శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము - 515 003, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 19 - Issue. 4 - Spl. Edition - April 2022 - ISSN No. : 2456-4702

ఆదర్శ సమాజ నిర్మాణంలో వ్యక్తులు, వ్యవస్థలు మరియు సాహిత్యం ప్రాధాన్యం

The Predominance of Individuals, Systems, and Literature in the Construction of an Ideal Society

అంతర్జాల జాతీయ సదస్సు

తేది : 29 & 30 ఏప్రిల్ 2022

నిర్వహణ :

సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

CENTRE FOR STUDY OF SOCIAL EXCLUSION AND INCLUSIVE POLICY (CSSEIP)



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Special Issue 4 - April 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

Dr. PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
HOD, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Narayanapuram.

15. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
Govt. Arts College, Rajahmundry.

16. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Potti Sriramulu University, Bommuru.

17. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

18. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

19. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

20. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

21. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

22. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము - 515 003.

జాతీయ సదస్సు

ఆదర్శ సమాజ నిర్మాణంలో వ్యక్తులు, వ్యవస్థలు మరియు సాహిత్యం ప్రాధాన్యం

తేదీ : 29 & 30 ఏప్రిల్ 2022

నిర్వహణ :

సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ విభాగం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము - 515 003.

ఆదర్శ సమాజ నిర్మాణంలో వ్యక్తులు, వ్యవస్థలు మరియు సాహిత్యం ప్రాధాన్యం

జాతీయ సదస్సు

భావవీణ ప్రత్యేక సంచిక

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
UGC CARE - Journal - Arts & Humanities

Editor : **Prof. M.Muninnarayanappa,**
Director, CSSEIP

Assistant Editor : **Dr. B. Ashok Kumar**

Co-ordinators : **Dr. D. Sreenivasa Rao (CSSEIP)**
Dr. K. Venkata Reddy (CSSEIP)

Organisers : **Dr. B. Konda Reddy (CSSEIP)**
Mrs. B. Padmavathi (CSSEIP)
Mr. T. Krishan Reddy (CSSEIP)
Mr. G. Prashanth Reddy (CSSEIP)
Mrs. B. Narmada (CSSEIP)
Mrs. M. Varalakshmi (CSSEIP)

ప్రథమ ముద్రణ : **ఏప్రియల్ 2022**

ప్రతులు : **200**

వెల : **రూ. 400/-**

కాపీలకు : **శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.**

గమనిక : **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.**

ఎడిటోరియల్ చిరునామా : **హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను, గుంటూరు – 522 002.**

డి.టి.పి : **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్,**
గుంటూరు జిల్లా. సెల్ : 9494 660 509.

ప్రింటింగ్ : **సాయి విఘ్నేశ్వర ప్రింటర్స్, సాయి నగర్, అనంతపురం.**

ఆదర్శ సమాజ నిర్మాణంలో వ్యక్తులు, వ్యవస్థలు మరియు సాహిత్యం ప్రాధాన్యం

జాతీయ సదస్సు

ప్రధాన సంపాదకులు :

ఆచార్య **యం. మునినారాయణప్ప**, డైరెక్టర్

సీఎస్ఎస్ఈఐపీ

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము - 515 003.

సెల్ : 94415 75395.

సహ సంపాదకులు :

డా॥. బత్తల అశోక్‌కుమార్

గ్రంథాలయ సహాయకులు

సీఎస్ఎస్ఈఐపీ

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము - 515 003.

సెల్ : 9490194780.

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 4, April 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము - 515 003.



ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి
ఉప కులపతి

ఉన్నత ఆదర్శాలతో సమాజం ముందుకు నడవాలి

ప్రజా జీవిత రంగాలు ఒకదానితో ఒకటి అనుసంధానించబడి ఉన్నాయి. సమాజ శాస్త్రాల చరిత్రలో, జీవితానికి సంబంధించిన ఏ రంగాన్ని అయినా ఇతరులకు సంబంధించి నిర్ణయించే ప్రయత్నాలు జరిగాయి. కాబట్టి, మధ్య యుగాలలో, సమాజ జీవితంలో ఆధ్యాత్మిక రంగంలో భాగంగా మతం ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుంటూనే ఉంది. ఆధునిక కాలంలో మరియు సాంకేతిక యుగంలో, నైతికత మరియు శాస్త్రీయ జ్ఞానం యొక్క పాత్ర నొక్కి చెప్పబడింది. ఇలాంటి అనేక భావనలు ప్రభుత్వాలకు, చట్టానికి ప్రధాన పాత్రను కేటాయిస్తాయి. ఆర్థిక సంబంధాల యొక్క నిర్ణయాత్మక పాత్రను మార్క్సిజం నొక్కి చెబుతుంది.

నిజమైన సామాజిక దృగ్విషయం యొక్క చట్రంలో, అన్ని రంగాల అంశాలు కలిపి ఉంటాయి. ఉదాహరణకు, ఆర్థిక సంబంధాల స్వభావం సామాజిక నిర్మాణం యొక్క నిర్మాణాన్ని ప్రభావితం చేస్తుంది. సామాజిక సోపానక్రమంలో ఒక స్థానం కొన్ని రాజకీయ అభిప్రాయాలను ఏర్పరుస్తుంది, విద్య మరియు ఇతర ఆధ్యాత్మిక విలువలకు తగిన ప్రాప్యతను తెరుస్తుంది. ఆర్థిక సంబంధాల ప్రభావం ప్రజల ఆధ్యాత్మిక సంస్కృతి, మతం మరియు నైతిక రంగంలో దాని సంప్రదాయాల ఆధారంగా చాలా తరచుగా ఏర్పడుతుంది. అందువల్ల, చారిత్రక అభివృద్ధి వివిధ దశలలో ఆధునిక సమాజంపై తన ప్రభావాన్ని చూపుతోంది. ఆదర్శ సమాజ భావన అన్నది మన పూర్వీకుల నుంచి మనకు తరతరాలుగా వస్తున్న ఆలోచనే.

ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, తద్వారా ఆదర్శ సమాజాభివృద్ధికి బాటలు వేసే దిశగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ వుంది. గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

గారు నవరత్నాల పేరిట ప్రజలకు ఏ రంగాల్లో చేయూతనిస్తే, వారు సామాజిక, ఆర్థిక పరంగా అభివృద్ధిని సాధిస్తారో అని ఆలోచించి, ఆ కోణంలోనే సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ, ఆదర్శ సమాజాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు.

రాయలసీమ ప్రాంతంలో అనంతపురం కేంద్రంగా నెలకొల్పిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అన్ని వర్గాల, కులాల, మతాల సాంఘిక సమానత్వానికి, ఆర్థిక చేయూతను అందుకునే విధంగా విద్యార్థులకు దిశానిర్దేశం చేసే లక్ష్యంగా ముందుకు దూసుకెళుతూ వుంది. విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్ళడమే ఈ విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర ఉద్యోగుల లక్ష్యాలుగా నిర్దేశించి, వారిని సమన్వయం చేస్తూ, ఆదర్శ సమాజాభి వృద్ధి దిశగా నడుస్తున్నాము. ఆ పరంపరలో భాగంగా మా విశ్వవిద్యాలయంలో అంతర్భాగమైన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ విభాగం ఆధ్వర్యంలో "ఆదర్శ సమాజ నిర్మాణంలో వ్యక్తులు, వ్యవస్థలు మరియు సాహిత్యం ప్రాధాన్యం" అన్న అంశంపై రెండురోజుల ఆన్‌లైన్ జాతీయ సదస్సు నిర్వహించడం అభినందించదగ్గ విషయం.

సమాజం ఉన్నతమైన ఆదర్శాలతో ముందుకు నడవాలని, ముఖ్యంగా అనంతపురం జిల్లా ఆదర్శ సమాజ నిర్మాణానికి కేంద్రం కావాలంటే ఎలాంటి అంశాలతో మమేకం కావాలన్న విషయాలను ప్రధానంగా చర్చించాల్సిన అవసరం వుంది. ఆదర్శ సమాజం ద్వారా సమానత్వ సాధన ఎలా సాధించాలన్న దిశగా విస్తృతమైన చర్చ ఈ జాతీయ సదస్సు ద్వారా జరగాలి. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వేదికగా విద్యార్థులు ఆర్థికవేత్తలుగా, ప్రతిభాసక్తులతో విశిష్ట వ్యక్తులుగా తయారయి ఆదర్శ సమాజంలో అంతర్భాగం కావాలన్నది నా సంకల్పంగా ప్రకటిస్తున్నాను.



(మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి)

❖❖❖

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము - 515 003.



ఆచార్య ఎ. మల్లికార్జున రెడ్డి
రెక్టార్

ఆదర్శ సమాజ నిర్మాణమే అంతిమ లక్ష్యం

మనిషి ఎన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినా, సంఘంతో మమేకమై జీవించాల్సిందే. ఆ దిశగా మనిషి యొక్క అంతిమ లక్ష్యం ఆదర్శ సమాజ నిర్మాణమే. ఆదర్శ సమాజం అన్న భావన ఇప్పటిది కాదు. మానవుడు నాగరికతను నేర్చుకొన్నప్పటి నుండి ఉన్నత విలువలతో, ఆదర్శాలతో జీవనం సాగించాలని సంకల్పించాడు. ఆదిశగా తన ఆర్థిక, సామాజిక, సాంఘిక జీవన విధానాన్ని సాగిస్తూ వస్తున్నాడు.

సమాజంలో భిన్న వైరుధ్యాలు, భిన్న వ్యక్తిత్వాలు, భిన్న సంస్థలు, విభిన్నమైనటు వంటి సాహిత్యం వుంది. సమాజాన్ని మంచి మార్గంలో నడిపించడంలో అనేకమంది వ్యక్తులు తమ ధన, మాన, ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించారు. వారు సమాజం అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయం. అనేక సంస్థలు సమాజాభ్యున్నతే లక్ష్యంగా తమ లక్ష్యాలుగా ప్రకటించుకొని పనిచేస్తున్నాయి. అందరికీ సమానమైన అవకాశాలను కల్పించాలన్న దిశగా ఎన్నో స్వచ్ఛంద సంస్థలు కృషిచేస్తున్నాయి. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో ఆర్‌డిటి సంస్థ అణగారిన వర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక పురోగతిని సాధించాలని ఆకాంక్షించి, వారికి అండగా నిలిచి అభివృద్ధి చేయడంలో సఫలీకృతమైన సంస్థగా మనం గమనించవచ్చు.

సాహిత్యం అన్ని కాలాల్లోనూ మనిషిని మంచి సంస్కారవంతంగా నిలిపే దిశగా తన ప్రయత్నాన్ని కొనసాగిస్తోంది.

(ఎ. మల్లికార్జునరెడ్డి)

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము - 515 003.



ఆచార్య ఎ. కృష్ణకుమారి
రిజిస్ట్రార్

ఆధునిక మహిళా ప్రగతి బహుముఖీనం

జగత్తునే జగన్మాతగా భావించిన సమాజం మనది. తొలి గ్రంథాలైన వేదాన్ని వేదమాతగా పిలుచుకుంటున్నాం. భూమిని భూమాత అంటున్నాం. నీటిని గంగామాత అంటున్నాం. గోవును గోమాత అంటున్నాం. ఇలా సమాజానికి ఉపయోగపడే ప్రతిదాన్నీ మాతృస్వరూపంగా భావించి, గౌరవించుకుంటున్నాం. వేదకాలంలో స్త్రీకి సమున్నతమైన స్థానమే లభించింది. ప్రాణులన్నింటినీ సమానంగా చూసిన కాలమది. "ఆత్మవత్ సర్వభూతాని మమాత్మా సర్వభూతాత్మా" - అంతటా ఉన్నది తన ఆత్మే. అంతటా ఉన్న ఆత్మే తనలోనూ వుంది. ఈ ఒక్కమాటతోనే ఆనాటి సమతావాదం మనకు అర్థమవుతుంది."సర్వేజనా: సుఖినోభవంతు, సమస్త సన్మంగళాని భవంతు" - అనే విశ్వజనీన సిద్ధాంతాలను మన సమాజం వ్యాపింపజేసింది. ఆధిపత్య భావజాలంతో పురుష అహంకారంతో అణగదొక్కబడ్డ స్త్రీని పురుషునితో సమానంగా ఉన్నతమైన స్థానాన్ని కల్పించింది వీరశైవము. పురాణసాహిత్యంలో సైతం వారికి సముచిత ప్రాధాన్యత లభించింది. ఆధునిక కాలంలో మహిళా ప్రగతి అన్ని రంగాల్లో బహుముఖీనంగా కనిపిస్తోంది. అనాది నుండి ఆధునికం వరకు స్త్రీని పూజించిన సమాజమే మంచి అభివృద్ధి సాధించినట్లుగా భావించవచ్చు. అందుకే స్త్రీకి ప్రాధాన్యత ఇవ్వాలన్న భావనను ఈ సందర్భంగా వ్యక్తపరుస్తున్నాను.

(ఎ. కృష్ణకుమారి)

SRI KRISHNADEVARAYA UNIVERSITY :: ANANTHAPURAMU
Centre for Study of Social Exclusion and Inclusive Policy (CSSEIP)
Office : G91 8554 - 255833, 794, **Mobile :** G91 94415 75395
e - Mail : directorskucsseip@gmail.com



Prof. M.Muninarayanappa
Director

సదస్సు నివేదిక

మానవుడు సంఘజీవనం ప్రారంభించినప్పటి నుండి ఆదర్శ సమాజం అన్న భావన ఉంటూనే వుంది. అరిస్టాటిల్ మొదలు నేటి వరకు ఆదర్శ సమాజం అన్నది కలగానే మిగిలి పోతోంది. దీన్ని సాధించడానికి మన వంతు ప్రయత్నం ఏం చేయాలన్నది ప్రధానంగా చర్చించాల్సిన అంశం. "ఆజాదీకా అమృతోత్సవ్" నిర్వహించుకుంటున్న మన స్వతంత్ర భారతదేశంలో భిన్న రంగాల్లో అసమానతలు నేటికీ కొనసాగుతున్నాయి. దానిని రూపుమాపేందుకు ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి. అవన్నీ సమసిపోయిన నాడు ఆదర్శ సమాజ నిర్మాణం సాధ్యపడుతుంది. దాన్ని సాధించే దిశగా వ్యక్తులు, రాజకీయ, సామాజిక, ఆర్థిక, న్యాయ వ్యవస్థలు మరియు సాహిత్యం ఎలాంటి ఉద్ధీపనలు అందిస్తోందో బేరీజు వేయాల్సిన అవసరం వుంది. తద్వార ఎలాంటి ఫలితాలు వస్తాయన్న అంశాలను నమోదు చేసేదిశగా రెండురోజుల జాతీయ వెబినార్ ఏర్పాటు చేయడమైనది.

సెంటర్ ఆధ్వర్యంలో రెండురోజులపాటు ఆన్‌లైన్‌ద్వారా వెబినార్‌ను నిర్వహించాలనుకున్నామని మా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డిగారిని కలిసి చెప్పాము. అందుకు ఆయన అనుమతినిచ్చి, వెన్నంటి ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా వారికి వ్యక్తిగతంగా, సెంటర్ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అభినందించి ప్రోత్సహించిన రెక్టార్ ఆచార్య ఎ. మల్లికార్జునరెడ్డిగారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కార్యక్రమ నిర్వహణకు అనుమతులు ఇచ్చి, కార్యక్రమం విజయవంతం కావాలని అభిలాషను వ్యక్తం చేసిన రిజిస్ట్రార్ ఆచార్య ఎ. కృష్ణకుమారిగారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. మేము వెబినార్ నిర్వహించాలని అనుకున్న వెంటనే అంశం ఎంపిక నుంచి వెబినార్

నిర్వహణవరకు ప్రతిక్షణం తోడుగా నిలిచిన మా సోషల్ సైన్స్ డీన్ ఆచార్య గిడ్డి వెంకటరమణగారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈనాటి వెబినార్ కీలకోపన్యాసకుడిగా మా ప్రయత్నంలో భాగస్వామ్యం వహించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

సమాజం అంటేనే భిన్న రంగాల కూడలి. మంచి సంస్కారవంతమైన, ఆదర్శవంతమైన సమాజం సాధించడానికి అన్ని రంగాలు కలిసికట్టుగా కృషిచేయాలి. ఈ సెంటర్ ఉద్ధేశ్యాలలో భాగంగా సంఘంలో సాంఘిక అసమానతలను రూపుమాపడానికి వివిధ సాంఘిక, ఆర్థిక, సామాజిక రంగాల్లోని వ్యక్తులు ఎలాంటి సూచనలు చేశారు? తద్వారా ఎలాంటి ఫలితాలను మనం సాధించవచ్చు అన్న కోణంలో రాజకీయ, ఆర్థిక, సామాజికవేత్తలు, సాహిత్యకారులు చేసిన కృషిని గుర్తించి, దానిని రికార్డు చేయాలన్న ఉద్ధ్యేశ్యంలో "ఆదర్శ సమాజ నిర్మాణంలో వ్యక్తులు, వ్యవస్థలు మరియు సాహిత్యం ప్రాధాన్యం" అన్న పేరుతో, యూజీసీ సౌజన్యంతో రెండు రోజుల ఆన్‌లైన్ జాతీయ వెబినార్‌ను ఏప్రిల్ 29 & 30 తేదీలలో నిర్వహించడంలో భాగంగా పత్ర సమర్పకులను ఆహ్వానించాము.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ విభాగం (CSSEIP) యూజీసీ సౌజన్యంతో 2008 లో ఆవిర్భవించింది. సమాజానికి దూరంగా వెలివేయబడ్డవారిని తిరిగి సంఘంతో మమేకం చేయడం ఈ సెంటర్ ఉద్ధేశ్యాలలో ప్రథమ ప్రాధాన్యత కలిగి వున్నది. సమాజిక వెనుకబాటుతనం, వివక్షను రూపుమాపే దిశగా అంతే స్థాయిలో పరిశోధనలకు అధిక ప్రాధాన్యతనిస్తూ, సాంఘిక సమానత్వాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తోంది. అనంతపురం జిల్లాలో ఎస్కేయూనివర్శిటీ కేంద్రంగా ఈ సెంటర్ తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తోంది.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఏర్పాటు కావడానికి తనశక్తివంచన లేకుండా కృషిచేసిన సెంటర్ ప్రారంభ డైరెక్టర్ ఆచార్య సి.హెచ్. ఉమామోహన్‌గారి కృషిని ఈ సందర్భంగా ప్రస్తావించడం నా బాధ్యతగా భావిస్తున్నాను. సెంటర్ డైరెక్టర్లుగా పనిచేసి అకాల మరణం పొందిన ఆచార్య సత్యనారాయణ, ఆచార్య ఎం. జయరాజుగార్లకు ఈ సందర్భంగా నివాళులర్పిస్తున్నాను. డైరెక్టర్లుగా వారి బాధ్యతలను నిర్వర్తించి సెంటర్ అభివృద్ధికి ఎంతో తోడ్పడ్డారు. ఇక ఆచార్య శ్రీధర్‌గారు సెంటర్ సిబ్బందికి జీతాలు తెప్పించడంలో ఎంతో కృషిచేశారు. వారి సేవలు సెంటర్ అభివృద్ధి చాలా ఉపయుక్తమయ్యాయి. ఆచార్య ఎం.డి. బావయ్యగారు ఇటీవలే పదవీవిరమణ చేశారు. సెంటర్‌లో సుదీర్ఘకాలం పనిచేసిన డైరెక్టర్‌గా వారి కృషి ఎనలేనిది. పదవీవిరమణ పొందిన అనంతరం కూడా ఆచార్య ఎం.డి. బావయ్యగారు సెంటర్‌కు ఉపయుక్తమయ్యేలా కృషిచేస్తున్నారు. ఈ సందర్భంగా పూర్వపు సెంటర్ డైరెక్టర్లందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

భారతదేశంలో భిన్న రంగాల్లో అసమానతలను రూపుమాపేందుకు ఎన్నో ప్రయత్నాలు రూపుమాపే దిశగా కృషిచేస్తేనే ఆదర్శ సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని ఈ జాతీయ వెబినార్‌లో అతిథులు, వక్తలు, పత్రసమర్పకులు సూచించారు. దాన్ని సాధించే దిశగా వ్యక్తులు, రాజకీయ, సామాజిక, ఆర్థిక, న్యాయ వ్యవస్థలు మరియు సాహిత్యవేత్తలు తమ రచనల్లో సూచించిన మార్పులను ఈ వెబినార్ ద్వారా రికార్డు చేయడం జరిగింది.

సెంటర్ ఆధ్వర్యంలో రెండురోజులపాటు ఆన్‌లైన్‌ద్వారా వెబినార్‌ను నిర్వహించడానికి అనుమతినవ్వడమే కాదు, వెబినార్‌లో ఆద్యంతం ఉండి మమ్మల్ని, పత్రసమర్పకుల్ని ప్రోత్సహించిన మా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డిగారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అభినందించి ప్రోత్సహించిన రెక్టార్ ఆచార్య ఎ. మల్లికార్జునరెడ్డిగారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కార్యక్రమ నిర్వహణకు అనుమతులు ఇచ్చి, కార్యక్రమం విజయవంతం కావాలని అభిలాషను వ్యక్తం చేసిన రిజిస్ట్రార్ ఆచార్య ఎ. కృష్ణకుమారిగారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. కీలకోపన్యాసంతో అందరినీ ఆకట్టుకున్న మా సోషల్ సైన్స్ డీన్ ఆచార్య జి. వెంకటరమణగారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్కేయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. బాలసుబ్రమణ్యంగారికి, గౌరవ అతిథిగా హాజరైన ఆచార్య ఆర్. జీవన్ కుమార్‌గారికి, కీలకోపన్యాసం చేసిన వారణాశి లోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధ్యక్షులు ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లుగారికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ సెంటర్ పూర్వపు డైరెక్టర్లుగా పనిచేసిన ఆచార్య సి.హెచ్‌ఉమామోహన్‌గారు, ఆచార్య శ్రీధర్‌గారు, ఆచార్య ఎం.డి. బావయ్యగారు ఆన్‌లైన్ ద్వారా తమ సందేశాలను అందించి ఈ సందర్భంగా పూర్వపు సెంటర్ డైరెక్టర్లందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

వెబినార్ కోసం ఇంగ్లీష్‌లో వచ్చిన 15 వ్యాసాలను, తెలుగులో వచ్చిన 40 వ్యాసాలను 8 సెషన్స్‌గా విభజించుకున్నాము. మొదటి సెషన్‌కు డా॥ ఎన్.ఆర్. సదాశివరెడ్డిగారు, రెండో సెషన్‌కు డా॥ జెన్నే యోగీశ్వరనాయుడుగారు, మూడో సదస్సుకు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డిగారు, నాలుగో సెషన్‌కు తెలంగాణా నుంచి డా॥ వెలిదండ్ల శ్రీధర్‌గారు, ఐదో సెషన్‌కు డా॥ బాశెట్టి లతగారు, ఆరు, ఏడు సెషన్‌లకు మా సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్లు, మరియు ఈ సదస్సు కో ఆర్డినేటర్లు డా॥ డి. శ్రీనివాసరావు, డా॥ కె. వెంకటరెడ్డిగారు, ఎనిమిదో సెషన్‌కు ఆచార్య జి. వెంకటనాయుడు గారు అధ్యక్షత వహించారు. వారికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ విభాగం డైరెక్టర్‌గా నా అధ్వర్యంలో ఇది మొదటి వెబినార్. త్వరలో మరో వెబినార్ నిర్వహించడానికి కూడా నిర్ణయం తీసుకున్నాము. ఈ సెంటర్ అభివృద్ధికి భవిష్యత్‌లో కూడా తప్పకుండా నా సహకారం అందిస్తాను. సెంటర్ వేదికగా మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో సమాజానికి ఉపయుక్తమయ్యేలా మంచి అంశాలను చర్చించి, పుస్తకాలుగా తీసుకురావాల్సి అవసరం ఇంకా వుందని భావిస్తున్నాను.

మేము అడిగిన తక్కువ సమయంలోనే పరిశోధనా పత్రాలను పంపిన వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులకు, కళాశాలల అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు, పరిశోధన విద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రారంభ, ముగింపు సమావేశాలకు హాజరైన అతిథులకు, కీలక ప్రసంగకర్తలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. రెండురోజుల పాటు నిర్వహించిన ఈ జాతీయ స్థాయి వెబినార్‌లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పరిశోధకులు పత్రాలను పంపారు. వెబినార్‌లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

ఈ సదస్సును విజయంవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. సదస్సు నిర్వహణకు సంబంధించి అనుమతులు, వివిధ పత్రాలను సమకూర్చిన మా విశ్వవిద్యాలయంలోని వివిధ శాఖల ఉన్నతాధికారులకు, బోధనేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. సదస్సు నిర్వహణకు పలు సూచనలు చేసిన సలహామండలి సభ్యులు ఆచార్య జి. బాలసుబ్రమణ్యంగారికి, ఆచార్య ఆర్. జీవన్ కుమార్‌గారికి, ఆచార్య జి.వి. రమణగారికి, ఆచార్య జి. నరసింహన్‌గారికి, డా॥ ఎన్.ఆర్. సదాశివరెడ్డిగారికి, డా॥ ఆర్. రామచంద్రగారికి ధన్యవాదాలు. వెబినార్‌ను దిగ్విజయంగా నిర్వహించిన సెంటర్ సిబ్బంది డా॥ డి. శ్రీనివాసరావు, డా॥ కె. వెంకటరెడ్డి, బి. పద్మావతి, డా॥ బి. కొండారెడ్డి, టి. క్రిష్ణారెడ్డి, జి. ప్రశాంత్‌రెడ్డి, బి. నర్మద, వరలక్ష్మి, డా॥ బత్తల అశోక్ కుమార్‌లను ఈ సందర్భంగా అభినందిస్తున్నాను.

సదస్సులో వచ్చిన వ్యాసాలన్నింటినీ క్రోడీకరించి ప్రత్యేక సంచికగా వెలువరించాలనుకున్న తరుణంలో యూజీసీ కేర్‌లిస్ట్ జర్నల్ ద్వారా ప్రచురించాలని భావించాము. అందుకు భావవీణ ప్రత్యేక సంచిక ద్వారా వాటిని ముద్రణ చేయడానికి అంగీకరించిన భావవీణ సంపాదకవర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

(యం.మునినారాయణప్ప)

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 4, April 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము - 515 003.



ఆచార్య జి. వెంకటరమణ
కవి, రచయిత, విమర్శకులు
డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్స్
డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ ఎవాల్యూయేషన్
డైరెక్టర్, స్టూడెంట్స్ & పబ్లిక్ అఫైర్స్
శాఖాధిపతి, సామాజికశాస్త్రం & వయోజన విద్య విభాగం

కీలకోపన్యాసం

సరైనటువంటి సమయంలో సరైనటువంటి దిశగా నిర్వహిస్తున్న జాతీయ వెబినార్ ఇది. ఆజాదీకా అమృతోత్సవ్ పేరిట దేశమంతా చర్చిస్తున్న వేళ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు నిండినా, తరతరాలుగా వస్తున్న దురాచారాలు, అరాచకాలు తగ్గలేదు. అమానుషకాండ నేటికీ కొనసాగుతోంది. మానవత్వం మాయమైపోతోంది. శ్రీశ్రీ మహాకవి చెప్పినట్లు "ఏదేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం"లో వున్నదన్న విషయం వాస్తవం.

గ్రీకు తత్వవేత్తలైన రత్నాల్లాంటి ముగ్గురి గురించి చర్చించుకోవాలి. సోక్రటీస్, అరిస్టాటిల్, ప్లేటో ముగ్గురూ ముగ్గురే. ఆదర్శవాదము లేదా ఆదర్శ వాదాలు లేక ఆదర్శ రాజ్యం అనే భావనకు పునాదిగా వీరి ముగ్గురిని ప్రస్తావించాల్సిన అవసరం వుంది. ప్లేటో తన భావాలను, ఆదర్శాలను అన్నీ కలగలపి "రిపబ్లిక్" అనే గ్రంథంలో ఆయన ఆదర్శరాజ్యం ఎలా వుండాలి? అనే దాని గురించి చక్కగా వివరించాడు. ప్రధానంగా మానవునికి వున్నటువంటి గుణాలైన ఇచ్ఛ, ధీరత్వము, హేతువు మూడు వర్గాలుగా విభజించాడు. దీని ప్రకారం ప్రజా పాలన ఉండాలని సూచించాడు. పాలకునికి వ్యక్తిగత ఆస్తులుగాని, కుటుంబం కాని వుండకూడదు. అలా ఉన్నట్లయితే అవి స్వార్థానికి దారి తీస్తాయని చెప్పడం జరిగింది.

ఆదర్శ రాజ్యంలో శిశువు జన్మించగానే శిశు సంక్షేమశాఖ శిశువుయొక్క పోషణ భారాన్ని భరించాల్సి వుంటుందని సూచించాడు. శాస్త్రీయ విజ్ఞానాన్ని అభివృద్ధికి ఉపయోగించాలి. అందరూ విద్యావంతులు కావాలి. మరియు మనిషిలో ఉన్న అనేక శక్తి సామర్థ్యాలు వెలికి తీసి, పుట్టిన శిశువు అభివృద్ధికి దోహదపడేలా కృషి చేయాలి.

శతాబ్దాలు, గడిచిపోయినా, తరాలు మారినా ఇంకా వారు చెప్పిన ఆదర్శ భావాలు అమలులోకి రాలేదు. ఊహలుగానే మిగిలిపోయింది. ఆదర్శ సమాజ భావన అనేది ఇప్పటికీ అమలు కాలేదు. ఎందుకంటే దానికి అనేక కారణాలు వున్నాయి. కర్ణుని మరణానికి కారణాలు కోకొల్లలు. నేటికి కూడా ఆదర్శ సమాజం అందని ద్రాక్షగానే మిగిలి పోయింది. అందరికీ రక్షణలేని సమాజంలో బ్రతుకుతున్న మనం ఆదర్శ సమాజం కోసం ఆలోచించుకొని ఎంతమాత్రం కృషిచేస్తున్నాం అనే ప్రశ్న ఉదయిస్తుంది. స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న ప్రస్తుత తరుణంలో దారిద్ర్య రేఖకు దిగువున ఇంకా అనేకమంది ఉండటం మనం గమనించాల్సిన అవసరం ఎంతో వుంది. నిరుద్యోగం ఊబిలో పడి కొట్టిమిట్టాడుతున్న యువకులు, కష్టాల కొలిమిలో మాడి మసైపోతున్న కార్మిక, కర్షకులు, నేటికి వైద్యం అందక అల్లాడుతున్న సామాన్య ప్రజానీకం దౌర్భాగ్య స్థితి ఇలాంటి సమస్యలు ఉన్న దేశంలో ఆదర్శ సమాజం తీసుకురావడం అన్నది నింగిలోని జాబిల్లిని నేలమీదకు దించడం లాంటిదే అంటే అతిశయోక్తి కాదు. అదొక గగన కుసుమం. కానీ ఆ దిశగా ప్రయత్నం జరగలేదా అంటే ఆ దిశగా వ్యక్తులు, వ్యవస్థలు, సాహితీ వేత్తలు కృషిచేశారు. ఉద్యమాల ప్రభావం ఆదర్శ సమాజ నిర్మాణానికి దోహదపడలేదా? అన్న ప్రశ్నలు రావడం సహజం. కానీ గుడ్డి కంటే మెల్ల మేలు అన్న చందంగా ఆదర్శ సమాజం ఆశించిన స్థాయిలో లేకున్నా, ఆ దిశగా ప్రయత్నమైతే జరిగింది.

వ్యక్తులు లేకుండా సమాజం లేదు. అదేవిధంగా వ్యక్తులు లేకుండా ఉద్యమాలు లేవు. వ్యక్తులు లేకుండా సాహిత్య సృజన జరగదన్న విషయం అందరికీ తెలిసిందే. ఆదర్శ సమాజ నిర్మాణాల వ్యక్తులు లేకుండా ఉద్యమాలు లేవు. ప్రపంచగతిని మార్చిన తత్త్వవేత్తలు చాలామంది వున్నారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, న్యాయవ్యవస్థల వల్ల సమాజంలో మార్పు వచ్చింది. కొంత మేలు జరిగింది. వ్యక్తులు, వ్యవస్థల కన్నా సాహిత్యం సమాజం రూపురేఖల్ని మార్చగలిగింది. ఇంటింటికీ ఓ పువ్వు ఈశ్వరునికోమాల అన్నట్లుగా అందరి తత్త్వవేత్తల చింతనలో లోపాలు ఉన్నప్పటికీ ఆదర్శ సమాజానికి దోహదపడే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయడం జరిగింది. అయితే ఎంతవరకు ఆదర్శ సమాజ నిర్మాణం జరిగింది అని అంటే అది అది విజ్ఞులు ఆలోచించుకోవాల్సిన ప్రశ్న. అన్నిటికంటే ప్రధానమైనది రాజకీయ వ్యవస్థ. అదేవిధంగా సామాజిక శాస్త్రాలు సామాజిక శాస్త్రం, సామాజిక కృషి, గ్రామీణాభివృద్ధి, రాజనీతిశాస్త్రం, న్యాయశాస్త్రం, సామాన్య శాస్త్రాలు, సాంకేతిక శాస్త్రాలు వీటి ప్రభావాలను కూడా తక్కువ చేయలేము. అదేవిధంగా కవులు, రచయితలు, జర్నలిస్టుల కృషి కూడా అధికంగానే వుందని చెప్పాలి. ఆదర్శ సమాజం అన్నది అందరాని చందమామ అనడంలో ఎలాంటి సందేహం లేదు. చూడటానికి చాలా బాగుంటుంది చందమామ. కానీ దాన్ని కిందకి దించాలంటే సాధ్యం కాదు. ఆదర్శ సమాజం అన్న భావన కూడా ఆలోచించడానికి, చూడటానికి ఆకర్షణీయంగా వుంటుంది. కానీ ఆచరణలోకి తీసుకువచ్చేటప్పటికి కష్టాలు, నష్టాలు కనిపిస్తాయి.

అసలు సమాజంలో బహుజనులు బాగుంటేనే, అత్యధికంగా వాళ్ళు ఆనందంగా వుంటేనే, తర తమ బేధాలు లేకుంటేనే, మనిషిని మనిషిగా చూడగలిగితేనే ఆర్థిక సంబంధాల స్థానంలో ఆత్మీయ సంబంధాలు బలపడితేనే కాస్తో,కూస్తో ఆదర్శ సమాజంగా చెప్పవచ్చు. కానీ భారతదేశంలో ఎక్కడాలేని, కానరాని దిక్కుమాలిన కులవ్యవస్థ వుండటంతో నిచ్చెనమెట్ల సమాజం అనేది ఉండటం వల్ల అనేక రకాలయినటువంటి సమస్యలు చోటుచేసు కున్నాయన్నది వాస్తవం. దానివల్ల అనర్థాలు ఎన్నో ఎన్నెన్నో. అసమతౌల్యమైనదాన్ని ఆదర్శ సమాజం అందామా?

మనిషిని జంతువుకన్నా హీనంగా చూస్తున్న సంఘాన్ని ఆదర్శ సమాజమని పిలుస్తామా? భూమి, సంపద కొంతమంది చేతిల్లో కేంద్రీకృతం కావడం, పెట్టుబడిదారివ్యవస్థకు పెద్దపీట వేయడం ఏ సమాజానికి నిదర్శనమో విజ్ఞులు ఒకసారి ఆలోచించాలి. "బహుజన హితాయి బహుజన సుఖాయి" అనేది బుద్ధుడు ఇచ్చిన ఒక నినాదం, నినాదంగా మిగిలిందే కానీ, సమాజంలో అత్యధిక శాంత వెనుకబడి ఉన్నారనేది వాస్తవం. వారు ఆరోగ్యంగా, ఆనందంగా, సమస్యలు లేకుండా జీవిస్తే అది ఆదర్శసమాజమవుతుంది. కానీ ఈ రోజు ఈ ఆదర్శ సమాజం వుందా? అని ప్రశ్నించుకుందాం? అది పూర్తిగా వాస్తవం కాకున్నా కాస్త మెరుగైన సమాజం నిర్మాణం జరుగుతుందని భావించాలి.

మానవుడు సంఘజీవి అన్నాడు అరిస్టాటిల్. సమాజంలో జీవించడమనేది మనిషి లక్షణం. మానవుడు సామాజిక జీవనాన్ని అనుసరించి, జంతువుకన్నా విభిన్నంగా వున్నాడు. సాంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆదర్శాలు వుండటం ద్వారా సామాజిక జీవనం ఒక పద్ధతి ప్రకారం కొనసాగుతుంది. ఏకాంతంగా ఏ మనిషి జీవించలేడు. వ్యక్తుల సమూహమే సమాజం. వ్యక్తికన్న సమాజం ప్రధానమన్న వాదన సరైనదే. దాని కారణంగా సమాజం స్థిరంగా వుంటుంది. వ్యక్తులు స్థిరంగా వుండరు. వ్యక్తిత్వాల ఆధారంగా సమాజాన్ని నిర్ధారించలేము. వ్యక్తికి సమాజానికి రెండింటికీ అవినాభావ సంబంధం వుంది. వ్యక్తిలేనిదే సమాజం లేదు. సమాజం లేకుండా వ్యక్తి మనుగడ కూడా జరుగదు. సమాజంలో అందరూ బాగుండాలి అంటే వ్యక్తిగతంగా వుండే వాదాలు మార్పులు రావాలి. మతం, కులం, ప్రాంతం, భాష వంటి వాటిపై సంకుచితంగా ఉండరాదు. మూఢనమ్మకాలు, అపోహలు తొలగిపోవాలి. సంకుచిత భావాలకు స్వస్తి చెప్పాలి. స్వార్థాన్ని పక్కకు పెట్టాలి. వ్యక్తిగతంగా ఆలోచించడం మానివేయాలి. సమాజ హితాన్ని కోరుకోవాలి. సమసమాజ నిర్మాణానికి పూనుకోవాలి. ఆదర్శసమాజానికి అంకురార్పణ జరగాలి. విశాల భావాలు వుంటే తప్ప సంస్కరణ అనేది జరగదు. సంక్షేమ ఫలాలు అందరికీ అందవు. ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి.

సమాజం నాకేమిచ్చింది అనే దాని నుండి సమాజానికి నేనేమిచ్చాను అనే ప్రశ్నతో ఆలోచించుకోవాలి. అప్పుడే సత్యం బోధపడుతుంది. ఆర్థిక అసమానతలు తొలగిపోవాలి. సామాజిక వెనుకుబాటు తనం తొలగిపోవాలి. మానవవులంతా సమానమే అనే భావన బలపడాలి. సమాజంలో ఏ కొద్దిమంది బాగుంటేనే, బాగుపడితేనే, బాధలు లేకుండా బ్రతుకుతుంటేనో సమస్యలు లేని జీవితం గడుపుతుంటేనో, అది ఆదర్శ సమాజం కానేకాదు. అందరూ విద్యావంతులు కావాలి. అందరికీ సమాజంలో సరైన స్థాయి వుండాలి. ప్రగతి ఫలాలు అందరికీ దక్కాలి. అందరికీ సమాన అవకాశాలు వుండాలి. రాజ్యాంగంలో వున్న లౌకిక భావన ఉండాలి. సంక్షేమం జరగాలి. స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రజలందరిలో వుండాలి. మతాలన్నీ శాంతినే బోధిస్తాయి. సమానత్వాన్ని కాంక్షిస్తాయి అని అందరూ అంటారు. కానీ ఆచరణలో చూస్తే నేతి బీరకాయ రీతి అని ఎవరికైనా అర్థమవుతుంది. వ్యక్తుల ఆలోచనలో లోపాలు, వ్యవస్థలో దోషాలు, సత్‌సాహిత్య సృష్టి లేకపోవడం ఇవన్నీ ఆదర్శ సమాజ నిర్మాణానికి ఆటంకాలంటే అతిశయోక్తి కాదు. అంతమాత్రాన ఆదర్శ సమాజానికి ప్రయత్నం జరగలేదని చెప్పలేము. చరిత్రను పరిశీలిస్తే ఎంతోమంది వ్యక్తులు ఆదర్శ సమాజం కోసం శ్రమించారు. తపించారు. కృషిచేశారు. ఆదిశగా పయనించారు. కాస్తోకూస్తో విజయం సాధించారు. వ్యవస్థలన్నీ కూడా ఆదిశగా పయనించే ప్రయత్నమూ జరిగింది.

సాహిత్యం కూడా సమాజాన్ని ప్రభావితం చేయడంలో చాలా ముందుంది. ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో సాహిత్యం చాలా ముందుంది. సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్, కారల్‌మార్క్స్, జీసస్, మహమ్మద్, జొరాస్ట్రియన్,

కన్ఫ్యూసియస్‌కానీ, భక్తి కవులకు సంబంధించి కబీరు, ఏకనాథుడు, సంత్ రవిదాస్, మీరాబాయి, ప్రపంచ వ్యాప్తంగా మదర్ థెరిస్సా, హెలన్ కెల్లర్, మార్టిన్ లూథర్‌కింగ్, దలైలామా, భారతీయ ఆధునిక ఆధ్యాత్మికవేత్తలయిన రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, రమణమహర్షి ఇలా అనేక మంది అనేక రంగాలలో స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ, నెహ్రూ, సర్ధార్ పటేల్, బాలగంగాధర్ తిలక్, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, ఆంధ్రదేశానికి సంబంధించి అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్ లాంటి వాళ్ళు సమాజాన్ని ప్రభావితం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. అనేకమంది శాస్త్రవేత్తలు కూడా సమాజాన్ని తమ ఆవిష్కరణలతో ప్రభావితం చేశారు. వాళ్ళ ఆలోచనలన్నీ ఆదర్శ సమాజ నిర్మాణంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేశాయి. వాళ్ళ అనుభవాలు సమసమాజ నిర్మాణం దిశగా ప్రేరణ కలిగించాయంటే అతిశయోక్తి కాదు.

భారతీయ సమాజం విలక్షణమైనది, విభిన్నమైనది. ఆదర్శ సమాజం అనేదానికి చాలా దూరంలో వున్నమాట వాస్తవమే. ఎందుచేత అంటే సమాజంలో అత్యధికంగా అణచివేతకు గురైనవారే కనిపిస్తారు. దోపిడీకి బలైనవారిని మనం చూస్తుంటాం. వాళ్ళ మౌన వేదన, ఆవేదన, రోదన అక్షరాలలో వివరించలేము. వారిపై సామాజిక, ఆర్థిక, రాజకీయ దోపిడీ ఇంకా కొనసాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ అంటరానితనం వుంది. అసమానతలు కొనసాగుతున్నాయి. భూమి కేవలం కొద్ది మంది చేతుల్లోనే వుంది. సంపద కొన్ని వర్గాలకే పరిమితమైపోయింది. శ్రమ ఒకరిది. సంపద మరొకరిది. సొమ్మొకరిది సోకొకరిది. అసమానతలు వున్న సమాజం ఆదర్శ సమాజం కాదు కానే కాదు. బీసీఎస్సీఎస్టీమైనార్టీలుగా విడిపోవడం, అంతరాలు వుండటం, కులాలు, ఉపకులాలు ఉండటం సమసమాజమనిపించుకోదు. ఆదర్శ సమాజానికి ఇది గొడ్డలి పెట్టు. ఈ సమాజం బాగుండాలని, బాగుపడాలని తరతరాలుగా తమ జీవితాలను అంకింత చేసిన మహానుభావులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేయాలి. బౌద్ధ ధర్మం సమాజ సమానత్వాన్ని బాటలు వేసింది. దేశంలో తొలి సంఘసంస్కర్తగా బుద్ధుడు మనకు కనిపిస్తాడు. త్రిరత్నాలు పాటించడం ద్వారా సమాజ అభ్యున్నతిని కాంక్షించవచ్చని సూచించాడు. అసమానత్వాల పట్ల ధిక్కార స్వరాన్ని వినిపించాడు. ఆయన భావాలు సమసమాజ నిర్మాణానికి కారకాలు, ప్రేరకాలు, ఉత్ప్రేరకాలు.

కబీరు భక్తి ఉద్యమంలో ప్రధాన పాత్రను గుర్తుచేసుకోవాలి. కర్మకాండల పేరుతో చేస్తున్న మోసాలను ఎండకట్టాడు. "రామ్ రహీమ్ ఏక్‌హై" అంటూ మతసమానత్వాన్ని, నిరాకార నిర్గుణ భక్తిని ప్రతిపాదించాడు. అణగారిన వర్గాల వారి అభ్యున్నతికి పాటుపడిన మరో ముఖ్యవ్యక్తి మహాత్మా జ్యోతిరావు ఫూలే. మహారాష్ట్రలో వెనుకబడిన కులంలో జన్మించినప్పటికీ, ఈ దేశ ప్రజల సాధికారికతకోసం పోరాటం చేశారు. ఆత్మగౌరవ పోరాటానికి పిలుపునిచ్చి, వెనుకబడిన శూద్రుల్ని, అతి శూద్రుల్ని ముందుకు నడిపించేందుకు పోరాటం చేశాడు. స్త్రీజాతి విముక్తికి, స్త్రీల విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి అనన్యసామాన్యమైనది. ఆధునిక కారల్‌మార్క్స్‌గా ఫూలేను పోల్చడం ఆహ్వానించదగ్గ విషయమే. గులాంగిరి అనే పుస్తకం పురోహితుల భండారాన్ని ఫూలే బయటపెట్టడం ద్వారా ఆయన సామాన్య జనాల్లో చైతన్యం తెచ్చారు. శూద్రులు, అతిశూద్రులు కానీ ఎందులోనూ తీసిపోరని, వారికి విద్య లేకపోవడం వల్ల జ్ఞానం, జ్ఞానం లేకపోవడం వల్ల నైతికత లేదు, నైతికత వల్ల సామాజిక చైతన్యం లేదని ఫూలే వారికి విద్యను అందించడం మొదలుపెట్టాడు. మొట్టమొదటి సారిగా తన భార్య సావిత్రిబాయికి చదువు నేర్పించి, ఆమెను ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దడం ద్వారా మహిళా విద్యను అందరికీ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేశాడు.

సమాజాన్ని ప్రభావితం చేసిన మరో మహానీయుడు సాహూమహరాజ్. మొట్టమొదటి సారిగా ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించి, ఆదర్శంగా నిలిచాడు. కేరళలలో నారాయణ గురు కూడా సామాజిక సంస్కరణ దిశగా అడుగులు వేశారు. తమిళనాడులో పెరియార్‌గా పిలువబడిన వ్యక్తి రామస్వామి నాయకర్.

నవభారత రాజ్యాంగ నిర్మాతగా, తొలి న్యాయశాఖమంత్రిగా, రాజ్యాంగ రచనలో నిపుణుడిగా, విద్యావేత్తగా, ప్రపంచ మేధావిగా పిలువబడిన వ్యక్తి డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్. ఆయన సాంఘిక అసమానతల్ని రూపుమాపి, భారత ప్రజలకు రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు కల్పించిన మహానుభావుడు. సమాజాన్ని అంబేద్కర్ ప్రభావితం చేసినంతగా మరెవరూ చేయలేదని ఘంటాపథంగా చెప్పవచ్చు. అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలు, ఆయన ఆశించిన సమాజం అన్నీ కూడా ఆదర్శ సమాజాన్ని ప్రజలకు చేరువ చేసేవే. ఆయన ఏమి చేసినా అదంతా చిత్తశుద్ధితో జాతిజనుల ఐక్యతకోసం, అణగారిన వర్గాల అభివృద్ధికి ప్రయత్నించారు.

ఆంధ్రదేశంలో భాగ్యలక్ష్మీవర్మ, కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు, బిర్సాముండాలు ప్రజల సమస్యలపై పోరాడారు. వాళ్ళు చేసిన కృషి ప్రత్యక్షంగా, పరోక్షంగా సమాజాభివృద్ధికి, సమసమాజ స్థాపనకు నాంది పలికింది. గుర్రం జాషువా, బోయిభీమన్నలు దళితుల అభ్యున్నతపై గళమెత్తి పోరాడారు. తమ రచనల ద్వారా సంచలనాలను సృష్టించారు. భారతదేశంలో దళిత, కార్మిక, రైతాంగ పోరాటలు సమాజాభివృద్ధిని కాంక్షించినవే అన్నది గమనించాలి.

ఆర్యసమాజం, బ్రహ్మసమాజం, రామకృష్ణమిషన్, ప్రార్థనా సమాజం, సత్యశోధక సమాజం ఇవన్నీ కూడా ప్రజల బాగుకోసం కృషిచేసినవే అని గుర్తించాలి. అటు ఉద్యమాలు, ఇటు సంస్థలు అన్నింటి పరమార్థం అందరూ బాగుండాలి అన్న ఆకాంక్షయే అన్నది గుర్తించాలి. తెలుగు సాహిత్యంలో భక్తి సాహిత్యంలో అన్నమయ్య సమసమాజ భావనతో "బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే" అంటూ చెప్పిన సంకీర్తనలు ప్రజలను చైతన్యవంతం చేశాయి. అలాగే మూఢనమ్మకాలపై పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చేసిన తిరుగుబాటు అనన్యసామాన్యమైనది. వేమన సంఘసంస్కరణ దిశగా నడిచిన ప్రజాకవి. ఆయన పద్యాలు సమాజంలో ఎంతో మార్పును తీసుకువచ్చాయి. కులమతాలను ధిక్కరించాడు. విగ్రహారాధనను నిరసించాడు. గురజాడ అప్పారావు "దేశమును ప్రేమించుమన్న" అంటూ ఆదర్శ సమాజాన్ని కాంక్షించాడు. కందూకూరి వితంతు పునర్వివాహాలు, బాల్యవివాహాల నిరసన చేపట్టి సంఘసంస్కరణకు పూనుకున్నాడు. ఇలా తెలుగునేలపై అనేకమంది కవులు, రచయితలు, విమర్శకులు సమసమాజాభివృద్ధిని కాంక్షించి, సమాజాన్ని ముందుకు తీసుకువెళ్ళి, ఆదర్శ సమాజాన్ని కలగన్నారు.

వ్యక్తిగత అంశాలను పక్కకుపెట్టి ఆదర్శ సమాజ భావనతో ప్రతి ఒక్కరు ఆలోచిస్తేనే సమసమాజం అన్నది నెరవేరుతుంది. ఆధునిక భావాలను మనం అందిపుచ్చుకోవాలి. సామాజిక మూఢనమ్మకాలను వదిలివేయడంలో ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాలి. సోక్రటీస్, అరిస్టాటిల్, ప్లేటో, కారల్‌మార్క్స్ లాంటి వ్యక్తులు కూడా కోరుకున్నది ఇలాంటి ఆదర్శ సమాజమే. అందుకే వ్యక్తిగత స్వార్థాన్ని వదలి, సంఘంతో మమేకమై, సమసమాజాన్ని ముందుకు తీసుకువెళ్ళాలి. అప్పుడే ఆదర్శ సమాజం అన్నది నెరవేరుతుంది. అందరికీ సంక్షేమ ఫలాలు అందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. నిరంతరం చింతన, మేధోమథనం గురించి ఆలోచిస్తూ ఇంకా సాంఘిక దురాచారాల్ని పాటించడం లాంటివి చేయడం ఏ నాగరికతకు చిహ్నం.

ఈ దేశం నాకేమిచ్చింది అనే దాని కంటే, ఈ దేశానికి నేనేమిచ్చాను అని ఆలోచించాలి. ఆదర్శ సమాజ నిర్మాణం జరగాలంటే వ్యక్తుల ప్రాధాన్యం వుంటుంది. వ్యవస్థల ప్రాధాన్యం వుంటుంది. సాహిత్యం ప్రాధాన్యం కూడా అనన్య సామాన్యమైనది. వ్యక్తుల్ని గుర్తించాలి. వ్యవస్థల్ని గౌరవించాలి. వ్యవస్థల్ని సరైన దారిలో నడిపించాలి. వ్యవస్థలు అవస్థలకు లోనవుతున్నాయి. వాటిని మనం రక్షించుకోవాలి. కాబట్టి వ్యక్తులు విద్యావంతులై, స్వార్థచింతనను వదిలి, ఆదర్శ సమాజం లక్ష్యాలను చేరుకోవడంలో ముందుకు రావాలని, మందడుగు వేయాలని ఆశిస్తున్నాను.

❖❖❖

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం

వారణాశి (ఉత్తర ప్రదేశ్)



ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు
శాఖాధిపతి, తెలుగు శాఖ.

సమాపన ప్రసంగం

'ఆదర్శ సమాజం' - ఎలా ఉండాలి? దాని లక్షణాలేమిటి? అనే దాని మీద ప్లాటో దగ్గరి నుండి, అరిస్టాటిల్, సోక్రటీస్, కార్ల్‌మార్స్, మాక్స్‌వెబర్, ఎమిలీ డర్కిమ్, జార్జి హెర్బర్డ్ మేడ్, జాన్ ఆడమ్స్ వంటి చింతనాపరులు ఎన్నెన్నో ఆలోచనలు చేశారు. ఆటవిక దశ నుండి నాగరోపేతుడైన దశ వరకు మానవ ప్రస్థానంలో ఎందరోదారులు చూపి సమాజ అభ్యున్నతికి కాపు కాచారు అందులో కణికుడు, చాణుక్యుడు వంటి భారత రాజనీతిశాస్త్రవేత్తలు చూపిన మార్గాలు ఉన్నాయి. సమాజం నుండి ఉన్నతంగా ఎదిగి అభ్యున్నతిని సాధించటానికి దోహదం చేసే లక్ష్యమే ఆదర్శ సమాజం. 'త్యాగేనైక అమృతత్వ మానుషుः, న ధనేన నప్రజేన'- అన్న సూక్తిని ఔదల దాల్చి వ్యక్తులు, వ్యవస్థలు ఆ ఆదర్శ సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తూనే ఉన్నారు.

రాజారామ్మోహన్‌రాయ్, దయానందుడు, వివేకానంద, ఈశ్వరచంద్రవిద్యాసాగర్ వంటి వ్యక్తులు భారతదేశంలో ఆదర్శ సమాజ నిర్మాణం కోసం చేసిన కృషి ఎంతగొప్పది? అంధకార బంధురమైన జాతికి చూపిన చేతన ఎటువంటి జాగృతికి దోహదం చేసిందో తెలినుకుంటే వాళ్లు నిర్మించిన పునాది పైనే మనం నిలబడి యున్నామని అర్థమవుతంది.

విజ్ఞాన రహస్యాల్ని ఆవిష్కరించిన ఎందరు శాస్త్రవేత్తలు, ఈ అజ్ఞాన సమాజపు దాష్టీకాలను బలయ్యారో తలచుకుంటే దుःఖం వస్తుంది. సోక్రటీస్‌కు విషం పెట్టి చంపించిన చరిత్రలో మన ఘనత ఎంత? స్థూలంగా గమనిస్తే పాశ్చాత్య దేశాలలో విజ్ఞానవేత్తలపై జరిగిన దాడుల వంటివి ప్రాచీన కాలంలో మనదేశంలో కనిపించవు. భాస్కరాచార్యుడు, వరాహమిహిరుడు, ఆర్యభట్టు, బ్రహ్మగుప్తుడు, చరకుడు, శుశ్రుతుడు, కణాదుడు వంటి వారిపై పాశ్చాత్యదేశాలలో జరిగిన దాడుల వంటివి లేవు. అయితే కుల వివక్ష ఈ సమాజానికి పట్టిన చీడ. ఇటువంటి పీడ ప్రతి సమాజంలో ఏదో రూపంలో వుంది.

వివక్షతల కన్నిటికీ అతీతంగా మనిషి మనగలగాలని, మనతో సమానంగా స్త్రీని చూడాలని, వితంతు స్త్రీల బ్రతుకుల్ని పండించటం కోసం కందుకూరి చేసిన కృషి వంటి కృషి ప్రతి సమాజంలోనూ ఎవరో ఒకరు చేస్తూనే వచ్చారు. ఈ దేశంలో అంబేద్కర్, జ్యోతిరావుపూలే, సావిత్రీబాయి, నారాయణ గురు వంటి వ్యక్తులు చేసిన కృషిని గురించి చెప్పటానికి మన భాష సరిపోదు! వ్యక్తులుగా ప్రారంభించి తమ కృషిని సంస్థాగతంగా, వ్యవస్థీకృతం చేసిన వాళ్లు వారు.

భారతదేశపు స్వేచ్ఛా సమరం కోసం ప్రారంభించిన జాతీయ కాంగ్రెస్ తొలుత ఒక చిన్న సంస్థగానే ప్రారంభమైంది. స్థాపించింది ఎ.ఓ.హ్యూమ్. దివ్యజ్ఞాన సమాజం, ఇంకా బ్రహ్మసమాజం, ప్రార్థన సమాజం, ఆర్య సమాజం, రామకృష్ణ మఠం- ఇవన్నీ సంస్థల రూపంలో వ్యవస్థ సంక్షేమం కోసం, ఆదర్శ సమాజ స్థాపన కోసం కృషి చేసినవే. ఇవన్నీ వేరుగా కనిపించినప్పటికీ మనిషి కోసం, మానవ సంక్షేమం కోసం వివిధ స్థాయిలలో కృషి చేసినవే.

ఏ సమాజంలోనైనా మానవులందరి అవసరాలు ఒకే విధంగా ఉండవు. వాళ్లంతా ఒకే లక్ష్యం కోసం పని చేయాలని కూడా లేదు. మనం ఎప్పుడైతే ఆదర్శమని అంటామో అప్పుడు తప్పనిసరిగా ఏదో ఒక Criteria (ప్రమాణాలు) పెట్టుకోక తప్పదు. అందులో అత్యంత ముఖ్యంగా పెట్టుకోవలసిన లక్షణం అందరూ సమానమేనన్నది. బయటి నుండి ఏ విధమైన భయం లేక పోవటమనేది కూడా ఆదర్శ సమాజం ఆశించేదే. వ్యక్తుల అవసరాల్ని బట్టి మారే ఆదర్శాలు సార్వత్రిక విలువలతో కూడుకున్నవి కావు. మంచి కోసం నిలబడే వ్యక్తులు ఎప్పుడూ మంచి సమాజాన్ని నిర్మించే ప్రయత్నమే చేస్తారు. పరస్పర సహకారంతో నడిచే సమాజమెప్పుడూ ఆదర్శానికి బృందగానమే. ఊరుమ్మడి బతుకులు, ఉమ్మడి బాధ్యత ఎప్పుడూ వ్యక్తికి భరోసాయే.

టెర్రరిజమ్, యుద్ధ వాతావరణం, సాంస్కృతిక ఘర్షణలు, లింగ వివక్ష, జాతి విబేధాలు, విషపునాల్కలు, చంపుకోవటాలు, అనత్ర భాషణలు, దొంగతనాలు, నేరాలు, వ్యభిచారాలు లేని సమాజం కావాలని ప్రతీ మనిషీ కోరుకుంటాడు. కానీ అటువంటి సమాజం భూలోకంలో ఎక్కడైనా దొరుకుతుందా? అలాంటిదాన్ని భూమి మీద సృష్టించగలవాడెవడైనా దొరుకుతాడా?

ప్రపంచమే కుగ్రామమైపోయేలా చేసిన కమ్యూనికేషన్ వ్యవస్థలు మన అరచేతిలో ఉన్నాయి. దేశాల మధ్యనే కాదు, గ్రహాల మధ్య కూడా దూరం తగ్గిపోతున్నది. కాని హృదయాల మధ్య తగ్గిందా? మనిషికి మనసుకు మధ్య బలపడతున్న ఇనుపతెరలను ఎలా ఛేదించాలి?

ఏ మనిషయినా అంతర్ముఖుడైనప్పుడే అనల్పశక్తిమంతుడు. ఊర్ధ్వముఖుడైనప్పుడే ఉన్నతుడు. మిగిలిన సమయాలలో జంతు ప్రవృత్తే సహజ లక్షణం.

అమరావతి కథలలో 'వరద'- అనే కథ ఉంది. అందులో కృష్ణకు వరద వచ్చి ఊళ్లోకి నీళ్లు వచ్చి ఇళ్ళన్నీ మునిగిపోతాయి. ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకుని ఊరు ఊరంతా ఒక ఎత్తయిన ప్రదేశానికి చేరుకుంటుంది. వరద కొంచెం తగ్గుముఖం పట్టాక, ఎవరి ఇళ్లలో దొరికిన వస్తువులు వాళ్లు పట్టుకొచ్చి సామూహిక సమారాధనలాగా

వంట చేసుకుని భోజనాలకు కూర్చుంటారు. ఇప్పుడు ఒక దళితుడు వచ్చి నేతిని వడ్డిస్తూ, అదే పంక్తిలో కూర్చున్న శాస్త్రిగారికి వడ్డించబోతూ సంశయంతో చేయి వెనక్కు తీసుకోగా శాస్త్రిగారు 'ఒరేయ్! ఇంకొకరు వేస్తే నెయ్యి, నువ్వు వేస్తే నెయ్యి కాకుండా పోతుందా? వెయ్యి!. సందేహించక వడ్డించమని ప్రోత్సహిస్తాడు'. - ఈ కథ చివరలో కథా రచయిత ఒక మాటంటాడు. 'స్నానం చేసిన ఒంటికి మళ్లీ చెమట పట్టి మలినాలంటుకున్నట్లు ఈ వరద మనుషుల మనసుల్లోని మురికిని కడిగేసిందని నమ్మవచ్చా? ఏమో! నాకైతే నమ్మకం లేదని అంటాడు. మానవ ప్రవృత్తి అంతే. అవసరానికి ఏ వేషమైనా వేస్తాడు.

లోకంలో పైన కథలో ప్రస్తావించిన స్థితిలాంటి మానసిక ప్రవృత్తి ఎప్పటికో ఒకప్పటికి భూతలం పైనున్న ప్రతిమనిషికీ రావాలి. అప్పుడే ఏక మానవ సమాజం అనేది ఏర్పడటానికి దారులేర్పడతాయి.

ప్రతివ్యక్తీ సమానమైన హక్కులు, సమానమైన స్వేచ్ఛ, చట్ట సమానత్వం కలిగియుండటమే ఆదర్శ వ్యవస్థకు తొలిమెట్టు. ప్రాచీన కాలపు పల్లెటూళ్ళలో కుల వ్యవస్థ ఉన్నప్పటికీ సమస్యల సందర్భంలో అందించుకునే సహాయ సహకారాలు, ఆధునిక సమాజంలో చూడలేకపోతున్నాం. తన సమాజపు సమస్యల్ని తాను చర్చించి పరిష్కరించుకోలేని సమాజం ఆదర్శవంతమైన సమాజమెలా అవుతుంది? స్వేచ్ఛతో పాటు తమ లక్ష్యసాధనకు పరస్పర సహకారంలేని సమాజం ఆదర్శం కాలేదు.

థామస్‌మోర్ **Utopia (1516)**లో వర్ణించిన Ideal Society, రామరాజ్యమంటూ మనం చెప్పే ప్రాగ్రూపాలు, లక్ష్యభూతమైన ఆదర్శాలే తప్ప పూర్తి వాస్తవ జగత్తులోనివి కావు. "Educating the mind without educating the heart is no education at all" ఇది ఆదర్శ వ్యవస్థ కోరుకునే రాజ్యాంగం చేయవలసింది. ప్లాటో "The real tragady of life is when men are afraid of the light" ఇందులోని light అంటే వెలుగే విజ్ఞానం. ఆ విజ్ఞాన కాంతులే ఆదర్శ సమాజానికి దారి చూపేది.

సోషలిజం సమీష్టికి ప్రాధాన్యం ఇచ్చింది. ప్రజాస్వామ్యం వ్యష్టికి ప్రాముఖ్యమిస్తుంది. వ్యష్టికి, సమీష్టికి వైరుధ్యాలను తొలగించి, వ్యష్టి యోగ క్షేమాలను సమీష్టి పురోగతిలో అంతర్భాగంగా చేయటంతో పాటు, సమీష్టి అభ్యుదయానికి విఘాతం కలుగకుండా వ్యష్టి వికాసానికి దోహదం చేసేది ఏదయినా సరే అది ఆదర్శవంతమైనదే.

ఏ దురాశో పీడించనిదే, ఏ దురహంకారమో రెచ్చగొట్టనిదే మానవుడు పరపీడనకో, రక్తపాతానికో, మరో దౌష్ట్యానికో ఒడిగట్టడు. దురాశ, దురహంకారాలతోపాటు అభద్రత, అపనమ్మకం, భయసందేహాలు మానవకోటిని పీడిస్తున్నాయి. కరోనాకు కారణమేంటి? దురాశ అందామా? అసూయ అందామా? ఇటువంటి ప్రపంచ గండాలు పొంచియున్న మానవ కోటి మధ్య స్నేహ సంబంధ పూరితమైన ఆదర్శాలు ఎక్కడ నిలుస్తాయి?

రక్తపాత విప్లవాన్ని సాగించటానికే కాదు. శాంతియుతమైన దాన్ని కొనసాగించాలన్నా ఆత్మవిశ్వాసం కావాలి. ధైర్య సాహసంతో పాటు త్యాగ నిరతి కావాలి. మనం ఆదర్శంగా చెప్పుకునే ఏ వ్యవస్థలోనైనా మంచి చెడులు ఉంటాయి. ఆ రెంటిలో ఏదో ఒక దాని పాలు కొన్ని అధికంగా ఉంటాయి!.

మనిషికి మనిషికి మధ్యనున్న గోడల్ని కూల్చకుండా ఆదర్శ వ్యవస్థను నిర్మించలేం. ఈ భేదాల్ని తొలగించమంటే రాజ్య వ్యవస్థను మార్చటం కాదు. అది పరిష్కారం కాదు. మనిషి గుణం మీద ఇంజనీరింగ్ జరగాలి. అంటే ప్రజల దృష్టిని మార్చటం, వాళ్ల చిత్తవృత్తిని, విశ్వాసాన్ని మార్చటం ఇది ఒక రోజులోనో, తరంలోనో జరిగేది కాదు. విద్యా విజ్ఞానాలతో పాటు సంస్కృతీ వికాసం ద్వారా మాత్రమే సాధ్యం.

ఉదా॥ యు.ఎస్.ఎ. ను చూడండి. ప్రతి యూరోపియన్ దేశం నుండి, గ్లోబ్‌లో ఉన్న అన్ని దేశాల నుండి భిన్న భాషా మత సంస్కృతుల నేపథ్యం నుండి వచ్చి చేరుతుంటారు. రెడ్ ఇండియన్స్ ను మినహాయిస్తే యు.ఎస్.ఎ.ను వలసల కేంద్రంగా చెప్పాలి. అయినా వాళ్లంతా అంటే నానా గోత్రికులు, నానా జాతులు, నానా దేశాల వాళ్లు అంతా అమెరికన్స్‌గా ఎలా మారిపోతున్నారు..ఈ పరిణామాన్ని గురించే 'ది గ్రేట్ క్రూసిబుల్'- అనే నాటకాన్ని జాంగ్విల్ అపురూపంగా రాశాడు. విద్యావిజ్ఞానం, శాంతి సంపత్తి సంస్కృతిని ఎలా ప్రభావితం చేస్తుందో వివరించి చెప్పిన నాటకమిది.

స్వేచ్ఛలేని ఏ సమాజమైనా సంతోషంతో ఉండగలదా? మన స్వేచ్ఛననుభవిస్తూనే పక్కవాడి స్వేచ్ఛను గౌరవించటంతో ఆరంభమవుతుంది ఆదర్శం. మానవుడిని సభ్యతతో, శిష్టతతో ఉన్నతునిగా తీర్చవచ్చు. బలాలు-దౌర్బల్యాలు రెండూ మనిషిలో ఉంటాయి. బలాలను ప్రోది చేయాలి. దైర్బల్యాల్ని విస్మరింప చేయగలగాలి. అందుకే సత్యాన్ని హరిశ్చంద్రుడిలా ఆచరించాలని, ఆర్తుల్ని శిబి చక్రవర్తిలాగా పాలించాలని, దాతృత్వాన్ని దానశీలాన్ని కర్ణుడిలా పాటించాలని, ప్రతిజ్ఞను భీష్ముడిలా ఆచరించాలని ఒక ఆదర్శాన్ని చెప్పి, అటువంటి లక్ష్యాన్ని మహోన్నత శిఖరాలపై నిలిపితే మనిషి వాటిపై ఒక గురుత్వాన్ని ఏర్పరుచుకుంటాడు. మానవ స్వభావంలోని ఈ బలాన్ని, దౌర్బల్యాన్ని సరిగా అర్థం చేసుకోకుండా చేసిన శాసనాలు వృథా వృథా.

రసరాజ్యానికి ఎల్లలు, శిశు హృదయానికి కల్లలలు లేవు. సాహిత్యానికి కూడా సరిహద్దులు లేవు. గ్రీకు భాషలో రాసిన హోమర్‌ను గ్రీస్‌కు చెందినవాడిగా భావించి పరిమితులు విధించగలమా? ఒక షేక్ స్పియర్‌ను, ఒక వాల్మీకిని, ఒక కాళిదాసును దేశాల సరిహద్దులు బంధిస్తాయా? దేశ- భాషల అవధుల్ని అధిగమించినట్లే సాహిత్యం కుల మతాతీత వ్యక్తిత్వం కలది కూడా! మిల్టన్‌ను, కాళిదాసుల్ని మతదృష్టితో చూస్తామా? ఒక రచనను ప్రేరేపించిన పరిసరాలు, ప్రోద్బలాలు, ఆశయాలు, అనుభూతులు ప్రతిబింబించే మానవ సంవేదనలు ఎల్లలను అతిక్రమింప చేసి, అందరి హృదయాలకు చేరువవుతాయి.

సమాజంలోని పాత్రలే సాహిత్యంలో సింబాలిక్ గా కనిపిస్తాయి. ఏక పత్నీవ్రతాన్ని బోధించే రామాయణం, అన్నదమ్ముల కలహాల వల్ల జరిగే నష్టాన్ని చెప్పే భారతం మనిషి మీద వేసిన ముద్రలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలలా అపరిహరణీయమైనవి. కవులు చెప్పే ఆదర్శాలెప్పుడు ఉన్నత సమాజానికి దారి చూపేదే. ఒక అసంపూర్ణ వలయం నుండి సంపూర్ణ వలయం వైపు ప్రయాణం చేసే మనిషికి దారి చూపేది ఆదర్శమే. ఆ ఆదర్శాన్ని చెప్పేది సాహిత్యమే. వాల్మీకి వ్యాసుల నుండి కవులు చెపుతూనే ఉన్నారు. మరి మనిషి మారాడా? అంటే ఆదర్శాలెప్పుడూ ఆచరణతో

బ్రతికేవే తప్ప ప్రవచనాలతో కాదు. వ్యక్తులు వ్యవస్థలయ్యేది ఆచరణ శీలురై నిజాయితీగా నిలిచినప్పుడే. ఒక బక్క పలుచని ప్రాణి గాంధీ ఒక్క పిలుపునిస్తే యావద్భారతానికి, ఇంగ్లండ్‌కు సంచలనమయ్యింది. దేని వలన గాంధీకి ఆ విలువ సమకూరింది. ఆ విలువను మనిషి పెంపొందించుకోవటానికి దోహదం చేసేదే సాహిత్యం. Market oriented cultureను వదిలి value oriented culture వైపు నడవటం ఎప్పుడూ ఆదర్శమే!

"ఒరులేయవి యొనరించిన
నరవర! యప్రియము తన మనమునకగు తా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మ పతములకెల్లన్"

ఈ sensitivity ఆదర్శ సమాజం అలవర్చుకోవలసింది. అందుకు వ్యక్తిని sensitize చేయడంలో సాహిత్యాన్ని మించిన సాధనం లేదు.

❖❖❖

Contents (విషయ సూచిక)

1.	ఆదర్శ సమాజ నిర్మాణంలో సాహిత్యం పాత్ర	- డా॥. వెల్దండి శ్రీధర్	28
2.	ఆధునిక సమాజ నిర్మాణం - గురజాడ సాహిత్య కృషి	- డా॥. జెన్నే యోగీశ్వరనాయుడు	32
3.	ఆదర్శ సమాజ నిర్మాణం - నీతి కథల పాత్ర	- డా॥. బాశెట్టి లత	35
4.	స్త్రీవాద కవిత్వం - సాంఘిక చైతన్యం	- డా॥. కొయ్యా శ్రీనివాసులు	38
5.	ఆదర్శ సమాజ నిర్మాణంలో ఎ.ఎ. నాగేంద్ర కవిత్వం	- డా॥. బత్తల అశోక్ కుమార్	42
6.	రాచపాళెం గారి రెండు ప్రపంచాలు కావ్యం - సామాజిక సంస్కరణ	- డా॥. ఎ. ఎ. నాగేంద్ర	47
7.	ఆదర్శ సమాజ నిర్మాణంలో జాతీయతా భావస్ఫోరక సాహిత్యం	- కప్పల శ్రీరాములు	51
8.	పల్లేటి నాటకాలు - మత సామరస్యం	- డా॥. కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి	55
9.	ఆదర్శ సమాజ నిర్మాణంలో కవులు రచయితల పాత్రికేయుల పాత్ర	- ప్రత్తిపాటి సుభాషిణి	59
10.	ఎం.వి.ఆర్. శంఖారావం వ్యాస సంపుటి - సామాజిక పరిశీలన	- యస్. గంగాధర రెడ్డి	62
11.	నీలవేణి కథల సంపుటి - సామాజిక అంశాలు	- డా॥. సింగర వాణి	68
12.	ఆంధ్ర మహాభారతం - సామాజిక శ్రేయస్సు	- వంకం భాస్కర్	71
13.	ఆదర్శ సమాజ నిర్మాణంలో సాహిత్యపు పాత్ర	- డా॥. నేమాని శారద	74
14.	ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగంగా-భారతదేశం జానపద కథకి పుట్టినిల్లు	- డా॥. కడివెండి మమత	77
15.	ఆదర్శ సమాజ నిర్మాణంలో కవి, రచయిత మరియు అష్టావధాని "పద్మశ్రీ" డాక్టర్ ఆశావాది ప్రకాశరావు గారి కృషి	- డా॥. ఆశావాది సుధామ వంశి & - ఆశావాది శశాంకమౌళి	81
16.	ఆదర్శ సమాజ నిర్మాణం స్త్రీ వాద కథ	- డా॥. యు. ఝాన్సీ	86
17.	ఆదర్శ సమాజ నిర్మాణం - ఆధునిక తెలుగు కవిత్వం పాత్ర	- పల్లా కృష్ణ	93
18.	ఆదర్శ దళిత సమాజ నిర్మాణంలో "మాదిగోడు" కథా రచయిత నాగప్పగారి సుందరరాజు కృషి	- డా॥. భీమినేని శివసాయి ప్రసాద్	97
19.	డా॥. పతికి రమేష్ నారాయణ 'ఎర్రని ఆకాశం'-ఆదర్శ సమాజ నిర్మాణ భావనలు	- కనుమల మునిస్వామి	101
20.	విద్వాన్ చొప్ప వీరభద్రప్ప "బాలసాహిత్యం" - ఆదర్శ సమాజం	- బసినేని శ్రీనివాసులు	106
21.	ప్రపంచానికే ఆదర్శం భారతదేశ ఆథిత్యం	- కే.హరీష్ కుమార్	113
22.	ఆదర్శ సమాజ నిర్మాణంలో 'రక్తస్పర్శ' కవుల కవిత్వానుశీలన	- భూక్యా కాశీరామ్	116
23.	ఆదర్శ సమాజ నిర్మాణంలో దేవులపల్లి కృష్ణమూర్తి - నవలానుశీలన	- జాగర్ల మహేందర్	120

24.	ఆదర్శ సమాజ నిర్మాణంలో విశ్వనాథ సత్యనారాయణ సాంఘిక నవలల పాత్ర	- అవధానం సుజాత	126
25.	ఆదర్శ సమాజ నిర్మాణంలో తెలుగు పద్య సాహిత్యం పాత్ర	- డా॥. ఒభిన్ని శ్రీహరి	129
26.	ఆదర్శ సమాజ నిర్మాణంలో గాంధీ గారి పాత్ర	- డా॥. కె.ఎస్. శకుంతల	133
27.	ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగవతం పాత్ర	- బి. ఈరనారప్ప	136
28.	ఆదర్శసమాజ నిర్మాణంలో సాంఘిక శాస్త్రాల ఆవశ్యకత	- పామర్తి లీలావతి	139
29.	ఆదర్శ సమాజ నిర్మాణ స్థాపనలో మహిళా శాస్త్రవేత్తలు	- వై. బుజ్జి	143
30.	ఆదర్శ సమాజ నిర్మాణం - వేమన పాత్ర	- డా॥. బోడిరెడ్డి మహేంద్ర రెడ్డి	145
31.	ఆదర్శ సమాజ దార్శనికుడు - వీరేశలింగం పంతులు గారు	- అంకే మదనమోహన	148
32.	ఆదర్శ సమాజ నిర్మాణంలో సాహిత్యం తెలుగు ప్రాధాన్యత	- కాపర్తి స్వరాజ్యం	153
33.	'రాజేశ్వరి' నాటకం - ఆదర్శ సమాజ చిత్రణ	- ఓబిలి వెంకటయ్య	157
34.	ఆదర్శ సమాజ నిర్మాణంలో గురజాడ సాహిత్యం	- నండూరి అనంతలక్ష్మి	161
35.	ఆదర్శ సమాజ నిర్మాణంలో తెలుగు సాహిత్యం	- డా॥. పి. కమల సుధారాణి	163
36.	ఆదర్శ సమాజ నిర్మాణానికి గురజాడ అప్పారావు గారి సాహిత్య కృషి	- వేమూరి కమలాకర్ సుజాత	165
37.	జాషువా గబ్బిలంలో - సామాజిక దృక్పథం	- డా॥. ఎల్. కస్తూరి	170
38.	ఆదర్శ సమాజ నిర్మాణంలో కాలువ మల్లయ్య కృషి	- గడ్డం లింగరాజు	173
39.	ఆచార్య కొలకలూరి ఇనాక్ కవిత్వం - మానవతా ప్రభోదం	- డా॥. ఆంజనేయుడు	178
40.	ఆధునిక సాహిత్యంలో సామాజిక స్పృహ	- డా॥. పుట్ట శ్రీనివాసులు	185
41.	Societal Safety Sciences/Technologies in building an Ideal Society	- Prof. R. Ramakrishna Reddy & - Dr. K. Rama Gopal	187
42.	The Role of Sociology in Constructing Ideal Society	- Dr. M. Kalpana Krishnaiah	195
43.	Building an ideal society using Skill Development training for Rural Areas	- R. Raj Kumar	203
44.	The Role of History in the Construction of Ideal Society and Contradictions	- Seelam Srinivasa Rao	210
45.	A Study on Problems of Rural People for the Development of Rural Areas : Some Issues and Challenges	- H. Thirupalu & - Prof. M. Muninarayanappa	214
46.	"The Importance and Involvement of Social Work Profession in the Structure of an Ideal Society"	- Talari Yugandhar & - Prof. M. Muninarayanappa	222

47.	Strategic approaches to the development of Rural areas through Rural Development Department in India	- Dr.A. Ramalingaiah & - Prof. M. Muninarayanappa	227
48.	Prominence of Detriment Groups of South India and Its Substitute Approaches for their Evolution	- Dr. Jammanna Akepogu	233
49.	Innovative Business Enhancement Practices among Tailoring Communities	- Dr. G. Ganeshkumar Rai & - Mr. Rajesh Jabade	251
50.	Comprehensive Study on Tribal Women Reference with Yerukulas in Andhra Pradesh	- C. Prasad, Research scholar	260
51.	An empirical study on impact of Mahatma Gandhi National Rural Employment Guarantee Scheme (MGNREGS) on Disable persons in Anantapuramu district	- Suddula Sudha & - Prof. M. Muninarayanappa	271
52.	An Empirical Study on Brunt of Relegation about Tribal Women	- Dr. Penukonda Jyothi	278
53.	Usage of Sustainable and Non Sustainable Materials for an Eco friendly Environment	- G.Vishnu Vardhan	286
54.	Tank Irrigation Under the Rayas of Vijayanagara	- Dr. M. Nagendra	290
55.	A Comprehensive Sociological Study on Ideal Types Theory of Max Weber	- Dr. K. Radhika	294

ఆదర్శ సమాజ నిర్మాణంలో సాహిత్యం పాత్ర

– డా॥. వెల్దండి శ్రీధర్, తెలుగుశాఖాధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పు), గజ్వేల్ - జిల్లా: సిద్ధిపేట, తెలంగాణ.

ఆదర్శ సమాజాన్ని నిర్మాణం చేయడానికి సాహిత్యాన్ని మించిన పరికరం మరొకటి లేదు. ఏ యుగంలోనైనా సాహిత్యం తన వంతు పాత్రను చాలా బలీయంగా పోషిస్తూ వస్తున్నది. సమాజం, సాహిత్యం పరస్పర ప్రేరకాలు. ఉత్తమ సాహిత్యం వెలువడాలంటే ఉత్తమ సమాజం ఉండాలి. ఉత్తమ సమాజ నిర్మాణం కావాలంటే ఉత్తమ సాహిత్యం కావాలి. వేదకాలం నుంచి కవులు, రచయితలు తమ సాహిత్యం ద్వారా మరింత మెరుగైన సమాజాన్ని నిర్మించడానికి తాపత్రయపడుతూనే ఉన్నారు. ఆ క్రమంలో ఎంతో విలువైన, మానవ సమాజం మనుగడ సాగించినన్నినాళ్లు గుర్తుంచుకోదగిన శ్లోకాలు, పద్యాలు, కథలు వెలువడ్డాయి. నన్నయాది కవులు ఋషితుల్యులు కాబట్టి వాళ్ళు ఏది రాసినా సమాజం కోసం, మనిషిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడం కోసమే రాసినట్టుగా కనిపిస్తుంది.

"నుతజల పూరితంబులగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత యొకబావి మేలు, మఱి బావులు నూఱిటికంటె నొక్కస
త్క్రతువది మేలు, తత్క్రతు శతంబునకంటె సుతుండు మేలు త
త్సుత శతకంబుకంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్"

- నన్నయ

సత్యవాక్యము యొక్క విశిష్టతను తెలపడానికి నన్నయ అనేక ఉపమానాలు చెప్పి సత్య వచనం ఎంత గొప్పదో వివరించాడు. వందమంది కొడుకుల్ని కలిగి యుండడం కంటే ఒక్క సత్యవాక్యానికి కట్టుబడి ఉండడం గొప్ప విషయమంటాడు కవి. యుగాలు గడుస్తున్నా కొద్ది మనిషి ఎంత మాట మీద నిలబడుతున్నాడో చూస్తూనే ఉన్నాం. సమకాలీన సమాజంలో అబద్ధం ఆడకుండా రోజు గడవని పరిస్థితి. ఏ ఒక్క మనిషి కూడా నిజాయితీగా ఉండడం అనేది చాలా చాలా అరుదుగానే జరుగుతోంది. ఈ పద్యం ఒక్కటి మానవజాతి మొత్తానికి ధర్మదీపికలాంటిది.

"తల్లిగల్గిననేల తపసిగానిచ్చు
తల్లిగల్గిన నేల తలజడల్గట్టు?
తల్లియున్న విషంబు ద్రావనేలిచ్చు?
తల్లియుండిన తోళ్ళు దాల్చనేలిచ్చు?
తల్లిపుచ్చునె సుతు వల్లకాటికిని?"

- పాల్కురికి సోమన

సకల బంధువర్గమంతా ఒకవైపు తల్లి ఒక్కతి ఒక వైపు. తల్లిలేకపోతే ప్రపంచమే వికలాంగురాలు అవుతుంది. తల్లి ఉంటేనే శిశువు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా పెరుగుతుంది. అనేక కారణాల వల్ల ఈ రోజు ఎంతో మంది పిల్లలు అనాథలుగా మారుతున్నారు. అందుకే సమాజం ఇంత ఘోరంగా తయారైపోయింది. తల్లి ఉంటే శిశువును ఎంత జాగ్రత్తగా చూస్తుందో తెలుపు తాయి పై మాటలు. శిశువుకు తల్లిని మించిన అభయ హస్తం ఏదీ ఉండదు. తల్లిపాత్ర యొక్క విశిష్టతను తెలుపుతూ తల్లే గనక ఉంటే శివుడు ఇలా మారుతాడా? అని ప్రశ్నిస్తుంది బెజ్జమహాదేవి. తల్లి లేకపోవడం వల్ల పరమ శివుడే అన్ని పాట్లు పడ్డాడంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి? తల్లిది ఈ సమాజం నిర్మాణంలో కీలక పాత్ర. తల్లే శిశువుకు మొదటి గురువు కావటాన మెరుగైన సమాజంలో మనిషి ఎలా మెదులుకోవాలో తల్లే చెప్తుంది. వివిధ కారణాల వలన తల్లిలేక అనాథలుగా మిగిలి పోయిన పిల్లల్ని చూస్తే ఎవరికైనా మనసు కలచివేస్తుంది.

"నియత తపమును నింద్రియ నిగ్రహంబు
భూరి విద్యయు శాంతికి గారణములు

వాని యన్నింటికంటె మేలైన శాంతి
కారణము లోభముడుగుట కౌరవేంద్ర''

- తిక్కన మ. భా. ఉద్యోగ 3-273

సమాజం ఎల్లప్పుడు ప్రశాంతంగా ఉండాలంటే సాధనాలేమిటో మహాభారతం చాలా స్పష్టంగా చెప్పింది. నియతమైన తపస్సు, ఇంద్రియ నిగ్రహం, పెద్ద చదువు ఇవన్నీ శాంతికి కారణాంటాడు తిక్కన మహాకవి. ఇంకా ఇవన్నింటికంటే మేలైన శాంతి లోభాన్ని వదిలివేయడం వలన కలుగుతుందంటాడు. దురదృష్టవశాత్తు ప్రస్తుత సమాజంలో ఇవన్నీ లోపించాయి. అందుకే ఇప్పటి సమాజం నిత్యం ఏదో ఒక అశాంతితో నలిగిపోతోంది. మహాభారతం ఆనాటి నుండి నేటి దాకా సమాజాన్ని ఎప్పటికప్పుడు సంస్కరిస్తూనే ఉంది. మహాభారతం మానవ సమాజాన్ని అన్ని కోణాల్లో వ్యాఖ్యానించింది. ఎలా ఉండకూడదో చెప్పింది. ఎలా ఉండాలో కూడా చెప్పింది. అందుకే ఇప్పటికీ మహాభారతం మానవాళికి నిత్య పారాయణ గ్రంథం.

''క్రోధ మోహ నామకులైన ఘోరశత్రు
లిరువు రెరియించుచుండుదురెపుడు
నంత రంగమయ్యుభయంబు నడంగకున్న
గలదె యూరక బ్రాహ్మణ గౌరవంబు?

- ఎఱ్ఱన మహాభారతం - 3-5-23

మానవ హృదయాలలో కోపం, మోహం అనే పేర్లుగల శత్రువులు ఇద్దరు మిక్కిలి భయంకరమైనవారు నివసిస్తుంటారు. వారిని ఇద్దరిని అణచివేయకపోతే ఈ లోకంలో బ్రాహ్మణులకు నిజమైన గౌరవం ఎలా కలుగుతుంది? అని ప్రశ్నిస్తాడు కవి. ఇంతకంటే సమాజ సంస్కరణ ఏముంటుంది? ప్రతి మనిషి విడువదగిన రెండు అవ లక్షణాల గురించి వివరించాడు. బ్రాహ్మణునికే కాదు ఏ మనిషికైనా నిజమైన గౌరవం లభించాలంటే అణచి వేయదగినవి ఇవి రెండు గుణాలు.

''పగవృద్ధి బొందించు భ్రష్టులే కాని
అడగించు నేర్పరు లిలలో లేరు''

''పోరు మంచిదిగాదు భూమి నెక్కడను
పాడౌను దేశంబు పగమించెనేని
ప్రజలెల్ల నశియించి పారిపోవుదురు''

- పల్నాటివీరచరిత్ర

లోకంలో అందరూ పగతో రగిలిపోయేవారేకాని దాన్ని నాశనం చేసేవారే లేరు. పోరు ఎప్పటికీ మంచిదికాదు. పొట్లాట వల్లనే దేశం పాడైపోతుంది. ప్రజలంతా నశించి పోతారు, పారిపోతారు అని కవి సమాజానికి పగవల్ల, పోరు వల్ల కలిగే నష్టాలను విడమర్చి చెప్తాడు.

''కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే
వారేరీ సిరి మూటగట్టుకొని పోవంజాలిరే భూమిపై
బేరైనంగలదే శిబి ప్రముఖులుం బ్రీతిన్ యశ: కాములై
యీరే కోర్కులు వారలన్ మరచిరే యిక్కాలమున్ భార్గవా!''

- పోతన భాగవతం 6-589

ఈ లోకం పుట్టినప్పటి నుండి ఈ ప్రపంచాన్ని ఎంతో మంది రాజులు పరిపాలించారు. ఎంతో గర్వంతో విర్రవీగిపోయారు. ఎంతో విశాలమైన రాజ్యాలు స్థాపించారు. వారంతా ఏరి? ఇప్పుడు వాళ్లంతా ఎక్కడున్నారు? వారు సంపాదించిన అపారమైన ధనరాశులను మూట గట్టుకొని పోగలిగారా? వారి పేరైనా ఈ భూమి మీద నిలిచి ఉన్నదా? శిబిచక్రవర్తి, దధీచి, కర్ణుడు మొదలైన వారు వారి దగ్గరికి వచ్చి చేయి సాచి అడిగిన వారికి లేదనకుండా ఇచ్చారు. వారిని ఈ లోకం ఇప్పటికీ మరచిపోలేదు కదా! మానవ కళ్యాణం కోసం తాపత్రయ పడే ఏ మహనీయుని ఈ ప్రపంచం మరచిపోదు. సంపదలు అశాశ్వతం. కీర్తి శాశ్వతం. ఈ సంగతి తెలియక మనిషి స్వార్థం అనే వృత్తాన్ని గీసుకొని అందులోనే పడి చచ్చిపోతున్నాడు అని పోతన మానవ జాతి ఎలా జీవించాలో ఎంతో స్పష్టంగా వివరించాడు. అయినా మనిషి మారలేదు. అతని వాంఛ తీరలేదు.

"తమ విద్య నెవ్వరే మా
త్రము గనజాలుదురు, వారిదండను దన్మా
త్రము ప్రకటింతురు బుధులు
త్తముల మహిమ నీరు కొలది తామర సుమ్మీ"

- కళాపూర్ణోదయం

నీరెంత ఉంటుందో అంతే విశాలంగా తామర పూవు విచ్చుకుంటుంది. అలాగే ఉత్తములైన వారు కూడా ఎదుటి వ్యక్తి ఎంత మాత్రం గ్రహింపగలడో అంత మాత్రమే తమ విద్యను ప్రదర్శిస్తారు కాని తమకు వచ్చు కదా అని తమ విద్యనంత ప్రదర్శించరు అని ఈ లోకంలో ఉత్తములైవారు ఎలా ఉంటారో, ఉండాలో వివరిస్తాడు కవి. సమాజంలో మానవులు ఎంత ఒద్దికగా ఉండాల కవి బోధపరుస్తాడు. ఈ సూక్ష్మ సూత్రాన్ని పాటిస్తే లోకమంతా ప్రశాంతంగా ఉంటుందని కవి భావన.

"శత్రువు చదువని పుత్రుడు
శత్రుడు ఋణకారియైన జనకుడు మిగులన్
శత్రువు రూపసియగు సతి
శత్రువు దుశ్చరితయైన జనని తలంపన్"

- కేయూరబాహుచరిత్ర

చదువురాని కొడుకు, రుణగ్రస్తుడైన తండ్రి, రూపసియైన భార్య, మంచి చరిత్రలేని తల్లి ఈ నలుగురు ఈ లోకంలో శత్రువులని చెప్తాడు కవి. అంటే కొడుకు చదువుకోవాలని, తండ్రి తన సంతానానికి అప్పులు పంచకూడదని, తల్లి సమాజం మెచ్చేలా జీవించాలని కవి ఎంతో అనుభవంతో చెప్తాడు. అప్పుడే ఆదర్శ సమాజం నిర్మితమవుతుంది.

శతకాలు మానవతా మూల్యాలకు, ఉత్తమ సమాజ నిర్మాణానికి ఎత్తిన పతాకలు. మానవ జీవితంలోని ప్రతి దశలో మనిషి, సమాజం ఎలా ఉండాలో చెప్పడానికి శతకాలన్నీ ప్రయత్నిస్తాయి. వాటిలో అనర్ఘమైన రత్నాలున్నాయి.

"మాలవాని నేల మరిమరి నిందింప
ఒడలనున్న మాంస మొకటిగాదె
వానిలోన వెలుగు వాని కులంబేది
విశ్వదాభిరామ వినుర వేమ"

వర్ణ వ్యవస్థపైనా, అస్పృశ్యతపైనా మొట్టమొదటగా గొంతు విప్పినవాడు వేమన. మనుషుల మధ్య భేదాలను శాశ్వతం చేసే కులగోడల్ని కూలదొయ్యాలన్నది వేమన్న వేదం. అంతేకాదు సంసారంలో విశృంఖలత్వం పనికి రాదని, సంఘానికి కట్టుబాటు అవసరమని, విటజీవితం సమాజానికి హానికరమని బోధించాడు వేమన. సంఘ సంస్కరణకు మూఢనమ్మకాలే అవరోధాలని గ్రహించిన వేమన అజ్ఞానం వల్లనే సమాజం ఇంతగా మతబోధకుల మాయలో పడుతోందని హెచ్చరించాడు.

"ఆపదలందు ధైర్యగుణమంచిత సంపదలందు దాల్మియున్
భూప సభాంతరాళమున పుష్కల వాక్చతురత్వమాజి బా
హా పటుశక్తియున్ యశమునందనురక్తియు విద్య యందు వాం
ఛా పరివృద్ధియున్ ప్రకృతి జన్యగుణంబులు సజ్జనాళికిన్"

లోకంలో సజ్జనులకు ఉండవలసిన సహజ సిద్ధమైన గుణాలను చెప్పాడు భర్తృహరి పైపద్యంలో. ఆపదలు కలిగినపుడు బెంబేలెత్తకూడదు. సంపదలు కలగగానే అహంకారానికి పోకూడదు. కీర్తి కాంక్ష, విద్య పట్ల తీరని కోరిక ఉండాలని చెప్తూ కార్యసాధకుడు ఎన్ని కష్టాలనైనా ఎదుర్కోవాలంటాడు మరో పద్యంలో. పని చేసేవానికి పనిపట్ల శ్రద్ధ, అంకితభావం ఉండాలి. అప్పుడే ఏ పనినైనా సాధించగలం అని హితవు పలుకుతాడు కవి. సమాజంలో అందరూ ఇలాగే ఉంటే అంతకన్నా ఉత్తమమైన సమాజం మరెక్కడ ఉంటుంది.

"మాటల చేత దేవతలు మన్నన జేసి వరంబులిచ్చెద
ర్మాటల చేత భూపతులు మన్నన జేసి ధనంబులిచ్చెద
ర్మాటల చేత కామినులు మన్నన జేసి సుఖంబులిచ్చెద
ర్మాటల నేరకున్న నవమానము న్యూనము మాన భంగమున్"

నోరు మంచిదైతే ఊరు మంచిదని సామెత. లోకంలో మాటకున్న విలువ దేనికీ లేదు. మాట వల్లనే అన్ని

ప్రదేశాలలో మనిషికి గౌరవం, కీర్తి లభిస్తాయి. అందుకే సుఖంగా బతకాలంటే మంచి మాటకారి కావాలి. నిజానికి మాటే రెండు హృదయాల మధ్య వంతెనలాంటింది. మన చుట్టూ ముళ్లవంతెనలు చాలా ఉన్నాయి. ఇప్పుడు మనకు సాధ్యమైతే పూల వంతెనలు నిర్మించాలి. అందుకే కవి మాటకున్న విలువను అనేక విధాలుగా చెప్పాడు. మాటల వలన దేవతల మెప్పునే పొందవచ్చు. మాటల వలన రాజుల నుండి ఎన్నో కానుకలను పొందవచ్చు. మాటల వలన వనితల హృదయాలను గెలుచుకోవచ్చు. మాటల వలన సర్వభోగాలు సమకూరుతాయి. మాటలే నేర్వకుంటే నిత్యజీవితంలో అవమానము, న్యూనతా భావం, గౌరవ భంగము కలుగుతాయని మాట విలువను ఎంతో హృద్యంగా వర్ణించాడు కవి. సమాజంలోని అందరి మాట తీరు మర్యాదగా, తీయగా ఉంటే ఇక కలహాలు ఎందుకు కలుగుతాయి. మెరుగైన సమాజ నిర్మాణానికి మాట కన్న మంచి ఆయుధం లేనేలేదు.

"పలుచగా జూచు నెంతయు బంధు సమితి
పిలువ, పిలువంగ బలుకరు బిడ్డలైన
రచ్చకెక్కెడు మాట గారాపు సతియు
లెక్క సేయదు, లేమి తూలించె నేని"

- రాజశేఖర చరిత్ర

'ధనమూలమిదం జగత్' అని సూక్తి. ధనం లేకపోతే సొంత బిడ్డలే మన మాట వినరు. బంధువులు దూరం దూరం జరుగుతారు. పెళ్లి చేసుకున్న భార్య కూడా మనల్ని లెక్క చేయదు. కాబట్టి మానవులు తన అవసరాలకు తగినంత ధనాన్ని సంపాదించాలి. లేకపోతే అందరి ముందు చులకనైపోతారు అంటాడు కవి. అదే సమయంలో సంపాదించే డబ్బు కూడా న్యాయంగా సంపాదించాలనే హెచ్చరిక కూడా ఉంది.

ప్రాచీన సాహిత్యంలో ఈనాటి సమాజానికి విరుద్ధమైన భావాలతో కూడిన పద్యాలు అక్కడక్కడ ఉన్నా సారాంశంలో మెరుగైన సమాజ నిర్మాణానికి ప్రతి కవి ఎంతో కొంత దోహదపడే పద్యాలనే రాశాడని చెప్పవచ్చు. అంతేకాదు మనిషిని, సమకాలీన సమజాన్ని సంస్కరించడానికి వారి రచనలు శక్తిమేర తోడ్పడ్డాయి. ఆధునిక సాహిత్యం కొత్త చైతన్యంతో, కొత్తచూపుతో సమాజాన్ని చూసింది. సమాజం కోసం మాట్లాడడం మొదలుపెట్టింది. కందుకూరి, గురజాడ మొదలైన సంఘసంస్కర్తలు తమ రచనల ద్వారా సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశారు.

"మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగిమొక్కుతు
మనుషులంటే రాయిరప్పల కన్న కనిష్ఠం
గాను చూస్తావేల బేల?
కొండకోనల వెతుకులాడే వేలా?
కన్ను తెరిచిన కానబడడో?
మానవ మాత్రుడియందు లేడో?
యెరిగి కోరిన కరిగి యీడో ముక్తి?"

- గురజాడ

అనాదిగా దైవదర్శనం కోసం మనిషి గుళ్ళుగోపురాలు తిరుగుతున్నాడు. కాని దేవుడు ఎక్కడో లేడు ఎదుటి మనిషిలోనే ఉన్నాడు. నీవు కన్ను తెరిచి చూడగలిగితే అంటాడు కవి. సాటి మనిషిని మనిషిగా చూడమంటుంది ఆధునిక సాహిత్యం. ఈ క్రమంలో తలెత్తిన ఎన్నో వాదాలు, ధోరణులు అన్నీ మనిషిని మనిషిగా చూసి ఆత్మగౌరవంతో బతకమన్నాయి. ప్రశాంతమైన సమాజాన్ని నిర్మించమన్నాయి. ఎన్నో సామెతలు, పొడుపు కథలు, జానపద గేయాలు కూడా ఉత్తమ సమాజాన్ని నిర్మించడానికి కావాల్సిన మానసిక ధైర్యాన్ని నూరిపోశాయి. ఇప్పుడు కావాల్సిందల్లా మనం వాటి వెంట ఉండి మన పూర్వకవులు, రచయితలు ఏం చెప్పారో గ్రహించడం, నేటి తరాలకు ఆ విలువల్ని అందించడమే.

❖❖❖

ఆధునిక సమాజ నిర్మాణం - గురజాడ సాహిత్య కృషి

– డా॥. జెన్నే యోగీశ్వరనాయుడు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), అనంతపురము.

నవ్య కవిత్వానికి అడుగుజాడ గురజాడ, భావికి బాట. గురజాడ ఆధునిక తెలుగు సాహిత్యానికి వెలుగుజాడ. ద్రష్ట, స్రష్ట, మహాకవి, సంఘ సంస్కర్త, మనీషి. కొత్తపాతల మేలు కలయికతో తెలుగు వారి మత్తును వదలగొట్టిన భావ విప్లవకారుడు గుజాడ అప్పారావు. సాహిత్యమే ప్రజల సొమ్మని ఎలుగెత్తి చాటిన మహనీయుడు. కందుకూరి వీరేశలింగం గారి సాంఘిక విప్లవం, గిడుగు రామ మూర్తి భాషా విప్లవం, తనలో సమన్వయించుకుని కొత్త సాహిత్య విప్లవమును తెచ్చిన నవయుగ వైతాళికుడు గుజాడ అప్పారావు అని సినారె తెలియజేసారు. గురజాడ వల్ల సాహిత్య రంగంలో నూతన చైతన్యం సిద్ధించింది.

సంఘసంస్కరణ లక్ష్యంగా అప్పారావు గారు సాహిత్యాన్ని సృజించుటయేకాక, అమోఘమైన కల్పనా చాతుర్యాన్ని ప్రదర్శించాడు. వాస్తవాలను, అభ్యుదయ భావాలను కమనీయ కవితా శిల్పముతో మేళవించి సామాజిక చైతన్యమును ప్రదీప్తం చేసిన యుగపురుషుడు గురజాడ. తను సృష్టించిన రచనల ద్వారా సామాజిక దురాచారాలను ఖండించి సలక్షణమైన ఆధునిక సమాజ నిర్మాణానికి కారకులయ్యారు. సాహిత్యం ద్వారా సమాజాన్ని సంస్కరించడం తన ఉద్దేశ్యమని తెలియ జేశాడు గురజాడ.

జీవిత విశేషాలు :

కౌసల్యమ్మ, వెంకటరామదాసు దంపతులకు విశాఖ జిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలలో 1862లో జననం, విద్యాభ్యాసం, వివాహం తరువాత ఆనందగజపతి సంస్థానంలో ఉద్యోగం, అసిస్టెంటు లెక్చరరుగా పనిచేసి 1915లో మరణించడం జరిగింది.

గురజాడ ప్రాథమిక దశలో అందరిలాగా సంప్రదాయ రీతిలో మాటల మబ్బులు, పుష్పలావికలు, మెరుపులు అను కవితలు, సుభద్ర అను కావ్యాన్ని, ఋతు శతకాన్ని రచించారు. నీలగిరి పాటలను గూర్చి సినారె మన ప్రాచీన కొత్త పరిమళాలను గుభాళించే సంప్రదాయక రచనలు అని పేర్కొనడం గమనించదగినది.

ఆదర్శ సమాజ నిర్మాణం - గురజాడ సాహిత్య కృషి :

"హితేన సహితం సాహిత్యం", "సహితస్య భావ: సాహిత్యం" అన్న వాక్యాల పరమార్థం సమాజానికి సాహిత్యం ద్వారా హితం చేకూర్చడం. వాస్తవానికి సమాజం సాహిత్యంలో ప్రతిబింబిస్తుంది. ఇందులో మంచి, చెడు లను ప్రస్తావిస్తూ ఆదర్శ సమాజం ఎలా ఉండాలో నిర్ణ యిస్తుంది సాహిత్యం. గురజాడ తను సృష్టించిన సాహిత్యంలో సింహభాగం ఉత్తమ విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి సాక్షీ భూతమయింది. సాంఘిక దురాచారాలను ఒకవైపు ఖండిస్తూ, మరొకవైపు సమాజంలో చైతన్యాన్ని ప్రోది చేసి ఆదర్శ సమాజ నిర్మాణానికి కంకణ బద్ధులయ్యారు. "బ్రతికి చచ్చియు ప్రజలకెవ్వడు బ్రీతి గూర్చునొ వాడె ధన్యుడు" అని సమాజానికి చావు, బతుకుల ద్వారా హితాన్ని కలిగించే వాడు ధన్యుడు అని, ఈ వాక్యాలను తానే ప్రత్యక్ష ఉ దాహరణ అని నర్మగర్భంగా తెలియజేశాడు.

ముత్యాల సరాలు :

కర్నాటక భాషలోని ఒక షట్పదీ, పారసీ భాషలోని ఒక గజల్, "గుమ్మడేదీ గోపదేవీ, గుమ్మడేదీ కన్నతల్లీ" అను జానపదగేయం, వృషభగతి రగడ మొదలైనవ గురజాడ అంతరాలలో ఒక కొత్తరీతిని మేల్కొలిపిన ఫలితంగా ముత్యాలసరాలు పొడసూపింది. వస్తువు లోనూ, భాషలోనూ, ఛందస్సులోనూ నవ్యత కలిగినవి గేయ ఖండికలు. "గుత్తునా ముత్యాల సరములు

కూర్చుకుని తేలైన మాటల కలయిక
కొత్తపాతల మేలు కలయిక
క్రొమ్మెరుంగులు జిమ్మగా
కొయ్యబొమ్మలే మెచ్చు కళ్ళకు
కోమలులు సొరెక్కునా'' అని నినదించాడు.

కొత్త ఛందస్సు, కొత్త కథా వస్తువు, సాంఘిక అంశాలు గల ఖండకావ్యాల సంపుటి ముత్యాల సరాలు. గురజాడ తన కవిత్వంలో పేదవారికి, సామాన్యులకి, వ్యక్తిత్వ చైతన్యానికి పెద్దపీట వేశారు. లవణరాజుకలలో మాలెత కావ్యనాయిక. వర్ణధర్మం అధర్మమని, మంచి అన్నది మాల అయితే ఆ మాల నేనవుతానని తెలియజేస్తూ అస్పృశ్యతను నిరసించి, మంచి-చెడు అన్నవి రెండే కులాలున్నాయని తెలియజేశారు.

''మతములన్నియు మాసి పోవును,
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును'' అని సర్వమానవ సమానత్వాన్ని, విజ్ఞాన ప్రాధాన్యతను, విశ్వమానవ ప్రేమను కాంక్షించిన దార్శనికుడు గురజాడ.

రాజరిక వ్యవస్థలోని డొల్లతనాన్ని, సమాజంలో స్త్రీల పట్ల కామాంధుల భావజాలాన్ని, కులం కన్నా శీలం, గుణం స్త్రీలకు ముఖ్యమని, స్త్రీలపై అఘాయిత్యంపై చేసే వ్యక్తులకు దైవశిక్ష పడుతుందని, సమాజానికి సందేశం అందిచ్చిన కవిత కన్యక.

కన్యక సెట్టి కూతురు. తన చెలికత్తెలతో కలిసి దేవాలయానికి వెళ్తున్న సమయంలో కామాంధుడైన రాజు, ప్రజలను రక్షించాల్సిన ధర్మం మరచి బలత్కారం చేస్తే ఎలాంటి పర్యవసానాలు ఉంటాయో తెలియజేసినది ''కన్యక'' గేయఖండిక. కన్యకను అగ్నిసాక్షిగా వివాహం చేసుకోమంటే రాజు గర్వంతో అంగీకరించడు. దుర్గ గుడికి వెళ్ళి వస్తానని చెప్పి రాజు దగ్గర నుండి బయలుదేరింది. తన జాతి జనులను ఉద్దేశించి మాట్లాడుతూ

''కాసుదీసం కలిగి వుండే చాపననుకొని వీర్యమెరుగక
విద్య నేర్చక బుద్ధిమాలినచో కలుగవా యిక్కట్లు?''

అని పలికింది. తనవాళ్ళు తమ ఆడబిడ్డను రక్షించుకోవాలని, బుద్ధిబలాన్ని పెంచుకోవాలని హితబోధ చేయటం ఆదర్శ సమాజ నిర్మాణాన్ని కాంక్షించడమే అవుతుంది. అలాగే ఉత్తమ స్త్రీ రాజును సైతం నిలదీయాలని సమాజానికి సంకేతమిచ్చింది.

గురజాడ రచించిన మరోఖండిక పూర్ణమ్మ. ఇది గురజాడ భావ నవ్యతకి, శైలీ నవ్యతకి, రస పోషణ నైపుణ్యానికి నిలువుటద్దం. బాల్యవివాహాలు సాంఘిక దురాచారమని, పసిపిల్లల జీవితాలు నాశనమవుతున్నాయని వివరిస్తూ ప్రజలలో చైతన్యతను తీసుకువచ్చి బాల్య వివాహాలు రూపుమాపడానికి గురజాడ కారకులయ్యారు. పుత్తడి బొమ్మ పూర్ణమ్మ. తండ్రి డబ్బుకు ఆశపడి ముసలివాడికిచ్చి పెళ్ళి చేయగా, దు:ఖించిన పూర్ణమ్మ ఆత్మత్యాగం చేసుకుని దుర్గాదేవిలో లీనమై పోయింది. ''మేలిమి బంగరు మెలతల్లారా'' అన్న సంబోధనలలో ఈ గేయం ప్రారంభమైంది. కరుణ రసాత్మకంగా ప్రవహిస్తూ హృదయాలను ద్రవీభవింప జేస్తుంది. మీ నలుగురు కూచొని నవ్వే వేళల నా పేరొకపరి తలవండి'' అని పూర్ణమ్మ నివేదించడం వ్యధాభరిత సన్నివేశం. దుర్గలో పూర్ణమ్మ లీనమైందని వాచ్యం చేయడం గురజాడ కవితా వైభవానికి పరకాష్ట.

దించులంగరు, లంగరెత్తుము ఖండికల్లో యుద్ధం వల్ల నాశనమే కాని మంచి జరుగదని ఆదర్శ సమాజం నిర్మాణం సాధ్యం కాదని తెలియజేశాడు. గురజాడ రచించిన దేశభక్తి గీతం వాస్తవానికి భారతదేశ జాతీయ గీతం కావలసి యున్నది.ఈ గేయం గురజాడ జాతీయ దృక్పథానికి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి, విశాల దృష్టికి, అభ్యుదయానికి పతాక ఈ 'దేశభక్తి' గేయం. ఈ గేయంలోని ప్రతికావ్యం ఆదర్శ సమాజనిర్మాణానికి ప్రతిబింబాలు. దేశమంటే మట్టి కాదని, మనుషులని, మంచి పెంచమని, విద్యయందు పోటీ ఉండాలని, జాతి, మతములు అన్నదమ్ముల వలె మెలగాలని, సాటిమనిషికి సహాయపడాలని సూచించారు.

ప్రేమభావన శారీరక పరిధులు దాటి మానసికా వరణంలోకి విస్తరించాలని, అదే శాశ్వతమైన, సార్వ జనీనమైన ప్రేమ అని తెలిపిన గేయం 'కాసులు'. మగడు వెల్పన పాతమాటది, ప్రాణ సఖుడు అని భార్యాభర్తల మధ్య బంధం స్నేహబంధమని తెలియజేస్తూ పతియే ప్రత్యక్ష దైవమన్న సంప్రదాయ భావజాలాన్ని నిరసించి అభ్యుదయాన్ని కాంక్షించాడు. ''ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును. ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును'' అని గురజాడ ప్రేమ తత్వాన్ని సమాజానికి అందించాడు.

సామాజిక రుగ్మతలను నిరసిస్తూ కథానికలు రచిం చాడు గురజాడ. నిన్నటి వరకూ తొలి తెలుగు కథానికగా కీర్తించబడ్డది దిద్దుబాటు. వ్యసనపరుడైన భర్తను ఆధునిక స్త్రీ ఎలా మార్చుకోగలదో, కాపురాన్ని ఎలా దిద్దుకోగలదో నిరూపించారు గురజాడ ఈ కథానిక యందు. అలాగే మెటిల్డా, మీ పేరేమిటి? మతం- విమతం కథానికలలో ఆదర్శ సమాజం ఎలా ఉండాలో తెలియజేశారు.

కన్యాశుల్కం :

సంఘ సంస్కరణం, భాషా సంస్కరణం, ఉత్తమ రూపక నిర్మాణం అను మూడు ప్రయోజనాలను ఉద్దేశించి అప్పారావుగారి కన్యాశుల్కం నాటకాన్ని రచించారు. కన్యా శుల్కం వల్ల అప్పారావుగారు ప్రజల భాషకు, ప్రజా జీవితానికి సన్నిమితులయ్యారు. కన్యాశుల్కంలో సునిశిత మైన హాస్యము, పాత్రపోషణ, సాంఘిక జీవన చిత్రణ, గుండెను దూసుకుపోయే వ్యంగ్య వైభవము ఇందులో ప్రత్యక్షంగా కనిపించే అంశాలు.

తెలుగు నాటక చరిత్రలో విశిష్టస్థానం కన్యాశుల్కం నాటకానిది. కన్యాశుల్కం అనే సాంఘిక దురాచారం, విజయనగర ప్రాంతంలో ఉండేది. బాల్య వివాహాల్ని ఖండిస్తూ, ముసల వాళ్ళకిచ్చే సాంఘిక దురాచారాన్ని రూపుమాపాలన్న ఉద్దేశ్యంతో రచించబడింది. వంద సంవత్సరాల తరువాత కూడా ప్రాసంగికతకు నోచుకోవడం కన్యాశుల్కం నాటకం గొప్పతనం. కన్యాశుల్కం నాటకం విజ్ఞాన సర్వస్వమని, సాంఘిక ఇతిహాస నాటకమని తెలపడం జరిగింది. ''ఈ రోగిష్టి సమాజానికి, మనసు చచ్చిన మనుషులకి శస్త్ర చికిత్స కన్యాశుల్కం'' అని పి.వి.రమణ గారు చెప్పిన మాటలు ప్రశంసించదగినవి.

ఈ నాటకంలోని పాత్రలు సజీవమైనవి. నేటికి ఇందులో కొన్ని పాత్రలు సమాజంలో మనకు తారస పడుతుంటాయి. నీతి లేని దగాకోరు రామప్ప పంతులు, సంస్కరణ పేరుతో మాటకారిగా పబ్బం గడుపుకొనే బడాయికోరులు, ధనాశకి లొంగే అగ్ని హోత్రావధాన్లు, సంస్కర్తలకే సంస్కర్త మధురవాణి, యిలా అన్ని పాత్రల ద్వారా ఆదర్శ సమాజం ఎలా వుండాలన్నది తెలియ జేశారు. ''తెల్లవాళ్ళ స్కూళ్ళలో తెలుగు పద్యాల మీద ఖాతరీ లేదండీ'' అని గిరీశం చేత పలికించిన మాటలు ఆంగ్ల మాధ్యమం నేడు తెలుగునాట వర్ధిల్లుతున్న తీరు, తెలుగు మాధ్యమం రద్దు ఈ సందర్భంగా పరిశీలించ దగినది.

ముగింపు :

''ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది'' అని ప్రవచించిన గురజాడ భవిష్యత్ దార్శనికుడు. ఆధుని కాంధ్ర కవితా ప్రవక్త. సాంఘిక దురాచారాలైన బాల్య వివాహాలు, కన్యాశుల్కం మరియు స్త్రీలపై అఘా యిత్యాలు, స్త్రీలకు విద్య లేకపోవడం, పురుషాధిక్యత పై నిరసన. మతము కన్న జ్ఞానము మిన్న అని తన సాహిత్యం ద్వారా ఆదర్శ సమాజ నిర్మాణానికి, పునాదులు వేసిన గురజాడ నవయుగ వైతాళికుడు.

ఆధార గ్రంథాలు :

1. గురుజాడలు - ఎమెస్కో ప్రచురణలు
2. ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయములు: ప్రయోగములు - డా॥ సి. నారాయణ రెడ్డి
3. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా.శాస్త్రి

❖

ఆదర్శ సమాజ నిర్మాణం - నీతి కథల పాత్ర

- డా॥. బొశెట్టి లత, తెలుగు అధ్యాపకురాలు, కె.వి.ఆర్. మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ.ప్ర.), కర్నూలు.

ఎద్దుకైనిగాని యేడాది దెల్పిన
మాట తెలిసి నడుచు మర్మమెఱిగి
మొప్పె తెలియలేడు ముప్పదేండ్లకునైన
విశ్వదాభిరామ వినురవేమ !

భావం : ఒక సంవత్సరం పాటు నేర్పించినట్లయితే ఎద్దు కూడా మంచి, చెడులను తెలుసుకొని నడుచు కుంటుంది. కానీ ముప్పై సంవత్సరాలు నేర్పినప్పటికీ మూర్ఖుడు తెలుసుకోలేడు అన్నది వేమన మాట.

మానవుడు సంఘజీవి. సమాజంలో నేడు మానవుడు తన ఉనికిని నిలబెట్టుకోవడానికి చాలా ప్రయత్నాలు చేస్తున్నాడు. తన మనుగడకోసం కావాల్సిన సమాజాన్ని తయారు చేసుకుంటున్నాడు. ఈ సమాజ నిర్మాణానికి, సమాజంలో ఉన్న అందరూ కలిసిమెలిసి తమతమ మనుగడలను కొనసాగించడానికి, విజయతీరాలను అందుకోవడానికి సరైన అవగాహన, విశ్వసనీయత చాలా అవసరం. కాబట్టి మనిషి కొన్ని ప్రవర్తనా నీతి, నియమాలను సమాజానికి ఏర్పరిచాడు.

నీతి, నియమాలు మనిషి నడవడికకి మార్గదర్శనం చేస్తాయి. కాబట్టి చిన్నప్పటినుండే పిల్లలు వాటిని ఆకళింపు చేసుకోవాలి. దురదృష్టవశాత్తు నేడు సమాజంలో నైతిక విలువలు కనుమరుగు అవుతున్నాయని చెప్పకనే తెలుస్తుంది. కారణం ప్రతి ఒక్కరిలో స్వార్థం పెరగడం, దురాశ కల్గిఉండడం, అవినీతికి అలవోకగా బానిసవ్వడం, నీతి-నియమాలను వ్యతిరేకించడం వల్ల తనతోపాటుగా సమాజంలోని వాతావరణాన్ని కలుషితం చేసేస్తున్నాడు. దీనివల్ల అశాంతి, ఒత్తిడికి గురౌతూ, మానవతా విలువలను, మానవ సంబంధాలను మంటకలిపేస్తున్నాడు.

ఇటువంటి తరుణంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీవారు జాతీయ సదస్సు కోసం ''ఆదర్శ సమాజ నిర్మాణంలో వ్యక్తులు, వ్యవస్థలు మరియు సాహిత్యం, ప్రాధాన్యం'' అనే అంశంను తీసుకోవడం ప్రశంసించ తగినది ముందుగా వారికి చాలా ధన్యవాదాలు.

''మొక్కై వంగనిది
మ్రానై వంగునా?'' అన్నారు పెద్దలు. అందువల్ల చిన్నప్పటి నుండే పిల్లలకు మంచి విలువలను పరిచయం చేస్తూ పిల్లలను ఆదర్శ వ్యక్తిత్వం గల పౌరులుగా తయారుచేయాలి. దానికోసం తెలుగు సాహిత్యంలో నీతి కథల పాత్ర ఎంత, ఎలా ఉంది? అని చెప్పడమే నా పత్రం యొక్క ఉద్దేశం. తరాలు మారినా, రోజువారీ ఉరుకుల, పరుగుల జీవితంలో అనేక పనులతో బిజీగా ఉన్నా, చందమామ, బాలమిత్ర, కాశీమజిలీ, భట్టి విక్రమార్క, భేతాళకథలు వంటివన్నీ కన్పించకుండా పోయినా, ప్రస్తుత సమాజ, జీవన విధానానికి తగ్గట్టుగా, సమాజంలో మనుగడ కోసం చేసే పోరాటం, జీవన నైపుణ్యాలు పెంపొందించే అనేక కథలు నేడు మనిషికి సంపూర్ణ మూర్తిమత్వ వికాసం పొందడానికి 'నీతికథలు' ఒక మెట్టుగా ఉపయోగపడుతున్నాయని, ఉపయోగ పడతాయని కూడా చెప్పడంలో అతిశయోక్తి ఏమీ కాదు.

అటువంటి నీతిని బోధించే కొన్ని కథలను నేనిక్కడ ప్రస్తావించదలిచాను. వాటిలో మొదటిది -

కష్టం - ఫలితం :

ఈ కథలో నాగన్న అనే చాలా పేదవాడు ఉంటాడు. అతనికి ఇద్దరు చిన్న పిల్లలు, భార్య ఉంటారు. నాగన్న వాళ్ళ ఊరి చివర్లో చాలా తక్కువ ధరకే స్థలం దొరకడంతో అప్పు చేసి మరీ కొంటాడు. ఆ స్థలం మొత్తం రాళ్ళు, ముళ్ళపొదలతో ఉంటుంది. అలాంటి స్థలాన్ని కొన్న నాగన్నను చూసి ఆ ఊరివాళ్ళంతా హేళన చేస్తూ నవ్వుతారు. వాళ్ళ మాటలు ఏమీ పట్టించుకోకుండా ఆ స్థలాన్ని

బాగు చేస్తుంటాడు నాగన్న. అలా చేస్తూ చేస్తూ ఉండగా చివరికి ఆ స్థలం అంతా రాళ్ళు లేకుండా చదునుగా కన్పిస్తుంది. ఆ నేలలోనే పంటలు పండించడం మొదలు పెడతాడు నాగన్న. వచ్చిన పంటలను పట్నంలో అమ్మి, వచ్చిన డబ్బుతో మళ్ళీ ఇంకో పంట వేసేవాడు. ఆ విధంగా కొన్ని సంవత్సరాల తర్వాత నాగన్న చాలా డబ్బు సంపాదించి ఒక పెద్ద ఇల్లు కట్టుకుంటాడు. కొత్త వ్యాపారం ప్రారంభిస్తాడు. ఒకప్పుడు నాగన్నని చూసి నవ్విన జనమే ఇప్పుడు నాగన్నని మెచ్చుకున్నారు. దీనిలో మనకు తెలిసిన నీతి ఏమంటే ''కష్టపడితే ఏమన్నా సాధించవచ్చు'' అని.

నేటి విద్యార్థులకు తల్లిదండ్రులు శ్రమించేతత్వం అలవాటు చేయాలి.

సూపర్‌హీరో :

ఒక స్కూల్‌లో పిల్లలు అంతా ఆడుకుంటున్న సందర్భంలో ఒక పాప తనకు స్పైడర్‌మాన్ అంటే ఇష్టం అంటుంది, అక్కడే ఉన్న ఇంకో అమ్మాయి తనకి ఐరన్ మాన్ అంటే ఇష్టం అంటుంది. అప్పుడు స్వాతి వచ్చి అందరూ సూపర్‌హీరోస్, చాలా గ్రేట్ వాళ్ళు. మనకు ఎప్పుడు సహాయం కావాలన్నా చేస్తారు అంటున్న సందర్భంలో అక్కడికి ఒక భయంకరమైన కుక్క వస్తుంది. అది ఎవరినైనా కరుస్తుందేమో అని అందరూ భయపడుతారు. అందులో ఒక పాప 'స్వాతి'ని ఎవరినన్నా సూపర్ హీరోస్‌ని పిలవవా అంటుంది. ఎంతసేపు పిలిచినా ఎవ్వరూ రారు, అప్పుడు స్వాతికి ఒక ఆలోచన వస్తుంది. తన స్కాక్స్‌బాక్స్‌లో ఉన్న ఆహారం తీసి కుక్కకి వేస్తుంది.

ఆకలితో ఉన్న కుక్క ఆ ఆహారం తింటూ ఉంటుంది. అప్పుడు పిల్లలంతా క్లాస్‌లోకి వెళ్ళి వాళ్ళ టీచర్‌తో చెప్తారు. ఆ టీచర్ కుక్కని బయటికి పంపించేస్తుంది. అప్పుడు స్వాతి అందరితో అంటుంది. సూపర్‌హీరోస్ అంటే ఎవరో కాదు, వాళ్ళు మనలోనే మనుషుల రూపంలోనే ఉంటారని అందరితో అంటుంది. అప్పుడు పిల్లలంతా ''స్వాతి ది హీరో'' అని చప్పట్లు కొడతారు. ఇందులో నీతి ఏమిటంటే - ప్రతి ఒక్కరిలో ''ఒక హీరో ఉంటాడు''. దాన్ని సమయాన్ని, సందర్భాన్ని బట్టి బయటికి తీయాలి. ఈ విషయం విద్యార్థులకు చిన్నప్పుడే నేర్పిస్తే ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవడానికి అస్కారం ఉంది.

నేడు సమాజంలో యువత ప్రతి చిన్న విషయానికి భయపడి ప్రాణాలు తీసేసుకుంటున్నారు. ఉదాహరణకి సెల్‌ఫోన్ కొనివ్వలేదని, సినిమాకు పోనివ్వలేదని, నాన్న తిట్టాడని, అమ్మ కొట్టిందని మొదలైన అనేక చిన్న చిన్న విషయాలకు తనువులు చాలిస్తున్న వారికి నేర్పాల్సిన నీతికథలుచాలా ఉన్నాయి.

అమ్మఋణం :

ఒక ఊరిలో ఒక అమ్మ, ఆమెకు ఒక కొడుకుండే వాడు. ఆ అమ్మకు తన కొడుకే ప్రపంచం, తన కొడుకు కోసం ఎంత కష్టమైనా, హాయిగా భరించేది. ఎంతైనా తల్లి హృదయం కదా! అలా పెద్దయ్యాక కొడుకు విదేశాలకు వెళ్ళిపోతాడు. అక్కడ బాగా డబ్బు సంపాదించి అమ్మ దగ్గరికి వస్తాడు.

విదేశాల నుండి వచ్చిన కొడుకు తల్లికి చాలా డబ్బులు ఇస్తాడు. ఈ డబ్బులతో నువ్వు కష్టం లేకుండా హాయిగా జీవితాన్ని గడుపు అని చెప్తాడు. డబ్బులు అయిపోగానే నాకు చెప్తే మళ్ళీ పంపిస్తా అంటాడు. అప్పుడా తల్లి తన కొడుకుతో అంటుంది. అరే కన్నయ్య నాకు నీ డబ్బులతో ఎలాంటి అవసరం లేదిప్పుడు, కానీ నాకు ఇప్పుడొక చిన్న కోరిక ఉండిపోయింది, అది నువ్వు తీరుస్తావా? అంటుంది. దానికి తన కొడుకు అంగీకరిస్తాడు, మాటిస్తాడు. ఆ తల్లి చెప్తుంది, అరే నాన్నా నువ్వు చిన్నప్పుడు నా పక్కన ఎలా పడుకునేవాడివో అలాగే ఇప్పుడు నా పక్కన పడుకోవాలి అని కోరుతుంది. దానికి ఒప్పుకున్న కొడుకు అమ్మపక్కనే పడుకుంటాడు.

ఒక గంట తర్వాత అమ్మ, తన కొడుకుని నిద్ర నుండి లేపి కొడుకా నాకు దాహమేస్తుంది, ఒక గ్లాస్ నీళ్ళు

తీసుకొనిరా అని అడుగుతుంది. కొడుకు లేచి తెచ్చిస్తాడు. తల్లి కొన్ని తాగి గ్లాస్ తిరిగిచ్చేటప్పుడు నీళ్ళగ్లాసు జారి ఆ అబ్బాయి డ్రెస్, బెడ్ తడిచేలా జారవిడుస్తుంది. దానికి కోపం తెచ్చుకున్న కొడుకు ఏంటమ్మా ఇలా పడేశావ్ అని కోపంతో అరుస్తాడు. మళ్ళీ ఒక గంట ఆగినాక కొడుకును లేపుతుంది. ఈసారి బెడ్‌లోనే మూత్రవిసర్జన చేసుంటుంది, బెడ్‌ని మార్చమంటుంది. అది వాసన తట్టుకోలేక అమ్మపై గట్టిగా అరిచేస్తాడు కొడుకు. అప్పుడు ఆ అమ్మ అంటుంది. బిడ్డా! ఒకరోజుకే నన్ను నువ్వు భరించలేకుంటే నిన్ను నవమాసాలు మోసి, కని, పెద్దచేసే సందర్భంలో నువ్వెన్ని సార్లు కష్టపెట్టినా, దాన్ని ఇష్టంగా నీ మీద ప్రేమతో ఓర్చుకొని బాధ్యతగా నిన్ను ఇంత పెద్దవాన్ని చేశానో ఆలోచించు అంటుంది. ఆ మాటలకు కొడుకు కంట్లో కన్నీళ్ళు తిరిగాయి. ఆ క్షణం నుండి తల్లిని కంటికి రెప్పలా చూసుకుంటాడు. ఇందులో నీతి "తల్లి ఋణం ఏమిచ్చినా తీరలేనిది".

ముగింపు :

పైన తెలిపిన మూడు కథలు కూడా నేటి సమాజంలోని ప్రతి వ్యక్తికి సంబంధించినవి మనిషి మనీషిగా ఎదగడానికి, ముఖ్యంగా నేడు స్వార్థంతో నిండిపోయిన మరమనుషులను మార్చడానికి ఇలాంటి నీతికథల పాత్ర చాలా ఉందని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ముఖ్యంగా నేటి యువత చెడుమార్గాలు అనుసరించి వాళ్ళ బంగారు భవిష్యత్తుని బూడిదపాలు చేసుకుంటున్నారు. దానికి కారకులుగా తల్లిదండ్రుల్నీ కానీ, సమాజాన్ని కానీ నిందించలేము. ప్రతి విద్యార్థి చిన్నప్పుడు 1. తల్లిదండ్రుల ద్వారా ఒక భాగాన్ని, 2. గురువు ద్వారా ఒక భాగాన్ని, 3. తన చుట్టూ ఉన్న సమాజం నుండి ఒక భాగాన్ని, 4. తన స్వబుద్ధితో ఒక భాగాన్ని నేర్చుకొని ఆలోచించి అడుగులు వేస్తాడు.

కానీ నేటి యువత ఎవరి మాటలు వినకుండా తనకు నచ్చినది చేస్తూ వెళ్ళడమే పెద్ద ఫ్యాషన్‌గా అనుకుంటున్నాడు. అందుకే నేడు సమాజంలో జరుగుతున్న అనర్థాలన్నింటికి మూలకారయం అవుతున్నాడు. ఈ అనర్థాలన్నిటికి చరమాంకం పలకాలన్నా, మంచి ఆదర్శ సమాజ నిర్మాణం కావాలన్నా చిన్నప్పటి నుండే పిల్లల్లో మంచి మంచి నీతికథల ద్వారానే, ఆదర్శ విలువలు గల వ్యక్తులుగా సమాజాన్ని కాపాడే శక్తులుగా తీర్చిదిద్దవచ్చు. అలాంటి నవసమాజానికి, నీతికథలతోనే నాందీ పలకవచ్చని, అటువంటి ఆదర్శ సమాజనిర్మాణం జరుగుతుందని ఆశిస్తూ ముగిస్తున్నాను.

"సర్వేజనాస్సుఖినో భవంతు"

ఆధార గ్రంథాలు :

1. వేమన శతకం - డీలక్స్ పబ్లికేషన్స్, విజయవాడ - 2011
2. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొ. వెలమల సిమ్మన్న, విశాలాంధ్ర పబ్లిషింగ్ - 2014
3. పంచతంత్రం - బ్రహ్మశ్రీ తాడంకి వెంకటలక్ష్మీనరసింహారావు - ఆన్‌లైన్‌లోని నీతికథల పుస్తకాలు.

❖❖❖

స్త్రీవాద కవిత్వం - సాంఘిక చైతన్యం

- డా॥. కొయ్యా శ్రీనివాసులు, తెలుగు విభాగాధిపతి, యస్.టి.యస్.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కదిరి.

'ఫెమినిజం' అనే ఇంగ్లీషు పదం 'స్త్రీవాదం' అనే తెలుగు పదంగా అనువదించుకొని వాడుతున్నాము. మానవ సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు పురుషుల కంటే తక్కువ సాంఘిక స్థితిలో ఉండటాన్ని ప్రశ్నిస్తూ వాళ్ల అభ్యుదయాన్ని, విముక్తిని వాంఛిస్తూ వచ్చిన స్త్రీవాద భావన పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధానికి ఉద్యమ రూపాన్ని తీసుకొని విస్తరించింది. తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ధోరణి 1980వ దశకం నుండి ప్రారంభమైందని చెప్పవచ్చు. అంతకుముందు కందుకూరి వీరేశలింగం తెలుగు సాహిత్యంలో స్త్రీ జనోద్ధరణకు అకుంఠిత దీక్షతో స్త్రీల అభివృద్ధి కొరకు పత్రికలు స్థాపించి, స్త్రీ విద్య ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. వితంతు పునర్వివాహం, బాల్య వివాహాలు మొ॥ విషయాలపై ధ్వజమెత్తి, స్త్రీల కోసం వీరు చేసిన సేవ అనితర సాధ్యమైంది.

రాయప్రోలు, గురజాడ అప్పారావు, చలం కట్టమంచి రామలింగారెడ్డి మొ॥ కవులు తమ సాహిత్యంలో గౌరవనీయ స్థానం కల్పించారు. శ్రీశ్రీ, నారాయణ బాబు, తిలక్, దాశరథి, పట్టాభి మొ॥ అభ్యుదయ కవులు తమ అభ్యుదయ కవిత్వంలో స్త్రీల సమస్యలు ప్రతిబింబించే విధంగా కవిత్వం రచించారు.

1960-1970దశకంలో రచయిత్రులు, కవయిత్రులు అనేకమైన రచనలు చేశారు. వర్ణాంతర వివాహాలు, ప్రేమ పెళ్లిళ్లు. చదువు, (ఆచంట శారదాదేవి, అబ్బూరి ఛాయాదేవి, డా॥ పి.శ్రీదేవి, వాసిరెడ్డి సీతాదేవి) సంస్కారం వంటి ఇతివృత్తాలతో నవలలు, కథలు వ్రాశారు. వరకట్న సమస్యలు, కుటుంబాల్లో స్త్రీల కష్టాలు, అత్తాకోడళ్ల ఆరాట, పోరాటాలు అన్నీ కథావస్తువులైనాయి. ఇన్ని అంశాలు స్పృశించినా గానీ స్త్రీ స్వేచ్ఛ, ఆర్థిక సమస్యలు, అసమానతలు, అణచివేతలు వంటివి రచనల్లో ఎక్కువ రాలేదు. ముప్పాళ్ల రంగనాయకమ్మ 1978లో 'జానకీ విముక్తి' నవల రచించారు. స్త్రీ స్వేచ్ఛారావాత్యాన్ని ఇందులో చిత్రించారు. ఎప్పుడో 1905 సం॥ నాటికే బండారు అచ్చమాంబ 'అబలా సచ్చరిత్ర మాల' నవలను రచించారు. అందులో స్త్రీల కష్టాలు, స్వేచ్ఛ, ఆత్మగౌరవం, పురుషాధిక్యత, స్త్రీల బాధల గురించి చర్చించారు.

తెలుగులో 1980వ దశకం నుండి స్త్రీవాద ధోరణి కనిపిస్తుంది. స్త్రీవాద ధోరణి కనిపిస్తుంది. స్త్రీవాద సాహిత్యం, పుట్టుక గురించి సి.మృనాళినీ గారు తార్కికంగా నిర్దేశం చేసారు. "పితృస్వామ్య వ్యవస్థకూ సాహిత్యానికే మధ్య ఉన్న సన్నిహిత సంబంధాన్ని గుర్తించి ధిక్కరించే క్రమంలో స్త్రీవాద సాహిత్యం పుట్టింది" అంటారు. ఈ సూత్రాన్ని అనుసరించి తెలుగులో వచ్చిన స్త్రీవాద సాహిత్యంలో అధికభాగం కవిత్వ ప్రక్రియ లోనే చేరుతుంది.

తెలుగులో తొలిస్త్రీవాద కవయిత్రిగా 'రేవతీ దేవి' గుర్తింపు పొందారు. ఈమె 1979-1981ల మధ్య ఆమె పలు కవిత్వాన్ని రచించి, చిన్న వయసులోనే మరణించారు. ఆమె కవితలు "శిలాలోలిత" అనే పేరుతో కవితా సంకలనం వెలువడింది. ఈ సంకలనానికి 1983వ సంవత్సరపు ప్రతిష్టాత్మక "ఫ్రీవర్స్ ఫ్రంట్" పురస్కారం వ్యాసాన్ని రచించారు. చేకూరి రామారావు ఈమె కవితలబీపై తన ప్రశంశాత్మక అభిప్రాయాన్ని వెల్లడించారు. "శిలాంతరోల్లిత రేవతీ దేవి" పేరుతో లభించింది. అనుభవాల సాంద్రత తాత్విక చింతన, తననావరించి ఉన్న ప్రపంచంతో సంబంధం ఈమె కవిత్వంలో ఉన్నాయని "చేరా" వ్యాఖ్యానించారు. 1984 సం॥లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురితమైన "బందిపోటు (సావిత్రి రచన) కవిత ఎంతోమందిని ఆకట్టుకుంది. "ఆఫీసులో మొగుడున్నాడు, అవసరమొచ్చినా సెలవు ఉవ్వడని అన్నయ్య అన్నప్పుడే అనుమానమేసింది"

అంటూ సాగిన ఈ చిన్న కవిత పురుషాధిక్య సమాజపు విశ్వరూపాన్ని అభివర్ణించింది. వ్యంగ్య ధోరణితో ఈ వ్యవస్థను అధిక్షేపించింది. సాహితీ విమర్శకుల అభిప్రాయం ప్రకారం ఈ కవిత తెలుగు స్త్రీవాద సాహిత్యంలో ఒక మైలురాయి వంటిది. అయితే 'శిలాలోలిత' సంకలన కావ్యం, 'బందిపోటు' కవితలు వెలువడేనాటికి తెలుగు సాహితీలోకానికి 'స్త్రీవాదం' అనే పేరు పెద్దగా తెలియదు. సాహితీ చర్చల్లో అక్కడక్కడ 'ఫెమినిజం' అనే మాటను వాడేవారు. తెలుగు స్త్రీవాద కవయిత్రుల్లో ప్రముఖ స్థానాన్ని పొందిన జయప్రభ తన ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం "భావకవిత్వంలో స్త్రీ" అనే గ్రంథంలో "స్త్రీవాదం" అనే పదప్రయోగం చేశారు. అప్పటినుండి అంటే 1987 తర్వాత స్త్రీవాదం విస్తృత ప్రాచుర్యాన్ని పొందింది.

1987-1980ల మధ్య తెలుగులో అనేక స్త్రీవాద కవితలు అచ్చయ్యాయి. స్త్రీవాద కవిత్వంపై చేకూరి రామారావు "చేరాతలు" శీర్షికల్లో పలు వ్యాసాలు రచించారు. "ఇటీవల కాలంలో స్త్రీ చైతన్య సాహిత్యం తగిన మోతాదులోనే వస్తున్నది. కొన్నింటిలో వేదన కనిపిస్తున్నది, కొన్నిటిలో వాదన వినిపిస్తున్నది. కొన్నిటిలో ఉత్త ఫ్యాషన్ బడాయి జడిపిస్తున్నది." అని చేరా అభిప్రాయ పడ్డారు. పురుషాధిక్య వ్యవస్థ వల్ల ఆగ్రహం, లైంగిక వివక్షపై నిరసన, నూతన అభివ్యక్తి, అనుభవాలు అనుభూతుల్ని ప్రకటించడంలో నిర్మొహమాటం తెలుగు స్త్రీవాద కవయిత్రుల రచనల్లో స్థూలంగా కనిపించే లక్షణాలు.

స్త్రీవాద కవిత్వంలో "నీలిమేఘాలు" అద్భుతమైన కవితా సంకలనం. ఇది 1993 సం॥లో వచ్చింది. అస్మిత సంపాదకత్వంలో వచ్చిన "నీలిమేఘాలు" సంకలనంలో వసంత కన్నాభిరావ్, ఓల్గా, కొండేపూడి నిర్మల, జయప్రభ, రాజేశ్వరీదేవి, కె.గీత, విమల, రజియాబేగం, ఘంటశాల నిర్మల, పాటిబండ్ల రజని, రేవతీదేవి, ఊర్మిళ, సావిత్రి, అబ్బూరి ఛాయాదేవి, శ్రీమతి ఏలూరి పార్వతి, అంజన, ఎస్.జయ, జయప్రభ, శాంతిప్రియ, కుప్పిలిపద్మ, రత్నమాల, వకుళాభరణం లత కవితలు ఆలోచనాత్మకంగా రచించనవి ఉన్నాయి.

కవయిత్రి విమల విప్లవ కవిత్వాన్ని రచించారు. ఆమె రచించిన "అడవి ఉప్పొంగిన రాత్రి" స్త్రీవాద కవిత్వ సంపుటం సాహితీ విమర్శకుల మన్ననల్ని పొందింది. స్త్రీవాద సాహతీలోకం కోరుకున్న వ్యంగ్యం ఉంది. "విమల కవిత్వంలో విప్లవ స్త్రీ చైతన్యం ఉంది" అన్నది విమర్శకాభిప్రాయం. స్త్రీవాద కవిత్వంలో విమల రాసిన "వంటిల్లు", "సౌందర్యాత్మక హింస" అన్న రెండు కవితలు చాలా ముఖ్యంగా చెప్పవలసినవి.

"మా అమ్మ మా అమ్మమ్మ
ఇంట్లో అమ్మలంతా ఇక్కడే స్త్రీలయ్యారంట
భయం భయంగా నిశ్శబ్దంగా నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ.
అసలు మా అమ్మేనడుస్తున్న వంటగదిలా వుంటుంది.
ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి
అయినా చివరకు వంటింటి గన్నెలన్నిటిపైనా
మా నాన్న పేరే"

అంటూ కుటుంబ వ్యవస్థలోని కుళ్ళును ప్రశ్నిస్తూ రచించిన 'వంటిల్లు' కవిత తెలుగు స్త్రీవాద కవిత్వంలో మైలురాయి లాంటిది.

"సౌందర్యాత్మక హింస" అనే కవిత్వంలో విమల స్త్రీ శరీరాన్ని భోగ వస్తువుగా తీర్చిదిద్దడం వెనుక పితృస్వామ్యంలోని వ్యాపార దృక్పథాన్ని విడమరచి చెప్పారు.

"మనమంటే 34, 32, 35 కొలతలమైన చోట
మొటిమలు మొలవడం జుట్టు రాలడం
నడుం సన్నగా లేకపోవడమే
మన నిరంతరాందోళనలైన చోట
అందం పోటీయైన చోట
అందం సరుకైన చోట
అందాల వ్యాపారాన్ని ద్వేషిద్దాం"

ఈ కవితలో విమలగారు అందాల పోటీల్ని శక్తివంతమైన బాషలో నిరసించింది. విమల కవిత్వాన్ని విప్లవ స్త్రీవాద కవిత్వంలో రెండవదశగా పరిగణిస్తారు.

తెలుగు స్త్రీవాద కవయిత్రుల్లో జయప్రభ స్థానం ప్రత్యేకమైనది. ఆమె రచనల్లో వామనుడి మూడోపాదం, యశోధరా నీకు వగపెందుకే, ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడ మేఘానిది, చింతల నెమలి, నాలుగో గోడ, యుద్ధోన్ముఖంగా ''క్షణక్షణ'' ప్రయాణం తదితర రచనలతో ఆమె తెలుగు సాహితీ ప్రపంచంలో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్నారు.

జయప్రభ రచించిన ''చూపులు'' ''పైటని తగ లెయ్యాలి'' అనే కవితలు సాహితీ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టించాయి. ఇవి పలు భాషలలోనికి అనువదింపబడ్డాయి.

''నన్ను అబలని చేసిన
పితృస్వామ్యపు అదృశ్యహస్తం పైట
దోపిడీ సంస్కృతి
నా వ్యక్తిత్వాన్ని శవంగా చేసి
దాని పైన కప్పిన తెల్లదుప్పటి పైట
నేను నడిచే శవాన్ని కాకుండా వుండాలంటే
ముందుగా పైటని తగలెయ్యాలి''

ఈ విధంగా జయప్రభగారి ''పైటను తగలెయ్యాలి'' కవిత తిరుగుబాటుకు మంచి శక్తినిచ్చింది. తెలుగు స్త్రీవాద కవిత్వంలో వాడుతున్న భాషను, ప్రతీకల్ని గురించి విమర్శలు వెల్లువెత్తిన సమయంలోనూ సమర్థవంతమైన రీతిలో వాటిని ఎదుర్కొన్న గొప్ప విమర్శక కవయిత్రి జయప్రభ.

జయప్రభతో సమాన స్థాయిలో సాహిత్య సృజన చేసిన కవయిత్రి ఓల్గా (పోపూరి లలిత కుమారి). పలు ప్రక్రియా రచనల ద్వారా సైద్ధాంతిక స్థాయిల్లోనూ స్త్రీవాద సాహిత్య ప్రచారానికి ఆమె తనవంతు కృషి చేశారు. ఓల్గా 'మెహందీ స్త్రీల విజ్ఞప్తి' పేరుతో ఒక శక్తివంతమైన కవితను రచించారు. ఈ కవితకు నేపథ్యం ఉంది. హైదరాబాద్ నగరంలో మెహందీ పేరుతో ఒక పురాతన వేశ్యా వాటిక ఉంది. ఒకసారి ఒకానొక యువకుడు ఈ వేశ్యా వాటికకు వచ్చి మరణించాడట. ఈ సంఘటన తర్వాత పోలీసులు ఆ వేశ్యావాటికకు రావడం, అక్కడి స్త్రీల పై దౌర్జన్య కరంగా ప్రవర్తించడం జరిగిపోయాయట. ఓల్గా గారు ఈ సంఘటన పట్ల స్పందించారు.

''బ్రతికేందుకు నానా చావూ చస్తున్న వాళ్ళం,
చచ్చేందుకు మా దగ్గరకు రాకండి''

అని ఓల్గా కవిత చెబుతోంది. కవయిత్రి ఈ కవితలో వాడిన కొన్ని పదాలు అప్పటిదాకా ఎవరూ ఉప యోగించనివి కావడంతో సంచలనం ఆరంభమైంది. అయితే ఓల్గాను కవయిత్రిగా కన్నా రచయిత్రిగానే పరిగణించవలసి ఉంటుంది.

స్త్రీవాద కవయిత్రుల్లో కొండేపూడి నిర్మల ప్రత్యేక స్థానం పొందారు. ఈమె కవిత్వం ఎంతోమందిని ప్రభావితం చేసింది. అప్పటి వరకూ అంటరానిదిగా మిగిలిపోయిన ఎన్నో కొత్త వస్తువులను స్వీకరించి, కవిత్వం రాసిన వారిలో కొండేపూడి నిర్మలది సరిక్రొత్త దారిగా అభివర్ణించవచ్చు. సందిగ్ధ సంధ్య, నడిచే గాయాలు, బాధా శప్తనది, మల్టీ నేషనల్ ముద్దు, నివురు వంటి కవితా సంకలనాల్ని వెలువరించారు. ఆమె రచించిన ''ఇల్లు ఖాళీ చేసినపుడు'' కవితలో వస్తు వైవిధ్యం దొరుకుతుంది. లేబర్ రూం, మరణ వాంగ్మూలం, మదర సీరియస్, కర్ణుడు మునిగిన దు:ఖ గంగయిది వంటి పలు కవితలతో తన ప్రత్యేకతను నిరూపించుకున్నారు.

''లేబర్ రూంలో అడుగు పెడితే చాలు
మీరంతా చెబుతున్న తెల్లచీర, మల్లెపూలు, పాల గ్లాసు, వూసుల్లో
పరాధీనతా బానిస కన్నీరు, ద్వీపాంతరవాసం
కాళ్ళనలా ఎడం చేసి దీనంగా, హీనంగా, నీచాతినీచంగా
ఒక హింసాతల పరాకాష్ఠ కోసం ఎదురు చూడ్డమంటే
రైలు పట్టా మీద నాణెం విస్తరించిన బాధ''

ఈ లేబర్ రూం కవితలో ప్రసవ సమయంలో స్త్రీ పడే వేదన ఎంత తీవ్రంగా, భరించరానిదిగా వుంటుందో నిర్మల తెలిపారు. ఈమె కవిత్వంలోనేకాదు ఇతర సాహితీ ప్రక్రియల్లో కూడా తనదైన ముద్ర వేశారు.

ఘంటసాల నిర్మలది తెలుగు స్త్రీవాద కవయిత్రులలో ఈమెది ప్రత్యేక స్థానం. ఈమె రచన కవితలలో 'ఈ సహారాకు ఏ సమీరాలు రావు', 'ఏకాల్ గర్ల్స్ మోనోలాగ్', 'జుగల్బందీ' మొ॥ కవితలు ఘంటసాల నిర్మల గారిని కవియిత్రిగా ఉన్నత స్థానంలో నిలబెట్టాయి.

శక్తివంతమైన భాషా సంపద, నేరుగా హృదయాల్ని తాకే లోతైన బావ సంపద పాటిబండ్ల రజని కవిత్వం. ప్రత్యేకంగా ఈమె 'అబార్షన్ స్టేట్‌మెంట్' కవిత ద్వారా పురుషాధిక్య సమాజాన్ని ఉలిక్కి పడేటట్టు చేసి వారి భావజాల మార్పుకు దోహదపడింది. అదే విధంగా మెహజబీన్ 'ఆకురాలు కాలం' మందరపు హైమవతి 'సర్వ పరిష్యంగం' తెలుగు స్త్రీవాద కవిత్వంలో విశిష్ట స్థానాన్ని పొందాయి.

తెలుగులో ముస్లిం స్త్రీల గురించి రాసిన మొట్ట మొదటి ముస్లిం స్త్రీ షాజమానా గారు. ఈమె రాసిన "పర్దా హఠాకే దేఖో" అనే కవిత ముస్లిం స్త్రీవాద కవిత్వానికి ఒక ఊపునిచ్చింది. పుట్టిన్నాటి నుంచి వెన్నెల రుచి ఎరుగక, వాన రుచి ఎరుగక, వసంతం రుచి ఎరుగక పెరిగి ఆంక్షల్లో, హద్దుల్లోనే ఆడబానిసగా తయారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. షాజహానా గారు తన కవితల్లో ముస్లిం ఆచారాల్లోని 'బురఖా' గురించి తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు.

మరో రచయిత్రి 'పషాద్ బేగం' గారు 'పర్సనల్ లా' అనే కవితలో విడాకులు తీసుకున్న స్త్రీ తన మనోవేదనను కళ్ళకు కట్టినట్టు వివరించారు.

"అయిదు నెలలకే నాలుగు నెలల కడుపు చేసి
తలాక్ ఇచ్చి వెళ్ళగొడతాడని నాకేం తెలుసు"

ఈ కవిత శక్తివంతమైనది దీన్ని చదువుతుంటే ఒళ్లు జలదరిస్తుంది. చివరకు "పర్సనల్ లా" వల్ల కూడా ముస్లిం స్త్రీలకు న్యాయం జరగలేదని వాపోతుంది పంషాద్ బేగం.

తెలుగు స్త్రీవాద కవిత్వాన్ని పైన పేర్కొన్న వారే కాకుండా పుట్ల హేమలత, రావుల పల్లి సునీత, కె.గీత, చంద్రమల్లిక, కవితా భారతి, ఆశ, శశికళ, కె వరలక్ష్మీ, కోట్ల వనజాత, సుధ, వసంత కన్నాభిరావ్, వాణీ రంగారావు, రజియా బేగం, కల్పనా రెంటాల. పసుపులేటి గీత, అనిశెట్టి రజిత, భవానీ దేవి, కుప్పిలి పద్మ, ఈశ్వర మొ॥ వారు స్త్రీ సమస్యలపై మంచి లైంగిక వివక్షపైన, మాతృత్వం పైన,కుటుంబంలో హింస పైన, సామాజిక జీవితం పైన, పురుషాహంకార దురాగతాల పైన, ప్రపంచీకరణ పైన, స్త్రీవాద కవితలు రచించి తెలుగు నాట సాంఘిక చైతన్యానికి పాటు పడ్డారు.

స్త్రీవాద కవిత్వం రాసిన వారిలో అధికశాతం స్త్రీలే అయినప్పటికీ పురుషులు కూడా ఉన్నారు. ఎండ్లూరి సుధాకర్- 'షమ్మా', శిఖామణి- 'పూల బజారు', జెలదండి సుధాకర్ - 'ఎర్రబడని మెహందీ', 'అరణ్య కృష్ణ', 'వేట', అరిశెట్టి ప్రభాకర్- 'వేశ్య' , 'విషాద సాక్షాత్కారం', 'ఎవరమ్మా నువ్వు', 'ఆశారాజు అద్దంలో ప్రతిబింబం' మొ॥ కవితల్లో స్త్రీ సమస్యల్ని గూర్చి అభివ్యక్తీకరించారు. వీరే కాకుండా కొప్పుల సింహాద్రి, శివారెడ్డి కిషోర్, అల్లం నారాయణ, తంగిరాల మొ॥ వారు స్త్రీవాద బావాలతో కవితలు రాసారు.

స్త్రీవాద కవిత్వాన్ని స్థూలంగా చూసినప్పుడు స్త్రీవాద కవిత్వంలో నవ్యతను చాటి చెబుతున్నట్లు అర్థమవు తుంది. డాక్టర్ రావి భారతి అన్నట్లు " చాలా కవితా ఖండికల్లో ఆర్తి ఉంది, ఆర్ద్రత ఉంది, ఆవేదన ఉంది, ఆవేశముంది అన్నిటినీ మించి సాంఘిక ప్రయోజనం ఉంది, భాషా పరంగా చూస్తే శబ్ద ప్రయోగంలో శక్తి, భావ వ్యక్తీకరణలో యుక్తి, శబ్ద శిల్పం మీద రక్తి కన్పిస్తాయి" (ఈ వాఖ్య తెలుగు స్త్రీవాద కవిత్వానికి వందశాతం సరిపోలుతుంది) అన్నమాటలు యధార్థం.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ వెలమల సిమ్మన్న
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి
3. నీలిమేఘాలు - స్త్రీవాద కవితా సంపుటి (1993)
4. కవియిత్రుల కవితా మార్గం - శిలాలోలిత

ఆదర్శ సమాజ నిర్మాణంలో ఎ.ఎ. నాగేంద్ర కవిత్వం

– డా॥. బత్తల అశోక్ కుమార్, గ్రంథాలయ సహాయకులు, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలజీ విభాగం (CSSEIP), శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

ఆదర్శ సమాజం అంటే ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సామాజిక అంశాల్లో వర్గ,వర్ణ బేధాలు లేకుండా అందరూ సమానంగా జీవించడం. ఒకరిని ఒకరు గౌరవించుకోవడం. పరస్పరంగా కలిసి మెలసి జీవించడం. మానవుడు సంఘజీవిగా ప్రయాణం మొదలుపెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు దీని గురించి అనేక మంది తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, సామాజిక ఉద్యమకారులు చర్చిస్తూ, ఆ మార్గం దిశగా సమాజాన్ని ముందుకు నడిపే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఆదర్శ సమాజం అన్నది అందని ద్రాక్షగానే మిగిలిపోయిందన్న విమర్శ ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రస్తుతం మన సమాజంలో అన్ని వర్గాల, కులాల, మతాల ప్రజలు సమైక్య జీవనం సాగించినప్పుడే ఈ కల సాకారం దిశగా అడుగులు వేస్తుందని ఎంతో మంది వ్యక్తులు, ఎన్నో రకాల వ్యవస్థలు, మరియు అనేక మంది సాహిత్యకారులు అభిప్రాయపడుతూనే ఉన్నారు. అలాంటి సాహితీ వేత్తలు ఒకరిగా మనకు డా॥ ఎ.ఎ. నాగేంద్ర గారు కనిపిస్తారు.

బాల్యం - విద్యాభ్యాసం :

ఉమ్మడి అనంతపురం జిల్లా (ప్రస్తుతం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా)లోని పుట్టపర్తి మండలం పెడబల్లిలో చిన్నగరుడప్ప, ఈరమ్మ దంపతులకు తేదిన నాగేంద్ర జన్మించారు. ఐదుగురు సంతానంలో నాలుగోవాడు. పెడబల్లిలో హైస్కూల్ వరకు చదివిన నాగేంద్ర అటు తర్వాత ఇంటర్మీడియట్‌ను కదిరివద్ద గల కాళసముద్రం రెసిడెన్సియల్ కళాశాలలో పూర్తి చేశారు. అనంతరం డిగ్రీ పూర్తయిన తర్వాత శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సోషల్‌వర్క్ విభాగంలో పీజీ పూర్తి చేశారు. అనంతరం రెండేళ్ళపాటు పీజీ విద్యార్థులకు టీచింగ్ అసిస్టెంట్‌గా పనిచేశారు. ఎంఫిల్ కోర్సులో పూర్తి చేశారు. మరోవైపు సాహిత్యంపై మక్కువతో దూరవిద్య ద్వారా ఎం.ఏ తెలుగు కోర్సులో చేరి, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం దూరవిద్య ద్వారా ''రాచపాళెం పాలి'' దీర్ఘకావ్యంపై ఎం.ఫిల్. కోర్సును పూర్తి చేశారు. ఏపీ సెట్‌లో అర్హత సాధించి తెలుగుశాఖలో పీహెచ్‌డీ కోర్సులో చేరారు. తెలుగుశాఖ సీనియర్ ఆచార్యులు జి. బాలసుబ్రమణ్యంగారి పర్యవేక్షణలో ''రాచపాళెం సాహిత్య విమర్శ - సమగ్ర అధ్యయనం'' అన్న అంశంపై 2016లో పీహెచ్‌డీ డిగ్రీని పూర్తి చేశారు. ప్రస్తుతం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని తెలుగు తులనాత్మక సాహిత్యశాఖలో ఆచార్య జి. బాల సుబ్రమణ్యంగారి పర్యవేక్షణలోనే యూజీసీ పోస్ట్‌డాక్టరల్ ఫెలోగా పనిచేస్తూ, రాయలసీమ సాహిత్య విమర్శను చారిత్రక అధ్యయనం చేస్తున్నాడు. మరోవైపు పీజీ విద్యార్థులకు బోధన చేస్తున్నారు.

సాహితీవేత్తగా ఎ.ఎ. నాగేంద్ర :

డా॥. ఎ.ఎ. నాగేంద్ర అనే పేరుకన్నా ''నానీల నాగేంద్ర'' అన్న పేరే అనంతపురం జిల్లా సాహితీ లోకంలో ప్రసిద్ధి. ఆయన ఇంటిపేరుకన్నా ఆయన రాసిన నానీల ద్వారా సమాజానికి ఎక్కువ పరిచయం అయిన విశిష్ట సాహితీవేత్త డా॥ ఎ.ఎ. నాగేంద్ర. ప్రముఖ సాహిత్య విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు ''పెద్దమనుషులు సినిమా తీసింది వాహినీ సీని స్టుడియోస్ అనే సంస్థ. అప్పటి నుంచి వాహిని వారి పెద్దమనుషులు అనే పేరు రూఢి అయింది. 'షావుకారు' సినిమాలో నటించిన జానకి 'షావుకారు

జానకి'గా ప్రసిద్ధులయ్యారు. 'సిరివెన్నెల' సినిమాకు పాటలు రాసిన సీతారామశాస్త్రి 'సిరివెన్నెల సీతా రామశాస్త్రి'గా పేరు పొందారు. 'వందేమాతరం' సినిమాలో అదే పేరుతో ఉన్న పాటను పాడిన శ్రీనివాస్ 'వందే మాతరం శ్రీనివాస్'గా ప్రసిద్ధులయ్యారు. 'అంపశయ్య' నవల రాసిన నవీన్ 'అంపశయ్యనవీన్'గా ప్రాచుర్యం పొందారు. ఈ వరునలో అనంతపురంలో 'నానీల నాగేంద్ర'గా ప్రచారంలోకి వచ్చాడు. బహుశా రాయల సీమలో తన రచనతో ప్రసిద్ధుడైన రచయిత ఈయనే కావొచ్చు". (సాహిత్య ప్రస్థానం, సంపుటి 3, సంచిక 2, నవంబర్ 2021) అని అనడం సాహితీవేత్తగా నాగేంద్ర గొప్పతనాన్ని మనముందుంచుతుంది.

అనంతపురం జిల్లాలో ప్రముఖ సాహితీవేత్త, ఆంగ్లానువాదకులు, విమర్శకులు డా॥ పతికి రమేష్ నారాయనగారు డా॥ ఎ.ఎ. నాగేంద్రగారి "మన నానీలు" పుస్తకాన్ని ఆంగ్లంలోకి అనువాదం చేశారు. ఈ పుస్తకానికి ముందుమాట రాస్తూ, "అనంతపురం జిల్లా సాహితీ సీమలో, సీమ సాహిత్యంలో మనకు అగుపడుతున్న ఒక మంచి రచన ఎ.ఎ. నాగేంద్ర రచించిన 'మననానీలు'. ఒక సామాజిక శాస్త్రం విద్యార్థి తెలుగు సాహిత్యంపై గల ఎంతో ఆసక్తితో బ్రతుకుబాటలో తన ఉపాధి అవకాశా లను సైతం పక్కకుబెట్టి ప్రత్యేకంగా తెలుగుభాషలో పరిశోధక విద్యార్థిగా ఎదగడం ఇప్పటి పరిస్థితుల్లో ఆషామాషీ వ్యవహారం ఏమీకాదు. నాగేంద్ర రచన 'మననానీలు' రాయలసీమ నేపథ్యం, కరువుసీమ అనంతపురం వాస్తవిక పరిస్థితులు, భిన్న కోణాల్లో వర్తమాన సమాజధోరణులు, పర్యావరణ స్పృహ వంటి అంశాలను ఎన్నింటినో స్థాలీపులాకన్యాయంగా మనకు పరిచయం గావిస్తాయి. అవన్నీ మనం హాయిగా చదువుకొనే రీతిలో వున్నాయి. అనంతసాహితీసీమలో యువతరానికి చెందిన ఒక ప్రతినిధిగా ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్న ఒక యువకుడు ఎ.ఎ. నాగేంద్ర. తెలుగు సాహిత్యంపై ఆసక్తిగల ఒక వ్యక్తిగా నాకువున్నట్టి కొద్దిపాటి పరిధుల్లో, సాహితీ పరిమితుల్లో "నాగేంద్రనానీలు" అన్న పేరుతో ఈ ఆంగ్లానువాదాన్ని ఇతనికి నేనందిస్తున్న ఒక అభినందన రూపం ఇది". అనడం సాహిత్యంపై డా॥ ఎ.ఎ. నాగేంద్ర పెంచుకున్న మక్కువ, అతనికిగల తెలుగు భాషాభిమానం పాఠకులకు వ్యక్తమవుతోంది.

నాగేంద్ర రచనలు :

ఎ.ఎ. నాగేంద్ర 2009లో 'మననానీలు' అనే పుస్తకాన్ని మొదటిసారి వెలువరించారు. ఇది ఆయన తొలి రచన. ఈ పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కేంద్రసాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు "నానీలను వొంచుతున్న నాగేంద్ర" అన్న పేరుతో ముందుమాట రాశారు. ఇందులో నాగేంద్ర వ్యక్తితం, ఆయన కవిత్వం లోని కవితాతత్వాన్ని రాచపాళెంగారు చక్కగా అభివ్యక్తీ కరించారు. సాహిత్యేతర విభాగానికి చెందిన ఒక విద్యార్థి, ఆ రంగంలో దొరికిన ఉపాధిని సైతం వదిలేసుకుని, సాహిత్యంపై అపారమైన మక్కువతో, సాహిత్యమే పరమావధిగా ఒక సాహిత్య విద్యార్థిగా, పరిశోధకుడిగా, సాహితీవేత్తగా ఎదిగిర పరిణామ క్రమాన్ని తనదైన కోణంలో రాచపాళెంగారు పాఠకులముందుంచారు. ఆయన మాటల్లోనే "నాగేంద్ర సామాజిక శాస్త్రం చదువు కున్న విద్యార్థి. సామాజిక తపన ఉన్న యువకుడు. వర్తమాన పరిణామాల పట్ల అధ్యయన దృష్టి వున్న వ్యక్తి. కవిత్వం రాయాలన్న ఆర్తుత వున్న మనిషి. ఫలితం ఈ నానీలు. గుండెతడి కలిసి నానీలయ్యాయి. తనను గురించి, తన ప్రాంతం గురించి, తన చుట్టూ వున్న విశాల ప్రపంచం గురించి నిబద్ధతతో రాసిన నానీలివి. కవిత్వ ఖనిజం కోసం తననుతాను తవ్వుకుంటూ ఒకవైపు జీవితాన్ని, మరోవైపు పుస్తకాలనూ చదువుతూ వాటిని జీర్ణం చేసుకొని, వాటిని సమన్వయం చేసుకొని రాయడానికి నాగేంద్ర చేసిన ప్రయత్నం ఈ నానీలు. సీమ కరువు నుంచి బుధియా పరుగు దాకా, పుస్తకాలు మోసుకెళ్ళే బుడుతడు మొదలు నాగళి మోసే రైతు దాకా, ఆమె

నుంచి అతడు దాకా, ఫాక్షనిజం నుంచి కార్పొరేటీకరణ దాకా, జంతుబలుల నుండి మానవ బలులదాకా, మహిళల నీటి యుద్ధం నుంచి సానియా టెన్నిస్‌దాకా నాగేంద్ర నానీలలో ఒదిగిపోయాడు'' అని చెప్పడం ద్వారా నాగేంద్ర కవిత్వంలోని సత్తా, ఆదర్శ సమాజ నిర్మాణం దిశగా ఆయన స్వప్నం మనకు ఆవిష్కారమవుతుంది.

సాహిత్యంతో గాఢఅనుబంధాన్ని పెనవేసుకున్న నాగేంద్ర, తాను మొదటగా చదువుకున్న సామాజిక శాస్త్రాన్ని సాహిత్యంతో మమేకం చేసుకుంటూ తాడిత పీడిత వర్గాల పాలిట తన కవిత్వ అస్త్రాన్ని సంధించాడు. సామాజిక రుగ్మతలపై అనేకమైనటు వంటి కోణాల్లో వ్యంగ్యంగా కవిత్వాన్ని వెలువరించారు. ప్రభుత్వం ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలను, ప్రజల అభివృద్ధికి సంక్షేమ పథకాలను చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తుకు చేస్తారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజల అవసరాలను, అందరి సమానత్వాన్ని తన కవిత్వంద్వారా కాంక్షిస్తారు డా॥ఏ.ఏ. నాగేంద్ర. ఆదర్శ సమాజ నిర్మాణానికి అనునిత్యం తన కవిత్వం ద్వారా తపన పడే వ్యక్తిగా నాగేంద్ర కనిపిస్తారు.

సమాజంలో వివక్ష ఇంకా పోలేదని, దాన్ని రూపు మాపడానికి ఇంకా ప్రయత్నం చేయాలంటాడు ఆయన. దళిత వేదనకి అక్షర రూపం ఇచ్చిన మహాకవి జాషువాగారిని గుర్తుకు చేసుకుంటూ

''జాషువా
దళిత వేదన
ఆగనేలేదు
'గబ్బిలం' ఎక్కడుంది?

అని ప్రశ్నిస్తాడు. జాషువా గబ్బిలం ద్వారా తన సందేశాన్ని పంపాడు. కైలాసంలో వున్న శివునికి తన దీనావస్థను గురించి నివేదించమని కోరుతాడు. ఈ కావ్యం ద్వారా సమాజంలోని వివిధ వర్గాల, కులాల మధ్య ఉన్న అంతరాలను పాఠకుల ముందుంచాడు జాషువాగారు. ఇదే విషయాన్ని తన కవిత్వంలో నాగేంద్ర ఎన్నో రకాలుగా ప్రశ్నించాడు. జాషువాను ఆదర్శంగా తీసుకొని, అణగారిన ప్రజల పక్షాన 'ప్రశ్న?'గా నిలుస్తాడు నాగేంద్ర.

మగ్గం బతికులు
మగ్గిపోకూడదు
మార్గం చెప్పు
రాధేయా

అనంతపురం జిల్లాలో చేనేత పరిశ్రమ ఒకప్పుడు ఉపాధికి మంచి మార్గంగా వుండేది. జిల్లాలోని ధర్మవరం ''సిల్క్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్'' (ఆంధ్రప్రదేశ్ పట్టు నగరం ధర్మవరం) అని పేరు గాంచింది. ధర్మవరంతోపాటు హిందూపురం, ముదిరెడ్డిపల్లి, నార్పల మండలంలో కేశేపల్లి, అనంతపురం నగర శివారుల్లోని సిండికేట్ నగర్‌లు పట్టు చీరలు తయారు చేసే నేత పనివారికి ప్రసిద్ధి. అయితే కరెంటు మర మగ్గాలు అధికం కావడంతో, చేతితో నేసే పనివారికి ఉపాధిలేకుండా పోయింది. దీనిపై అనంతపురం జిల్లాకు చెందిన కవి, రచయిత డా॥ రాధేయ గారు ''మగ్గంబతుకు'' అనే దీర్ఘకావ్యాన్ని రాశారు. ఆ పుస్తకాన్ని ఆసాంతం చదివి నాలుగు లైన్ల నానీల్లో నాగేంద్ర చక్కగా అభివ్యక్తీకరించాడు. మగ్గం పనిచేసేవారి జీవితాలు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ప్రభుత్వం చొరవ చూపించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా నాగేంద్ర ప్రశ్నించాడు.

''ఆశ్రమాల్లో కన్నవాళ్ళు
ఏసీ గదుల్లో పిల్లలు
కార్పొరేట్ సంస్కృతికి
ఆనవాలు''

ఈ మాటలు నాగేంద్ర ఆవేదనకు సజీవ సాక్ష్యాలు. ప్రస్తుతం మన సమాజంలో వృద్ధాశ్రమాల సంఖ్య పెరిగిపోతుంది. తమకు జీవితాలను ఇచ్చిన తల్లి దండ్రులను అవసాన దశలో వదిలివేస్తున్నవారు కొందరైతే, వారిని వృద్ధాశ్రమాల్లో వదిలివేసి, నెలనెలా డబ్బులు పంపేవారు మరికొందరు. ఈ తరహా సంస్కృతి మంచిది

కాదని, ఇది సమాజం తిరోగమనం దిశగా వెళ్ళే సంకేతమని నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సమాజంలో మరో రుగ్మత "కార్పొరేట్ వైద్యం". ప్రజలకు సేవచేయడానికి, మంచి ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించడానికి బాసటగా నిలవాల్సిన "వైద్యవృత్తి" వింత పోకడలపై తన కలాన్ని ఝళిపించారు నాగేంద్ర. కార్పొరేట్ వైద్యుల మోసాలను, వైద్యం తీరుతెనుల్ని చక్కగా అభివ్యక్తీకరించాడు. ఉదాహరణకు

"డబ్బూ, జబ్బూ
డాక్టర్ ముందు వుంచా
మాయమైంది
డబ్బు"

ఈ మాటలు ఎంత లోతైన భావాన్ని వ్యక్తం చేస్తున్నాయో వేరే చెప్పక్కరలేదు.

రాయలసీమ వాసుడు కాబట్టే ఇక్కడి నేల వాసనల్ని బాగా గుర్తించగలిగాడు నాగేంద్ర.

"రోడ్లన్నీ / బురద బురద/ వర్షంతో కాదు /రక్తంతో..."

అని చెప్పడం రాయలసీమ జిల్లాలో ఒకప్పటి ఫాక్షన్ ప్రభావాన్ని చెప్పకనే చెబుతున్నాడు. రాయలసీమలోని ఆధిపత్య వర్గపోరుని, తద్వారా జరిగిన మారణ హోమాల్ని ప్రత్యక్షంగా చూసినవాడు కావడం నాగేంద్ర నిజమైన ఆర్తితో కవిత్వాన్ని వొంపాడు. అందుకే రాచపాళెం గారు "ఆయన తపన కల్తీలేనిది. ఆయన ఆర్తి నిష్కల్మష మైనది. ఆయన కోపం అర్థవంతమైనది. వీటిని కవిత్వంగా పాఠకుల చేతిలోకి వొంచడానికి నిజాయితీగా ప్రయత్నించాడు. వొంచడమే కావలసింది. వొలకబోయడం కాదు. వొలకబోస్తే నవ్వులపాలే ఎందుకంటే అది విదూషక చేష్టగనక. నాగేంద్ర నానీలు కవిత్వాన్ని పాఠకుల చేతిల్లో వొంచడానికే ప్రయత్నించాడు" అని అనడం నాగేంద్ర కవిత్వ తత్వాన్ని చెప్పకనే చెబుతోంది.

"పడుచు పల్లె/ వలస పోయింది / ఒంటరైంది / పండు ముసల్ది
రైతు / చెక్కిళ్ళపై / కన్నీటిధార / అప్పుల మరక
అలసి పోయింది / నాన్నజేబు / మోయలేక/ప్రాంసరీ నోటీసుల్ని
రైతు / ఆత్మహత్య / కరువుతో కాదు / పరువుతో...."

వంటి నానీలు దగాపడ్డ అనంతపేదరైతు జీవితాలకు నిలువెత్తు సజీవ సాక్ష్యాలు. వర్షాలు రాక పంటలు పండక ఒకవైపు, వర్షాలు వచ్చినా, పంటలు అరకొరగా పండినా, ఆ పెట్టుబడులకు చేసిన అప్పులు తీరక, అప్పులవాళ్ళు అనే మాటలకు పరువు పోగొట్టుకొని ఆత్మహత్యలు చేసుకుంటున్నరైతులు అనేకమంది అనంతపురం జిల్లాలో మనకు కనిపిస్తారు. మరికొందరు ఉపాధిబాట వెతుకుతూ, పట్టణాలకు వలసలు పోతున్న దృశ్యాలు అనంతపురం జిల్లాలో సర్వసాధారణం. ముసలివాళ్ళను, పసిపిల్లలను ఇళ్ళవద్దే వుంచి, పట్టణాలకు ఉపాధికి వెళుతున్న అనేక కుటుంబాల ఆవేదనలకి అక్షరరూపమే, సజీవ తార్కాణమే డా॥ ఏ.ఏ. నాగేంద్ర కవిత్వం.

సమాజంలో అన్ని వర్గాల వారికి న్యాయం జరగాలి, ముఖ్యంగా అనంతపురం జిల్లాలో రైతుల దయనీయమైన పరిస్థితుల్లో మార్పులు రావాలని, వారిని ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు ఆదుకోవాలనే ఆర్తి ఆయన కవిత్వంలో మనకు కనిపిస్తుంది.

"సమసమాజం నిర్మించాలంటే
గోడలు కట్టాల్సిన పనిలేదు
మన మధ్య ఉన్న అసమాన గోడల్ని
పగలగొడితే చాలు
సమసమాజం
కళ్ళముందు ఆవిష్కరింపబడుతుంది.

అని, సమసమాజ స్థాపన జరగాలని, అన్ని వర్గాల ప్రజలు ఆనందగా జీవించాలన్న కాంక్ష నాగేంద్ర కవిత్వంలో మనకు ప్రతిఫలిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. మన నానీలు - డా॥ ఏ.ఏ. నాగేంద్ర,
2. నాగేంద్ర నానీలు - డా॥ పతికి రమేష్ నారాయణ
3. కవితదారి పట్టిన నాగేంద్ర (వ్యాసం) - ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, సాహిత్య ప్రస్థానం-సంపుటి -3, సంచిక -2, నవంబరు 2021.
4. నానీలకు కొత్తరూపు నాగేంద్ర (వ్యాసం) - సాక్షి దినపత్రిక, అనంతపురం, జూలై 2019.

❖❖❖

రాచపాళెం గారి రెండు ప్రపంచాలు కావ్యం - సామాజిక సంస్కరణ

– డా॥. ఎ. ఎ. నాగేంద్ర, యూజీసీ పోస్ట్ డాక్టరల్ ఫెలో, తెలుగు & తులనాత్మక సాహిత్య శాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయము, అనంతపురము,

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయము, తెలుగు & తులనాత్మక సాహిత్య శాఖలో ఆచార్యులుగా పనిచేసి 2008 అక్టోబర్ 31న ఉద్యోగ విరమణ చేశారు.

ఆచార్య రాచపాళెం గారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో పేరెన్నికగన్న సాహిత్య విమర్శకుడు కవి.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు చిత్తూరు జిల్లా తిరుపతి రూరల్ మండలంలోని 'కుంట్రపాకం' అనే గ్రామలో ఒక మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో శ్రీమతి మంగమ్మ, రామిరెడ్డి దంపతులకు 1948 అక్టోబర్ 16న జన్మించాడు.

ఆచార్య రాచపాళెం ప్రధానంగా సాహిత్య విమర్శ కుడు, పరిశోధకుడు, అయినప్పటికీ ఆయన కవిత్వం కూడా రాశాడు. కవిత్వ రంగంలోకి రాచపాళెం చాలా ఆలస్యంగా అడుగుపెట్టాడు. రాచపాళెం పరిశోధక విద్యార్థిగా ఉన్నప్పుడే కవిత్వ రచన ప్రారంభించాడు. 1975 ప్రాంతాలలోనే 'అంతరాలు' అనే కవిత రాశాడు.

1978లో 'సమాజమా ఆలోచించు' అనే కవిత రాశాడు. 'స్వర్ణభారతి సాక్షిగా' 'సీమనానీలు' 'పాలి' (దీర్ఘకావ్యం) 'రెండు ప్రపంచాలు' మొదలైన కవితా సంపుటాలను ప్రచురించారు. రాచపాళెం గారి సుదీర్ఘ సాహిత్య ప్రస్థానంలో ఆధునిక సాహిత్య ప్రక్రియలైన కవిత్వం, కథానిక, నవల, నాటకం, విమర్శ వంటి వాటి మీద విశేషమైన కృషిచేశారు.

రాచపాళెం గారి సాహిత్య కృషిని పలుసాహితీ సంస్థలు గుర్తించాయి. ఆయనకు సాహిత్యంలో సముచిత స్థానాన్ని చేకూర్చే ప్రయత్నంలో భాగంగా విశిష్ట పురస్కారాలతో సన్మానించాయి.

'రెండు ప్రపంచాలు' కావ్యం :

'రెండు ప్రపంచాలు' అనే కవిత్వ సంపుటాన్ని 2012 జూలైలో ప్రచురించారు. రాచపాళెం గారు తనకు ఎంతో ఆత్మీయుడైన వెంకటస్వామి గారికి అంకితం ఇచ్చారు.

ఈ సంపుటిలో దాదాపు 46 కవితలు ఉన్నాయి. ఈ కవితలన్నీ సమాజాన్ని తట్టిలేని మందుకు నడిపించేవే.

తన ప్రాంత, మనుషులు, మారుతున్న సమాజం, మనిషి మనిషిగా ఎలా జీవించాలి, అనంతరైతు ఆవేదన, తన చుట్టూ ఉన్న జీవితం తదితర అంశాలు మనకు కన్పించడమే కాకుండా సమాజంలో మంచి మార్పును, మనిషిలో సంస్కరణ తీసుకువచ్చే సాహిత్యం ఈ కవితల్లో మనకు కన్పిస్తుంది.

రాయలసీమ ఒకనాడు పచ్చని పంటలతో అలరారు చుండేది. అలాంటి రాయలసీమ రాజకీయ నాయకుల నిర్లక్ష్యం వల్ల ఎలా వెనుకబాటుతనానికి గురైందో కవి ఎంతో ఆర్ద్రతతో ఇది 'పరాధీనసీమ' అంటూ ఆవేదన చెందుతాడు.

ప్రతి చారిత్రక సందర్భంలోనూ రాయలసీమకు అన్యాయమే జరిగింది.

1937లో కోస్తా, రాయలసీమ పెద్దమనుషుల మధ్య ఒప్పందం 'శ్రీబాగ్ ఒడంబడిక' జరిగింది. కృష్ణ, తుంగ భద్ర, పెన్నానదీ జలాల పంపకాల్లో ప్రథమ ప్రాధాన్యం రాయలసీమకే దక్కాలి. కానీ అలా జరగలేదు. దీనికి తోడు కరువు, ఫ్యాక్షన్ రాయలసీమ ప్రజల జీవితాల్లో మాటువేశాయి.

''ఇక్కడ
జీవితాలు నిజంగానే నీటిబుడగలు
పేలుతున్న బాంబులు తెగుతున్న పేగులు''

అంటూ రాయలసీమ ప్రజల ముఖచిత్రాన్ని ఆవిష్కరిస్తాడు కవి. కరువు, ఫ్యాక్షన్ కలసి ఇక్కడి ప్రజల జీవితాల్ని ఎలా ఆడిస్తాయో, జీవితాలు ఎంత విషాదంగా నీటిబుడగలు మాదిరి పేలిపోతాయో చూస్తుంటే చదివే పాఠకుడి హృదయం కూడా బరువెక్కుతుంది.

"ఏ పల్లె కంట్లోకి తొంగిచూసినా
కనిపించేది నల్లటి దిగులు
ఏ ఇల్లాలి ముఖం చూసినా
కనిపించేది రేపటి అపనమ్మకం
ఇదొక బ్రతికి చెడిన గడ్డ
ఇదొక షాద కావ్యం" (విషాద కావ్యం)

రాయలసీమలోని అనంతపురము జిల్లాను దృష్టిలో పెట్టుకొని కవి ఇది 'విషాద కావ్యం' అంటూ అనంత పురము జిల్లా ప్రజల జీవితాలను దగ్గరుండి చూశాడు కాబట్టి ఈ వాక్యాలు రాయగలిగాడు కవి. ఏ పల్లె కంట్లోకి చూసినా నల్లని దిగులు కన్నిస్తుంది. పంటలు చేతికి రాకపోవడం, పండినా దళారీ వ్యవస్థ రైతును మోసం చేయడం ఇవన్నీ రైతులను దిగులు గువ్వను చేస్తున్నాయి. ఏ ఇల్లాలి ముఖం చూసినా కనిపించేది రేపటి అపనమ్మకం. రేపు అనేది ఒక గట్టి నమ్మకాన్ని ఇవ్వాలి కానీ ఇక్కడి ప్రజలకు రేపు ఎలా అనే అపనమ్మకాన్ని ప్రకృతి, పాలకులు కలసి కల్గిస్తున్నారు అంటూ కవి ఇది విషాదం అంటూ ఆవేదన వ్యక్తపరుస్తాడు.

తెలుగు సాహిత్యంలో ముస్లిం, మైనార్టీ సాహిత్యం మొలకదశలో ఖాదర్‌మోహిద్దీన్ రాసిన 'పుట్టుమచ్చ' ఒక సంచలనం. ఈ సంకలనంలో కూడా కవి ఒక శీర్షికకు 'పుట్టుమచ్చ' అని పేరుపెట్టాడు.

ఫ్యాక్షన్ సామాన్య ప్రజల జీవితాల్ని ఎలా అంతం చేస్తుందో తెలియజేస్తూ...

"మాకు
జీవితమంటే
హత్యకూ హత్యకూ మధ్య విరామమే
జీవన యానమంటే
మరణం నుంచి మరణానికి ప్రయాణమే"

రాయలసీమ ముఠాకక్షల్ని ఇలా వ్యక్తీకరిస్తాడు కవి.

'టీవి బాంబుల్ని
కారు బాంబుల్ని
రేసు గుర్రాలుగా చేసుకుంటా' అని అనడం

ఇక్కడ పగ, ప్రతీకారాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం అవుతుంది.

ఒక వ్యక్తిని మరొక వ్యక్తి
ఒక జాతిని వేరొక జాతి
పీడించే సాంఘిక ధర్మం ఇకనా
ఇకపై సాగదు అని శ్రీశ్రీ అంటే

రాయలసీమ ప్రాంతంలో పగలు, ప్రతీకారాలు ఎలా చెలరేగుతాయో కళ్ళకు కట్టినట్లు చూపిస్తాడు కవి.

కవులు సాధారణంగా సౌందర్యాన్ని వర్ణిస్తారు. స్త్రీని, ప్రకృతిని, చెట్టును, చందమామను, మంచుపర్వతాన్ని అయితే రాయలసీమ కవి 'ఫ్యాక్షనిజం' గురించి రాయకుండా ఉండలేదు.

'సీమ సిగలో విరిసిన
పగపువ్వు ఫ్యాక్షనిజం
సీమ బతుకు పుస్తకంలో
ఇక చీకటి పుట
ఫ్యాక్షనిజం' (ఫాక్షనిజం)

'పగపువ్వు' అనేది కొత్త అభివ్యక్తి. ఇక్కడ 'పగ' అనేది 'పువ్వు'లా వికసిస్తుంది అంటూ చెబుతాడు కవి.

సమాజం నిన్నటి కన్నా ఇవాళ, ఇవాళ కన్నా రేపు ఎంతో గొప్పగా చైతన్యవంతమైన మార్పుతో ముందుకు సాగాలి. ముఖ్యంగా అంబేద్కర్, మార్క్స్ కలలు గన్న సమ సమాజం రావాలని కోరుకుంటాడు రాచపాళెం గారు.

"రాజూ
మనిద్దరం కలుసుకున్నప్పుడల్లా
మనువు నిర్మించిన అడ్డుగోడల్ని

అంబేద్కర్ పగలగొడ్తున్నట్లుండేది
మార్క్స్‌ను అంబేద్కర్‌ను
మనిద్దం
అంటుగడుతున్నట్లుండేది" (సుందర రాజు కోసం)

మనువు సిద్ధాంత గోడల్ని పగలగొట్టేది ఆధునిక చైతన్య కవులు. సుందరరాజు, రాచపాళెం గారి స్వప్నం కూడా సమసమాజ నిర్మాణం, అందరూ వసుదైక కుటుంబంగా జీవించాలని.

రాచపాళెం గారికి మంచి కీర్తి తెచ్చిపెట్టిన కావ్యం 'పాలి' అనే దీర్ఘకావ్యం. ఇందులో రైతు జీవితాన్ని యదార్థంగా చిత్రించారు రాచపాళెం గారు. "జైజవాన్ - జైకిసాన్" అనే మాట గుర్తుకు వస్తుంది.

"మా నాయన
మొలకెత్తిన వడ్లను
గోయిందా గోయిందా అంటూ నారు విడుస్తుంటే
తిండిగింజలు పడుతాయి భయపడకండని
దండోరా వేస్తున్నట్లుండేది" (మా నాయన)

రైతు శ్రమతో మనందరం సమయానికి భోజనం చేస్తున్నాము. రైతు ఎన్ని కష్టాలు పడ్డా చివరికి అందరికీ తిండిగింజలు అందిస్తాడు. శ్రమ తాను పడుతూ తిండిగింజలు మనకు అందించే నిస్వార్థపరుడు ఒక్క రైతు మాత్రమే.

17వ శతాబ్దంలో వేమన 'కర్మ' సిద్ధాంత స్థానంలోనే 'శ్రమ' సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు.

శ్రీశ్రీ కూడా శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని ప్రకటిస్తాడు. రాచపాళెం గారు కూడా మాకు ఇప్పుడు కావలసింది మసీదులు, మందిరాలు కాదు మనకిప్పుడు కావలసింది సమిష్టిశ్రమ, సమిష్టిఫలం అంటూ ఉద్బోధిస్తాడు. అందరూ కష్టించి వచ్చిన ఫలాలు అందరూ సమిష్టిగా అనుభవించాలని కవి ఆకాంక్షిస్తాడు.

ఎంతో భవిష్యత్తు ఉన్న అలనాటి నటి సౌందర్య అకాలమరణం పట్ల స్పందిస్తూ... ఒక రాజకీయ పార్టీ స్వార్థపు ఎత్తుగడల ఉలిదెబ్బలకు ఉల్కలా రాలి పోయింది అంటూ ఆవేదన చెందుతాడు రాచపాళెం.

"కమలంలా వికసిస్తూ
రాజకీయ కమలాగ్నిలో
సౌందర్యం బూడిదయ్యింది.
కంపు కొడుతున్న జెండాలకు
పరిమళం అద్దబోయి
అధికార క్రీడాగ్నిలో పడి
సౌందర్యం మిడతలా మాడిపోయింది" (ఇది ఎవరు కోరిన త్యాగం)

ఆధ్యాత్మిక ముసుగులో చలామణి అవుతున్న దొంగ బాబాల నిజస్వరూపాన్ని కళ్ళకు కట్టినట్లు చూపిస్తాడు కవి. మనిషి మనిషిని మాత్రమే నమ్మాలనే సత్యాన్ని మరచి దొంగబాబాలను నమ్మి మోసపోవడంపై చురకలు వేస్తాడు కవి.

"ఆధ్యాత్మికతకు సంపదకు పెళ్లి చేస్తే
పుట్టేవి ట్రస్టులే
బాబాలైనా అమ్మలైనా అవ్వలైనా
ట్రస్టీ మావటీల అంకుశాలకు
తలవంచే ఏనుగులే" (సత్యం)

ఆధ్యాత్మిక ముసుగులో సంపదను దిబ్బలుగా పెంచుకోవడానికి బాబాలు దొంగ 'ట్రస్టు' లను ఏర్పాటు చేసి నల్లధనాన్ని తెల్లధనంగా ఎలా మార్చుకుంటున్నారో తేటతెల్లం చేస్తాడు కవి.

ముగింపు :

రాచపాళెం గారి కవిత్వం 'రెండు ప్రపంచాలు' కావ్యం వ్యవస్థలోని లోపాల్ని చూపించడమే కాకుండా ఎలా ఉంటే వ్యవస్థ బాగుపడుతుందో తెలియజేస్తుంది.

రాయలసీమ ప్రజల జీవితాలు ఎలా ఉండాలో ఎలా ఉండకూడదో తెలియజేస్తుంది ఈ కావ్యం.

ఒక్కరికోసం అందరం, అందరి కోసం ఒక్కరు అనే సమిష్టి సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తుంది. వేమన్న నేలలో

మనం శాంతిని కోరాలని, శత్రువును కూడా క్షమించాలని సూచిస్తుంది ఈ కావ్యం. సమాజంలో మార్పురావాలంటే ముందు మన నుంచే ప్రారంభం కావాలని, సంపదను, ఫలాలను సమిష్టిగా అనుభవించాలని, సామాజిక సంస్కరణ అంటే మనిషిని మనిషి విశ్వసించడమే అని ప్రతిపాదిస్తుంది ఈ కావ్యం.

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో జాతీయతా భావస్థిరక సాహిత్యం

– కప్పల శ్రీరాములు, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి, ఉత్తరప్రదేశ్.

"జననీ జన్మభూమిశ్చ
స్వర్గాదపి గరీయసీ"

జాతీయత అంటే ఒక జాతియొక్క ఆత్మగౌరవానికి, ఔన్నత్యానికి సంబంధించిన స్థితి. ఒక జాతి సంస్కృతి, సంప్రదాయాలను సహజత్వాన్ని ప్రవహింపజేసే జీవనది జాతీయత. ఒకే మనుగడ, ఒకే విశ్వాసంగల మానవ సమూహపు భావజాలమే జాతీయత. గురజాడవారి 'దేశభక్తి' గీతం జాతీయతకు మంచి ఉదాహరణ. తన జన్మభూమికి ఎప్పుడూ వినయంగా వుండి అవ్యాజమైన ప్రేమలను కలిగివుంటూ ఆ నేలను, అక్కడి సంప్రదాయాలను, చారిత్రకతను అభిమానిస్తూ, గాఢమైన అనురాగం వుండటమే జాతీయత. మనమంతా ఒక్కటే అనే భావమే జాతీయత అవుతుంది. అందుకు ఉదాహరణ మన దేశంలో ఉన్నటువంటి ఎన్నో కులాలు, మతాలు వుండి భిన్నత్వంలో ఏకత్వం కలిగివుండటమే. తామంతా దేశ ప్రజలమే అందరి కష్టసుఖాలను పంచుకోవాలి అనుకోవడమే జాతీయత అవుతుంది. భిన్న జాతులు, భిన్న భాషలు ఉన్నా జాతీయత అలవడుతుందని భారతదేశం ప్రపంచానికి చాటి చెప్పింది.

జాతీయ భావాలే స్వాతంత్ర్య కాంక్షకు మూలం. స్వాతంత్ర్యం అనేది జన్మతహ సంక్రమించే సహజలక్షణం. అంటే జీవ ధర్మం, 'స్వాతంత్ర్యం నా జన్మహక్కు' అంటూ ఎలుగెత్తి చాటాడు. మానవుని ఆర్థిక, సామాజిక, రాజకీయ మానసిక, ఆత్మీయ, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాలే అసలైనవి. స్వాతంత్ర్యం లేని మానవ జీవితం ఒడ్డునపడ్డ చేప లాంటిది. జన్మభూమిని దాస్య శృంఖలాల నుంచి విముక్తి చేయించాలని ఎందరో త్యాగాలు చేశారు. మాతృరుణం తీర్చుకున్నారు. జాతి విముక్తికోసం మాతృభూమి స్వేచ్ఛ కోసం కవులు కలాలు పట్టారు. అదే జాతీయోద్యమ సాహిత్యం. ఆంగ్లేయుల పాలనలో భారతీయుల్ని బానిసలుగా చేసి జాతి సమైక్యతకు విఘాతం కల్పిస్తూ, రాజకీయంగానే కాకుండా, ఆర్థిక, సాంస్కృతిక, భాషా పరంగా అన్ని రంగాలలోనూ భారతీయుల్ని వెనక్కు నెట్టారు. భారతీయ సార్వభౌమత్వాన్ని మంటకలిపారు తెల్లదొరలు. అప్పుడు జాతి చైతన్యం పోటెత్తిన సప్త సముద్రాల్లా విజృంభించింది. అందరిలో త్యాగం, "నాదేశం నా జాతి" అనే భావన పవిత్ర ధారగా ప్రవహించింది. ఒక్కొక్క భారతీయుడు ఒక్కో యోధుడయ్యాడు. ఆంగ్లేయుల పాలనను మట్టుపెట్టి, స్వరాజ్యం స్థాపించడానికి జాతీయోద్యమం ప్రారంభమైంది. 1857 సిపాయిల తిరుగుబాటును ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామమంటారు. 1885లో భారతీయ కాంగ్రెస్ ఎ.వో. హ్యూమ్ వల్ల రూపుదిద్దుకుంది. అరవిందఘోష్, తిలక్ వంటివారు ఉద్యమ తత్వాన్ని ప్రచారం చేశారు. చైతన్యవంతమైన ప్రజా ఉద్యమాన్ని పురికొల్పారు. వందేమాతరగేయంతో ఒక ప్రత్యేక ఉద్యమమే పెల్లుబుకింది. తన జాతి పరాయి పాలకుల పదఘట్టనల క్రింద జీవచ్ఛవంలా బ్రతుకుతున్నప్పుడు కవి చేతులు మూసుకొని కూర్చోలేడు. ఇదే స్ఫూర్తితో తెలుగులో జాతీయోద్యమ కవిత్వం ఏరులై ప్రవహించి, తెలుగుజాతిని ఉత్తేజితం చేయడంలో ప్రధాన భూమిక పోషించింది. తెలుగు కవులు తమ కలాల్ని తుపాకులుగా, తమ గీతాల్ని తూటాలుగా చేసుకొని ఆంగ్లేయుల పాలనపై ధ్వజమెత్తారు.

అయితే స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వచ్చిన ఈ జాతీయోద్యమ కవిత్వం ప్రాధాన్యాన్ని కాదనలేము. అయితే ఇప్పుడు దీని అవసరం ఏమిటి అన్న ప్రశ్న ఉత్పన్నం కావొచ్చు. ఆనాటి జాతీయోద్యమ కవిత్వ స్ఫూర్తి ప్రజలందరి శ్రేయస్సు. అది ఇప్పుడు మనల్ని మనం పరిపాలించుకుంటున్న వ్యవస్థలో అది కనిపించని

సత్యమని మనందరం గ్రహించాలి. ఆదర్శ సమాజ భావన అంటేనే సర్వమానవాళి సౌభ్రాతృత్వం. కానీ అది ప్రస్తుతం మన ప్రజాస్వామ్య వ్యవస్థలో కనిపించలేదన్నది నిర్వివాదాంశం. మన దేశంలో మనకొరకు మనం రాసుకున్న రాజ్యాంగ పాలనలో ఇంకా పేదరికం, అసమానత్వం, సాంఘిక, ఆర్థిక, రాజకీయ అణచివేతలు ఎదుర్కొంటున్న తరుణంలో ఆదర్శ సమాజం అన్నది కలగానే మిగిలిపోతోంది. దాన్ని మనం సాకారం చేసుకోవాలంటే మరోసారి మనం సాధించి తెచ్చుకున్న స్వరాజ్యం, ఆనాటి స్వరాజ్య పోరాట స్ఫూర్తి, ఆ స్ఫూర్తిని నింపిన జాతీయోద్యమ సాహిత్యాన్ని మననం చేసుకోవడం ద్వారా ఆదర్శ సమాజ నిర్మాణాన్ని కాంక్షించవచ్చన్నది నా అభిమతంగా భావిస్తున్నాను.

జాతీయోద్యమ కవిత్వం ఎక్కువకగా తాత్కాలిక మైనదని, దానికి సార్వకాలికత తక్కువని కొందరు విమర్శించకపోలేదు. ఏ ఉద్యమ కవిత్వమైనా తాత్కాలికమే. కానీ సాహిత్య చరిత్ర ఆధారంగా పరిశీలించినప్పుడు కేవలం తాత్కాలికం అనలేము. దేశ భక్తిని ప్రబోధించే ఏ కవిత అయినా ఎప్పుడూ ఆదరణీయమే. నిజానికివి స్వాతంత్ర్య చరిత్రకు సాక్ష్యాలు. వీటిలో చాలా గేయాలు విజ్ఞాన ప్రదాలు. జాతి మనుగడకు మోక్ష సాధనాలు. ఈ కవితలు ఉత్తమ లక్ష్యాలను అందిస్తాయి. గురజాడ రాఘవశర్మ అన్నట్టుగా "కర్మఫల త్యాగం, సర్వార్పణ ముఖ్యములు. అనాసక్త యోగము, దీక్ష, స్వాతంత్ర్య సముపార్జనకై సర్వ త్యాగము. ఇందు స్వార్థము లేదు. త్యాగమే ధ్యేయం. పరశ్రేయశ్శే ఆనందం. ఈ సోపానాలనధిష్ఠింపజేయ ప్రయత్నాలే జాతీయ గీతాల ప్రయోజనాలు". ఈ మాటలను ప్రస్తుతం ఆదర్శ సమాజా నిర్మాణానికి ఎందుకు ఉపయోగించు కోలేము? వాటిని ప్రస్తుత సమాజానికి అనుగుణంగా మలచుకుంటే తప్పకుండా జాతీయోద్యమ స్ఫూర్తి కలుగుతుంది. తద్వారా ఆదర్శ సమాజ నిర్మాణం సాధ్యపడుతుంది.

మహాత్మాగాంధీగారు అస్పృశ్యతా నివారణకు కడదాకా కంకణబద్ధులై పోరాడారు. కానీ మహాత్మాగాంధీగారి కన్నా ముందే తెలుగునేలపై అస్పృశ్యతా నివారణ దిశగా కవులు తమ గళాలను వినిపించారు. వారిలో కొద్దిమంది అజ్ఞాతంగా ఉన్నప్పటికీ వారి సాహిత్య వాసనలు మాత్రం సమాజంలో పెల్లుబికాయి.

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లీకి
అందారు ఒక్కటై వుండాలి సక్కంగ"

ఈ మాటలు ఇప్పటి మన సంఘ పరిస్థితులకు వర్తించవా? ఇవి సార్వకాలికమైన మాటలు కావా? అంటే తప్పక వర్తిస్తాయని చెప్పక తప్పదు. ప్రస్తుత మన సమాజాన్ని పరిశీలిస్తే వర్ణ, వర్గాలుగా విడిపోయి హక్కులు ఒకవైపు, ఆత్మగౌరవం ఒకవైపు అంటూ గొంతెత్తుతున్నారు కదా? అన్ని వర్గాల అభ్యున్నతి జరిగినప్పుడే ఆదర్శ సమాజం అన్నది నిలబడుతుంది.

మనం అత్యాధునిక యుగంలో ఉన్నాం. ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిన తరుణంలో కూడా ఇప్పటికీ సామాజిక వెలి, సాంఘిక వెలి మన జీవితంలో ఇంకా అంతర్భాగాలుగానే ఉన్నాయన్న అంశాన్ని మనం విస్మరిస్తున్నాం. ఇంకా గుడుల్లోకి అనుమతించకుండా బయటే నిలబెట్టే సంస్కృతి అక్కడక్కడా కనిపిస్తోంది. అందుకే ప్రముఖ కవి పురిపండా అప్పలస్వామి

"గుడిలోని దైవమా ఆలింపవోయి
గుడిలోని దయ్యమా పైకి రావోయి
నీ పాదపూజకై వెదకి తెచ్చిన పూలు
నీ పాదసేవకై నింపి తెచ్చిన నీళ్ళు
పనికి రావంటారు మైలపడెనంటారు"

అని 90 ఏళ్ళ క్రితమే అన్నారు. కానీ మరీ ఇంత అధ్వాన్నమైన పరిస్థితి లేనప్పటికీ, ఇంకా వివక్ష మాత్రం ఉన్నదని మాత్రం అంగీకరించక తప్పదు. దాన్ని మనం రూపుమాపాలంటే మానవులందరూ ఒక్కటేనన్న భావనను కలిగించడానికి యత్నించి, సఫలీకృతమైన భారత జాతీయోద్యమ స్ఫూర్తిని కలిగించిన సాహిత్యం ఇప్పటికి అవసరమే నన్న ప్రతిపాదన చేస్తున్నాను.

మద్యపానం వల్ల సమస్యలు ఎంతగా ఉత్పన్న మవుతాయో మనకు తెలిసిన విషయమే. ఇదే సమస్య నుంచి భారత ప్రజలను తప్పించి, స్వాతంత్ర్య కార్యోన్ముఖులను కావించడంలో ఆనాటి తెలుగు కవులు సఫలీకృతులైనారు. మద్యపాన విరక్తుల్ని చేయడంలో భాగంగా

"ఎంతమాయా స్వరూపిణి విపుడు దెలిసె
నౌర నీ గుట్టు, మా పాలిమేరవిడిచి
వెడలుమిటనుండి యింక త్రాగుడు
పిశాచమా! నిశాచర! పెనుభూతమా! వెడలుమా"

- అంటూ గురజాడ రాఘవశర్మ మద్యపాన నిషేదానికి తమ వంతు ప్రయత్నాలను చేశారు.

"కల్లు త్రాగబోకురా! నీ యిల్లు వళ్ళు కూడ
గుల్లలౌతాయిరా
కల్లు సారాలమ్మి కొల్లాగొట్టి సొమ్ము
కల్లారి సరకారు ఖైదీలో పెడతారు"

అని మంగిపూడి పురుషోత్తమ శర్మ హితబోధ చేయడం మనకు కనిపిస్తుంది. ప్రస్తుతం మన ముందున్న సమాజం కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటూంది. కల్తీ కల్లు, కల్తీ సారా తాగి ఎంతమంది మృత్యువాత పడ్డారో ప్రసార, ప్రచార సాధనాల ద్వారా మనం నిత్యం గమనిస్తూనే వున్నాము కదా!. అందువల్లనే ఆదర్శ సమాజ స్థాపనలో ఆనాటి స్వాతంత్ర్య వుద్యమానికి పురికొల్పిన సాహిత్యం నేటికీ నిత్యనూతనమై, నేటి కాలపు సామాజిక రుగ్మతలలో ఒకటైన మద్యపానాన్ని రూపుమాపడంలో తన ప్రయత్నాన్ని కొనసాగించాల్సి వస్తోంది.

ప్రపంచపు మహాకవి గురజాడ అప్పారావుగారి దేశభక్తి గేయం సర్వకాల సర్వావస్థలలోనూ ప్రపంచ మానవాళికి దిశానిర్దేశం చేయగలిగిన కవిత్వం. ఇది ఒక దేశానికో, ఒక ప్రాంతానికో, ఒక నిర్ధేశిత సమయానికో పరిమితం కాలేదు. దేశంలో సమస్యలు ఉన్నన్నాళ్ళు ఈ దేశభక్తి గేయం ఆ సమస్యల్ని అధిగమించడానికి కావాల్సిన శక్తిని మనకందిస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి కాదు.

స్వంత లాభం కొంత మానుకు
పొరుగువాడికి తోడుపడవోయి
దేశమంటే మట్టికాదోయి
దేశమంటే మనుషులోయి!

అంటూ దేశం అంటే వ్యవస్థకాదు, వ్యక్తుల సంపూర్ణ సమూహమేనంటూ మానవజాతికి విలువనిచ్చి, సమాజం గురించి ఆలోచిస్తూ, సమాజాన్ని ఉన్నత దిశగా నడిపించాలని కలలుగన్న స్వాప్నికుడు మహాకవి గురజాడ. ఆధునిక పోకడలు పెచ్చుమీరుతున్నా, సమాజంలో రోజురోజుకూ ధనస్వామ్యం ప్రాధాన్యత పెరుగుతున్న సమయంలో పక్కవ్యక్తి గురించి ఆలోచించే రోజులు పోయాయి. మన స్వార్థం కోసం ఎదుటి వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగినా పట్టించుకోము సరికదా, అవసరమైతే మనమే వారిని ఇబ్బందులకు గురిచేసే రోజులివి. ఈ సమాజాన్ని 120 సంవత్సరాల క్రితమే ఒక వ్యక్తి తన రచనల్లో స్పృశించారు. సమాజం ఈ దశలో ఉన్నది, దీన్నుంచి బయటపడాలని, లేకపోతే దేశం అభివృద్ధి చెందదనే నిష్మర సత్యాన్ని తెలియపరిచిన మహానుభావుడు శ్రీగురజాడ అప్పారావుగారు.

ప్రస్తుత మన రాజకీయ వ్యవస్థను గురించి ముందు గానే శ్రీగురజాడ వారు కలగన్నారో ఏమో అనిపిస్తోంది. దేశాభివృద్ధిలో కీలకంగా మారాల్సిన వారు దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. మన రాజకీయ వ్యవస్థ తీరును చూస్తుంటే భరించరాని కంపు కొడుతూ మురిగిపోయిందనిపిస్తోంది. కేవలం ప్రదర్శన తప్ప అంకిత భావంతో పనిచేస్తున్న నాయకులు మచ్చుకు కూడా కనిపించరు. కవి కాలం కన్నా ముందుంటా డంటారు కదా అందుకేనేమో,

దేశాభిమానం నాకుకద్దని
వట్టిగొప్పలు చెప్పుకోకోయి!
పూని యేదైనాను నొకమేలు
కూర్చి జనులకు చూపవోయి!

అంటూ ఆదేశించారు. కానీ మన నాయకులు అందుకు లొంగుతారా? వేషం, భాష, యాస ఎన్నింటినో ఔపోషన పట్టారు మనవారు. 64 కళలను మించి అద్భుత కళను ప్రదర్శించే నేర్పును ఒడిసిపట్టుకున్నారు. ఆయన చెప్పిన అంశానికి భిన్నంగా తమ కొత్త పంథాను ఎంచుకున్నారు. మన సమాజం ఆదర్శ భావనలతో ముందుకెళ్ళాలంటే జాతీయత భావస్ఫోరక సాహిత్యాన్ని మనం మళ్ళీ పున:శ్చరణ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాను. అప్పుడే ఆదర్శ సమాజం అన్న భావన పరివ్యాప్తమై, సమాజం ఉన్నతంగా ఉదాత్త ఆలోచనలతో ముందుకు వెళు తుందన్న ఆశా భావాన్ని వ్యక్తం చేస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

1. ముత్యాల సరాలు - (దేశభక్తి) - గురజాడ అప్పారావు
2. జాతీయోద్యమ కవిత్వం - డా॥ ద్వానా శాస్త్రి (వ్యాసం), తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమీ ప్రచురణ.
3. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య జి. నాగయ్య, నవ్యపరిశోధక ప్రచురణలు, తిరుపతి.
4. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం - డా॥ మద్దూరి సుబ్బారెడ్డి

❖❖❖

పల్లేటి నాటకాలు - మత సామరస్యం

– డా॥. కొప్పలు రెడ్డి శేఖర్ రెడ్డి, అకడమిక్ కన్సల్టెంట్, లలితకళల విభాగం, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

"నేను నాటకాన్ని నడిపిస్తాను. నాటకం ఆశయాన్ని నడిపిస్తుంది. "నేను పోయినా, నా నాటకం బ్రతికుండాలి" అని సంతోషంగా, ధైర్యంగా ప్రకటించుకున్న రచయిత శ్రీ పల్లేటి లక్ష్మీకులశేఖర్ గారు. ఈయన 03-12-1954 సం॥ కడప జిల్లా వీరబల్లి మండలంలోని గడికోట గ్రామంలో శ్రీమతి మరియమ్మ, శ్రీ పల్లేటి విలయమ్స్‌కు జన్మించారు. వీరు చదివింది పదవ తరగతి వరకే అయినా చిన్నతనం నుంచే "కవి" కావాలన్న బలమైన కోరికతో పరిక్రమించి కృతకృత్యులయినారు. పల్లేటి రచనా శక్తిని గమనించిన కమాల్ సాహెబ్ అనే తెలుగు అధ్యాపకులు ప్రోత్సాహంతో ఛందస్సుతో పాటు, అనేక రచనా మెళకువలను నేర్చుకొన్నారు.

శ్రీ పల్లేటి లక్ష్మీకులశేఖర్ గారికి కడపకు చెందిన ప్రముఖ, సాంఘిక రచయిత "వై.యస్. సిలార్"తో ఏర్పడిన పరిచయం పల్లేటి వారిని సాంఘికనాటక రచయితను చేసింది. అలాగే 1982 సం॥లో "సవేరా ఆర్ట్స్" వ్యవస్థాపకులు "శ్రీ ఆళ్ళూరి వెంకటయ్య" గారితో ఏర్పడిన పరిచయం పద్యనాటక రచయితగ జీవితంలో స్థిరమైన ప్రయాణానికి నాంది పలికింది. ఈ విధంగా శ్రీ పల్లేటి లక్ష్మీకులశేఖర్ గారు పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటికలు, నాటకాలే కాకుండా హరికథలు, ఒగ్గు కథలు, నృత్య నాటికలు, కావ్యాలు, వ్యాసాలు, టి.వి. నాటికలు, టీ.వి. సీరియళ్ళు, సినిమాలు, రేడియో నాటికలు, పాటలు, పద్యాలు ఇలా అనేక ప్రక్రియల్లో నైపుణ్యం చూపిన శ్రీపల్లేటి లక్ష్మీకులశేఖర్ గారి లాంటి ప్రతిభావంతులు చాలా అరుదు.

శ్రీ పల్లేటి లక్ష్మీకులశేఖర్ గారి రచనలకు అన్ని విభాగాల్లో 84 నంది బహుమతులు, 37 గరుడ అవార్డులు, 9 సార్లు ఉత్తమ రచయితగా నందులు, 1 సారి ఉత్తమ దర్శకునిగా, 9 సార్లు పైడి లక్ష్ముమయ్య అవార్డులు, 9 సార్లు ఎన్.టి.ఆర్. జీవిత సాఫల్య పురస్కారాలు, హంస అవార్డు ఇలాంటి ఎన్నో మరెన్నో అవార్డులు, రివార్డులు పొందిన వీరి రచనా శైలి అమోఘం, అదిత్వీయం.

శ్రీ పల్లేటివారు ముఖ్యంగా వారి నాటకాలను ప్రపంచీకరణ ప్రభావంతో ప్రజలు తమకు తెలియని ఆకర్షణకు లోనైపోతున్నారని, మూఢనమ్మకాలతో సమాజం వెనుకకు పోతున్నదని సరైన విద్యావిధానం లేక విద్యార్థులు చాలా మంది నిరుత్సాహానికి లోనై, మానసికంగా క్రుంగిపోతూ పెడదారిపడుతున్నారని, మత సంస్కరణలు సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా పలు రకాలైన అంశాలపై పల్లేటిగారు గళం విప్పారు. ప్రస్తుతం ఇప్పుడు మత సామరస్యం అనే అంశం గురించి చర్చిద్దాం.

మత సామరస్యం :

ఆదర్శ సమాజంలో శాంతి నెలకొల్పుటకు, స్నేహ భావాన్ని పెంపొందించుటకు మతసామరస్యం అవసరం. సర్వమతాల సారమొక్కటేనని గ్రహించి మైత్రీభావంతో మెలగాలి. ఒక మతంకంటే వేరొక మతం గొప్పదని వాదించుట అవివేకం. పరమత సహనంలేని మానవుడు పశువుతో సమానం. దురదృష్టవశాత్తూ స్వార్థ సంకుచిత స్వభావాలు గల మూర్ఖులమూలంగా అనేక మారణ హోమాలకు మతమే కారణమైంది.

మనమంతా మనుషులం. మానవత్వమే మనకున్న ఏకైక మతం. ప్రతి మతంలో మంచి చెడ్డలుంటాయి. మంచితనం, మానవత్వంలేని మతం సంస్కరించ బడాల్సిందే. 'మంచిచెడ్డలు రెండే మతములు' అనే సూక్తికి తిరుగులేదు. మంచి ఏ మతంలో ఉన్నా స్వీకరించాలి. చెడు ఏ మతంలో ఉన్నా తిరస్కరించాలి. మతాన్ని

మారణ కాండకు సాధనంగా మలచుకోవద్దు. మంచికి వాడని మతం నిరుపయోగం. ఓర్పు, సహనం, శాంతి, క్షమ, దయ మనలో ఉంటే మతకలహాలు జరుగవు. గతంలో ఎప్పుడో ఎక్కడో ఎవరో ఏదో చేశారని ఇప్పటి వాళ్ళను బాధ్యుల్ని చేసి బాదపెట్టకూడదు. ప్రజలు శాంతి సామరస్యాల కోసం కృషి చేయాలి. తల్లిగర్భంలో ఉండే బిడ్డకు ఏ మతం లేదు. తాను ఫలానా మతంలో పుట్టాలని కోరుకొని పుట్టరు. తర్వాతనే ఈ కులాలు, మతాలు. ఇవన్నీ మానవుడు కల్పించినవే తప్ప భగవంతుని దృష్టిలో అందరూ సమానమే! మానవుల్లో ఒకరివల్ల ఒకరికి ప్రేమానురాగాలు ఉంటే వారి జీవితాలు స్వర్గమయమే! దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు చెప్పినట్లు

'మతమన్నది నీ కంటికి మసకైతే
మతమన్నది నీమనసుకు మచ్చైతే
మతంవద్దు, గితం వద్దు - మాయామర్మం వద్దు'

మాటలు అక్షరసత్యాలు .

మొదటి నుండి మనదేశం విభిన్న మతాల కలయిక. 'భిన్నత్వంలో ఏకత్వం - ఏకత్వంలో భిన్నత్వం' అనేవి భారతదేశానికి మాత్రమే సొంతం. ఇక్కడ హిందూ ముస్లిం భాయీ... భాయీ... నినాదం భారతదేశంలో అణువణువునా వినిపిస్తుంది. ఇదే మతసామరస్యం. మత సామరస్యానికి నిలువెత్తు నిదర్శనాలు ఎన్నో కనిపిస్తాయి. ఉదాహరణకు బీహార్ రాష్ట్రంలో 'యారి' అనే గ్రామంలో ఒక మసీదు ఉంది. వందల సంవత్సరాల చరిత్రగల మసీదు అది. ఆ మసీదు బాధ్యతల్ని ఇప్పటికీ హిందువులే నిర్వహించడం విశేషం. అంతెందుకు నిన్నా మొన్నా దేశంలో కరోనా విలయతాండవంతో లక్షలాది మంది చనిపోవడం మనకు తెలిసిందే! కరోనా సోకి చనిపోయిన కొంతమంది దహనసంస్కారాలను రక్త సంబంధమున్న వారే భయపడి జరిపించలేకపోవడం మనందరం చూసాం. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో చాలామంది ముస్లిం యువకులు హిందువుల దహన సంస్కారాలు చేశారు. చాలా సందర్భాల్లో మన దేశంలో మతసామరస్యం వికసించి యావత్ప్రపంచాన్ని అబ్బుర పరిచింది.

తులసి వనంలో గంజాయి మొక్కల్లాగా ఎక్కడో ఒక్కచోట మతోన్మాదులు మనకు కన్పిస్తారు. వారే తన స్వార్థం కోసం పదిమందిని మతోన్మాదులుగా మార్చడానికి ప్రయత్నిస్తారు. ఈ స్వార్థమే మనిషిని నిరంకుశున్ని చేస్తుంది. ముఖ్యంగా అధికారం కోసం రాజ్య పరిపాలన విషయంలో కూడా ఈ మతమే నిరంకుశమైన పెత్తనాన్ని చెలాయిస్తుంది. ప్రపంచంలో మతాల పేరిట అనేక యుద్ధాలు జరిగాయి. ఒక్కో దేశంలో ఒక్కొక్క మతం ఆరాధింపబడుతూ వస్తుంది. రాజ్యాన్ని పాలించేవారు ఒక మతాన్ని అవలంభిస్తే ఆ మత వ్యాప్తికే కృషి చేస్తూ వచ్చారు.

ఇలాంటి సమయాల్లో ఎందరో సంఘసంస్కర్తలు మత సామరస్యానికి కృషి చేస్తారు. ప్రజల్లో సమతను, మమతను పెంచడానికి ప్రయత్నించారు. అలాంటి వారిలో తెలుగు నేలలో ముగ్గురు మహోన్నతవ్యక్తులు ఉద్భవించి సర్వమత సమానత్వానికి పాటు పడ్డారు. వారు తాళ్లపాక అన్నమయ్య, వేమన, పోతులూరి వీరబ్రహ్మంగార్లు.

ఈ నేపథ్యంగా పల్లేటి లక్ష్మీకులశేఖర్ ఈ ముగ్గురు చేసిన మత సామరస్యాన్ని అన్నమాచార్య, విశ్వకవి వేమన, వీరబ్రహ్మం నాటకాల ద్వారా తెలియజెప్పారు. అన్నమయ్య

బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే
కందువగు హీనాధికములిందులేవు...

అంటూ ఎలుగెత్తి చాటాడు. పల్లేటి అన్నమాచార్య నాటకంలో అన్నమయ్య తన సంకీర్తనలో సంస్కరణా భావాలు వెదజల్లారని, ఆయన దృష్టిలో మానవులంతా సమానులేనని, భగవంతుని దృష్టిలో కులమతాలు లేవని చెబుతూ సర్వమానవ సమానత్వాన్ని వేషభాషలు, జీవన విధానం, వ్యక్తిత్వం - ఈ అంశాలన్నీ కూడా తాళ్ళపాక వంశస్థులు రాసినట్లుగా రాసినా అప్పటి సామాజిక

వైరుధ్యాలను తగ్గించడానికి అన్నమయ్య చేసిన సంస్కరణా విధానాలను చెప్పి, అవి ఈనాటి సమాజానికి కూడా మార్గదర్శకాలే అని నిరూపించే ప్రయత్నం చేశారు.

కం. మొదటను మతమున్ వదలక
తుదనెవ్వరి మతమునైన దూషింపక తా
పదిలుఁడయి కొక్కిఁగోరక
ముదమున జరియించు బుధుఁడే ముఖ్యుఁడు వేమా!

- వేమన పద్యరత్నాకరం 251

ఆ.వె. మతము లెన్నియైన సతములు కావని
సతము కర్మమగును జగతి యందు
అన్ని మతములందు నరయ నొక్కటిలేదు
విశ్వదాభిరామ వినురవేమ!

- వేమన పద్యరత్నాకరం 723

అంటూ మతాలే శాశ్వతాలు కావని వేమన ఉద్ఘాటించారు. వేమన సర్వమత సమానత్వాన్ని ప్రబోధిస్తూ ఆనాటి సమాజంలో ప్రజలకు ఒక సామాజిక స్పృహ కల్గించడానికి ప్రయత్నించారని పల్లేటి 'విశ్వకవి వేమన' నాటకం ద్వారా తెలియజెప్పారు. వేమన కాలంనాటి ప్రజలు కులాల కుమ్ములాటలతో, మతాలు మారణహోమాలతో, ధనిక దారిద్ర్య వ్యత్యాసాలతో, మూఢవిశ్వాసాలతో, ఈర్ష్యా ద్వేషాలతో మానవత్వం మంటగలిపి నీతి బాహ్యులై చరిస్తున్న సమయంలో వేమన కుల మత రహితమైన నవ సమాజ నిర్మాణానికి నాంది పలికాడని, అజ్ఞానంతో మతమనే అహంకారంతో విర్రవీగే మూఢజనులకు చెప్పుదెబ్బ కొట్టినట్లు చెప్పారని, మతాన్ని తాత్విక దృష్టితో పరిశీలించి సంఘంలో చైతన్యం రావడానికి, కుల మతాలతో శిథిలమైపోతున్న సమాజాన్ని సంస్కరించడానికి ప్రయత్నించాడని ఈ నాటకం ద్వారా ప్రబోధించారు.

మానవుడు స్వేచ్ఛాజీవి కాని మతోన్మాదంతో ఉన్మత్తుడు కారాదంటూ వీరబ్రహ్మేంద్రస్వామి మత సామరస్యానికి కృషి చేసినట్లు ఆయన రచనల ద్వారా వెల్లడవుతుంది. ఆయన కాళికాంబా సప్తశతిలో

ఆ.వె. మతము మత్తుగూర్చు మార్గమ్ము కారాదు
హితము గూర్పవలయు నెల్లరకును
హితము గూర్పలేని మతము మానగవలె
కాళికాంబ! హంస! కాళికాంబ! ప: 694

ఆ.వె. సర్వ మతములందు సారమ్ము గ్రహియించి
ఐకమత్య మార్గమనుసరించి
క్రించుదనము మాని ప్రేమించుకొనమేలు
కాళికాంబ! హంస! కాళికాంబ! ప: 379

పై పద్యాల ద్వారా అన్ని మతాల్లో ఉన్న సారమొక్కటే నన్న సత్యాన్ని బ్రహ్మంగారు స్పష్టపరచారు. బ్రహ్మంగారి జీవితంలో చెప్పదగిన ఘట్టాలలో మహమ్మదీయ మతానికి చెందిన సిద్ధయ్యను ప్రియశిష్యునిగా చేసుకోవడం సిద్ధయ్యతో కలసి హిందూ మహమ్మదీయ సఖ్యత కోసం నవాబుల ఆస్థానాలను దర్శించి వారికి జ్ఞానబోధలు చేశారు.

కులశేఖర్ 'వీరబ్రహ్మం' నాటకంలో వీరబ్రహ్మంగారు హిందూ మహమ్మదీయ మతసామరస్యానికి చేసిన పోరాటాన్ని, సర్వమతాల సారమొక్కటేనని ఐకమత్యంతో సత్యమార్గంలో ప్రయాణించమని, అల్లా అయినా ఆదినారాయణుడైనా ఒక్కటేనని సమభావాన్ని ప్రదర్శించిన తీరును చక్కగా చిత్రించారు. రచయిత ఆనాడు బ్రహ్మంగారు ప్రజల్ని చైతన్యపరచిన సంఘటనల్ని గుర్తు చేసి నాటి ఉపయోగాన్ని ఇప్పటి సమాజానికి అన్వయించే ప్రయత్నాన్ని చేశారు.

హిందూ ముస్లింల మధ్య గట్టి సంబంధాలను పెంపొందించడానికి పల్లేటి 'అణుబంధం' అనే సాంఘిక నాటిక రాశారు. దేశభక్తిని ప్రధానాంశంగా తీసుకొని హిందూ-ముస్లింల మధ్య బంధాన్ని మరింత ప్రతిష్టపరిచే విధంగా నాటిక కొనసాగుతుంది. హిందూ అమ్మాయికి, ముస్లిం అబ్బాయికి మధ్య వివాహ సంబంధం ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో ఇందులో ప్రధానంగా చర్చింపబడుతుంది. సమైక్య అనే హిందూ అమ్మాయిని

ప్రేమించి పెండ్లి చేసుకొని ఆమెకు బాసటగా నిలిచిన సలీమ్ హిందూ ఆచారాలను గౌరవిస్తాడు. భార్యా భర్తలిద్దరూ మతాలకతీతంగా ప్రవర్తిస్తూ ఒకరి మతాన్ని మరొకరు గౌరవించుకుంటారు. ఆ నాటికలో సలీం, సమైక్యలు దేశభక్తికి, మత సామరస్యానికి ప్రతీకలుగా నిలిస్తే వారికి సహాయంగా సమైక్య తండ్రి మోహన్‌దాస్ నిలబడతాడు. మతాలు వేరైనా మనుసులు ఒక్కటే! ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకోవడం వల్ల ఏ గొండవలు రావు. ఇలా దేశమంతా అనుకొని ముందుకు సాగితే సమక్ష్యత వర్ధిల్లుతుంది. మత కలహాలు, కుల పోరాటాలు ఉండవు. ఇదే అసలైన సాంఘిక విలువ. ఈ విలువకు ప్రత్యక్ష ఉదాహరణలు సలీం, సమైక్యలు. వారిలాగా ఆధ్యాత్మిక చింతనలో గాని, భౌతిక జీవనంలో గాని, ఒకరి మనసులోని అభిప్రాయాలను మరొకరు గౌరవించుకొంటూ జీవనాన్ని ఆనందంగా గడపడమే ఈనాటిక ప్రధాన ఆశయం. సమాజంలోని వ్యక్తులు, కులమతాలకు అతీతంగా, సమానంగా ఉండాలని, అందరి జీవితాల్లో సౌభాగ్యం నిండాలనే మహోత్త ఆశయాన్ని పల్లేటి లక్ష్మీకులశేఖర్ ఈ నాటిక ద్వారా తెలియజేశారు. పల్లేటి నాటికలో సమైక్య పాత్ర ద్వారా సేవలను ప్రతిపాదిస్తాడు. వీరంతా భారతదేశానికి తమ తమ రంగాల్లో సాంఘిక విలువలకు కట్టుబడి, మత సామరస్యాన్ని గౌరవించి, అందరినీ కలుపుకొని జీవితాన్ని కొనసాగించినవారేనని వారితో ప్రతి ఒక్కరికీ ఏదో రూపంలో అనుబంధం కొనసాగుతూనే ఉందని రచయిత అభిప్రాయాన్ని చెప్పారు.

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో కవులు రచయితల పాత్రకేయుల పాత్ర

– ప్రత్తిపాటి సుభాషిణి, తెలుగు ఉపాధ్యాయిని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యాజలి, కర్లపాలెం మండలం, బాపట్ల జిల్లా.

అనలు ఆదర్శసమాజం అంటే ఏమిటి? అని ఆలోచిస్తే.. ఏ సమాజం లోనైతే ప్రతీ ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం తో ఉండి, శాంతియుతంగా జీవనాన్ని గడుపుతారో అది అని క్లుప్తంగా చెప్పవచ్చు. అంతర్లీనంగా అందులోనే వ్యక్తి స్వేచ్ఛ, పరస్పర సహకారం, గౌరవం, విశ్వాసం, నైతిక విలువలు, నిజాయితీ,నిర్భయత, సమన్యాయం వంటి అనేకభావనల సమ్మిశ్రమం ఉండి తీరుతుంది. అయితే ఇలాంటి ఆదర్శ సమాజ నిర్మాణంలో అనేక ఆంశాలున్నప్పటికీ మరీ ముఖ్యమైన భూమిక వహించే వారు సమాజ హృదయంగా చెప్పదగిన వారు మొదట కవులు ఆ వరుసలోనే రచయితలు, పాత్రికేయులు ఉంటారు.

ఈ కలం సేన ఎలా సమాజ నిర్మితికి మూలస్థంభాలు అంటే మనం కొద్దిపాటి విశ్లేషణచేయవలసిందే!

అనలు సాహిత్యం అంటేనే స''హిత'' భావాల సమాహారం. కవి హృదయం చూడలేని పార్శ్వం ఏదీ లోకంలో లేదు. ప్రకృతి తాదాత్మ్యతలో పరువులెత్తే కవి కలం లలిత భావాల సుమపరిమళమైతే..., కళ్ళెదుట జరిగే లోకపుటన్యాయాలను ధిక్కరించడంలో అగ్ని కణాలను వెదజల్లే కాగడా అవుతుంది. మనసులలోని మకిలిని కడిగేసే ఉప్పెనవుతుంది, నిబిడాంధకారంలో మూఢాచారాల జడిలో పడి తిరిగే సంఘాన్ని అక్షర సూర్యులై ఉదయించి జాగృతం చేస్తారు కవులు.

యుగాల చరిత్రను కవిత్వీకరించి పద్యంగానో, గేయంగానో, పాట గానో వచనంగానో విరచించి విశ్వ హితం కోరుకునే విధాతలు కవులు. తరాల అంతరాలను, సంస్కృతి ని, సంప్రదాయాలను, అన్నింటికీ మించి మానవీయ విలువలను, మానవతా పరిమళాలను సున్నితంగా ఆత్మను స్పృశించేలా చెప్పే పదాల అల్లికే కవనం. మనిషి భావోద్వేగాలను నియంత్రించే శక్తి కవిత్వానికుంది. భాషా సౌందర్య ప్రభతో చేసే మధు రోహల సేద్యం కవిత్వం.కవులది జగమంత కుటుంబం. వారిలో అధికులు విశ్వనరులే. తన అనుభూతులను, అనుభవాలకు మాత్రమే పరిమితమైన కవులు ఉం డవచ్చు. కానీ విశ్వంభర గురించి , మానవ జాతి శ్రేయం గురించి కలలు కని, పాఠకుల మనసుల్ని తడిపి, తడిమి, తట్టి లేపిన ఎందరో కవులలో కొందరి రచనలను రేఖా మాత్రంగా మనం ఇపుడు పరిశీలిద్దాం.

పదకవితా పితామహుడు అన్నమయ్య కీర్తనలు చూస్తే భక్తి, శృంగార కీర్తనలతో పాటు ఆనాటి సమాజంలోని అసమానతలను ఖండించిన కీర్తనలు కనబడుతాయి. ఈనాటికీ మనం ఉదహరించే ఆ కీర్తన....ఇలా ఉం టుంది.

తందనాన అహి..... కీర్తనలో
నిండార రాజు నిద్రించు నిద్రయునొకటే
అండనే బంటు నిద్ర అదియూనొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే
ఛండాలుడుండేటి సరిభూమీ ఒకటే.

ఇది ఆదర్శ సమాజాన్ని కాంక్షించిన కవి మాట.

తెలుగునాట అక్షరం తెలియని వారు ఎందరో ఉం డవచ్చు కానీ....ఒక్క వేమన పద్యమైనా రాని వారు ఉండరనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అట్టి "ప్రజాకవి" వేమన పద్యాలకు మించిన సంఘసంస్కరణ మరెక్కడా కనిపించదని నా విశ్వాసం. వేమన కాలంలో సంఘంలో ఉన్న దుర్వ్యసనాలు, స్త్రీ లోలత్వం, కుల వ్యవస్థ, మూఢాచారాలు,దురాశ వీటిపై వేమన చెప్పిన ఒక్కో పద్యం ఒక్కో శతఘ్ని. ఎన్ని చెప్పినా వినని మూఢుల గురించి ఇలా అంటారు వేమన.

ఎలుక తోలు తెచ్చి ఏడాది ఉతికినా..
నలుపు నలుపే గాని తెలుపు రాదు
కొయ్య బొమ్మ దెచ్చి కొట్టిన పలుకునా..!

ఇన్ని శతాబ్దాల తర్వాత కూడా ఇంకా వినని కొయ్య బొమ్మలు మనకు కనబడుతున్నాయి.

ఆదర్శ మానవుని లక్షణాలను ఎన్నో పద్యాలలో చెప్పారు. అందులో కొన్ని.

కోపమున ఘనత కొంచమ్ పోవును..//
ఇనుము విరిగెనేని(మాటతీరు గురించి)//
అనువు గాని చోట అధికులమనరాదు//
దురాశ గురించి....
నీళ్ళలోన మీను నెరిమాంస మాశకు....//

ఇలా ఎన్నో ఉదాహరణలు చెప్పవచ్చు.

శతాబ్దాల బానినత్వపు న్తబ్ధతను పారద్రోలి ఉద్యమానికి తొలి ఊపిరై నిలచి, దేశ స్వాతంత్ర్య పోరాటానికి పట్టుగొమ్మై నిలచిన దేశమాతకు బంకించంద్ర కవి ఇచ్చిన అక్షరనివాళి "వందేమాతరం"....ఎన్ని వేల మాటలు చెప్పినా గీతం గురించి తక్కువే కదా! వందే మాతరం అన్న ఒక్కమాట వేల గుండెల్ని చైతన్యంతో ఉప్పొంగించిందో కదా!!

తెలుగు నాట
చేయెత్తి జైకొట్టు తెలుగోడా....,
మా కొద్దీ తెల్లదొరతనము.....

వంటి గేయాలు ఉద్యమాలకు ఊపిరిలూదాయి కదా!

అంతర్ముఖీన కవిత్వం ఉన్నా అందులో కవి ప్రపంచ సమస్యల పట్ల తన హృదయ స్పందన ను తెలపడం అవి సమాజంలో ఓ భావవిప్లవానికి, ఓ మార్పుకు శ్రీకారం అవడం చూస్తాము. మహాకవి గురజాడ వారి పూర్ణమ్మ , కన్యక ఆడపిల్ల పట్ల సంఘం చూపును మార్చినదనడం నిర్వివాదాంశం. మూఢాచారాలను, అంటరానితనాన్ని ధిక్కరించిన కవికోకిల గుఱ్ఱం జాషువా. కరుణ తొణికిసలాడే వీరి కవిత్వం ఫిరదౌసి, గబ్బిలంలో సుస్థిరమైంది. అలాగే అభ్యుదయ మహాకవి శ్రీశ్రీ తెంచినది ఛందస్సంకెలలు మాత్రమే కాదు, పాతుకుపోయిన సంప్రదాయపు సంకెళ్ళు, పెత్తందారీ భావజాలాన్ని కూడా. పాలాలనన్నీజి హలాలదున్నీ..... కార్మిక వీరుల కాయము నిండా.... ఘర్మజలానికి ,ధర్మజలానికి ఖరీదు కట్టే షరాబు లేడోయ్ (ప్రతిజ్ఞ)

పదండి ముందుకు పదండి తోసుకు
పోదాం పోదాం పైపైకి...(మహాప్రస్థానం)
నేను సైతం.... ప్రపంచాగ్నికి (జయభేరి)

ఇలా వెలుతురు బావుటాలను ఎగురవేసిన కవి శ్రీశ్రీ.

ఇక రచయితల విషయంపరిశీలిద్దాం. సమాజంలో వేళ్ళూనుకున్న వినిమయ సంస్కృతి ని, పాతుకుపోయిన పితృస్వామ్య భావజాలాన్ని, జుగుప్సాకరమైన కట్టుబాట్లను ,మూఢాచారాలను, ఆంగ్లభాష పై మోజును, స్త్రీల దుస్థితిని తన కలం బలంతో అత్యద్భుతమైన సంభాషణలతో, పాత్రలతో సృజించిన సంఘసంస్కర్త మహాకవి గురజాడ అప్పారావు గారు. వీరి కన్యాశుల్కం తరువాత సమాజంలో కన్యాశుల్కం నశించిపోయిందనే చెప్పాలి. గిరీశం, మధురవాణి, సౌజన్యరావు పంతులు ఏ పాత్రకు ఆ పాత్ర అద్వితీయమని చెప్పవచ్చు.

కుల వ్యవస్థ, సామాజిక అన్యాయాలపై ఉద్యమించడమే కాక ఆచరణలో పెట్టిన కవిరాజు శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి గారు. వీరి రచన...

వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వడొ తెల్పుమీ..."

అత్యద్భుతమైనది. సమాజంలో మార్పు కోసం కథలు, నవలలు, నాటకాలు,వ్యాసాలు వ్రాసిన రచయితలు ఎందరో. పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు, సాక్షి వ్యాసాలు, కందుకూరి వీరేశలింగం పంతులు గారు,ఉన్నవలక్ష్మీ నారాయణ గారు, ఉప్పల లక్ష్మణరావు గారు, త్రిపురనేని గోపీచంద్, బుచ్చిబాబు, ఇలా ఎందరో

రచయితలు ఆదర్శ మానవ సమాజ నిర్మితికి తోడయ్యారు. వారు దర్శించిన సమాజంలోని సంఘటనలను, వ్యక్తులను, లోపాలను, స్త్రీ పురుష సంబంధాలను, సామాజిక అసమానతలను తమదైన శైలిలో వ్యాఖ్యానించారు, చిరంజీవులు అయినారు.

పాత్రికేయులు :

సంఘసంస్కరణ చైతన్యం తెచ్చినా, దేశభక్తిని ప్రేరేపించినా.., స్వేచ్ఛ విలునుప్రబోధించినా, సమానత్వాన్ని ప్రకాశింపజేసినా, విశ్వాసదీపికలను వెలిగించినా, జాగృతికి రెక్కలుతొడిగినా అదంతా పాత్రికేయుల కలం బలమే. ఆ పాళీ రెండంచుల కత్తిలాటిది. దమననీతిని,ద్వంద్వ వైఖరులను చీల్చే అల్లూరి బాణపు ములుకు లాటి పలుకో వైపు, సమకాలీన వ్యవహారాలపై సమగ్ర నివేదికలు ఒక వైపు, ప్రపంచంలో మనమెక్కడున్నామో తెలిపే స్వీయ అవగాహన ఇంకొక వైపు. హితబోధ చేసే వార్తలు వ్రాసే పాత్రికేయులు చాలా చాలా మంది ఉన్నారు. కందుకూరి బాల్యవివాహాలు వద్దంటూ సాహిత్యం ద్వారా సతీహిత బోధిని పత్రికనునడిపారుప్రజలలో రాజకీయ, సాంఘిక చైతన్యంరేకెత్తించిన ఆయుధంగా గోల్కొండ పత్రికను తయారుచేసిన సురవరం ప్రతాపరెడ్డి గారు.(1896-1953)నైజాంపాలనకు వ్యతిరేకంగా పోరాడారు.

న్యాపతి సుబ్బారావు గారు (1856-1941) :

ది హిందూ పత్రిక సంపాదకులు, స్వాతంత్ర్య సమర యోధులు గా ఎనలేని కృషి చేశారు. అలాగే శివలెంక శంభుప్రసాద్ గారు ఆంధ్రపత్రిక మరియు భారతి పత్రికను నడిపారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే సంఘటనలు, భిన్న కోణాల్లో పరిస్థితుల విశ్లేషణ, ప్రజా జీవితాన్ని మార్చే ప్రపంచవ్యాప్తసంఘటనలు, ఇలా అన్నీ పాత్రికేయులతోనే సాధ్యం.

పత్రికలు, పాత్రికేయులు లేకుంటే ఈ లోకం అమాయకంగా ఉండిపోవలసి వచ్చేదేమో!!! ప్రపంచానికి తాము చెప్పాలనుకునే విషయాన్ని బలంగా చెప్పే రచయితలు, శబ్ద సౌందర్యం తో మనసుకు హత్తుకునేలా కవిత్వం సృజించే కవులు, సాంఘిక,నైతిక విలువలను, సంస్కృతి సాంప్రదాయాలు, జ్ఞానాన్ని అందించే పాత్రికేయులు అందరూ ఆదర్శ సమాజ నిర్మాణంలో కీలకపాత్రలు పోషించేవారే. అజ్ఞానంధకారంలో ఉన్న సమాజానికి వెలుగురేఖల్ని పంచిన సాహితీ సూర్యులు ఎందరో. ఉత్సాహాన్ని రేకెత్తించి, ఓ ఆలోచనను మొలకెత్తించి, ఉప్పెనలా ఉద్యమాలను పరుగులెత్తించిన కలాలది ఒకటే బలం ఆత్మబలం. ఒకటే భాష అది విశ్వభాష. అక్షరాలది మౌన భాష. అది తెచ్చే మార్పే పర్జన్య గర్జన. అది శబ్దస్పర్శ.

పరిశీలన గ్రంథాలు :

1. వేమన శతం - వేమన
2. మహాకవి శ్రీశ్రీ - బూదరాజు రాధాకృష్ణ
3. తెలుగు సాహితీ వేత్తల చరిత్ర - ముప్పల సుబ్బరామయ్య..

❖❖❖

ఎం.వి.ఆర్. శంఖారావం వ్యాస సంపుటి - సామాజిక పరిశీలన

- యస్. గంగాధర రెడ్డి, పరిశోధక విద్యార్థి (ఎస్.ఆర్.ఎఫ్), తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

తెలుగు సాహిత్యంలో మార్క్సిస్టు దృక్పథంగల ప్రముఖ రచయితలలో డా॥ ఎం.వి.ఆర్. ఒకరు. ఈయన కడప జిల్లాలో 1944వ సంవత్సరంలో జన్మించారు. తన జీవితంలో చివరి నిమిషం వరకు అక్షరమే శ్వాసగా జీవించారు. వీరు కథకుడుగా, వ్యాసకర్తగా, పత్రికా సంపాదకుడుగా, విమర్శకుడుగా, అనువాదకుడుగా, ఉద్యమకారుడుగా, ట్రేడ్ యూనియన్ నాయకుడుగా, వైద్యుడుగా, లాయర్‌గా వివిధ రంగాలలో విశిష్ట సేవలందించారు.

ఎం.వి.ఆర్. రచనలలో శంఖారావం వ్యాస సంపుటి ఒకటి. ఇందులో స్త్రీలకు సంబంధించిన అంశాలు విద్య, నీటిపారుదల, భాషాంశాలు, మూఢవిశ్వాసాలు, పరిపాలన, రాయలసీమ అస్థిత్వం, వ్యవసాయం, రాష్ట్ర విభజన, శాస్త్రీయ విజ్ఞానం మొదలైన అంశాలను గురించి వివరించే దాదాపు 64 వ్యాసాలున్నాయి. ఇవన్నీ మార్క్సిజం దృక్పథం, సైన్సు చూపుతో డాక్టర్‌గారు విమర్శనాత్మకంగా, నిగూఢంగా, సునిశితంగా రాశారు. ఈ వ్యాసాలను 7 రకాలుగా విభజించవచ్చు.

మగ పార్లమెంటులో మగువల బిల్లు :

పార్లమెంటులో 33% మహిళా రిజర్వేషన్ బిల్లు వాయిదా పడటానికి గల కారణాలను సహేతుకంగా రచయిత ఈ వ్యాసంలో వివరించారు. ఈ బిల్లు పాస్ అయితే ఎన్నికల్లో పోటీ చేసే కొందరి పురుషుల స్థానాలకు గండి పడే విషయం వాస్తవమైన ఈ బిల్లు ఆమోదం కోసం రాజ్యాంగాన్ని సవరించవలసిన అవసరం లేదని అందుకోసం స్త్రీలకు ఎన్నికల్లో కొన్ని ఎక్కువ స్థానాలు కల్పిస్తే సరిపోతుందంటాడు రచయిత.

చట్టసభల్లో కూర్చోవాలనే కుతూహలం కొంతమంది హైక్లాస్ సొసైటీ మహిళలలో తప్ప మిగతా మహిళలలో లేదని పేర్కొంటాడు డాక్టర్ గారు. ఎందుకంటే మహిళా బిల్లును వ్యతిరేకించిన శరత్ యాదవ్, ములాయం సింగ్ పార్టీలు ఎన్నికల్లో గెలిచాయని చెప్తాడు. అంతేకాదు స్త్రీలు ఉన్నత పదవులు నిర్వహించాలంటే వారికి రిజర్వేషన్లు కాదు, ఆర్థిక స్వాతంత్ర్యం, విద్య, మంచి కుటుంబ వాతావరణాన్ని కలిగుండాలని ప్రస్తావిస్తూ ఈ సౌకర్యాలు కలిగి ఉండి, దేశంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన ఇందిరా గాంధీ, గోల్డామెయిర్, బెనజీర్ బుట్టో, హసీనా బేగమ్, మార్గరెట్ థాచర్ మొదలైన మహిళలను గురించి ఈ వ్యాసంలో పరిచయం చేస్తాడు.

నీటిపారుదల, నీటి రాజకీయాలకు సంబంధించిన వ్యాసాలు :

రొచ్చు గుంతలో చేపల వేట :

నాగరికతకు మూలాధారమైన నీటి కోసం కర్ణాటక మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జరిగే కోట్లాటలను రచయిత చాలా వ్యంగ్యంగా చిత్రించారు. నీటి కోసం జరిగే పోరాటాలు ఆధునిక చరిత్రలో అనంతం కాబోతున్నాయని భవిష్యత్ పరిణామాన్ని వివరించే క్రమంలో వనరులు తగ్గే కొద్దీ తగవులు ఎలా తీవ్రతరమవుతాయో చాలా చక్కగా విశ్లేషించారు. ఒక ప్రాంత ప్రజల మరో ప్రాంత ప్రజలను ద్వేషించే పరిస్థితులను సృష్టిస్తున్నది స్వార్థపరులైన రాజకీయ నాయకులేనని రచయిత ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రజలు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని రచయిత సూచిస్తాడు.

పోలవరం ప్రాజెక్టు మాటున పొంచి ఉన్న ప్రమాదం :

వృథాగా పోతున్న గోదావరి జలాల నీటి వినియోగానికి ఆయువు పట్టు అయిన పోలవరం ప్రాజెక్టులో సాధక బాధలను రచయిత పేర్కొన్నాడు. పొరుగు రాష్ట్రాలతో

చేసుకున్న ఒప్పందాలు వాటితో ఎదురయ్యే సమస్యలు భవిష్యత్తులో రాబోయే ఇబ్బందులు మొదలైన వాటిని అద్భుతంగా వివరించారు. పోలవరం ప్రాజెక్టు దవళేశ్వరం ప్రాజెక్టు లాగా డైవర్షన్ సిస్టమ్ లాగా కాకుండా పరిపూర్ణ మైన ప్రాజెక్టు లాగా అన్ని వర్గాలకు ఉపయోగపడాలంటే ఆసరాగా ఇచ్చంపల్లి దగ్గర రిజర్వాయర్ నిర్మించాలనే రచయిత ఇచ్చిన సూచన అత్యంత ముఖ్యమైనది. సాగునీటి ప్రాజెక్టులపైన వాటి ద్వారా ఏయే ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుందో రచయితకున్న సమగ్రమైన అవగాహన ఈ వ్యాసంలో వ్యక్తమవుతుంది.

తెలుగు గంగ పబ్లిసిటీతో కొనితెచ్చుకున్న తంటా :

తెలుగు గంగ ప్రాజెక్టుపైన అవసరానికి మించిన ప్రచారం ప్రజల ప్రయోజనాలను ఎలా దెబ్బతీసిందో ఈ వ్యాసంలో వివరించబడింది. ఈ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒక్కటే నిర్మాణం చేస్తుందనీ అనవసరమైన పబ్లిసిటీ, పాలకుల అత్యుత్సాహం ద్వారా ఏర్పడిన వివాదానికి ఆంధ్ర రాష్ట్రం సుప్రీంకోర్టుకు సరైన సాధానం ఇవ్వలేకపోవడం, తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా రాయల సీమలో ఒక్క ఎకరాకు నీరు అందకపోయినా రాష్ట్రాన్ని మొత్తం ఇతర రాష్ట్రాల దృష్టిలో ఎలా దోషిగా నిలబెట్టిందో ఈ వ్యాసంలో రచయిత చక్కగా విశ్లేషించారు.

నదీ జలాలు, మనమూ అమెరికా :

కరువు కాటకాలు మనకు మాత్రమే చుట్టాలు కాదని ప్రపంచంలో అగ్రగామిగా నిలిచిన అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో సైతం ఓక్లహామా, ఆర్కన్‌సన్ ప్రాంతాలు ఒకప్పుడు దుర్భర జీవితాన్ని గడిపేవి. ఆ తర్వాత 1943-47లో ఆరాష్ట్ర గవర్నర్ రాబర్ట్ శ్యామ్ పట్టుదల, సంకల్పం, ప్రజల సహకారంతో (మరొక్క మనిషికి ఆహారంగా మారే ఏ ఒక్క నీటి చుక్కను వృథా చేసే హక్కు ఏ మనిషికి లేదనే నినాదంతో) ఆ ప్రాంతాలన్నింటినీ నీటి పారుటం ద్వారా సస్యశ్యామలం చేశారు. అలాగే దక్షిణాది రాష్ట్రాల్లో సాగునీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకొని, సాగునీటి సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో రచయిత ఈ వ్యాసంలో స్పష్టంగా తెలిపాడు. సాగునీటి ప్రాజెక్టులపై అపారమైన అవగాహనకు ఈ వ్యాసం అద్దంపడుతుంది.

శ్రీశైలం జలాశయం మీద రాయలసీమ హక్కు తిరుగులేనిది :

శ్రీశైలం జలాశయంపై రాయలసీమ వాసుల హక్కు తిరుగులేనిదనీ రచయిత చారిత్రకంగా నిరూపించారు. కోస్తా వారు తమ ప్రాబల్యంతో ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్న వారిపై ఒత్తిడి తెచ్చి రాయలసీమకు రావాల్సిన వాటాను బలవంతంగా దోచుకుపోతున్న విధానాన్ని రచయిత సూటిగా ప్రశ్నించాడు.

పరిపాలనా రంగంలో లోపాలను ఎత్తి చూపే వ్యాసాలు :

గారడీలకు జబ్బులు నయంకావు :

మెదడువ్యాపు వ్యాధిని నిర్మూలించడంలో భాగంగా ప్రభుత్వం చేపట్టే చర్యలలో వ్యాధిమూలాలను నియంత్రించకుండా పందులను చంపటం, ఎంతవరకు సమంజసమని, దీనివల్ల పందులను నమ్ముకొని జీవనం సాగిస్తున్న కొన్ని వర్గాల ఉపాధి దెబ్బతింటుందని రచయిత ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడు అభివృద్ధి చెందిన దేశాలలో వృత్తిపరంగా పందుల పెంపకం ఉన్నా అక్కడ ఈ వ్యాధి ఎందుకులేదని అందుకు కారణం పసిపిల్లలకు - పందులకు మధ్య వారదిగా ఉన్న దోమలను నియంత్రిస్తే వ్యాధి ప్రభావాన్ని తగ్గించవచ్చని అలాకాకుండా దేన్ని లక్ష్యంగా చేసుకొనిపందులను చంపుతున్నారోనని రచయిత సునిశితంగా ఈ వ్యాసంలో విమర్శిస్తాడు.

వ్యవసాయంలో సహకారం :

సహకార వ్యవసాయంలోని లోపాలను చక్కగా రచయిత ఈ వ్యాసంలో తెలియజేసారు. యుపిఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి హామీ పథకం ద్వారా వలసలను నివారించవచ్చని భావించింది. కాని ఈ పథకం ఉద్దేశ్యం మంచిదే అయినా అందువల్ల

రైతాంగానికి ఉత్పన్నమయ్యే సమస్యలను రచయిత నిగూఢంగా ప్రస్తావించాడు.

ప్రజల్లో పనిచేసే విధానాన్ని కాక పనిచేస్తున్నట్టు నటించే విధానం, దీనివల్ల కోట్లాదిమంది ప్రజలను నిరుపయోగమైన పనులకు మళ్ళించడం ద్వారా దేశం ఆర్థికంగా దెబ్బతింటుందని రచయిత వివరిస్తాడు. ఈ పథకం వ్యవసాయ కూలీలకు కనీస కూలీ ఇచ్చేలా చేసిన రైతాంగానికి వ్యవసాయ కూలీల కొరతను సృష్టించడనడంలో ఎటువంటి సందేహం లేదు. అంతేకాక అనేక ఎకరాలున్న భూయజమానులు వ్యవసాయంపట్ల ఆసక్తిలేని వ్యక్తుల ద్వారా వ్యవసాయం నిరుపయోగమయ్యే అంశాలను రచయిత క్షుణ్ణంగా పరిచయం చేశాడు.ప్రభుత్వం ఈ సమస్యలను సున్నితంగా ఆలోచించాల్సిన అసరం ఎంతైనా ఉంది.

కొత్త పుంతల్లో బడ్జెట్ కాలక్షేపం :

పార్లమెంటులో, అసెంబ్లీలో బడ్జెట్ పేరుతో జరిగే ప్రహసనాన్ని రచయిత అద్భుతంగా వివరించాడు. ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ ఎలా ఉన్నా అధికారపక్షం బాగుందని, ప్రతిపక్షం సరిగాలేదని మాట్లాడటం సహజమని ఇవన్నీ గమనించి ప్రజలలో ఒక ఉదాసీనత ఏర్పడిందని, బడ్జెట్ సమయంలో వేతన జీవుల వ్యథలను డాక్టర్‌గారు అద్భుతంగా విశ్లేషించారు. అంతేగాక ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుత ప్రభుత్వంకంటే బాధ్యతాయుత ప్రతిపక్షం అవసరమని రచయిత ఈ వ్యాసంలో ప్రబోధిస్తాడు.

నాటువైద్యులూ, మోటు రాజకీయాలు :

ప్రజల సంక్షేమం ఏమాత్రం పట్టని మోటు రాజకీయాలు గురించి ఈ వ్యాసంలో రెడ్డిగారు పరిచయం చేశారు. సంపాదనే ధ్యేయంగా బ్రతికే 'క్వాక్'ల వలన ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, పత్రికారంగంలో 'క్వాక్'లను నియంత్రిస్తే జర్నలిజమే దేశాన్ని కాపాడుతుందని రచయిత ఈవ్యాసంలో ఉద్బోధిస్తాడు.

నల్లడబ్బు మీద యుద్ధం విజయం సాధించేనా :

ఇందులో కొత్త నోట్ల డీమానిటైజేషన్ ఎందుకు విఫలమయిందో రచయిత తెలియజేశాడు అవినీతి మయమైన యంత్రాంగంతో అనుకున్న విధానాలు అమలు ఎందుకు సాధ్యపడలేదో రచయిత క్షుణ్ణంగా తెలియజేశాడు ఈ వ్యాసంలో.

ఈ బందులు, రాస్తా రోకోలు ఏ పరమార్థం కోసం :

ఏ సంబంధంలేని సామాన్యుడు ఈ బందులవల్ల ఎటువంటి ఇబ్బందులు పడుతున్నాడోనని రమణారెడ్డి గారు ఈ వ్యాసంలో తెలిపారు. ఈ బందులు, రాస్తా రోకోలు పార్టీ అవసరల మేరకేనని, భారతదేశంలో అన్ని రాజకీయ పార్టీలు ఇటువంటి విధానంతో ఉన్నాయని రచయిత చక్కగా ఈ వ్యాసంలో విమర్శించాడు.

తాజ్‌మహల్ గెలిచింది కానీ :

తాజ్‌మహలను ప్రపంచ వింతల్లో చేర్చడానికి ప్రభుత్వం పడ్డ శ్రమను రచయిత చాలా వ్యంగ్యంగా చిత్రించాడు. గ్రీకుల కాలంలో ఒక వ్యక్తి ప్రపంచాన్ని పర్యటిస్తూ ఏడువింతలను ప్రవేశపెట్టాడు. అప్పటి నుంచి ఏడు వింతల పోటీన అలా కొనసాగుతుందని అయినా వింతలు ఏడుఎందుకు ఉండాలని అంతకంటే ఎక్కువగా ఉండవచ్చని, తెలుపుతూ ఆధునిక దేశాల మధ్య వింతల పోటీని రచయిత ఈ వ్యాసంలో సవివరంగా పేర్కొన్నాడు.

భాషకు సంబంధించిన వ్యాసాలు :

అయ్యో నా తెలుగు తల్లీ :

తెలుగు భాషను సంరక్షించుకోవాలే ఆశ, ఆసక్తి, ఆరాటం తెలుగువారిలో లోపించాయనీ ఈ వ్యాసంలో రచయిత వెల్లడి చేస్తాడు. తమిళులకు తమ భాషట్ల అమితమైన గౌరవాన్ని వివరిస్తూ మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయేటప్పుడు తెలుగువారికి తమిళ ద్వేషాన్ని కొంతమంది స్వార్థపరులు నూరిపోశారని డాక్టర్ గారు వ్యక్తం చేశారు. రచయితగా44 సంవత్సరాల సాహితీ వ్యాసంగంలో ఇప్పటికి ఒక్కసారి కూడా ప్రపంచ తెలుగు

మహాసభల ఆహ్వానం నాకు అందలేదని రమణారెడ్డి గారు సరదాగా చెప్పారు.

తెలుగు భాషకు తక్కువైంది హోదా ఒక్కటేనా :

ప్రపంచంలో అత్యంత మధురమైన భాషగా చెప్పుకొనే తెలుగు భాషకు ప్రాచీన హోదా కోసం పోరాడే నేపథ్యంలో మూలాలలోని అంతరంగాన్ని అంటే కేంద్రం నుంచి నిధుల కోసమా? భాషను రక్షించుకోవడానికా అని డాక్టర్‌గారు ప్రశ్నిసాతరు. నిధులే పరమార్థమైతే రాజకీయ నాయకులు చూసుకుంటారని రచయిత ఈ వ్యాసంలో సూచిస్తాడు. అంతేగాక తెలుగుభాష మీద అభిమానం ఇతర భాషలపై ద్వేషం కారాదని సున్నితంగా విమర్శిస్తారు. ప్రాచీన హోదా ఏ భాషకు లభించినా కూడా అందరూ ఆహ్వానిద్దాం అని రచయిత సూచిస్తాడు.

తల్లి భాష పట్ల చిన్నచూపు :

జానపదుల భాషను ఆధునికులు ఎంత వంకరగా అర్థం చేసుకుంటున్నారో రచయిత సోదాహరణంగా ఈ వ్యాసంలో చిత్రించాడు. తిక్కన సోమనలకు జానపదుల భాష ఏ విధంగా అనుసరణీయమైనదో క్లుప్తంగా రచయిత వివరించారు.

సాహిత్య బ్రహ్మోత్సవాల సందర్భంగా :

తెలుగు భాషలోని వివిధ మాండలికాలను, వేరు వేరు యాసలను గురించి అద్భుతంగా వివరించారు. ప్రాంతం ఏదైనా ఆ ప్రాంతంలోని యాసను స్పృశించాలని రచయిత వివరిస్తాడు. ఏ భాషలోని యాస తక్కువ కాదని మనమంతా తెలుగువారమేనని ఒకరి భాష, యాసను చులకన చేయడం తప్పని రచయిత సూచిస్తాడు. అంతేగాక మన నిఘంటువుల్లో పురాతన కవులు వాడిన సంస్కృత పదాలకు అర్థం చెప్పడం తప్ప తెలుగువాసన వాటికి లేదని తిక్కన మాత్రం తన పద్యాలలో తెలుగు పదాలను వాడటంవల్ల బ్రతికిపోయామని చెబుతూ మన చుట్టూ ఇన్ని సమస్యలు పెట్టుకొని నాది తెలుగు తెలుగు అని అరిస్తే ఏమి ప్రయోజనం అని ఆధునిక యుగంలో భాషాపరంగా ముందుకు పోవడానికి నిఘంటువులు తయారు చేసుకోవడం ఎంతైనా అవసరమని రచయిత వాపోతాడు.

తిక్కన మహాకవికి జరుగుతున్న అపచారం :

తిక్కన పదప్రయోగాలను ప్రశంసిస్తూ మహా భారతంలోని పద్యాలకు భాష్యాలను రాయటంలో తెలుగు పండితులు చేసిన చేస్తున్న పొరపాట్లను రచయిత ప్రస్తావించారు. ఈ పొరపాట్లను ఇప్పటి తెలుగు అధ్యాపకులు కూడా చేస్తున్నారని ఇప్పటికైనా వాటిని సవరించి తిక్కనకు అపచారం జరగకుండా చూడాలని రచయిత ఆవేదన వ్యక్తం చేస్తాడు.

రైతు సమస్యలను ప్రస్తావించే వ్యాసం :

రైతాంగాన్ని అపహాస్యం చేస్తున్న రైతు బజార్లు :

రైతు స్థితిగతులను బాగు చేయడానికి రైతుబజార్లను ఏర్పాటు చేయలేదని నామమాత్రంగా రైతు కంటి తుడుపు కోసం ఏర్పాటు చేసారని డాక్టర్ గారు అంటారు. మార్కెట్లు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఏర్పడు తాయని, పూర్వకాలంలోని వారసంతలే నేటి రైతు బజార్లుగా మారాయని రచయిత వివరిస్తాడు. ఈ వార సంతల్లో రైతులకు కనీసం త్రాగడానికి నీళ్లు, నీడ, అన్నం కల్పిస్తే అదే రైతుకు పదివేలు అని ప్రభుత్వానికి సూచిస్తాడు. రైతుల పట్ల ప్రభుత్వానికున్న ఆర్ద్రతను తట్టి లేపుతాడు రచయిత ఈ వ్యాసంలో.

రాయలసీమ అస్థిత్వాన్ని తెలిపే వ్యాసాలు :

హత్యలు రాయలసీమకే ప్రత్యేకమా? :

రాయలసమీలో ప్రజల ఉన్నతమైన మనస్తత్వాన్ని, సంస్కారాన్ని, ఫ్యాక్షనిజం, కారణాలను ఈ వ్యాసంలో రచయత పరిచయం చేస్తాడు. నువ్వు చెడ్డోనివనీ నీ చేతనే పలికించేంత చాకచక్యంగా కొందరు కోస్తా ప్రాంతంవారు రాయలసీమ చెడును రాయలసీమ వారితో ప్రచారం చేయిస్తున్నారు. లోతుగా ఆలోచించకుండా పైపైన ఆలోచించే మేధావులు ఇలాంటి విషయాలకు వత్తాసు

పలుకుతున్నారు. రాయలసీమలో కడప, కర్నూల్‌లో ఫ్యాక్షన్ వల్ల మోడుపోయిన కుటుంబాలు నిజమే కాని అంతమాత్రంచేత మనుషులను రాక్షసులుగా చిత్రించటం మంచిది కాదని, అన్ని ప్రాంతాల్లో కూడా హత్యలు జరుగుతున్నాయని విజయవాడలో వంగవీటి రాధాతో సహా ఐదుగురిని చంపటం, నిరాహార దీక్షలో వంగవీటి రంగాను, తూర్పుగోదావరిలో చేపల చెరువు తగదాలో ముగ్గురుని తల నరికి చంపటం, నరసరావుపేటలో మంత్రి భవనంలో గంపల కొద్దీ బాంబులు దొరకటం, పల్నాటి ప్రాంతంలో కూడా లెక్కలేనన్ని హత్యలు మొదలైన వాటిని పత్రికలు పట్టించుకోకుండా ఒక సీమలో జరిగే వాటిని భూతద్దంలో పెట్టి చూపించే మీడియాల చిత్తశుద్ధిని రచయిత ఘాటుగా హెచ్చరిస్తాడు.

గుంతకల్లు రైల్వే జోన్ ఎందుకు రాకూడదు :

రాయలసీమలో ప్రధాన భూభాగం గుంతకల్లు. ఈ ప్రాంతంలో మంచినీటి అవసరాల కోసం తుంగభద్ర లోలెవల్, జోన్ ఏర్పాటుకు అవసరమైన డీజల్ షెడ్, ట్రైనింగ్ స్కూల్, కార్యాలయ ఏర్పాటుకు ఖాళీ జాగా, అదనపు భూసౌకర్యంతోపాటుగా సికింద్రాబాద్ తర్వాత జోన్ మొత్తం ఆదాయంలో రెండవ స్థానంగా ఉండటం మొదలైన అనేక సదుపాయాలుండగా కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, రాయలసీమవానులు రాజకీయాలలో తలమునకలై ఉండటం వల్ల గుంతకల్లుకు రైల్వే జోన్ లభించలేదని రచయిత ఆవేదన ఈ వ్యాసంలో స్పష్టంగా ప్రస్ఫుటమవుతుందని చెప్పవచ్చు.

ఇతర వ్యాసాలు :

మన పుణ్యభూమికి శాస్త్రీయ పరిశోధన :

అన్నీ మన వేదాల్లో ఉన్నాయనే శాస్త్రీయ ఆలోచన లేకుండా ఆధ్యాత్మికతో జీవిస్తూ సాంకేతిక విజ్ఞానానికి దూరమవుతున్నామో రమణారెడ్డి గారు ఈ వ్యాసంలో వివరించారు. ఈరోజు మనం ఉపయోగించే ప్రతి వస్తువు సాంకేతిక విజ్ఞానంతోనే సంపాదించుకున్నామనీ, ఇవన్నీ పాశ్చాత్యుల సాంకేతికతోనే అందిపుచ్చుకున్నామనేది కఠోర సత్యమని అందరూ ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని రచయిత ఈ వ్యాసంలో నొక్కి వ్యాఖ్యానించాడు.

పర్వత సన్నిభులు నాగురువులు :

పుట్టపర్తి, గడియారం వేంకటశాస్త్రి మొదలైనవారు నాకు విద్య నేర్పిన గురువులు అంటారు రమణారెడ్డి గారు. వీరు నాకు అక్షరాలు మాత్రమే నేర్పించలేదని మంచినడవడిక, విషయ లోతులు పరిశీలించే సామర్థ్యం అందించారనీ, వారి ఆలోచనంతా విద్యార్థులను పెద్ద చెయ్యడం తప్ప వేరే వ్యాపకం ఉండేది కాదనీ వారి ఉపాధ్యాయుల గొప్పతనాన్ని పాఠకులతో పంచుకొన్నాడు.

నేను చదువుకొన్నది సన్యాసుల దగ్గర కాదనీ సంసారుల దగ్గరనీ, వారు ఆశించినదంతా వారి తదనంతరం వారి కుమారులు టీచర్లుగా స్థిరపడాలనీ డొనేషన్ల పేరుతో ఇంజనీర్లుగా కాదనీ, అంతేగాక తమ కూతుర్లకు వచ్చే అల్లుళ్లు కూడా టీచర్లుగా మాత్రమే రావాలని డాక్టర్ కాదనీ భావించారే తప్ప, ఆడంబరాలకు వెళ్లలేదని అందుకే నా ఉపాధ్యాయులు మహోన్నత హృదయం కలవారని రచయిత తన ఉపాధాయయుల గొప్పతనాన్ని, అభిమానాన్ని ఈ వ్యాసంలో అద్భుతంగా వ్యాఖ్యానించాడు.

బాణామతి :

మనుషుల్లో ఉన్న అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని, మానసిక బలహీనతను ఆధారంగా చేసుకొని కొంతమంది బాబాలు ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నారో ఈ వ్యాసంలో రచయిత చక్కగా విశ్లేషించారు. విజ్ఞానం మనిషి ప్రగతికి బాటలు వేయాల్సిన తరుణంలో కొంతమంది వ్యక్తులు ప్రజల్లో నెలకొన్న నమ్మకాలను, విశ్వాసాలను అవకాశంగా చేసుకొని సైన్సును తమ అవసరాలకు వినియోగిస్తు ప్రజలను దోచుకుంటున్న వైఖరిని రచయిత ఈ వ్యాసంలో స్పష్టంగా వివరించారు.

మొత్తం మీదపైన వివరించిన వ్యాసాలతో పాటు రాష్ట్ర సమైక్యతను, విభజనను వివరించే వ్యాసాలు నదుల

అనుసంధానం, శ్రీశ్రీతో గడిపిన ఒకరోజు, తరిమెల నాగిరెడ్డి మొదలగు అనేక వ్యాసాలను ఎం.వి. రమణారెడ్డి గారు సునిశితంగా, నిగూఢంగా, విమర్శనాత్మకంగా విశ్లేషించారు.

ముగింపు :

డా॥ ఎం.వి.ఆర్. సామాజిక సమస్యల పట్ల విస్తృత పరిజ్ఞానం గల వ్యక్తిగా, డాక్టర్‌గా, లాయర్‌గా, సాహితీ వేత్తగా తనకున్న దృక్పథం మేరకు జాతిని జాగృతం చేయాలనే ఉద్దేశ్యంతో 40 సంవత్సరాల సాహితీ వ్యాసంగంలో సందర్భానుసారంగా నిరంతరం వైవిధ్యమైన అంశాలపట్ల వ్యాసాలు రాసి ఒక ఆదర్శ సమాజం కోసం పాటుపడ్డారు. ఈ వ్యాసాలు అక్షరజ్ఞానం తెలిసిన సగటు మానవునికి అర్థమయ్యే శైలిలో పాఠకులలో సామాజిక బాధ్యతను రేకెత్తించే విధంగా ఈ వ్యాసాలు స్పృశింప బడ్డాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెప్పవచ్చు. డాక్టర్ గారి వాక్య నిర్మాణంలో ప్రత్యేక శైలి సంతరించుకొని ఉండటమే గాక ఈ వ్యాసంలో నిరుడు, సొట్టు, సాంగెం, అలగాజనాలు, దొమ్మలు, బిస మొదలైన రాయలసీమ మాండలిక పదాలతోపాటు బయోలాజికల్ క్రీచర్, కీజరీ, మొదలగు ఆంగ్ల పదాలను రచయిత వాడాడు. ఒక్కో పదం కోసం అనేక పుస్తకాలను చదివి, మాటలోని మూలాలను పేజి చివరన ఇవ్వటంలో రచయిత నిబద్ధతను అర్థం చేసుకోవచ్చు. చివరి దశలో కూడా అక్షరమే ఆక్సిజన్‌గా జీవించిన రచయిత సాహిత్యం ద్వారా, ఉద్యమం ద్వారా ఆదర్శ సమాజం కోసం నిరంతరం పాటుపడ్డాడు.

ఆధార గ్రంథాలు :

1. శంఖారావం - డా॥ ఎం.వి. రమణారెడ్డి

❖❖❖

నీలవేణి కథల సంపుటి - సామాజిక అంశాలు

- డా॥ సింగర కొఱ్ఱి, సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ,, ఐఐఐటి ఒంగోలు, ఆర్.జి.యు.కె.టి.

1990 తర్వాత కాలం ప్రపంచీకరణ. సామాజిక అంశాల్తోపాటు ప్రపంచీకరణ ప్రభావం వాటి తాలుకా పరిణామాలపై రచయితలు అనేక కథలు రాశారు. ఈ పరిణామాలపై రాసిన వారిలో పి.వి.సునిల్‌కుమార్ గారు ఒకరు. వీరు పోలీస్ శాఖలో అత్యున్నతమైన పదవిలో ఉన్నారు. సమాజాన్ని అతి దగ్గరగా చూసినవారు. వారి సర్వీసులో ఎన్నో సామాజిక అంశాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా చూసినవారే. సాహిత్యం సమాజానికి దగ్గరగా ఉంటుంది. సమాజంలో ఉన్నదే సాహిత్యంలో ఉంటుంది. సాహిత్యంలో ఉన్నదే సమాజంలో ఉంటుంది.

పి.వి. సునిల్ కుమార్ పశ్చిమ గోదావరి జిల్లా వాసి. చింతలపూడిలో జన్మించారు. వీరి మాతామహులు ఆంగ్ల భాషా పండితులు. తల్లి దయామణి గారు శరత్, చలం సాహిత్యాల అభిమాని. తల్లి, తాతగారి వల్ల ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యాల పట్ల మంచి అభిరుచి ఏర్పడింది. ఈ అభిరుచి వల్ల మంచి పాఠకుడు అయ్యాడు. ఈయన పాఠకుడే కాదు మంచి రచయిత కూడా. రచయిత అయిన సునీల్ కుమార్ గారు వృత్తిరీత్యా ఐ.పి.యస్. అధికారి. కడప జిల్లాలో వీరు సేవలు అందిస్తున్న కాలంలో ఒక ఫ్యాక్షన్ నేరం కాని, ఎలక్షన్‌లో అక్రమాలు గానీ జరగలేదు. సంస్కరణవాదిగా ప్రజల హితవాదిగా మంచి పేరు సంపాదించారు. ఈయన కలం నుంచి యాభై కథలు, మూడు నవలలు వెలువడ్డాయి. 2014లో డిల్లీ తెలుగు అకాడమీ పురస్కారం, 2015లో వాషింగ్టన్‌లో తానా పురస్కారం అందుకున్నారు. వీరు రాసిన కథల సంకలనమే నీలవేణి. ఈ నీలవేణి సంకలనంలో 16 కథలు ఉన్నాయి. ఈ కథలో మానవ సంబంధాలు, స్త్రీ దృక్పథం, సమాజ విశ్లేషణ, దళిత క్రైస్తవ జీవితం, అధివాస్తవికత మొదలగు అంశాలు స్పృశించారు. కుటుంబంలోని స్త్రీల పరిస్థితిని, మానవ సంబంధాలను, అందులోని డొల్ల తనాన్ని, బతక నేర్చిన తనాన్ని సునిశితంగా, సున్నితంగా, వ్యంగ్యంగా హాస్యాన్ని రంగరించి మనకు అందించారు.

సమాజం ప్రశాంతంగా మనుగడ సాగించాలంటే రక్షక యంత్రాంగం సక్రమంగా వారి పని వారు చేయాలి. లా అండ్ ఆర్డర్ పరిరక్షిస్తున్న సంస్థలలో పోలీస్ శాఖ ప్రముఖమైంది. ఎంతో బాధ్యతగల పాత్ర. ఆ బాధ్యతను నిర్వహిస్తూనే సాహిత్యసేవ చేశారు. వారి సాహిత్యసేవ ఎన లేనిది, శ్లాఘనీయమైంది. అటు స్పార్టకస్ (మోహన్‌రావు) ఆయన పోలీస్. రావులపాటి సీతారామారావుగారు అసంఖ్యాక కథానికల రచయిత. ఆయన పోలీస్ అధికారి. 'ఖాకీ బతుకులు' తెలుగులో సంచలనాత్మకమైన నవల. ఒక పోలీస్ అధికారి ఆశాఖలోని జీవితాన్ని గురించి రాసిన నవల. 'మైనపు బొమ్మలు', 'తడియారని స్వప్నం' వంటి కావ్యాలను లోసారి సుధాకర్ రాశారు. ఇలా చాలామంది ఉన్నారు. వీరి లాగా పి.వి. సునిల్ కుమార్‌గారు తమ బాధ్యతను నిర్వహిస్తూనే సమాజంలోని స్త్రీ వివక్ష, కుల వివక్ష, అజ్ఞానం, అవినీతి, ఆర్థిక అసమానతలపై తన కలాన్ని ఎక్కుపెట్టి సంధించిన బాణంవలె రివ్వున వదిలారు తన కథానికల ద్వారా.

సునిల్ కుమార్ గారు రాసిన కథలలో నవలల్లో అభూతకల్పనలతోనో, వాస్తవికతను దూరంగానో ఉండవు. తడి ఆరని గాయం లాగా సమాజంలో ఉన్న సమస్యను పట్టి సున్నితంగా మనస్సుకు హత్తుకుంటాయి. పాఠకుని హృదయాన్ని కరిగిస్తాయి. మనకు తెలియకుండానే కళ్ళు చెమర్చుతాయి. ఈయన రాసిన నీలవేణి కథల సంపుటిలోని కథలను పరిశీలిస్తే చాలు. ఇటీవల కాలంలో వస్తున్న కథలు వారపత్రికలు, మాసపత్రికలు, డైలీ పేపర్లలోను వస్తున్న కథలకీ ఈ కథలకీ చాలా వ్యత్యాసం ఉంది. నింగికి నేలకున్నంత అంతరం.

వార పత్రికల్లో వచ్చే కథలు 2, 3 లైన్లు చదవగానే పత్రిక పక్కన పెట్టేస్తున్నాం. కథ 2, 3 లైన్లు చదవగానీ ముగింపును చెప్పగలగటం, ఎక్కడో చదివినట్టుగా అనిపిస్తుంది లేదా పేలవంగా ఉంటుంది. కాని సునిల్ కుమార్ గారి కథలు ఉత్కంఠత, ఆసక్తి కలగలపి ఏకబిగిన పూర్తిగా చదివే వరకు వదిలిపెట్టలేము.

దెయ్యం, దెయ్యం-2, నీలవేణి, 'చాయిన్ ఈజ్ యువర్స్' కథలను పరిశీలిస్తే, అందులో మొదటిది, రెండవది దెయ్యం, దెయ్యం-2 అనే కథలను చూస్తే సమాజంలోని మూఢనమ్మకాలు ప్రజల్ని ఎలా భయ భ్రాంతులను చేయవచ్చో వాటిని ఉపయోగించుకొని స్వార్థపరులు లాభపడటం చూస్తుంటాం. నీలవేణి కథలో తండ్రి చేసిన పొరపాట్లు, మగాడిని అన్న అహంకారం వల్ల, ఆ మగాడు చేసే పనివల్ల ఇంటిల్లిపాది నరకం అనుభవించింది. సమాజంలో ఎదుర్కొన్న బాధలు, అవమానాలు ముఖ్యంగా నీలవేణి తల్లి భరించిన బాధలు అన్నీ ఇన్నీ కావు. నేడు చాలా కుటుంబాల్లో మగవారు చేసిన పొరపాట్లకు ముఖ్యంగా బలయ్యేది భార్యే. నీలవేణి తల్లి పడే వేదన భర్త దూరంగా ఉంటున్నా... దానికంటే ఉద్యోగం చేసే చోట ఎదుర్కొన్న అవమానాలు మరింత బాధాకరం. మగదిక్కులేని కుటుంబంటే అదందరి అలుసే. ఇవన్నీ చూసి కూడా ఏమీ చేయలేని, ఎదిరించలేని వయస్సు నీలవేణిది. తండ్రి తిరిగి వచ్చి నీలవేణిని తన స్నేహితుడి కొడుక్కి ఇచ్చి వివాహం చేస్తారు. అన్నీ అవలక్షణాలున్న అతగాడిని వదిలించుకొని తనకాళ్ళ మీద తను నిలబడి తన తర్వాత తమ్ముడు, చెల్లిని చదివించి ప్రయోజకుల్ని చేస్తుంది. దగాపడ్డ స్త్రీ అయినప్పటికీ దాని నుంచి త్వరగా బయట పడి తేరుకొని చేయాల్సిన పనులు చేసికొన్న ధీరురాలుగా నీలవేణి పాత్రను చిత్రించాడు రచయిత. స్త్రీ ఉన్నతిని, అభివృద్ధిని కాంక్షించాడు రచయిత. "అందం" కథలో ఏది అందం అనేది చర్చ. నలుగురికి ఉపయోగపడే మనస్తత్వం అసలైన అందం. అదే ఉన్నతం. బాహ్య సౌందర్యం కన్నా అంతరంగ సౌందర్యం గొప్పది అని ఈ కథ తెలియజేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం జరుగుతుంది. ఇటీవల కాలంలో కాల్‌మనీ కేసులు విపరీతంగా బయట పడ్డాయి. ఈ కాల్‌మనీ విషవలయంలో చిక్కుకొని ఎంతో మంది ధన, మాన, ప్రాణాలను పోగొట్టుకున్నారు. "చాయిన్ ఈజ్ యువర్స్" కథలో సావిత్రి పాత్ర అలాంటిదే. దిగువ మధ్యతరగతి స్త్రీ వ్యధ. భర్త, పిల్లలు చిన్న కుటుంబం, చింతలేని కుటుంబం అంటూ హాయిగా సాగిపోతున్న సావిత్రి జీవితంలో భర్త అనారోగ్యం సావిత్రి జీవితాన్ని అతలాకుతలం చేసింది. దిక్కుతోచని స్థితిలో "మైక్రో ఫైనాన్స్"లో నలుగురు చొప్పున ఒక గ్రూపు ఏర్పాటు చేసుకొని దానిలో అప్పు తీసుకోవటం అప్పు తీర్చలేక వేశ్యగా మారి తర్వాత అవమానబారంతో తనువు చాలించింది.

భర్త, పిల్లలు దిక్కులేని అనాథలయ్యారు. ఈ స్థితికి కారణం పేదరికం, అవగాహన లోపం, అవసరార్థం ఈ మూడు కలిపి సాలెగూడులాంటి విషవలయంలో చిక్కి బయటపడలేని జీవితాల వ్యథల్ని మన కళ్ళముందు నిలిపారు కవి. "నాన్న హైద్రాబాద్ వచ్చాడు" కథలో ఎంత ఎత్తుకు ఎదిగిన, టెక్నాలజీ పెరిగిన మానవ సంబంధాల్లోని ఆత్మీయతలు, అనుభూతులు, బంధాల ముందు అన్నీ బాలదూర్ అని నిరూపించాడు రచయిత ఈ కథ ద్వారా. ముందు ముందు రాబోతున్న ప్రపంచాన్ని మనకు చూపించారు ఈ కథలో. డిసిప్లే కథలోను పోలీస్ శాఖలోని వారు ప్రజారక్షణకు జవాబుదారిగా ఉండాలి. నిజాయితీగా వారి పనివారు చేసుకోవాలి. కానీ వారి వ్యక్తిగత ప్రయోజనం కోసం తోటి ఉద్యోగులపై చాడీలు చెప్పి, వారిని ఇబ్బంది పెట్టి, అధికారులకు ఊడిగం చేసే వారి వల్ల వ్యవస్థ నాశనం అవుతుంది. అదే వారు ప్రజల తరుపున వారిరక్షణ కోసం తపిస్తే జనం గుండెల్లో స్థానం లభించి చిరకాలం ఉంటారు అనే నినాదం ఇచ్చారు.

భయానందంలో గిరిజనుల జీవితాలను చిత్రించారు. ప్రశాంతత వెనుక దాగిఉండే విద్వంసం ఏ రూపంలోనైన కాటు వేయక తప్పదని, క్షణం క్షణం ప్రాణగండముల నడుమ ప్రశాంతమైన జీవితం గడుపుతున్నట్లు కనబడే వారి జీవితం దూరపు కొండల నునుపే నని తెలిపారు.

సునిల్‌కుమార్ గారు రాసిన ఏకథైనా వాస్తవానికి దూరంగా లేదు, చాలా దగ్గరగా ఉంది. ఈయన చెప్పే విధానం నడిపే తీరు పాఠకుల్ని ఆకట్టుకుని అసాంతం చదివింపజేస్తుంది. సమాజంలోని అన్ని వర్గాలను, మతాలను, గమనించారు. పరిశీలించారు. అందుకే ఆయన కథలు నేలవిడిచి సాము చేయవు. ఈయన కలం నుంచి అనేక కథలు, నవలలు రావాలని కోరుకుంటున్నాను. సాహిత్యదాహార్తులకు దాహం తీర్చే రచనలు రావటం లేదు. ఆ కొరత సునిల్ కుమార్ గారు తీరుస్తున్నారు. తెలుగు సాహిత్యానికి వీరు చేస్తున్న కృషి అభినందనీయం అనే చిన్నమాట సరిపోదు.

ఆధార గ్రంథాలు :

1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు - సి.నా.రె.
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి
3. చాసో కథలు (రెండవ కూర్పు) - విశాలాంధ్ర ప్రచురణ
4. నీలవేణి కథల సంపుటి - పి.వి. సునీల్ కుమార్

❖❖❖

ఆంధ్ర మహాభారతం - సామాజిక శ్రేయస్సు

- వంకం భాస్కర్, ఆంధ్రోపన్యాసకులు, ఎన్‌సిఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు.

కావ్య ప్రయోజనములు :

'భూమహుడు' కావ్య ప్రయోజనాన్ని ఇలా నిర్ణయించాడు.

శ్లో॥ ధర్మార్థ కామ మోక్షేసు, వైచక్షణ్యం కళాసుచ।
ప్రీతిం కరోతి కీర్తించ, సాధు కావ్య నిషేవణం॥

మంచి కావ్యాన్ని పఠించటం వలన ధర్మార్థ కామ మోక్ష విషయక విచక్షణా జ్ఞానం కల్గుతుంది. కళలలో నేర్పు, ప్రీతి, కీర్తి లభిస్తుంది. అలాగే 'మమ్మటుడు' కావ్య ప్రయోజనాన్ని గురించి ఈ విధంగా నిర్వచించాడు.

శ్లో॥ కావ్యం యశసే ర్థ కృతే, వ్యవహారవిదే శివేత రక్షతయే।
సద్య: పరనిర్వృతయే, కాంతా సమ్మిత తయోప దేశయుజే॥

కావ్యం వలన యశస్సు, ధనలాభము, వ్యవహార జ్ఞానము కలుగుతాయి. అమంగళాలను తొలగిస్తుంది. పఠించిన వెంటనే పరనిర్వృతి ప్రాప్తిస్తుంది. అలాగే కాంతా సమ్మితంగా ఉపదేశయుక్తి ఉంటుంది. ఈ విధంగా కావ్యములు ఆనందప్రదాలే కాకుండా ఉపదేశాలను కూడా అందిస్తూ, ప్రజల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడటమే కాకుండా, సమాజ శ్రేయస్సుకు కూడా కారణ భూతాలవుతున్నాయి.

ఆంధ్రమహాభారతము - సామాజిక శ్రేయస్సు :

సంస్కృతంలో వేదవ్యాస మహర్షి దాదాపు లక్ష శ్లోకాలతో రచించిన మహాభారతాన్ని, కవిత్రయమని తెలుగు భాషలో పేరుగాంచిన 'నన్నయ, తిక్కన, ఎఱ్ఱన'లు రచించిన విషయం మనందరికీ తెలిసిందే. తేనెలొలుకు తెలుగు భాషలో మహాభారతాన్ని అనువదించి, మన తెలుగు జాతికి మహోపకారము చేసినారు కవిత్రయము వారు. యావత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఇతిహాసముగా పేరొందిన మహాభారతము మానవ జీవితాన్ని ఎలా మలచుకోవాలో నిర్దేశిస్తుంది. వ్యష్టిగా వ్యక్తుల వికాసానికి తోడ్పడుతూ, తద్వారా సామాజిక చైతన్యానికి, సమిష్టి తత్వానికి దోహదం చేస్తుంది భారతం.

మహాభారతం వివిధ ఆఖ్యాన ఉపాఖ్యానాల ద్వారా మనకు ఎంతో విజ్ఞానాన్ని, ఆనందాన్ని, నీతిని, సమాజ శ్రేయస్సును బోధిస్తుంది. అందులోని కొన్ని ముఖ్య ఘట్టాలను పరిశీలించి, వివరించటమే ఈ పత్ర సమర్పణ ఉద్దేశ్యము.

ఏక చక్రపురంలో పాండవులు, కుంతీదేవి ఎవరికీ తెలయకుండా, బ్రాహ్మణ వేషంలో రహస్యంగా జీవిస్తూ ఉండగా, తమ ఇంటి యజమానికి వచ్చిన కష్టాన్ని గురించి తలచి, కుంతీదేవి-

కం. కృతమెఱుగుట పుణ్యఉ, స
న్మతి దానికి సమముసేత మధ్యము; మఱిత
త్కృతమునకగ్గలముగ స
త్కృతి సేయుట యుత్తమంబు కృతబుద్ధులకున్
(ఆ.6.244)

బుద్ధిమంతులైన వాళ్లు ఎదుటివాళ్ళు చేసిన ఉపకారాన్ని గుర్తించటమే గొప్ప పుణ్యకార్యం. మంచిబుద్ధితో దానికి సమానమైన ప్రత్యుపకారం చేయటం మధ్యమ మార్గం. అట్లాకాక చేసిన ఉపకారం కంటే ఎక్కువగా ప్రత్యుపకారం చేయటం ఉత్తమ పద్ధతి అని ఆలోచన చేసి, వారి సమస్య తీర్చుతుంది. చేసిన మేలు మరచి, కృతఘ్నతతో జీవించే మనుష్యులకు కృతజ్ఞతా భావం యొక్క గొప్పదనాన్ని చెబుతుంది ఈ సందర్భం.

లోకంలోని సాధుజనులను, బీదలను రక్షించవలసిన బాధ్యత అందరికీ ఉంది. ముఖ్యంగా ధనవంతులైన వారికి ఈ బాధ్యత మరీ ఎక్కువ. ఏ సమాజం నుండి

లబ్ధిని పొంది, తాము ఉన్నత స్థితిలోకి వచ్చినారో ఆ సమాజానికి తిరిగి తాము ఉపకారము చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ. పేదలను హింసించినట్లయితే అది విప్లవానికి ఆరంభమవుతుంది.

కం. తగునిది తగదని యెదలో
వగవక సాధులకు బేదవారల కెగ్గుల్
మొగిజేయు దుర్వినీతుల
కగు ననిమిత్తా గమంబులయిన భయంబుల్
(ఆ.1.85)

మంచివారికి అపకారాలు కావాలని చేసేవారికి, అలాంటి నీతి రహిత వర్తనులకు కారణం లేకుండానే ఆపదలు వస్తూ ఉంటాయి. కాబట్టి మంచివారికి, పేద వారికి కీడు చేయాలని సంకల్పించటం కూడా దుర్మార్గ మైన ఆలోచనే అంటుంది మహాభారతం.

యయాతి చరిత్రములో యయాఆతి కుమారు లెవ్వరూ కూడా (పూరుడు తప్ప) తండ్రి ఆజ్ఞను మన్నించ లేదు. ఆ సందర్భంలో-

కం. తనయందు దల్లిదండ్రుల, వనిచినవని
సేయడేని, పలుకెడలో, జే
కొనదేని, వాడు తనయుం, డనబ్రడునే-?
పితృధనమునకర్హుంతగునే-? (ఆ.3.199)

కొడుకు తల్లిదండ్రులాజ్ఞాపించిన పని చేయకపోతే, వారి మాటలను హృదయపూర్వకంగా అంగీకరించక పోయినట్లయితే అట్టివాడు కొడుకు అనబడతాడా-? తండ్రి ఆస్తికి తగిన వారసుడవుతాడా-? కాడు. అంటుంది మహాభారతం. నేటి కాలంలో కూడా తల్లిదండ్రుల ఆస్తు లను మాత్రం సంతానం కోరుకుంటోంది కాని, వారి బరువు బాధ్యతలను మాత్రం సంతానం కోరుకుంటోంది కాని, వారి బరువు బాధ్యతలను మాత్రం వదిలేస్తోంది. అలాంటి వారు అసలు సంతానమే కాదు అని భారతం చెబుతోంది. సంతానానికి తమ తల్లిదండ్రుల పట్ల బాధ్యతలను గుర్తు చేస్తుంది.

సమాజంలో మనుషుల మధ్య ఈర్ష్య, అసూయ లున్నట్లయితే వారికి శాంతి ఉండదు. అలాగే పగ కూడా. వ్యక్తుల మధ్య పగ ఏర్పడినట్లయితే దాని వలన మనసుకు అశాంతి, తద్వారా నిద్రలేమి, అనారోగ్యం పాలవటం ఇవన్నీ సంభవిస్తాయి. అందువలన "పగ ఉన్నట్లయితే పామున్న ఇంటిలో ఉన్నట్లే" అంటారు ధర్మరాజు. రాయబారానికి పోతున్న శ్రీకృష్ణునితో సంధి చేయడానికి ప్రయత్నించమని ధర్మరాజు చెబుతాడు.

చ. పగయతగించుటెంతయు శుభం;బదిలెన్స;
యడంగునే పగం
బగ-?వగగొన్న మార్కొనక పల్కకయుండగ
వచ్చునే-? కడుం
దెగమొదలెత్తిపోవ బగ ఁదీర్పగ వచ్చిన
గ్రౌర్యమొందు;నే
మిగతి దలంచినంబగకు మేలిమి లేమి ధ్రువంబు
గేశవా! (ఉ.3.21)

పగను అణచివేయడం ఎంతో శ్రేయస్కరం. విరోధం వలన విరోధం పోదు. ఒకడు మనమీద పగతో బాధ కలిగిస్తే, బాధ పెట్టిన వానితో తలపడకుండా ఊర కుండుట శక్యం కాదు. మనం కూడా దారుణమైన పనులు చేయవలసి వస్తుంది. కాబట్టి ఎన్ని విధాల ఆలోచించినా పగవల్ల కీడేగాని ప్రయోజనం లేదు. అని చెప్పిన ఈ మాటలు నేటికి కూడా మన సమాజంలోని వ్యక్తులకు వర్తిస్తాయి. లేనిపోని అహంభావముతో, అనవసరమైన శత్రుత్వాలను పెంచుకుని కుటుంబాలకు కుటుంబాలే నాశనమవుతున్నాయి. అందుకే ప్రతి ఒక్కరూ మొదట తమలో ఉన్న అసూయ, ఈర్ష్య, ద్వేషాలను పక్కన పెట్టి సామరస్యధోరణిలో వ్యవహరించుకుంటూ ఉన్నట్లయితే సమాజంలో సగం సమస్యలు మాయ మవుతాయి.

మనిషి వ్యసనాలకు బానిసై తన బ్రతుకును, ఆరోగ్యాన్ని నాశనం చేసుకోవటమే గాకుండా, తన కుటుంబ నాశనానికి కూడా కారకుడవుతున్నాడు. అందుకే

విదుర నీతిలో-

తే. వెలది, జూదంబు, పానంబు, వేట, పలుకు
ప్రల్లిదంబును, దందంబు బరుస దనము
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ము సేత
యనెతు సప్త వ్యసనముల జనదు తగుల
(ఉ.2.44)

స్త్రీ వ్యామోహం, జూదం, త్రాగుడు, వేట, వాక్పారుష్యం, దండపారుష్యం, డబ్బు వృథాచేయటం అనే ఏడు వ్యసనాలయందు ఆసక్తి చూపకూడదు అంటాడు విదురుడు. ఈ వ్యసనాలు ఈనాటికీ కూడా మనిషిని పట్టి పీడిస్తూనే ఉన్నాయి. తమ కళ్ళముందే ఎంతోమంది ఇలాంటి వ్యసనాలకు గురియయి నాశన మవుతూ ఉన్నా కూడా వ్యసన పరులలో చైతన్యం కలగడం లేదు. అలా చైతన్యం పొందిన వాడు తన కుటుంబంతో సుఖ సంతోషాలతో జీవించగలుగుతాడు.

గర్వము మనుషులకు అనేక విధాలుగా ఉంటుంది. అందులో విద్యాగర్వము, ధన గర్వము, రూప గర్వము, గుణ గర్వము, ఆభిజాత్య గర్వము మొదలయినవి ఒక్కొక్కటే మనిషికి ఎంతో గర్వాన్ని కలిగిస్తుంది. అలాంటిది అన్నీ ఒకచోట సమకూరితే అది సమాజానికి ప్రమాదకరం. అందుకే

క. ధనమును విద్యయు వంశం
బను దుర్మదులకు మదంబు బొనరించును స
జ్జనులైన వారి కడకువ
యును వినయమునివియ తెచ్చునుర్వీనాథా!
(ఉ.2.35)

ధనము దుర్మార్గలకు మదాన్ని, సుబుద్ధులకు వినయాన్ని ప్రాప్తింపజేస్తుంది. ఇలాగా ఒక్కొక్క లక్షణం ఒక్కొక్క అంశాన్ని మనిషిలో కలిగిస్తుందని, మంచి లక్షణాలు మనిషి కలిగి యుండాలంటుంది మహా భారతం. చివరగా-

కం. ఒరులేయవి యొనరించిన
నరవర! యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మపథములకెల్లన్!
(శా.5.210)

ఇతరులు మనకు ఏది చేస్తే మన మనస్సుకు బాధ కలుగుతుందో అలాంటి పని మనము ఇతరులకు చేయరాదు. ప్రతివ్యక్తీ ఈ సూక్తిననుసరించి జీవించి నట్లయితే మన సమాజం నిజంగా స్వర్గతుల్యమవుతుంది. మహాభారతములో ఇలా అనేక ఆఖ్యాన, ఉపాఖ్యా నాలలో చెప్పబడిన ఈ విషయాలు సార్వకాలికాలు, సార్వ జనీనాలు. ఈ విలువలను మనం నిజాయితీగా మన జీవితంలో పాటించినట్లయితే సర్వమానవ కళ్యాణం సాధ్యమవుతుంది.

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో సాహిత్యపు పాత్ర

– డా॥. నేకూని శారద, అసిస్టెంట్ ప్రొఫెసర్, డా.వి.యస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎ), విశాఖపట్నం.

సమాజానికి, సాహిత్యానికి అవినాభావ సంబంధం వుంది. వీటిని విడదీయడం కష్టం. సాహిత్యం లో ప్రతి బింబించేది సమాజం లో వున్నదే. "సాహిత్యం అంటే మానవుణ్ణి గూర్చిన అధ్యయనం" అంటాడు గోర్కీ. సమాజ హృదయమే సాహిత్యమంటాడు.

ప్రాచీనయుగం నుండి ప్రపంచ సాహితీకారుల, విమర్శకుల, తత్త్వవేత్తల అభిప్రాయాలను బట్టి సమాజానికి సాహిత్యానికి వున్న గాఢమైన సంబంధం విస్పష్టమవుతుంది. కాబట్టి ఆదర్శ సమాజం రూపొందాలంటే అందులో సాహిత్యపు పాత్ర అనివార్యమవుతుంది.

ఆదర్శ సమాజం అంటే :

స్వయం సమృద్ధి కలిగిన ఆరోగ్యవంతమైన, శాంతియుతమైన సమాజం, ఆదర్శ సమాజం. సమన్యాయం, సమాన హక్కులు, బాధ్యతలు, మతతత్త్వం లేని, లింగ వివక్షత, అంటరానితనం, అసమానతలు, రాజకీయ వివక్షతలు లేని సమాజం ఆదర్శ సమాజం. సర్వమత సమానత్వం, రాజకీయ హక్కులు, స్త్రీపురుష అసమానత్వం లేకుండా, నిస్వార్థత్వం తో కూడిన మంచి మనుషులతో కూడిన, ప్రణాళికా బద్ధ ప్రభుత్వం, ఆరోగంలో కూడిన, కాలుష్యం లేని పరిశుభ్రమైన పర్యావరణం కలిగిన క్రమశిక్షణ గల సమాజమే ఆదర్శ సమాజం.

సాహిత్యం :

"సహితే సాహిత్యం". సాహిత్యం ఒక విశిష్ట సృష్టి. సమాజాన్ని వివిధ కోణాలనుండి దర్శింపజేయగలిగిన విస్తృతమైన పరిధి సాహిత్యానికి వుంది. సాహిత్యపు ప్రయోజనం విశ్వశ్రేయమని విషయాన్ని మన ప్రాచీనాలంకారికులు నాక్కి వక్కాణించారు. సాహిత్యాన్ని అధ్యయనం చేసేటప్పుడు పఠిత బుద్ధీ హృదయం సమానంగా పనిచేస్తాయి. దేశ, కాలాలను బట్టి, వ్యక్తులను బట్టి నీతులు, ధర్మాలు మారవచ్చు. కానీ విశ్వ సాహిత్యమంతా ఏదోఒక సిద్ధాంతానికి, నీతికి కట్టుబడి వుంటుంది. సమర్థుడైన రచయితకు ఈ సమాజం పై అవగాహన వుంటుంది. సమాజంలోని అస్తవ్యస్తతకు కారణాలివనీ, వాటిని అధిగమించాల్సిన అవశ్యకతను గూర్చి సమర్థుడైన ప్రతీ రచయితా తన రచనలో ప్రతిఫలిస్తూనే వుంటాడు. సాహిత్యంలో రచయిత ప్రతిపాదించిన సిద్ధాంతాలు మానవత్వాన్ని నిరూపించి అటువంటి రచనే కాలాన్ని అధిగమించి నిలుస్తుంది. ఉత్తమ సాహిత్యాన్ని చదివిన సహృదయుడైన పాఠకునికి కేవలం ఆనందానుభూతి మాత్రమే గాక, మేధో వరమైన అనుభూతిని కూడా పొందుతాడు. సాహిత్యపు దృక్పథం ఉత్తమమైనది అయినపుడు అది పాఠకుని బుద్ధిని కూడా ప్రభావితం చేస్తుంది. రాంభట్ల కృష్ణమూర్తి గారు రచనా స్వరూపాన్ని, స్వభావాన్ని వివేచిస్తూ యిలా అన్నారు. "ఏకళలోనైనా సుందరత, వాస్తవికత, దార్శనికత అనేవి త్రివేణీ సంగమం లాగ ముప్పేటగా వుంటాయి. అయితే అందులో సుందరత ముమ్మొనగ వుంటుంది. ఆ తరువాత వాస్తవికత వస్తుంది. దార్శనికత సరస్వతి లాగ అంతర్వాహినిగా వుంటుంది. సుందరత వల్ల కలిగేది ఆనందం, వాస్తవికత వల్ల కలిగేది జగదవగాహన - దార్శనికత ప్రపంచ దృక్పథాన్ని కలిగిస్తుంది. ఈ విధంగా ఉత్తమ సాహిత్యం సమాజంలోని వ్యక్తులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుంది. వ్యక్తులు కలిస్తే సమాజం. ఉత్తమ పౌరులు కలిగినదే ఆదర్శ సమాజంగా రూపు దిద్దుకొంటుంది.

భారతీయ సాహిత్యం :

మన భారతీయ సాహిత్యాన్ని పరిశీలిస్తే ప్రాచీన సాహిత్యం ప్రజల ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు అనంతరం

ధర్మబోధ దాని నుండి భౌతిక జీవిత పరిశీలనకు చేరుకుంది. క్రమేపీ సాహిత్యం లౌకిక జీవితం వైపు పయనించి సమకాలీన సమాజాన్ని పరిశీలించి దానిలోని లోపాలను పాఠకులముందు వుంచడం నేర్చుకుంది. ఆదర్శ సమాజం రూపొందాలంటే ముందు సమాజంలోని వ్యక్తులు ఆదర్శ పౌరులుగా మారాలి. దారిలో నైతిక పరమైన, రాజకీయ పరమైన, ఆర్థిక పరమైన, సాంస్కృతిక పరమైన అవగాహనలను కలిగించి ఒక పరిపూర్ణ మానవునిగా రూపొందించాలి. మన భారతీయ సాహిత్యం చాంత్రక, రాజకీయ, సామాజిక, నైతిక, మనస్తత్వ అంశాలను కూడా స్పృశిస్తు ఒక ఆదర్శ సమాజనిర్మాణానికి తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తూనే వుందనేది నిర్వాదాదాంశం.

భారతీయ సాహిత్యం లోనే అత్యంత ప్రాచీనమైనది బుగ్వేదం. అపౌరుషేయాలైన మన వేదాలలోనే ఆదర్శ సమాజానికి కావలసిన కట్టుబాట్లు, నిబంధనలు వున్నాయి. వేదాలనాటి సాంఘిక జీవన విధానంలో సుస్థిర కుటుంబ వ్యవస్థ, స్త్రీపురుష సమానత్వం, కళాపోషణ సుస్థిర సమాజ నిర్మాణం వంటి అనేక ఆదర్శ భావనలు కన్పిస్తాయి. మానవ జీవనాన్ని ప్రభావితం చేసే ధర్మార్థ కామ మోక్ష సంబంధమైన అంశాలు ప్రమాణీకరించ బడ్డాయి.

బుగ్వేదంలో..

"సమానీన ఆకూతి : సమాని హృదయానివ : ॥
సమాన మస్తువోమనో యధావసు సహాసతి ॥"

అనగా మనందరి ఆశలు., హృదయాలు ఉకటి కావాలి. ఆలోచనలు ఒకే త్రాటి పై నడవాలి. అందరం ఒకటై మంచి స్నేహితులుగా వుండాలి అనే విశ్వమానవ సౌభ్రాతృత్వభావనను చాటుతుంది.

శుక్లయజుర్వేదంలో..

"న చర్మణో నరక్తస్య నమాంసస్య నచాస్తిన : ।
నజాతిరాత్మనో జాతి వ్యవహార : ప్రకల్పిత : ॥

జాతి అనేది చర్మానికి లేదు, రక్తానికి లేదు, మాంసానికి లేదు, ఎముకలకు లేదు, ఆత్మకు లేదు, వ్యవహార నిమిత్తం కల్పించబడినది అని సర్వమానవ సమానత్వాన్ని ప్రతిపాదిస్తోంది.

ఆర్షవాఙ్మయంలో వేదాల తరువాత ఉపనిషత్తులు మానవ జాతి జీవన విధాన సరళిని బోధించడం జరిగింది. సమాజ క్రమశిక్షణకు ఈ వాఙ్మయంలో అనేక విధులు, నిషేధాలు కనిపిస్తాయి.

"తేన త్యక్తేన భుంజీథా మాగృధ: కస్య స్విద్ధనమే" ।
(ఈశో పనిషత్ - 1,1-పుట 53)

ఈశ్వరుడు త్యజించినదే అనుభవించు. అన్యుల ధనం ఆశింపకు.

"సత్యమేవ జయతి "
(ముండకోపనిషత్ 3-1-6 పుట 198)

సమాజాన్ని ధర్మపథంలో నడిపించుటలో మన ప్రాచీన సాహిత్యం తన బాధ్యతగా స్వీకరించింది. ధర్మ విరుద్ధమైన పనులు చేయరాదని ప్రాచీన కవులు తమ కావ్యాల ద్వారా సమాజానికి సందేశమిచ్చారు.

రామాయణం :

ఇతరుల భార్యలను అపహరించుట పాపమని, ప్రాణాంతకమని బోధించటానికే సీతారాముల కథ, వాలి సుగ్రీవుల కథలు.అంతేకాక రామరాజ్యం అంటి ఆదర్శ రాజ్యం అనే భావన నేటికీవుంది.

మహాభారతం :

అన్నదమ్ముల ఆస్తులను అపహరించడం వినాశ హేతువుగా ఉద్బోధిస్తుంది. అంతేగాక మంచి రాజ్యం కావాలంటే రాజు అనుసరించాల్సిన ధర్మాలను కూడా భారతం వివరిస్తుంది. సభాపర్వంలో నారదుడు - ధర్మ రాజుకు రాజనీతిని ఉపదేశిస్తూ

"మఱియు నాస్తిక్యం బనృతంబు ప్రమాదం.....
బరిహరింతి ? యని వాడిగిన నారదునకు ధర్మ రాజిట్లనియె
(ఆం.మ.భా. - సభా-పు-56)

నాస్తికత, అబద్ధాలాడటం, ఏమరుపాటు, సోమరితనం, అతికోపం, అతిదు:ఖం, జ్ఞానుల్ని గుర్తించకపోవడం, శుభకార్యాలు చేయకుండటం మొదలైన 14 రాజ దోషాలను వదిలివేసావు కదా అని అడుగుతాడు. అంటే ఆదర్శరాజ్య రూపొందనలో ప్రభుత్వం కూడా ఏ విధంగా వుండాలనేది ముఖ్యం. సమర్థుడైన పాలకుడు వున్నప్పుడే రాజ్యం సుభిక్షంగా వుంటుంది. రాజ్య సుస్థిరత కూడా ఆదర్శ రాజ్య లక్షణం. ఆధునిక సాహిత్యం పరిశీలిస్తే కందుకూరి వీరేశలింగం పంతులు గారి వ్యవహారధర్మ బోధిని లో " వీరన్న - దొరయ్య అనే అన్నదమ్ముల మధ్య వ్యాజ్యం వస్తుంది. కేసు గెలవడం కోసం లాయరు దారయ్యతో వీరన్న - దొరయ్యకు సోదరుడు కాడని మావూళ్ళో వాళ్ళు దొంగసాక్ష్యం చెప్తే కేసు గెలుస్తామంటాడు. అప్పుడు దొరయ్య ప్లీడరుతో మావూళ్ళో వాళ్ళు లక్ష వరాలిచ్చినా మేమిద్దరము అన్నదమ్ములు కామని పలుకరు అంటాడు. ఈ వాక్యం ఆకాలం నాటి సమాజంలోని ధార్మికత్వాన్ని సూచిస్తోంది.

గురజాడ : మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును
అంతస్వర్గసుఖంబులన్నవి
యవని విలసిల్లున్ (ముత్యాలసరాలు)

అంటూ సర్వమత సమానత్వాన్ని, సుఖప్రదమైన సమాజాన్ని ఆశించాడు. ఇలా చెప్పుకుంటూ పోతే సామాజిక బాధ్యతను భుజాన వేసుకున్న సాహిత్యం కొల్లలుగా సాగిపోతూనే వుంది.

ముగింపు :

అయితే సమాజంలోని అందరూ సాహిత్యాన్ని చదువుతారా ? చదివి మారతారా అంటే చెప్పలేముగానీ, సాహిత్యాభిలాషులు ఏకాలంలోనైనా వుంటారు. మంచి సాహిత్యం సహృదయుడైన పాఠకుని మదిని ఆకర్షిస్తుంది. ఆదర్శ సమాజం నిర్మించాలంటే సమాజంలోని ప్రతీ ఒక్కరూఆదర్శవంతులు గా మారాలి. బిందువు, బిందువూ కలిసి సింధువు అయినట్లుగా ఆదర్శ వంతమైన వ్యక్తులు కలిసి ఆదర్శ సమాజం ఏర్పడుతుంది. ఈ ఆదర్శ సమాజం ఏర్పడడంలో సాహిత్యం పాత్ర ఎంతనేది కొలిచి చెప్పలేము గానీ సమాజ వికాస దశల్లో దాని పాత్ర

అది నిరంతరం పోషిస్తూనే వుంటుందనేది కాదనలేని నిజం.

ఉపయుక్త గ్రంథాలు :

1. మదాంధ్ర వచన ఋగ్వేద సంహిత - ఆచార్య దాశరథి రంగాచార్యులు గారు
2. సాహితీ జగతి - కాళూరి హనుమంతరావు
3. తెలుగు నవలలో సామాజిక చైతన్యం - డా॥ పి. సంజీవమ్మ
4. ఆంధ్ర మహాభారతం - తి.తి.దే
5. ప్రాచీనాంధ్ర కథా కావ్యాలు - నీతిబోధ - తెలుగు అకాడమీ

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగంగా - భారతదేశం జానపద కథకి పుట్టినిల్లు

- డా॥. కడివెండి సుమత, అధ్యాపకులు, భద్రుక వాణిజ్య కళాశాల, హైదరాబాద్.

ఈభూమి మీద పుట్టిన మానవుడు తన మనస్సులోని ఊహలను ఏనాడు వ్యక్తం చేయడం మొదలు పెట్టాడో అనాడే పుట్టింది. కథ. "మానవుడు సంఘజీవి" కాబట్టి తన అనుభవాలను, అనుభూతులను, ఆశలను, ఆకాంక్షలను, వేదనలను, బాధలను మరొక వ్యక్తికి చెప్పుకోవడం మొదలైన నాటి నుండి కథ అనేది ఉందనే చెప్పవచ్చు. మానవుడు బయటి ప్రపంచంలోని సమస్త విషయాలను కన్ను చూసేది కొంత, మనస్సు చూసేది మరికొంత కలిసి అందంగా కథారూపం పొంది శ్రోతలను అలరిస్తున్నాయి.

ప్రపంచ జానపద కథా సాహిత్యంలో భారతదేశానికి అగ్రస్థానం ఉన్నది. దానికి కారణం ప్రపంచానికి కథాభిక్ష పెట్టింది భారతదేశమేనని అనేక మంది అభిప్రాయం. అయితే దాన్ని తిరుగులేని సిద్ధాంతంగా ప్రతిపాదించి నిరూపించటంలో కొన్ని ప్రతిబంధకాలు ఉన్నాయి. "ఒకటి జానపద వ్యాయం కథన సంప్రదాయబద్ధంగా గ్రంథస్థం కాకపోవడం. రెండవది కథాకల్పన కాలాన్ని నిర్ద్వంద్వంగా నిరూపించే ఆధారాలు లేకపోవడం. మొదటి కారణంవల్ల జానపద వ్యాయంలో చాలాభాగం నశించిపోతూ వచ్చింది. రెండో కారణం వల్ల లభించిన లిఖిత గ్రంథాలు కూడా ఏనాటివో స్పష్టంగా చెప్పటానికి వీలులేకపోతున్నది" (దక్షిణామూర్తి, పోరంకి : 1988:56).

ఈజిప్టులో లభించిన క్రీస్తు పూర్వం 2000-1700 మధ్యకాలం నాటివని చెప్పే కథలే అన్నిటికాన్న ప్రాచీనమైనవన్న అభిప్రాయం వ్యక్తమయింది. "Great short stories of the world" అన్న గ్రంథంలో సంకలన కర్తలు ఈజిప్టు కథలే ప్రాచీనమైనవి చెప్పారు" (థాంప్సన్, స్టిత్ : 1951:3). దీనిని బట్టి చూస్తే పాశ్చాత్య పరిశోధకులకు దొరికిన ఆధారాలను బట్టి జానపద కథా చరిత్రను నాలుగైదు వేల సంవత్సరాల కంటే పూర్వానికి తీసుకుని వెళ్లడానికి వీలులేదు.

సర్ జేమ్స్ జీన్స్ అనే ప్రఖ్యాత శాస్త్రవేత్త ధాతుశాస్త్ర, భౌతిక శాస్త్ర, జ్యోతిష్య శాస్త్ర, విజ్ఞానోపకరణాల సహాయంతో జరిగిన పరిశోధనలవల్ల భూమి ఏర్పడి ఇప్పటికి సుమారు రెండు వందల కోట్ల సంవత్సరాలై ఉంటుందని చెప్పాడు. "భారతీయ పంచాంగ కర్తలు సౌరమానాన్ని అనుసరించి తేల్చిన లెక్కలో భూమి పుట్టి ఇప్పటికి 195,58,85,048 సంవత్సరాలైందని చెప్పారు" (వెంకటానంద రాఘవరావు, గొబ్బూరి : 1960:4). దీని ప్రకారం భారతీయ శాస్త్రవేత్తల అంచనాలకు చాలా దగ్గరగా ఉండటం గమనించాలి.

జీన్స్ అంచనా ప్రకారం :

1. భూమి వయస్సు ఇప్పటికి ఉరమరగా రెండు వందల కోట్ల సంవత్సరములు.
2. భూమి మీద ప్రాణికోటి ఏర్పడి ఇప్పటికి ఉర మరగా ముప్పది కోట్ల సంవత్సరములైనది.
3. భూమి మీద మనుష్యజాతి ఏర్పడి ఇప్పటికి ఉర మరగా మూడు లక్షల సంవత్సరములైనది"

(వెంకటానంద రాఘవరావు : 1960:3-4)

మూడు లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడిన మానవ జాతి ఇటీవలి వరకు మూగబోయి ఉన్నదనటం సమంజసం కాదు. అంటే అనుభవాలను, అనుభూతులను, ఆకాంక్షలను, వేదనలను, బాధలను మరొకరితో

పంచుకోకుండా ఉండగలడా? అంటే ఏదో రకంగా వ్యక్తం చేసి ఉన్నట్లే కదా! ఆ అనుభూతే కథా బీజం.

వేదాలు నాలుగు సంహితల రూపంలో ఉన్నవి. అవి : 1) ఋగ్వేదం 2) యజుర్వేదం 3) సామవేదం 4) అథర్వణ వేదం. వీటిలో అతి ప్రాచీనమైనది ఋగ్వేదం.

భారతదేశంలో పుట్టిన వేదాల కాలాన్ని తత్త్వవేత్తలు, శాస్త్రవేత్తలు, జ్యోతిష్య శాస్త్రవేత్తలు పరిశీలించి చెప్పిన అభ్పిఆయాల ప్రకారం ''యాకోబి జ్యోతిష్యశాస్త్ర ప్రవీణుడు. వైదిక సాహిత్యంలో చెప్పబడిన నక్షత్రాల స్థితిని బట్టి అతడు వేదాల కాలనిర్ణయానికి పూనుకున్నాడు. కల్ప సూత్రంలోని వివాహ ప్రకరణంలో ''ధ్రువ ఇవ స్థిరాభవ'' అన్న వచనాన్ని ఆధారంగా తీసుకుని ధ్రువ నక్షత్రం క్రీ.పూ. 2700 సంవత్సరంలో అట్టి స్థితిలో వున్నదని నిర్ణయించి తదాధారంగా వేదాల రచనా కాలాన్ని క్రీ.పూ. 4500 అని అతడు నిర్ణయించాడు (గోపాలరెడ్డి, ముదిగంటి సుజాతరెడ్డి, ముదిగంటి : 1997 :88).

''బాలకృష్ణ దీక్షిత్ జ్యోతిష్యశాస్త్ర సహాయంతో వేద రచనా కాలాన్ని నిర్ణయించడానికి పూనుకున్నాడు. శతపథ బ్రాహ్మణంలో చెప్పబడిన కృత్తికానక్షత్ర స్థానాన్ని బట్టి ఆ బ్రాహ్మణ రచనాకాలిన్న విక్రమ శకానికి పూర్వం 3000 అని చెప్పాడు. తైత్తిరీయ సంహితలో చెప్పబడిన కృత్తికా స్థానాన్ని బట్టి ఆ సంహిత శతపథ బ్రాహ్మణానికి ప్రాచీన రచన అని తెలున్తున్నదని, అప్పడు ఋగ్వేద రచనాకాలాన్ని విక్రమ శకానికి పూర్వం 3500కు ప్రాచీనమే గాని అర్వాచీనం కాదని నిర్ణయించాడు'' (గోపాలరెడ్డి, ముదిగంటి సుజాతరెడ్డి, ముదిగంటి : 1997 : 88).

''అద్భుత కావ్య శకలాలు, కథా ఖండాలు, సమ్మిశ్రమై ఉన్న ఋగ్వేదం మానవ మేధా పరిణతికి ప్రకృష్టమైన ప్రప్రథమ ప్రమాణం.

అది క్రీ.పూ.3500 యేళ్ళ కిందటిదని థాంప్సన్ అభిప్రాయం'' (థాంప్సన్, స్టిత్ 1951:371)పై పరిశోధనల ప్రకారం చూసినట్లయితే ఈజిప్టులో లభించిన క్రీ.పూ. 2000 - 1700 మధ్య కాలం నాటి జానపద కథల లిఖితాధారాల కంటే కూడా ఇంచుమించు ఋగ్వేదం 1500 సంవత్సరాల ఆర్వాచీనమన్న అర్థం వస్తుంది.

ఋగ్వేదంలోని ఈ శ్లోకం వల్ల ఆనాడే కథా బీజాలున్నాయని చెప్పవచ్చు.

''ఓమ్
ఉద్యుం జాతవేదసం దేవం వహన్తి కేతవః
దృశే విశ్వాయ సూర్యమ్''

(సత్యనారాయణ శర్మ:అను:1)

అంటూ ఎలుగెత్తి చాటకుండా ఎలా ఉండగలడు? దినకరుడు సారించే వెలుగురేఖలు అతనికి గుర్రాలలా కనిపించడంలో ఆశ్చర్యమేముంది? తాను పాలించే విశాల విశ్వాన్ని వీక్షించడానికి ప్రభువు బయల్వేడలి వస్తున్నాడు. అతని రథానికి పూన్చిన గుర్రాలు సభోమండలంలో పరుగులు తీస్తున్నాయి. ఇదొక కథాబీజంబీ మంత్ర రూపంలో నిక్షిప్తమైనది'' (దక్షిణామూర్తి, పోరంకి : 1988:58).

ఋగ్వేదంలోని మరొక శ్లోకం ద్వారా కథాబీజం ఉద్దీప్తం కావడమే కాదు కవితా గ్రంథం ఉద్భూతం కావడం కూడా గమనించవచ్చు.

''అపతే తాయవో యథా నక్షత్రాయంత్యక్తుభిః
సూరాయ విశ్వచక్షసే''

(సత్యనారాయణ శర్మ: అను:2)

అన్నప్పుడు చోరుల కార్యకలాపాలకు అంధకారం అనుకూలమైనది కాబట్టి చుక్కలనే దొంగలు మింటినాక్రమించుకొని ఉన్నారు. ఇంతలో పొద్దుదొర జాడ తెలిసింది. అతని రక్షకభటగణం అల్లదే వస్తోంది. దాని చూసి ''చుక్కదొంగలు'' మెల్లగా జారుకుంటున్నారు'' (దక్షిణామూర్తి, పోరంకి : 1988:58).

''వేదాల కాలనిర్ణయంలో గల సాధకబాధకాలను పరిశీలిస్తూ మాక్స్ ముల్లర్ వేదాలు ప్రపంచ సాహిత్యంలో

అది గ్రంథాలని, ప్రపంచంలో జ్ఞానోదయారంభం వాటితో జరిగిందని అంగీకరించాడు'' (గోపాలరెడ్డి, ముదిగంటిబీ సుజాతరెడ్డి, ముదిగంటి: 1997:871)

పై పండితుల అభిప్రాయం ప్రకారం ఈజిప్టులో లభించిన కథల కంటే ముందే ఋగ్వేదంలో కథాబీ/జాలు ఉన్నాయి. కాబట్టి ప్రపంచానికి కథా భిక్ష పెట్టింది భారతదేశమే కాక మరొకటి ఎలా అవుతుంది?

సాధారణంగా జానపత కథా పరిశీలన జరిపే వారికి నాలుగు ప్రశ్నలు ఎదురవుతుంటాయి.

1. కథాకథన సంప్రదాయం ఎలా మొదలైంది. ఈనాడు వ్యాప్తిలో ఉన్న కథలకు మూలమేమిటి?
2. ఈ కథలకు బాహ్యార్థలే కాక అంతరార్థాలు కూడా ఏమన్న ఉన్నాయా?
3. కొన్ని కథలకు యావత్ప్రపంచ వ్యాప్తి ఉన్నట్టు కనపిస్తోంది. ఇది ఎలా సాధ్యమైంది?
4. ఒకే కథ తాలూకు పాఠాలు వేరువేరుగా కని పిస్తుంటాయి. ఈ భేదాలకు కారణం ఏమిటి?
5. మార్చెన్, పురాణం, సాగే, వీరగాథ వంటి భిన్న జానపద కథారూపాలకు గల సంబంధం ఏమిటి?'' (దక్షిణామూర్తి, పోరంకి: 1988:60).

పై ప్రశ్నలపై శ్రద్ధ చూపిన వారిలో విల్‌హెల్మ్‌గ్రిమ్ (Wilhelm Grimm) సోదరులు. వీరు 1856లో తమ సిద్ధాంతాలను సమీక్షిస్తూ భిన్న భిన్న దేశాల్లో ప్రచురితమైన జానపద కథల్లో సాదృశ్య వైదృశ్యాలు గోచరించడానికి గల కారణాలను వివరించారు. జానపద వ్యాయం యావత్తు మానవజాతి సమిష్టి సంపత్తి అన్నారు. కొన్నిట ఆదానప్రదానాలు జరిగి ఉండవచ్చు. కొన్నిట స్వతంత్ర కల్పనా జరిగి ఉండవచ్చు. మానవుడు ఏ కాలంనాటి వాడైనా, ఏ దేశవాసి అయినా అతని అలవాట్లు, ఆలోచనలు, ఆచారాలు ఒకే రీతిగా సాగుతుంటాయనే విషయం వీటిలో గల పోలికలవల్ల స్పష్టమవుతుంది. అయితే సమాన సంఘటనలు గల జానపద కథలకు మూలం ఇండోయూరోపియన్ భాషా కుటుంబమేనని వారు స్పష్టం చేశారు.

''ఇటలీ, నార్వే, ఇండియాల్లో కనిపించే కథల్లో పోలికలుండటానికి కారణం ఈ కథలు ఆర్యుల తెగలు విడివడకముందే ఏర్పడి ఉండటం అన్నాడు కాక్స్'' (థాంప్సన్, స్టిత్ : 1951:1372).

''సామాన్య ఇండో - యూరోపియన్ మూల కథా సిద్ధాంతాన్ని తులనాత్మక పురాన వ్యాయ సిద్ధాంతాన్ని (Both the general Indo European and Mythological Theories) రెండింటిని నిరాకరించిన మరొక థియోడార్ బెన్ఫీ (Theodor Benfey) వర్గం వారు ఋగ్వేదాన్ని జానపద కథ మీద దాని ప్రభావాన్ని పరిశోధించడం ప్రారంభించారు. జానపద కథా సంప్రదాయాఆనికి భారత దేశమే మూలకందమని ఆ వర్గం వారి విశ్వాసం'' (థాంప్సన్, స్టిత్ : 1951-375-376).

''బెన్ఫీ 1859లో పంచతంత్రం ప్రచురిస్తూ రాసిన ఉపోద్ఘాతంలో తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించినప్పటికీ అంతకు ముందే 1838లో లోయ్‌సెలూర్ డెస్లాంగ్‌చాంప్స్ (Loiseleur Deslongchamps) ప్రచురించిన ''Essai Surfables Indiennes'' అన్న గ్రంథంలో, యూరఫ్ జానపద కథలకు మూలాలు బహుశా భారతదేశంలో లభించవచ్చునని సూచించడం జరిగింది'' (థాంప్సన్, స్టిత్ : 1951:376), బెన్ఫీ, సిద్ధాంతం ఆ తర్వాత కనీసం రెండు తరాల పండితులను ప్రభావితం చేసింది. పశ్చిమార్ధ ప్రపచంలో వ్యాప్తిలో ఉన్న జానపద జంతు కథలు, ఈసప్ నీతి కథలకు కొంచెం ఇంచుమించుగా రూపాంతరాలన్నది స్పష్టమేనంటూ బెన్ఫీ వాటిలో కొన్నింటి మూలాలు భారతీయమైనవన్న అభిప్రాయం కలగవచ్చు అన్నాడు.

భారతదేశంపై పదో శతాబ్దంలో మహమ్మదీయులు పదేపదే దండయాత్రలు జరిపి ధన రాశులను, అనేక గ్రంథాలను కొల్లగొట్టుకొనిపోయి, అరబ్బీ భాషలోనికి అనువాదాలు చేయించారు. ఆసియా, ఆఫ్రికా, యూరఫ్‌లలో మహమ్మదీయుల రాజ్యం కొనసాగటం, అదే

సమయంలో క్రైస్తవ ప్రపంచమంతటా కూడా వారి ప్రభావం ప్రసరించడం కన్పిస్తుంది. అలాగే క్రీ.శ.ప్రథమ శతాబ్ది ప్రాంతంలో అనేక బౌద్ధ గ్రంథాలు చైనాలోకి ప్రవేశించాయి. మరియు టిబెట్‌లోనూ ప్రచురితమైనాయి. టిబెటన్ల నుంచి అవి మంగోల్‌లకి అందాయి. మంగోల్‌లు దాదాపు రెండు వందల ఏళ్ళపాటు యూరప్‌లో అధికారం చెలాయించారు. భేతాళ పంచ వింశతిక, విక్రమార్క చరిత్ర లతో పాటు శుకసప్తతి కథలు కూడా కొన్ని మార్పులతో మంగోల్‌లకు సుపరిచితమైనాయి. శుకసప్తతి కథలు తోతానామాగా అరబ్బీలో ప్రచురితమై యూరప్‌కు కూడా వ్యాపించాయి. బొకాషియో (Bhocaccio), స్ట్రపరోలా (Straparola) రాసిన కథల్లో వీటి ప్రభావం చూడవచ్చు. ఈ విధంగా సాహిత్యంలో నిలిచిన కథలు ప్రజల్లో, జానపదుల నోళ్లల్లో రకరకాలుగా రూపాంతరం చెంది మళ్ళీ లిఖిత సాహిత్యంలోనికి ప్రవేశించి మళ్లీ జానపదుల నోళ్ళలోకి వెళ్లి వివిధ రూపాంతరాలు చెందాయి.

ఈ విధంగా బెన్ఫీ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని అనుసరించి ఈసప్ నీతి కథలు తప్ప, తక్కిన జానపద కథలన్నీ భారతదేశం నుంచే వచ్చాయని చెప్పవలసి ఉంటుంది.

మొత్తం మీద కనీసం ఋగ్వేదకాలం నుంచి ఈనాటి వరకు అవిచ్ఛిన్నంగా సాగుతున్న భారతీయ కథన సంప్రదాయం ప్రాచ్య పాశ్చాత్య ప్రపంచాల్లో అనేక దేశాల మీద ప్రభావం చూపి అగ్రస్థానం వహించిందన్నది సిద్ధాంతం. దీనికి అనేక ఉపపత్తులు పాశ్చాత్య పండితుల కృషి ఫలితంగానే మనకు లభ్యమైనాయి.

ఈ విధమైన నేపథ్యమున్న జానపద కథను పరిశీలిస్తే కథ మనకు కొత్తయేమికాదు. అందరు కథలు వినే ఉంటారు. జానపదుల జీవితంలో కథలు చెప్పడం, కథలు కట్టడం లేదా కథలు అల్లటం, కథలు వినడం ఒక భాగం. పల్లెటూళ్ళలో నేటికి జానపద కథలు చెప్పేవారు. వినేవారు ఉంటారు. పేదరాశి పెద్దమ్మ కథలు, ఏడుగురు రాజ కుమారుల కథలు, ఏడు చేపల కథలు, కాశీమజిలీ కథలు, కిన్నెర కథలు, జంతువుల కథలు, పక్షుల కథలు మొదలైనవి. వీటిలో కొన్ని సమాజ అనుభవాలకు సన్నిహితమైనవిగా ఉండవచ్చు. కొన్ని నిజ జీవితంలో జరగవచ్చనే ఊహకు కూడా అందని, అసంభవమైన కథలు ఉండవచ్చు. ఇది కథ చెప్పే వారి నైపుణ్యాన్ని బట్టి ఉంటుంది. కథలో మార్పులు చేర్పులు రావచ్చు. వీటికి శ్రోతలు మాత్రమే ఉంటారు. ఇవి మౌఖికమైన ప్రచారాన్నే ప్రధానంగా కలిగి ఉంటాయి ఇవి నిజమైన జానప కథలు.

ఈ జానపద కథల్లో ఎత్తుగడ, నిర్వహణ, ముగింపు ఒక మూసలో పోసినట్లు ఉంటాయి. కథ పూర్తిగా నాయకున్ని ఆశ్రయించి ఉంటుంది. నాయకుడే చివరకు విజయం సాధిస్తాడు. మంచివాళ్లు చెడువాళ్లు అన్న విభజన స్పష్టంగా ఉంటుంది. ఈ జానపద కథలు నేటికి గ్రామాల్లో జానపదులను, బాలబాలికలను ఇట్టే ఆకట్టుకుంటాయి. ఈ జానపద కథల్లో పాత్ర వైవిధ్యంగా కాని, పాత్రల అంతరంగ చిత్రణ గాని అంటూ ఏమి ఉండదు. కథ ఒక మూసలో పోసినట్లు ఉంటుంది. ఈ విధమైన నేపథ్యమున్న జానపద కథలు నేటికి ఆదరించ బడుతూనే ఉన్నాయి.

ఉపయుక్త గ్రంథసూచిక :

1. దక్షిణామూర్తి, పోరంకి. 1998. కథానిక స్వరూపం స్వభావాలు, హైదరాబాద్ : విశాలాంధ్ర ప్రచురణాలయం.
2. వెంకటానంద రాఘవరావు, గొబ్బూరి. 1960. జ్యోతిర్వేదము శాస్త్రవిజ్ఞానం, చరిత్ర, హైదరాబాద: : తెలుగు-ఉర్దూ అకాడమీ.
3. గోపాలరెడ్డి, ముదిగంటి మరియు సుజాతరెడ్డి, ముదిగంటి 1997. సంస్కృత సాహిత్య చరిత్ర. హైదరాబాద్ : పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
4. Thomson, Stith. 1951. The Folktale. New York: The Drydon Press.

❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో కవి, రచయిత మరియు అష్టావధాని

"పద్మశ్రీ" డాక్టర్ ఆశావాది ప్రకాశరావు గారి కృషి

– డా॥. ఆశావాది సుధాకర వంశీ
సంస్కృతోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
అనంతపురం, ఆంధ్రప్రదేశ్.

– ఆశావాది శశాంకమౌళి
హిందీ ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
అనంతపురం, ఆంధ్రప్రదేశ్.

భారతస్య ప్రతిష్టే ద్వే సంస్కృతం, సంస్కృతిస్తథా అనే ఆర్యోక్తిని పురస్కరించుకొని భారతదేశానికి మకుటాయమైనవి రెండేరెండు ఒకటి సంస్కృతము, రెండు సంస్కృతి. మన సంస్కృతి సాంప్రదాయాలకు నెలవైన తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మాతృభాష అయిన తెలుగు తల్లికి, తెలుగుభాషాభిమానులకు, సాహిత్యాభిమానులకు, రసహృదయులకు, కవిసార్వభౌములకు స్వాగతసుమాంజలినిలనర్పించుకుంటూ.

నరత్వం దుర్లభం లోకే విద్యాతత్ర సుదుర్లభా
కవిత్వం దుర్లభం తత్ర శక్తిస్తత్ర సుదుర్లభా

ఈ భూలోకంలో మానవజన్మ పొందటం చాలా గొప్ప అవకాశం. అందులోను విద్యావంతుడె ఉండటం ఇంకా గొప్ప అవకాశం. విద్యావంతుడు కవిగా మారటం, కీర్తి గడించటం పూర్వజన్మ సుకృతం. అలాంటి ధన్యజీవి పద్మశ్రీ డా॥ ఆశావాది ప్రకాశరావు గారు. వీరి రచనలలో ఆదర్శసమాజ నిర్మాణం కోసం ఏ విధంగా ప్రయత్నం చేసారో, నేడు ఈ అంతర్జాల వేదికగా నా పత్రసమర్పణ చేస్తున్నాను. కవితాలోకానికి పద్మశ్రీ డా॥ ఆశావాది ప్రకాశరావు గారి రచనలలో దాగివున్న చాలా విభిన్న కోణాలలో ముఖ్యమైన కొన్ని కోణాలను సమాజానికి పరిచయం చేయటమే లక్ష్యం.

పద్మశ్రీ డా॥ ఆశావాది ప్రకాశరావు గారి సంక్షిప్త పరిచయం :

1944వ సంవత్సరం ఆగస్టు 2వ తేదీన దివంగత శ్రీమతి కుళ్యాళయమ్మ, శ్రీ పక్కీరప్ప గార్ల మొదటి సంతానమైన ఆశావాది ప్రకాశరావు గారు సాధారణమైన కుటుంబంలో జన్మను పొంది అసాధారణమైన వ్యక్తిగా వ్యక్తిత్వ నిర్మాణాన్ని పెంపొదించుకున్నారు. "అవకాశం రాదు, అవకాశాన్ని చేజిక్కించుకోవాలి". అనే సిద్ధాంతాన్ని అనుసరించి కలిసివచ్చిన అవకశాలను చేజార్చుకోకుండా బాల్యదశ నుండి తనదైన ప్రత్యేకతను ప్రదర్శిస్తూ ఎదిగారు.

మన మాజీ రాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ గారి చేతుల మీదుగా 12వ యేటనే బాలకవిగా బిరుదును పొందినారు. పద్మశ్రీ డా॥ ఆశావాది ప్రకాశరావు గారు సుఖమంటే ఎమిటన్న ప్రశ్నకు కష్టం అంటే తెలిస్తేనే కదా సుఖమంటే తెలియడానికి అనే విషయాన్ని మరచిపోక నిత్యం కష్టంలోనే సుఖాన్ని, ఆనందాన్ని పొందుతూ సరదా అన్న మాటకు తావివ్వక కష్టమన్న మాటనే సుఖమయంగా మార్చుకొని తన 12వ యేట నుంచే అవధాన ప్రక్రియను మొదలుపెట్టి అవిశ్రాంతంగా తనదైన ప్రత్యేక నైపుణ్యంతో తెలుగురాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా అవధానాలను చేసి ఎంతో పేరు ప్రఖ్యాతలను సంపాదించుకున్న వారు పద్మశ్రీ డా॥ ఆశావాది ప్రకాశరావు గారు.

సరస్వతీ కటాక్షంతో తెలుగు ప్రజలకు మాత్రమే ప్రత్యేకమైన అవధాన ప్రక్రియను ఎంచుకొని దానినే జీవిత పరమావధిగా మార్చుకొని ప్రసిద్ధ అష్టావధానిగా, శతావధానిగా, రచయితగా, విమర్శకుడిగా అవధాన విద్యలో పేరును సంపాదించుకోవడమే కాక ఎంతటి కష్టమైన సమస్యనైనా సునాయసంగా జయించగలిగే ప్రతిభను ప్రదర్శిస్తూ, తనకుంటూ ఒకప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. అవధాన విద్య అనేది ఒక జాతికి

మాత్రమే పరిమితం కాదు అని నిరూపించి అవధాన ప్రక్రియలో తనదైన శైలిని ప్రదర్శించి, ఎంతోమంది శిష్య ప్రశిష్యులను అవధానులుగా, కవులుగా, పరిశోధన విద్యార్థులుగా తయారు చేశారు.

పద్మశ్రీ డా॥ ఆశావాది ప్రకాశరావు గారు తనదైన శైలిలో అత్యంత ప్రతిభావంతులైన వారి మధ్యన ఉంటూ ప్రజ్ఞతో, ఆకర్షణీయమైన విద్యతో ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నారు. ఎంతో మందికి జ్ఞానగురువులుగా, ఆదర్శ ప్రాయులుగా విశిష్టసేవలను అందిస్తూ లౌకిక సమాజానికి అలౌకిక సాహిత్య సమాజానికి నిరంతరాయంగా సేవలందిస్తూ అవిశ్రాంతంగా 78 సంవత్సరాలు చాలా నిరాండంబరమైన జీవనాన్ని సాగిస్తూ జనవరి 26వ తేది 2021న భారతప్రభుత్వంచే అత్యంత గౌరవప్రదమైన పద్మశ్రీ అవార్డును భారతదేశ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ''అవధాన రంగానికి'' ఇవ్వడం, అందులోనూ ఆద్యుడుగా పద్మశ్రీ డా॥ ఆశావాది ప్రకాశరావు గారితో మొదలవ్వటమూ, కవిగా, రాయలసీమ సరస్వతీ పుత్రుడిగా భారతదేశ చరిత్ర పుటలలో మరోమారు రాయలసీమ చరిత్రను అందరూ స్మరించేలా, ఉటకించేలా చేసి ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిగా కీర్తి గడించారు. తన సాధారణమైన జీవన విధానంలోనే ఆనందాన్ని పొందుతూ, సాహితీసేవలోనే తన జీవితాన్ని గడుపుతూ 2022 ఫిబ్రవరి 12వ తేదీన ''కానరాని దొంగ కాలహర్త'' అన్న నండూరి రామకృష్ణమాచార్యుల వారి మాటలకు తానూ అతీతున్ని కాదని, ఆ కాలస్వరూపుడిలో ఐక్యం పొందినారు కీ॥శే॥ పద్మశ్రీ డా॥ ఆశావాది ప్రకాశరావు గారికి అంజలి ఘటిస్తున్నాను.

''గద్యం కవినాం నికషం వదన్తి'' అంటే గద్యకావ్య రచనయే కవియొక్క ప్రతిభకు నిదర్శనమని లోకోక్తి. గద్యకావ్య రచన చేయడానికి ప్రయత్నం చేసి సఫలీకృతులైనారు కీ॥శే॥ పద్మశ్రీ డా॥ ఆశావాది ప్రకాశరావు గారు. ఒక కవి పద్యంగానైన తన మనస్సులోనైనా, వదనంగానైనా మనస్సులోని భావాలను కాగితంపై లిఖించవచ్చు. సమాజంలో పద్యకవిత ద్వారా కన్నా రచన కవిత ద్వారానే కవి ఎక్కువ ప్రజాదరణ పొందుతారన్నది సత్యమని చెప్పకతప్పదు.

ఆశావాది ప్రకాశరావు గారి రచనలలో ఎక్కువగా కవి హృదయాన్ని ప్రభావితం చేసిన అంశాలను ఎంచుకొని ఆయా అంశాల ద్వారా వాటిలో దాగివున్న కవుల రసతత్వ భావాన్ని వ్యక్తీకరించడానికి నేటి సమాజంలో అత్యంత ప్రభావం చూపుతున్న అంశాలకు వినూత్న సమాధానాలు చెప్పే ప్రయత్నం చేసారని చెప్పవచ్చు.

ప్రాణం లేని దానికి ప్రాణం పోసే శక్తి ఒక్క హృదయానికి మాత్రమే సాధ్యం. దీనికి ఉదాహరణగా కాళిదాసు మహాకవి ఒకచోట ఒక స్త్రీ ధరించిన గజ్జలలోని మువ్వలను గూర్చి ఇలా అంటాడు.

శైశాస్థలీ యత్ర విచిన్వతాత్వాం
భ్రష్టం మయా నూపురమేవమువ్యాం
అదృశ్యతా త్వత్ చరణారవిందాత్
విశ్లేష దు:ఖాదివ బద్ధమౌనమ్

సాధారణంగా కొంతమంది గొప్ప కవులయొక్క ప్రభావం వారి సమకాలికులపై కానీ లేదా వారి తదనంతర తరంపై గాని ఎక్కువగా ఉంటుంది. దీనికి కవులెవ్వరూ అతీతులు కారని చెప్పవచ్చు.

కవుల యొక్క సహజస్వభావం సాహిత్యపరమైనవే కాక కొత్తదనం కోసం కొత్తకొత్త ప్రయోగాలు చేయటమనేది సాధారణమైన విషయమే. అయితే అదే కోవలోకే వచ్చేవారే పద్మశ్రీ డా॥ ఆశావాది ప్రకాశరావు గారు. కేవలం ఆధునిక సమాజంలో ఉన్న రుగ్మతలను మాత్రమే కాక అనాదిగా వున్న కొన్ని రకాలైన జాడ్యాలను ఇప్పటికి కూడా సమాజంలో పేరుకుపోయిన కులవివక్షను రూపుమాపడానికి కవిగా ఆశావాది ప్రకాశరావు గారు అనేక సందర్భాలలో కవిత్వం ద్వారా ప్రయత్నం చేశారు.

ఒక అవధానంలో ఒక పృచ్ఛకుడు కులం పరంగా అడిగ ప్రశ్నకు సమాధానం ఇలా ఇచ్చారు.

కులము మతము లెవ్వి కొలమానములు కావు
గుణమునా ముఖ్యమనుచు గురైరింగి
స్వ పర భేదము లేదా విడి స్వాగతించా రెప్పుడు
వచ్చిపోవు వారు బంధువులని

నేటి సమాజంలో వంచనకు గురిఅవుతున్న పంచములను గూర్చి ఎంతో బాధ పడుతూ వారిపై ప్రేమతో వారికి ధైర్యం చెప్పడానికి కులాన్ని అవమానపరిచే వారి విషయంలో నిలదీసి అడగడంలో తానేమీ తక్కువగాదని అందరూ భావించాలని ఇలా వ్రాస్తారు.

ఊపి రాడగనీక ఉరిత్రాడు బిగియింత్రు
ఆ గాలి మీ మిత్రుడైనయట్లు
ఆవాస మీయక అగచాట్లు కల్పింత్రు
ఆ నేల మీ తాతదైనయట్లు
త్రాగునీరియక ప్రాణాలు హరియింత్రు
ఆ గంగ మీ చుట్టమైనయట్లు
దిక్కుతోచగనీక దీపాలు కురియింత్రు
ఆ వెల్గు నీయబ్బదైనయట్లు
తే॥గీ॥ తేజమెల్లను హరియించి తిట్టుచుండ్రు
శూన్యహస్తాల గికుదించి చొక్కుచుండ్రు
పంచములని హసించి హింసించుచుండ్రు
ఓ సవర్ణులారా! కనుడు చిత్తమేదో?

ఎంతో ఆవేదనతో, బాధతో తాను తనతోటి వారు అనుభవించిన విషయాన్ని చెబుతూనే తను ఎంత బాధననుభవించారో తన లాగానే మరొక కులం వారు అనుభవిస్తే తెలుస్తుందని "విద్వాన్నేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమం నహి ఉర్వి ప్రసవవేదన" అనే దానికి నిదర్శనంగా నిలిచారు. ఓ సవర్ణులారా మానవత్వంతో ఆలోచించండి అని గౌరవానికి భంగం వాటిల్లకుండా సవినయంగా వారిని పేర్కొనటం కీ.శే. పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు గారి వినయ విధేయతలకు నిదర్శనం.

మన సమాజంలో కొంతమంది కులమతాలను ప్రోత్సహించే పీఠాధిపతులున్నారు. అటువంటి వారి విషయంలో ఆశావాది గారిని ఒక అవధానంలో ప్రశ్నించగా, అప్పుడాయన అస్పృశ్యతను సమర్థించే పీఠాధిపతుల విషయంలో ఇలా అన్నాడు.

ఎంత పీఠాధిపతులైన నేమి లెమ్ము
మానవత్వము నట్టేట మ్రగ్గజేసి
భేదభావాలు సృష్టించు వాదములకు
విస్తృతస్థితి యొక్కటే విలువనిచ్చు.

అంతేకాక అందరికి తెలిసే విధంగా, సులభంగా అర్థమయ్యే రీతిలో అంతరంగ తరంగాలు అనే వచన కవితా సంపుటిలో కొత్త నిర్వచనాలు అనే కవిత ద్వారా సమాజంలోని అనేకమైన సామాజికాంశాలకు, కొత్త నిర్వచనాలు ఇవ్వటం జరిగినది. బి.సి. (బడుగు బలహీన వర్గాలు) అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ దీనిని చాలా చమత్కారంగా వారిలో సృజన కలిగేలా, ఎవరైనా తప్పులు చేస్తుంటే వారి చెంపచెల్లు మనేలా ఇలా వ్రాసాం.

వెనుకబడినవాడంటే ఎవరో కాదు
అమ్మాయిల వెంటపడేవాడు
తరగతి గదిలో చివరి బెంచీవాడు
చదువులో చేతగానివాడు.
వెనుకబడినవాడంటే ఎవరో కాదు
అమ్మాయిల వెంటపడేవాడు
తరగతి గదిలో చివరి బెంచీవాడు
చదువులో చేతగానివాడు.

సమాజంలో వెనుకబడినవారు అన్న ప్రయోగంలో ఒక జాతివారిని ఉద్ధేశించి చేస్తున్నట్లుగా వినిపిస్తుంటుంది. ఈ రకమైన దానికి స్వస్తి చెప్పి నూత్నమైన కొత్త నిర్వచనాన్ని సమాజానికి తెలియజేసారు. ఇలా చెప్పటం గూడార్థాన్ని ప్రయోగించడం కవి కౌశలత్వానికి ప్రతీక.

వెనుకబడినవాడంటే కులం చేత మాత్రమే వెనుకబడినవాడు కాదని కులం గొప్పదైనా చేయకూడనీ పనులను చేయడం ద్వారా కూడా వెనుకబడినవాడవు తాడని అతనే అసలైన వెనుకబడిన వాడని కీ.శే. పద్మశ్రీ

డాక్టర్ ఆశావాది ప్రకాశరావు గారి అభిప్రాయం గోప్యంగా కనబడుతున్నది.

గిరిజనుడంటే ఎవరో కాదు
కోతిలా ఇతరులను వెక్కిరించేవాడు
కొండముచ్చులా ప్రవర్తించేవాడు
పులిలా గాండ్రించి దూకేవాడు

సనాతనధర్మం తెలిసి, నాగరికతలో పెరిగి, ఆలోచనా పరిపక్వతాజ్ఞానాన్ని కలిగియుండి కూడా జీవనవిధానం తెలియనివారిని, నాగరికతా అవగాహన లేనివారిని, యుక్తాయుక్తజ్ఞాన రహితులైన వారిని తప్పుపడుతూ, అవహేళన చేస్తూ, అవమానపరుస్తూ కించపరుస్తున్నారు నేటి సమాజంలోని కొందరు. గిరిజనులకు చేతనైతే చేయూతనివ్వాలి లేకపోతే హద్దుదాటక ప్రవర్తిస్తే మంచిది అంతేకాని వారిపై చిన్నచూపు తగదనే భావన ఎంతటి హృదయద్రవీభూతస్ఫురణనో అలాగే సాటి కులస్తుల పట్ల చదువుకోవడానికి నోచుకోని వారిపట్ల ఎంతటి దయ కలిగినవారో మనమందరం కూడా ఆలోచించవలసిన అవసరం ఉంది. ''పులిలా గాండ్రించి దూకేవాడు'' సామాన్యంగా మనమందరం ప్రాణభీతి కలిగియుంటాం అదే ప్రాణభీతి గిరిజనులకు ఉంటుంది. కాని వారు చేయగలిగే సాహసోపేతమైన చర్యలు, ఆలోచనలు, శారీరకమైన పనులు పట్టణవాసులు చేయలేరు. పట్టణ వాసులకు బాగా చదవగలిగే సామర్థ్యం ఉంటుంది. అదే శారీరకమైన, మానసికమైన సమస్యలే వస్తే భరించడానికి శక్తి చాలా తక్కువ ఉంటుందనే విషయం సర్వవిధితం. గిరిజనులు పల్లెటూరులో ఏ రకమైన సదుపాయాలు లేక, నానా ఇబ్బందులను ఎదుర్కొంటూ, ప్రకృతికి ఎదురీదుతూ సమస్యల వలయాలతో శారీరక, మానసిక, ఆర్థికపరమైన ఇబ్బందులను అత్యంత సునాయసంగా ఎదుర్కొని జీవనప్రయాణం సాగిస్తుంటారు. ఈ లక్షణాలు కలిగియుండడం చేతనే కాబోలు గిరిజనుడైన వారిని కవిగారు సమస్కుల పట్ల పులిలా గాండ్రించి దూకేవాడు అనే పదప్రయోగం చేసివుంటారని అనిపిస్తుంది.

''రవిగాంచనిచో కవిగాంచునుననే'' మాటను సార్థకం చేస్తూ పద్మశ్రీ డా. ఆశావాది ప్రకాశరావు గారు సూర్య కిరణాల కంటే వేగంగా, చురుకుగా జనహృదయాలలోకి ప్రవేశించే విధంగా పదునైన మాటలను తన కవితలలో ప్రయోగించారని చెప్పవచ్చు.

నేటి సమాజంలో చాలామంది తల్లిదండ్రులు వారి సంతానం విషయంలో ఎంతో క్లేదాన్ని, క్లేశాన్ని అనుభవిస్తున్నారు. ఉద్యోగాల వేటలో, సంపాదన కోసమని దేశవిదేశాలకు వెళ్ళి అక్కడే ఉండిపోతూ ఇటు తల్లి దండ్రులకు మోయలేని భారాన్ని ఒంటరితనాన్ని మిగిలిస్తున్నారన్నది నగ్నసత్యం. ఆ విషయాన్ని డాక్టర్ ఆశావాది ప్రకాశరావు గారు ఆ సంతానానికి కనువిప్పు కలిగేవిధంగా నిజంగా తల్లిదండ్రుల పైన ప్రేమ మమకారం ఉన్నట్లయితే ఆ తనయుడు బ్రతికి ఉన్నప్పుడు చేయవలసిన మానవధర్మాలను మానేసి పూజలు, గుళ్ళు, గోపురాలు అంటూ తిరుగుతూ పుణ్యాన్ని సంపాదించుకోవడానికి అనేక పనులను చేస్తున్నాడు అవన్నీ వృథా అని అసలైన ప్రేమకు అర్థం ఈ క్రింద తెలియ పరిచారు. ఆశావాది గారు సమాజంలో ఏ ఒక్క వ్యక్తైన తన మాటను ఆలకిస్తాడని, పాటించడానికి ప్రయత్నం చేస్తాడని ఆశా దృక్పథంతో ఇలా వర్ణించారు.

తల్లిదండ్రి మీద తగ భక్తియే యున్న
కోట్లకొలది సురల గొల్వనేల?
తపము జపము లేల? దానధర్మము లేల
పుణ్యతీర్థములకు బోవనేల?

చివరిగా కీ.శే. పద్మశ్రీ డాక్టర్ ఆశావాది ప్రకాశరావు గారు బడుగు బలహీనవర్గాలపై రచించిన పాటతో ముగిస్తున్నాను.

బగుగులమని బడుగులమని
పరుల పంచలో పడిపడి చస్తే
నీది బ్రతుకవుతుందా?
నీకూ ఒక గతి ఉంటుందా?

స్వార్థపూరితమురా కులసంఘాలు
స్వార్థపూరితమురా జనకలహాలు
నీ తలలోపల మెదడుందని
నీ మొలమాటున బలముందని
ఎందుకు ఎందుకు ఎందుకు మరిచావ్?
ముందుకు ముందుకు దూసుకు వెళ్లక
ఎవడో నిను హెచ్చరిస్తే
ఇంకెవడో నిన్న నింగికెత్తితే
నీ పనిపాటుల నీళ్లను గలిపి
వారి పనులలో కూరుకుపోయి
ఎన్నాళ్లని ఎన్నాళ్లని ఈ రీతిగ దాస్యం
ఇంకెప్పుడు ఇంకెప్పుడు నీకగురా లాస్యం?

కులాలను అడ్డుపెట్టుకొని వారి స్వార్థప్రయోజనాల పొందుతూ, కాలాయాపన చేస్తూ ఇతరుల పంచలో బ్రతికే వారు కాస్త ఆలోచించాలని కవి చాలా ఆరాటపడడం, అంతేకాక నీకున్న తెలివితేటలను గాలికి వదిలేసి వాళ్ల కోసం, వీళ్లకోసం పని చేస్తూ పోతే అతి గతి లేకుండా, నీకు గుర్తింపు లేకుండా పోతుంది అంటూ జాగురూకత చేయటం, నీవు నీ ఆలోచనను, శక్తిని నమ్ముకో అనే దానిలో ముందుకు పోయి పని చేయి, అటువంటప్పుడే నీవు పైకి ఎదుగుతావు. అప్పుడే నీ శ్రమకు ఫలితం దక్కుతుందని అభిప్రాయాన్ని చెప్పటం, నీ మీద నీవు నమ్మకంగా ఉండు ఇతరుల మీద కాదు అనే స్వశక్తి తత్వాన్ని బోధించడం చాలా ఉత్తమైనదిగా చెప్పవచ్చని తెలియపరుస్తూ ముగిస్తున్నాను.

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణం స్త్రీ వాద కథ

– డా॥. యు. రమాదేవి, తెలుగు మెంటార్, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంతిక విశ్వవిద్యాలయం, నూజివీడు, కృష్ణా జిల్లా.

'హితేన సహితం సాహిత్యం....' అన్నారు పెద్దలు. అంటే హితాన్ని కలిగించేది సాహిత్యం. ఆదర్శ సమాజ నిర్మాణంలో కథాసాహిత్యం పాత్ర కొనియాడదగినది. పిల్లల నుండి పెద్దలవరకు అందరిని అలరింపచేసే శక్తి కథా సాహిత్యానికి వుంది. ఈ పత్రంలో నేను స్త్రీవాద కథ ఆదర్శ సమాజ నిర్మాణంలో ఎలాంటి పాత్ర పోషిస్తుందో వివరించడానికి ఆరు కథలు తీసుకున్నాను. ఈ అంశాన్ని వివరించడానికి ముందు స్త్రీ స్త్రీవాదం, స్త్రీవాద కథ నేపథ్యాన్ని వివరిస్తాను.

ఆంధ్రదేశంలో స్త్రీవాద ఆవిర్భావం :

ఆంధ్రదేశంలో స్త్రీవాదం ఆరంభమై, ఒక ఉద్యమంగా కొనసాగడానికి ఆంధ్రదేశ సామాజిక పరిస్థితులే అధికంగా దోహదపడ్డాయి. ఎందుకంటే ఆంధ్రదేశంలో స్త్రీలు తర తరాలుగా అనేక కట్టుబాట్లకు అర్థంపర్థంలేని ఆచార వ్యవహారాలకు బలైపోయారు. వీటినుండి విముక్తి పొందడం అంత సులువైనపనికాదు. ఆనాటి స్త్రీ జీవితాన్ని అర్థంచేసుకోవడానికి కందుకూరి వీరేశలింగం నవలలు ఎంతగానో ఉపయోగపడతాయి.

సంఘసంస్కరణోద్యమాల కాలం నాటి స్త్రీ ఉద్యమాలకు, స్త్రీవాద ఉద్యమానికి మౌలికమైన ఉంది. సంఘ సంస్కరణోద్యమాలు స్త్రీల కోసం పురుషులు నిర్వహించిన ఉద్యమాలు. తేడా స్త్రీవాదోద్యమం స్త్రీల కోసం స్త్రీలే నిర్వహించే ఉద్యమం. ఆంధ్రదేశంలో 1973లో 'ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఫర్ ఉమెన్' సంస్థ ఏర్పడడంతో స్త్రీవాద ఉద్యమానికి తొలి బీజాలు పడ్డాయి. ఎమర్జెన్సీ తరువాత, అంటే... 1977లో ఏర్పడిన స్త్రీ శక్తి సంఘటన, ఆ తరువాత పదేళ్లకు ఏర్పడ్డ ఫెమినిస్టు స్టడీ సర్కిల్ 'వ్యక్తిగతమంతా రాజకీయమే' అనే స్త్రీవాద దృక్పథానికి ప్రచారం కల్పించడానికి, పునరుత్పత్తి హక్కుల చైతన్యం కలిగించడానికి విశేషంగా కృషిచేసాయి. వివిధ ప్రాంతాల్లో చిన్న చిన్న గ్రూపులు ఏర్పడ్డాయి. ఇవి స్త్రీ సమస్యల మీద అవగాహన పెంచడానికి, వరకట్న సమస్యకు, కుటుంబ హింసకు వ్యతిరేకంగా స్త్రీల ఉద్యమాలు నిర్మించడానికి కృషిచేసాయి. ఈ గ్రూపులన్నీ సామాజిక విముక్తితోనే స్త్రీ విముక్తి ముడిపడి ఉందన్న సత్యాన్ని గ్రహించడం వల్ల వీరు సామాజికపరమైన కార్యక్రమాలే ఎక్కువగా నిర్వహించారు. అందుకే ఈ విముక్తితోనే స్త్రీ విముక్తి ముడిపడి ఉందన్న సత్యాన్ని గ్రహించడం వల్ల వీరు సామాజిక పరమైన కార్యక్రమాలే ఎక్కువగా నిర్వహించారు. అందుకే ఈ గ్రూపులన్నీ 1995 సెప్టెంబర్ లో 'ఆంధ్రప్రదేశ్ చైతన్య మహిళా సమాఖ్య'గా ఐక్యమయ్యాయి.పైన పేర్కొన్న వివిధ సంస్థలతో పాటు కొన్ని పత్రికలు కూడా స్త్రీవాద ఉద్యమ వికాసానికి తోడ్పడ్డాయి. వాటిలో ఆంధ్రజ్యోతి దినపత్రిక, మహిళామార్గం, మాతృక, భూమిక మొదలైనవి. ముఖ్యంగా చెప్పుకోదగ్గవి.

స్త్రీ వాదం 1970 దశాబ్దంలో ఒక ఉద్యమ రూపంలో మొదలైనప్పటికి, దీనికి బీజాలు మాత్రం కొన్ని దశాబ్దాల క్రితమే మొదలైయ్యయి అని అంటారు డా.మృ ణాలిని గారు. వీటిని ఆవిడ విశ్శబ్ధ విప్లవాలుగా అభివర్ణించారు

తొలి కథగా పిలవబడే బండారు అచ్చమాంబ రాసిన 'స్త్రీ విద్య' కావచ్చు, గురజాడ రాసిన 'దిద్దుబాటు కావచ్చు' వీటికి కథా వస్తువు ''స్త్రీ, స్త్రీ చైతన్యం''కావడం విశేషాంశంగా చెప్పవచ్చు. ఈ క్రమంలో 1980 తరువాత తెలుగు సాహిత్యంపై స్త్రీవాదోద్యమం ప్రభావం చూపింది. ఈ ఉద్యమం ద్వారా ప్రభావితం చెందిన రచయితలు, రచయిత్రులు స్త్రీలకు సంబంధించిన అనేకాంశాలపై కథలు రాయడం జరిగింది. ఇప్పుడు కొన్ని కథలను పరిశీలిద్దాం!

అంటురోగం :

ఈ కథ 30 జూలై 2006న ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో వెలువడింది. రచయిత్రి కె.ఎన్. మల్లీశ్వరి సాధారణంగా స్త్రీలు బస్సులలో ప్రయాణించేటప్పుడు ఎదుర్కొనే 'లైంగిక హింస'ను గురించి వివరించడమే ఈ కథలోని వస్తువు. ఈ కథలో ప్రధానపాత్ర నీలిమ. ఈమె ఉద్యోగస్తురాలు. ఒకరోజు బస్సులో ఆఫీసుకి వెళు తుండగా నీలిమ వెనుక సీటులో ఉన్న వ్యక్తి తన చేతివేళ్లతో నీలిమ వీపు మీద గోకుతాడు. అది గమ నించిన నీలిమ అతన్ని మందలిస్తుంది. నీలిమ మాటలకు అతను అవమానకరంగా మాట్లాడతాడు. ఆ మాటలు ఆమెను కుంగదీస్తాయి. ఆ బాధతో ఆఫీసుకి చేరు కుంటుంది. మధ్యాహ్నం భోజన సమయంలో ఆ ఆఫీసు స్త్రీలంతా కలిసి, తమకెదురైన అలాంటి అనుభవాల గురించి (లైంగికహింస) చర్చించుకుంటారు. అంతేకాక ఇక ముందైనా తమపై జరిగే లైంగికహింసను ప్రతి ఘటించాలచుకోవడంతో కథముగుస్తుంది.

కథా విశ్లేషణ :

ఈ కథలో నీలిమ చైతన్యవంతురాలైన స్త్రీగా కనిపిస్తుంది. ఆమెపై జరిగిన లైంగిక హింసను ప్రతిఘటి స్తుంది. నీలిమ ఎదుర్కొన్న ఈ హింస ప్రతి ఒక్క స్త్రీ ఏదో ఒక సందర్భంలో ఎదుర్కొంటుంది. నీలిమ తనను లైంగిక హింసకు గురిచేసిన వ్యక్తితో మొదటిసారి 'మీకే చెప్పేది చెయ్యి తీయండి... అంటుంది. అతను చెయ్యి తీస్తాడు. మళ్లీ కొంతసేపటికి అలాగే చేస్తాడు. రెండోసారి నీలిమ, 'అలా మీదపడతారేంటి. సరిగా నిలుచోండి'... అని గద్దిస్తుంది. ఆ మాటలకతను ''ఏంటమ్మా!.. ఇందాకట్నుంది. చూస్తున్నాను. పెద్దాడినని కూడా చూడకుంటా ఒకటే అంటున్నావు. నిన్ను అంటుకోవడం నాకేమన్నా. సరదానా...?'' అంటూ మాట్లాడతాడు. ఆ మాటలకు ఇద్దరు, ముగ్గురు మగవాళ్లు కూడా అంతగా ముట్టుకోకుండా ఉండాలంటే కారులోనో, ఆటోలోనో వెళ్లండి'' అంటూ సలహా ఇస్తారు. ఆ మాటలు నీలిమను ఆశ్చర్యానికి, అవమానానికి గురిచేస్తాయి. అతను తప్పుచేసి కూడా తప్పును అంత తెలివిగా సమర్థించు కున్నందుకు ఆశ్చర్యపోతుంది. అంతేకాక, సహ పురుష ప్రయాణికులు ఇచ్చిన నలహామ అవమానంగా భావిస్తుంది.

ఆఫీసుకి చేరుకున్నాక కూడా ఆమె ఇదే విషయం గురించి ఆలోచిస్తూ వుంటుంది. మధ్యాహ్నం ఆ ఆఫీసు స్త్రీలంతా కలసి ఇదే విషయం మీద చర్చించుకుంటారు. నీలిమ సహోద్యోగి అయిన సరళ, 'ఇంతకు ముందు పనిచేసిన మేనేజర్ పెట్టిన లైంగిక హింసను, అంటే... చూపులో వేధించడం, భోజన సమయంలో ద్వందార్థలతో మాట్లాడటం, అవకాశం దొరికినప్పుడు తాకడం... మొదలైన చర్యలను భరించలేక ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, ఇక్కడ చేరానని చెబుతుంది.

నీలిమ తన పాత స్నేహితురాలైన సరోజ గురించి చెప్తూ... సరోజా నేను మంచిస్నేహితులం. ఒకరోజు ఇద్దరం కాలేజీ నుంచి తిరిగివస్తుండగా... ఒకతను వేగంగా వచ్చి సరోజ ఛాతిని బలంగా ఢీ కొట్టాడు. ఆ దెబ్బకు సరోజ శారీరకంగా, మానసికంగా కుంగిపోతుంది. అంతవరకూ నిటారుగా నడిచిన ఎ సరోజ, వంగి నడవడం మొదలు పెట్టింది. కాలక్రమంలో 'ఫ్రిజిడిటీ' అనే మానసిక వ్యాధికి గురై, పెళ్లి తరువాత కూడా భర్తకు శారీరకంగా, మానసికంగా దగ్గరకాలేకపోతుంది. అందువల్ల భర్త, విడాకులు కావాలంటూ కోర్టుకెళ్లాడు. కేసు నడుస్తుంది... అంటూ ముగిస్తుంది. నీలిమ చెప్పిన ఈ మాటలు ప్రతి ఎ ఒక్కరి హృదయాన్ని కదిలించాయి. అక్కడున్న స్త్రీలంతా ఇకముందైనా తమపై జరిగే లైంగిక హింసను మౌనంగా భరించకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని నిర్ణయించు కోవడంతో కథముగుస్తుంది.

దృష్య కీచకం :

ఈ కథ, మార్చ్ 2009న ఆంధ్రజ్యోతి అనుబంధంలో ప్రచురించబడింది. రచయిత్రి కొండేపూడి నిర్మల. ఈ కథ, ఉద్యోగం చేసే స్త్రీ ఒక పురుషుని ద్వారా ఎదుర్కొన్న

సమస్యను వివరించడం దీనిలోని ప్రధాన వస్తువు. ఈ కథలో ప్రధాన పాత్ర ప్రసన్న. ఈమె కార్పొరేట్ సంస్థలో ఉద్యోగిని. ఒకసారి ఉద్యోగంలో భాగంగా ఒక కాంట్రాక్ట్ కోసం ఇంటర్వ్యూకి వెళుతుంది. ఇంటర్వ్యూ బాగా చేశానని నమ్మకం కలిగి, ఆ కాంటాక్ట్ తనకు వస్తుందని ఆశిస్తుంది. ప్రసన్నను ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి, ఇంటర్నెట్ చాటింగ్ లో కలపి ఆమె ఎడల అసభ్యంగా ప్రవర్తిస్తాడు. దాంతో ఆమె ఆందోళనకు గురవుతుంది. క్రమక్రమంగా తనను తాను ధైర్యపరచుకొని ఎలాగైనా ఆ కాంట్రాక్ట్ పని దక్కించుకుని ఆ పనిని విజయవంతంగా ముగించాలని నిర్ణయించుకోవడంతో కథ ముగుస్తుంది.

ఈ కథ సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో ఉద్యోగం చేసే స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్లు చిత్రించడం జరిగింది. ప్రసన్న ఎదుర్కొన్న మానసిక వేదనను. లైంగిక వేధింపుగా ఈ కథ సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో ఉద్యోగం చేసే స్త్రీలు ర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్లు చిత్రించడం జరిగింది. ప్రసన్న ఎదుర్కొన్న మానసిక వేదనను లైంగిక వేధింపుగా చెప్పవచ్చు.

ఇక అలాంటి వ్యక్తులతో కలసి పనిచేయలేనని ఆ కాంట్రాక్ట్ వదిలేసుకోవాలనుకుంటుంది ఆమె మనసు అంగీకరించదు. తనలో తాను ఎంతో సంఘర్షణకు గురవు తుంది. చివరికి తనను తాను . ధైర్యపరచుకుని స్వగతంలో 'వాడు ఉన్నందుకు ఉద్యోగం మానేసే దశ నుంచి, వాడి ముందే విజేతగా ఎదగాలి' అని అనుకుంటుంది. సమస్యను చూసి భయపడి పారిపోకుండా సమస్య ఉన్న చోటే నిలబడి, ఆ సమస్య ఎడల జాగ్రత్త వహించి తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ జీవితంలో ముందుకు సాగిపోవాలని తెలియచేయడం జరిగింది.

ఒక రాత్రి గడవాలి :

ఈ కథ 2003, జూన్ 15న 'వార్త పత్రిక అనుబంధంలో ప్రచురించబడింది. రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మిదేవి. స్త్రీ అస్తిత్వం అంటే ఏమిటి, కెరియర్ అంటే ఏమిటి, స్త్రీ స్వేచ్ఛ అంటే ఏమిటి?... మొదలైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన కథ ఇది. ఈ కథలో వినీల అనే అమ్మాయి, 'విహయస' అనే కలం పేరుతో రచనలు చేసిన సర్వలక్ష్మి కథలను చదివి, వాటిద్వారా చైతన్యం పొంది ఒక పైలట్ గా ఎదుగుతుంది. వినీల ఆ ఉద్యోగంలో చేరడానికి ముందు తన లక్ష్య సాధనకు బాటలు వేసిన సర్వలక్ష్మిని కలవడానికి వెళ్లడంతో కథ ప్రారంభమవుతుంది. వినీల, తన అభిమాన రచయిత్రి అయిన సర్వలక్ష్మి ఇంటికి వెళ్తుంది. వెళ్లిన దగ్గర నుండి ఆమెను గమనిస్తూ ఉంటుంది వినీల. సర్వలక్ష్మి జీవనవిధానం వినీలను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆ రచయిత్రి తన రచనల్లో చెప్పిన భావాలకు, అభిప్రాయాలకు భిన్నంగా ప్రవర్తిస్తున్నట్లు అనిపిస్తుంది. వినీల భావాలను గ్రహించిన సర్వలక్ష్మి ఆమె ప్రశ్నలన్నింటికీ జవాబు చెప్పడంతో కథ ముగుస్తుంది. ఇది ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం.

కథావిశ్లేషణ :

ఈ కథలో స్త్రీ అస్తిత్వాన్ని చాలా వినూత్నమైన రీతిలో పాఠకుల కళ్ల ముందు ఆవిష్కరించారు రచయిత్రి, స్త్రీ తనకు కావల్సినది పొందడం కోసం సమాజంతో పోరాగడంతో పాటు, ఆ పోరాటంలో తన వ్యక్తిగత కుటుంబ జీవితాన్ని కూడా సమన్వయం చేసుకుని ఒక ఉన్నత పంథాలో పయనించడమే అసలైన అస్తిత్వం అని రచయిత్రి చిత్రించారు. సర్వలన్న తన భర్త అయిన శంకరం గారికి అన్ని విధాలుగా సేవ చేస్తుంది. భర్త లేచే సరికి అతనికి కాఫీ అందించడం, దినపత్రిక అందివ్వడం చేస్తుంటుంది. అవసరం అనుకున్నప్పుడు భర్తకు వంటపని అప్పగిస్తుంది. ఇలా వారిరువురు సాగిస్తున్న జీవనవిధానం వినీలకు అంతుపట్టదు. సర్వలక్ష్మి ఆమెకు అర్థమయ్యి అర్థమవ్వనట్టు అనిపిస్తుంది. వినీల ఇక ఉండబట్టలేక తన మనసులో ఉన్న సందేహాలన్నీ నివృత్తి చేసుకుంటుంది. మొదటిగా వినీల సర్వలక్ష్మిని ఇలా అడుగుతుంది. 'గత పదేళ్లుగా మీరు ఏమీ రాయలేదు. ఎక్కడా

ఏ సభలోనూ కనిపించడం లేదు. ఇలా వంటింటికి, ఇంటికి, ఇంటి వెనుక పూల మొక్కలకి మీ తెలివి జ్ఞానాన్ని అప్పగించి ఉండిపోతారనుకోలేదు. మీరు ఇంతకాలం చెప్పిందేమిటి? మీరు ఇక్కడ... ఇలా... ఉంటారని ఊహించలేదు. ఆడవాళ్లు వంటిళ్లు వదిలి బయటకి రాకపోతే జీవితం లేదన్న మీరే ఇలా ఇంటికి బందీ అయిపోయారంటే నాకు దిగులుగా ఉంది. మీ రచనలు చదివి నేను ఇలా బయట ప్రపంచాన్ని గెలిచాను. తీరా ఇక్కడికి వచ్చి చూస్తే మీరూ మా అమ్మమ్మలాగా వడియాలు పెడ్తూ, పెసరట్లు వేస్తూ, ఇల్లు సర్దుతూ, సాధారణ గృహిణి అయిపోయారు. అందుకే అర్థం కావట్లేదు' అని ఆంటుంది. దానికి సమాధానంగా సర్వలక్ష్మి 'నేను చాలా చిన్నప్పుడే వంటిళ్ల ట్రెజరీని, ఇళ్ల పెత్తనాన్ని గ్రహించాను. అందుకే ఎదిరిస్తూ బయటి కొచ్చాను. బయటి ప్రపంచాన్ని నువు చెప్పినట్లు అర్థం చేసుకోవడమూ, గెలవడమూ చేసాను. ఆ తర్వాతనే ఇంటిని కూడా గెలవొచ్చని తెలిసింది. 'మరి సభలు సమావేశాలు ఎందుకు మానేశారు ' అదే నీ కంప్లయింట్. నా ఫోటో నీకు పేపర్లోకనిపించడం లేదని. అది నీ ఫ్యాన్సీ ఆలోచన కదూ! నాకు అర్థమయిదేమిటంటే బయటికి వచ్చేకొద్ది మనకి వచ్చే పాపులారిటీ, పేరు మనల్ని 'క్యాప్చర్' చేస్తాయి. మనం ఎందుకొచ్చామో మర్చిపోతాం. ఒక కెరీరిస్టుగా కాకుండా కోసం, ఒక మిగలడం కోసం నా స్వేచ్ఛని ఉపయోగించుకున్నానని అదే నన్ను ఇలాంటి జీవన విధానంలోకి తెచ్చిందని చెప్తే నీకు సులువుగా అర్థమవుతుందా.....'' అంటూ తన ప్రశ్నలన్నింటికి సమాధానం చెప్తుంది. వినీల తన ప్రశ్నలకు సమాధానాలు ఆమె మాట్లాడిన మాటల్లో వెతుక్కుని తృప్తి పడుతుంది.

పెళ్లి కాకుండా కలసి జీవించే జీవన విధానాన్ని (live together) గురించి సర్వలక్ష్మి వివరిస్తూ ''ఆడవాళ్లు ఎందుకు మోసపోతారో చెప్పనా? 'ఆడవాళ్లు, అన్నింటికీ మగవాళ్ల మీద ఆధారపడిపోతారు. అన్నింటికీ అంటే డబ్బు సరే, సాంఘిక భద్రత నుంచి, ఉద్వేగాల ఉపశమనం దాకా! ఒక మనిషి మీద ఆధారపడకుండా సంఘ నిర్మాణం నడవదు. నిజమే. నువ్వు అతని మీద ఎంతగా ఆధారపడుతున్నావో, అదే స్థాయిలో అతను కూడా నీ మీద ఆధారపడేలా నువ్వు తయారు కాగలవా? దాన్ని అతను కూడా గ్రహించుకునే లాగ చెయ్యగలవా ? '''' అంటూ వినీలాను ఆలోచింప చేసింది. ఈ విధంగా సాగిన వారిరువురి సంభాషణ వినీలాకు సంతృప్తిని కలిగిస్తుంది. ఆమె ప్రశ్నలన్నిటికి సమాధానం దొరికి నందుకు సంతోషిస్తుంది. ఈ కథలో సర్వలక్ష్మి, ''ఒక మానవిగా'' జీవించడం గమనించదగ్గ విషయం.

నిర్ణయం :

ఈ కథ ఓ రాసిన ''మృణ్మయనాదం'' అనే కథల సంపుటి నుండి గ్రహించబడింది. ఈ నిర్ణయం కథలో స్త్రీలు యెంతమంది పిల్లల్ని కనాలి, వారిలో ఆడపిల్లలు ఎంతమంది, మగపిల్లలు ఎంతమంది... మొదలైన అంశాల్లో స్త్రీలు ఎదుర్కొనే మానసిక సంఘర్షనను చిత్రించడం జరిగింది. ఈ కథలో కమల, విశ్వనాథం అన్యోన్య దంపతులు. విశ్వనాథం, కమలను ఇష్టపడి పెళ్లి చేసుకుంటాడు. కమల నర్సుగా పనిచేస్తుంటుంది. విశ్వనాథం మందుల కంపెనీలో పనిచేస్తాడు. వారికి తొలి సంతానం ప్రియాంక. రెండోసారి కమల గర్భవతి అని తెలుసుకున్న విశ్వనాథం, కమలను స్కానింగ్ చెయ్యించుకోమని, ఆడపిల్లని నిర్ధారణ అయితే అబార్షన్ చెయ్యించుకోమని ఆజ్ఞాపిస్తాడు. కమల పనిచేస్తున్న హాస్పిటల్లోని డాక్టరమ్మ (శైలజ) కు ఆడపిల్లలని తెలుసుకొని అబార్షన్ చెయ్యించుకోవడం అస్సలు నచ్చదు. అలాంటిది తన హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తున్న కమల, ఆ మాట తన భర్త చెప్పేసరికి ఆమె జీర్ణించుకోలేకపోతుంది. ఆ తరువాత శైలజ కమలతో 'నీకు అలాంటి ఉద్దేశం ఉంటే, లెక్కచూసి నీ కేతం తీసుకొని వెళ్లిపో, మళ్లీ రావద్దు' అని చెప్తుంది. కమల ఏమీ చెయ్యలేని పరిస్థితిలో ఉంటుంది. కనుల, అటు భర్త ఆధిపత్యాన్నీ, ఇటు డాక్టరమ్మ ఆధిపత్యాన్ని భరించలేకపోతుంది. ఒకరోజు కమల కాలుజారి

పడిపోతుంది. పొట్టకు బలమైనగాయం అవుతుంది. అందువల్ల డాక్టర్ ప్రమేయం లేకుండానే ఆమెకు అబార్షన్ అయిపోతుందని భయపడుతుంది. భర్త ఆమెను హస్పిటల్ కు తీసుకొని వెళ్లాడు. కమల తొందరగానే కోలుకుంటుంది. కమలను ఇంటికి తీసుకుపోవచ్చని డాక్టర్ చెప్తుంది. అందుకు కమల డాక్టర్ తో నాకు ఆపరేషన్ చేసేయ్యండి. నాకు ఒక కూతురు చాలు. ఈ నిర్ణయంలో మీ ప్రమేయంగాని, మా ఆయన ప్రమేయం గాని లేదు డాక్టర్. నా సొంత నిర్ణయం ఇది అని అనడంతో కథ ముగుస్తుంది.

ఈ కథను విశ్లేషిస్తే అనేక అంశాలు వెల్లడవుతాయి. దీనిలో ప్రతి స్త్రీ సంతానం విషయంలో ఎదుర్కొనే అంతరంగ పోరాటాన్ని, భర్త వల్ల ఎదురయ్యే ఇబ్బందులను చిత్రించటం జరిగింది. కమల రెండవసారి గర్భవతిగా ఉన్నప్పుడు భర్త విశ్వనాధం స్కానింగ్ తీయించుకోమని, ఆడపిల్లయితే అబార్షన్ చేయించుకోమని, తన మనసులోని మాట బయటపెడతాడు. ఆ మాటకు కమల చాలా భయపడుతుంది. ఆమె భయానికి అనేక కారణాలున్నాయి. వీటిలో మొదటిది: ఉద్యోగం గురించి. కమల నర్స్ గా పనిచేస్తున్న హాస్పిటల్లోని డాక్టరమ్మకు ఈ విషయం తెలిస్తే, ఆ ఉద్యోగం నుండి తీసేస్తుందని, రెండవది: అబార్షన్ చెయ్యించుకోకపోతే భర్త పెట్టే హింస. ఈ సందర్భాన్ని గమనిస్తే సమాజంలో సగభాగంగా ఉంటున్న స్త్రీలను ఎవరు కూడా ఒక మనిషిగా, ఇంకా చెప్పాలంటే మనసున్న మనిషిగా గుర్తించడం లేదు. అందుకే ప్రతి ఒక్కరూ ఆమెపై పెత్తనాన్ని చెలాయించి, వారివారి అభిరుచి మేరకు, సౌకర్యార్థం, స్త్రీ జీవించాలనే ఆలోచన కలిగివున్నట్లు స్పష్టమౌతోంది. పిల్లలకు జన్మనిచ్చే విషయంలో ప్రధాన భూమిక వహించేది స్త్రీ, నవ మాసాలు మోసి, తన ప్రాణాలను ఫణంగా పెట్టి బిడ్డకు జన్మనిస్తుంది. అలాంటి స్త్రీ యొక్క ఇష్టాఇష్టాలతో కాని ఆరోగ్య సంబంధమైన విషయాలతో కాని ఏమి సంబంధం లేకుండా పురుషుడు తనకు అనుకూలంగా స్త్రీ జీవితాన్నిమలచుకోవడం వెనుక అతని స్వార్థం వుంది.

ఈ కథ ప్రారంభంలో కమల కూడా పురుషస్వామ్యం ఉక్కుపాదాల కింది నలిగిపోతూ ఉంటుంది. కాని ఎప్పుడైతే ఆమె తన అస్తిత్వం గురించి, తన ఇష్టాఇష్టాలను గురించి ఆలోచించిందో అప్పుడు ధైర్యంగా, ఇక తనకు పిల్లలు వద్దనుకుని ఆపరేషన్ చెయ్యించుకోవడానికి సిద్ధపడడం ఆమెలో కలిగిన చైతన్యానికి సాదృశ్యంగా వుంది. తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో అలాంటి నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతుంది.

ఈ విషానికి ఈ తేనె చాలు :

ఈ కథలో హెడ్ మిస్ట్రెస్ చా పనిచేసిన వింధ్య అనే మహిళ ఏ విధంగా ఇతరులకు ఆదర్శవంత మయ్యిందో వివరిస్తూ ఆమె ఎదుర్కొన్న సనాతన సంప్రదాయ పద్ధతులు ఆమెను ఏవిధంగా మానసికంగా బలహీన పరిచాయో తెలియచేసే కథ ఇది.

ఇతివృత్తం :

వింధ్య హెడ్ మిస్ట్రెస్. వేరే స్కూల్‌కి బదిలీ అవుతారు. ఈ బదిలీకి నెలరోజులు ముందే ఒక యాక్సిడెంట్‌లో తన భర్తను కోల్పోతారు. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఆమె ఆ బాధనుండి తేరుకోలేకపోతుంది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయబడిన ప్రవచనాలు ఆమెకు నూతన ఉత్తేజాన్ని కలిగిస్తాయి. ఆమె పనిచేసే స్కూల్లో సైన్స్ టీచర్‌గా పనిచేస్తున అనురాధ ఈమెకు మంచి స్నేహితురాలవుతుంది. వింధ్య జీవితం అనురాధను ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అనురాధకు పెళ్లయిన నెలకే ఆ పెళ్లి విఫలమవుతుంది. ఆడుతూపాడుతూ చదివి, సరదాగా సంపాదించుకున్న ఉద్యోగం అప్పుడు ఆమెకు ఆధారం అవుతుంది. సమాజం నుంచి తనను తాను రక్షించుకోవడానికి మార్గాలు వెతకడం ప్రారంభిస్తుంది. మెడలు వంచి మంగళసూత్రం తీయకుండా వుంచుకోవడంలో ఆమెకు

భద్రత కనిపిస్తుంది. తన భర్త గల్ఫ్ దేశంలో వున్నాడని చెప్పుకుంటూ ఒక అబద్ధపు జీవితంలో బ్రతుకుతూ వుంటుంది. నిజాయితీగా జీవించడం ఎలా అని తనలో తాను చాలాసార్లు మదనపడుతుంది. విందు మేడం జీవితవిధానం తనకు అర్థం అవడం మొదలవగానే తన మనసులోని చిక్కులు వాటంతట అవే విడిపోసాగాయి. బలవంతపు గృహిణి వేషాన్ని ఒక్కొక్కటిగా విప్పడం మొదలుపెడుతుంది.

తన వివాహజీవితం విచ్ఛిన్నం కావడానికి కారణం తను కాకపోయినప్పటికీ ఒక ఆత్మన్యూనతా భావం పట్టుకొని పీడిస్తూవుండేది. ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అని సంకోచిస్తూ మానేసుకున్న సరదాలెన్నో ఒక్కటక్కటిగా రెక్కలు విప్పుకుంటూ తనలో నుండి బయటకు రాసాగాయి. వాటిలో ఒకటి పంజాబీ డ్రస్సు వేసుకోవడం, తనను తాను ప్రేమించుకోవడం. ఈ క్రమంలో విందును ఆరాధించడం మొదలుపెడుతుంది. ఒకసారి విందు ఎవ్వరికీ చెప్పకుండా ఒక రెండు వారాలపాటు సెలవుపెడుతుంది. ఏం జరిగిందో అనురాధకు అర్థంకాక, చాలా బాధపడుతుంది. సెలవులు ముగించుకొని విందు వచ్చాక, అనురాధ చాలా ఆప్యాయం గానూ బాధగాను చెప్పకుండా ఎక్కడికి వెళ్లిపోయారని అణకువతో కూడిన ప్రశ్నను సంధిస్తుంది. దానికి విందు సమాధానంగా 'ప్రవచనాల్లో భాగంగా ఆచార్యులు ఏదో పూజా కార్యక్రమం ప్రారంభించారు. భర్తలేని వారందరూ లేచి వెనక్కి వెళ్లమని చెప్పారు. సువాసినీ పూజట. చాలమంది ఆడవాళ్లు మౌనంగా లేచి, ఏదో తప్పు చేసిన వాళ్లలాగా వెనక్కివెళ్లిపోతున్నారు. నేనూ లేచాను బాధగానూ, అవమానంగానూ.

అప్పుడు ఆచార్యుల వారు కొన్నిమాటలు పలికారు. గతజన్మలలో చేసిన అపరాధాల కారణంగా స్త్రీలు ఈ జన్మలో విధవలవుతారని అది వారి దురదృష్టమని, వాళ్లకి శుభసమయాల్లోకి రావడానికి అర్హత లేదని చెప్పారు.

ఆ మాటలు నన్ను వెంటాడాయి. ఇదంతా నిజమేనేమో అనే భావం నన్ను నమిలేసింది. భారతీయ స్త్రీ ఈ వైధవ్య ముద్ర మోసి తీరాలేమో!

''ఇలా బయటకు వచ్చి ఆత్మగౌరవాలు కాపాడుకోగలగటానికి మేమెంత కష్టపడ్డాం? మాకోసం ఎందరెందరో పడిన కష్టం ఎంత విలువైనది? ఇలా నలుగురిలో ధైర్యంగా, గౌరవంగా బతికే మమ్మల్ని ఈ పీఠాధిపతులు మళ్లీ ఇలా గోతుల్లోకి తోసి పారేస్తారా? అని ఎంతో భయమేసింది. మరొక సందర్భంలో వినోద అనే ఆమె ఈ విధంగా చెబుతుంది. ''ఈ ఆడవాళ్లు మళ్లీ వెనక్కి వెళ్లిపోతున్నారు.

హిందూమతోద్ధారకులు, పీఠాధిపతులు వీధికొకరు తయారయ్యారు. వాళ్లే వీళ్లని ఇలా పాడుచేస్తున్నారు. శాస్త్రంలో ఏముందో వీళ్లకీ తెలియదు, వాళ్లకీ తెలియదు. ఎంతకష్టపడి బయటకొచ్చాం మనం? మళ్లీ మనల్ని ఎక్కడికి తీసుకుపోతారో అంటుంది''. ఈ మాటలు విందులో చాలా ధైర్యాన్ని, నూతన ఆలోచనను రేకెత్తించాయి.

ఈ కథ స్త్రీలలో వున్న బలహీనతలను, సమాజంలో జరుగుతున్న అంధవిశ్వాసాలను ప్రశ్నించే రీతిగా చేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే స్త్రీల సమస్యలను కొత్త దృక్కోణంతో చూసేటట్లు చేసింది. స్త్రీ వాదానికి ఇదొక మలుపుగాను, మైలురాయిగా చెప్పవచ్చు. తీసుకున్న వస్తువుని, రూపాన్ని చక్కగా సమన్వయం చేస్తూ రచయిత్రి చక్కగా వివరించారు.

ఈ విధంగా 'ఆదర్శ సమాజ నిర్మాణంలో స్త్రీవాద కథా సాహిత్యం' ప్రముఖ పాత్ర వహించిందని చెప్పవచ్చు. అయితే, ఇటీవల కాలంలో కొంతమంది కథా రచయితలు పనిగట్టుకుని స్త్రీలు ధరించే వస్త్రాలు, ఆభరణాలు మరి ముఖ్యంగా మెట్టెలు, మంగళ సూత్రాలు...మొదలైన వాటిగురించి తిరోగమన రీతిలో భావవ్యక్తీకరణ చేస్తున్నారు. ఇది వారి విజ్ఞత లేనితనాన్ని, అవగాహన రాహిత్యాన్ని తెలియచేస్తుంది. ఏది ఏమైనా 'స్త్రీవాద కథాసాహిత్య సేవ' వేనోళ్ల కొనియాడదగినది.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్ర జ్యోతి, ఆదివారం అనుబంధం, జులై-16, 2006,
2. ఆంధ్ర జ్యోతి, ఆదివారం అనుబంధం, మార్చి-8, 2009,
3. కిటికీ బయట వెన్నెల- వాడ్రేవు వీరలక్ష్మీ దేవి
4. జెండర్ స్పృహ.కాత్యాయని విద్మహే (సంపాదకత్వం)

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణం - ఆధునిక తెలుగు కవిత్వం పాత్ర

- డా॥. పల్లి కృష్ణ , వైస్ ప్రిన్సిపల్, తెలుగు ఉపన్యాసకులు, సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎమ్ డిగ్రీ మరియు పిజి కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

ఒకే సంస్కృతి, దానితో సంబంధసృహ ఉన్న జనసమూహం సమాజం. కొన్ని కొన్ని సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు జీవనవిధానాలు, విశ్వాసాలు, కళలు మొదలైన సాంస్కృతికాంశాలు మానవాళిలో కొందరికి సమానంగా ఉంటాయి. అలాంటి సామాన్య సంబంధమున్న జనసమూహాన్ని సమాజం అంటాము. కులవ్యవస్థ, శ్రమవిభజన, సహకారం, సంబంధం, భావవినిమయం సమాజానికి శ్రీరామరక్ష. ఈ సమాజం ఒకేచోట నివసిస్తున్నా ప్రజలలో జాతి, కుల, మత, వృత్తిపరంగా అనంతమైన జీవనవైవిధ్యం ఉంది. ఈ జీవన విధానంలో మనిషి అనేక పార్శ్వాలతో జీవించడం కనిపిస్తోంది. ప్రేమ, మమత, స్నేహం, జాలి, దయ, కోపం, ద్వేషం, భయం ఇత్యాదులు మనిషి తత్వాన్ని తెలియ జేస్తున్నాయి. అయితే మనుషుల్లో రాను రాను స్వార్థం ఎక్కువగా కనిపిస్తుంది. దీని వల్ల సమాజంలో సంకుచిత ఆలోచనలు పెరిగి మనిషి కుచించుకుపోవడం తెలుస్తోంది. కవులు, రచయితలు ఈ అంశాన్ని సాహిత్య వస్తువుగా తీసుకుని సమాజంలో మార్పు కోసం తపన పడటం, ఆందోళన చెందడం, పోరాటాలు చేయడం చూస్తున్నాం.

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన, మహనీయులు ఎందరో కలరు. నేటికీ ఆధునిక సాహిత్యం కోసం తమ వంతు కృషి చేస్తున్న సాహితీవేత్తలు ఉన్నారు. ఆధునిక సాహిత్యం అనే మహావృక్షానికి ఉన్న అనేక శాఖలలో కవిత్వం ఒక ప్రదాన శాఖగా అభివర్ణించవచ్చు. ఆధునిక తెలుగు కవిత్వం నేడు తన పరిధిని బహు ముఖీనంగా విస్తరింపచేసుకుంది. ఆధునిక తెలుగు కవిత్వం ఆదర్శ సమాజ నిర్మాణంలో పెద్ద భూమికనే పోషిస్తున్నదని చెప్పవచ్చు. ప్రతి కవి కూడా ఎక్కువ భాగం ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగస్వామి కావాలనే కోరుకుంటాడు. అందుకు తగ్గట్లుగా కవితావస్తువును ఎంచుకుంటాడు. ఆధునిక కవి సమకాలీన సమాజాన్ని చక్కగా తమ రచనలలో ప్రతిబింబిస్తున్నాడని చెప్పవచ్చు.

నాటి నుండి నేటికీ వరకు కవులు ఆదర్శ సమాజ నిర్మాణానికి కృషి చేసిన వారు, చేస్తున్న వారు ఉన్నారు. ఈ నేపథ్యంతో ఆధునిక తెలుగు కవులు తమ కవిత్వంతో సమాజంలో మార్పులు ఆశిస్తూ, సమసమాజ నిర్మాణం కోసం పాటుపడటం గమనించవచ్చు.

ఆదర్శ సమాజ నిర్మాణంలో ఆధునిక కవిత్వం పాత్ర :

ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగంగా ఆధునిక తెలుగు కవుల కవిత్వాన్ని పరిశీలిస్తే - ఆధునికత అన్నది గురజాడ నుంచే ప్రారంభము. ఛందస్సులో భాషలో, విషయంలో సాంఘికవ్యవస్థలో ఆయన తీసుకున్న చొరవ తర్వాతి తరం రచయితలకు దారిబత్తెమైంది. భాషా విషయకంగా గిడుగు తెచ్చిన విప్లవాన్ని స్వాయత్తం చేసు కొన్నాడు. సమకాలీన సామాజిక స్థితిగతుల్ని కందుకూరి నుంచి స్వీకరించాడు. సామాజికత, వర్తమానత, మానవతా అనే త్రివిధ సూత్రాల్ని తన సాహిత్యంలో విస్తృతంగా ప్రక్షేపించాడు.

ఈనాడు స్త్రీ పురుషులు పరస్పరం ఇచ్చి పుచ్చుకునే వరశుల్క, కన్యాశుల్కాలుగానీ, వివాహవిధిలోని సంప్రదాయ విచ్ఛేదకత గానీ మిగిలిన అన్ని సాంఘిక ధర్మాలను తనదైన ఆలోచనా స్రవంతిలోకి తెచ్చు కున్నాడు.

నేడు బాల్య వివాహాల దురాచారం నామ మాత్రాక శిష్టమై ఉంది. కన్యాశుల్కం తుడిచి పెట్టుకు పోయింది.

వరశుల్కం వెర్రితలలు వేసిన స్థాయినుంచి ఆలోచనా స్థాయిలోకి దిగివచ్చింది. విధవా వివాహాలు కులాంతర, మతాంతర వివాహాలు, విడాకుల విధానం స్త్రీ విద్యపట్ల అవగాహన, స్త్రీకి ఆర్థిక స్వావలంబన కల్పన గురజాడ ప్రసాదించిన ఆధునికమైన ఫలాలు.

గురజాడ వారి 'పూర్ణమ్మ'లో వారి భావనా శక్తి కవిత్వం అంచుల్ని, లోతుల్ని ముట్టింది. బాల్యవివాహాల విముఖత, కన్యాశుల్కం నిరసన, మూఢసంప్రదాయాల ఖండనలతో నాటి సమాజంలో పేరుకుపోయిన సంకుచిత భావజాలాన్ని అద్భుతమైన శిల్పదృష్టితో, వర్ణనలతో, శైలీ విన్యాసంతో కరుణరసాత్మకమైన గాథను నిర్మించాడు.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా!
వొట్టి మాటలు కట్టిపెట్టోయి
గట్టి మేల్ తలపెట్టవోయి" అంటూ -

"స్వంత లాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడుపడువోయి,

"దేశమంటే మట్టికాదోయి,
దేశమంటే మనుషులోయి!" లాంటి మహాసూక్తులతో దేశభక్తిని చాటుతూ ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యులయ్యారు. ముత్యాలసరాలులో విశ్వమానవ సౌభ్రాతృత్వం, విశ్వమానవ కళ్యాణం, విశ్వ శ్రేయస్సును ఆకాంక్షించాడు గురజాడ. 'యెల్ల లోకము వొక్క యిల్లె ' అంటూ లోకాన్నే ఒక ఇల్లుగా, మానవులంతా సోదరులుగా మెలగాలని గురజాడ పేర్కొన్నారు.

1940 తార్వాత ఒక దశాబ్దం పాటు ఆంధ్ర సాహిత్య లోకాన్ని ఉత్తేజితం చేసిన అభ్యుదయ కవిత్యోద్యమ మూలవిరాట్టు 'శ్రీశ్రీ'. వాస్తవికతతో పాటు అధివాస్తవికత, వ్యక్తి చైతన్యంతో పాటు సంఘ చైతన్యాన్ని సమానంగా ప్రభోదించారు. 1933లో రచించిన 'జయభేరి' వచన గేయ ఖండికలో -

"నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను!
నేను సైతం
విశ్వవృష్టికి
అశ్రు వొక్కటి ధార పోశాను!
నేను సైతం
భువన ఘోషకు
వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను!" అంటూ కొనసాగే గేయ ఖండికలో వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యంలో భాగస్వామ్యం అని తెలియజేశారు.

లోకమంతటా వర్గ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రయత్నించారు. శ్రీశ్రీని మార్క్సిజం బాగా ప్రభావం చూపింది. ఇది ఆయనలో సామాజిక దృక్పథాన్ని వెలి గించింది.

దోపిడీకి గురౌవుతున్న కార్మిక, శ్రామిక వర్గాల్ని అంతటినీ మరో ప్రపంచం పిలిచింది అంటూ 'మహా ప్రస్థానం'లో

మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరోప్రపంచం పిలిచింది!

పదండి ముందుకు, పడండి త్రోసుకు! పోదాం, పోదాం పైపైకి! అంటూ నూతన ప్రపంచం పట్ల కుతూహలాన్ని రగుల్ కొల్పాడు. "ఈలోకం మీదేనండి, మీ రాజ్యం మీ రేలండి!" అని ముగించి రాజ్యాధికారాన్ని వ్యక్తుల నుంచి తప్పించి సమాజానికి ఇప్పించడమే కవిత్వపు తుది లక్ష్యం అన్నాడు. శ్రామికులతో 'తిరుగు బాటు మా వేదాంతం' అనిపించారు. "ప్రపంచమంతట అభివృద్ధిని కాంక్షించే కవుల స్వప్నాలు రష్యన్ విప్లవంలో ఆకృతి ధరించడం నాకు కనపడింది. సామాజిక విప్లవానికి సాహిత్యవిప్లవం, చాలు అన్న దృఢనిశ్చయం ఏర్పడింది" - అంటాడు శ్రీశ్రీ. సమసమాజ స్థాపనలో శ్రీశ్రీ గారి మార్గం అనితరసాధ్యం. ఆదర్శ సమాజ నిర్మాణానికి

అభ్యుదయ కవిత్వాన్ని ఆయుధంగా ప్రయోగించిన మహనీయుడు, మహాకవి శ్రీశ్రీ.

మా'నవ' కవిగా, మానవతావాదిగా పేరుగాంచిన కవి 'బాలగంగాధర తిలక్'. తిలక్ కవిత్వాన్ని పరిశీలించితే ఆయన మానవతాదృక్పథం వ్యక్తమవుతుంది. 'ఆర్తగీతం'లో

"నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు
కింద మరణించిన ముసలివాణ్ణి
నేను చూశాను నిజంగా నీ రంధ్ర వర్షాన వంతెన
కింద
నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని
నేను చూశాను నిజంగా తల్లిలేక తండ్రిలేక తిండిలేక
ఏడుస్తూ ఏడుస్తూ ముంజేతుల కన్నులు
తుడుచుకుంటూ మురికి కాల్వ పక్కనే నిద్రించిన
మూడేళ్ళ పసిబాలుణ్ణి"

అంటూ అభాగ్యుల, అనాధల దుస్థితిని, దీనస్థితిని మన ముందుంచాడు.

"నా కవిత్వం కాదొక తత్త్వం
మరికాదు మీరనే మనస్తత్వం
కాదు ధనికవాదం, సామ్యవాదం" అంటూ 'అమృతం కురిసిన రాత్రి'లో తమ కవిత్వం గురించి చెప్పుకున్నారు.

ఆధునిక సాహిత్యం అన్ని రకాలైన మానవీయ విధ్వంసకర ప్రవృత్తుల్ని ధీరంగా నిలిచి ప్రశ్నించే స్థాయికి ఎదిగింది. ఈ కుంపటిలోంచి వచ్చిన అభ్యుదయ కామనలే స్త్రీవాద, దళితవాద, ముస్లింమైనారిటీవాద ఉద్యమాలు.

ఆధునిక కవిత్వంలో స్త్రీవాద కవిత్వం 1980 ప్రాంతం నుంచి వస్తూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఎన్ని ఉద్యమాలు వచ్చినా ఆ ఉద్యమాల ప్రభావంతో స్త్రీల దైనందిన జీవనశైలిలో మార్పురానందున స్త్రీలకోసం, స్త్రీలచేత ఆవిర్భవించిందే స్త్రీవాద కవిత్వం. ఆది నుంచి సమాజంలో మగవారికి తోడుగా నడిచిన స్త్రీని - తక్కువగా చూడడం, చూపడం జరిగిందనవచ్చు. అన్నింటికీ అడది కావాలి కానీ ఆధిపత్యం మాత్రం మగవాడిదే అనే కోణంలో నుంచి జ్వలిస్తూ, జనించిందే స్త్రీవాద కవిత్వం.

1990లో వచ్చిన త్రిపురనేని శ్రీనివాస్‌గారి 'గురిచూసి పాడేపాట', 1993లో అస్మిత వారి 'నీలి మేఘాలు' వంటి కవితా సంకలనాలు స్త్రీవాద కవిత్వాన్ని బలంగా ప్రకటించాయి.

"అందమైన దోపిడీకి - పవిత్రమైన హింసకూ, న్యాయమైన దాస్యానికీ - బలైపోయిన నేను, భారత స్త్రీని!" అంటూ "నీలిమేఘాలు" సంకలనంలో 'ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి' కవిత ద్వారా 'ఓల్గా'గారు, "వర్గ శత్రువు నాశ్రమనే దోచుకుంటారు, ఈ దుష్ట శత్రువు నా బ్రతుకే దోచుకుంటాడు" అని 'మిత్రవైరుధ్యమా!' అనే కవిత ద్వారా 'మొక్కపాటి సుమతి'గారు, "నేనొక స్త్రీని - నేనొక నిషిద్ధ జీవిని" అంటూ 'శ్రీమతి' గారు, ఇలా 'బందిపోట్లు' - 'సావిత్రి'గారు, 'వంటిల్లు' - 'విమల'గారు, 'లేబర్ రూమ్' - 'కొండేపూడి నిర్మల' గారు, "వామనుడి మూడో పాదం", "యశోధరా వగపెందుకే" ద్వారా 'జయప్రభ' గారు స్త్రీవాద కవిత్వం ఆవేదనను, సంఘర్షణను, తీవ్రతను తెలియజేశారు.

దళిత చైతన్యానికి మూలపురుషుడు 'జాషువా' గారు. గబ్బిలం ద్వారా దళిత చైతన్యం రగుల్కొల్పారు. అలాగే 'బోయి భీమన్న', 'కుసుమ ధర్మన్న', 'కొలకలూరి ఇనాక్', 'ఎండ్లూరి సుధాకర్' వంటి మొదలైన కవులు తమ కవిత్వం ద్వారా అణచివేతకు, అవమానాలకు గురౌతున్న దళితులపక్షాన ఉద్యమించారని చెప్పవచ్చు. గద్దర్, వంగపండు వంటి వారు పాటల ద్వారా ఉద్యమస్ఫూర్తిని నింపారు. అలాగే 1991లో 'వి.సిమ్మన్న', 'కొండపల్లి సుదర్శన రాజులు' 'దళిత కవిత' సంకలనాన్ని ప్రచురించడం విశేషం. 1993లో 'జయధీర్ తిరుమలరావు' సంపాదకుడుగా "దళిత గీతాలు" సంకలనం, 1995లో 'జి.లక్ష్మీనరసయ్య', 'త్రిపురనేని శ్రీనివాస్'ల "చిక్కనవుతున్నపాట", 1996లో 'జి.లక్ష్మీనరసయ్య' సంపాద

కుడుగా ''పదునెక్కిన పాట'' వంటి మొదలైన దళిత సంకలనాలు వెలువడ్డాయి.

''నేనింకా నిషిద్ధమానవుణ్ణే - నాది బహిష్కృత శ్వాస'' అంటూ 'ఎండ్లూరి సుధాకర్'గారు దళిత స్పృహను బలంగా వ్యక్తీకరించారు. ''నిలువుటద్దం ముందు నిల్చుంటాన్నేను - అవయవాల దొంతరకాదు - అవమానాల పరంపర కనిపిస్తుంది'' అంటూ ''పంచమ వేదం''లో ఘోషిస్తాడు కవి 'సతీష్‌చందర్'.

''నేను పుట్టక ముందే
దేశద్రోహుల జాబితాలో
నమోదై వుంది నా పేరు'' అని 'పుట్టుమచ్చ'లో మైనారిటీల ఆవేదనను, అణచివేతను కవి 'ఖాదర్ మొహియుద్దీన్' గొంతెత్తుతాడు.

ఈ విధంగానే బహుజన వాదకవిత్వం కూడా అందర్ని ఆలోచింపచేస్తుంది. 2001లో 'స్పృహ' సాహితీ సంస్థ వారు వెనుకబడిన కులాల కవిత్వంగా ''వెంటాడే కలాలు'' అనే కవితా సంకలనం వెలువరించడం జరిగింది.

ఈ విధంగా ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగంగా కవులు తమ కవిత్వం ద్వారా విశేషమైన సేవ చేశారని చెప్పవచ్చు.

ఆధార గ్రంధాలు :

1. గురుజాడలు - పెన్నేపల్లి గోపాలకృష్ణ(సం) - మనసు ఫౌండేషన్.
2. మహాప్రస్థానం - శ్రీశ్రీ.
3. తెలుగు సాహిత్య చరిత్ర - డా.ద్వా.నా.శాస్త్రి.

❖❖❖

ఆదర్శ దళిత సమాజ నిర్మాణంలో "మాదిగోడు" కథా రచయిత

నాగప్పగారి సుందరరాజు కృషి

– డా॥. భీమినేని శివసాయి ప్రసాద్, పాఠశాల సహాయకులు, నల్లమోతు చెంచురామనాయుడు పురపాలక ఉన్నత పాఠశాల, తెనాలి, గుంటూరు.

భారతీయ సమాజం వర్ణ సమాజం. ఈ వర్ణ సమాజంలో ఏ వర్ణం ఇంకో వర్ణంతో సమానంగా లేదు. నిట్టనిలువుగా నిర్మించిన ఈ వర్ణ సమాజంలో దీనిని నిర్మించివారు అత్యున్నత స్థానాన్ని ఆక్రమించి, వారి క్రింద వున్న స్థానాలను ఆయా వర్ణాలకు కేటాయించారు. అలాంటి అట్టడుగు వర్ణాలకు చెందిన వారులో మాదిగలు ఒకరు. ఈ కేటాయింపులలో మాదిగలకు దక్కింది శ్రమ,నీచమయిన పనివృత్తులు. భూములు, పదవులన్నీ పై మెట్టు మీది వర్ణాల వాళ్ళు పంచుకోగా వారి పాదాల దగ్గర సేవకులుగా శూద్ర వర్ణాల వారయిన మాదిగలు, కనీసం పాదాల చెంతకు కూడా రాలేక మనుష్యులకు దూరంగా ఇళ్ళ బయటకు, ఊరి బయటకు నెట్టి వేయబడ్డారు. పిల్లా, ముసలి, గొడ్డు, గోదా కుటుంబం లోని అందరూ నిద్రలేచినప్పటి నుండి తిరిగి నిద్రకు ఉపక్రమించే వరకూ ఒళ్ళు హూనమయ్యేలా చెమ టోడ్చినా జానెడు కుడుపుకు కానిన్ని గింజలు దొరకని బతుకులు వీరివి. అస్పృశ్యత,అంటరానితనానికి గురవుతున్న వారిలో మాదిగలు ప్రథమ స్థానాన్ని ఆక్ర మిస్తారు.

దళితులలో చాలా మంది అగ్ర వర్ణాల వారి దగ్గర, భూస్వాముల దగ్గర ఇంటి పని, వ్యవసాయ పని చేసే పాలేరులుగా జీవనం సాగిస్తున్నారు. భూస్వాముల ఇళ్ళను శుభ్రపరచడం, గొడ్లను శుభ్రపరిచి మేతకు తీసుకెళ్ళడం, పంటలకు సంబందించిన పాలాలన్నీ చూసుకోవడం ఇందులో ఉంటాయి. కొద్ది మంది వీరిలో డప్పు కొడుతూ జీవనం సాగిస్తున్నారు. బ్యాగురోళ్ళు ఏమో శవాలను పూడ్చిపెట్టే తంతును చక్కగా నిర్వహిస్తున్నారు. చాలా మంది మాదిగవారు డ్రైనేజి కాలువలు, చెత్తను శుభ్రపరచడం, సెప్టిక్ ట్యాంకులను నిర్వహించడం మొదలయిన పనులు చేస్తున్నారు. కొద్దిమంది ఏమో ఎద్దు, బర్రె మొదలయిన జంతువుల మాంసపు విక్రయదారులుగా జీవనం సాగిస్తున్నారు.

సీమ రచయితలయిన నాగప్పగారి సుందర రాజు తమ కథల ద్వారా మాదిగ వాళ్ళకు సేవక వృత్తిని శాసించిన అగ్రకులాల వారి దురహంకారాన్ని ఎండగట్టారు. మాదిగలు సవర్ణుల చేతిలో అణచివేయబడుతున్న వైనాన్ని, దోపిడీ తనాన్ని సీమ రచయిత సీమ జీవద్భాషలోనే ప్రతిభావంతంగా చిత్రించారు.

నాగప్పగారి సుందరరాజు కర్నూలు జిల్లా 'నేమకల్లు' లో మాదిగ రంగడు, పెద్ద నరసక్క దంపతులకి జన్మిం చాడు. కర్నూలు జిల్లా మొలగవల్లి మాదిగ కొట్టాలలో పెరిగినాడు. గుంతకల్లు, పత్తి కొండ, అనంతపురము, హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేసి అనంతపురంలోని శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా పని చేశాడు. నవంబర్, 1997లో ఈయన 'మాదిగోడు' (మాదిగ బ్రతుకు కథలు-నాగప్ప గారి సుందర రాజు కతలు) అనే పేరుతో ఒక కథా సంపుటిని వెలువరించాడు. ఇందులో మొత్తం 10 కథలు కలవు. ''మాదిగోడు కతల్లో కథానాయకుడెక్కడా మనకు కనబడడు. కథకుడే మన వెనకాలుండి మనల్ని ముందుకు తోసుకపోతాడు. అంచేత కథకుడే కథా నాయకుడైనాడు. అంటే సుందర్రాజు కథల్లో మాదిగోడే కథానాయకుడై మనల్ని నడిపిస్తాడు. కాదు...కాదు... బరబరా ఈడ్చుకు పోతాడు సారంగ మార్గాన. ఈ 'భాషా సారంగమార్గం' పాడుబడి, చీకటిగా, పాత వాసనలతో మెలికలు తిరుగుతూ సాగుతుంది''. ''సంస్కృత భాషా

సామ్రాజ్య వాదంపై మాదిగోడి దాడి''గా దీనిని పరి గణించవచ్చు.

'బోడెద్దుకత', 'నడిమింటి బోడెక్క బసివిరాలయ్యేద', 'మద్దికేరి మార్తమ్మ కత యంత మందికి తెలుసప్పా!', 'జోరెసావుకత', 'సెలివోడికత', 'పోడేపోడు' మొదలైనవి ఇందులో ముఖ్యమైన కథలు. 'బోడెద్దు కత'లో దళితేతరులు తాము ఏది చేస్తే అదే కథగా, సాహిత్యంగా చలామణి అయ్యిందనీ, అటువంటప్పుడు మాదిగల అలవాట్లు, ఆచారాలు, జీవిత వాస్తవాలన్నీ కూడా కథా వస్తువులుగా తీసుకోవడంలో తప్పులేదని, పైగా ఆత్మగౌరవ ప్రకటన, అస్తిత్వానికై జరిగే సంఘర్షణలో భాగమేనని రచయిత ధ్వనింపజేశాడు. ''మాదిగలు అత్యంత ప్రియంగా గొడ్డును కోసుకునే, పంచుకొనే దృశ్యాల్ని రమణీయంగా తన కలం కుంచెతో చిత్రీకరించిన నేర్పు తెలుగు సాహిత్యంలో సుందర్రాజుకే దక్కుతుంది'' అని 'మాదిగోడు' కి ముందుమాట రాసిన దార్ల వెంకటేశ్వరరావు తెలిపారు.

ఈ మాదిగోడు (మాదిగ జీవిత కథలు) రాయల సీమలోని కర్నూలు జిల్లా ఆలూరు ప్రాంత జన వ్యవహార భాషలో వ్రాయడం జరిగింది. ఆదోని, పత్తికొండ, ఆస్పరి, చిప్పగిరి, మద్దికెర, గుంతకల్ మండలాలు చుట్టుముట్టి వున్న, ఆలూరు మండల కేంద్రంగా వున్న మొలగవల్లి కొట్టాల, నేమకల్ గ్రామాల నేపథ్యంగా కథలు నడుస్తాయి. ఈ గ్రామ ప్రజలు కర్నూలు జిల్లా వాసులు అయినప్పటికీ అతి సమీపంలో వున్న అనంతపురం జిల్లా, కర్ణాటక రాష్ట్రంతోను సంబంధ బాంధవ్యాలు ఉండటం వలన ఆయా ప్రాంతాల జన వ్యవహార శైలి, సాంస్కృతిక జీవన విధానం వీరిలో కూడా కనిపిస్తుంది. ''సుందర్రాజు అట్టడుగు బతుకు తాలుకు భాదలన్నిటినీ స్వయంగా అనుభవించాడు. పేదరికం, అంటరానితనాల నడుమ తిరగలి కింద రాగి పిండిలా నలిగిపోయాడు. గ్రామీణ దళిత జీవితాలను పట్టిపీడిస్తున్న అవమానాలు, అణచివేతలు, దౌర్జన్యాలు, అన్నీ కలసి ఆరని నిప్పుల కుంపటై రచయిత గుండెను దహించి వేశాయి. బాధాతప్తమైన, బహుముఖీనమైన దళిత జీవన చిత్రణకు అనువైన ప్రక్రియ కథేనని గుర్తించి 'మాదిగోడు' రాశాడు.

దళిత ఈస్థటిక్ ఆచార వ్యవహారాలను, జీవన విధానాన్ని, వారి పలుకుబడిని, నుడికారాన్ని, జాతీయాలను పాత్రల సంభాషణల్లో ఇబ్బడి ముబ్బడిగా రచయిత పొందు పరిచాడు. ముఖ్యంగా భాష విషయంలో తెలుగు కథకులందరి కంటె సుందర్రాజు ముందున్నాడు. రాయల సీమలో కర్నూలు ప్రాంతంలోని మాదిగల సజీవ భాషను యధాతదంగా తొలిసారిగా కథల్లో ప్రవేశపెట్టిన ఘనత కూడా సుందర్రాజుకే దక్కుతుంది. మాదిగ్గేరిలో ప్రజలు మాట్లాడుకునేటప్పుడు ఆ మాటల్ని రికార్డు చేసి, కథల్లో రాశాడా! అన్నంత సహజంగా ఈ కథల్లో రచయిత భాషను ప్రయోగించాడు. కానీ కథల్లో కథ కంటె దళిత జీవన వాతావరణానికి అధిక ప్రాధాన్యత నిచ్చినట్టు కనిపిస్తుంది.

జోరెసావు కత :

అంటరాని పిల్లలు చదువు కోవడానికి మానసికంగా శారీరకంగా ఎన్ని చిత్రవధలకు గురికావాల్సి వస్తుందో తెలియ జేయడమే కాక పోలీసు వ్యవస్థ అగ్రకులస్థులకు ఏ విధంగా కొమ్ముకాస్తారో తెలియజేసిన కథ ఇది. దళిత విద్యార్థిగా నాగప్ప ఎంత ఆత్మన్యూనతా భావానికి లోనై వ్యధ పొందాడో ఈ కథ తెలియజేస్తుంది.

ఆ స్కూల్లో చదువుతున్న విద్యార్థులలో ఒకే ఒక్క దళితుడయిన నాగప్ప అంటరానితనం మూలంగా ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. మాదిగొల్లు మీరు తగలకూడదని బడిలో తోటి విద్యార్థులు,

ఉపాధ్యాయులు, హుకుం జారీ చేశారు. బాయిలో నీళ్ళుసేదనివ్వక పోవడమే కాక ట్యాంకు కాడ కొలాయిని కూడా ముట్టుకోనిచ్చేవారు కాదు. ఈ అస్పృశ్యత గాయాలు మానేదాని కోసం ఎవరూ లేనప్పుడు బావిలో ఉమ్మి వేయడం, బావిలో తన నీడను చూసుకొని ఆనందించడం, తరగతి గదిలో అగ్ర వర్ణాల పిల్లలకు కాళ్ళు తగిలించడం మొదలయిన పనులు నాగప్ప చేశాడు. ఒక

రోజు స్కూలు కు దగ్గరలో జోరెసావు చెట్టుకు ఉ రేసుకున్నాడు. రెడ్డి దగ్గర పాలం తీసుకొని కవులుచేస్తూ వర్షాభావ పరిస్థితుల వల్ల పంట పండక ఐదువేల అప్పు కట్టాల్సి వచ్చి జోరెసావు (సాయిబు) తన కొడుకుని రెడ్డోరి దగ్గర పనికి చేర్చాడు. కానీ కొడుక్కి రెడ్డోరి దగ్గర పని చేయడం ఇష్టం లేకపోవడంతో రెడ్డోరు వాడిని దొంగతనం కేసులో ఇరికించడంతో వ్యధ చెంది జోరెసాయిబు ఉ రివేసుకున్నాడు. పోలీసు యంత్రాంగం రెడ్డోళ్ళకు సహాయం చేసి వారి తరపున మాట్లాడి కేసులేకుండా చేశారు. సన్నజీవాలము అయిన దళితులము రెడ్డి వారితో పెట్టుకోవడం మనదే తప్పని ఓ పెద్దాయన నిట్టూర్చాడు.

నడిమింటి బోడెక్క బసివిరాలమ్మేద :

నిమ్న వర్గాలలో ఉండే పేదరికం, అవిద్య, మూఢ నమ్మకాలను అడ్డం పెట్టుకుని దళిత అడబిడ్డలను "మాతమ్మ", "బసివిని" పేరుతో ఊరుమ్మడి వేశ్యలగా తయారు చేసే దుష్ట సాంప్రదాయాలను భూస్వాములు, అగ్రవర్ణాలు తమ స్వార్థం కోసం ప్రోత్సహించేవారు. ఈ కథలో దళితులలో తరతరాలుగా వస్తున్న ఆచారాల వెనుక గల అగ్ర కులాల స్వార్థపూరిత అధిపత్య రాజకీయ ప్రయోజనం నిరూపించబడింది. మగవాళ్ళు కామకేళి కోసం అశాస్త్రీయ ఆచారాలను ఆసరాగా చేసుకొని మాదిగ నడిమింటి బోడెక్కను బసివిరాలుగా మార్చిన కథ ఇది.

నడిమింటి బోడెక్క నన్ను బసివిరాలుగా చేయకండి, ఎవరైనా కూలోడికిచ్చినా రెక్కలు కష్టము చేసుకొని బ్రతుకుతామని ఏడుస్తోంది. బసివిరాలిగా యిడుసు కుంటే కండ్ల ముందే సుఖంగా ఉంటూ ముసలితనంలో తమని చూసుకుంటుందని దళిత తల్లితండ్రుల ఆశ. బోడెక్కను బసివిరాలుగా ఇడుస్తాంటే ఆ కార్యానికి ఆ ఊర్లో బందుబలగంతో సహా అందరూ హాజరయ్యారు. బసిరికట్లు, జమ్మాకుతో బోడెక్క ఇంటిని తయారుచేసి ఆడోళ్ళకి అడ్డబొట్లు, కుంకుమబొట్ల తతంగం ముగిచారు. ఎక్కడనుండో వచ్చిన బసివురాళ్ళంతా గుంపులుగా నిలబడి పాటలు పాడుతున్నారు. పులిగెమ్మవ్వ పెయ్యి లోకి వచ్చి ఆశీర్వదిస్తే వారి బసివి బ్రతుకు సుఖంగా సాగుతుందని బసివి రాళ్ళంతా వేపమండలు తుంటికి కట్టు కున్నారు. తప్పిటోళ్ళు ఎగిరెగిరి కొడుతుంటే జాతర యల్లబారినట్లు మాదిగ్గేరి నుండి నగ్న శరీరానికి వేపాకు మండలతో కప్పుకొని ఒకొక్క ఆచారాన్ని ముగిస్తూ నడిమింటి బోడెక్క బయలుదేరింది. బసిరి మానుకాడ అయిదేండ్ల నుండి పుటిగెమ్మవ్వ కి ఇడిసిన బోడెక్కళ్ళ దున్నపోతుని ఒక్క ఏటులో నరకడానికి రెడీ గా ఉంచారు. బోడెక్కని బసివిరాలుగా అయితే వాళ్ళ తండ్రికి ఇవ్వాల్సిన దానాలను రెడ్డి, కర్నము సమకూర్చిరి. బావిలోని నీరుతో స్నానం చేయించి తెల్లచీరకట్టి గంటవాయిస్తూ, జమిదిక, జోగులుతట్ట మ్రోగుతుండగా పులిగమ్మవ్వకి శాస్త్రం చేసి, ఒక ఏటుకి దున్నపోతుని నరికి దేవర చేసిరి. దేవర కట్టముందు నిలబెట్టించి కర్నము సామితో కాలు తొక్కించి, బయినే రామన్నతో దావర్లు కట్టిడ్సినారు. ద్యావర్లు కట్టిన పూజారప్ప, కాలుదొక్కిన కర్నము సామి, కుంకుమను గట్టిన గొరవయ్య ఒకరి తర్వాత ఒకరు రాత్రికి పక్కలో పరుండ బెట్టుకొన్న తర్వాత ఇక ఊరందరికి బసివి చెందుతాది. చిత్తకార్తి కుక్కల మాదిరి ఎంతమంది మీద పడతారో, ఎంత మంది పిల్లల్ని పుట్టిస్తారో, ముసలి ముప్పతనానికి ఆ భగవంతుడే దిక్కని నడిమింటి బోడెక్క బసివిరాలుగా తల్లడిల్లిపోయింది.

దళిత వర్గాల శ్రమను దోచుకోవడమే కాకుండా సంస్కృతి, నమ్మకాల పేరుతో అణచి వేయబడ్డ కులాల మీద చేసే పెత్తనానికి ఈ ఆచారం పరాకాష్ట. పితృస్వామ్య వ్యవస్థ మత పరంగా స్త్రీలను వ్యక్తిత్వం లేని బొమ్మలుగా నిలబెట్టిందని సూచించడానికి ఈ కథ పరాకాష్టగా చెప్పవచ్చు.

మద్దికేరి మార్తమ్మ కత యంతమందికి తెలుసప్పా ! :

దళిత స్త్రీ ఎదుర్కొంటున్న కుల లింగ వివక్షలను, శ్రమదోపిడీని చిత్రించిన కథ ఇది. అగ్ర కులస్థుల కుల తత్వం, పురుషాధిపత్యం దళిత స్త్రీ శరీరం మీద ఎలా ప్రతిఫలిస్తాయో ఈ కథలో అవగాహన అవుతుంది.

కుంటికాలు యర్రన్నోళ్ళు మూడు తరాలుగా కోమిటోళ్ళ ఇంట్లో పని చేస్తున్నారు. యర్రన్న కోమటోళ్ళ పిండి జిన్నాలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మిషన్ల వల్ల కాలు పోగొట్టుకొని కుంటి యర్రన్నయినాడు. యర్రన్న కూతురు బంగారం లాంటి కుందనపు బొమ్మ, మార్తమ్మ కాయాకష్టం చేస్తూ, పిండి జిన్నాలో పనిచేస్తూ తండ్రిని పోషించుకుంటోంది. అందాలబొమ్మ లాంటి మార్తమ్మ పై ఎందరి మగవాళ్ళ చూపు పడినా ఏ మాత్రం పట్టించు కోకుండా తనపని తాను చేసుక పోయేది. రెడ్డి శివారెడ్డి, బామొళ్ళరాందాసు, తురక కాజా అనే సావాసగాళ్ళ కళ్ళు మార్తెమ్మ అందాలపై పడినాయి. ఒక రోజు కోమటోళ్ళ పిండి జిన్నాలో మార్తెమ్మ నోట్లో గుడ్డలు కుక్కి అత్యా చారం చేశారు. నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారం చేయడంతో ఊపిరాడక ఆ పిల్ల చనిపోయింది. బంగారం లాంటి మంచి బుద్ధి కలిగిన మార్తమ్మ అన్యాయంగా కిరాతకుల చేతిలో బలయింది. ఇంత అమానుషం జరిగినా నిందితులకు శిక్ష పడకపోవడం అగ్రవర్ణాల రాజకీయ దాష్టికానికి పరాకాష్టగా చెప్పవచ్చు.

దళితులు సామాజిక న్యాయం కోసం చేస్తున్న పోరాటాన్ని, ఆ పోరాటాన్ని అణచి వేసేందుకు దళితేతర కులాలన్నీ ఐక్యమై దళితులను ఊచకోత కోసిన సంఘటనలను ఈ కథలో చిత్రించాడు. కారంచేడు, చుండూరు, పదిరికుప్పం మొదలైన చోట్ల దళితులపై దాడులు జరిగినా అగ్రకులాల వారి ఆదరణతో దాడులు చేసిన వారిపై చర్యలు లేవని కథా రచయిత నిరసించాడు.

ఉపసంహారం :

"ఇది నా బతుకు, ఇదంతా నా భాష, ఇవన్నీ మా సమస్యలే" అని ఆత్మీయంగా గుండెలకు హత్తుకునే కథా సంపుటి కోసం ఎదురుచూసిన దళితుల చారిత్రక అవ సరాన్ని తీర్చేవే సుందర్రాజు 'మాదిగోడు' కథలు. "డప్పు కొట్టిన చేత్తో మనువాద డొక్క చీలుస్తాం. చెప్పులు కుట్టిన చేత్తో ఈ చరిత్రను తిరగరాస్తాం. అవమానింపబడ్డ అరికాళ్ళకు అధికారమిస్తాం" అని నినాదాన్ని చేసిన రాయలసీమ కర్నూలు బిడ్డ సుందర్రాజే. దళితులలోని నాయకత్వలేమి, అనైక్యత, అవిద్య, మూఢనమ్మకాలు, పిరికితనం, ఆర్థికదైన్యం, ఉద్యమ నిబద్ధతలేమి మొదలైన అంశాల పట్ల నిరసన వ్యక్తం చేశాడు. దళితులు తమ ఆత్మగౌరవం కోసం, హక్కుల కోసం పోరాడేందుకు కావ లసిన సైద్ధాంతిక బలాన్ని, స్ఫూర్తినీ దళిత మేధావులకు, రచయితలకు అందించాడు. దళిత సాహిత్యానికి, దళిత సమాజ నిర్మాణానికి ఆశాకిరణం అవుతాడనుకున్న నాగప్ప గారి సుందర్రాజు ఎస్.కె. యూనివర్శిటీలో పని చేస్తూ చిన్న వయస్సులోనే అకస్మాత్తుగా తన జీవితాన్ని త్యజించి నప్పటికీ ఆయన ఉద్యమస్ఫూర్తిని ముందుకు తీసుకు వెళ్ళవలసిన అవశ్యకతను ఈయన కథలు తెలియ జేస్తాయి.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. సుందరరాజు, నాగప్ప గారి - మాదిగోడి కథలు - సెంట్రల్ యూనివర్శిటీ, హైదరాబాద్ - 1997.

❖❖❖

డా॥. పతికి రమేష్ నారాయణ 'ఎర్రని ఆకాశం' - ఆదర్శ సమాజ నిర్మాణ భావనలు

- కనుమల మునిస్వామి, పరిశోధక విద్యార్థి(ఎస్ఆర్ఎఫ్), తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

ఆదర్శ సమాజం అన్న భావన ఎన్నో శతాబ్దాలుగా నెరవేరని కలగా వుండి, దాన్ని సాధించే ప్రయత్నంలో అనేకమంది వ్యక్తులు, అనేక రకాలైన వ్యవస్థలు, మరీ ముఖ్యంగా సాహిత్యం ద్వారా అనేకమంది సాహితీవేత్తలు తమ రచనల్లో ఆదర్శ సమాజ భావనను ప్రతిపాదించారు. అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయ హక్కుల సాధన దిశగా కవులు తమ కలాలను కదిలించారు. ప్రజలందరి అభివృద్ధి, స్వేచ్ఛ, సమానత్వాల కోసం అనేకమంది పాత్రికేయులు తమ ప్రాణాలను సైతం అర్పించారు. రచయితలు జైళ్ళకు కూడా వెళ్ళారు. ఆదర్శ సమాజ నిర్మాణం దిశగా అనంతపురం జిల్లా నుంచి అనేక మంది రచయితలు, రచయిత్రులు, కవులు, కవయిత్రులు తమ గళాలను కలాలుగా మలచుకొని అక్షర సేద్యాన్ని చేపట్టారు. ఆ కోవలోకి చెందిన వ్యక్తే డా॥ పతికి రమేష్ నారాయణ గారు. ఆయన వేశ్యా ప్రసక్తిని, వారి ఆక్రందనలని, ప్రాక్పశ్చిమ సాహిత్యంలో ఎక్కడ నుంచి ఈ వ్యవస్థ ప్రారంభమైందన్న అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వారి కష్టాల విముక్తికి తనదైన కోణంలో వారి ఆదర్శ సమాజాన్ని చిత్రించారు. ఆ భావనలు ఈ వ్యాసంలో మీతో పంచుకుంటున్నాను.

డా. పతికి రమేష్ నారాయణ అనంతపురం జిల్లా ప్రముఖ సాహితీవేత్త. ఆయన ఆగస్టు 27, 1947లో అనంతపురంలో జన్మించారు. తండ్రి పి.ఎల్. నారాయణ రావు. తల్లి రాజ్యలక్ష్మి. బాల్యం నుండి విద్యాభ్యాసం అనంతపురం పట్టణంలోనే కొనసాగించి జంతు శాస్త్రంలో స్థానిక ప్రభుత్వ కళాశాల నుండి బి.ఎస్సీ (1963 - 1966) డిగ్రీని, తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎస్సి (1966-1968) డిగ్రీని పొందాడు. ఉద్యోగ నిర్వహణ కాలంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుండి జంతుశాస్త్రంలో పి.హెచ్డి.(1987), అన్నామలై విశ్వవిద్యాలయం నుండి బి.యిడి. (1985), ఎం.యిడి (2004) డిగ్రీలు పొందారు. విద్యాభ్యాసానంతరం ఉపాధ్యాయ వృత్తిపైగల అపారమైన మమకారంతో సమకాలీనంగా ప్రభుత్వరంగంలో ఉన్నతస్థాయి ఉద్యోగాలకు గల అవకాశాలన్నింటిని వదులుకొని 1968లో అనంతపురం శ్రీసాయిబాబా నేషనల్ జూనియర్ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడుగా ప్రవేశించారు. తర్వాతిగా అదే విద్యాసంస్థలో 2005లో పదవీ విరమణ కాలం దాకా 38 సం॥లు పఠన, పాఠన, పరిపాలనలు (1968-2005) గావించారు. పదిహేడు సం॥లు పైగా (1989-2005) జూనియర్ కళాశాల మరియు ఉన్నత పాఠశాల ప్రధానాచార్యులుగా బాధ్యతలు సంయుక్తంగా, సమర్థవంతంగా నిర్వహించాడు.

డా. పి. రమేష్నారాయణ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనా, ప్రవృత్తిరీత్యా ఒక సాహితీ ప్రియుడు. సామాజిక కార్యకర్త. వక్త. వివిధ సంస్థల్లో జీవితకాల సభ్యుడిగా, కార్యనిర్వాహక సభ్యుడిగా దశాబ్దాల పైబడి చైతన్యవంతమైన విశేషపాత్ర పోషించారు. సమాజసేవలో భాగంగా అంతర్జాతీయ లయన్స్క్లబ్ సంస్థలో ప్రముఖ సభ్యుడుగా 1973 నుంచి 45 సంవత్సరాలకు పైగా ఎన్నో విశిష్ట బాధ్యతలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ అంతర్జాతీయ సేవాసంస్థ రోటరీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ 'పాల్ హారిస్ ఫెలో'గా, అనంతపురము సెంట్రల్ రోటరీ క్లబ్ గౌరవ సభ్యుడిగా ఉన్నాడు.

ఆం.ప్ర. ప్రభుత్వ నియామకంతో అనంతపురం జిల్లా స్థాయిలో జువైనల్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ (2009-2012), అనంతపురంలోని ఆరుబయలు కారాగారం సలహా సంఘం సభ్యులుగా (2010-2013), ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటి సలహా సంఘం సభ్యుడు (2014)గా ఉన్నాడు. డా. పి. రమేష్‌నారాయణ విశేష పుస్తక ప్రియత్వంగల సాహితీ ప్రియుడు. ప్రాక్పశ్చిమ పురాణ వాఙ్మయం, భాషా సాహిత్యాలు, శాస్త్ర విజ్ఞానం, ఆధ్యాత్మికవాదం సంబంధించిన ఆంధ్ర, ఆంగ్ల గ్రంథాలపై ఆసక్తిగల అపారమైన చదువరి. అనంతపురం జిల్లాలో సాహిత్య రచయితగా 2011 నుంచి పూర్తిస్థాయిలో దర్శనమిస్తారు. ''రిఫ్లెక్షన్ ఆన్ హ్యూమన్ నేచర్'' అనే ఆంగ్ల రచనతో తన సాహితీ ప్రస్థానాన్ని మొదలు పెట్టిన ఆయన 2013-2018 కాలానికి తెలుగు సాహిత్యంలో డెబ్భైదాకా రచనలు చేశారు. అందులో 40 వరకు ముద్రణ చేయించారు. తులనాత్మక సాహితీ ధోరణితో గిరిజన సంస్కృతి, చేనేత వ్యవస్థ, వేశ్యావ్యవస్థ వంటి అంశాలు, జానపద సాహిత్యంలో యక్షగానాలు, అక్క దేవర్ల పాటలు, మాధవరాజులు వంటి అంశాలు, సర్పారాధన వైశిష్ట్యము వంటి విశేషాంశాలు గల గ్రంథాలు, జీవనచిత్రణలు, ఆధ్యాత్మికరచనలు ఆయన గావించారు. అనువాదసాహిత్యంలలో ప్రవేశించి దీర్ఘ కావ్యాలు, కవితా సంకలనాలు, నానీలు, రెక్కలు వంటి రచనలను ఇరవైదాకా ఆంగ్లానువాదం గావించారు. తెలుగు సాహిత్యంలో భిన్న అంశాలపై ప్రాక్పశ్చిమ భావజాల నేపథ్యంలో విలువైన సమగ్ర సమాచారాన్ని అందించే పరిచయ గ్రంథాలుగా ఆయన రచనలు వుంటాయి.

డా. పతికి రమేష్‌నారాయణ భిన్న కోణాల్లో గావించిన రచనల్లో ఒక ప్రముఖమైన రచన ''ఎర్రని ఆకాశం''. సభ్యసమాజంలో సాధారణంగా గమనించే వేశ్యావృత్తికి సంబంధించిన మూలాల్ని, దాని తీరుతెన్నుల్ని, పురుషాధిక్య ప్రపంచంలో అభాగినులైన స్త్రీలు వంటి అంశాలు సాహిత్య స్ఫోరకంగా ఈ రచనలో మనకు అగుపడుతాయి. ప్రస్తుతకాలంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలు, వివక్ష ధోరణులు ప్రతిఫలింపజేసే రచనలుగా వున్నప్పటికినీ సమాజంలో ఒక ప్రధానమైన అంతర్భాగంగా వుంటున్న వేశ్యారంగంపై మాత్రం ప్రభావశీలకమైన స్పందన పూర్తిస్థాయిలో వ్యక్తపరచక పోవడం ఒక విచారించదగ్గ విషయంగా వుండిందని ప్రస్తుత నావ్యాసం ''డా.పతికి రమేష్ నారాయణ 'ఎర్రని ఆకాశం' - సంఘసంస్కరణ ధోరణులు'' ద్వారా వివరించే ప్రయత్నం చేస్తాను.

''కొన్ని మన కళ్ళముందు ఉండీ మనం చూడని, చూడజాలని విషయాలనేకం వుంటాయి. కొన్ని భయంవల్ల చూడము. కొన్ని అభద్రతవల్ల చూడము. కొన్ని ఒక బలమైన భావజాలం ప్రభావంవల్ల మన ఎదుట వుండీ మనకు కనిపించవు. ఒక్కొక్కసారి మనకు అలవడిన దృక్కోణంవల్లగానీ, మనం ఎంచుకొన్న దృక్కోణంవల్లగానీ కొన్ని విషయాలు కళ్ళముందు వుండీ కనిపించవు. వీటిలో విడివిడి విషయాలే కాక, సామాజిక క్రమాలు కూడా వుంటాయి. వీటిని మనకు చూపించడం సాహిత్యంచేసే పనులలో ఒకటి'' (సాహిత్యంపై బాలగోపాల్ : రూపం - సారం) అని ప్రముఖ రచయిత, సామ్యవాద సిద్ధాంతకర్త ''డా. కె.బాలగోపాల్'' అంటారు. ఇలాంటి సామాజిక రూపాల్లో తెలుగు సాహిత్యంలో మనకు అగుపడే ఒక ప్రముఖ అంశం వేశ్యాప్రసక్తి.

''జీవితం కన్వేయర్‌బెల్ట్. తనతోబాటుగా మానవుడిని ఏమీ తెలియని అజ్ఞాత తీరాలకు మోసుకుపోతూ వుంటుంది. మానవుడు జీవంగల వ్యక్తి అని అనుకోవడం కన్నా ఒక వస్తువుగా ఒక పదార్థమని అనాలి'' అని అంటూ ''దు:ఖమయమూ, విషాదభరితమూ అయిన జీవిత సముద్రంలో విసరివేయబడిన ఒక బరువైన వస్తువు''గా వాస్తవిక జీవితాలను గురించి 'మెరాఇస్తిని' (సత్యానికి కొలబద్ద) అనే రచనలో రష్యన్ రచయిత 'యురీ కాఫ్కా' అభిప్రాయపడతాడు. ఇలాంటి ధోరణులతో ప్రస్తుత

కాలంలో వేశ్యావ్యవస్థను గమనిస్తే, ''ఒక గుండెతడి, ఒక దు:ఖపుజీర, ఏదో ఒకఆర్తి దిగులు గుండెల్ని చుట్టేస్తున్నట్లు ఎక్కడనుంచో ఎన్ని యుగాల నుంచో ఒక సన్నని మూలుగు వినిపిస్తున్నట్లు ఒక దు:ఖంతోనే ఒక పరితాపంతోనే, ఒక పరివేదనతోనే గుండె బరువెక్కుతుంది. వెక్కిళ్ళు వినబడతాయి'' (కె. శివారెడ్డి, శివారెడ్డి పీఠికలు - ఆరేళ్ళ అద్దం ముందుమాట). అని చెప్పక తప్పదు. ప్రాక్పశ్చిమ సమాజాల్లో ప్రాచీనకాలమూ, మధ్యయుగాలూ, వలస పాలనా కాలమూ మొదలుకొని ప్రస్తుత పరిస్థితులు దాకా వేశ్యాప్రసక్తికి సంబంధించిన ఎన్నో అంశాలను డా. పతికి రమేష్‌నారాయణగారు ''ఎర్రని ఆకాశం'' (ప్రాక్పశ్చిమ సాహితీ రూపాల్లో వేశ్యా ప్రసక్తి) అన్న గ్రంథంలో స్పృశించారు.

ఎర్రని ఆకాశం గ్రంథంలో డా. పి. రమేష్‌నారాయణ గారు ''చిరకాలంగా భారతీయ వ్యవస్థలో మానవ సంబంధాల్లో కులాంతర, జాత్యాంతర వివాహ సంబంధాలు, అనులోమ, ప్రతిలోమ వివాహాలు, తదనుగుణమైన జీవన రీతులు అగుపడుతాయి. ఆంధ్ర మహాభారతం అనుశాసనికపర్వంలో భీష్ముడిబోధ, అరణ్యపర్వంలో దీర్ఘతముడు కథ స్త్రీల ప్రవృత్తిని తెలిపే అంశాలు. ఉపనిషత్కాలంలో అగుపడే జాబాలి, శ్వేతకేతువు, ప్రద్వేషిణి, మాధవి జీవితగాథల్లో ఆనాటి సమాజంలోని విశేష లైంగిక సంబంధ ధోరణులు గమనిస్తాం. ఆంధ్రమహాభారతం అరణ్యపర్వంలో పుట్టు గ్రుడ్డి అయిన దీర్ఘతముడిని ఋషిపత్ని పోషిస్తూ 'భార్య అంటే భర్తను పోషించునది' అని అంటూ తాను ఎలా పోషిస్తూ వుందో మన ఊహకే వదిలివేస్తుంది. యయాతి మహారాజు కూతురు మాధవిని గాలవుడు అనే ఋషి కుమారుడు తన గురుదక్షిణకు కావలసిన జాతిగుర్రాల కొరకు పలువురు మహారాజులకు భోగవస్తువుగా వినియోగించి గుర్రాలను సేకరించి విశ్వామిత్రునికి అందించిన పురాణగాథ అగుపడుతుంది. శ్వేతకేతువు గురుకులం నుండి ఉద్ధాలకుడి ఆశ్రమానికి వచ్చిన సందర్భంగా ఒకనాడు తమ ఇంటికి వచ్చిన అతిథి భోజనానంతరం తన తల్లిని లైంగికానందం కొరకు బలాత్కారం గావిస్తే, ఈ సన్నివేశాన్ని సహించక ఇలాంటి ప్రవర్తనలను సాంఘిక దురాచారంగా భావించి శ్వేతకేతువు స్త్రీపురుష సంబంధాలకు ఆనాటినుండి నైతిక కట్టుబాట్లు విధిస్తాడు. తులనాత్మకంగా గమనిస్తే మధ్యయుగ కాలాల్లో ఐరోపా ఖండంలోని సమాజాల్లో విశృంఖలంగా వున్న వ్యభిచార ధోరణులను తీవ్రంగా నిరసించి సెయింట్ అగస్టీన్ ఇట్టి నిషేధాన్ని ఆనాటి పాశ్చాత్య వ్యవస్థలో విధించాడు. ఇస్లామియా జగత్తులో వ్యభిచారం దుష్టకార్యంగానూ, చెడు మార్గంగానూ, శిక్షార్హంగానూ పవిత్ర ఖురాన్ గ్రంథంలో బనీ ఇస్రాయిల్, అల్‌నూర్‌ల్లో ప్రకటించబడింది'' అంటూ వేశ్యాప్రసక్తి గురించి, దాన్ని సాంఘిక దురాచారంగా ప్రకటించారని, చెడుమార్గమని చెప్పారంటూ ..... '' సుదీర్ఘ వివరణలతో వివరించాడు.

ఎర్రని ఆకాశం - సంఘసంస్కరణ చిత్రణ :

డా. పతికి రమేష్ నారాయణ రాసిన ఈ ఎర్రని ఆకాశం పుస్తకంలో ప్రాచీన సాహిత్యాల నుంచి నేటి ఆధునిక కాలం వరకు వేశ్యాజీవిత చిత్రణ చేసిన వాటిని పొందు పరిచారు. వాటిని అవలోకిద్దాం.

పూర్వరంగం :

ప్రాచీన కాలం నుండి వేశ్యాసంస్కృతి సాహిత్యానికి, లలితకళలకు అనుబంధంగాను, అంతర్భాగంగానూ వుంటూ సౌందర్యాభిలాషులయిన పురుషులకు నృత్యగానాదులపై ఆసక్తిగల కన్యలకు, స్త్రీలకు దోహదకారిగా చిరకాలం కొనసాగిందని, రామాయణం కావ్యంలో సీతాన్వేషణ చేస్తున్న సందర్భంలో హనుమంతుడు రావణుడి అంత:పురంలో భోగస్త్రీలు వివిధ భంగిమల్లో నిద్రించినట్లు రామాయణంలో చెప్పబడిన అంశాలను పూర్వరంగంలో చర్చించారు.

నాట్యశాస్త్రంలో వేశ్య ప్రసక్తి :

ప్రాచీనకాలంలో వేశ్యావృత్తిలోని స్త్రీలకు రసిక హృదయులైన రాజులను, సంపన్న కులీనులను రంజింప

జేయడానికి అభినివేశం వుండాల్సిన అంశాలు చాలా అగుపడుతాయి. పురుషుల మనస్సును రంజింపజేసే చర్యలు వేశ్యాజీవితాన్ని గడిపే స్త్రీలు నిర్వహించడానికి వారికి సంగీతం, నాట్యం, సంభాషణాచాతుర్యం, ఆకర్షణీయమైన హావభావ నైపుణ్యాలు ఎంతో ఆవశ్యకములైన వుంటాయన్న అంశాలను ఇందులో చర్చించాడు.

రాజరిక యుగాలు :

ఆంధ్రదేశంలో రాజరిక యుగాలలో వేశ్యసంస్కృతి ఎంతో విశేషంగానూ, గౌరవ ప్రదంగానూ వుండేదని, పరిపాలకులైన రాజులు బాహాటంగానూ, అర్భాటంగానూ వేశ్యల గృహాలకు వెళ్ళేవారని, రెడ్డిరాజుల యుగంలో ఆవచి తిప్పయ్యశెట్టిని 'జగదగోపాలరాయవేశ్యాభుజంగ' అని శ్రీనాథుడు కీర్తించడం చూస్తే తెలుస్తుందని ఉదహరించాడు. రెడ్డిరాజుల కాలంలోని మత సాంఘికాచారాల్లో సహగమనం సన్నివేశాల్లో భార్యల విషయాల్లో నిర్బంధం లేకపోయినా, ప్రభువుల ఉంపుడు గత్తెలతో మాత్రం బలవంతంగా సహగమనం కావించేవారని వేశ్యా సంస్కృతికి సంబంధించిన ఇలాంటి ఎన్నో విషయాలను సురవరం ప్రతాపరెడ్డిగారి ''ఆంధ్రుల సాంఘిక చరిత్ర'' విపులంగా వివరిస్తుందని కూడా సూచించారు.

ప్రాచీన సాహిత్య ప్రపంచం :

సంస్కృత సాహిత్యంలో వేశ్యల ధోరణులను వెల్లడించే నాటకాల్లో భాసమహాకవి రాసిన 'చారుదత్తము' ఒక ప్రసిద్ధ నాటకం. ఇలాంటి మరొక రచన శూద్రమహాకవి రచించిన మృచ్ఛకటికం. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ప్రబంధ యుగంలోని కావ్యాలు, కాకతీయుల కాలానికి, రెడ్డిరాజుల యుగానికి చెందిన కావ్యరచనలు, శ్రీనాథుని చాటువులు, శతక సాహిత్యం మొదలు వర్తమాన కాలంలోని సాహితీ రూపాలుదాకా విస్తారంగా వేశ్యా ప్రసక్తి అగుపడుతుందన్న విషయాన్ని ఇందులో వెళ్ళడించాడు.

ఆధునిక తెలుగు సాహిత్యం :

బ్రిటీష్ వలస పాలనా కాలంలో భారతీయ సాహిత్య రంగంలో ప్రవేశించిన పాశ్చాత్య సాహిత్య ధోరణులు తెలుగు సాహిత్యంలో విశేష ప్రభావాన్ని చూపాయి. తెలుగు సాహిత్యంలో 19వ శతాబ్దపు తొలి దశకాల్లో వేశ్యాప్రవృత్తికి సంబంధించిన చైతన్యం, సాహిత్యం, సంస్కరణ ధోరణులు ఎన్నో కనిపిస్తాయి. నాటకాలు, కథలు, వ్యాసాలు మొదలైన వాటిలో వేశ్యావృత్తి నిర్మూలన గురించి అనేక అంశాలు చర్చకు తెరలేపాయన్న విషయాల్ని చర్చిస్తూనే, బాల్యవివాహాల వ్యతిరేకించి, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించి సంఘ సంస్కర్తగా పేరుగాంచిన కందుకూరి వీరేశలింగం వేశ్యావృత్తి నిర్మూలనకు కృషిచేయలేదని, వారిని అసహ్యించుకున్నాడంటూ సున్నితంగా విమర్శ చేస్తూ, అందుకు సాక్ష్యంగా వీరేశలింగంగారు ''సంసార కల్పవృక్షమునకు పాతివ్రత్యామృత రసమునకు విఱుగుడు మందులును'' అన్న మాటలను ఉటంకించారు.

ఇతర భాషా సాహిత్యాలలో కూడా వేశ్యావృత్తిపై వచ్చిన అంశాలను ఇందులో వెల్లడించారు. వర్థమాన పరిస్థితుల్లో భారతదేశంలో గణాంకాల వివరాల ప్రకారం వ్యభిచారవేశ్యావృత్తిలో వుంటున్న సెక్స్‌వర్కర్లు 30 మిలియన్ల దాకా, ఇందులో ఎనిమిది మిలియన్లకు పైగా బాలికలు వున్నారంటూ గణాంకాలతో వివరిస్తూ, ఇటీవలి కాలంలో స్త్రీలపై హింస ఎక్కువైందని, ఇలాంటి వాటిని నిరసిస్తూ సాహిత్యం ద్వారా ఇలాంటి అన్యాయాల్ని, వివక్ష ధోరణుల్ని ప్రతిఫలింపజేస్తున్నప్పటికీ మార్పు కొద్దిమేర మాత్రమే జరుగుతోందని ఎర్రని ఆకాశం ద్వారా వివరించారు. సమాజంలో ఒక ప్రధాన రుగ్మతైన వేశ్యావృత్తిని రూపుమాపడం జరగాలంటే అందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి చాలా తక్కువని, వారి పునరావాస జీవనాన్ని సమాజంతోపాటుగా జరిగేలా చూడటంలో విఫలమవుతుండటం వల్లనే తిరిగి వారు ఆ వృత్తిని స్వీకరిస్తున్నారని ఈ పుస్తకం ద్వారా వెల్లడించే ప్రయత్నం చేశారు.

ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడుగా స్వచ్ఛంద సంస్థలు, సామాన్య జనం తోడుగా నిలిచి వారు తిరిగి సమాజంలో

అంతర్భాగంగా మారడానికి ఆధునిక సంఘసంస్కర్తలుగా ప్రతిఒక్కరూ రూపాంతరం చెందాల్సిన అవసరం ఎంతైనా వుందని, మహిళా, బాలికా రక్షణకు ఉన్న చట్టాలను మరింత కఠినంగా అమలు పరచడం, వ్యక్తుల ఆలోచనల్లో మార్పు తేవడం ద్వారా వేశ్యావృత్తిని నిర్మూలించవచ్చని డా. పతికి రమేష్ నారాయణగారు తమ ''ఎర్రని ఆకాశం'' ద్వారా సూచించి ఆదర్శ సమాజ నిర్మాణానికి బీజాలు వేశారని ప్రకటిస్తూ.... ముగిస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

1. డా॥ పతికి రమేష్ నారాయణ, - ఎర్రని ఆకాశం
2. డా॥ బత్తల అశోక్ కుమార్ (సం) - సంఘసంస్కరణలో కవుల కృషి

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 4, April 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

విద్వాన్ చొప్ప వీరభద్రప్ప "బాలసాహిత్యం" - ఆదర్శ సమాజం

- బసినేని శ్రీనివాసులు, పరిశోధక విద్యార్థి (జేఆర్ఎఫ్), తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

అనంతపురం జిల్లాకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న చిన్నస్థాయి మండలకేంద్రమైన బుక్కరాయ సముద్రంలో 1945 జూన్ 2వ తేదిన శ్రీమతి చొప్ప పాపమ్మ శ్రీ చొప్ప నారాయణప్ప గార్లకు శ్రీచొప్ప వీర భద్రప్ప గారు జన్మించారు. అనంతరం స్వగ్రామంలోనే ఎస్ఎస్ఎల్సీ వరకు విద్యాభ్యాసం చేశారు. తల్లిదండ్రు లిద్దరూ నిరక్షరాస్యులైనప్పటికీ, తల్లి శ్రీమతి పాపమ్మకు మాత్రం వీరభద్రప్పను బాగా చదివించాలని కోరిక, ఆమె ప్రోద్భలంతోనే ఆయనకు విద్యాజ్ఞానం అబ్బింది. ఎంతో క్రమశిక్షణతో, కష్టపడి ప్రభుత్వ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగాన్ని సాధించారు. మంచి ధృడ సంకల్పం, పవిత్ర ఆశయం తప్పక ఫలితాన్నిస్తుందని నమ్మి మంచి భవిష్యత్తుకు ఉపకరించే విధంగా ప్రయివేట్ విద్యార్థిగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యా లయంలో చేరి, ఎం.ఏ చరిత్రను అధ్యయనం చేశారు. పీ.జీ పట్టా పొందిన తర్వాత నెల్లూరులోని ప్రభుత్వ ఉపాధ్యాయ కళాశాలలో బీ.ఈడీ. పూర్తి చేశారు. తాను వృత్తిరీత్యా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందారు.

ఉపాధ్యాయుడుగా ఒక వైపు వృత్తి ధర్మాన్ని నిర్వర్తి స్తూనే మరోవైపు సమాజాభివృద్ధిని ప్రవృత్తిగా మార్చు కున్నారు. 2000 సం॥లో శివదృష్టి నమ:శ్శివాయ ప్రాశస్త్యం, 2001 సం॥లో విభూతి అనే పుస్తకాలను రచించారు. తదుపరి 2003 సం॥లో జూన్‌లో ఉపా ధ్యాయ వృత్తి నుండి పదవీ విరమణ పొందారు. అప్పటి నుండి ప్రవృత్తి అయిన రచనా వ్యాసంగాన్ని ఒక వృత్తిలా మలచుకొని, అంకిత భావంతో సమాజాభివృద్ధే ధ్యేయంగా తన రచనా పరంపరని అప్రహతిహతంగా కొనసాగిస్తు న్నారు. ముఖ్యంగా "మొక్కైవంగనిది మానైవంగునా" అన్న పెద్దల వాక్యాన్ని ఆయన బాగా నమ్మారు. అందుకే పిల్లలను సరైన దారిలో నడిపిస్తే సమాజం మెరుగైన దారిలో పయనిస్తుందని అభిలషిస్తారు. మన ప్రథమ ప్రధానమంత్రి శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూగారు చెప్పిన విధంగా "నేటి బాలలే రేపటి పౌరులు" అన్న మాటను బలీయంగా నమ్ముతూ, బాలసాహిత్యంలో ఆయన విశేషంగా కృషి చేస్తున్నారు. చిన్నచిన్న నీతికథలు ద్వారా పిల్లల్లో నీతి, నిజాయితీలను తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో అనేక బాలల పుస్తకాలను అక్షరబద్ధ చేస్తున్న ఘనత శ్రీ చొప్ప వీరభద్రప్పగారికే దక్కుతుంది.

విద్వాన్ చెప్పా వీరభద్ర గారు సమాజంలో ఉన్న మానవ సంబంధాలు ఆదర్శ విలువల గూర్చి మంచి మనసు అనే బాలల కథా మంజరి లో ఎంతో ఆదర్శవంత మైన సమాజానికి ఉపయోగపడే నైతిక విలువలు ఎన్నో మనకు తెలియజేశారు. గతకాలం నాటి విలువలు ఎంతో ఆదర్శవంతమైనవిగా పేర్కొన్నాడు నాటి సమాజంలో మానవ సంబంధాలు ఎంతో పటిష్టంగా మానవీయమైన విలువలతో కూడి ఉండేటివి నేటి సమాజంలో మానవ సంబంధాలు ఉల్లిపాయ పోర లాగా ఉన్న డబ్బున్న వాడికి ఎంతో విలువ ఇస్తున్నారు మనసుల మధ్య డబ్బే ప్రధానంగా నేడు సమాజంలో మనసులో జీవిస్తున్నారు పూర్వకాలంలో మనిషికి మర్యాద గౌరవం కీర్తిప్రతిష్టలు మీద ఆధారపడి ఉండేది. ఎంతో క్రమశిక్షణతో కూడిన కుటుంబం నైతిక విలువలతో పాటు సమాజానికి ఆదర్శ వంతంగా నడవడిక ఉండేది. పెద్దల మాటలు పెడచెవిన పెట్టి ధోరణి ఈ తరంలో ఎక్కువగా చూస్తున్నాం కానీ వారు చేసే ప్రతి పని చెప్పే ప్రతి మాట పిల్లలు ఎంతో

ఆదర్శవంతంగా ఉపకరిస్తుంది. విద్వాన్ చొప్ప వీరభద్రప్ప మంచి మనసు కథలు ఒక రైతు తన పొలంలో పక్షులు వల్ల నాశనం అవుతున్న మానవత్వంతో ఎంతో ఆదర్శంగా ప్రమాదం జరిగితే ఎంతో సహృదయంతో గాయానికి నాటు మందువేసి బాగు చేస్తాడు. అందుకు కృతజ్ఞతగా మరొక పావురం రైతును పాము కాటువేయగా పోతుంటే ఆ పాము తోక మీద తన గోర్లతో కరిచి నుండి కాపాడుతుంది. ఇలా మనిషికి మధ్య ఎంతో సహకారాన్ని గురించి విద్వాన్ చెప్ప వీరభద్ర గారు ఎంతో చక్కగా ఈ కథలో తెలియజేయడం జరిగింది. అభ్యాసం వల్లనే ఏ విధమైన పట్టుబడుతుంది అని వీరభద్ర రావు గారు పట్టుదల కథలో తెలియజేశాడు. కృష్ణ అనే అబ్బాయి ఈ కథలు వేణువు నేర్చుకోవడానికి ఎంతో కష్టపడి అభ్యసిస్తాడు. మొదట్లో అందరూ తనను తిట్టేవారు. కృష్ణ వేణువు క్రమంగా లయబద్ధంగా రాగయుక్తంగా చక్కగా కొన్ని పాటలు వేణు పాడుతున్నాడు. వేణువు గానానికి తల్లి సంతోషించింది. వాయించడంలో తప్పొప్పులను ఆనవరించుకుంటూ ఆ వేణు స్వర యుక్తంగా రాగాలు పలికిస్తూ వేణునాదం చేస్తుంటే వీధిలోని వారందరూ కృష్ణుని అభినందించేవారు. కృషితో నాస్తి దుర్భిక్షం అనే నానుడి కృష్ణ నిజం చేసి చూపాడు ఎదుటి వారికి ఆదర్శంగా ఉంటూ తన గానంతో తన ఊర్లోనే జమిందార్ని కూడా మెప్పించగలిగాడు. గ్రామం లోని వారందరికీ అబ్బాయి ప్రతిభ తెలిసి చాలా సంతోషించారు. క్రమంగా గ్రామంలోని వారందరూ అతని కృష్ణ అనడం వేణు కృష్ణ అనసాగారు. కథా రచయిత ఎంతో నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆదర్శంగా కృష్ణ నడిపించడం జరిగింది.

విద్వాన్ చొప్పా వీరభద్రప్ప పరివర్తన కథలో రచయిత మనిషికి మనిషికి మధ్య మరియు పెంపుడు జంతువైన గ్రామసింహం అయిన కుక్క యొక్క విశ్వాసాన్ని ఎంతో చక్కగా వివరించడం జరిగింది. ఈ కథలో అనే వ్యక్తి ఉద్యోగస్తుడు అయినా పిచ్చగాళ్ళకి వేయకపో గా వారిని కోపంతో ఇంటి దగ్గర నుంచి వీళ్ళ కొట్టేవాడు ఒకనాడు ఒక గ్రామసింహం తన ఇంటిముందు మూలుగుతూ ఉంటే అసహ్యించుకుంటు అందరి ముందు దాని మీద చీదరించుకుంటాడు. ఇదే కథలో మరో వ్యక్తి సుమంత్ ఇతను ఆటో డ్రైవర్ ఆ కుక్కను తన ఇంటిలోనే పెంచు కుంటూ దాని గాయాలను మాన్పించే బాగా చూసు కుంటాడు. చేసిన మేలు మరువకు కుక్క విశ్వాసం గల మూగజీవి అది ఒక రోజు వి హెయిర్ ఇంట్లో దొంగల పడగా ఆ కుక్క తనను కాపాడుతుంది. మన ప్రవర్తనను బట్టి వారు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి. పెద్దల మాట చద్దన్నం మూట అని నానుడి నియంత్రణ అనే కథలు వీరభద్రప్ప తెలియజేశాడు. ఈ కథలు తల్లిదండ్రుల కష్టార్జితం వచ్చిన ఆస్తిని అంతా జల్సాలకు అలవాటు పడి ఉన్న ఆస్తినంతా పోగొట్టుకుంటాడు కాశీం. స్నేహితుల వల్ల చెడు వల్ల అది క్రమంగా పాలలో విషపు చుక్కై కి ఇంట్లో అమావాస్య చీకట్లు అలుముకున్నాయి. డబ్బే జీవితం అన్న వారికి ఈ సమాజంలో ఎదురయ్యే పరిస్థితులను వీరభద్ర గారు చాలా చక్కగా వివరించారు. మనసు నిండితే గర్వం వస్తుంది. అది వస్తే వివేకం నశిస్తుంది. దానితో నోటినుండి దురుసు మాటలు వస్తాయి. అదే పతనానికి నాంది అవుతుంది అని విపరీత బుద్ధి అనే కథలో స్నేహం చేయడానికి సమవుజ్జీ అయి ఉండాలి అని పెద్ద వృక్షము ఎంతో గర్వంతో అహంతో పొగరుబోతుతో ప్రవర్తించడం ప్రకృతి విలయతాండవానికి నేలకు ఒరిగి పోవడం జరుగుతుంది. అందుకే పెద్దలు ఎప్పుడు చెబుతుంటారు. పెరుగుట విరుగుట కొరకే అని. అలాగే మంచి బుద్ధి గల ప్రాణికోటి ఎదుటి వారికి ఎప్పుడూ మంచే చేస్తారు కాని ప్రక్క వారికి హాని తలపెట్టక కోరుకో రాదని సవివరంగా విద్వాన్ చొప్పా వీరభద్రప్ప తెలియజేశాడు.

ఇతరులకు ద్రోహం చేయాలని గోతులు తీస్తే ఆ గోతిలో వారే పడతారు అని 'మోసం దాగదు' అనే కథలో తెలియజేశాడు. నంది గుప్తుడు సుదర్శన గుప్తుడు నీ

మోసం చేయడం ధర్మాన్ని న్యాయాన్ని నమ్ముకొని మాకు ఏమి సంపాదించి ఇచ్చారు కష్టాలు తప్ప దాన్ని విడిచి ఏదో మార్గంలో డబ్బు సంపాదించి ఉండాలి. ధర్మం న్యాయం సత్యం అనే మాటలు కథలు చెప్పడానికి బాగుంటాయి అవి అని తండ్రితో వాదోపవాదనలు జరగడం మిత్రుని మోసం చేయడం తప్పు అని తండ్రి చెప్పిన మాట పెడచెవిన పెట్టడం వల్ల రాజుగారి న్యాయ నిర్ణయం తర్వాత నందిగుప్తుడు దోషిగా సుదర్శన గుప్తుడు నిర్దోషిగా రుజువు కాబడతాడు. మూర్ఖులకు మంచి మాటలు చెవికి ఎక్కవు. పార్టీ వారితో స్నేహం చేయరాదు. కష్టాల్లో ఉన్నవారికి చేతనైతే సహాయ పడాలి వారి కష్టాలు తీర్చాలి. నేటి సమాజంలో ప్రజలు ఎవరికి వారే యమునా తీరే అనే విధంగా ఉన్నారు. తోటి వ్యక్తుల మంచిచెడ్డలు మంట కలుస్తున్నా పట్టించుకోవడం లేదు. అందువల్లనే వారిని సంస్కరించడానికి అనుగుణంగా మంచి కథలను భవిష్యత్ తరాల వారికి అందిస్తున్నారు చొప్పా వీరభద్రప్ప గారు.

విద్య, విలువ అనే కథలు అత్యంత నిరుపేద కుటుంబంలో పుట్టిన ప్రవీణ్ తల్లిదండ్రులు కష్టపడి చదివితే బాగా పెద్ద చదువులు చదువుకున్నా, చదువుకు తగ్గ ఉద్యోగం లేకపోవడంతో కుటుంబం చదివిన చదువును పక్కనపెట్టి మెకానిక్ పని చేయడం, చదువు మీద శ్రద్ధ సహనం ఓర్పు పట్టుదలతో మంచి ఉద్యోగం సంపాదించి సమాజంలో అందరికీ ఆదర్శవంతంగా ప్రవీణ్ ఉండటం ఈ కథలో తెలియజేయడం జరిగింది.

విద్వాన్ చొప్ప వీరభద్రప్ప తన కథలలో పశు పక్ష్యాదుల కథ కాకుండా మనిషి అవిటి వాడైనా గుణంలో ఎంతో ఆదర్శంగా చిత్రీకరించాడు. అంగ వైకల్యం మనిషికి మాత్రమే కానీ మనసుకు కాదని వీరభద్రప్ప గారు తెలివైన కథలు లో ఎంతో చక్కగా తన రచనా నైపుణ్యం ద్వారా సమాజానికి ఆదర్శవంతంగా సాటి మనిషికి తోడ్పడే విధంగా కథను రచించడం జరిగింది. తెలివైన కథలు జ్ఞాపకశక్తి ఎంతటిదో అంటే ఒక్కసారి ఈ పాట వింటే చాలు వెంటనే చెప్పగల సామర్థ్యం ఉన్నవాడు. అతడికి అమోఘమైన తెలివి తేటలు చాలా అందంగా ఉంటాడు. ఒక దేవత ప్రత్యక్షమై వరం కోరుకోమనగా తెలివిగా అతను నా మనవడు బంగారు తూగుటుయ్యాల ఉండగా చూడాలనే ఒకే ఒక కోరిక చాలు అమ్మ అని కోరుకున్నాడు. కోరిక ఒకటే అయినా అందులో అని అర్థం చాలా ఉంది. మానవుడు కావాలంటే ముందు పెళ్లి కావాలి. అప్పుడు కొడుకు పుట్టాలి. కొడుకుకు కొడుకు పుట్టాలి చూడాలంటే కన్నులు కావాలి. బంగారు ఉయ్యాల్లో ఊగాలి అంటే సంపద కావాలి. అంతవరకు బతకాలంటే ఆయుష్షు, ఆరోగ్యం కావాలి. అన్నీ ఒక కోరిక కలిగి ఉండే విధంగా వీరభద్రప్ప ఈ కథలో తెలియజేయడం జరిగింది. సంపాదన అవసరమే అంతకుమించిన సంస్కారం కూడా ఎక్కువ అవసరం. లేనితనాన్ని మదిలో ఉంచక నేర్చిన విద్య తోడి సేవను నలుగురికి పంచిన దాతకు గ్రహీతకు జన్మ పుణ్యం అవుతుంది. ఇద్దరికీ ఆనందం ఉంది అన్నిటికీ మించిన ధనమదియే కదా వ్యక్తి శీలవంతుడు అయినప్పుడే అతడు చేసే ప్రతి పని దైవానికి ప్రీతిపాత్రం అవుతుంది. మంచి పేరు పొందడం ధనం కంటే విలువైనది. వీరభద్రప్ప విధేయుడైన కుమారుడు కథలో ఒక ఆచారం ప్రాణం పోసుకుని బ్రతికి ఉందంటే ఆచారాన్ని సులభంగా కొట్టిపారేయలేం. పెద్దవారు బాగా ఆలోచించి అనుభవంతో చెబుతుంటారు అని తల్లి కుమారుడితో అంటుంది. ప్రతి పనికి తన అంతరాత్మ ప్రమాణం అని చెప్పింది. ఈ కథలో రావిచెట్టు మహత్యం పురాణాలనుంచి దేవత వృక్షమని బోధివృక్షం అని మొదల్లో లో బ్రహ్మ మధ్య విష్ణువు నువ్వు చివర శివుడు ఉంటారని వర్ణించాయి. ఆ చెట్టు లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేస్తే పాండు రోగం, క్షయ, కుష్టు, జ్వరం అన్ని రోగాలు నశిస్తాయని ఆకులపై అముదం రాసి ఆకులను వేడి చేసి తల పైన, కనతల పైన, నొసట పైన ఉంచుకొన్నా ఎట్టి తలపోటు అయినా

తగ్గిపోతుందని తెలియజేశాడు. తల్లి చెప్పినట్టుగా కుమారుడు ప్రయాణంలో తప్పిన పెనుముప్పును గ్రహించి, తల్లిని మించిన దైవం లేదని తల్లి స్థానం తండ్రి కంటే వెయ్యి రెట్లు అధికమని పెద్దలు ఊరికే అన్నారా? తల్లి మాట వినకున్న ఈరోజు అరణ్యంలో దిక్కులేని చావు చచ్చిన వాడినని అందుకే పెద్దల మాటలపై విశ్వాసం వుంచాలి అంటారు. విశ్వాసం లేని జీవితం అరణ్య ప్రయాణం కదా. లోకంలో తాను తెలుసుకున్నది చాలా ఎక్కువ అనుకుంటాడు మూర్ఖుడు. తాను తెలుసుకోవాల్సింది చాలా ఉందని అనుకుంటాడు వివేకి.

తెలుగు సాహిత్య రంగంలో ఎంతో మంది రచయితలు తమ అనుభవాలను తన కథల ద్వారా సమాజానికి అందించి ముఖ్యంగా బాల్యంలోని ఈ విషయ లను తెలుసుకునేలా తన రచనల్లో తెలియ జేయగలరు రచయిత చొప్ప వీరభద్రప్పగారు. బాల సాహిత్యంలో అనేక కథలు రచించి బాలల కథా సంపుటాలు ప్రచురించి సమాజానికి ఆదర్శంగా నిలుస్తు న్నారు. తన రచనా శైలి మనసు లోనే కాకుండా పశు పక్ష్యాదులు జంతువుల ద్వారా కూడా మానవీయ విలువ లను నైతిక విలువలను సమాజానికి ఉపయోగపడే విధంగా రచనలు చేయడం ఆదర్శవంతుడిగా పేర్కొన వచ్చు. నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్ది ఎంతో ఆదర్శవంతంగా తయారవుతుందో అవుతారని రచయిత అభిప్రాయంగా చెప్పవచ్చు సమాజానికి కావాల్సిన విలువ లతో కూడిన విద్యావంతులుగా తీర్చిదిద్దాలి అంటే ఇలాంటి కథాసంపుటాలు పిల్లలతో చదివించాలి. తన అపార ఉపాధ్యాయ అనుభవం ద్వారా ఈయన రచనలు చేయడం జరిగింది. బాలసాహిత్యంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరుచుకున్నాడు వీరభద్రప్ప. తర్వాతి తరాల వారికి అందించాల్సిన మీ శాశ్వతమైన విలువ కలిగినవి సంస్కారాలు విలువలు మధురానుభూతులు ప్రగతిశీల ఆలోచనలు అని తెలుసుకోవాలి.

రామాయణం, మహాభారతం కథలు మనందరికీ కొద్దోగొప్పో తెలిసినవే. అయినప్పటికీ మరలా మరలా వాటిని వింటూనే ఉంటాం. వాటిని మరలా ఎవరైనా రాస్తే చదువుతూ ఉంటాం. తెలిసిన కథలే అయినప్పటికీ వాటిలోని మహత్తు ఏదో ఆ కథల చుట్టూరా మనల్ని తిప్పుకుంటూనే ఉంటుంది.

పిల్లలకు వాళ్ళకు అనువైన భాషలో సాహిత్యం ఎందుకు అవసరమో తెలుసుకుంటే దానికి కావాల్సిన ప్రాముఖ్యత ఇవ్వగలరు. బాలలు విరిసే మొగ్గలు. వికసించే పుష్పాలు. మొలకెత్తే విత్తనాలు. చిగురించే పత్రాలు. బాలలు జాతికి పునాదులు. భవిష్యత్తుకు అందాల మేడలు. ఆ మొగ్గలను సరిగ్గా చూసుకోకపోతే, ఆ మొగ్గలను సరిగ్గా పాలించకపోతే, ఆ శిశువులను అన్ని విధాలా సరిగ్గా పోషించి పెంచకపోతే కాబోయే భావి భారత పౌరులు ఎలా తయారవుతారో ఊహించుకోవచ్చు.

కేవలం నీతిని నేర్చుకోవడానికో, పెద్దల మాటలు బుద్ధిగా వినడానికో కాదు, వాటి ద్వారా అంతకు మించి నది ఏదో పొందడం వలనే పిల్లలకు మంచి అనుభూతిని, కోరికను కలిగించేవి నైతిక కథల పట్ల ఆసక్తిని పెంపొంది స్తుంది. ఆ కథల్లోని మాంత్రిక శక్తి ఉత్సుకతగల కథలను వినాలనిపిస్తుంది. చదివిన కథల్నే మరలా మరలా చదివింపజేస్తుంది. ఇలాంటి ఇంద్రజాలమే వీరభద్రప్ప గారి కథల్లో దాగి వుంది.

శ్రీ చొప్ప వీరభద్రప్పగారు 2013లో నైతిక కథా దర్శనం, ఇతర పుస్తకాలను రచించారు. ఇందులో నైతిక కథాదర్శనం అనే గ్రంథం పాఠకుల, విమర్శకుల ప్రశంస లనందుకొంది. పిల్లల మనస్తత్వం ఎరిగిన కవి కావడం వల్ల సరళ సుందరమైన శైలిలో ఈయన రచించడం అభినందించదగ్గ విషయం. అందుకు ఆయన ఎంత కష్టపడ్డారో మనం భావించవచ్చు. ఈ సందర్భంగా మహాకవి శ్రీశ్రీ గారు "ఎవరికీ అర్థం కాకుండా రాయడం ఎంత సులభమో, అందరికీ అర్థమయ్యేలా రాయడం అంత కష్టం" అన్న మాటలను మనం గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చెయ్యి తిరిగిన రచయితలు తప్ప అన్యులు బాలసాహిత్యాన్ని సృష్టించలేరు. శైలి మనోహరంగా, అక్షరం నుండి అక్షరం లాగినట్లుగా పదం నుండి పదాన్ని లాగినట్లుగా వీరభద్రప్పగారి సాహిత్యం ఉంది. అలా వుంటే చదవడానికి ఉల్లాసంగా ఉంటుంది. రచన మీద ఆసక్తి ఏర్పడుతుంది. సంభాషణ శైలిలో ఉంది కాబట్టి పిల్లలకు, పెద్దలకు కూడా రమ్యంగా ఉంటుంది. ఇలాంటి కథలు చదవడం వల్ల జీవితమంతా వాటి తాలూకు స్ఫూర్తి, పరిమళం జీవితానికి అంటిపెట్టుకొని వుంటాయి. బాలసాహిత్యానికి పనికివచ్చే ఇతివృత్తాన్ని ఎన్నుకోవడం సులభమైన విషయం కాదు. ఏమి రాసినా అది పిల్లల అభివృద్ధికి తోడ్పడేదిగా ఉండాలి. అది కథలాగా ఆహ్లాదజనకంగా వుంటే పిల్లల హృదయాలకు అది హత్తుకుంటుంది. ఆహ్లాదంతో పాటు బుద్ధి వికాసానికి తోడ్పడుతుంది.

శ్రీచొప్ప వీరభద్రప్పగారి రచనలు చాలా సరళ శైలిలో ఉంటాయి. ప్రతీకాత్మకంగా చెప్పడం రచయిత కథనా శిల్పంలోని విశిష్టత. పులి గురించి చెప్పినా, నక్క నైజాన్ని విడమరచి వివరించినా అందులో ప్రతీకాత్మకంగా మానవ స్వభావంలోని దౌర్భల్యాన్ని, దుష్టత్వాన్ని ప్రతిఫలింప చేశాడు. కాలానుగుణంగా, సమయానుసారంగా సందర్భోచితంగా వ్యవహరించాల్సిన అవశ్యకతను ఈ కథల ద్వారా గుర్తు చేస్తారు వీరభద్రప్పగారు. ఆపదలో ఉన్న సింహం, పులి వంటి క్రూర జంతువులు అవసరార్థం పలికే సాధు వచనాల్లో పూర్తి నిజం ఉందనుకుంటే మొదటికే మోసం వస్తుంది. కనుక సహాయం చేసినా, ఆ వెంటనే పక్కకు తప్పుకోవడం మంచింది. ఈ విషయాన్ని "క్రూరులెప్పుడూ కృతఘ్నులే" అన్న కథ ద్వారా చాలా చక్కగా విడమరచి చెప్పారు. దుష్ట స్వభావం ఉన్న ఒక జంతువు ఒక సందర్భంలో మంచిగా ప్రవర్తించినట్లు కనిపించినా, దాని అంతరంగంలోని దుష్టత్వం చెదిరిపోదు. కనుక ఈ తరహా మనుషులకు దూరంగా వుండటమే శ్రేయస్కరమని, ఉత్తమ సంస్కార భావాన్ని ఈ కథ ద్వారా చెప్పకనే చెప్పారు రచయిత.

పెద్దలమాటలు పెడచెవిన పెట్టే ధోరణి ఈ తరంలో ఎక్కువగా ఉండటం మనం గమనించవచ్చు. కానీ వారు చేసే ప్రతి పని, చెప్పే ప్రతి మాట పిల్లలకు ఎంతగానో ఉపకరిస్తుంది. దీనిని "విధేయుడైన కుమారుడు" అన్న కథద్వారా ఎంతో శక్తివంతంగా నేటి సమాజానికి ఉత్తమ సంస్కారం అలవడుతుందని చెప్పారు. పెద్దల మాటలు చాదస్తాలుగా కొట్టిపడేయానికి వీలు లేదనే హెచ్చరిక ఈ కథలో దాగి వుంది. నాటి తరం నుండి నేటి తరం వరకు ఉపయోగపడేసూక్తి "పెద్దల మాట సద్దన్నం మూట" అని చెప్పవచ్చు. ప్రతి మనిషికి జీవితంలో అనుభవం ద్వారా చెప్పే మాటలు ప్రతి ఒక్కరి జీవితానికి ఎంతో ఉపయోగపడతాయి. అనుభవం ద్వారా ఎన్నో విషయాలను ఎదుటువ్యక్తులు ఇచ్చే సహకారం జీవితంలో ఎలా ఉండాలి అనే మాటలు మనం నేర్చుకోవచ్చు. మాటల్లోని సారాంశం, అనుభవంతో చెప్పే మాటలు ఎంత గాఢమైనదో చాలా కథల్లో చూడవచ్చు.

వీరభద్రప్పగారు "ముందుచూపు" శీర్షికన మూడు చేపల కథని చెప్పిన రీతి ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది. పిల్లల మనస్తత్వ పరంగా వారికి మనసుల్లో ప్రగాఢమైన ముద్ర వేసేలా కథని రచించడంలో రచయిత శిల్ప ప్రావీణ్యం గోచరిస్తుంది. అందుకు ఈ కథే ఉదాహరణ అంటూ ప్రముఖ కథా విమర్శకులు గుడిపాటి గారు ప్రస్తావిస్తారు. వారి మాటల్లోనే "నా చిన్నతనంలో నేను కూడా ఈ కథని విన్నాను. నా పిల్లలకు ఈ కథను చాలా సార్లు చెప్పాను. ఒక సారి విన్న కథే అయినప్పటికీ మరలా మరలా వినాలనిపించే కథ. ఇప్పుడు వీరభద్రప్ప రాసిన కథ చదివి చాలా థ్రిల్ అయ్యాను. ఇదే కథను పిల్లలకు వినిపిస్తే మరింత కొత్తగా అనిపించింది. ఒక విశ్వజనీనమైన సత్యాన్ని ఎవరికి వారు తమదైన పద్ధతిలో చెబుతారు. ఒకరు చెప్పిన కథను మరొకరు కొత్తగా, సృజనాత్మకంగా చెప్పడం విశేషం. సత్యం ఒక్కటేగాని, చెప్పిన తీరులోనే వైవిధ్యం వుండాలి. దీనిని ముందుచూపు కథలోనే కాదు చాలా కథల్లో రచయిత సాధించారు" అని చెప్పడాన్ని

బట్టి చూస్తే వీరభద్రప్పగారి కథాశైలి, ఆయన రచనా తీరు మనకు అవగతమవుతాయి. ఇలాంటి నీతి కథలే ఇప్పుడు ఉన్న ప్రస్తుత సమాజానికి చాలా అవసరం కూడా. వారి కథల్లోని నీతిని వ్యక్తిగత జీవితంలో పిల్లలకు అలవాటు చేయడం ద్వారా ఉత్తమ సంస్కారం అలవడుతుందని ఘంటాపథంగా చెప్పగలను.

సూక్ష్మాతి సూక్ష్మ విషయాలన్నీ ఎంతో చక్కగా పూస గుచ్చినట్లు చెప్పిన రీతి ఈ కథల్లో ప్రధాన ఆకర్షణ. అయితే నమ్మకంతో మోసగించే వారి మాటలు ఎల్లకాలం సాగవు. ఎప్పుడో ఒకసారి వారు ఘోరంగా దెబ్బతినడం అనివార్యం. "తాడి తన్నేవాడుంటే వాడి తలదన్నేవాడుంటాడు" అని మన పెద్దలు చెప్పే సామెత. ఇలాంటి నీతి సామెతలను చాలా చిన్న చిన్న మాటల్లో వీరభద్రప్పగారు కొంగ - ఎండ్రి - చేపలు కథలో దీనిని సోదాహరణంగా చూపించారు. అందుకని జిత్తులమారి తనంతో ఎల్లకాలం నెగ్గుకువస్తామనుకుంటే కుదరదని గ్రహించాలి. ఒకసారి మోసపోతారేమోగానీ, పదేపదే మోస పోవడం జరగదు. అందుకని మోసం చేయడం బతకనేర్చిన తత్వం అనుకుంటే సరిపోదు. ఇలాంటి జీవిత సత్యాలు అనేకం ఈ కథల్లో కనిపిస్తాయి.

నిజానికి ఒక సంపూర్ణ జీవితానికి బాల్యం పునాది అయినట్లు, జీవిత సాహిత్యానికి బాలసాహిత్యం పునాది. "బాలవాక్కు బ్రహ్మవాక్కు" అన్నట్లే పిల్లలంతా పరమాత్మకు ప్రతిరూపాలన్నారు. కథాకథనంలో "రీటెల్లింగ్" అన్నది అద్భుతమైన పద్ధతి. దీనిని ఎంతో చాకచక్యంగా, నేర్పుగా నిర్వహించాలనేదే ప్రధానం. ఈ పనిని ఎంతో నిబద్ధతతో చేశారు వీరభద్రప్పగారు. ఉపాధ్యాయులుగా సుదీర్ఘమైన అనుభవం ఉన్నందున ఏ రీతిన చెబితే మనస్సుకు హత్తుకుంటుందో రచయితకు తెలుసు. అందువల్లనే ఈ కథల అంతటా నింపాదితనంతో కూడిన రచయిత కంఠస్వరం వినిపిస్తుంది. ఎలాంటి ఆవేశ కావేశాలకు లోను కాకుండా, ఆయా పాత్రల స్వభావాల్ని, సన్నివేశాల్ని నెమ్మది తనంతో చెప్పుకురావడం వల్ల మౌఖిక కథనా శైలి కథలకు బలాన్నిచ్చింది.

పట్టుదలకి, స్థిరత్వానికి ధ్రువుడు, లోకకంఠకత్వాన్ని నిరసించటంలో తండ్రినైనా లెక్కచేయని ఆత్మవిశ్వానికి ప్రహ్లాదుడు, మృత్యుంజయ సాధనకు మార్కండేయుడు, ముల్లోక వ్యాప్తికి వామనుడు, సాహసానికి సర్వదమనుడైన భరతుడు, తండ్రికే బ్రహ్మోపదేశం చేసిన కుమార స్వామి, పితృభక్తికి శ్రవణ కుమారుడు, ఒకరికొకరు తెలియని తన తల్లిదండ్రులను కలిపిన నాచికేతుడు, ఒక ధర్మంకోసం తండ్రితో పోరాడి జాత్యాభిమానాన్ని నిలిపిన కుశ, లవులు మొదలైన బాలురల వల్ల పురాణ రచనల్లో ప్రతి కథ కూడా ఒక కనువిప్పును, సందేశాన్ని, ప్రబోధాన్ని మిళితం చేసుకొని రూపొందింది. అయితే కేవలం సందేశాలివ్వడానికో, ప్రబోధాలు చేయడానికో అన్నట్లుగా రూపుదిద్దుకోకపోవడమే ఈ కథల్లోని మేలిమి గుణం. సందేశాలు, ప్రబోధాలు అంతస్సారంగా వుండాలి. పై పురాణాలలోని నైతిక దర్శనం - ఉత్తమ సంస్కారాలు ఈ గమనింపు రచయితకు వుంది. ఈ అవగాహన వల్లనే కథల్లోని కళాత్మక విలువలకు భంగం కలుగకుండా కథను సృజించారు. ఈ కారణంగానే చొప్ప వీరభద్రప్పగారి కథలు పిల్లల్ని ఆకట్టుకుంటాయి. ఈ కథలను చదివితే ప్రతి ఒక్కరు కూడా తమ చిన్నప్పటి జ్ఞాపకాలను తప్పక నెమరువేసుకుంటారని చెప్పక తప్పదు.

భావి పౌరుడు ఎలా ఉండాలి అని ప్రజలు, ప్రభుత్వం వాంఛిస్తార్తో ఆ సిద్ధాంతాలు బాల్యంలోనే జీర్ణమయ్యేలా సాహిత్యంలో సృష్టించడంలో ఆశయానికి తగిన తరం రూపొందగలరు. బాలల మానసిక తత్వం సంక్లిష్టం. ఇది ఆధారంగా దీనికి అనుగుణంగా ఉత్తమ నైతిక కథా దర్శనం, ఉత్తమ సంస్కారాలు పిల్లలకు అందించడం ఆధునిక సమాజంలో ముఖ్య ఆవశ్యకత. సాహిత్య సృష్టికి సమాజం ఆధారం. సమాజంలో ఉన్న మంచిచెడ్డలు, నీతి-అవినీతి, పిల్లలకు అర్థమయ్యే రీతిలో చెప్పారు. జీవితంలో ఉన్నత ఆశయ సాధన వారి మెదళ్ళలో బీజంగా చేరడానికి ప్రయత్నించాడు. పిల్లలకు ప్రకృతిపై ఉన్న ఆసక్తి, ఇష్టం మరోదానిపై ఉండదు. ఆకాశం,

అరణ్యం, జంతువులు పిల్లల్ని ఎక్కువగా ఆకర్షిస్తాయి. వీటిని ఆధారంగా సహజ సాహిత్యం సృష్టిస్తే పిల్లలను బాగా మేలుకొలుపుతుంది. పిల్లలు బాగా చదువుకొని, మేధస్సు పెంచుకొని, అందిన రీతికి దిగి రాయడం ఈయన ప్రత్యేకత. ఎవరినైనా సులువుగా నమ్మేస్తారు కొందరు. కానీ అలా నమ్మి వారికి హాని తలపెట్టే నమ్మక ద్రోహులు కూడా ఉంటారు. కనుక ద్రోహ చింతన ఎలా ఉంటుంది? అన్నదానిని ఒక కథలో చక్కగా అక్షరీకరించారు. ఎవరిని ఎంత వరకు నమ్మాలో ఇందులో చెబుతారు. నమ్మడానికి ముందు ఒకటికి నాలుగుసార్లు ఆలోచించుకోవాలిన సూచిస్తారు. నమ్మినవారినే మోసం చేసే వీలుంటుంది. అయితే ఇలాంటి నమ్మకద్రోహం ఎంతటి తీవ్రమైన నేరమో అమానవీయమైన చర్యనే ఈ కథల ద్వారా చక్కగా చెప్పారు వీరభద్రప్పగారు. రామాయణం, భారతం, భాగవతాలలో ఎన్నో నైతిక విలువలు గల కథలు మరియు సంస్కారానికి సంబంధించిన కథలు ఉన్నాయి. అయితే రామాయణంలోని కథలు కథలుగా కాకుండా, నాగరికతలకు, అనాగరికథకు అందులో ఉండే సంఘర్షణ శాస్త్రీయంగా పిల్లలకు బోధించాలి. అలాగే భారతంలో ధర్మానికి, అధర్మానికి ఉండే తేడాలను అర్థమయ్యేలా చెప్పారు. కథారూపంగా పిల్లలకు ఎంతో సున్నితంగా వాళ్ళకు అర్థమయ్యే భాషలో భావాలతో అందించారు. పిల్లలను ఆకట్టుకొనే కథలకు ముఖ్యంగా కథా సంవిధానం, భాష, ఆశ్చర్యం, ఆనందం ఆహ్లాదం కలిగించే విధంగా నైతిక కథాదర్శనంలో ఉత్తమ సంస్కారాలు దర్శనమిస్తాయి. అందుకే పిల్లల కోసం రాసే ప్రతి కథ పిల్లలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయో, ముందుగానే గ్రహించి పరీక్షించి మరీ రాశారు వీరభద్రప్పగారు.

నేటి ఆధునిక సమాజం విపరీతమైన పోకడలతో దారి తప్పుతోంది. అందుకే అనేకమైన అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు వెలుస్తున్నాయి. ఇది దేశ సామాజిక వ్యవస్థకే తీరని మాయని మచ్చ. ఇలాంటి స్థితి రావాలంటే భావి భారత పౌరులు సత్ప్రవర్తనతో పెరగాలి. అలాంటి నైతికతతో కూడిన వ్యవస్థను మనం అందించాలంటే ఉత్తమ సంస్కారవంతమైన నీతి కథలను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై వుంది. ఇలాంటి సందర్భంలో వర్థమాన విషయాలను తీసుకొని, పిల్లలలో ఆదర్శాలను, సదాశయాలను ఆచరణా శక్తిని రేకెత్తిస్తూ, చొప్ప వీరభద్రప్పగారు తన కథల ద్వారా పిల్లలకు ఉగ్గుపాలతో సమతావాదాన్ని బోధించే రచనలు చేశారు. అలాంటి గాఢతని, సాంద్రతని సంతరించుకున్న గ్రంథం "నైతిక కథాదర్శనం". ఒక తరం నుంచి మరో తరానికి అందజేయాల్సిన కథా స్రవంతి మరియు ఉత్తమ సంస్కారమిది.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రమహాభారతం - తి.తి.దే. ప్రచురణలు, తిరుపతి
2. శ్రీమద్రామాయణ కల్పవృక్షం - విశ్వనాథ సత్యనారాయణ
3. బాలసాహిత్య లక్షణాలు - మద్దాళి రఘురామ్
4. నైతిక కథా దర్శనం - విద్వాన్ చొప్ప వీరభద్రప్ప

❖❖❖

ప్రపంచానికే ఆదర్శం భారతదేశ ఆథిత్యం

– కే.తిరీష్ కుమార్, పరిశోధక విద్యార్థి (యుజిసి-జేఆర్ఎఫ్), తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ,
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

భారతదేశ సంస్కృతి మతాలు వర్ణాలు కులాల మరియు వర్గాల సమిష్టి కలయిక. భారతదేశంలోని వివిధ భాషలు, మతాలు, సంగీతం, నృత్యం, ఆహారం, నిర్మాణకళ, ఆచారాలు వ్యవహారాలు దేశంలో ఒక్కో ప్రాంతానికి ఎంతో భిన్నంగా ఉంటాయి. భారతీయ సంస్కృతి అనేది అనేక సంస్కృతుల సమ్మేళనంగా పిలవబడుతున్నది. ఇది భారత ఉపఖండం మొత్తంలో విస్తరించి ఉంది, అనేక వేల సంవత్సరాల చరిత్రను ప్రభావితం చేసింది. భారతీయ సంస్కృతిలో వైవిధ్యమైన మతాలు, భారతీయ తత్వశాస్త్రం,భారతీయ వంటకాలు వంటి అనేక అంశాలు ప్రపంచవ్యాప్తంగా బలీయమైన ప్రభావం కలిగి ఉన్నాయి.

సంస్కృతి ఒక జాతి విశిష్టతను ఉన్నతిని తెలియ జేస్తుంది. ఎన్ని తరాలు మారినా మారిన తరాలనుండి ఆ తర్వాతి తరాలకు అందించే వారసత్వ సంపద సంస్కృతి. భారతదేశం అనేక విదేశీయుల దండయాత్ర లకు, కుతంత్రాలకు లోనై ప్రజా స్వాతంత్ర్యానికి ఎనలేని నష్టం జరిగింది.అయినా భారతీయులు తమ ఆర్ష సంస్కృతిని మరచిపోలేదు.అద్వితీయమైన తమ సంస్కృతి సంప్రదాయాలు ఆధ్యాత్మికతను జాగ్రత్తగా కాపాడు కుంటున్నారు. ధర్మం న్యాయం పట్ల భారతీయ సంస్కృతి కొన్ని నిబద్ధతలను పాటించింది. ప్రజలు చేసిన అనేక ప్రయత్నాలు అనుసరించిన పద్ధతుల వల్లే సంస్కృతి ఒక సనాతన ధర్మంగా పరిఢవిల్లిందని చెప్పవచ్చును.హిందూ సంస్కృతైన వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులకు ఆలవాలం. ఆధ్యాత్మికతకు సంగీత సాహిత్యాలు లలిత కళలు చక్కటి భూమికలు.

భారతదేశంలో నాగరిక సమాజంతో పాటు ఆటవిక సమాజం కూడా ఉంది.నాగరికత సంస్కృతిలో మార్పు జరిగినంత సులభంగా ఆటవిక సంస్కృతి లో మార్పు జరగడం అంతా తేలిక కాదు.భారతీయుల నాగరికత వారి సామాన్య జీవన విధానం నాగరిక లాక్షణికత సంప్ర దాయం భారతీయ సంస్కృతికి ఆధారమైన భారతీయ తత్వాన్ని భారతీయుల ఐకమత్యాన్ని తెలియజేస్తాయి ఇవన్నీ వారి సంస్కృతిలో భాగాలు.

భారతదేశ సరిహద్దులు నదీనదాలు సముద్రాలు వాటి విశిష్టత పురాణ ఇతిహాసాలు, దైవలీలలు ఎందరో విశిష్ట వ్యక్తుల ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఋషి పరంపర, భారత భాగవత, రామాయణ, ఖురాన్ బైబిల్ గ్రంధాలలోని విషయాల విశిష్టత భారతీయ సంస్కృతికి అద్దం పడతాయి. కేవలం సంస్కృతి సాంప్రదాయాలు ఉంటే సరిపోదు వాటిని పాటించే వ్యక్తులూ సమాజం కూడా ఉండాలి. భోజన సమయానికి ఇంటికి వచ్చిన అతిథుల కడుపునింపగలిగితే చాలు ఆ సంస్కృతి చరిత్రపుటల్లో తన చరిత్రను నింపుకుంటుంది. ఆ సేతు హిమాచలం వరకు భారతదేశం ఆతిథ్యానికి పెట్టింది పేరు అని చెప్పవచ్చు. అది నిన్న మొదలైన చరిత్ర కాదు.మనిషి పుట్టిందే మొదట తన ఆహారం కోసం వెతుక్కుంటూ నడక యాత్ర చేపట్టాడు. దొరికినవి దొరకనివి, ఉడికినవి ఉడకనివి అలా ఎన్నోరకాల ఆహారాలను సమకూర్చుకొని తినడం ప్రారంభించాడు. తాను తిని మిగిలినవి ఇతరు లకు వదిలేసి వెళ్ళిపోయేవాడు అని చరిత్ర చెబుతోంది అదే నిజం.

ప్రాచీన భారత కాలం నుండి రాజులు తమ రాజ్యా లను చూడడానికి వచ్చిన విదేశీ అతిథులను అనేక రకాలుగా సన్మానించి భారతదేశ ఆతిథ్యాన్ని రుచి

చూపించేవారు. అంతకుముందు రామాయణ భారతాలలో అతిథిని దైవంగా భావించేవారు. భారతీయ సనాతన ధర్మం

మాతృదేవోభవ
పితృదేవోభవ
ఆచార్యదేవోభవ
అతిధి దేవోభవ..

అని అతిథికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది.భారతీయ ధర్మాన్ని ప్రచారం చేయడానికి తమ జీవితాలనే త్యాగం చేసి దట్టమైన అడవుల్లో ఆశ్రమాలను ఏర్పాటు చేసుకొని ఋషులు సన్యాసులు జీవించేవారు. రాముడు వనవాసం వెళ్తున్న సమయంలో అనేకమంది ఋషుల ఆశ్రమాలను సందర్శించి వారి ఆతిథ్యాన్ని స్వీకరించాడు. అందుకు వారు ఎంతో సంతోషించారు.సాక్షాత్తూ రాముడే తమ ఆశ్రమానికి వచ్చి తమ ఆతిథ్యాన్ని స్వీకరించడంతో వారి జన్మ ధన్యమైందని భావించారు. అతిథికి భోజనం పెట్టనిదే కొందరు పచ్చి మంచినీళ్లు కూడా ముట్టరని నానుడి.

ద్వాపరయుగంలో తనను వెతుక్కుంటూ వచ్చిన తన చిన్ననాటి మిత్రుడైన కుచేలున్నిచేరదీసి తన సింహాసనం మీద కూర్చోబెట్టి తన భార్యతో కూడా సేవలు చేయించి కాళ్లు కడిగి సపర్యలు చేసి, చివరికి తన వెంట తెచ్చుకున్న అటుకులను మరీ మరీ అడిగి ఇప్పించుకుని తిని,తన మిత్రునికి సకల ఐశ్వర్యాలు ప్రాప్తింపచేశాడు శ్రీకృష్ణుడు. అలాగే మహాభారత యుద్ధ సమయాన రాయబారిగా వెళ్లి విదురుని ఆతిథ్యాన్ని స్వీకరించాడు.

మూలఘటిక కేతన తెలుగులో తొలి ధర్మ శాస్త్ర గ్రంథం అయినా ''విజ్ఞానేశ్వరములో''అతిథి గురించిన నియమాల అంశాన్ని ప్రస్తావించారు.

కం. అతిథుల కభ్యాగతులకు
బితరులకును వేల్పులకును బెట్టిన శేషం
బతిశుద్ధ మట్టియన్నము
సతతము గుడుచుట గృహస్తు సద్ధర్మ మిలన్

అతిథులకూ, కోరి వచ్చినవారికి పితృదేవతలకి ఇంద్రాది దేవతలకు పెట్టిన దాంట్లో మిగిలినది చాలా శుద్ధమైనది తూర్పున అరుణకాంతి ఉన్న సమయంలోనే పవిత్రమైనది. అటువంటి అన్నాన్ని నిత్యము తినడమే గృహస్థులు పాటించవలసిన ఉత్తమమైన ధర్మం అని తెలిపాడు.

పూర్వం పండితులకు ఆతిథ్యం ఇచ్చేటప్పుడు ఎలాంటి ఆసనాన్ని వాడకూడదో కూడా చెప్పాడు.

కం. ఇనుమును బొదిగిన పీటను
మును గాలినయట్టి పీట మోదుగు పీటన్
జెనటిగ బగిలిన పీటను
గొనకొని విప్రుండు గుడువ గూర్చుండ డిలన్

విప్రుడు భోజనం చేసే సందర్భంలో కూర్చునేందుకు ఉపయోగించకూడని పీటలు. ఇనుముతో చేసినవి పనికిరావు. అలాగే ఇనుమును చుట్టూ తోడుగుగా అమర్చినది పనికిరాదు. ఆ కొసనో ఈ కొసనో ముందు ఎప్పుడూ కాలిన పీటను, మోదుగు చెక్కతో చేసిన పీటను, పగిలిపోయిన విరిగిన పీటను భోజనం వేళ ఏరి కోరి కూర్చోడానికి ఉపయోగించకూడదు. ఈ పీటలపై విప్రుడు భోజనానికి కూర్చోడు అని తెలియజేశాడు.

కం. పెక్కండ్రు చూచుచుండగా
ఒక్కడు దాగుడువగ జన దొకరుడు చూడన్
బెక్కండ్రు గుడువ జనదని
తక్కక చెప్పుదురు ధర్మ తత్వవిధిజ్ఞుల్

ఆశగా అనేకమంది చూస్తూ ఉండగా ఒక్కడే ఎవరికీ పెట్టకుండా ఆబగా తినటం తగని పని.అలాగే ఒకే ఒక్కడు చూస్తూ ఉంటే వారికి పెట్టకుండా తక్కిన వారందరూ తినడము పద్ధతి కాదు అని చెబుతారు.

ఇలా అతిథి యొక్క ప్రాముఖ్యతను మరియు ఆతిథ్యం ఇచ్చేటప్పుడు పాటించవలసిన నియమాలను కూడా చెప్పడం ఒక భారతదేశ సంస్కృతికే చెల్లింది అనడంలో సంశయం లేదు.

ఆంధ్రదేశానికి వస్తే ప్రబంధ కాలంలో కృష్ణదేవ రాయలు తన ఆముక్తమాల్యద గ్రంథంలో విష్ణుచిత్తుని అతిథి సత్కారాల గురించి ప్రస్తావించారు. విష్ణుచిత్తుడు తీర్థయాత్రలకు వెళ్లేవారికి, పాదచారులకు నిత్యం అన్న దానం చేస్తుండేవాడు. ఆయా కాలాలకు అనుగుణంగా అంటే చలికాలంలో వెచ్చని ఆతిధ్యం, ఎండాకాలంలో చలువ చేసే ఆతిథ్యాన్నిఇస్తూ నిత్యం అన్నదాన సేవలో తరించిపోయేవాడిని కృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

అల్లసాని పెద్దన మనుచరిత్ర లో ప్రవరుని ఇంటికి వచ్చిన సిద్ధుని అన్నివిధాలా తగిన ఆతిథ్యమిచ్చి ఆయన ద్వారా జ్ఞానోదయం కలిగి గృహస్థుని ఈ కారణంగానే అనేక వర్గాల ప్రజలు, బ్రహ్మచారులు, తీర్థ యాత్రికులు, సన్యాసులు, ఋషులు ఇలా ఎందరికో ఆతిథ్యం లభిస్తోం దని తెలుసుకుంటాడు. ప్రవరుని భార్య సోమిదమ్మ కూడా భర్తతో పాటే అన్నదానంలో అలుపెరగకుండా అర్ధరాత్రి వచ్చిన వారికి సైతం కడుపు నింపి గృహస్థ ధర్మాన్ని పాటించేవారు.

తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలలో నిత్యాన్న దాత గానూ అన్నపూర్ణ గానూ ప్రసిద్ధి చెందిన వ్యక్తి డొక్కా సీతమ్మ. గోదావరి మధ్యస్థంగా కల డెల్టా ప్రాంతంలోని డెల్టాగన్నవరం లేదా లంకల గన్నవరం అని పిలువబడే ఊరిలో ఇల్లాలుగా ప్రవేశించిన ఈమె ఆ ప్రాంతములలో తరచు వచ్చే వరద కారణంగానూ అతివృష్టి, అనావృష్టిల కారణంగానూ పలు ఇబ్బందులకు గురయ్యే ఆ ప్రాంత గ్రామాల పేదలను ఆదుకొంటూ, వచ్చిన వారికి లేదన కుండా నిత్యాన్నదానం జరిపిన మహాఇల్లాలు. 'అన్నమో రామచంద్రా' అన్నవారి ఆకలి తీర్చిన మహా ఇల్లాలు.ఈమె చదువుసంధ్యలు లేని సాధారణ స్త్రీ. ఆమె తాను అన్నదానంచేసి, విశ్వమానవతకు అద్దం పట్టిన మహిళా మణి. భారతీయ సాంప్రదాయంలో 'అన్నం పరబ్రహ్మ స్వరూపమ్ అని పేర్కొనడం మనం వింటున్నాం. అన్న దానానికి మించిన దానంలేదని విశ్వసించి, ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడమే ధ్యేయంగా 'అతిథి దేవోభవ' అన్నపదానికి ఉదాహరణగా నిలిచినవ్యక్తి డొక్కా సీతమ్మ గారు.

ఇలా ఎందరో నేను సైతం భారతదేశ సంస్కృతికి ఒక్క సమిదనై అన్నరీతిలో తమకు ఉన్నంతలో సాటి మనిషికి అన్నం పెట్టాలని మంచి మనసుతో ముందుకు వచ్చారు.ఈమధ్య ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మహమ్మారిని ఎదుర్కొనే క్రమంలో ఎంతోమంది దాతలు మానవతావాదులు ఒక్కరేమిటి మొత్తం దేశమంతా ఆకలి బాధను గుర్తించి అన్ని చేతులు కలిసి దేశం ఆకలిని తీర్చిన ఘనత మన భారతదేశానిదే.మనుషులకే కాదు మూగజీవాలను సైతం గుర్తించి ఆకలి బాధను అర్థం చేసుకొని వాటికి కూడా ఆకలి తీర్చే ప్రయత్నంలో భారతదేశం యావత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పడంలో గర్వంగా ఉందని తెలియజేస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

1. భారతీయ సంస్కృతి - ఆచార్య యస్.బి.రఘునాథచార్య తి.తి.దే ప్రచురణలు
2. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి
3. మహాభారతం- తి.తి.దే ప్రచురణలు
4. మనుచరిత్ర -అల్లసాని పెద్దన
5. ఆముక్తమాల్యద - శ్రీ కృష్ణదేవరాయలు

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో 'రక్తస్పర్శ' కవుల కవిత్వానుశీలన

– భూక్యా కాశీరామ్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, సెంట్రల్ యునివర్సిటి హైదరాబాద్, హైదరాబాద్.

సమాజంలోని భిన్న వర్గాలు, సమస్యాత్మక సమూహాలు, సామాజిక రుగ్మతలు, అంతరాల వ్యవస్థలు నిర్మూలించి సామాజిక రుగ్మతలను సరిచేయడానికి అంతిమంగా సమ సమాజాన్ని స్థాపించడానికి మేలుకోరే అంశమే సాహిత్యం. సమాజం కేంద్రంగా సమాజ హితాన్ని ఆకాంక్షించే సామాజిక మార్పు పై దోహదపడే బలమైన ధోరణులు దృక్పథాలు వైఖరులను కలిగి ఉండటం వల్ల రచయిత తనకంటూ ఒక భావజాలం కలిగి ఉండి, వీలున్న మేరకు ఆచరించడానికి సంసిద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే ఒక రచన ప్రక్రియను సృష్టించడానికి అవకాశం ఉంటుంది. సాహిత్యానికి, సమాజానికి అవినాభావ సంబంధం ఉంది.

వర్తమాన సాహిత్యంలో ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు యువకులు అఫ్సర్, ప్రసేన్, సీతారాంలు తమ గళాన్ని 1986లో 'రక్తస్పర్శ' కవిత్వ సంపుటి ద్వారా వినిపించారు. అత్యాధునిక సాహిత్యంలో అడుగు పెడుతూ, తమ కవిత్వంలో నూతన పద ప్రయోగాలను చేస్తూ, సామాజిక అంశాలను ప్రతిబింబిస్తూ సాహిత్య లోకానికి పరిచయం అయ్యారు. ఈ రక్తస్పర్శ కవులు తమ కవిత్వంలో సమకాలీన సమాజంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలను ప్రతిఫలింపజేస్తూ మానవీయ దృక్పథంతో కవిత్వ రచనకు నాంది పలికారు.

ఈ ముగ్గురు కవులు నాలుగు దశాబ్దాలుగా సాహిత్యంలో తమకంటూ ప్రత్యేక అస్తిత్వాన్ని నిలుపు కుంటున్నారు. 'రక్తస్పర్శ కవులు'గా కొనియాడబడుతున్న ఈ కవులు, ఆదర్శ సమాజ నిర్మాణంలో వారి రచనల ద్వారా సాహిత్య కృషిని నా ఈ పరిశోధన పత్రం ద్వారా తెలియజేస్తాను.

రక్తస్పర్శ కవులల్లో మొదటి వాడు 'అఫ్సర్'. కవిగా నిరంతరం నదీ ప్రవాహంలా సృజనాత్మకమైన రచనలను చిత్రీకరించడంలో ఎప్పటికప్పుడు కృషి చేస్తూనే ఉన్నాడు. ఆయన రాసిన కవిత్వంలో సామాజిక అలజడిలతోపాటు ప్రత్యేక అస్తిత్వ ఛాయలు కనిపిస్తాయి. అఫ్సర్ ను మైనారిటీ కవిగా చూడలేం. ఎందుకంటే ఒకే వర్గానికి సంబంధించిన కవితలు రాయలేదు. సమాజంలో సామాజిక విషయాలపట్ల బాధ్యతను కలిగి వుండి, వాస్తవికత దృక్పథంతో కవితా వస్తువులను వారి రచనలో ప్రతిపాదించారు. ఉద్యోగరీత్యా సప్త సముద్రాలు దాటి ఉన్నప్పటికీ తన రచనలలో మాత్రమే అతని అస్తిత్వ గోడును మాత్రం తన కవిత్వంలో వినిపిస్తాడు కవి అఫ్సర్.

అఫ్సర్ రాసిన 'ఇంటివైపు' కవితా సంపుటిలో అస్తిత్వ నేపథ్యంతో కూడిన కవితలు చాలానే కన్పిస్తాయి. కవి జీవనోపాధికై వెళ్ళి తిరిగి తన సొంత గూటికి వెళ్ళేటపుడు తన జ్ఞాపకాలను తలుచుకుంటూ ఇలా అంటున్నాడు కవి

> "ఎన్ని ప్రయాణాలు ఎన్ని దూరాలకి వెళ్ళి వుంటానో
> అటు ఆకాశంలోనూ ఇటు నేలమీదా
> నా అడుగులు ఎన్ని పడి వుంటాయో
> కానీ ఇంటికెళుతున్నా అడుగుల్ని మాత్రం
> ఇప్పటికీ ఎప్పటికీ లెక్కపెట్టుకుంటూ వుంటాను
> ఇంకెన్ని అడుగుల్లో
> ఇంకెంత దూరంలో వున్నానా అని"
>
> పుట :446

ఈ కవితలో మనిషి ఎంత దూరంలో ఉన్నప్పటికీ పుట్టిన నేలకు రాకుండా తప్పదు. తన చిన్ననాటి జ్ఞాపకాలను తెలుసుకోకుండా ఉండలేడు. ఎన్ని ప్రయాణాలు చేసిన పుట్టిన నేలమీద మళ్ళీ తమ అడుగులు పడకుండా ఉండలేమని కవి ఇంటి బాట పట్టిన తన అస్తిత్వాన్ని ఈ కవితలో చెప్తున్నాడు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి రోహిత్ వేముల మరణించినపుడు దుర్మార్గ కుల వివక్ష మీద నిరసనగా ఉరి తాడును పెనవేసుకున్న ఆ విద్యార్థి మరణం దళిత జాతి మొత్తాన్ని కుదిపేసిన సంఘటనను కవి అఫ్సర్ దళిత దృక్పథంతో ఇలా అంటున్నాడు.

"నోప్పేడుతుందని చెప్పుకోలేని
ఒకలాంటి రాత్రి లోంచి
ఇంకో లాంటి రాత్రి లోకి వెళ్ళిపోయావే తప్ప
రెండు కలల మధ్య చావుని అల్లుకుంటూ
వెళ్ళిపోయావే తప్ప
ఎవరి చీకట్లోకి నువ్వు
ఏ దేహంతో సహా గబుక్కున దూకేశావో
ఎవరి గోడల్ని
పిడిబాకులాంటి పిడకళ్ళతో బాదుకుంటూ ఉండి పోయావే
ఆ రాత్రికో ఆ వొంటరితనానికో
ఇప్పుడు నీడగా అయినా కనిపించని నీకు తెలుసా"

పుట : 525

రోహిత్ వేముల మరణం దళిత విద్యార్థుల గుండెల్లో చెరగని ముద్ర వేసింది. కుల వివక్షత కారణంగా దళిత విద్యార్థి మరణం రాష్ట్రమంతటా కలచివేసిన సంఘటన. సమాజం ప్రగతిమార్గం వైపు అడుగులు వేస్తూన్నప్పటికీ ఈ కుల వివక్ష నేటికీ పోలేదని చెప్పవచ్చు. సమాజంలో దళితులు వివక్షత గురవుతున్నారని చెప్పవచ్చు.

అఫ్సర్ ఒక మైనారిటీ వర్గానికి చెందిన కవి అయి నప్పటికీ సమకాలీన సమాజంలో ప్రతి అంశాన్ని సామాజిక నేపథ్యంతో కూడినటువంటి కవిత్వాలను రాశారు.

రక్తస్పర్శ కవుల్లో ఒకడిగా ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ప్రముఖ స్థానం సంపాదించుకున్న కవి "ప్రసేన్". ప్రసేన్ కవిత్వం చదువుతున్నప్పుడు ప్రగతిశీల భావాలు, వాస్తవిక సామాజిక దృక్పథం పాఠకులకు కనిపిస్తుంది. కొన్ని ఆలోచనలు భిన్నంగా ఉన్నప్పటికీ స్థూలంగా చూసినప్పుడు సామ్రాజ్యవాదం పైన దాని యుద్ధాల పైన ప్రపంచీకరణ ప్రభావాలపైన తనదైన శైలిలో కవిత్వీకరించిన తీరుని అతని కవితాశైలి నిదర్శనమని చెప్పవచ్చు. దేశంలో అమానీయంగా ఉన్న కుల వ్యవస్థ పై తీవ్ర స్వరాన్ని వినిపిస్తాడు. మతతత్వాన్ని ఎండగట్టడం, మానవీయత మృగ్యం అవుతున్న తీరును చరిత్ర పట్ల ఉండాల్సిన బాధ్యతను, స్త్రీ పురుష సంబంధాలలోని అసంబద్ధ, సమాజంలోని కన్నీళ్ళను, దుఃఖాన్ని వ్యక్తీకరించిన తీరు సామాజిక అంశాలపై అవగాహన ఎంత వుందో కవి కవితా రచనలు చదివితే తెలుస్తుంది.

"బాంబు జారిపడ్డ చప్పుడికి
పసిపాప గుక్క పట్టింది
చుట్టూరా సైనికులు
స్తన్యం ఖాళీ లేదు
ఇంతే సంగతులు....."

పుట:210

అగ్రరాజ్యాల అహంకారాన్ని ధిక్కరిస్తూ యుద్ధోన్మదపు విశృంకలత్వాన్ని దృశ్యమానం చేస్తున్నాడు కవి. యుద్ధం వల్ల బాధపడేవారిలో పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు అమాయకులైన పౌరులు అనేక మంది ఉండటం వారి దుస్థితిని ఈ కవిత తెలుపుతుంది.

తెలంగాణ ప్రజలకు ఆంధ్ర పాలకులు యేదేచ్ఛగా జరుగుతున్నా ప్రాంతేతర దోపిడిని తీవ్రంగా నిరసించాడు. నీళ్ళు, నిధులు, ఉద్యోగాల్లో జరిగిన అన్యాయాన్ని తెలంగాణ బిడ్డగా నిలదీశాడు కవి ప్రసేన్.

"నీకు నీళ్ళు మాకు కన్నీళ్లు
నాకు రాళ్లు నీకు నాలుగు రాళ్లు
మాకు బిళ్లు మీకు సాలిరు వాళ్ళు
మాకు గద్దెలు మాకు సుద్దులు"

పుట : 211

ఈ కవితలో ప్రాంతీయ వివక్షలను ఎండగడుతున్నాడు కవి. తెలంగాణలో కొనసాగిన అధిపత్యాల్లో సంస్కృతి ఆధిపత్యం అత్యంత కీలకమైంది. తెలుగు

వాళ్లందరం ఒక్కటే అన్న ఐక్యత భావం వుత్తమాటేనని, నిత్యం తెలంగాణ భాషను, యాసను వెక్కిరించే దుస్థితిని తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని కవి తన గొంతును వినిపిస్తున్నాడు.

కుల, మతాల సమస్యలపై ప్రతిబింబిస్తూ చుండూరు మారణహోమం, బాబ్రీమసీదు విధ్వంసం వంటి సంఘటనలు తెలుగు సమాజానికి, ముఖ్యంగా కవులను తీవ్రంగా కలచివేసిందనే చెప్పాలి.

"జడ్జి మానవా
మీ ముత్తాత మనుపు పెంచిన
కండల చాటు బలవర్ధక
నెత్తుటి కూడు మీ సంతకం
మీరు మాత్రం ఏం చేస్తారు లెండి
న్యాయ దేవుడు పుల్లింగ వారసత్వం కదా
గాయపడ్డ చీకటి స్రవించే
నెత్తురు మీకు కనపడదు కదా"

పుట: 214

అంటూ ధిక్కార గొంతుతో పలుకుతున్నాడు ప్రసేన్. న్యాయాన్ని కాపాడాల్సిన కోర్టులు, చట్టాలు కూడా మతం రంగు పులుముకున్నప్పుడు ఈ దేశంలో లౌకిక తత్వం బతుకుతుందా? మనువు ముద్దాయిని చేస్తూ ,మత ఛాందసత్వాన్ని కవి నిరసించాడు. ఈ విధంగా కవి ప్రసేన్ సామాజిక, రాజకీయ భావాలతో కవిత్వం రాయడం జరిగింది.

రక్తత్రయంలో మూడవ కవి "సీతారాం". ఈ కవిలో ఒక పార్శం సున్నిత భావాలు, మరో పార్శం సమాజం పట్ల బాధ్యతను,దానిలోని లోపాలను, అసమానతల పట్ల నిరసన స్పష్టంగా కనిపిస్తుంది. సీతారాం కవిత్వం అంతా కూడా సామాజిక నేపథ్యంలోనే కొనసాగించినదే.

సీతారాం రాసిన "కుప్పం కవితల" ద్వారా శ్రమజీవుల శ్రామిక సౌందర్యాన్ని తెలియజేస్తున్నాడు.

"ఇక్కడికొచ్చేదాకా రాళ్లుంటే
మనుషుల్ని గాయపరిచే
ఆయుధాలు అనుకునేవాణ్ని
పలుకు రాళ్ళ లాంటి మాటలతో
అందర్ని గాయపరిచేవాడ్ని
ఇక్కడికొచ్చాకే కఠిన శిలల నుంచి
కన్నీటి గింజల్ని పిండొచ్చని తెలిసింది
వాళ్ళు రాళ్లను రచిస్తున్నారు"

పుట:95

అంటూ శ్రమజీవుల సౌందర్యాన్ని ఆరాధిస్తూ కవి అంతరంగిక జీవితంలోని అలజడులు కనిపిస్తుంది. సీతారాం కవిత్వ లక్ష్యం సామాజిక చైతన్యం. అందుకే ఈ కవితలో 'వాళ్ళు రాళ్లను పగలగొట్టే పనిలో ఉన్నారు ,నేను మనిషి లోపల రాళ్లు పగలకొట్టే పనిలో ఉన్నాను' అంటూ మనిషిలో మానవత్వం లేదని మనిషి మనిషికి మధ్య వ్యత్యాసాన్ని చూపుతున్నారని కవి వేదన పడుతున్నాడు.

అలాగే ప్రపంచీకరణ ప్రభావం పల్లెల్లో ఏ విధంగా ప్రభావం చూపిస్తుందో ఇలా చెప్తున్నాడు కవి

"మా తాత నారుమడి మల్టీప్లెక్స్ గా మారింది కనుక
మా పశువుల బీడు ప్రపంచబ్యాంకు వనరుల
కేంద్రమైంది కనుక
పశుక్రాంతి కోసం
మా గాసం కోసం
ఒక ఆవలింత కూడా రాకుండా
సూపర్ బజార్ ముందు నిలబడతాను
నేను వైట్ కార్డు హోల్డర్ని "

పుట: 52

అంటూ రైతు పట్టణాల్లో రోజు కూలీలుగా మారుతున్నారు దుష్పరిణామాలున్ని ఈ కవితలో కవి వాస్తవిక చిత్రణ చేశాడని తెలుస్తుంది.

'సన్నాఫ్ మాణిక్యం' కవితా సంపుటిలో ఈ దేశంలో కులం, మతం ప్రాంతమంటూ మనుషులు వేరు కావడం జరుగుతున్న దృశ్యాన్ని, ఈ కుల మతాల వల్ల

కింది వర్గం ప్రజల దుస్థితి ఏ విధంగా ఉందో ఇలా అంటున్నాడు కవి.

"కులమతాలు
విడిపోయి విడిపోతున్న అన్నదమ్ముల శవాలు
నేనిలా చూస్తుంటాను
నిప్పుకణికలాగా
నా నుడికారం వెతుక్కుంటూ
కంచికచర్లకు ఇంకా చెరని
మన కథని మలిచే పద్యం కోసం"

పుట : 86

1968 ఫిబ్రవరి 24న కృష్ణా జిల్లాలోని కంచికచర్లలో దళితుడైన కోటేశుడు దొంగతనం చేశాడని ఆ ఊరి పెద్దలు కులాధిపత్యంతో నిలువునా దహనం చేసిన ఆ సంఘటన సమాజానికి అరని గాయంగా చిత్రించింది. కారంచేడు, చుండూరు, లక్షింపేట చోట్ల జరిగిన దళిత సంఘటనలు దళిత ప్రజల గుండెల్లో అలజడులు రేపుతాయి. సీతారాం కవిత్వమంతా కూడా సామాజిక కోణంలో రాశారని చెప్పవచ్చు.

ఈ విధంగా ఈ రక్తస్పర్శ కవులు సమాజంలో లోటు పాట్లను ప్రశ్నిస్తూ, వాస్తవిక కోణంలో కవిత్వ రచన చేశారు. ముఖ్యంగా వీళ్ళ కవిత్వంలో మానవీయత కనపడుతుంది, ఆదర్శ సమాజ నిర్మాణంలో ఈ కవుల ప్రత్యేకత అస్తిత్వాని, సమాజంలో సంఘటనలను ప్రతిస్పందిస్తూ సామాజిక చైతన్యాన్ని పురికొల్పే విధంగా కవిత్వం రచన చేయడంలో సిద్ధహస్తులుగా రక్తస్పర్శ కవులను చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. అఫ్సర్ కవిత్వం - అఫ్సర్
2. సీతారాం సాహిత్యం - పగిడిపల్లి వెంకటేశ్వర్లు
3. సిక్స్త్ పూర్తి సీతారాం - మువ్వా శ్రీనివాస రావు, సీతారాం, పగిడిపల్లి వెంకటేశ్వర్లు
4. సాహిత్యంలో వస్తు శిల్పాలు - త్రిపురనేని మధుసూదనరావు
5. ప్రసన్ సర్వస్వం - ప్రసేన్
6. కుప్పం కవితలు - సీతారాం
7. సన్నాఫ్ మాణిక్యం - సీతారాం

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో దేవులపల్లి కృష్ణమూర్తి - నవలానుశీలన

- జగర్ల మహేందర్, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.

దేవులపల్లి కృష్ణమూర్తి అచ్చమైన తెలంగాణ పల్లె రచయిత. సమాజంలో తన చుట్టూ వున్నా పరిస్థితులను, వ్యవస్థలో జరిగిన ప్రతి సందర్భాన్ని, సంఘటనలను వస్తువుగా గ్రహించి తన ఉద్దేశాలకు అనుగుణంగా పాత్రలను ఎన్నుకొని చిత్రీకరించడంలో సిద్ధహస్తుడు. ఊరు జన జీవన యదార్థ చిత్రణకు ఈయనే సాక్ష్యం. తెలంగాణ గ్రామీణ రూపానికి ఆనవాళ్ళు, సామాజిక పరిణామాలు ఎన్నో ఈయన రచనల్లో నిక్షిప్తమై వున్నాయి. ఈయన 1940 జూలై 14 తేదిన తల్లితండ్రులు రాములమ్మ, పెద్దనరసింహలకు అనంతారంలో జన్మించారు. ఈయన వృత్తిరీత్యా ప్రభుత్వరంగ తహసిల్దార్ తోపాటు ప్రవృత్తిగా తెలుగు సాహిత్యంలో అక్షర సేద్యం చేశారు. ఈయన డెబ్భైఆరు కథలను, మూడు నవలలను, ఒక యాత్ర కథనాన్ని రాశారు. దేవులపల్లి జీవితమంతా నాటకాలు, సాహిత్యం, కమ్యూనిజం చుట్టే తిరిగాయి. ఇవే ఈయనకు సర్వస్వంమైపోయాయి. తెలుగు సాహిత్య ప్రక్రియలైన కథ, నవలలో ఒక నూతన ఒరవడికి ప్రాణం పోశారు. కథలగూడు, తారుమారు, యక్షగానం ద్వారా క్రియేటివ్ రచయితగా, 'ఊరు వాడ బ్రతుకు', 'బయటి గుడిసెలు', 'మూడుముక్కలాట' ద్వారా ఉత్తమ నవలా రచయితగా పేరు ప్రఖ్యాతలు, సత్కారాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే పొందారు.

ఊరువాడ బ్రతుకు నవల - పల్లె జీవనం :

దేవులపల్లి కృష్ణమూర్తి గారు తన జీవితాన్ని ఇతి వృత్తంగా రాయబడిన ఈ నవల 'ఊరువాడ బ్రతుకు'. ఇది 2012లో ప్రచురితమైంది. దేవులపల్లి జీవితం, తనలో ప్రయాణించిన కాలం, సందర్భం, వృత్తి జీవన విధానం, కొన్ని ఆచారవ్యవహారాలు మొదలైన అంశాలన్నీ అత్యంత ప్రతిభావంతంగా చూపింది. మామూలుగా దేవులపల్లి ఘట్టం నుండి మొదలై తన వృత్తి సాలె మగ్గంతో అల్లుకుపోయి చివరికి వ్యవస్థ స్థితిగతులను, కులాలు, రాజకీయాలు, పటేల్, దొరలు, పోలీసులు ఎన్నో విషయాలను, మానవసంబంధాలను ఈ నవల మానవుని జీవితం అన్ని కోణాల్లో స్పృశిస్తుంది. ఇప్పటివరకు ఇది సృజనాత్మక సాహిత్యంలోకి ఎక్కని 70 ఏళ్ల నాటి తెలంగాణ ప్రజల సామాజిక చరిత్ర. దేవులపల్లి కృష్ణమూర్తి గారు ప్రధానంగా ప్రతి ఊరు స్థితిగతులను చిత్రిస్తూనే తన అంతరంగాన్ని తన జీవితాన్ని ఇందులో ఆవిష్కరించారు. ఈయన రాసిన మార్మిక శైలి విధానం ద్వారా పాఠకులు హత్తుకొని తమ జీవితాన్ని చూసుకున్నారు. తన బాల్యంలో చదువుకున్న పరిస్థితులను అప్పుడు ఎదుర్కొన్న దీనమైన సందర్భాన్ని, మెతుకు లేని పల్లె వాతావరణాన్ని, మనుషులు పడుతున్న దరిద్రాన్ని చూడవచ్చు. పద్మశాలి కుటుంబంలో జన్మించడం ద్వారా పనితో పాటు పాట అన్నట్టు ఎప్పుడు మగ్గం నేసేటప్పుడు ఇంటి సభ్యులతో కలిసి పని చేసుకుంటూ భక్తి గీతాలను, జానపద పాటలను, తత్వాలను పాడుకునేవారు. అలాగే కుటుంబ సభ్యులు నాటకాలు వేసేవారు. అలా సాహిత్యం, సంగీతం, భక్తి, సమాజం, వృత్తి ఇలాంటి అంశాలతో పరిమాణాత్మక, గుణాత్మక మార్పులతో ఒక కొత్త కోణాన్ని దేవులపల్లి వారు ఈ లోకానికి పరిచయం చేశారు. అప్పటికాలంలో ఉన్న ఉద్యమాల ప్రభావం కూడా వీరి కుటుంబంపై పడింది. ఇలాంటి కుటుంబం ప్రపంచీకరణ భాగంగా ఈస్టిండియా కంపెనీ బట్టల మిల్లు వల్ల మగ్గం నేలకూలింది. చేనేత పని తక్కువై బట్టలు నేయించుకునే వారు లేక ఆ ఊరిలోని పద్మశాలీలు పొట్ట చేత పట్టుకొని ఊరిని వదిలి పెట్టి ఇతర ప్రాంతాలకు వలస పోయారు. చేనేత రంగమే నాశనమైంది. మిల్లు బట్ట రాకతో నేత బట్ట మోటూ అయింది. అలా పల్లె

వాతావరణం చుట్టూ నడుస్తున్న తెలంగాణ జీవితం, ఆచార వ్యవహారాలు, పండుగలు, బోనాలు, జాతరలోని సజీవ చరిత్రను అందించారు. ఇందులో విలక్షణమైన తీరు మనకు కనబడుతుంది. ఇందులో పాటలు, తత్వాలు, నమ్మకాలు, కథలు, సామెతలు, నుడికారాలు, తెలంగాణ యాస, నూతన పదాలను అన్నిటినీ నవలలో భాగం చేసి నవల ప్రక్రియలో ఒక కొత్త మార్గాన్ని తెలుగుసాహిత్యంలో చర్చకు తవు తీశారు. నవల అంటే ఎన్నో పాత్రల సమాహారం అయితే ఇందులో చాలా ప్రక్రియల కరచలనం కనిపిస్తుంది. ఇలా నవలలో చాల తెలుగు ఆధునిక ప్రకియలను చేర్చి నూతన మార్గాన్ని చూపించారు. అలా తన అంతరంగంతో పాటు, ఆ ఊరిలో అన్ని సబ్బండవర్గాల వారు శ్రమజీవులు, వారి ప్రాణాల్ని అడ్డం పెట్టి నిజాంకి వ్యతిరేకంగా పోరాటం చేసి ఎంతో మంది అమరులు అయ్యారు. దీని తరువాత ప్రభుత్వ యునియన్ మిలటరీ వచ్చి సంగపోల్ల మీద దాడులు చేసి హతమార్చారు. భూమి కోసం యుద్ధం చేసి అందరికి సమానంగా భూమిపై హక్కులు వుండాలని సంగం వాళ్ళు పోరాటం నడిపిన విధానం చక్కగా కన్నుల ముందే జరిగినట్టే స్వీయ అనుభూతిని కలిగించారు. ఇలా ఆ రోజుల్లో జరిగిన పోరాటాలను, మెతుకు లేని బతుకు జీవుల కథను, వాళ్ళ జీవితం చిన్నాభిన్నం అయిన స్థితిని, వాళ్ళు ఇతర ప్రాంతాలకు వలస పోయిన విధానం, ఉన్నత వర్గాల చేతుల్లో శిథిలమైన మానవుని అంతరాన్ని నేటి చరిత్రలో భాగం చేసారు. ముఖ్యంగా ఇందులో కృష్ణమూర్తిగారి బాల్యంతో మొదలై చివరికి యుక్తవయస్సు వివాహబంధం వరకు నవల ముగుస్తుంది.

మూడు ముక్కలాట నవల - రియల్ ఎస్టేట్ దళారుల మోసాలు :

సమాజంలో నిత్యం జరుగుతున్న నిజమైన సంఘటన ఆధారంగా (మూడుముక్కలాట) ఈ నవలను రచించారు. ఇందులో అన్ని యధార్థమైన స్థితిగతులే దర్శనమిస్తాయి. ఊహకల్పనకు చెందిన రచయిత అసలే కాదు. అసలు సిసలైన పల్లె రచయిత. ప్రతి సన్నివేశం చదువుతుంటే పాఠకులు నిజంగా నల్లగొండలో ప్రయాణించినంతా అనుభూతిని కల్పిస్తాడు. ఇందులో ప్రధానంగా ముగ్గురు వ్యక్తులు మోసపోయిన సజీవ చరిత్రను మన ముందు ఉంచారు. ఇందులో రియల్ ఎస్టేట్, ఇంటి జాగలను ప్రధాన వస్తువుగా తీసుకొని శ్రీశైలం, వెంకటాద్రి, జాన్ ఖాన్ పాత్రలతో మూడు ముక్కల్లో చెప్పారు. ఇదే మూడు ముక్కలాట. శ్రీశైలం చిరకాల కలను నెరవేర్చుకోవడానికి ప్రయత్నిస్తూ వుంటాడు. ఎప్పటికీ అయిన సొంత ఇల్లు కట్టుకొని ప్రకృతి ఒడిలో అందమైన ఇంట్లో జీవించాలని వుంటది. దానికి అనుగుణంగానే ఇంటి జాగ కోసం వెతుకుతూ ఉంటాడు. ఒక రోజు కత్తుల లతీఫ్ దగ్గర పానగల్లు తొవ్వకు స్థలం వుంది అని తెలుసుకొని దానిని కొంటాడు. కొన్ని రోజుల తర్వాత శ్రీశైలం అతని భార్య తులసితో కలిసి ఆనందంతో ఇంటి పునాది తీసే దిశగా వెళ్తారు. ఆ లోపే కోటిరెడ్డి వచ్చి తన జాగ ఇది అని గొడవ పెట్టుకుంటాడు. అంతటితో విసిగిపోయిన శ్రీశైలం, తులసి భార్యాభర్తలిద్దరూ లతీఫ్ గోడును వదిలించుకోవడానికి చివరికి కొంత డబ్బును తీసుకొని ప్లాట్ ను వదిలేస్తారు. మిగిలిన డబ్బు కోసం కొన్ని రోజులు తిరిగి వీడు మట్టి మోసగాడని అర్థమయ్యాక శ్రీశైలం వెనుదిరిగి వెళ్ళిపోతాడు. మరొకరోజు దూరపు చుట్టం పాము నరసయ్యను కలసి నల్లగొండ జిల్లా ఖానా దగ్గర ప్లాట్ ఉంది అని చెబితే ఆలోచించి చుట్టమే కదా అని నమ్మి కొనుకుంటారు. చివరికి ఇందులో కూడా మోసం జరుగుతుంది. గూని సర్దార్ దగ్గర నర్సయ్య కొంటాడు. కానీ పూర్తి డబ్బులు చెల్లించలేదు. ఇది అంతా శ్రీశైలంకు చెప్పకుండానే నరసయ్య అమ్మేస్తాడు. కొన్ని రోజులకు వచ్చి ప్లాట్ చూసేసరికి ఆ జాగాలో కట్టెలు అమ్ముకునే సాహెబ్ ఒక్కడు వచ్చి గుడిసె వేసుకొని జీవిస్తాడు. ఇది నాది అని ఇద్దరూ గొడవ పడతారు. చివరికి గూని సర్దార్ దగ్గరికి ఈ విషయం చేరుకొని ఇద్దరి మధ్య భూమిని కొలిచి ఇద్దరికీ తలా ఇంత ఇస్తాడు. జాన్ ఖాన్ ఇల్లు

కడతానని కాంట్రాక్ట్ తీసుకొని శ్రీశైలంను మోసం చేసి తన దగ్గర డబ్బులు అన్నీ తీసుకొని రాత్రికి రాత్రే వేరే ప్రాంతానికి వెళ్లి పోతాడు. ఇలా శ్రీశైలం మోసపోయి తన సొంత ఇంటి కలను నెరవేర్చుకోలేక లేకపోతాడు.

వెంకటాద్రి నిత్యం సమాజ శ్రేయస్సు కోరుకునే నాయకుడు ఉపాధ్యాయుడు కూడా. ఈయన ప్లాట్ల బిజినెస్ కూడా చేస్తాడు. ఉపాధ్యాయుల హక్కుల కోసం కూడా పోరాటం చేస్తాడు. నిత్యం సమాజ సేవలో ఉండే వ్యక్తి. అయితే ఇతరుల సలహాతో ప్లాట్లు అమ్మేది దందాలోకి దిగి పూర్తిగా నష్టపోతాడు. మధ్య మధ్యలో ఎమ్మెల్యే కావాలని ఆశతో ఇతరులకు కావాల్సిన అన్ని రకాల పనులు చేస్తాడు. వాళ్లతో ఉంటూ టికెట్ కోసం ప్రయత్నిస్తుంటాడు. చాలా ప్రయత్నాలు చేసి ఖర్చులు పెట్టుకొని ఆస్తులను పోగొట్టుకుంటాడు. చివరికి టికెట్ దొరకక అదే ఆశను చంపుకొని మధ్యవర్తుల ద్వారా నిండు జీవితాన్ని కోల్పోతాడు.

జాన్ ఖాన్ దొరికిన పని చేస్తుంటాడు. ఈయన రకరకాల వ్యాపారులు చేస్తాడు. ప్లాట్ల బిజినెస్ కూడా చేస్తూ బ్రోకర్ గా చాలా ఆదాయం పొందుతాడు. అలాగే దొంగ రిజిస్ట్రేషన్లు చేయిస్తూ చాలా మందిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తాడు. అలాగే చివరికి వార్త పత్రిక సంపాదకునిగా మరి లోకంలోని ఇతర అంశాలను పేపర్లో వేస్తూ అందరి దగ్గర ఆస్తులు డబ్బులు దండుకుంటున్నారు. మాయచారితో చేతులు కలిపి జనాల రక్తాన్ని నిత్యం తాగుతూ ఉంటాడు. ఇందులో ప్రధానం శ్రీశైలం, వెంకటాద్రి, జాన్ ఖాన్ ద్వారా ప్రధాన పాత్రలుగా తీసుకొని రియల్ ఎస్టేట్ వ్యవస్థలో జరిగిన లోపాలను పేర్కొన్నారు. ఇందులో చిన్న అంశంగా సినీరంగంలో ప్రవేశాల కోసం వచ్చి జనాలు ఎలా వారి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటారో అంతర్భాగంగా చెప్పారు. అలాగే సంగాపోల్ల బాధలను, ప్రభుత్వ వైఫల్యాలను కూడా ప్రస్తావించారు. చివరికి సమాజ విలువలు కాపాడాలని ప్రజా చైతన్య దిశగా మూడుముక్కలాట మన ముందుంచారు.

'బయటి గుడిసెలు' నవల - సంచార జీవన చిత్రణ :

భారతదేశం అనేక భిన్న జాతుల సమాహారం. అనేక కులాలు, ఉపకులాలు, తెగలు, జాతులు అందరు కూడా మన దేశంలో నివసిస్తున్నారు. ప్రపంచం సాంకేతికంగా దినదినాభివృద్ధి చెందుతున్న కొన్ని జాతులు, కులాలు నాగరిక జీవనానికి అలవాటు పడకుండా అనాగరిక జీవనాన్ని కొనసాగిస్తున్నారు. స్వాతంత్ర భారతదేశంలో కొన్ని జాతులు ప్రపంచానికి దూరంగా ఉంటూ, సమాజం నుండి దూరంగా జీవిస్తున్నారు. వారి జీవితాల్లో ఎటువంటి మార్పులు రావడం లేదు తరాలు మారుతున్న వారి తలరాతలు మారడం లేదు దీనంతటికి కారణం ఎవరు? వారి జీవితాల్లో వెలుగును ప్రసాదించే వారెవరు? వారు సమాజానికి దూరంగా జీవించడానికి గల కారణాలు ఏమిటి? ఇంకా కొన్ని జాతులు తిండి లేక గూడు లేక మానవునికి కనీస అవసరాలు తీర్చుకోలేని స్థితిలో ప్రజల జీవనం కొనసాగుతుందని కొన్ని జాతుల జీవన అస్తిత్వాన్ని చూస్తే ప్రపంచానికి అర్థం అవుతారు అని ఈ నవల ప్రతిపాదిస్తుంది. ప్రభుత్వాలు ఎన్ని మారిన రాజకీయ నాయకులు ఓట్ల కోసం వారిని కలవడం తప్ప వారి జీవితంలో మార్పులను కోరే నాయకులు ఉండ లేకపోతున్నారు. ఇటువంటి దుష్పరిణామాలు తమ సమకాలీన సమాజంలో కొంత మంది జాతి ప్రజల జీవనాన్ని చూసి రచయిత సమాజానికి దూరంగా ఉంటున్నా మొండి కులాలను వస్తువుగా తీసుకొని 'బయటి గుడిసెలు' నవల రాయడం జరిగింది.

దేవులపల్లి కృష్ణమూర్తి రాసిన ఈ నవలలో మొండి, బుడగజంగాలు, దొమ్మరి, ఎరుకల వంటి కులాల ప్రజల జీవనాన్ని ఈ నవల అద్దం పడుతుంది. ఈ కులాలు సొంత ఆస్తి లేకపోవడం పందుల్ని మేపుకొని జీవనాన్ని కొనసాగించడం, ఊరి బయట ఉండటం, మద్యపానానికి బానిసగా మారడం, నీ కులాల స్త్రీలు చెత్త, ప్లాస్టిక్ వంటి వస్తువులను ఏరుకోవడం, పిల్లల ద్వారా ఊరిలో అన్నం

అడుక్కోవడానికి ప్రాధాన్యత ఇవ్వడం, విద్య లేకపోవడం అగ్రవర్ణాల పటేల్ వారి కొడుకులు ఈ కులాలలో ఉన్నటువంటి స్త్రీలను అన్యాయంగా అత్యాచారం చేయడం, కొంతమంది స్త్రీలు డబ్బుకు ఆశపడి వారి మాయలో పడి పోవడం, అధికారుల దౌర్జన్యం, పంచాయతీలలో న్యాయం పొందలేకపోవడం. వంటి అంశాలతో ఈ కులాల ప్రజల జీవనానికి ప్రతీకగా మలిచాడు రచయిత.

ఈ బయటి గుడిసెలు నవల ప్రారంభంలో 'ఎల్లడు' పాత్ర గణనీయమైనదిగా చెప్పవచ్చు. ఇతని భార్య, పిల్లలను, పందులతో ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి సంచార జీవనాన్ని కొనసాగిస్తాడు. ఎక్కడ కూడా స్థిరంగా ఉండలేక పోతాడు. ఆయుర్వేద మూలికలు తయారు చేస్తున్నట్టు వాటిని మందులుగా ప్రజలకు అందిస్తాడు. దానితో కొంతవరకు ఆర్థిక భారం తగ్గుతుంది. నిజానికి ఎల్లడు ఇచ్చే మందులు అంతా కూడా అబద్ధమే కానీ గ్రామ ప్రజల భయాన్ని ఆసరాగా చేసుకొని మందుల్ని శ్రీశైలం అడవుల్లో నుంచి తీసుకువచ్చి తయారుచేసి ఇస్తున్నాను అని అందరిని నమ్మిస్తాడు. కొంతమంది స్త్రీలకు పిల్లలు లేకపోవడం వారిని ఇతర మందులతో సంతానోత్పత్తి కలుగుతుందని ప్రజలను నమ్మిస్తాడు. కొంతమందికి స్త్రీ పురుష కలయిక వల్ల సంతానం ఏర్పడు తుందని తెలియకపోవడంతో ఏదో మందులు ఇచ్చి భార్యాభర్తలు కలయిక జరిగితే ఈ మందులు పని చేస్తాయని నమ్మ. అలాగే దగ్గు జ్వరం తేలుకాటుకు పాముకాటుకు అన్ని రకాల పొడులు ఇచ్చి వాళ్ల భయాన్ని ఆసరాగా చేసుకుని ఏదో మందులు నిజంగా ఇస్తున్నాడని ప్రజలందరూ ఎల్లడు ని నమ్ముతారు. వచ్చిన డబ్బులతో మద్యం సేవించే వాడు. పటేల్ భార్య దయ్యం పట్టిందని ఎల్లడు ఎలాగైనా దెయ్యాన్ని తరిమేయాలని పటేలు వచ్చి అడిగినప్పుడు, తనకు భూత మంత్రాలు తెలియని తెలిసినప్పటికీ బెదిరించి తీసుకెళ్తాడు. అప్పుడు వారిని నమ్మించే విధంగా కోడిని చంపి రక్తం తాగడం, కుంకుమ చల్లడం, భయంకరంగా అరవడం చేస్తూ పటేల్ భార్య సమస్యను తెలుసుకొని పటేల్ అక్రమ సంబంధం ఉం డటంతో దాని వల్ల తన భార్య దయ్యం....దయ్యం అంటూ అరుస్తుంది. అని ఇంకోసారి ఇటువంటి వాటికి వెళ్ళ కూడదని ఏదో పనికిరాని మంత్రాలు చదువుతూ పటేల్ కొడతాడు. తనలో ఉన్న దుష్టశక్తి పోవాలంటే కొట్టాలని అలాగే ఎటువంటి అక్రమ సంబంధం ఉండరాదని హెచ్చరించి నిమ్మకాయని కోస్తాడు. అలా ప్రజలలో ఎల్లడు డాక్టర్ గా, భూతవైద్యుడు గా పేరు తెచ్చుకుంటాడు. పానగల్లు పటేల్ కోడలు దెయ్యం పట్టి నీల్లాడడం లేదంటే ధం..... అమ్....దు....ధం అని పిచ్చి మంత్రాలు చదివితే భయానికి బిడ్డను జన్మిస్తుంది. దానిని చూసి జనాలు నిజంగా భూతవైద్యుడుగా అనుకుంటారు. మళ్లీ అక్కడి నుండి వేరే ప్రాంతానికి వెళ్ళటం ఇలా ఆయుర్వేద మందులు ఇవ్వడం దాని ద్వారా డబ్బులు ఎల్లడు సంపాదిస్తాడు. ఈ విధంగా ఎల్లన్ని కన్ని చూసి తనకు కూడా బిడ్డ కావాలని నెపంతో అతని మాయలో పడడం జరుగుతుంది. ఇటువంటి మూఢనమ్మకాలు ఈ నవలలో చాలాచోట్ల దర్శనమిస్తాయి.

ఎల్లడు కొడుకు 'సాంబుడు' కూడా వైద్యాన్ని అనుసరించి పటేల్ భార్య సుగుణతో అక్రమ సంబంధం పెట్టుకొని పట్టణానికి పారిపోతాడు. సుగుణ గొప్పింటి కుటుంబం నుంచి వచ్చి తన జీవితంలో ఎలా జీవించాలో ఎన్నో కలలు కంటుంది. కానీ పటేల్ ఉన్న ఆస్తిని దుర్వినియోగం చేయడంతో ఆస్తులు పోవడం, తర్వాత పటేల్ కాలు విరగడం, సేవ చేయలేకపోవడం, సాంబుడు పరిచయమై అతనితో సంబంధం పెట్టుకుని పారిపోవడం. మళ్లీ కొన్నాళ్లకు ఇద్దరు రాజకీయంగా నిలబడడం జరుగుతుంది. పేద ప్రజలకు ఆసరగా నిలబడటం ఈ నవలలో ఒక సామాజిక చైతన్యానికి మార్పు కనిపిస్తుంది. సుగుణ ,సాంబుడు పాత్ర ద్వారా చివరికి తన కులం చెడిపోయిన తను అనుకున్న విధంగా జీవితాన్ని పొందుతుంది సుగుణ.

అలాగే కన్కికి కూడ ఎల్లడు దిక్కుతోచని స్థితిలో వంట మనిషిగా పటేల్ ఇంట్లో చేరటం వంటలలో తన ప్రతిభ కనపరిచడం తహసిల్దార్ ఆమెను మెచ్చుకొని ఉన్నత స్థానం ఇవ్వడం, కన్కి ఆర్థికంగా స్థిర పడి కొడుకుని చదివిస్తూ ఉంటుంది. ఈ కన్కి పాత్ర ద్వారా తాను అనుభవించిన జీవితాన్ని తన కొడుకుకు రాకూడదని కొడుకుని చదివిస్తూ, సమాజం పట్ల బాధ్యతను పెంచుతుంది.

ఈ నవలలో పోలీసుల దౌర్జన్యం కనిపిస్తుంది. అమాయక ప్రజలను వేటకు పంపించి జంతు మాంసాన్ని తీసుకురావాలని ఆజ్ఞాపించడం, కాదంటే కేసులు పెట్టి బెదిరించడం జరుగుతుంది. దొంగతనం కేసులో ముత్తి మొగుడు చేసిన దొంగతనం పోలీసులకు బయట పడుతుందని మంగితో గొడవపడి తమ గూడెం లో పరువు పోతుందని ముత్తి గ్యాస్ నూనె తీసుకొని ఒంటి మీద పోసుకుని కాల్చుకొని మరణిస్తుంది. ఈ విధంగా పోలీసులు అమాయకపు ప్రజల పై దౌర్జన్యం చేస్తూ వారిపై అనేక అక్రమ కేసులు పెట్టి హింసకు గురి చేసి ప్రజల సొమ్మును తినేవారు. పటేలు అధికారులు ఈ నవలలో అమాయకపు స్త్రీలను బలవంతం చేయడం, వారిని మాయమాటలతో నమ్మించడం, చివరికి గర్భవతులు అవటంతో పైసలతో పంచాయతీ పెట్టి కార్యక్రమాన్ని ముగించడం జరుగుతుంది. అత్యాచారానికి గురైన స్త్రీల తల్లిదండ్రులకు కొంత డబ్బు ఇచ్చి కేసు పెట్టనివ్వకుండా చేయడం జరుగుతుంది. చెత్త ఏరడానికి వెళ్లిన మైనర్బాలికను చూసి ఇంట్లో పటేల్ బంధువుల పిల్లలు ఆరుగురు అత్యాచారం చేయడం అలాగే దుకాణం ఓనర్ పురుషోత్తం మైసిని ముగ్గులోకి దింపి ఆమెతో అక్రమ సంబంధం కొనసాగించడం చివరికి ఆమె గర్భవతి అని తెలిసేసరికి గూడెం ప్రజలు నిరసన వ్యక్తం చేస్తారు. పురుషోత్తంతో చివరికి మైసినీ పెళ్లి చేయిస్తారు. ఇటువంటి సంఘటనలు స్త్రీలపై అత్యాచారాలు చేయడం ఈ నవలలో కనబడుతుంది. ఈ విధంగా దేవులపల్లి కృష్ణమూర్తి రాసిన 'బయటి గుడిసెలు' నవల కొంతవరకు తెలుగుసాహిత్యంలో కేశవరెడ్డి రాసిన చివరి గుడిసె నవలకు అనుసంధానంగా కనిపిస్తుంది. అక్కడ కేశవరెడ్డి ఎరుకల జీవనం గురించి చెప్తాడు. ఈ నవలలో రచయిత మొండి కులాల జీవన చిత్రణ చేశారు. ఇటువంటి జీవితాన్ని గడుపుతున్న అనేక కులాలు, జాతుల వారు, అణగారిన వర్గాల వారు అధికారులతోను, అగ్రవర్ణాల వారితోనూ హింసకు గురవుతూ వారి నిండు జీవితాన్ని కోల్పోతున్నారని రచయిత భావన.

ముగింపు :

దేవులపల్లి కృష్ణమూర్తి రాసిన నవల ఊరు వాడ బతుకు, మూడుముక్కలాట, బయటి గుడిసెలు ఈ నవలలో రచయిత తెలంగాణ పల్లెల్లో నివసించే పేద ప్రజల జీవితాలను ప్రతి ఫలింప చేస్తూ వస్తువుగా స్వీకరించారు. దేవులపల్లి నవలల్లో ప్రధానంగా వాస్తవిక సాధారణ జీవితాలను కళ్లకు కట్టినట్టుగా పాఠకులకు చూపించారు. అయితే ఈ రచయిత రాసిన ఊరు వాడ బతుకు నవల సత్యజిత్ రే రాసిన పథేర్ పంచాలి నవల పల్లెల్లో నివసించే పేద ప్రజల జీవితాన్ని అత్యంత వాస్తవంగా చిత్రించబడింది. ఊరు వాడ బతుకు నవల కూడా తెలంగాణ పల్లెల్లో ప్రజల జీవన చిత్రణ చేశారు రచయిత. మూడుముక్కలాట నవలలో ప్రధానంగా రియల్ ఎస్టేట్ చెబుతూ దొంగ రిజిస్ట్రేషన్ ఎలా జరుగు తాయో ఈ నవలను శ్రీశైలం లాంటి కొందరు మంచి వాళ్ళు అమాయకులు ఇంటి జగాలను కొంటూ ఎలా దళ రులచేతుల్లో మోసపోతారో విధానాన్ని రచయిత స్వానుభావంతో నిజానికి నేటి సమాజంలో రియల్ ఎస్టేట్ దళారులు వల్ల చాలామంది అమాయక ప్రజలు మోసపోతూనే ఉన్నారు. అని వాస్తవిక చిత్రణ చేయడంలో దేవులపల్లి కృష్ణమూర్తి రచనా శైలికి నిదర్శనమని చెప్పవచ్చు. దేవులపల్లి కృష్ణమూర్తి రాసిన బయటి గుడిసెలు నవలలో ఒక నిమ్న వర్గాలకు చెందిన కులాలు

మొండి అనే కులాన్ని రచయిత పరిచయం చేయడం బహుశా ఇదే మొదటిది అని చెప్పొచ్చు. అగ్రవర్ణాల ఆధిపత్యం, అధికారుల దౌర్జన్యం, అక్రమ కేసులు పెట్టి హింసించడం పాలక భావజాలపు ప్రభావం వల్ల కొన్ని జాతులు తెగలు నేటికీ బానిస వ్యవస్థలోని కొట్టుమిట్టాడుతు నలిగిపోతున్నాయి అని చెప్పవచ్చు. ఈ నవలలో సంచారజాతుల జీవనంపై అగ్రకులాల ఆధిక్యతను చెప్పడం జరిగింది. ఈ విధంగా రచయిత జీవితంలో తాను అనుభవించిన జీవితాన్ని, సమకాలీన సమాజంలో చూసిన సంఘటనలను వాస్తవిక జీవన్ని పాత్రచిత్రణ చేయడంలో ఈనాటి వ్యవస్థలో జరుగుతున్న మోసాలను బహిర్గతం చేశారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఊరు వాడ బ్రతుకు -దేవులపల్లి కృష్ణమూర్తి
2. మూడు ముక్కలాట - దేవులపల్లి కృష్ణమూర్తి
3. బయటి గుడిసెలు -దేవులపల్లి కృష్ణమూర్తి
4. నవల శిల్పం - వెంకట సుబ్బయ్య

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో విశ్వనాథ సత్యనారాయణ సాంఘిక నవలల పాత్ర

– అవధానం సుజాత, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ సిటీ కళాశాల, నయాపూల్, హైదరాబాదు.

మన భారతీయ వ్యవస్థ నైతిక విలువలతో నిర్మిత మైనది. ఆదర్శ సమాజ నిర్మాణానికి నైతిక విలులే పునాది మానవుడు స్వేచ్ఛగా సాధువర్తనంతో సమైక్య భావనలతో మెలగినపుడే ఆదర్శ సమాజ నిర్మాణం జరుగుతుంది. రాజ్యం అంటే రామారాజ్యం, ప్రభుత్వందే రాముడే రామ రాజ్యంలో ధర్మం నాలుగు పాదాల్లో నడిచింది. రాముడు ఆదర్శప్రాయుడు. పితృవాక్యపాలకుడు, నిరంతరం ప్రజల క్షేమాన్ని కోరేవాడు. రాముని పాలనలో ఆదర్శ సమాజం నిత్యనూతనమై, ఆరాజ్యం సిరి సంపదలతో మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లిందని చెప్పవచ్చు.

ఉద్దేశము :

ఆదర్శ సమాజ నిర్మాణంలో విశ్వనాథ సత్య నారాయణ ప్రధానమైన ఐదు సాంఘిక నవలల (1. వేయి పడగలు, 2. చెలియకట్ట, 3. జేబుదొంగలు, 4. దమ యంతి స్వయంవరం, 5. వీరవల్లడు) పాత్రను ఈ వ్యాసంలో వివరించడం జరిగింది. సమాజ నిర్మాణానికి మానవీయ విలువల ఆవశ్యకతను, విశ్వనాథ ఆ విలువ లను ఈ నవలల్లో వ్యక్తం చేసిన తీరును వివరించడం జరిగింది.

ఉపోద్ఘాతము :

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ వ్యక్తిత్వం :

సాహితీ తెలుగు సాహితీ వ్యక్తిత్వం స్రష్ట, జ్ఞానపీఠ బహుమతి గ్రహీత, కవిసమ్రాట్, కళాప్రపూర్ణ, బహుముఖ ప్రజ్ఞాశాలి, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. విశ్వనాథ, నవల, నాటకం, కావ్యం, కథానిక, శతకం, విమర్శ మొదలైన అనేక ప్రక్రియలను చేపట్టారు. నవలల్లో మేయి పడగలు, కావ్యాలలో రామాయణ కల్పవృక్షం ప్రసిద్ధ మైనవి. వారి శైలి విలక్షణమైనది. విశ్వనాథ రచనలు తెలుగు సాహితీ సరస్వతికి మణిహారం. వీరి రచనలన్నీ మానవకళ్యాణం కోసమే. భారతీయ సంస్కృతి వైభవాన్ని, తెలుగు దనాన్ని తమ రచలన ద్వారా చాటి చెప్పారు.

విశ్వనాథ తమ బాల్యం నుండి తనచుట్టు ఉన్న సమాజాన్ని పరిశీలించారు. తద్వారా ఎన్నో అంశాలను తెలుసుకొన్నారు. సమాజమే వారికి తొలి పాఠశాల అయినది. గ్రామంలోని అనేక ఆచార వ్యవహారాలను, సామాజిక పరిస్థితులను అవగాహన చేసికొన్నారు. ఆ అంశాలనే వారు తమ సాంఘిక నవలల్లో నిక్షిప్తంచేసారు.

ప్రపంచ జ్ఞానం అంటే మానవత్వం దేశాన్ని పాలించే నియమావళిలో ప్రధానంగా పాటించవలసిన విషయం ఏమిటంటే అందరూ బ్రతకాలి. అందరికి సుఖదు:ఖా లున్నాయి. కష్టనిష్టురాలున్నాయియ ఇది పీఠికగా దేశ పాలనా నియమావళి ఉండాలి. అన్న విశ్వనాథది ముందుచూపే కాని వెనుక చూపు కాదు అని విశ్వనాథ దర్శనంలో ఆచార్య యస్వీ రామారావుగారు పేర్కొన్నారు. సమాజ ప్రగతిని ఆకాంక్షిస్తూ కలం చేపట్టిన Conscious writer విశ్వనాథ సత్యనారాయణ.

ధర్మాధర్మాలమధ్య సంఘర్షణ చెలరేగినపుడు మనిషి వివేకంతో విచక్షణా జ్ఞానంతో పురోగమించాలన్నదే ఆయన సిద్ధాంతం. సామాజిక, సాంస్కృతిక కుటుంబ విలువలను పాటించినపుడే ఆదర్శ సమాజం నిర్మాణం అవుతుందిని విశ్వనాథ అభిప్రాయం.

వేయిపడగలు 1934లో విశ్వనాథ రచించిన బృహన్నల నవల కావ్యేతిహాసంగా భారతీయ సంస్కృతి వైభవానికి దర్పణంగా నిలిచింది. స్వర్ణోత్సం జరుపుకొన్న ఏకైకనవల. ఈ నవలను పి.వి. నరసింహారావు గారు

సహస్రఫణ్ పేరుతో హిందిలోకి అనువదించారు. ఈ నవల 2018 నాటికి 31 పునర్ముద్రణలు పొందింది.

ఈ నవలలో గ్రామాణ సంస్కృతిపై పాశ్చాత్యనాగరికతా ప్రభావాన్ని వివరించారు. మూడుతరాలు జమీందారి కథను ఆధారంగా తీసికొని భారతీయ సంప్రదాయ వైభవాన్ని వివరించారు.

రాజుకు ప్రజలకు మధ్యసంబంధాన్ని వివరించారు ఈకథలో గ్రామ నిర్మాణము ఈవిధంగా ఉంది. వీరన్న వంశంవారు స్వామికి ప్రతినిధులు బ్రాహ్మణవంశమునకు ప్రచారకులు, కాపు వంశపు అడపడచులు స్వామికి వ్యాఖ్యాతలు.

పైన భగవంతుడు, క్రిందరాజును, బ్రాహ్మణుడును ఈరెండు మహాసంస్థలమను గణాచారి త్రెంచరానిలంకె ఇది నాల్గుస్తంభాల మంటపం. స్వామి, జనీందారు, బ్రాహ్మణుడు, గణాచారి వీరు నాలుగు స్తంభములు, సుబ్బన్నపేట, భారతదేశానికి ఆదర్శ సమాజానికి ప్రతీక ధర్మార్థకామ మోక్షములనే అరటిచెట్లు కట్టిన యీ నాలుగు స్తంభము నిత్యనూతనముగా వర్ధిల్లుచుండెను. కృష్ణమనాయుడు ప్రభువుగా ఉన్నపుడు ప్రజలను కన్నబిడ్డలవలె చూచెను. వానలు పడక పంటలు పండకపోతే రైతులకు గ్రాసమిచ్చి, శిస్తు రద్దుచేసేవాడు. కోటలో ఏనుగులు, నెమళ్ళు, లట్టపిట్టెలు రకరకాల పక్షులు ఉండేవి. పెద్దపెద్ద వృక్షాలుండేవి.

ఆయుర్వేద ఔషధములను పండించేవారు. ఆస్థాన వైద్యుడు బీదలకు సైతం వైద్యమందించేవాడు. రాజు

అంత ఊరుడు జమీందారు గారు బీళ్లలో గొడ్లలన్ని యదేచ్ఛగా చెరిగెవి బీదవారు పుల్లపుడక ఏరుకొని పోయేవారు. చింతంలోవూలో విరగకాసిన చింతకాయను ప్రజలు స్వేచ్ఛగా వాడుకొనేవారు. జమీందారి మిరప, వంగ, అరటితోటలు గ్రామములో ఎవరికి అవసర మొచ్చినా వాడుకొనేవారు. తాటిచెట్ల ఆకులను వాడేవారు.

సుబ్బన్నపేట జమీందారు ప్రాచీన కళలను పోషించే వారు. తోలుబమ్మలాట, వీధినాటకాలు, కూచిపూడి భాగవతాలు, పగటివేషగాళ్లు, దొమ్మరవాళ్ళు, గారడీ వాళ్ళు వీళ్ళను పరగణాలనిచ్చి పోషించేవారు. గ్రామము పాడిపంటలలో స్వయం సమృద్ధిగా ఉండేది. చెట్టు చేమలు రక్షింపబడి, వానలు సమృద్ధిగా కురుసేవి.

కృష్ణమనాయుని మరణం తరువాత పాశ్చాత్య విద్యను అభ్యసించిన రంగారావు రాజయ్యెను.

కోటలో ఆధునిక పోకడలు ప్రవేశపెట్టెను. పట్టాభిషేక సమయంలో మోటరు ఎక్కిరాగా, లక్ష్మణస్వామి అనే ఏనుగు, తనను రాజు ఎక్కలేదన్న ఆవేదనలో బాటపక్కన పడి ప్రాణములు విడిచెను. చెట్లు నరకి విద్యుత్తు స్తంభములు నాటారు. పర్యావరణం దెబ్బతిన్న వైనాన్ని విశ్వనాథ నవలలో ఆదివటము వృషన్నది అన్న కథ ద్వారా చూపారు. ఒకప్పుడు సుబ్బన్నపేట పచ్చని చెట్లతో అలరారేది వృక్షానికి మేఘం గ్రామంలో వచ్చి చూసి చెట్లు లేక ఇండ్లపై కురిసి పోయెనట.

పసరికి ప్రతీక పాత్ర బూడిదరంగు జుట్టు సన్నని దేహం పాములవలే ఉండేవాడు. చెట్లలో తిరిగేవాడు. గార్డినరు దొర ఇతనని పట్టుకొని మ్యూజియంలో పెట్టాలంటే ధర్మారావు అతనికి నచ్చజెప్పి అతడు మా పైరుపచ్చ మా ప్రాణం విడిచిపెట్టమని దొరకు నచ్చజెప్పి చిన్నరాజు హరప్పచే కొంత ధనమిచ్చి సన్మానం చేసి పంపుతాడు.

ఆంగ్లేయుల పాలనలో గ్రామీణ వ్యవస్థ దెబ్బతిన్నరని వృత్తివిద్యలు దెబ్బతిన్నాయని విశ్వనాథ భావన గ్రామములు స్వయంసమృద్ధిగా ఉన్నపుడే దేశం బాగు పడుతుందని, వస్తువాడకం పోయి ధన వారడం వల్ల ప్రతి ఒక్కరిలో ధనాశ పెరిగిందని అన్నారు.

ధర్మారావు అరుంధతి పాత్రల ద్వారా దాంపత్య ధర్మం నిలిచి ఉండాలని తెలిపారు. అపుడే ఆదర్శ సమాజమ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈనవలలో నాయరు, గోపన్న చిన్న పాత్రలు, ఈ పాత్రల ద్వారా పరోపకార గుణాన్ని తెలిపారు. గిరిక పాత్ర ద్వారా కృష్ణభక్తిని, దేవదాసి పవిత్రతను చాటారు. హరప్ప పాత్ర

ద్వారా యోగవిద్య ఔన్నత్యాన్ని, రాణిరుక్మిణమ్మ, సరోజినమ్మ, రంగాజమ్మ, అరుంధతి, రాజ్యలక్ష్మమ్మ, సావిత్రమ్మ పాత్రల ద్వారా కుటుంబంలో స్త్రీ ఆచరించ వలసిన విధులను తెలిపి, ఆదర్శ మహిళలు ఎలా ఉండాలో చూపారు. కుటుంబంలో స్త్రీ వివేచనగలదై, సహన సాశీల్యాలతో ఉండే ఆ కుటుంబంలోని వారందరు సుఖ శాంతులతో వర్ధిల్లుతారని విశ్వనాథ భావన.

జేబుదొంగలు: విద్యద్వారా ఒకవ్యక్తి ఉన్నతస్థాయికి ఎదిగి తన తప్పు తెలిసికొని, కుటుంబాన్ని ఎలారక్షిస్తాడో అవధాని పాత్ర ద్వారా చూపారు. కుటుంబంలో తండ్రి చనిపోయి ఆత్మీయ వ్యక్తి వల్ల పిల్లలు రక్షింపబడి, ఉన్నత వ్యక్తులుగా ఎలా తీర్చిదిద్దబడ్డారో వారు సమాజంలో ఉన్నతస్థితిని (అవదాని కలెక్టర్ అవడం) ఎలా ఎదగాలో చూపారు.

కుటుంబవిలువలు సక్రమంగా పాటించినపుడు ఆదర్శసమాజ నిర్మాణం జరుగుతుందని విశ్వనాథ భావన.

చెలియలికట్ట :

స్వేచ్ఛాప్రణయ సిద్ధాంతం రత్నావళి, రంగన పాత్రల ద్వారా ఖండించారు. వివాహబంధం అనే చెలియరికట్ట లేకపోతే స్త్రీ, పురుషుల జీవితం నాశనమనుతుందని, పిల్లల పరిస్థితి అనిశ్చితమై సమాజ నిర్మాణంలో విలువలు లోపిస్తాయిని అన్నారు. దమయింతిస్వయంవరంలో లంచగొండితన్నాని విమర్శించారు. ఒక టీచరుకు పైన్నను రావడానికి కొన్ని నెలలు ఆఫీసు చుట్టూ తిరిగుతాడు, ప్రతిచోట లంచం అడుగుతారు. సమాజ ప్రగతి లంచ గొండితనం వల్ల దెబ్బతింటుందని అన్నారు. దమయంతి ఉద్యోగానికి నలుడు ఉద్యోగాన్వేషికి స్వయంవరం ఇంటర్వూకు ప్రతీకలుగా చూపారు.

కరెంటు బిల్లుల ప్రహసనాన్ని చూపారు. బిల్లు తేది ఆదివారం ఖరారు అయితే సోమార్ బిల్లు కట్టడానికి వెళితే బిల్లు కట్టలేదని కట్ చేస్తారు. వేసేవాడు ఒకడు తీసేవాడు ఒకడు. రోడ్లు మరమ్మత్తులు చేసిన తెల్లారే పంపునీటి గొట్టాలకని మళ్ళి తవ్వుతారు. వ్యవస్థలో ఒకరి ఒకరికి అవగాహన లేదని దానివల్ల ప్రజాధనం వృధా అవుతుందని విశ్వనాథ వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపారు.

వీరవల్లుడు :

వల్లుడు అనే పాలేరు కృతజ్ఞత అనే మానవాలు విలువకు ప్రతిరూపం తన దొరచనిపోతే చనిపోయి భూమిని లాక్కుంటే ఆ దొరకుటుంబం నిరాశ్రయు రాలవుతారు. వల్లడు ఊరివారందరిని పిలిపించి తన దొర కుటుంబానికి భూమిని ఇప్పిస్తాడు ఆతరంలో పుట్టిన బిడ్డను ఆ ఇల్లాలు కృతజ్ఞత సూచనగా వల్లడని పేరు పెడుతుంది.

ఈ విధంగా విశ్వనాథ తమ సాంఘిక నవలల్లో సమాజంలో జరుగుతున్న అనేక మార్పులను అవినీతిని చిత్రించారు.

కుటుంబంలో వ్యక్తుల మధ్య ప్రేమానురాగాలు ఉండాలని అభిలషించారు. భారతీయ వ్యవస్థకు పునాది కుటుంబ వ్యవస్థ. ఈ వ్యవస్థ బలంగా ఉండాలందే దాంపత్య ధర్మము పటిష్టంగా ఉండాలని

కోరారు. పరోపకారం, సహనము దానగుణం, కృతజ్ఞత మొదలైన సంప్రదాయ విలువలను యువత పాటించి నపుడే ఆదర్శ సమాజ నిర్మాణము సాధ్య మవుతుందని విశ్వనాథ నిరూపించారు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. వేయిపగడలు - సమకాలీనత
2. విమర్శిని - 1,2
3. ఆత్మకథ
4. విశ్వనాథ దర్శనం

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో తెలుగు పద్య సాహిత్యం పాత్ర

– డా॥. ఒభిన్ని శ్రీహరి, తెలుగు అధ్యాపకులు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు.

ఆదర్శ సమాజ నిర్మాణంలో సాహిత్యం పాత్ర అన్నది చాలా ఎక్కువ అని చెప్పవచ్చు. సాహిత్యం అనేది ఏ కాలంలో అయినా సమకాలీన సమస్యలకు అద్దం పడుతుంది. మనిషి ప్రవర్తనను ఆమూలాగ్రం పరిశీలించి, ఉత్తమ జీవనవిధానాన్ని సమాజానికి చూపిస్తుంది."హితేన సహితం సాహిత్యం" అని మన పెద్దలు అన్నారు. అంటే సమాజం యొక్క హితాన్ని కోరుకొనేది సాహిత్యం అని అర్థం. అటువంటి సమాజ హితాన్ని తెలుగు పద్య సాహిత్యం ద్వారా నూటికి నూరుపాళ్లు పొందవచ్చు. తెలుగు పద్యాలు అవి రామాయణ మహాభారత భాగవతాలలో పద్యాలైనా, శతకాలలో పద్యాలైన అవి సమాజం యొక్క సర్వతోముఖాభివృద్ధికి వెలుగు దివ్వెల వంటివని చెప్పడంలో అతిశయోక్తి ఎంత మాత్రం లేదు.

మానవీయ సంబంధాలు ఘోరంగా క్షీణిస్తున్న నేటి కాలంలో మనిషి ఏ విధంగా ఆదర్శవంతంగా జీవించాలో మన సాహిత్యం చెప్పింది. ఇక్కడ ఎలా మాట్లాడాలి, ఎలా ప్రవర్తించాలి అన్న అనేక విషయాలు మన పద్యసాహిత్యం చెపుతుంది. ఉదాహరణకు ఆంధ్ర మహాభారతంలో విదుర నీతిలో ఒక పద్యం ద్వారా మన పద్య సాహిత్యంలో ఎంత గొప్ప వ్యక్తిత్వ వికాస విషయాలు ఉన్నాయో చూద్దాము.

ఒరు లేయవి యొనరించిన
నరవర యప్రియము దనమనంబునకగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్.

మన తెలుగు సాహిత్యం ఎంత గొప్పదో ఈ పద్యం ద్వారా తెలుసుకోవచ్చు. వ్యక్తిత్వ వికాసానికి ఈ పద్యం ఆణిముత్యం వంటిది. ఇతరులు ఏదైతే చేస్తే మనకు బాధ కలుగుతుందో అది ఇతరులకు చేయకుండా ఉండడమే పరమోత్తమమైన ధర్మం. ఒక చిన్న వాక్యంలో ఎంత గొప్ప సందేశం ఉందో అర్థమవుతున్నది. అంటే ఎవరకు వారుగా వారికి జరిగిన నష్టాన్ని అనుభవించి ఆ బాధ అనేది ఇతరులు నా ద్వారా పొందకూడదనుకోవడం చాలా గొప్ప విషయం. అలా అందరూ ఎవరికి వారుగా అనుకొని అలా ఉన్నప్పుడు ప్రతీ వ్యక్తి ఒక మహా పురుషుడిగా మారతాడని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు.

ఇటువంటి పద్యాలు మచ్చుకు మాత్రమే ఇలాంటివి మన తెలుగు పద్య సాహిత్యంలో కోకొల్లలు. అటవంటి గొప్పదైన మన తెలుగు పద్యాలను నేటి యువతీ యువకులు పఠించి, వాటిని జీవితంలో ఆచరించి ఉత్తమ వ్యక్తిత్వంతో పది మందికి ఆదర్శవంతంగా ఉన్నప్పుడూ ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని చెప్పడంలో సందేహం లేదు.

నన్నయ గారి అంధ్రమహాభారతం ఆదిపర్వం తృతీయాశ్వాసంలో జీవితంలో ఉన్నతులుగా ఎలా
ఎదగాలో చెపుతూ.....

ఎరుక గల వారి చరితలు
గరచుచు, సజ్జనుల గోష్టి గదలక ధర్మం
బెరుగుచు, నెరిగిన దానిని
మరువక కనుష్టించునది సమంజస బుద్ధిన్.

వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి ఇది మహోన్నతమైన పద్యం. గొప్పవారి యొక్క చరిత్రలు చదవడం, సజ్జన గోష్టి జరుగుతున్నప్పుడు కదలకుండా వారు చెబుతున్న మంచి విషయాలను శ్రద్ధగా వినడం చేయాలి. ఇలా గొప్పవారి యొక్క జీవిత చరిత్రలలోని విషయాలు సజ్జనులు గోష్టిలో గొప్ప మాటలు తుచా తప్పకుండా జీవితంలో ఆచరించాలి.

ఇది వ్యక్తిత్వ వికాసంలో ప్రాథమిక విషయం. దీనిని నన్నయ గారు 11 వ శతాబ్దంలో చెప్పడం గొప్ప విషయం. మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద వంటి మహనీయుల చరితలు నేటి యువతకు సదా ఆదర్శప్రాయమైనవి వీటిని చదివి వాటి వారి జీవితాలను ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలి. అయితే దురదృష్టవశాత్తూ నేటి యువత కొంతమంది పాశ్చాత్య వ్యామోహ ప్రభావంతో మహనీయుల జీవిత చరిత్రలు చదవడం పక్కన పెట్టి వారు మన సమాజనికి ఏమి చేశారన్న విషయాల పై ప్రాథమిక మైన అవగాహన లేకపోవడం అనేది నేడు బాధ కలిగిస్తుంది. అలాగే నన్నయ గారు సభలో ఎలా మాట్లాడలో చెపుతూ..

మనమునకు ప్రియంబును హిత
మును బథ్యము దద్యమును నమోఘము మధురం
బును బరిమితను నగు పలు
కొనరగ బలుకునది ధర్మయుతముగ సభలన్.

సభలో మనసుకు ప్రీతి కలిగించేది, మేలైనది, ఉచితమైనది, సత్యమైనది, తీయనిది, విస్తృతం కానిది, అయిన మాటను ధర్మంతో కూడుకొని ఉండేటట్లుగా మాట్లాడాలని ఈ పద్యం యొక్క భావం.

ఈ పద్యం ఎంత గొప్పదంటే దీనిని మనం అందరం ఫోటో ఫేమ్ కట్టించుకొని ఇంట్లో పెట్టుకోవలెమో అనడం ఎంత మాత్రము అతిశయోక్తి కాదు. నేడు ప్రపంచంలో గొప్ప వక్తలుగా మనకు కనిపిస్తున్నవారందరూ ఏ సభల్లోనైనా లేదా పదిమంది ముందు మాట్లాడేటప్పుడు పై విషయాలు తూచా తప్పకుండా పాటించడం వలనే వారు గొప్ప వక్తలుగా చలామణి అవుతున్నారన్న విషయాన్ని అందరూ గ్రహించాలి.

ఎప్పుడో 1000 సంవత్సరాల క్రితం నన్నయ గారు చెప్పిన ఈ విషయాలనే నేడు సాఫ్ట్ స్కిల్స్ అని కమ్యూనికేషన్ స్కిల్స్ అని కొన్ని వేల రూపాయలు నేటి యువత ఖర్చు పెట్టి కొన్ని సంస్థల్లో చేరి ఎలా మాట్లాడాలో నేర్చుకొంటున్నారు. కానీ మన నన్నయ ఈ విషయాలు వెయ్యి సంవత్సరాల క్రితమే మనకు చెప్పారన్న విషయం మనం గ్రహించం. అది మన తెలుగు ఆదికవి నన్నయ గొప్పతనం.

అలాగే మన కవిబ్రహ్మ తిక్కన గారు మహాభారతం శాంతి పర్వం తృతీయా శ్వాసంలో ధర్మం గురించి చెపుతూ..

ధర్మ మధర్మము భంగి న
ధర్మము ధర్మంబు మాడ్కి దానయా! తోచున్
నిర్మలమతి నరయవలయు
ధార్మికతం గోరువాడు దన కేర్పడగన్.

కొన్ని సందర్భాలలో ధర్మం అధర్మం వలె, అధర్మం ధర్మం వలె కనిపిస్తుంది. 'ధర్మం ఇది అని తెలుసు కోదలచినవాడు తనకు తేటతెల్లమయ్యేవరకు మంచి మనసుతో ఆలోచించాలి అని పై పద్య భావం.

వ్యక్తిత్వ వికాసంలో ఇది చాలా ముఖ్యమైన పద్యం, మన హితులు, సన్నిహితులు వారి పనులు వారి మాటలు కొన్ని సమయాలలో మనకు ఇబ్బందికరంగా కనిపిస్తాయి ఆ సమయంలో వారు మన మంచికే అలా చేస్తారు అయితే మనం తొందరపడి వారిని నిందించి నిజా నిజాలు తెలియక వారికి దూరం అవుతాం. అంటే వారు మనకు మంచి చేసిన అ సమయంలో ధర్మం అధర్మంగా కనిపిస్తుంది. కాబట్టి ఓర్పు ఉండాలి ప్రశాంతమైన మనసుతో ధర్మాధర్మా విచక్షణ అన్నది చేయాలని తిక్కన గారు వివరించారు.

ఇలాగే ఎఱ్ఱన, శ్రీనాథుడు, పోతన శ్రీనాథుడు మొదలైన కవులందరూ వారివారి రచనల్లో చాలా సందర్భాలలో వ్యక్తిత్వ వికాసాన్ని గూర్చి చర్చించడం కనిపిస్తుంది. ఇక శతక సాహిత్యం గురించి అయితే చెప్పనక్కరేడు. మన శతకాలన్నీ, వ్యక్తిత్వ వికాస భాండాగారాలే. వేమన, సుమతీ,భాస్కర మొదలైన శతకాలు వ్యక్తిత్వ వికాసానికి వెలుగు దివ్వెలుగా చెప్పవచ్చు. వేమన శతకంలో పద్యాలలో ఉదాహరణకు ఒక పద్యం పరిశీలిద్దాం.

మాటలాడగల్గు మర్మము లెరిగిన
పిన్న పెద్దతనము లెన్నవలదు
పిన్న చేతిదివ్వే పెద్దగా వెలుగదా?
విశ్వదాభిరామ వినురవేమ!

మనలోని తప్పులు చెప్పేవారు మనకన్నా వయసులో చిన్నవాడా పెద్దవాడా అన్నది ముఖ్యం కాదు. వారు చెప్పేది నిజమైనప్పుడు ఎవరు చెప్పినా స్వీకరించాలి. దీపం చిన్నవాని చేతిలో ఉన్నా పెద్దవాని చేతిలో ఉన్నా వెలుగుతుంది కదా అనేది అని ఈ పద్యం భావం. సహజంగా మనం ఒక్కక్కసారి తప్పులు అనేని చేస్తుంటాం వాటిని ఎవరు చెప్పినా స్వీకరించాలి. అలా చెప్పిన వారు మనకన్నా పెద్దవారా, చిన్నవారా అన్నది చూడకూడదు. అయితే నేడు యువతకు వారిలో తప్పులు స్వయంగా తల్లిదండ్రులు చెపుతున్న పిల్లలు లెక్కచేయకపోవడ0, అనేది నేటి సమాజంలో చూస్తున్నాం. అంటే తల్లిదండ్రుల మీద, గురువుల మీద, పెద్దల మీద ఏ రకమైన వినయ, విధేయతలు అనేవి నేటి యువతలో కొద్ది మందికి లేకపోవడం బాధాకరం. కాబట్టి ఎప్పటికప్పుడు మనలోని తప్పులను ఎవరు చెప్పినా సవరించుకొంటూ ఉన్నత మార్గం వైపు వడివడిగా అడుగులు వేస్తూ మన గమ్యం వైపు నడవాలి.

మరొక పద్యంలో భర్తృహరి సుభాషితాలలో సజ్జనుడికి ప్రకృతి సిద్ధంగా కొన్ని గుణగణాలు ఉంటాయని చెపుతూ.....

ఆపదలందు ధైర్యగుణ మంచిత సంపదలందు దాల్మియున్
భూపసభాంతరాళమున బుష్కలవాక్చతురత్వ, మాజి బా
హాపటుశక్తియున్, యశమున0 దనురక్తియు, విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్, బ్రకృతి జన్య గుణంబులు సజ్జనాళికిన్ .

భావం :

ఆపదలందు ధైర్యంగా ఎదుర్కోవడం, సంపదలు వచ్చినప్పుడు ఓర్పుగా వుండడం, రాజసభలో వాక్చాతుర్యాన్ని ప్రదర్శించడం, యుద్ధంలో భుజశక్తిని కల్గి వుండడం, కీర్తిపై కోరిక వుండడం, విద్యను నేర్చుకోవాలని ఆశపడడం ఇవి అలాగే భయంలేకుండా సభల్లో మాట్లాడగలగాలి. ఈ సజ్జన లక్షణాలను మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్ వంటి మహనీయులలో ప్రత్యక్ష్యంగా చూడవచ్చు. ఆపదలనేవి చెప్పివారు, కాబట్టి మనిషి ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవడానికి సిద్ధంగాఉండాలి. అలాగే నేడు కొంతమంది దగ్గర డబ్బు ఉంది కదా అని విర్రవీగేవారున్నారు. మనకున్న డబ్బుతో పదిమందికి సహకరించాలి, కానీ బాధపెట్టకూడదు

అలాగే భయంలేకుండా సభల్లో మాట్లాడగలగాలి. కొంతమంది ఎంత గొప్ప ఉపన్యాసికులైనా స్టేజ్ ఎక్కగానే భయపడిపోతారు అది పద్ధతికాదు. అలాగే నేడు యుద్ధాలు లేకపోయినా ఆపదలలో ఉన్నపుడు మనల్ని మనం కాపాడుకోవడానికి భుజబలాన్ని ఉపయోగించాలి. కీర్తిమీద కోరిక ఉండడంలో తప్పులేదు. అప్పుడే సాధించాలన్న కసి పెరుగుతుంది. అలాగే నిరంతరం చదువుతూ ఉండాలి. అప్పుడే మన జ్ఞానం అనేది వికశిస్తుంది. ఈ లక్షణాలు అనేవి నేడు అందరూ తప్పకుండా అలవర్చుకోవాల్సివవి.

ఆదే విధంగా చిన్నయ సూరి నీతి చంద్రికలో విద్యార్థికి చదువు ద్వారా ఏమి సమకూరుతాయో చెపుతూ విద్యార్థి ఎలా ఉండాలో ఒక చక్కని పద్యంలో చెప్పారు

విద్య యొసగును వినయంబు వినయమునను
బడయు బాత్రత పాత్రత వలన ధనము,
ధనము వలనను ధర్మ0బు దాని వలన
నైహికముష్మిక సుఖంబు లందు నరుడు.

విద్య వలన వినయం వినయం వలన యోగ్యత యోగ్యత వల్ల ధనం, ధనం వల్ల ధర్మం లభిస్తాయి. విద్య వల్ల ఇహలోకంలో లోనూ పరలోకం లోనూ మనం సౌఖ్యాలు పొందుతామని ఈ పద్య భావం.

ఈ పద్యం ఎంత గొప్పదంటే తెలుగు పద్య సాహిత్యానికే మకుటయమాన మైనదని గర్వంగా చెప్పవచ్చు. ఇక్కడ విద్య ద్వారా మొదట వినయం వస్తుందని చెప్పారు కానీ డబ్బు వస్తుందని కాదు. కానీ నేటి కాలంలో చదువు అన్నది కేవలం డబ్బు సంపాదించే దానికే అనుకొనే కొంతమంది యువత తయారవడం బాధాకరం. ఈ పద్యంలో చెప్పిన విధంగా వినయ విధేయతలతో చదివినవాడు జీవితంలో అత్యున్నత స్థాయికి వెళ్ళడం అన్నది సమాజంలో సహజంగా చూస్తున్న విషయమే. కాబట్టి మన వ్యక్తిత్వం ద్వారా పదిమందికి మనం ఆదర్శంగా ఉండాలని ఎవరికి వారు అనుకొన్నపుడు ఒక్క ఉన్నత సమాజాన్ని ఆకాంక్షించవచ్చును.

ఈ విధంగా అజరామరమైన మన తెలుగు పద్య సాహిత్యంలో వ్యక్తిత్వ వికాసానికి దిక్సూచి వంటి పద్యాలు కోకొల్లలు. నేడు సమాజంలో అందరం ఇటువంటి పద్యాలను చదివి వాటిలోని నీతిని ఆచరణలో పెట్టి నప్పుగు గొప్ప సమాజం ఏర్పడుతుంది. కాబట్టి ముఖ్యంగా నేటి యువత చిన్నతనం నుండి మహాభారతం లోని పద్యాలు, వేమన, సుమతీ మొదలైన శతకంలోని పద్యాలు 5 సంవత్సరాల పిల్లల దగ్గర నుంచి కంఠస్థ పట్టించి వాటిని వారు ఆచరించేలా చేయగలిగితే ఏంతమంది అబ్దుల్ కలామ్'లను చూస్తామో ఒక్కసారి మనమందరం ఆలోచించాలి.

నేడు సమాజంలో LKG నుంచే IIIT ఫౌండేషన్ అంటూ చిన్న పిల్లలను కోళ్ళ ఫారల్లాంటి స్కూళ్ళలో వేలకు వేలు పోసి చదివిస్తున్నారు. వారికి మార్కుల యావ తప్పిస్తే ఎవరితో ఎలా మాట్లాలలో, ఎలా ప్రవర్తించాలో తెలియడం లేదు. చిన్నప్పటి నాన్నమ్మ, తాతయ్య చెప్పే నీతి కథలు మాయమై కార్టూన్ నెట్'వర్క్ చానళ్ళు ప్రవేశించడం వలన పిల్లల్లో విపరీత ధోరణులకు కారణమవుతున్నాయి. ఈ పిల్లలతో మనం నేటి భావి భారతాన్ని ఎలా చూడాలో అన్న ప్రశ్న ప్రతీ ఒక్కరిలో కలుగుతుంది. కాబట్టి మన పద్య సాహిత్య గొప్పతనాన్ని, దానిలో ఉన్న వ్యక్తిత్వ వికాసా సూత్రాలను నేటి పిల్లలకు చాటి చెప్పడం, అన్నీ స్కూలల్లో పద్య పఠన పోటీలు వంటివి నిర్వహించి నేటి యువతను సరైన దారిలో నడిపించాల్సిన బాధ్యత ఇటు ప్రభుత్వ, ప్రవేటు స్కూళ్ళకు ప్రభుత్వానికి ఉన్నదన్న విషయాన్ని మరవ కూడదు.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. బద్దెన, సుమతీ శతకం. పావని సేవాసమితి, హైదరాబాద్. 2010.
2. భర్తృహరి, భర్తృహరి సుభాషితాలు. గంగాధర ప్రచురణ, విజయవాడ. 2005.
3. తిక్కన, కవిత్రయ మహా భారతం(ఉద్యోగ పర్వం), తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి. 2006.
4. మాల కొండారెడ్డి, ఉండేల. తెలుగు జాతి వివేకం. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్. 2012.

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో గాంధీ గారి పాత్ర

– డా॥ కె.ఎస్. శకుంతల, సహాయ ఆచార్యులు, దూరవిద్య కేంద్రం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

ఆదర్శ సమాజ నిర్మాణంలో వ్యక్తుల పాత్ర చాలా ప్రముఖమైనది. ఆదర్శ సమాజమంటే ఏమిటి? ఆదర్శవంతమైన వ్యక్తులతో కూడిన సమాజం ఆదర్శ సమాజం. ఆదర్శ జీవితం అంటే ఏమిటి? తనయొక్క ధర్మాలను నిర్వర్తిస్తూ సామాజిక స్పృహతోటి సమాజంలో జరుగుతున్న ఒడిదుడుకులతో తనవంతు పాత్ర పోషిస్తూ, ముందుకెళ్ళడం. ఇది నిజమైన ఆదర్శ జీవితం. బైబిల్‌లో "నిన్ను నీవలే పొరుగువారిని చూడ" మంటుంది. అలాగే మహాభారతంలో తిక్కన

"ఒకరులేయవి యొనరించిన
నరవర; యప్రియము దన మనంబునకగు,
దా నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్

ఇతరులు నీకి ఏమి చేస్తే నీ మనసు బాధపడుతుందో అలాంటి పనులు నువ్వు ఇతరులకు చేయకు. ఇదే అన్ని ధర్మాలకన్నా ఉన్నతమైన ధర్మము.

ఇతరులు నిన్ను అకారణంగా నిందిస్తే, నీ మనస్సు బాధపడుతుంది. కాబట్టి నువ్వు కూడా ఎవ్వరినీ నిందించకు. ఇలా నీ మనస్సు ఏ సందర్భాలలో బాధపడుతుందో అలాంటి సందర్భాలను ఇతరులకు రానీయకుండా చూసుకోవడం ధర్మం. ఇలాంటి మానవత్వంతోటి పరుల సేవలతోనే దైవత్వం చూసిన గొప్పవ్యక్తి మహాత్మాగాంధీ.

మహాత్మాగాంధీ తన ఆత్మకథకు ముందుమాటలు రాస్తూ, నేను రాజకీయంలోకి వచ్చింది మోక్షం కోసం అన్నారు. రాజకీయంలో మోక్షం పొందటం అనేది చాలా గొప్ప మాట. అలాంటి ఏకైక వ్యక్తి మహాత్మాగాంధీ. ఈయన దేశానికే కాదు, యావత్ ప్రపంచంలో వున్న ప్రజలందరికీ కూడా ఆదర్శప్రాయుడు. ఆయన విగ్రహాలు భారతదేశంలోనే కాకుండా, చాలా దేశాలలో వున్నాయి. మనం మహాత్మాగాంధీని విద్యార్థి దశనుండి పరిశీలించగలిగితే గాంధీగారు మెట్రిక్యులేషన్ పూర్తి చేసి, బారిష్టర్ చదువుకు విదేశాలకు వెళ్ళే సందర్భంలో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన స్కూల్‌లో వీడ్కోలు సమావేశంలో మాట్లాడమన్నప్పుడు సభాకంపం (స్టేజ్ ఫియర్) చేత మాట్లాడలేకపోయాడు. అలాంటి పరిస్థితి మన గాంధీగారిది. అలాంటి పరిస్థితులతో బారిష్టర్ చదువుకు విదేశాలకు వెళ్ళి, అక్కడ అనేక ఒడిదుడుకులకు ఎదుర్కొన్నారు. ఎన్నో కష్టాలు పడి తినడానికి తిండిలేక ఒంటిపూట భోజనం చేసేవారు. అలాంటి దయనీయమైన పరిస్థితి నుండి భారతదేశానికి వచ్చి, పనుల నిమిత్తం దక్షిణాఫ్రికా వెళ్ళడం, అక్కడ రైల్లో ప్రయాణిస్తుంటే, నల్లజాతి వ్యక్తి నువ్వు, రైల్లో రెండవ తరగతిలో ప్రయాణించడానికి అనుమతి లేదని రైలునుండి త్రోసివేయబడ్డాడు. ఇంకొక వ్యక్తి అయితే సూర్యుడు అస్తమించని బ్రిటీస్ అధికారులు చేసిన దుర్మార్గానికి నోరెత్తకుండా, నోరుమూసుకొని పడి వుండేవారు. కానీ గాంధీగారు అలా చేయలేదు. ఎదురు తిరిగారు. అక్కడ ఉన్నటువంటి భారతీయులందరినీ ఒక తాటిమీదకు తెచ్చి, వారికి నాయకుడిగా ఉద్యమించి న్యాయం జరిపించారు. ఇది ఎలా సాధ్యం? ఏ మాత్రమూ కండబలం లేని వ్యక్తి గాలి వస్తే క్రిందకి పడిపోయే స్థితిలో ఉన్న వ్యక్తికి ప్రపంచంలో సగం మందిని ఆక్రమించుకున్న బ్రిటీష్ వారిపైన వ్యతిరేకంగా ఉద్యమించే ధైర్యం, స్థైర్యం, సాహసం ఎక్కడినుండి వచ్చాయి. ఈ ప్రశ్నకు సమాధానం మనకి కావాలి.

ఒకప్పుడు వీరి తాతముత్తాతలు దివానుల వద్ద పనిచేశారేమోగానీ, గాంధీగారిది అలాంటి పరిస్థితి కానే కాదు. బారిస్టర్ చదవడానికి గాంధీ అన్నగారు అప్పుచేసి

గాంధీగారిని ఇంగ్లాండ్‌కు పంపారు. ఇలాంటి ఆర్థిక పరిస్థితి నుండి వచ్చిన గాంధీగారికి దక్షిణాఫ్రికాలో బ్రిటీష్‌వారిని ఎదుర్కొనే శక్తి ఎక్కడి నుండి వచ్చిందని మనం బాగా పరిశీలిస్తే వారి వెనుక ఆధ్యాత్మిక జ్ఞానం, యోగజ్ఞానం వున్నాయి. కేవలం ఒక మహాత్మాగాంధీగారే కాదు, స్వాతంత్ర్య సమర పోరాటంలో పాల్గొన్న ప్రతి యొక్క నాయకుని నేపథ్యం చూస్తే వాళ్ళందరి వెనుక భగవద్గీత మరియు యోగజ్ఞానం వుంది. ఈ జ్ఞానం వల్లే ఎదుటివ్యక్తి అమితమైన శక్తివంతుడా, సాధరణమైనవంటి వాడా అని చూడకుండా చేస్తున్న పని మంచిదా? కాదా? చూసుకొని, మంచిదైతే శత్రువెంత బలమైన వాడయినా సరే ముందుకు పోగలిగే శక్తి వాళ్ళకి ఆధ్యాత్మిక శక్తి ద్వారా లభించింది. ఆధ్యాత్మికత ఏం చెబుతుంది? ముఖ్యంగా ఉపనిషత్తుల్లో కఠోపనిషత్తుగానీ, భగవద్గీత సాంఖ్యాయోగ తదితర అధ్యాయాల్లోగానీ ఏం చెప్తాయంటే నువ్వు శరీరం కాదు. నువ్వు ఆత్మ స్వరూపుడివి. ఆత్మకు చావుపుట్టుకలు లేవు. పుట్టింది శరీరం, చనిపోయేది శరీరం అంటే శిథిలమైనది. కాబట్టి శరీరమన్నారు. ఇది శరీర లక్షణం, నువ్వు శరీరం కాదు. నువ్వ ఆత్మ స్వరూపుడివి. చావు పుట్టుక లేని సర్వాంతర్యామి. ఇలాంటి వాడయిన నువ్వు ఎవరికి భయపడాలి. దేనికి భయపడాలి. సాధారణంగా మనిషి మరణానికి భయపడతాడు. ప్రాణం పోతుందంటే భయపడతాడు. ప్రాణమంటే ఏమిటి? ఈ శరీరమే నీది కానప్పుడు ఆ మరణానికి సంబంధమేమిటి? సంబంధం లేదు. అది ముఖ్యంగా సమాజంలో నలుగురికి మంచి జరిగే క్రమంలో ఈ శరీరం కాలిపోతే అంతకంటే కష్టతనం ఏముంది. ఇలాంటి ఆదర్శ జ్ఞానంతోటి జీవించి గాంధీగారు స్వాతంత్ర్యం తెచ్చారు. గాంధీగారు యావత్ ప్రపంచానికే ఆదర్శవంతులు. అతడి జీవన విధానాన్ని గమనిస్తే ఈ జ్ఞానమే మహాత్మాగాంధీ యంతటి నాయకులకు ప్రేరణ. ఈ జ్ఞానమే సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదిరించడానికి కారణం ఈ జ్ఞానంతోటి మహాత్మాగాంధీ బ్రిటీష్ వాళ్ళని ఎదిరించి అన్ని సంవత్సరాలు పోరాడి మనకు స్వాతంత్ర్యాన్ని తీసుకురావడం జరిగింది. ఇక్కడ మహాత్మాగాంధీ యావత్ ప్రపంచానికే ఆదర్శప్రాయుడు. ఆయన జీవించినటువంటి జీవన విధానము చాలా ఆదర్శనీయమైనది. ఎందుకంటే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చివరికి ఆయన ప్రధానమంత్రి కావాలి అనుకుంటే ఆయనకి తప్ప ఇంకెవరికీ ఆ అవకాశం వచ్చేది కాదు. కానీ ఆ పదవిని తృణప్రాయంగా అంటే గడ్డిపోచ మందంగా పదవిని వదులుకున్నాడు. ఈనాడు పంచాయితీ వార్డు మెంబర్‌కోసం కొట్లాడి, కోట్లు ఖర్చు పెట్టే కాలంలో ఒక ప్రధానమంత్రి పదవి తన కాళ్ళదగ్గరికి వచ్చినా త్రోసివేయడమనేది అందరికీ అంత సులభంగా సాధ్యమయ్యేపనికాదు. కాబట్టి అలాంటి గొప్ప వ్యక్తిత్వ నిర్మాణం ఎలా జరిగింది? దాని నేపథ్యమేమిటో చూడాలి. ఎందుకంటే దాన్ని తెలుసుకున్నప్పుడే మనం కూడా అలాంటి ఆదర్శమార్గంలో నడిచేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇలాంటి జ్ఞానం గాంధీగారికి ఎక్కడినుండి వచ్చింది. అది కూడా భగవద్గీతే. భగవద్గీత ఏం చెబుతుంది?

"కర్మణ్యేవ వాధికారస్తే, మా ఫలేషు కదాచనా
మాకర్మ ఫలహేతుర్భూహు మాతే సంగస్త్య కర్మణే॥

కర్మ చేయుటకు నీకు అధికారం వుందే కానీ, ఆ ఫలితం పట్ల నీకు ఎలాంటి అధికారం లేదు. అలా అని కర్మ (పని) చేయుట మానరాదు. ప్రతి మనిషి పని చేయాలి. నీకున్న శక్తియుక్తులను ప్రయోగించి నూటికి నూరుశాతం ఫలితాన్ని ఆశించకుండా పనిచేయాలి.

ఇవి గాంధీగారు కేవలం దాన్ని వినడం కాదు, నిజ జీవితంలో ఆచరించి చూపించిన మహానుభావుడు. తత్వ వేత్త. ఆదర్శ వ్యక్తి కూడా. తను ఉద్యమం చేయడంలో ఎలాంటి ఫలితాన్ని ఆశించలేదు. పదవి కావాలని కోరుకోలేదు. అందువల్ల మహాత్మాగాంధీ నా దృష్టిలో ఒక ఋషి. ఒక ముని. ఒక తపస్వి కూడా. మనం పురాణాల్లో

ఋషుల గురించి చర్చిస్తాము కానీ, వాళ్ళందరికన్నా గొప్పవాడు. ఎందుకంటే ఋషులందరూ అడవిలో ముక్కుమూసుకొని తపస్సు చేసిన వారే కానీ, మహాత్మా గాంధీ గారు జనారణ్యంలో వుంటూ, అనేక రకమైన ఆకర్షణలు తన చుట్టూ వున్నా, కాదనుకుంటూ ఋషిలాగా ఇక్కడ జీవించిన మార్గం చాలా ఆదర్శ మైనటు వంటిది మరియు ఈ ఋషుల కన్నా గొప్ప వ్యక్తిత్వం కలిగినటువంటి మహాత్మాగాంధీ ఈ వ్యక్తిత్వం ప్రపంచ ప్రజలందరికీ ఆదర్శవంతమైన వ్యక్తిత్వము. దీన్ని మనం ఆదర్శంగా తీసుకోవాలి. అంటే అవసరమైతే సమాజం కోసం శత్రువు ఎంతటి బలమైన వాడైనా ఎదురొడ్డి నిలబడడం, అట్లాగే అందలం ఎక్కి అవకాశం వచ్చినా కూడా పదవులు తన దగ్గరికి వచ్చినా కూడా కాదు, పొమ్మనడం గొప్ప ఋషులకున్న తత్వం. దీన్ని మనమందరం ఆదర్శంగా తీసుకొని ఆ జ్ఞానాన్ని మన మందరం ఆచరణలో పెట్టగలిగితే కచ్చితంగా మనం కూడా సమాజంలో ఆదర్శ జీవితం గడపవచ్చు. ఆదర్శ సమాజం నిర్మాణం కూడా చేయవచ్చు. మహాత్మాగాంధీ గారిపైన అనేక పరిశోధనలు, చర్చలు జరగాలి. ఆ చర్చలయొక్క సారాంశం నేటి యువతరం బుర్రకు ఎక్కించాలి. వారు కూడా దాన్ని పాటించగలిగితే ఒక గొప్ప ఆదర్శ సమాజాన్ని నిర్మించవచ్చు.

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగవతం పాత్ర

– ఖ. ఈరన్నాయుడు, పరిశోధక విద్యార్థి(యూజీసీ ఎస్ఆర్ఎఫ్), తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

సంస్కృతంలో విస్తారమైన సాహిత్యం ఉంది. ఈ సాహిత్యాన్ని వైదిక సాహిత్యం, లౌకిక సాహిత్యం అని రెండు వాధాలుగా విభజిస్తారు. వేదాలు- వాటికి సంబంధించిన సాహిత్యం అంతా వైదిక సాహిత్యం. తక్కినది లౌకిక సాహిత్యం. మనం నాలుగని చెప్పుకుంటున్న వేదాలను వర్గీకరించి కూర్చినవారు వేద వ్యాసుడు. ఈ వ్యాసుడే మహాభారతం, అష్టాదశ పురాణాలను రచించాడని చెప్తారు. వ్యాసుడు ఒక వ్యక్తి కాదు ఒక పీఠం. . ఇంకా వ్యాసుణ్ణి గొప్ప భగవత్స్వరూపుడని భావిస్తారు.

పురాణం పంచలక్షణాలతో కూడుకుని ఉంది. సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరితం అన్నవి పురాణ లక్షణాలు. బహువిషయములతో కూడుకుని ఉన్న పురాణాలు ఒక విధంగా ప్రాచీన విజ్ఞాన సర్వస్వాల వంటివి. ఈ పురాణాలను సాత్వికాలు, రాజసికాలు, తామసికాలు అని కూడా విభాగం చేసారు.

భాగవత పురాణం శాస్త్ర విషయ బహుళమైనదిగా ప్రసిద్ధం. అనువాద క్లిష్టం. పోతన మహాకవి శ్రీధరీయ భాష్యాన్ని అనుసరిస్తూ సర్వజనామోదకంగా, సర్వజన సమ్మోహనంగా తెలుగులోకి అనువదించారు. పోతన గారు భాగవతాన్ని తెలుగువారి నాలుకపై నాట్యమాడించారు.

సమాజం వ్యక్తుల మధ్య సంబంధాల మీద, వ్యక్తుల నడవడిక మీద ఆధారపడి నడుస్తుంది. పురాణ వాఙ్మయం వ్యక్తి నడవడికని, సమాజంలో వర్గాల, వ్యక్తుల సంబంధాలను నిర్దేశించడానికి, ప్రతిష్ఠించడానికి ప్రయత్నిస్తుంది. విభిన్న సామాజిక వర్గాల మధ్య సంబంధాలు, సమాజంలోని వర్గాల వ్యక్తుల సంబంధాలను నిర్దేశించడానికి, ప్రతిష్ఠించడానికి ప్రయత్నిస్తుంది. విభిన్న సామాజిక వర్గాల మధ్య సంబంధాలు, సమాజంలోని వ్యక్తుల మధ్య అంటే రాజు- ప్రజలు, భార్యాభర్తలు, తల్లిదండ్రులు -పిల్లలు, గురుశిష్యులు, బంధుమిత్రుల సంబంధాలెలా ఉండాలో, వాటి ఆదర్శమేమిటో కథా రూపంలో నిర్వచించడం పురాణ లక్ష్యం.

భాగవతంను ఒక ప్రాచీన కథగా, నాటి ప్రజా జీవన నియమాల నిర్వచన పత్రంగా వ్యాఖ్యానించినంత మాత్రాన చేగూరే ప్రయోజనం తక్కువ. దాన్ని సమకాలీన జీవనంలో మానవ సంబంధాల దృష్ట్యా, విలువల దృష్ట్యా నేటి మనిషికి అన్వయించగలిగినప్పుడే సార్థకం. ఏ విలువలను సమాజం అనుసరించింది అన్న విషయం చెప్పి, ఆ వైపు ప్రజలను తిప్పి వారిని ఆదర్శవంతులుగా చేయాలి.

ఒకరోజు శుకుడు సరోవరం ప్రక్క నుండి వెళ్ళిపోతున్నాడు. అక్కడ సరోవరంలో అప్సరసలు దిగంబరులై స్నానం చేస్తున్నారు. అందులో ఒకరు శుకుడు వస్తున్నాడు అన్నారు. ఆ స్త్రీలు దిగంబరంగా వచ్చి శుకుడిని నమస్కరించించారు. అపుడు శుకుడు నిండు యవ్వనంలో ఉన్నాడు. శుకుడు వారిని చూసి చూడనట్లుగా పోయాడు. మళ్ళీ అప్సరసలు స్నానం చేస్తున్నారు. వ్యాసుడు వచ్చాడు. వ్యాసుడఱు రాగానే స్త్రీలు వస్త్రాలు ధరించి నమస్కారం చేశారు. వ్యాసుడు ఆశ్చర్యపోతూ నా కుమారుడు యవ్వనంలో ఉన్నాడు. నేను ముసలితనంలో ఉన్నాను. నేను వస్తే వస్త్రములు ధరించి వచ్చారు. నా కుమారుడు వస్తే దిగంబరంగా వచ్చారు. తేడా ఏమి అని అడిగాడు. అప్పుడు అప్సరసలు అన్నారు. నీ కుమారునకు స్త్రీ, పురుష భేదము లేదు. ఆయన అంతటా బ్రహ్మము ఒక్కటే చూస్తాడు. మీకు స్త్రీ, పురుష భేదము తెలుసు. అందుకే మేము వస్త్రాలు ధరించి నమస్కారం చేనామని

బదులిచ్చారు.

ఈ చిన్న సంఘటన చాలు. పోతన గారు రాసిన భాగవతం ఎంత ఆదర్శమో. శుకున్ని ఆదర్శంగా తీసుకుని అలాంటి నదీవాటికలలో ఉండాలని, అంతా తెలిసి కూడా అంతటా బ్రహ్మమే వ్యాపించి తన, మన, స్త్రీ, పురుష భేదం లేకుండా స్వార్థం, కుటిలతనం లేకుండా సమాజంలో ఆదర్శంగా ఉండాలి అని శుకుని పాత్ర ద్వారా తెలిపాడు.

జీవితంలో మొదట మనం దేనికి లొంగుతాము? కష్టములకు లొంగుతాము. అంపశయ్య మీద పడుకున్న భీష్ముడు ధర్మరాజును చూసి ఇలా అన్నాడు. కుంతి ఎన్ని కష్టాలు పడిందయ్యా! పాండురాజు చిన్నతనంలో చని పోయాడు. మీరు తండ్రిలేని బిడ్డలై పెరిగారు. ఎట్టకేలకు మీకు రాజ్యాధిపత్యం వచ్చింది. ఇన్ని వచ్చినా కష్టం మిమ్మల్ని వదలలేదు. మనం మన జీవితంలో చిన్న చిన్న కష్టములకు కదలిపోతాము. ఎంతో కష్టం వచ్చిందని బాధపడిపోతాము. ఎందుకు అంటే మనం ఆ కష్టము నందు వెంటనే తాదాత్మ్యం పొందుతాము. సంసారంలో తాదాత్మ్యం పొందుతాము. మనం ఎప్పుడూ మన విధిని నిర్వహించాలి. అంతేగాని అందులో వచ్చే సుఖదు:ఖము లతో మీరు తాదాత్మ్యం పొందితే మీ స్వధర్మమును మీరు నిర్వహించలేరు.

నేటి సమాజంలో కొన్ని విషయాలను గమనిస్తే కొన్ని ఇళ్ళలో పిల్లలకు చాలా చిత్రమైన పేర్లు పెడుతున్నారు. టింకూ అని, బంటి అనీ- ఇవే పేర్లు కుక్కలకీ, పిల్లులకూ కూడా పెడుతున్నారు అంటే పిల్లవాడిని పిలిస్తే కుక్కలూ, పిల్లులూ వస్తున్నాయి. అది మనం మన పిల్లలకు నేర్పిస్తున్న సంస్కారం.అజామీళోపాఖ్యానము లో పోతన గారు ఇలా అంటారు.-

"బిడ్డ పేరుబెట్టి పిలుచుట విశ్రామ, కేళినైన మిగుల గోలినైన
పద్యగద్యగీత భావార్థములనైన, గమతనయనేదలప గలుషహారము" (6-122)

- పేరు పిలిస్తే ఇంట్లో ఐశ్వర్యము పరిఢవిల్లాలి. ఒక పేరు పిలిస్తే నీ జన్మ సాఫల్యము పొందాలి. పిలాతీయ్లడిని పేరుపెట్టి పిలిచినపుడు హాస్యం కోసం అయినా సరే ఒరేయ్ మాధవా ఇలా రా! అన్నా సరే- ఈశ్వరుడి పేరు తలవగానే నీలో ఉన్న పాపం పోతుంది. నామమునకు ఉన్న శక్తి అటువంటిది. నామము అంత గొప్పది. పేరు పెట్టుకోవడంలో ఉంది అదృష్టం. ఇలాంటివి భాగవతం వినడం, చదవడం వల్ల తెలుసుకోవలసిన విషయములు. ఇలాంటివి పాటించకపోతే మనము మన కుటుంబానికి, సమాజానికి చాలా కీడు చేసినవారము అవుతాము.

విదురుడు హస్తినాపురము వచ్చిన తర్వాత ధర్మరాజుగారు ఎదురువెళ్ళి తీసుకుని వచ్చారు. పెద్దలు కనపడినపుడు ఎలా మాట్లాడాలో ధర్మరాజు మాట్లాడి నపుడు చూడాలి. భారతంలో గానీ, భాగవతంలో గానీ ధర్మరాజు మాట్లాడితే చాలా గంభీరంగా ఉంటుంది. ఆయన వెర్రివాడిలా, తెలివితక్కువ వాడిలా మాట్లాడడు. ధర్మరాజుకి మాట్లాడడం రాకపోతే భయంకరమైన భీముడిని అదుపు చేయడం ఎలా? భీమసేనున్ని అదుపు చెయ్యాలంటే ధర్మరాజుగారి మాటతో సాధ్యం ఇలాంటి మాటతీరు మన పురాణ ఇతిహాసాలలో కొద్దిమందికి మాత్రమే జన్మత: వచ్చింది. అరణ్యవాసంలో ఉన్న రాముడిని తొలిసారి కలిసిన హనుమంతుడు కూడా తన మాటతీరుతోనే ఆకర్షించాడు. ఇలాంటి వారి గురించి తెలుసుకోవడం ద్వారా ఉత్తమ వ్యక్తిత్వం అలవడటమే కాక మంచి నైతికవిలువలు అలవడి సమాజంలో ఉత్తమ పౌరులుగా గుర్తింప బడవచ్చు.

ఒకసారి ధర్మరాజు దగ్గరకు విదురుడు వచ్చాడు. ధృతరాష్ట్రునకు ఎకక్కడికి వెళ్ళాడో నీకు ఏమైనా తెలుసా అని విదురీతిని అడిగాను. విదురుడికి, ధృతరాష్ట్రుడికి ఉన్న సంబంధం చాలా గమ్మత్తుగా ఉంటుంది. తప్పో, ఒప్పో విదురుడు మంచివాడని ధృతరాష్ట్రునికి తెలుసు. అందరూ పడుకున్నాక ధృతరాష్ట్రుడు విదురుడిని పిలిచి - "నాకు నిద్ర పట్టడం లేదు. ఏదయినా మంచి మాటలు చెప్పు" అనేవాడు. అపుడు విదురుడు "నీకు ఎందుకు నిద్ర పట్టడం లేదు? దొంగలకు నిద్ర పట్టదు. నీవు

దొంగవి. నీ తమ్ముడి రాజ్యం, నీ తమ్ముడి పిల్లల రాజ్యమును నీవు నీవు దొంగలించాలని ఆలోచన తీస్తున్నావు" అని తిట్టేవాడు. నిజమే, నేను దొంగనే, ఏం చేస్తాను.. ఈ యోగంలోంచి బయటకు రాలేను అనేవాడు. కనీసం ఒక మంచి వ్యక్తి దగ్గర సత్సంగం చేసి తన తప్పును ఇప్పుకుని, బుర్రకి పట్టినా, పట్టకపోయినా రాత్రి మంచి మాటలు వినేవాడు. ఈ పుణ్యమునకే విశ్వరూప సందర్శనంలో కృష్ణ పరమాత్మ ధృతరాష్ట్రునికి కళ్ళను ఇచ్చి దర్శనం ఇచ్చాడు.

జీవితంలో ఒక సత్పురిషుడితో సహవాసంతో ఎలా ఉంటుందో, ఆయన మాటలు విన్నా, వినకపోయినా వారిలో సత్యంగా చేయడం వల్ల ఎలాంటి అనుభూతిని పొందుతామో భాగవతం, భారతంలోని ఈ సంఘటన తెల్పింది. అందుకే ఆది శంకరాచార్యులు ఈ విధంగా అంటారు.

సత్యంగత్వ నిస్సంగత్వం నిస్సంగత్వ నిర్మోహత్వం
నిర్మోహత్వ నిశ్చల తత్త్వం నిశ్చల తత్త్వే జీవన్ముక్తి!!

అని మంచి వారితో సాంగత్యం చాలామంచి విషయాలు తెలుస్తాయని తెలిపాడు.

భాగవతంలోని అష్టమస్కంధంలోని గజేంద్రమోక్షం నేటి సమాజానికి ఎంద అవసరమో అంత ఆదర్శం. అన్నీ ఉన్నాయన్న ఏనుగు చివరకు తన అంతిమ పరిస్థితి ఏమిటో తనకే అర్థమయ్యేలా చేశాయి. పరిస్థితులు సమాజంలోనూ ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి. గజేంద్రుడిలోని అత్యాశ, అహంకారం, నేను అనే స్వార్థం ఇవన్నీ తనను మడుగులోకి దింపి తన వారు ఎందరున్నా, తనని రక్షించలేరు. నాకు ఆ ఈశ్వరుడే దిక్కు అనే సంపూర్ణ శరణాగతి పొందినప్పుడే ఆ ఈశ్వరుడు వచ్చి గజేంద్రున్ని రక్షిస్తాడు. ఈ కథ వల్ల పోతన గారు సమాజానికి మంచి విషయం అందించారు. అన్నీ కలిగిన మానవుడు సమాజంలో ఏనుగును ఆదర్శంగా తీసుకోకుండా, భగవంతుడు ఇచ్చిన వాటిలో ప్రశాంత జీవితం గడపాలని తెలిపాడు.

గజేంద్రమోక్షంలో గజముగా ఎందుకు చెప్పాలి? ఒక శునకముగా చెప్పకూడదా? ఒక కోతిగా చెప్పకూడదా? లేకపోతే ఒక చీమగా చెప్ప కూడదా? ఏనుగుగా ఎందుకు చెప్పారు అంటే ఈ ప్రపంచంలో ఏనుగు ఒక్కదానికే ఒక బలహీనత ఉంది. భూమి నుంచి చాలా తక్కువ ఎత్తు మాత్రమే ఎగరగలిగిన ప్రాణి ఏనుగు. ఏనుగు పైకి ఎగరలేకపోవడానికి దాని శరీర బరువే దానికి అడ్డు వస్తుంది. మనిషికి ఈశ్వరుడి వైపు ఎందుకు నడవలేడు? అతని సంసారమే అతనికి బరువుగా ఉంటుంది. ఇష్టం పెంచుకుంటున్న కొద్దీ సంసారం బరువైపోతూ ఉంటుంది. నిజానికి అది ఏనుగు కథ లేకపోతే మన కథ? భాగవతంలో ఎన్నో కథలు ఉన్నాయి. వాటిలో మనకి ఏదయినా ప్రమాదం వస్తే వృత్రాసుర వృత్తాంతను కాగితం మీద వ్రాయమంటారు. అది అంత శక్తివంత మైనది. ఇక రెండవది నిత్య పారాయణము చేయ వలసినది అని నిర్ణయింపబడిన కథ గజేంద్రమోక్ష కథ.

ఈ గజేంద్రమోక్ష కథ మన జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. మానవ జీవితంలోని అనేక సంఘటనలుగజేంద్రుని కథలో కూడా జరిగాయి. మనిషి ఎరుకతో లేకపోతే గజేంద్రుడి మాదిరిగా చాలా కష్టాలు పడవలసి వస్తుంది. ఎన్ని కష్టాలు వచ్చినా ప్రహ్లాదునిలా సర్వం ఈశ్వరీక్ష అనే భావనతో ఉంటే ఎన్ని కష్టాలు వచ్చినా అవే పటాపంచలు అవుతాయి. భాగవతం చెప్పిన ఇలాంటి కథలను ఆచరించి ఆదర్శ సమాజాన్ని నిర్మిద్దాం.

ఆధార గ్రంథాలు :

1. భాగవతం - పోతన- తి.తి.దే ప్రచురణ
2. శ్రీమదాంధ్ర మహాభాగవతం (ప్రవచనం) - చాగంటి కోటేశ్వర రావు
3. ఆంధ్ర మహాభాగవత ఉపన్యాసాలు - పుట్టపర్తి నారాయణాచార్యులు
4. గీతా మకరందం- శ్రీశ్రీ విద్యా ప్రకాశ నందగిరి స్వామి

❖

ఆదర్శసమాజ నిర్మాణంలో సాంఘిక శాస్త్రాల ఆవశ్యకత

– పామర్తి లీలావతి, చరిత్ర అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాయకాపురం, విజయవాడ.

సత్యసంధాయకతను, క్రమపద్ధతిని అనుసరిస్తున్న శాస్త్రసముచ్ఛయంలోని శుద్ధశాస్త్రాలు - సాంఘికశాస్త్రాలు - అనుభావిక శాస్త్రాలు - మాయావాదశాస్త్రాలు అనబడే వాటిలో రెండవతరగతికి చెందినవే ఈ సాంఘికశాస్త్రాలు. వ్యావహారికంగా చెప్పాలంటే - భిన్న సమాజాల సంకలనమే సాంఘిక శాస్త్రాల కూడలి. నేడు సామాజిక విలువలు, కుటుంబ విలువలు, వ్యక్తిగత విలువలు కనుమరుగవుతున్నాయంటే అందుకు విద్యాలయాలలో మూసివేతకు గురవుతున్న సాంఘిక శాస్త్రాల అధ్యయనమే కారణం. ఏడెనిమిది దశాబ్దాల క్రితం మన జీవన విధానం పరిశీలిస్తే ప్రతి కుటుంబం సాంఘిక శాస్త్రాలకు నిలయంగా ఉండేవి. ఈ శాస్త్రజ్ఞానం పేద, గొప్ప, విద్యావంతులు, అవిద్యాపరులు అనే భేదం లేకుండా, కనిపించని దారం పూలను దండలా గ్రుచ్చిన విధంగా ఒకరి నుండి ఒకరికి పెద్దల నుండి పిన్నల వరకు ఉన్నత విద్యావంతుల నుండి సమాజంలోని అట్టడుగు స్థాయిల వరకు పరంపరగా అందించబడేది. పిల్లలకు పెద్దలు చెప్పే భారత, భాగవతాలు నీతిశాస్త్ర రూపంలో అందించబడేవి. పండుగలు సామూహికంగా ఎటువంటి కృత్రిమత్వానికి, ఆడంబరానికి తావులేకుండా జరుపుకుంటునప్పుడు సామాజికశాస్త్రం దర్శనమిచ్చేది. ప్రకృతిని పూజిస్తూ ప్రేమిస్తూ, మమేకం అవుతూ పర్యావరణ పరిరక్షణ జీవితంలో ఒక భాగంగా ఉండేది. ఉమ్మడి కుటుంబాలలో పెద్దలకు దక్కే గౌరవం, పిల్లలకు అందించబడే ప్రేమ వారిని పరిపూర్ణ వ్యక్తులుగా రూపొందించేవి. దయ, దానం, ధర్మం, సంపాదన, నిర్వహణ అర్థశాస్త్రాన్ని అందిస్తే, అనువంశికంగా అనుసరించే ఆచార సాంప్రదాయాలలో చరిత్ర దాగి ఉండేది. వీటన్నిటి సమాహారంతో కుటుంబపు వెన్నెముకగా సమాజం విలసిల్లేది. ఫలితంగా నేడు సర్వసాధారణ సమస్యలుగా ఎదుర్కొంటున్న డిప్రెషన్, నిద్రలేమి, ఒంటరితనం, ఊబకాయం, న్యూన్యతాభావం (ఇన్ఫీయారిటీ కాంప్లెక్స్), అధికభావం (సుపీరియారిటీ కాంప్లెక్స్), ఇగోలు వంటివి పెద్దగా నాడు కనిపించేవి కావు. ఎక్కడైనా తలెత్తితే పెద్దలు వారివారి అనుభవాల ద్వారా ఆయా సమస్యలను సునాయసంగా, విజయవంతంగా పరిష్కరించేవారు. దానితో సమస్య ఎక్కడ మొదలైందో అక్కడే అంతం అయ్యేది. కుటుంబం వ్యక్తులకు అండదండలు అందిస్తే వ్యక్తులంతా కలిసి కుటుంబంలోని బలహీనులను, దురదృష్టవంతులను ఆదుకుంటూ ఉన్నంతలో ఆదర్శవంతంగా, విలువలు పాటిస్తూ, సహకారంతో జీవించేవారు.

నేడు సాంఘికశాస్త్రాల అధ్యయనాన్ని పరిశీలిస్తే చరిత్ర, ఆర్థికశాస్త్రము, పౌరశాస్త్రము, రాజనీతిశాస్త్రము, సామాజిక శాస్త్రము, తాత్వికశాస్త్రాలను అధ్యయనం చేస్తున్న విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతూ కొన్ని ప్రసిద్ధ కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో ఆయా విభాగాలను మూసివేస్తున్నారు. ఈ సబ్జెక్టులను చదవడం వలన ఎటువంటి ఆర్థిక ప్రయోజనం లేదు. ఉద్యోగాలు దొరకవ్. దేనికీ పనికి రారు. ఇటువంటి భావజాలం గత మూడు దశాబ్దాలుగా విపరీతంగా ప్రచారం చేయబడింది. విద్య ఎపుడైతే కార్పోరేటీకరణ చేయబడిందో అప్పటి నుండి కేవలం డాక్టర్లు, ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ వలసలను తయారు చేసే బాధ్యతను అవి తలకెత్తుకున్నాయి. సాంఘికశాస్త్రాల అధ్యయనం పూర్తిగా కేవలం ప్రభుత్వ విద్యాలయాల బాధ్యతగా మారిపోయింది. సాంకేతిక చదువుల ద్వారా లభిస్తున్న ఆర్థిక ఉన్నతి అన్ని వర్గాల వారిని ఆ చదువువైపే మళ్ళించింది. ఇటువంటి పరిస్థితు

లలో సాంఘికశాస్త్రాల అధ్యయనం అంతరించిపోతున్న జాతుల జాబితాలోకి చేరిపోయింది. అయితే సాంఘిక శాస్త్రాలు పనికిరానివా? వాటికి ఎటువంటి ప్రయోజనం లేదా? వాటి అధ్యయనం వలన వచ్చే లాభమేంటి? ఇది నేటి సామాజిక పరిస్థితులకు ఎంతవరకు అవసరం? పరిశీలిద్దాం -

చరిత్ర - ఆవశ్యకత :

తొలుత చరిత్రను తీసుకుంటే చరిత్ర అన్ని సాంఘిక శాస్త్రాలకు తల్లివంటిది. ఇది కేవలం గతించిపోయిన అంశాలను మాత్రమే చర్చించదు. "గతం వర్తమానంతో జరిపే అంతులేని సంభాషణే చరిత్ర" అంటారు ఇ.హెచ్. కార్ అనే చరిత్రకారుడు. అంటే చరిత్ర కేవలం గత కాలానికి మాత్రమే పరిమితం కాదు. ప్రతి సమాజం గతాన్ని పరిశీలించి దానిలోని లోపాలను సరిచేసి భవిష్యత్తుకు కావాల్సిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటుంది. గతం లేనిదే వర్తమానం లేదు. వర్తమానం లేనిదే భవిష్యత్తు ఉండదు. భవిష్యత్తు అనే విజయవంతమైన భవనానికి పునాది చరిత్ర. ఇది కేవలం రాజుల కథలు, యుద్ధాలు, అతిశయోక్తుల సమాహారం కాదు. వారు అత్యంత అభిరుచితో నిర్మించిన సాంస్కృతిక నిలయాలే నేడు మనం చూస్తున్న దేవాలయాలు. వాటి చుట్టూ వున్న, అల్లుకున్న వారసత్వ సంపద, ఇంజనీరింగ్ నైపుణ్యాలు, ఎన్నో ఆశ్చర్యకర అద్భుతమైన నేడు మన ఊహకు కూడా అందని సైన్స్ ఆలయశిల్పాలలో దాగి ఉంది. దేవాలయాలే ప్రధాన కేంద్రంగా నాటి కాలంలో పట్టణాలు రూపుదిద్దుకునేవి. నేటికీ విడివడని జామెట్రికల్ రహస్యాలు వారు నిర్మించిన కోటలలో, భవనాలలో, కట్టడాలలో ఇమిడి ఉన్నాయి. వాటిని క్రమపద్ధతిలో అధ్యయనం చేస్తే నేటి తరాలకు స్ఫూర్తినందించే అంశాలు మరెన్నో వెలుగు చూస్తాయి. మన పాలకులు అందించిన సమర్థవంతమైన పాలన, అధర్మంపై చేసిన పోరాటాలు, వారి గెలుపు ఓటములు నిశ్చయంగా సమాజంలోని ప్రతివ్యక్తీ తెలుసుకోవల్సిన అంశాలు. వారి గాథలను తరతరాలుగా గానం చేసి అందించడానికి అనేక కళా రూపాలు ఉండేవి. హరికథలు, బుర్రకథలు, తోలు బొమ్మలాటలు, జంగమాలు, పిచ్చుకగుంటలు వారు ఎందరో ఆయా వీరుల పరాక్రమ శౌర్యాలను ఎదలు ఉప్పొంగేలా ప్రచారం చేసేవారు. పృథ్వీరాజ్, శివాజీ, రాణాప్రతాప్, రుద్రమదేవి, శ్రీకృష్ణదేవరాయలు, రామరాయలు తదితర వీరుల చరిత్రలు స్ఫూర్తిని నింపేవి. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోని వీరుల గురించి తప్పక వివరించాల్సిందే. విదేశీ దాస్యశృంఖలాల నుండి భరతమాతను విడిపించిన యోధుల గాథలు నిత్యస్మరణీయాలు. చరిత్ర మరచిన జాతి, మనుగడను సాగించ లేదనేది నగ్న సత్యం.

ఆర్థికశాస్త్రం - ఆవశ్యకత :

ఒకప్పుడు గ్రీకు సామాజికవేత్తల అభిప్రాయంలో గృహనిర్వహణ శాస్త్రమే ఆర్థికశాస్త్రం. కాలక్రమేణా ఆ శాస్త్ర పరిధులు విస్తరించాయి. ఈ రోజు జాతీయాదాయం, తలసరి ఆదాయం, వ్యయం, విదేశీ అప్పులు, వనరుల సేకరణ, బడ్జెట్ తీరుతెన్నులు మున్నగునవి ప్రతిపౌరుడు తెలుసుకోవాల్సిన అతిముఖ్య అంశాలు. తాము పన్నులు ఎందుకు చెల్లిస్తున్నాం, ఎంతవరకు వనరులు సద్వినియోగం అవుతున్నాయి, రోజు రోజుకూ పెరుగుతున్న ధరలకు కారణాలు, స్టాక్‌మార్కెట్ పడిపోవడం మరియు లేవడం అంటే ఏమిటి, బులియన్ మార్కెట్ తీరుతెన్నులు, రూపాయి విలువ పడిపోవడం ఎందుకు, ఆదాయ అప్పులపై ద్రవ్యోల్బణ ప్రభావం అంటే ఏమిటి? ఇవన్నీ కూడా నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అంశాలు. ఇవి తెలుసుకోవడం ద్వారానే తమ ఆదాయాన్ని ఏ విధంగా నిర్వహించుకోవాలో ఎంత మొత్తంలో పొదుపు చేయాలో, ఎక్కడ మదుపు చేయాలో తెలుస్తుంది. భవిష్యత్ అవసరాలకు సరిపడా మొత్తాన్ని ప్రస్తుతం నుండే సమకూర్చుకోవడం, ద్రవ్యోల్బణ పరిస్థితులకు అనుగుణంగా వ్యయాన్ని నియంత్రించుకోవడం తదితర అంశాలన్నీ ఆర్థిక పరిజ్ఞానం ద్వారా మాత్రమే సాధ్యం.

"ధనం మూలమ్ ఇదం జగత్" అనే అనుభవజ్ఞుల పదాలను ఆచరణలో సుసాధ్యం చేయాలంటే ధనాన్ని అవసరాలకు, సౌకర్యాలకు, భవిష్యత్తుకు సరిపడేలా ప్రతి కుటుంబం ప్రణాళికలు రూపొందించుకోవాలి. అపుడే ఆందోళన లేని ప్రస్తుతాన్ని, భయం లేని భవిష్యత్తును నిర్మించుకోగలుగుతాయి. ఆర్థికశాస్త్రం ఎంతగానో పరిజ్ఞానం అందించి వ్యక్తికి, కుటుంబానికి, తద్వారా సమాజానికి శాంతివంతమైన జీవితానికి బాటలు వేస్తుంది. సామాజికశాస్త్రం, గణితశాస్త్రం, సాంఖ్యాకశాస్త్రం, నృశాస్త్రం, మనోవిజ్ఞానశాస్త్రం, భూవిజ్ఞానశాస్త్రం వంటి శాస్త్రాలతో ఆర్థికశాస్త్రం జతగూడి ఏర్పరిచే పరస్పరాధిరితవిద్యలు వివిధరంగాలలో స్పష్టతను, కార్లవేగాన్ని పెంచుతాయి.

రాజనీతిశాస్త్రం - ఆవశ్యకత :

ప్రస్తుతం మనం జీవిస్తున్న ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపౌరుడు రాజకీయ పరిజ్ఞానాన్ని కలిగి ఉండటం చాలా అవసరం. రాచరికవ్యవస్థకు సంబంధించి పరిపాలనలో ప్రజలకు ఎటువంటి పాత్రలేదు. అందువలననే కౌటిల్యుడు తాను రచించిన 'అర్థశాస్త్రం' అనే పరిపాలనా గ్రంథంలో రాజు విధులు, రాజు శత్రువులు, రాజు మిత్రులు, కోట నిర్వహణ, సైన్యం, వేగులు, విజిగీషు వంటి అన్ని అంశాలు చర్చిస్తాడు. ప్రజలు కేవలం పాలితులే తప్ప, వారు పాలనలో ఎటువంటి భాగస్వాములు కారు. కాని నేటి వ్యవస్థలో పాలకులను ఎన్నుకునేదే ప్రజలు. వారే అధికారానికి మూలం. వారు తమ ఓటుహక్కును ఉపయోగించుకుని తమకు తద్వారా సమాజానికి, దేశానికి మేలు చేకూర్చేపాలకులను ఎన్నుకుంటారు. ఓటు విలువ అంటే ఏంటి? తాము ఎంచుకోబోయే పాలకులు ఏ విధంగా సమాజానికి ఉపయోగపడతారు? దేశ భవిష్యత్తును ఎలా దిశానిర్దేశం చేస్తారు? రాజకీయ పార్టీల వ్యూహాలు ఏంటి? తదితర అంశాలపై ప్రతి పౌరుడికి ప్రాథమిక అవగాహన కలగాలంటే రాజనీతిశాస్త్రంలో కనీస పరిజ్ఞానం అవసరం. శాసనసభ్యుడు (ఎం.ఎల్.ఎ), పార్లమెంట్ సభ్యుడు (ఎం.పి.) వారి అర్హతలు, విధులు తదితర అంశాలపై అవగాహన ద్వారా మాత్రమే సరియైన ప్రతినిధిని ఎన్నుకోవడం సాధ్యపడుతుంది. రాజకీయపార్టీలు ఆశచూపే ప్రలోభాలకు లొంగి కొందరు తమ ఓటును నోట్ల కోసం అమ్ముకుంటున్నాడు. దానితో చట్టసభలకు నేరస్తులు, గుండాలు, అక్షరజ్ఞానం లేని వారు ఎంపికై విలువలను కాలరాసి దిగజారుడు రాజకీయాలకు పాల్పడి తమకు మాత్రమే ప్రయోజనం చేకూర్చే చట్టాలను తయారు చేస్తున్నారు. ప్రజల అప్రమత్తమై ఆరంభంలోనే ఇటువంటి వారిని అడ్డుకుంటే సుపరిపాలన, సమయోచిత నిర్ణయాలు సాధ్యపడతాయి. పరిపాలకులను నిర్ణయించాల్సిన ప్రజలే నిరాసక్తంగా మారి, ప్రలోభాలకు లొంగి కనీసపు ఆసక్తి కనబరచక పోవడానికి కారణం రాజకీయ పరిజ్ఞానం లోపించడమే. ప్రతి పౌరుడూ విధిగా తమ దేశరాజకీయ వ్యవహారాల పట్ల అవగాహనను పెంపొందించుకోవాలి. గతంలో ఆయా పార్టీలు అనుసరించిన విధానాలు, ఆచరణలో జరిగిన వైఫల్యాలు, తదితరాలన్నింటినీ బేరీజు వేసుకొని పౌరులు భవిష్యత్తు పాలకులను ఎన్నుకోవడం వలన దేశం ప్రగతిపథంలో ముందుండటమే కాకుండా అంతర్జాతీయ వేదికలపై తన వాణిని బలంగా వినిపించగలుగుతుంది.

సాంఘికశాస్త్రాలు - పరిణామాలు :

నేటి సమాజం పూర్తిగా విస్మరించిన అతి ముఖ్యమైన విషయం "స్వంత లాభం కొంత మానుకుని పొరుగువాడికి తోడుపడవోయ్" అన్న గురజాడ పలుకులకు ఇప్పుడు కాలం చెల్లింది. లాభం సంగతి పూర్తిగా వదిలేసినా ఎటువంటి ప్రయోజనం లేకపోతే పక్కవాడిని చూసి పలకరింపుగా చిరునవ్వు కూడా ఖర్చుపెట్టని కాలంలోకి వచ్చేశాం. మన ఫోనే మన ప్రపంచంగా మారిపోయింది. రైలు ప్రయాణాలు, దూరప్రయాణాలు చేసే సమయంలో కాలక్షేపానికి పలకరించుకుని తరువాత ఆప్తులుగా, బంధువులుగా మారిన ఉదంతాలు ఒకప్పటి కాలంలో తరచుగా జరిగేవి. నేడు పక్క వ్యక్తి ఎవరో పదిగంటలు

ప్రక్కనే ఉన్న చూడకుండా ఉండి ఎవరి దారినవాళ్ళు వెళ్ళే కాలంలోకి అడుగుపెట్టి దశాబ్దం గడిచిపోయింది. పెరిగిన సాంకేతిక నైపుణ్యం ప్రపంచాన్ని దోసిట్లో పెట్టి పక్కవాడిని దూరం చేసిందంటే అతిశయోక్తి కాదు. ఆ నైపుణ్యాన్ని తగిన విధంగా శ్రేయోదాయకంగా వినియోగించుకోవడంలో సమాజాన్ని ఉన్నతంగా నడిపించే పెద్దలు తగ్గిపోతున్నారు. పిల్లలకు నీతికథలు చెపుతూ వారిక మంచి గుణాలను పసితనం నుండే అలవాటు చేసే సంస్కృతి కనుమరుగైపోతోంది. నేడు ప్రతి ఇంట్లో పిల్లలు ముందు టీవీలు, సెల్‌ఫోన్లు పెట్టేసి వారిని అయా సాధనాలకు బానిసలుగా మారుస్తున్నారు. తమ పనులు చక్కబెట్టుకోవడానికి, పిల్లలను దృష్టి మరల్చడానికి అలవాటు చేస్తున్న వినోదసాధనాలకే పిల్లలు పూర్తిగా అంటుకుపోతున్నారు. కథలు, కబుర్లు చెప్పి వినోద, విజ్ఞాన, వికాసాలను అందించే పెద్దలు వారికి అందుబాటులో ఉండటం లేదు. ఇరుగుపొరుగు వారితో అరమరికలు లేకుండా కలిసి కబుర్లు చెప్పుకుంటూ, పిల్లలతో కూడా కలివిడిగా ఉండే సంస్కృతి మాయమై పోతోంది. ఒకప్పుడు కనీసం గ్రామాలలో అయినా కలిసి కూర్చుని మాట్లాడుకునే సన్నివేశాలు కనిపించేవి. ఇపుడు ఎవరి ఇంట్లో వారే ఉంటూ పలకరిస్తే ఏం సహాయం చేయాలో అని ముందే జాగ్రత్తపడుతున్న జనరేషన్ల మధ్య ఏం చెప్పడానికి అవకాశం లేక పెద్దతరం వృద్ధాశ్రమంలోనే జీవించడానికి సిద్ధమైపోతున్నారు.

బాగా విస్తరించిన సోషల్ మీడియా సంస్కృతిలో నీతి కబుర్లు, జాతివీరుల చరిత్రలు, కనుమరుగైపోతున్న పండుగలు, ఉత్సవాలు, జయంతులు, వర్ధంతులు, ఆ రోజు ప్రాముఖ్యతలు, గుడ్మానింగ్, గుడ్‌నైట్‌లను యాంత్రికంగా ఫార్వర్డ్ మెసేజ్‌ల ద్వారా పంపిస్తూ సంతృప్తి పడే ఒకతరం తయారవుతోంది. కనీసం పదిమందిలోకి వచ్చి ఒక్క మాట కూడా మాట్లాడలేని వాట్సప్ పులులు, ఫేస్‌బుక్ సింహాలు, ఇన్‌స్టాగ్రామ్ ధీరులు అవసరం అయిన సమయంలో కూడా స్పందించలేరు. ప్రస్తుతం క్రమంగా నిస్తేజం, నిర్వేదం వైపు నడుస్తున్న సమాజానికి సాంఘికశాస్త్రాల అధ్యయనం ఎంతో అవసరం. ఇంటర్ మీడియట్ స్థాయిలో ప్రవేశపెట్టిన పర్యావరణ, నీతిశాస్త్రాలు ఏ కాలేజీలోనూ బోధింపబడక కేవలం మార్కుల కోసం వ్రాసే అనవసరపు సబ్జెక్టులుగా మిగిలాయి. ఆ విధంగా కాకుండా సివిల్స్ పరీక్షలలో పెట్టిన విధంగా ప్రతి కోర్సులోనూ సాంఘికశాస్త్రాలు, నీతిశాస్త్రాన్ని తప్పనిసరి పేపరుగా బోధించాలి. సైన్స్ మరియు ఇంజనీరింగ్ విద్యార్థులకు సహితం సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, పౌరవిజ్ఞానం, అర్థశాస్త్రములతో కూడిన ఒక తప్పనిసరి పేపరును చేర్చడం ద్వారా కనీస పరిజ్ఞానం వారికి అందుతుంది. సమాజంలో ఒకప్పుడు గడిపిన ఆదర్శనీయమైన, సహకారంతో కూడిన జీవనవిలువలను బోధనాంశాలుగా నేర్పాలి.

'యూజ్ అండ్ త్రో (use and throw) సంస్కృతి ఏ విధంగా హానికరమో అనేక ప్రత్యక్ష ఉదాహరణల ద్వారా తెలపాలి. సాంఘిక శాస్త్రాల పరిజ్ఞానం, ఆచరణే ఆదర్శ సమాజానికి ఆవశ్యకం అని యువతకు అర్థమయ్యేలా తెలియపరిస్తే వారి జీవనం మరింత శ్రేయోదాయకమవుతుంది. శాంతివంతమైన జీవనానికి అయా శాస్త్రాలే ఆధారభూతం అవుతాయని అవగతమవుతుంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్ఓ) జరిపిన ఆరోగ్యసంబంధిత పరిశోధనల్లో తేలిన శారీరక ఆరోగ్యం, ఆధ్యాత్మిక ఆరోగ్యాలతో పాటుగా సాంఘిక ఆరోగ్యం కూడా ముఖ్యమని తేలింది. ఇందుకు సాంఘిక శాస్త్రాల అధ్యయనం కూడా చాలా ముఖ్యమని గుర్తించాలి.

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణ స్థాపనలో మహిళా శాస్త్రవేత్తలు

-వై. బుజ్జి, అధ్యాపకురాలు, సంస్కృత విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి.

ప్రస్తుతము సమాజంలో స్త్రీలు పూర్వపు బాధలన్నిటిని మరచి విద్యావేత్తలుగా ప్రతి రంగంలో ముందుం టున్నారు. తమకు వచ్చిన అవకాశాల ను వినియోగించు కుంటు తమ కుటుంబాలకు దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెడుతున్నారు. ప్రాచీనకాలం నుండి భారతదేశం సైన్సు, గణిత రంగాల కృషి తో ప్రసిద్ధి చెందినది. సాధారణంగా 'సున్నా' అనే భావనను సంఖ్య, దశాంశ వ్యవస్థగా మనదేశానికి చెందిన గణిత శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. మనదేశం గోప్పచరిత్రకు, దేశానికి అపార మైన గౌరవాన్ని తెచ్చి పెట్టిన అనేక శాస్త్రవేత్తలతో నిండి ఉంది.అలా దేశానికి వన్నెతెచ్చిన శాస్త్రవేత్తలలో మహిళా శాస్త్రవేత్తలు అనేకమంది ఉన్నారు. వీరందరూ సైన్సు లోని వివిధ భాగాలకు గణనీయమైన కృషి చేశారు.సైన్సు టెక్నాలజీ రంగంలో తమదయిన ముద్రవేసుకోవాలనే కోరిక వారికి ఉంది. కనుకనే మహిళా శాస్త్రవేత్తలు చరిత్రలో నిలిచిన కొందరి గూర్చి మనము తెలుసు కుందాం.

వారిలో కొంతమంది...

ఆనందిభాయి గోపాలజోషి 1865-1887 :

ఈమె యునైటెడ్ స్టేట్స్‌లో వెస్ట్రన్ మెడికల్ నందు రెండేళ్ళ డిగ్రీ పూర్తిచేసిన మొట్టమొదటి మహిళా వైద్యురాలు.తన వ్యక్తిగత జీవితమే తనను మెడిసిన్ తీసుకునేలా చేసినది. ఈమెకు తొమ్మిది సంవత్సరాలు వచ్చే సరికి తనకంటే 20 సంవత్సరాల పెద్దవయసున్న వ్యక్తితో వివాహం జరిగినది. ఆమెకు14 సంవత్సరాలు వచ్చుసరికే ఒక కుమారుడు జన్మించెను. అసమయమున సరైన వైద్య సదుపాయాలు లేక బాబు చనిపోయెను. కుమారుడు చనిపోవడం వలన తాను వైద్యవృత్తిని చేపట్టడం జరిగింది. తన భర్త ప్రోత్సాహంతో 1886 సంవత్సరంలో ఉమెన్స్ మెడికల్ కాలేజ్ ఆఫ్ పెన్సిల్వేయా నందు మెడిసిన్ చేసింది. ఒక మహిళ అచట వైద్య విద్యను చదవడం ఇదే మొదటి సారి.

జానకి అమ్మాళ్ 1897-1984:

1877సంవత్సరంలో మొట్టమొదటి పద్మశ్రీ అవార్డు అందుకున్న భారతీయ శాస్త్రవేత్త. ఈమె బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్‌గా గొప్ప బాధ్యతను చేపట్టారు. 1990 సంవత్సరంలో ఈమె వృక్షశాస్త్రాన్ని చేపట్టారు. ఇది మహిళలకు ఒక అసాధారణమైన ఎంపిక. తరువాత 1921 సంవత్సరంలో ప్రెసిడెన్సీ కళాశాల నుండి వృక్ష శాస్త్రములో ఆనర్స్ డిగ్రీని పొందారు. తరువాత సైటో జెనెటిక్స్‌లో శాస్త్రీయ పరిశోధనను కొనసాగించారు. ఇది క్రోమోజోములు, కణప్రవర్తన ఫైటోజియోగ్రాఫీకి ఎలా సంబంధం కలిగి వుంటాయనే దానితో సంబంధం ఉన్న జన్యుశాస్త్ర విభాగ మొక్కల జాతుల భౌగోళిక పంపిణీకి సంబంధించినవి. చెరకు, వంకాయ వంగడాలపై ఈమె చేసిన కృషికి మంచి గుర్తింపు వచ్చినదని చెప్పాలి.

కమలా సోహాని 1912-1998 :

సైంటిఫిక్ విభాగంలో పీహెచ్.డీ. పట్టా పొందిన తోలి తెలుగు భారతీయ మహిళ కమల సోహాని గారు. ఈమె రీసర్చ్ ఫెలోషిప్ కోసం దరఖాస్తు చేసుకోగా మహిళ అను కారణం చేత ఆమె దరఖాస్తును మొదట తిరస్కరించినారు. అప్పటి డైరెక్టరైన సర్. సి.వి. రామన్‌గారు గారు తన లోని నైపుణ్యాన్ని గుర్తించి, ఆమెకు తదుపరి పరిశోధన కొనసాగించడానికి అనుమతినిచ్చారు. మొక్కల కణజాలంలోని ప్రతి కణం ఆన్ని మొక్కల కణాల ఆక్సీకరణలో పాల్గొనే సైటోక్రోమిసి అనే ఎంజైమ్ ని కలిగి వుందని ఆమె కనుగొన్నారు.

అసిమా చటర్జీ - 1917-2006 :

ఈమె ఒక భారతియ రసాయన శాస్త్ర వేత్త. తాను

చేసిన ఆర్గానిక్ కెమిస్ట్రీ & సైటో కెమిస్ట్రీ (మొక్కలనుండి తీసుకోబడిన రసాయనాలు) రంగాలలో చేసిన కృషికి అత్యంత గౌరవం పొందినారు. 1936 సంవత్సరంలో కలకత్తా విశ్వవిద్యాలయంలోని స్కాటిష్ చర్చ్ కళాశాల నుండి నుండి రసాయన శాస్త్రంలో పట్టభద్రురాలైన తరువాత తన పరిశోధనను కొనసాగించారు. ఈమె అత్యంత ముఖ్యమైన పనిలో "VIMKAALCALAIDS" (CANCER-వ్యతిరేక లక్షణాలకు ప్రసిద్ధి చెందిన ్రాజు=×ఎ×వీజూజు నుండి ఉద్భవించింది. ఎఎన్‌టి -1 ఎపిలిప్టిక్ మరియు యాంటీ మలేరియా ఔషధాల అభివృద్ధి పై పరిశోధనలు ఉన్నాయి.

రాజేశ్వరిచటర్జీ 1922-2010 :

ఈమె కర్నాటక రాష్ట్రానికి చెందిన మొదటి మహిళా ఇంజినీర్. 1946 సంవత్సరంలో తాను విదేశాల్లో చదవ డానికి ప్రభుత్వ స్కాలర్‌షిప్‌ను పొందారు. తాను మిచిగాన్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం నుండి మాస్టర్స్ డిగ్రీని పొందారు. డాక్టరేట్ డిగ్రీని పొందాక భారతదేశానికి తిరిగి వచ్చి ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాంష్ఠలో ఫ్యాకల్టీ మెంబర్‌గా చేరారు. తరువాత తన భర్తతో కలసి మైక్రోవేవ్ పరిశోధనకు సంబంధించిన ప్రయోగశాలను స్థాపించి, ఆరంగంలో ఇరువురూ మార్గదర్శకులుగా పనిచేశారు.

కల్పనా చావ్లా (1962-2003) :

అంతరిక్షంలోకి వెళ్ళిన మొట్టమొదటి వ్యోమగామి కల్పనా చావ్లా. ఈమె మొదటి సారిగా 1997వ సంవత్సరంలో స్పేష్ షటిల్ కొలంబియాలో మిషన్ స్పెషలిస్ట్ అండ్ ప్రిలిమినరీ రోబోటిక్ అర్మ్ ఆపరేటర్‌గా ప్రయాణించారు. తరువాత 1982 సంవత్సరంలో అమెరికాకు వెళ్ళి 1984లో టెక్సాస్ విశ్వవిద్యాలయం నుండి ఏరో స్పేష్ ఇంజినీరింగ్‌లో మాస్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీని పొందారు. తరువాత 1986లో రెండవ మాస్టర్స్ డిగ్రీని కొలార్డో బోల్డర్ విశ్వవిద్యాలయం నుండి, 1988లో ఏరో స్పేష్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ డిగ్రీలను పొందారు. తరువాత 1.02.2003న స్పేష్ షటిల్ కొలంబియా విపత్తులో మరణించిన సిబ్బందిలో కల్పనా చావ్లా ఒకరు. వీరు భూమియొక్క వాతావరణంలోనికి తిరిగి వస్తున్న సమయంలో స్పేష్ షటిల్ విచ్ఛిన్నం కావడంతో ఈ విషాధం సంభవించింది.

డా॥. ఇందిరా హిందూజా :

ఈమె బొంబాయి విశ్వవిద్యాలయం నుండి హ్యూమన్ ఇన్విట్రో ఫెర్టిలైజేషన్ అండ్ ఎంబిరో ట్రాన్స్‌ఫర్ నందు డాక్టరేట్ పట్టాను పొందిన వైద్యురాలు. వంధ్యత్వ నివారణ నిపుణురాలు. భారతదేశపు "F" KHEEU పుట్టుకకు దారి తీసిన GEMET INTRAFHALOPIEN TRANSFER ["F"] TECNICను ప్రారంభించినారు, 4-1-1988న బిడ్డకు జీవం పోశారు. దీనికి ముందు ఈమె 6-1-1986 న KEవి ఆసుపత్రిలోలో భారతదేశపు మొట్టమొదటి టెస్ట్-ట్యూబ్ బేబీ ని ప్రసవించింది. రుతుక్రమం ఆగిన, అకాల అండాశయ వైఫల్యం ఉన్న రోగుల కోసం ఓ సైట్ డోనేషన్ టెక్నిక్‌ను అభివృద్ధి చేసి నందుకు కూడా ఆమె మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. 24-1-1991 న ఓ శిశువు ఈ టెక్నిక్ ద్వారా బయట పడింది.

ఈ విధంగా మహిళలు తాము ఎంచుకున్న రంగములో ఎంతో ప్రగతి సాధించినను, ఆస్తిహక్కు పొందినను వరకట్న మరణముల సంఖ్య తగ్గుటలేదు. నిత్యము వార్తాపత్రికలలో ఏదో ఒక వార్త ను వినవలసి వస్తుంది.మహిళ గృహిణిగా, తల్లిగా, ఉద్యోగస్తురాలిగా అనేక బాధ్యతలను సక్రమముగా, సమర్ధవంతముగా నిర్వర్తించుచున్నప్పటికి పురుషునితో సమానహక్కు అన్నిటా పొందలేకపోవుచున్నది. స్త్రీకి సమానత తొందరగా రావాలని మనందరమూ కోరుకుందాం.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు వ్యాసములు మరియు జాతిరత్నాలు
2. వికీ తెలుగు సోర్స్

❖

ఆదర్శ సమాజ నిర్మాణం - వేమన పాత్ర

- డా॥. బోడిరెడ్డి మహేంద్ర రెడ్డి, తెలుగు శాఖ, బి.టి. కళాశాల, మదనపల్లె.

'ప్రజాకవి వేమన' లో కవి, విశ్వకవి, సంఘసంస్కర్త, మానవతావాది, సామాజిక వాదిగా చైతన్య దృష్టితో కవిత్వాన్ని అల్లిన కవి. తొలి తెలుగు కవి మన వేమన. ఆదర్శవంతమైన సమాజం కోసం ముందు దృష్టితో రచనలు రాయడం ఆనాటి రచయితల కర్తవ్యంగా చెప్పవచ్చు.

మన పూర్వికుల సంప్రదాయాన్ని, విలువలను వెనుకటి వారికి తెలియజేస్తూ తన రచనతో సామాజిక చైతన్యం కలిగించిన కవి మన వేమన.

వేమన 17వ శతాబ్దానికి చెందినవాడు అని పెక్కు మంది పేర్కొన్నారు. తెలుగు వారిలో వేమన కీర్తి అజరామరం. ఒక్క వేమన పద్యం రానివారంటూ ఉండరని లోకోక్తి కలదు. ఈయన రెడ్డి వంశానికి చెందినవాడని ఎక్కువమంది పరిశోధకుల అభిప్రాయం. తెలుగు సాహిత్యంలో వేమనకు స్థానం ఇవ్వకపోయిన, తెలుగు వారి గుండెలలోను, వారి నాలుకలపై తాండవం ఆడించిన పద్యకవి వేమన. తెలుగు వారికే కాకుండా దేశ, విదేశాల్లోను ఎందరో మహానుభావులు, విద్యావేత్తలకు ఆదర్శవంతమైన గొప్ప కవి మన వేమనే అని చెప్పుకోవచ్చు.

వేమన విద్యావేత్తలకు విద్యాధికారిగా, మేధావులకు మేధావిగా, మానవులపట్ల మానవతావాదిగా, స్త్రీలపట్ల సంప్రదాయ వాదిగా, నైతికత పట్ల నైతికవాదిగా, ఆర్థిక వేత్తలకు ఆర్థికవేత్తగా, రాజకీయ నాయకులకు రాజకీయవేత్తగా, జ్యోతిష్యులకు జ్యోతిష్యవేత్తగా, మునులకు మహాముునిగా, కులవివక్షకులకు కులాంతకుడిగా, బ్రహ్మజ్ఞానులకు జ్ఞానిగా, తత్వవేత్తలకు తాత్వికునిగా, సర్వమానవులకు సమానత్వ వేత్తగా కీర్తించబడినాడు.

సమసమాజంలో జరుగుతున్న మూఢనమ్మకాల్ని ఖండించాడు. తన కాలాన్ని కంటే ముందుచూపుతో చూడగలిగిన ద్రష్ట వేమన. తాను చెప్పదలచుకున్నది ప్రజల భాషలో నూటిగాను, నంక్షిప్తంగాను, సరసోక్తంగాను, వ్యంగ్యంగానో, హాస్యంగాను, లోకోక్తిగాను, సామెతగానో తేట తెలియపరిచినాడు. తన కాలపు చట్రంతో ఇమడని గొప్ప కవి మన వేమన.

వేమన గురించి మొదట అబేదుబాయ్ నుంచి ఆరుద్ర వరకు నేటి కాలపు ఎందరో కవులకు, ఇతరులకు ఆదర్శం. శ్రమ శక్తిలోనే అనంత సర్వమున్నదని, నిశితమైన పరిశీలన చేసిన విధానంలోనే తెలుస్తుంది. మన వేమన మామూలు సాదా సీదా కవి కాడని, ముందు చూపున్న మహా మనీషిగా చెప్పవచ్చు. ఇలా ఆదర్శ సమాజ నిర్మాణం కోసం వేమన పాత్ర ఎంతగానో కనిపిస్తుందని చెప్పవచ్చు.

చదువులందు పాడి మొదవులందును స్త్రీల
పెదవులందు రాజ్య పదవులందు
ఆశలుడిగినట్టి అయ్యలు ముక్తులు
విశ్వదాభి రామ వినుర వేమ! -

అంటూ వ్యక్తిగత వ్యామోహాలు ఏ విధంగాను ఉపయోగపడవని వేమన అంటాడు.

పాండిత్య ప్రకర్ష కోసం గాని, పేరు కోసం కానీ, చదివే శుష్కవిద్యలు కాని, సంపద కోసం పెంచుకొనే ఆల మందలు కాని, స్త్రీల కోసం వ్యసనాలు, అధికార కాంక్షలు, ఆశలుగల ఇటువంటి వారు బంధీలే కాని ముక్తులు కారు అని వేమన అంటాడు.

చదువులు నలుగురికి ఉపయోగపడే చదువులే నిజమైన చదువులు అంటారు. సంపద ఒక్కడికే పెరిగే సంపద, అది సంపదే కాదు. స్త్రీలు కాంక్ష కుటుంబంతో

సాగాలి. కాని ఇతరులతో కాదని పలికారు. అధికారం ప్రజలకు సేవ చేయడానికే గాని, తన స్వార్థప్రయోజనాల కోసం కాకూడదు అంటారు. ఆదర్శ సమాజ నిర్మాణంకు పూనుకోవాలని వేమన పై పద్యంలో తెలియజేశారు.

కుండ కుంభమండ్రు కొండ పర్వతమండ్రు
ఉప్పు లవణమండ్రు ఒకటిగాదె
భాషలింతెవేరు పరతత్వ మొక్కటి
విశ్వదాభి రామ వినుర వేమ! -

అంటూ తెలుగులో అన్న సంస్కృతంలో అన్న పదం యొక్క అర్థం ఒక్కటే, ప్రయోజనం ఒక్కటే అని వేమన అంటున్నాడు. అనవసరమైన మాటలు పట్టుకొని వ్రేలాడటం వ్యర్థం అంటాడు.

భాషల్లో ఎక్కువ భాష, తక్కువ భాష, మంచి భాష, చెడ్డ భాషలంటూ ఉండవనీ, అన్నీ భాషలు మానవ భావ వ్యక్తీకరణకు వాహకాలే అని శాస్త్రీయ దృక్పథంతో చెప్పారు.

తెలుగులోను, సంస్కృతంలోను 'సత్యం' పలికితే, అది సత్యమే అవుతుంది. కాని కొందరు పండితులు హెచ్చైన భాషలో చెపితేనే, అది 'సత్యం' అనే వారి కోసం వేమన ఈ పలుకులు పలికినాడు. ఇలాంటివారు అనాడు కూడా ఉండి ఉండవచ్చు. అందుకే వేమన సామాన్య ప్రజల భాష తాత్వికుడు అయినాడు. ఎంతటి తత్వ రహస్యాలనైనా ప్రజల భాషలోనే చెప్పాలనేవాడు. భాషలు ఏవైనా భావం ఒక్కటే అని వేమన వాదం. ఇక్కడ కూడా ఆదర్శ సమాజ నిర్మాణంలో గొప్ప తక్కువ అనేది ఉండకూడదు అనే కరాఖండిగా చెప్పాడు.

వెలయభూమి తల్లి విత్తనమటు తండ్రి
పంటలరయ సుతులు పాడి పరము
ధర్మము తన పాలి దైవము సిద్ధము
విశ్వదాభి రామ వినుర వేమ! -

అంటూ భూమి తల్లి లాంటిదైతే, బీజం వేసేవాడు తండ్రి. దాని ఫలితంగా పుట్టిన పంటలు సంతానం అంటాడు. తాను పండించే వ్యవసాయమే దేవుడు అని, ఆ ధర్మం తన ఎదుటే కనిపిస్తుంది.

ఆది నుంచి వ్యవసాయ సమాజంలో భూమిని స్త్రీగాను, తల్లిగాను, ఆకాశాన్ని తండ్రిగాను భావించే ఆచారం ఉంది. భూమి పంటలను కంటుంది. ఆకాశం వర్షం కురిపించి విత్తనాలను మొలకెత్తిస్తాడు. కాబట్టి ఆకాశం తండ్రిగా, పండే పంటలే పిల్లలుగా, ఆ పంటలను తిని బతికే మనమూ భూమి పిల్లలమే అంటాడు.

భూమిని నమ్ముకున్న వారికి 'కృషియే ధర్మం', 'ప్రత్యక్ష దైవం' అంటాడు. 'భూములిచ్చినట్లు భూపతులీయగలరా?' అని వేమన ప్రభువుల గురించి తెలియజేశాడు. ఇందులో ఆదర్శ సమాజ నిర్మాణంలో భూమి తల్లిగా, ఆకాశంను తండ్రిగా పోషణ పిల్లలుగా ఎంతగానో తాత్విక దృష్టితో రైతు లేకపోతే జీవనం ఉండదు. మనిషి జీవితం అసలే ఉండదని తెలియపరిచాడు.

అరయ తరచు కల్లలాడెడు వారిండ్ల
వెడల కేల లక్ష్మి విశ్రమించు
ఓటికుండ నీరు వోసిన చందాన
విశ్వదాభి రామ వినుర వేమ!

అంటే కలిమి కలిగిన వానికి కరుణ కూడా ఉండాలి అంటాడు వేమన.

ఆర్థిని 'రేపురా మాపురా' అని తిప్పించుకొనేవాడు. ఇనుప పెట్టెలో డబ్బులున్నా ఎప్పుడూ లేదు, లేదంటూ అపద్ధాలు ఆడేవారు, బీద అరుపులు అరిచేవారు నిజంగానే దరిద్రులు అని వేమన అన్నాడు.

అది ఎట్లా అంటే ఓటు కుండలో నీరు పోసిన నీళ్ళు నిలువనట్లే, కల్ల పలికే వారి ఇంట్లో లక్ష్మినివాసం ఉండదు అంటారు. ఆదర్శ సమాజ నిర్మాణంలో 'సిరికి' ఇంటి ఉన్న లేనట్లుగా, వ్యవహరిస్తున్న పిసనార్ల జీవితాల్లో శ్రీలక్ష్మీ కటాక్షం ఉండదని వేమన పేర్కొన్నారు.

చిప్పలోనబడ్డ చినుకు ముత్యంబాయె
నీళ్ళబడ్డ చినుకు నీళ్ళ గలసె

ప్రాప్తము గల చోట ఫలమేల తప్పునో
విశ్వదాభి రామ వినుర వేమ!

అంటూ వేమన స్వాతి చినుకులు కోటాను కోట్లు కురుస్తూ ఉంటాయి. కాని ముత్యపు చిప్పలో పడ్డ ఒక్క చినుకు మాత్రమే ముత్యమౌతుంది. మిగిలిన వన్నీ అపారజల రాశిలో జలమై కలసి వ్యర్థమౌతాయి. వచ్చిన మంచి అవకాశం వినియోగించుకుంటే మంచి ఫలితాలే వస్తాయి అంటాడు వేమన.

ఏ కార్యానికైనా దేశకాల పరిస్థితిని బట్టి ప్రాధాన్యత అప్రాధాన్యతలు ఉంటాయని వేమన పలికాడు. ఇందులో ఆదర్శ సమాజ నిర్మాణంలో ప్రాప్తం ఉంటే అదే నువ్వు ఎక్కడ ఉన్నా, నిన్నే వెతుక్కొని వస్తుందని వేమన వాదం. ఫలితం అనేది తప్పకుండా వస్తుందని వేమన అంటాడు.

అంకి లెరిగి మాటలాడ నేర్చినపుడె
పిన్న పెద్దతనము లెన్న నేల
పిన్న చేతి దివ్వె పెద్దగా వెలగదా
విశ్వదాభి రామ వినుర వేమ। - అంటూ

కష్టాలు ముందే గుర్తించిన వ్యక్తి మాట, చింతలు తీర్చి ఒక మంచిమాట చిన్నవాడు పల్కిన తప్పు లేదు అంటాడు. వయసుతో సంబంధం లేదు. పసివాని చేతిలో ఉన్న దీపం పెద్ద వెలుగు నివ్వదా! వెలుగు నిస్తుందని వేమన ప్రశ్నించాడు.

తనకు తెలిసిన తెలివి, తెలియజేయటానికి చిన్న, పెద్ద అని లెక్కలు కట్టవలసిన అవసరం లేదు. సమయ మెరిగా మాట్లాడువాడు, సందర్భానికి తగినట్లు మెరుపులా ఆలోచించేవాడు, యువకుడైనా, వృద్ధుడైనా ఒక్కటే అని అంటాడు.

సందర్భమెరిగి మాట్లాడువాడు నేర్పరి. కాని ఇది వయస్సుతో వచ్చేది కాదని, తెలివితేటల వల్ల వస్తుందని వేమన భావం.

ఇక్కడ మాట్లాడేవాడు చిన్నవాడా పెద్దవాడా అని కాదు. చిన్నవాడైనా అతని మాటల్ని చిన్నతనం చేసి చూడరాదని వేమన హెచ్చరిక చేస్తున్నాడు. ఆదర్శ సమాజ నిర్మాణంలో ఆటంకాలు, చింతల నుంచి తప్పించినవాడే నిజమైన తెలివైనవాడని వేమన తెలియజేశాడు.

❖❖❖

ఆదర్శ సమాజ దార్శనికుడు - వీరేశలింగం పంతులు గారు

- అంకే మదనమోహన, తెలుగు అధ్యాపకుడు, ప్రభుత్వ కళాశాల(స్వయం), అనంతపురం.

తెలుగు జాతి నవయుగ వైతాళికుడు, సంఘసంస్కర్త ,బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన కందుకూరి వీరేశలింగం పంతులు గారి గురించి పరిశీలించడం అంటే 19వ శతాబ్దపు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, విద్యా సంబంధ మైన పరిస్థితుల్ని స్కానింగ్ చేయడమే అని నా అభిప్రాయం. ఎందుకంటే వీరేశలింగంగారు పుట్టడానికి ముందే భారతదేశంలో ముఖ్యంగా తెలుగు ప్రాంతంలో పాశ్చాత్య సాహిత్య ప్రభావం, నూతన ఆంగ్ల విద్యా విధానం, క్రైస్తవ మిషనరీల మరియు పాఠశాలల స్థాపన వంటి అనేక మార్పులకు మూల కారణమైంది . అలాంటి తరుణంలో జన్మించిన కందుకూరి వారు స్త్రీ విద్యకై ఉద్యమించి పాఠశాలలు స్థాపించడమే కాకుండా కులా లకు అతీతంగా సహ విద్యా విధానాన్ని (Co-education) ప్రవేశపెట్టాడు. అలాగే బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు (కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక ఇబ్బందులు పడే స్త్రీల జీవితం) గుర్తించి వితంతు పునర్వివాహం జరిపించాలని ప్రచారం చేయడమే కాకుండా, ఆచరణలో పెట్టారు కూడా . అలాంటి కందుకూరి వారి వ్యక్తిగత జీవితం ,సంఘ సంస్కర్తగా తాను చేసిన సేవలు ,వితంతు పునర్వి వాహాలు, సాహిత్యం మరియు పత్రికా రంగంలో చేసిన విశిష్ట సేవలు గురించి ఈ సందర్భంగా తెలియ జేస్తున్నాను.

కందుకూరి వారి వ్యక్తిగత జీవితం :

1848 ఏప్రిల్ 16న సుబ్బరాయుడు పున్నమ్మ దంపతు లకు రాజమండ్రిలో జన్మించారు. నాలుగు సంవత్సరాల వయసులోనే తండ్రిని పోగొట్టుకున్న వీరేశలింగం గారు పెదనాన్న సహాయం తో విద్యాభ్యాసం కొనసాగించారు విద్యార్థి దశ నుండే వీరికి పద్య రచన పై ఆసక్తి ఉండటం చేత గోపాల శతకం, మార్కండేయశతకం రచించారు.

వీరేశలింగం గారు చదువుకునే రోజుల్లోనే కేశవ చంద్ర సేన్ రాసిన పుస్తకాలు చదివి ప్రభావితుడయ్యాడు విగ్రహారాధన, పూజలు మొదలైన వాటి మీద నమ్మకం తగ్గడమే కాకుండా దయ్యాలు, భూతాలు లేవనే అభి ప్రాయానికి వచ్చాడు. అంతేకాదు ప్రజలు దాన్ని నమ్మడా నికి అర్ధరాత్రి శ్మశానానికి వెళ్ళి వచ్చేవాడు. తన 13వ ఏట 8 సంవత్సరాల కందుకూరి రాజ్యలక్ష్మమ్మ గారితో బాల్య వివాహం జరిగింది. పెరిగి పెద్దయ్యాక వీరేశలింగం గారు ఇలాంటి దురాచారాలు నిర్మూ లించడానికి కృషి చేశారు .1867 సంవత్సరంలోపెదనాన్న చనిపోవడంతో ఏదైనా ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలని ప్రయత్నం చేశాడు. అయితే లంచం ఇవ్వనిదే ప్రభుత్వ ఉద్యోగం రాదని ప్రయత్నం మానుకున్నాడు. తరువాత న్యాయవాద వృత్తిని ఎంచుకుందామని భావించి ఆ వృత్తిలో రాణించాలంటే తప్పనిసరి అయిన అవినీతి, అబద్ధం వంటి కారణాలతో ఆ రెంటినీ కాదని పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించడం జరిగింది దాదాపుగా 25 సంవత్సరాలు రాజమండ్రిలోనూ, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఐదు సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు.

కందుకూరివారు సమాజంలో ఉన్నటువంటి అనేక దురాచారాలపై తన భావాలను వ్యాప్తి చెయ్యడానికి ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలతో పాటు సంఘ సంస్కరణ భావాలను బోధించాడు. 1874 లో వివేకవర్ధని అనే పత్రికను ప్రారంభించాడు.మొదటి సంచికలోనే" సంఘం లోని అవకతవకలను ఎత్తిచూపడం, దురాచారాల నిర్మూలన, ప్రభుత్వ వ్యవస్థలో ఉన్న అవినీతిని ఎత్తి చూపి, అవినీతిపరుల్ని సంఘం ముందు నిలబెట్టడం

వివేకవర్ధిని లక్ష్యాలని తెలిపారు. అదేవిధంగా సంఘ సంస్కరణ భావజాలంతో ఆంధ్ర దేశంలో యువతలో మార్పు తీసుకురావడానికి బ్రహ్మసమాజం,హితకారిణీ సమాజాలను ఏర్పాటుచేసి తన యావత్ ఆస్తిని ఇచ్చే శాడు. అదే విధంగా సమాజంలో మార్పు కోసం అనేక గ్రంథాలు అనేక ప్రక్రియల్లో రచనలు చేసి యుగకర్త గా ప్రసిద్ధి పొందిన వీరు "గద్య తిక్కన" అనే బిరుదు కూడా పొందడం జరిగింది. ఈ విధంగా వీరేశలింగం గారు పగలు సంఘసంస్కరణల విషయాల్లో పని చేసి, రాత్రి గ్రంథ రచనలు సాగించేవారని ఆరోజుల్లో చెప్పుకొనేవారు. తాను ఆశించిన ఆదర్శ సమాజ నిర్మాణానికి తాను నమ్మిన సిద్ధాంతాన్ని, సత్యాన్ని తు.చ తప్పకుండా పాటిం చిన వీరేశలింగం పంతులుగారు ఆంధ్ర సమాజాన్ని సంఘ సంస్కరణ బాట పట్టించి, సాహిత్యంలో నూతన ప్రక్రియ లకు నాంది ప్రస్తావన గావించిన వీరు 1919 మే 27న మరణించారు .

సంఘ సంస్కర్తగా వీరేశలింగం పంతులు గారు:

పాశ్చాత్య నాగరికత, సంస్కృతి ,సాహిత్య ప్రభావం చేత భారత దేశంలో వచ్చిన పెను మార్పులు ఆంధ్ర దేశంలో కూడా కొనసాగాయి. ప్రధానంగా స్త్రీవిద్య వితంతు పునర్వివాహ ఆవశ్యకత ,స్త్రీజనోద్ధరణ వంటి విషయాలలో తిరుగులేని పోరాట యోధునిగా కందుకూరి వారిని మార్చడం జరిగింది. వీరేశలింగంగారు స్వతహాగా హేతువాది. విగ్రహారాధన, పూజలుచేయడం పై వ్యతి రేకత పెంచుకున్నాడు అదేవిధంగా ఆనాటి సమాజంలో నెలకొన్న సాంఘిక దురాచారాలైన బాల్యవివాహాలు, ప్రబంధ యుగాలనాటి వేశ్యా వృత్తిని సైతం వ్యతిరేకిస్తూ వివేకవర్ధిని పత్రికలో వ్యాసాలు కూడా రాశారు . ఆయన ఉపాధ్యాయుడుగా విద్యార్థులను హేతువాద దృష్టి లో నడిపించడమే కాకుండా సంఘ సంస్కరణ భావజాలం నింపడం జరిగింది అందులో భాగంగానే పత్రికల స్థాపన ఆయా పత్రికల్లో సంఘంలోని అవకతవకలు ఎత్తి చూపడం, ప్రభుత్వ వ్యవస్థల్లో జరుగుతున్న అవినీతిని సామాన్యునికి తెలియజెప్పడం, సాంఘిక దురాచారాలను నిరసించడం ప్రధాన లక్ష్యంగా చేసుకోవడం జరిగింది. అలాగే స్త్రీవిద్య ప్రాధాన్యతను గుర్తించి బాలికల పాఠశాల ఏర్పాటు చేయడమే కాకుండా సహ విద్యా విధానాన్ని (బాలబాలికలకు కలిపి) ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే కులాలకు అతీతంగా అనేక మందిని విద్యా వంతులను చేయడం జరిగింది.

కందుకూరి వారు చేసిన అన్ని సంస్కరణ కార్య క్రమాలు ఒక ఎత్తు, వితంతు పునర్వివాహాలు ఒక ఎత్తు. ఆనాటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయడం కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి వితంతువులై స్త్రీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని ప్రచారం చేసాడు. 1881 డిసెంబరు 11న తమ ఇంట్లో మొట్టమొదటి వితంతు వివాహం జరిపించారు తొమ్మిదేళ్ళ బాల వితంతువు "గౌరమ్మ"కు తిరువూరు తాలూకా రేపూడి కి చెందిన వరుడు "గోగులపాటి శ్రీరాములు" కు వివాహం జరి పించడం జరిగింది అయితే ఆ పెళ్లికి వెళ్లిన వాళ్లందరికీ నాటి సమాజం వెలివేసింది. ఒక దశలో తన ఇంట్లో పనిచేసే వంటవాళ్ళు, నీళ్ళ వాళ్ళు ఇంటికి రావడానికి నిరాకరించారు. ఆ సమయంలో తన భార్య రాజ్యలక్ష్మమ్మ స్వయంగా గోదావరికి వెళ్ళి నీళ్ళు తెచ్చి పెళ్ళివారికి వంట చేసిపెట్టి, తన సహకారం అందించింది. తాను దాదాపుగా 40 వితంతు వివాహాలు జరిపించడంలో తన విద్యార్థు లతో పాటు భార్య రాజ్యలక్ష్మమ్మ, పైడా రామకృష్ణయ్య, లక్ష్మీ నరసింహం, బసవరాజు గవర్రాజు వంటి మిత్రులు తనకు అండగా ఉండటం గమనార్హం. (ఏ కాలాల్లోనైనా మంచిని తలపెట్టినవుడు విమర్శించే వాళ్ళు, ప్రోత్సహించేవారు ఉండటం సహజం)

చిన్ననాటి నుండి వీరేశలింగం వారికి కార్యదీక్ష, సాహసం, హేతువాద దృష్టి తెలుసుకోవాలనే తపన ఎక్కువ. రాజా రామ్మోహన్ రాయ్, దేవేంద్రనాథ్ ఠాగూర్,

కేశవ చంద్ర సేన్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌ల రచనలు ఇతని ఆలోచనల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసు కొచ్చాయి.1887 సంవత్సరంలో సంఘసంస్కరణ సమాజాన్ని స్థాపించి, మతం ముసుగులో అధోగతిలో ఉన్న హైందవ సమాజం లోని దురాచారాలపై విప్లవాన్ని ప్రారంభించారు. మూఢ విశ్వాసాలు సనాతన ఆచారాలపై ఆయన పోరాటం జరిపారు.

తాను సమాజానికి చెప్పాలనుకున్న అనేక విషయాల్ని తన పత్రికలలో వ్యాసాల రూపంలోనూ, సంపాదకీయాల రూపంలోనూ ఎప్పటికప్పుడు వివరిస్తూనే వచ్చారు.. స్త్రీ విద్యావంతురాలైతే సమస్త మానవాళి చైతన్య వంత మవుతుందన్న ఆశయంతో కందుకూరి వారు వివిధ సాహిత్య ప్రక్రియల్లో స్త్రీ చైతన్యాన్ని కోరుతూ రచనలు చేయడం జరిగింది..

నదులు, కవులు భూగోళపు రక్తనాళాలు
నదులు కంటున్న కలలు పొలాల్లో ఫలిస్తాయి
కవులు కంటున్న కలలు మనుషుల్లో ఫలిస్తాయి
అంటారు . ..

- శేషేంద్ర గారు.

నాడు కందుకూరి లాంటి వారు ఆశించిన ఆదర్శ సమాజ నిర్మాణం నేడు అన్ని రంగాలలోనూ కన్పిస్తోంది.. మహిళలు ఆకాశంలో సగమే కాదు అంతరిక్షంలోకి సైతం పురుషులతో సమానంగా పయనిస్తుండటం, గర్వించదగ్గ విషయం..

సాహిత్యపరంగా వీరేశలింగం గారి కృషి :

పాశ్చాత్య సాహిత్య ప్రభావం చేత తెలుగు సాహిత్యంలో అనేక నూతన ప్రక్రియలు ప్రారంభ మయ్యాయి అందులో ప్రధానంగా కవిత్వం, నవల, నాటకం, కథ, స్వీయ చరిత్ర, జీవితచరిత్ర, వ్యాసం మొదలైన ప్రక్రియలు కందుకూరి వారిని సంఘ సంస్కర్తగా, సాహితీవేత్తగా నిలబడడానికి అవకాశం కల్పించాయి. అనేక ప్రక్రియలకు తెలుగు సాహిత్యంలో ఆయనే ఆద్యులు. ఆ విషయాన్ని తన స్వీయ చరిత్రలో "మొదటి ప్రకృతి శాస్త్రం నేనే రచించితిని, మొదటి ప్రహసనము నేనే రాసితిని, మొదటి చరిత్రమును నేనే విరచించితిని, స్త్రీలకు మొదటి వచన పుస్తకము నేనే కావించితిని" అన్నారు వీరేశలింగంగారికి మొదట పద్యరచన పై ఆసక్తి ఉన్నప్పటికీ "సమాజానికి పద్యకావ్యం కంటే వచన కావ్యం రాయడం ఎంతో శ్రేయస్కరం" అన్నారు. అలాగే వ్యవహారిక భాష ప్రయోజనాన్ని ఆనాడే గుర్తించిన వ్యక్తి కందుకూరి వారు. తెలుగు, సంస్కృతం, ఆంగ్ల భాషలలో ప్రతిభ కలిగిన కందుకూరి వారు దాదాపుగా 130కి పైగా గ్రంథాలు రాశారు . ఆంగ్లము మరియు సంస్కృత గ్రంధాలను తెలుగులోకి అనువదిం చారు. విద్యార్థుల కొరకు వాచకాలు రాసాడు. స్వీయ చరిత్ర రాశాడు. ఆంధ్ర కవుల చరిత్రను కూడా ప్రచు రించాడు నీతిచంద్రిక (తెలుగు పంచతంత్రం) లోని సంధి విగ్రహం భాగాలను చిన్నయసూరి వదిలివేయగా వీరేశలింగం పూర్తి చేశారు..

పద్య కావ్యాలు :

మార్కండేయ శతకం, గోపాల శతకమని టివి కందుకూరి వారు తొలిదశలో రాసిన రచనలు తర్వాత అనే కావ్యం శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం అనే మూడు ఆశ్వాసాల నలచరిత్ర కావ్యం. దీని ప్రత్యేకత ఏమంటే శుద్ధాంధ్రము, నిరోష్ఠ్యము, నిర్వచనము అనే మూడు నియమాలకు కట్టుబడి రాయడం గొప్ప సాహసమే. ఆ తరువాత రసికజన రంజనం అనే ప్రబంధం చిత్ర కవిత్వం శృంగారం ప్రధానంగా ఉంటాయి. అభాగ్యో పాఖ్యానం హేళన పూర్వకమైన సంఘ సంస్కార దృష్టితో కూడిన వ్యంగ్య కావ్యం. సరస్వతి నారద విలాపం పద్యాత్మకమైన వ్యంగ్య ప్రహసనం భాషా పరంగా కందుకూరి దృక్పథంలో వచ్చిన మార్పును ఈ కావ్యంలో చూడవచ్చు. అర్థ సామరస్యం లేని ఊహలతో పాండిత్య ప్రకర్షతో ఇటు సరస్వతిని అటు నారదుని అవమానిస్తున్నా రని ఇందులో వ్యంగ్యంగా చమత్కరించారు.. పథిక విలాసం అనే పేరుతో ఆంగ్లంలో ఆలివర్ గోల్డ్ స్మిత్

వ్రాసిన ది ట్రావెలర్ కావ్యానికి తెలుగు సేత. వీటితో పాటుగా నీతి పద్యాలు స్త్రీ నిధి దీపిక మొదలైన పద్య కావ్యాలు రచించారు.

నాటకాలు :

కందుకూరి వారు పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఆధునిక నాటకాల రచన మొదలు పెట్టారు అని చెప్పవచ్చు ఆధునిక తెలుగు సాహిత్యంలో కందుకూరి వారు మొట్టమొదటగా ''వ్యవహార ధర్మబోధిని ''అనే నాటకాన్ని రచన చేసి, దర్శకత్వం వహించి తన విద్యార్థులతో ప్రదర్శింప చేశారు. అందుకే ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త తొలి దర్శకుడు తొలి ప్రదర్శన కారుడైన కందుకూరి వారి జన్మదినాన్ని (ఏప్రిల్ 16వ తేదీని) తెలుగు నాటక రంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది.. అంతేకాకుండా షేక్స్పియర్ నాటక మైన ''కామెడీ ఆఫ్ ఎర్రర్స్''ను చమత్కార రత్నావళి అనే పేరుతో ద్విపదలో రచనచే, వివేకవర్ధనిలో ప్రచురించడమే కాక విద్యార్థులచేత ప్రదర్శింప చేశాడు .అలాగే కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్నిమిత్రం శ్రీ హర్షుని రత్నావళి, దక్షిణ గోగ్రహణం, సత్య హరిచంద్ర, వంటి 12 నాటకాలు అనువాదం లేదా స్వతంత్ర రచన చేయడం జరిగింది.

నవలలు :

కందుకూరి వారు రచించిన తొలి తెలుగు సాంఘిక నవల ''రాజశేఖర చరిత్రము'' .ఇది ఆంగ్లంలో ఆలివర్ గోల్డ్స్మిత్ వ్రాసిన ''వికార్ ఆఫ్ వేక్ఫీల్డ్ ''అనే నవలకూ కొన్ని పోలికలు ఉన్న మాట వాస్తవమే కానీ ఇది అనువాదం కాని అనుకరణ కాదని వీరేశలింగం గారు చెప్పడం జరిగింది ఇందులో రచయిత సాంఘిక దురాచారాలను మూఢ నమ్మకాలను విమర్శించాడు చక్కని తెలుగు సామెతలను లోకోక్తులు ప్రయోగించి ముందుతరం నవలాకారులకు మార్గదర్శకంగా నిలిచాడు అని చెప్పవచ్చు. తరువాత ''సత్యరాజు పూర్వ దేశ యాత్రలు'' అనేది ఆంగ్లంలో జోనాథన్ స్విఫ్ట్ వ్రాసిన ''గలివర్ ట్రావెల్స్'' అనే గ్రంథం ఆధారంగా రాశాడు ఇందులో సమాజపు వికృత సంఘటనలను అవహేళన చేయడం జరిగింది. తరువాత ''సత్యవతీ చరిత్రము'' అనేది స్త్రీ విద్య ప్రాముఖ్యతను బోధించే నవల. చంద్రమతీ చరిత్రము అనే నవలలో స్త్రీ విద్య ఆవశ్యకత తెలియజేస్తూ చంద్రమతి దేవి తల్లి సునంద విద్యావంతురాలై ఆమె కుమార్తె ని విద్యావంతురాలిగా చేసింది. ఉనీనర మహారాజు ఆస్థానంలో ఒకనాడు ఒక పండితుడు ఉపన్యసిస్తూ స్త్రీలకు కూడా విద్య చాలా అవసరం అని చెప్పాడు . విద్యా సముద్రుడు అనే గురువు చంద్రమతికి అనేక విద్యలు నేర్పిస్తాడు భగవంతుని సృష్టిని గురించి, ధర్మమార్గాన్ని గురించి, మానవ సుగుణ సంపద గురించి, శారీరక ఆరోగ్య ఆవశ్యకత గురించి, గృహస్థ ధర్మం గురించి, జీవ కారుణ్యం గురించి ఇలా అనేక విషయాలు ఇందులో బోధిస్తాడు. ఈ విధంగా కందుకూరి వారు గ్రంథ రచనలో సందర్భాన్ని సృష్టించుకొని మరి స్త్రీ విద్యను, స్త్రీ చైతన్యాన్ని ప్రోత్సహించడం జరిగింది.

ప్రహసనాలు :

సాంఘిక దురాచారాలను సంభాషణాత్మకంగా వినోదాత్మకంగా విమర్శించే అటువంటి ప్రయోగానికి ఆద్యులు వీరేశలింగం పంతులు గారు. వీరు ప్రహసనాలను ''వివేకవర్ధిని ''పత్రికలో ప్రచురించారు. ''ప్రహసనము ఆయన కరములకు ఉచిత పరికరమయ్యెను. శైలి సొంపులతోను హాస్యపు దళులతోనూ శోభిల్లెడి ఈ ప్రహసనావళియందు దుష్టాంగము ను ఖండించి శేషాంగ స్ఫూర్తికి రక్షణ చేయు శస్త్ర చికిత్సకునివలె రచయిత సాంఘిక అనర్థములను దునుమాడెను ''అని ''రాయసం వెంకట శివుడు ''ప్రశంసించాడు. కందుకూరి వారు దాదాపు 50కి పైగా వ్రాసిన ప్రహసనాలలో కొన్ని అనువాదాలు మరికొన్ని స్వతంత్ర రచనలు. వీటన్నిటిని ''హాస్య సంజీవని'' పేరుతో మూడు భాగాలుగా ముద్రించ బడ్డాయి. పెళ్లి వెళ్ళిన తర్వాత పెద్ద పెళ్లి (లోకోత్తర

వివాహం). వేశ్యాభిమానం, చాదస్తపు ఆచారాలు, శాఖా భేదాలు, అజ్ఞానం, అమాయకత్వం స్వార్థం వంటి అంశాలు కలగలిసి ఉండేవి. జమా బందీ, యోగా భ్యాసము, చంద్రగ్రహణం, తేలు మందు, హిందూ మహాసభ, బహుభార్యత్వం, కామరూప ప్రహసనం, కలిపురుష శనైశ్చర విలాసం ,వేశ్య ప్రియ ప్రహసనం, విచిత్ర వివాహ ప్రహసనం మొదలయినవి వీరు రచన చేయడం జరిగింది..

కందుకూరి వారు స్త్రీల అభ్యుదయాన్ని ప్రోత్సహించే విధంగా కథలు కూడా రాశారు కొన్ని ఆంగ్లం నుండి అనువాదం చేయబడ్డవి. ఎక్కువగా స్వతంత్ర రచనలే కథలు ఎక్కువగా "సతీహిత బోధిని" అనే పత్రికలో ప్రచురించడం జరిగింది అదేవిధంగా కందుకూరి వారు అనేక వ్యాసాలు, ఉపన్యాసాలు కూడా రాయడం జరిగింది వాటిని వివేకవర్ధిని, సతీహిత బోధిని, చింతా మణి, సత్య సంవర్ధిని, తెలుగు జనానా అనే పత్రికలలో ప్రచురించారు. ఆంధ్ర వాంగ్మయ చరిత్రలో సమగ్రమైన పరిశోధనాత్మకమైన, ప్రణాళికా బద్ధమైన కవుల చరిత్ర కందుకూరి వారిదే ఆంధ్ర కవుల చరిత్రము. అదేవిధంగా వీరు వ్రాసిన స్వీయ చరిత్ర కొమర్రాజు వెంకట లక్ష్మణ రావు గారు విజ్ఞాన చంద్రికా గ్రంథమాల ద్వారా ప్రచురించడం జరిగింది ఇది ఆనాటి సమాజాన్ని చిత్రించే రచనగా చెప్పవచ్చు.

పత్రికా రంగంలో కందుకూరి వారి కృషి :

"పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు పత్రికొక్కటున్న మిత్ర కోటి ..." అన్న నార్ల వెంకటేశ్వరరావు గారి మాటల్ని సార్ధకం చేస్తూ సాంఘిక దురాచారాల్ని తొలగించాలన్నా, సమాజంలో మార్పు తీసుకురావాలన్నా పత్రికే వజ్రాయుధం అని భావించి, 1874 లో వివేకవర్ధిని పత్రిక ప్రారంభించారు. తర్వాత సతీహిత బోధిని సత్య సంవర్ధిని సత్యదూత చింతామణి తెలుగు జనానా వంటి పత్రికల్లో తన సాహిత్యాన్ని ప్రచురించడమే కాకుండా కథలు, వ్యాసాలు సంపాదకీయాలు లాంటి అనేక ప్రక్రియలలో ప్రధానంగా స్త్రీల అభ్యున్నతికి ఉపయోగపడే వివిధ అంశాల్ని ఆయా పత్రికల్లో ప్రచురించేవారు.

కందుకూరి వారు అనేక విశిష్టతలు తనలో నింపుకున్న మహామనీషి ఎందుకంటే మొట్టమొదటి వితంతు వివాహం జరిపించిన వ్యక్తి, మొట్టమొదటి సహవిద్యా పాఠశాలను ప్రారంభించిన వ్యక్తి, తెలుగులో మొదటి స్వీయ చరిత్ర ఆయనదే, తెలుగులో తొలి నవల రాసింది ఆయనే, తెలుగులో తొలి ప్రహసనం రాసింది కందుకూరి వారే అదేవిధంగా తెలుగు నాటకరంగంలో తొలి నాటకాన్ని రచించి, ప్రదర్శించిన వారు కూడా వారే. ఇంతటి ఘనకీర్తి ఘటించి గతించిన కందుకూరి వారి గురించి ఆయన అనుయాయి, తనకుతాను శిష్యురాలుగా భావించి,గురువు గారికి చివరి దశలో శుశ్రూష చేసిన కొటికలపూడి సీతమ్మ గారు ఒక సీస పద్యం లో వారి యొక్క బహుముఖ ప్రజ్ఞను వివరించారు.

ఒక యెడ స్త్రీ పునర్వివాహమును గూర్చి
వాదించు పండిత వరుల తోడ,
సరగ నింకొక దెస సంఘ సంస్కరణ చే
చెలగు సభనుపన్యసించుచుండ,
పఱగ వేరొక దెస పత్రికా ప్రకటన
భారం వహించు ప్రజ్ఞ మీర,
రహినొక్క తరి గ్రంథ రచనా విశేషంబు
నను దెల్పు జనుల దుర్జయములెల్ల,
నొక నిమిషమైన విశ్రాంతినొందక
పరహితార్థంబు కొరకునై పాటుపడుచు
కాలమెంతయోవిలువగా గడుపునహహ
ఘనుడు వీరేశలింగాఖ్య కవి వరుండు

పైపద్యంలో చెప్పినట్టు కందుకూరి వారు ఆదర్శ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడిగా, సంఘ సంస్కర్తగా, కవిగా/ రచయితగా ,పాత్రికేయుడిగా బహు గ్రంథకర్తగా విశేష కృషి సల్పిన నవయుగ వైతాళికుడు, తెలుగు జాతి జీవించి ఉన్నంత కాలం ఆయన ప్రాతఃస్మరణీయులు. ❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో సాహిత్యం తెలుగు ప్రాధాన్యత

- కాలర్తి స్వరాజ్యం, పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం

ఒకరిగా బతికితే వ్యక్తులం మాత్రమే, ఒకటిగా బతికితే శక్తులం అవుతామనేది జగమెరిగిన సత్యం. మనిషి ఎంత దూరం ప్రయాణం చేసిన శక్తిగా మారినపుడే గమ్యం చేరగలడు, లక్ష్యం సాధించగలడు. అందరం కలిసి ఒక్కటిగా జీవించేదే సమాజం. ఒక కుటుంబం ఎదగాలంటే కుటుంబంలో అందరూ కలిసికట్టుగా పని చేయలి అప్పుడే ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది. అదే విధంగా ఒక సమాజం అభివృద్ధి చెందాలంటే సమాజంలోని ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతను నిర్వహించాలి.

నేడు అనేక దేశాలు అభివృద్ధి చెందాయంటే కారణం సమాజంలోని వ్యక్తులే.భారతదేశం కూడా నేడు అభివృద్ధి పథంలో సాగుతుందంటే కారణం ఆధునికతను సంతరించుకువడమేనని చెప్పవచ్చు. ప్రాచీన కాలం మానవుని ఆలోచనలు, నేటి కాలపు వ్యక్తుల ఆలోచనలకు ఎంతో వైవిధ్యం ఏర్పడింది. ఒకనాడు ఎడ్ల బండిలో ప్రయాణించే వారు, నేడు హెలికాప్టర్లో ప్రయాణం చేస్తున్నారంటే ఎంతగా అభివృద్ధిచెందామో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

ఒక సమాజం అభివృద్ధి చెందడానికి ఏ ఒక్కరి కృషి మాత్రమే సరిపోదు దానికి అందరి సహకారం కావాలి, అన్ని రంగాల్లో మార్పు రావాలి. రాజకీయ, ఆర్థిక, సామంజిక, సాంఘికసాహిత్య వైద్య మొదలైన అన్ని రంగాలు కూడా ఈ అభివృద్ధిలోపాత్రధారులే. ముఖ్యంగా సమాజ అభివృద్ధికి సాహిత్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో నేరుగా పాల్గొనని ఎందరో వ్యక్తులు తమ రచనలతో ప్రజలను చైతన్యపరిచారు.

మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది !

- శ్రీశ్రీమహాప్రస్థానం, మహాప్రస్థానం, కవితా సంపుటి, పుట:26.

ఒక కొత్త ప్రపంచానికి ఆహ్వానించే శ్రీ.శ్రీ పిలుపులు బానిస సంకెళ్ళు తెంచుకుని అందమైన లోకానికి పయనం చేయమంటున్నాయి. అనాటి సమాజం స్వేచ్ఛా, స్వాతంత్రాలు లేనిది, స్వంతంగా ఆలోచనలు కూడా చేయలేని పరిస్థితి ఉండేది. శ్రీశ్రీ తన కవితల ద్వారా నిద్రాణమైన సమాజానికి మేలు కొలుపు చేశాడు. రక్తం మరిగిన ప్రతి వాడు యోధుడేనని, ఒకసారి మేల్కొంటే మళ్ళీ నిదుర రాదనే చైతన్య పిలుపునిందించాడు.

సమాజంలో సాహిత్యం :

సాహిత్యం ప్రజలను చైతన్యవంతులుగా తీర్చి దిద్దుతుంది అనడానికి ఇలంటి కవితలు నిదర్శనాలుగా చెప్పవచ్చు. సాహిత్యంసమాజం వేర్వేరు కాదు. సమాజంలో సాహిత్యం పాత్ర చెప్పుకొదగినదే. ''సహిత స్వభావ సాహిత్యం, ''హితేన సహితం సాహిత్యం ''సాహిత్య మంటేమంచిని చేసేది, మంచితోకూడినది. అంతేకాదు సకల విద్యలకు తల్లియేన ఆ సరస్వతి దేవికి సంబంధించిన సారస్వతం. సాహిత్యంలో ఏ ఒక్క ప్రక్రియల మాత్రమే ఉండదు. కథ, నవల, నాటిక, గేయం, ఉపన్యాసం మొదలైన అనేక ప్రక్రియలు కలిగినదే సాహిత్యం. ప్రక్రియ ఏదైనా సరే సాహిత్యానికి మేలు చేస్తుంది.

ఒక కథను చదివిన, నవల చదివిన మరేదైనా చదివినపుడు పాఠకుడు ఉత్తేజానికి లోనవుతాడు. ఆ ప్రక్రియలోని పాత్రగా తనను తాను ఊహించుకుంటాడు. ఒక్కో పాఠకుడు ఒక్కో రకమైన పాత్రలో ఒదిగిపోతాడు.

సాహిత్యం అంటే మానసిక వ్యక్తిత్వానికి తోడ్పడుతుంది. రచయిత సాహిత్య ప్రక్రియకు కావల్సిన వస్తువును

సమాజం నుంచి ఎంచుకుంటాడు. సమాజంలోని సంఘటనలు లేదా జీవిత అనుభవాలే రచయితకు వస్తువు అవుతుంది. దీనిని బట్టి సాహిత్యానికికావలసిన వస్తువు సమాజం ఇస్తే, సమాజానికి కావలసిన చైతన్యం సాహిత్యం ఇస్తుంది. ముందు చెప్పినట్లు సమాజం సాహిత్యం వేరు వేరు కాదని తెలుస్తుంది సమాజంలోని ప్రతి సంఘటన కూడా సాహిత్య అంశాల ద్వారా అంశాల తిరిగి సమాజంలోనిప్రజలకు చేరవేయబడుతుంది. ఒక సమాజం అభివృద్ధి చెందడానికి సాహిత్యం ముఖ్యంగా తెలుగు సాహిత్యం ఎంతో అవసరం.

రాయప్రోలు సాహిత్యం :

రాయప్రోలు సుబ్బారావు రచించిన స్నేహలత కావ్యంలో కవితా వస్తువు వాస్తవిక మైనది. బెంగాల్ లోజరిగిన వాస్తవ సంఘటననురాయప్రోలు తన ఖండ కావ్యం ద్వారా, అందంగా మంచి తిరిగి సమాజంలోనికి సందేశంగా ఇచ్చాడు. కవితా వస్తువు అందరికి ఉప యోగపడేది, వరకట్న దురాచారానికి బలైపోయిన ఒక ఆడపిల్ల ఆత్మలేఖనే స్నేహలత లేఖ, చనిపోయినది ఒక ఆడపిల్ల మాత్రమే కాదు ఎంతోమంది వరకట్నమనే రాక్షసి రాక్షసి కోరల్లో చిక్కి ప్రాణాలు కోల్పోయారు. ఆనాటి సామాజిక వ్యవస్థను తెలుపడమేకాదు, మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఆడపిల్ల అన్ని రంగాలలో ఉన్నప్పటికీ వరకట్నం ఇచ్చుకోలేక పోయినట్లయితే చివరికి ఎలాంటి స్థితి ఏర్పడుతుందో తెలిసిపోతుంది. స్నేహలత చెప్పిన ఈ మాటలు కేవలం ఒక తండ్రికి మాత్రమే కాదు, మొత్తం సమాజాన్ని ప్రశ్నించినట్లు ఉంటుంది.

స్నేహలత :

ఎదిగిన స్వార్థ త్యాగమే జ్వలించు
ఈయూదయ కాలమందునుఃహేయమయిన
కన్యకా వరశుల్క రాక్షస కళంక
మును నిసేరని రోయడే యనుజుడొకడు
- స్నేహలత లేఖ, తెలుగు అకాడమీ, పుట్ట 52.

స్వాతంత్రం కోసం ఎందరో ప్రాణత్యాగాలు చేస్తుంటే వరకట్నం కోసం బలవుతున్న వారిని ఆపడానికి, వరకట్నం రూపుమాపడానికి ఏ ఒక్కరు లేరా అంటూ ఆవేదనతో ప్రశ్నించిన తీరు, ప్రతి ఒక్కరిని కంటతడికి గురి చేస్తుంది. అనంతరకాలంలో స్వాతంత్రం రావడం సమాజంలో కొంత మార్పులు అక్షరాస్యత మొదలైన వాటి ఫలితంగా నేడు వరకట్నం రాక్షసి కొంతవరకు పోయిందని చెప్పవచ్చు. ఇలాంటి కావ్యాలు, కథలు ఆనాటి సమాజాన్ని తీవ్రంగా దూషించాయి దాని ఫలితం నేడు మనం చూస్తూనే ఉన్నాం. ఇంకా ఇప్పటికీ ఆడపిల్లలు బలవుతూనే ఉన్నారు కొందరు పెళ్లికి ముందు అయితే, మరికొందరు పెళ్లి తర్వాత వరకట్న మహమ్మారికి బలవుతున్నారు. వరకట్నం ఆశకీ బలయ్యే ఆడపిల్లలను ఆదుకునే వారు ఏ ఒక్కరు కూడా లేరంటూవాపోయింది.రాఖీ, పుట్టింటికి రా చెల్లి వంటి చిత్రాల్లో కూడా ఈ అత్యాచారాన్ని గురించి కళ్లకు కట్టినట్టుగా చూపించారు. ఇలాంటి సాహిత్యాన్ని చదివి, విని,చూసి మార్పు చెందిన సంఘసంస్కర్తలు వరకట్నానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరు ఆధునిక భావజాలం వర కట్నం తీసుకోకుండా పెళ్లి చేసుకున్న వారు కూడా ఉన్నారు.

పూర్వం ఆడపిల్లకు పెళ్లి చేయడం ఒక సమస్యగా ఉండేది. ఆడపిల్లని మెడపై ఒక కుంపటిలా భావించే వారు. చిన్న పిల్ల అని కూడా చూడకుండా ముసలి వాళ్ళకి ఇచ్చి పెళ్లి చేయడం, భర్త చనిపోతే జీవితాంతం విధంగా పుట్టింట్లో వెట్టిచాకిరి చేయించేవారు. ఈ తీరుపై ఎందరో రచయితలు కవులు తమ కలాల గళాలతో ప్రజలను చైతన్యవంతులుగా చేశారు. నేడు కన్యాశుల్క వ్యవస్థ దాదాపుగా అంతరించిపోయింది. నేడు సమాజం మూఢనమ్మకాలు బాల్య వివాహాలు మొదలైన సాంఘిక దురాచారాలను ఎదుర్కొని ముందంజలో ఉందంటే సాహిత్యం మొదటి కారణం అని చెప్పవచ్చు.

ఒక సమాజం కొత్తపుంతలు తొక్కడానికి,కి నూతన భావాలను ఆవిష్కరించడానికి సాహిత్యం ఎంతో

అవసరం. కేవలం సాంఘిక దురాచారాలను రూపు మాపడానికే కాదు, బానిస సంకెళ్లు తెంచుకొని వడానికి మనల్ని మనం ప్రోత్సహించి పోవడానికి సహకరిస్తుంది సాహిత్యం. ఒక నాటి సమాజంలో బానిసత్వం ఎక్కువగా ఉండేది బలహీనులు ఒకటైతే ఇంతటి బలవంతుడైన వేయవచ్చని నిరూపించే రచనలు ఎన్నో వచ్చాయి.

నవల సాహిత్యం :

ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవల, కేశవరెడ్డి నవలలు, బి.ఎస్. రాములు బ్రతుకు పోరు, వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి, దాశరథి రంగాచార్య మోదుగుపూలు మొదలైన నవలలు ప్రజాశక్తి వెలికితీసి ఎన్నో సంఘటనలు సన్నివేశాలు ఉన్నాయి. మాలపల్లి నవలలో సంగదాసు చనిపోయిన అతని ఆశయం చేయిస్తుందని తెలపడంలో రచయిత ఉద్దేశం అనాడు స్వాతంత్ర ఉద్యమంలో ఎందరో వీరులు ప్రాణత్యాగం చేశారు. అంతమాత్రం చేత ఉద్యమం ఆగదు ఎప్పటికైనా వారి త్యాగ ఫలం మనకి వస్తుందనే ఆశాభావాన్ని తెలియ జేశారు. అదేవిధంగా ఆశయం కోసం చనిపోయిన సరే అందరికీ విముక్తి రావాలనే భావనతో పాటు ప్రజల్లో కూడా చైతన్య భావాలు, స్వాతంత్ర్య కాంక్షను పెంపొందింప జేశారు.

జైల్లో ఉండి కూడా పోరాటం చేసిన వారిలో వట్టికోట ముందు వరుసలో ఉంటాడు. అనాడు జైల్లో ఖైదీలు చాలా అవమానాలకు గురయ్యేవారు. ఏ నేరం చేయ కుండానే ఉరిశిక్షకు గురైన వారెందరో. కొందరు ఈ దుస్సంఘటన చర్యకు చలించిపోయి అధికారులకు కూడా ఎదురు తిరిగే వారు."25 ఏండ్ల వయస్సు కుర్రోన్ని పెళ్లి కొడుకోలే పట్టుకెళ్లి స్తంభానికి ఉరి తీయటానికి నీకు చేతులెట్లా వచ్చాయి" (ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారు స్వామి సాహిత్య సమాలోచన, డాక్టర్ గంట జలంధర్, తెలంగాణ భాషా సాంస్కృతిక, కార్తీక్ ఆర్ట్ ప్రింటర్స్, : 157). జైల్లో ఉండే ఇంకో ఖైదీ మనసు చలించి పోయి అధికారులకు ఎదురుతిరిగిన ఈ సన్నివేశం ఉద్యమానికి నాందిగా మారిందని చెప్పవచ్చు. ఆ యువకుని బలిదానం కావడం చూసి గండయ్య ఒక రోషంతో అధికారిని నిలదీసే స్థాయికి ఎదగడం ఎంతో గొప్ప విషయం. ఇలాంటి అనేక విషయాలను రచయితలు తమ సాహిత్యం ద్వారా తెలిపి ప్రజలు తిరుగుబాటు ధోరణి కలిగించారు.

నేడు ఆధునిక సమాజంలో ప్రతిదీ ఒక సమస్యగా మారుతుంది. అమ్మాయిలు ఒంటరిగా తిరుగుతున్న భయపడాల్సిన వస్తుంది. అదే విధంగా సమాజంలో ప్రతి ఒక్కరు తమ ను తాము నిలబెట్టుకోవాలంటే ఎన్నో అడ్డంకులను ఎదుర్కోవాల్సి వస్తుంది. నిన్నటి తెలంగాణ ఉద్యమం వారికి కూడా బలిదానాలు ఆగ లేదంటే సమాజంలోని వ్యక్తుల మానసిక స్థితి ఎలా ఉందో తెలుస్తుంది. తను అనుకున్నది జరగలేదంటే ఆత్మహత్య లకు పాల్పడుతున్నారు కారణమేదైనా సరే ప్రాణత్యాగం చేస్తున్నారు. ఒకవేళ తమ చనిపోతే తమ చుట్టూ ఉన్న వారు ఎంత బాధ పడతారు అనే ఆలోచన కూడా లేకుండా సిద్ధపడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు భయం వల్ల కూడా వారు ఎంతటి ఉన్నత విద్యను అభ్య సించిన మానసికంగా శక్తులు కావడమే దీనికి కారణమని చెప్పవచ్చు. అందుకే సాహిత్యంలోని ఏ ప్రక్రియ అయినా సమాజంలోని వ్యక్తులని చైతన్యపరిచేలా ఉంటుంది. ముఖ్యంగా జీవిత చరిత్రలు వీరిని కొంతవరకు ప్రయో జకులుగా మార్చుతాయని చెప్పవచ్చు. ఉదాహరణకి అబ్దుల్కలాం ఒక పేదింటి బిడ్డ, తను చదువుకునే రోజుల్లో అనేక కష్టాలు ఎదుర్కొన్నాడు అయినా సరే దేనికి కుంగిపోయి ఆగిపోలేదు. గుండె ధైర్యంతో ముందుకు సాగి నేడు ఎంత మంది గుండెల్లో స్థానాన్ని పొందడమే కాదు కొత్త చరిత్రను మానవాళికి అందించిన మహ నీయుడు అయ్యాడు. ఇలాంటి గొప్ప వారి జీవిత చరిత్రలు ప్రేరకాలుగా కూడా మారుతాయి అతిశయోక్తి కాదు. సాహితీ ప్రక్రియ ఏదైనా సమాజాభివృద్ధికి కార్యకమే. గొప్పవారి జీవిత చరిత్రలు కేవలం ఒక వ్యక్తి కాదు మొత్తం సమాజ వికాసానికి దోహదం చేస్తాయని థామస్ కార్

లైల్ అభిప్రాయపడ్డారు. ఒక వ్యక్తి సంపూర్ణ వికాసానికి సాహిత్యం తొలిమెట్టు. మనలోని భావోద్వేగాలను తగ్గించ డానికి సాహిత్యం ఒక సాధనం, ఒక ఆయుధం, ఔషధం.

విష్ణుశర్మ రచించిన పంచతంత్రం కథలు రాజ కుమారులను మార్చగలిగాయని చరిత్ర చెప్పిన సత్యం. సాహిత్య మూరులను కూడా జ్ఞానవంతుడు చేస్తుం దనడంలో సందేహం లేదు. ప్రతి వ్యక్తిలో చైతన్యంతో పాటు జ్ఞానం కలిగించి నట్లయితే సమాజ అభివృద్ధిలో పాలు పంచుకుంటారు. నాని గాంధీ గారి వంటి స్వాతంత్ర ఉద్యమ కారుల జీవిత చరిత్రలు ఎందరికో ఆదర్శాలు. కందుకూరి స్వీయచరిత్ర ఉన్నత వ్యక్తిత్వానికి నాంది పుటాలు. జనగణమన గేయం ప్రతి భారత పౌరుని గుండెల్లో గంట ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటేమిటి సాహిత్యం అంటే సార్వ మకాలిన సమాజానికి ఆదర్శ సూత్రాలు.

ముగింపు :

సమాజం అభివృద్ధి పథంలో సాగుతుంది అంటే అందరి కృషి ఫలితం. రైతు దగ్గర నుండి రాజకీయ నేత వరకు సమాజాభివృద్ధిలో పాత్రులే. దువ్వూరి రామిరెడ్డి రైతు లేకుండా రాజ్యం లేదు అని, రైతు గొప్పతనాన్ని తెలుపుతూ రాసిన రైతు ప్రశస్తి కావ్యం, రైతు విలువ ను తెలిపే గొప్ప కావ్యం. తెలుగు సాహిత్యం అంటేనే వెలుగులు నింపే వారధి అనడం అతిశయోక్తి కాదు.

సాహిత్యం సమాజంతో ముడిపడి ఉంటుంది. మనం ఏ సాహిత్య ప్రక్రియను ఎంచుకున్న దానిలోని అంశాలు సమాజానికి దగ్గరగా ఉంటాయి. అదేవిధంగా వాటిలోని పాత్రలు కూడా సమాజంలోని మానవుల వ్యక్తిత్వానికి దగ్గరగా ఉంటాయి. అందుకే కొన్ని సార్లు చదువు తున్నప్పుడు అది మన జీవితమే, అందులో ఉన్నది మనమే అనిపిస్తుంది అంటే, సాహిత్యం మనతో ఎంత ముడిపడి ఉందో తెలుస్తుంది. సమాజంలో వ్యక్తులు వివిధ రకాల మనస్థత్వాలతో పాటు అనేక రకాల వైవిధ్యాన్ని కలిగి ఉంటారు. ప్రతి వారు కూడా సమాజాభి వృద్ధికి పాటుపడాలన్నారు అంటే సాహిత్య అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా తెలుగు సాహిత్యం మానవుల మనోవికాసానికి తోడ్పడుతుంది. ఉదాహరణకు దాశరథి కవిత్వం ఒక 'అగ్నికణం' చదివే ప్రతి వారి రక్తం ఉడికి పోవాల్సిందే. 'నా తెలంగాణ కోటి రతనాల' అని ఎలుగెత్తి చాటి తన రాష్ట్ర భక్తిని చాటుకున్నాడు. ఈమె ఈ మంత్రం తర్వాత కాలంలో తారకమంత్రంగా మారి, వారి నోటి నుండి వెలువడినది అంటే సాహిత్యం ఎంతగా ప్రభావితం చేసిందో చెప్పవచ్చు. అనేక అంశాలను తనలో నింపుకున్న సాహిత్యం ఆధునిక సమాజ నిర్మాణానికి తొలి వారధి అని చెప్పవచ్చు. ప్రతి సాహిత్య ప్రక్రియను చదివి అర్థం చేసుకున్నట్లయితే మనం కూడా రాజకుమారుల విజ్ఞాన పొందగలుగుతాం, దేశాభివృద్ధికి తోడ్పడతాం. ప్రతి భావోద్వేగానికి మనం ఎంచుకున్న మార్గం సాహిత్యం అలాంటి సాహిత్యం తరాలకు అందించిన వరమే నేడు మనం ఉంటున్న సమాజం.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. ప్రజా కవి దాశరథి సాహిత్యం, డాక్టర్ దాశరథి కృష్ణమాచార్యులు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2013
2. తెలుగు సాహిత్య సమీక్ష, జి. నాగయ్య, 2003.
3. స్వామి వివేకానంద జీవితం సందేశం, రామకృష్ణ మఠం, గ్రాఫిక్ ప్రింటర్స్, 2012.
4. ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారుస్వామి, గంటా జలంధర్ రెడ్డి, కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,హైదరాబాద్, 2014.
5. తెలుగు సాహిత్య చరిత్ర, ద్వా.నా.శాస్త్రి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 2007.
6. సాహితీ దుందుభి, తెలుగు అకాడమీ, నవతెలంగాణ ప్రింటర్స్, హైదరాబాద్, 2021.
7. మహాప్రస్థానం, శ్రీ. శ్రీ, నవ చైతన్య పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2020.
8. తెలుగు సాహిత్య మంజీర, తెలుగు అకాడమీ, నవతెలంగాణ ప్రింటర్స్, హైదరాబాద్, 2018.

❖

'రాజేశ్వరి' నాటకం - ఆదర్శ సమాజ చిత్రణ

- ఓబిలి వెంకటయ్య పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, యోగివేమన విశ్వవిద్యాలయం, వేమనపురం, కడప.

'కావ్యేషు నాటకం రమ్యమ్' అని లాక్షణికోక్తి. సౌందర్య విలసితమైన సర్వకళల్లో కావ్యం శాశ్వతమైంది. శ్రవ్య కావ్యం చదివినప్పుడు, విన్నపుడు సహృదయులకు రసాస్వాదన కలుగుతుంది. దృశ్యకావ్యాలు నటులతో రంగస్థలంపై ప్రదర్శింపబడతాయి. కనుక సమస్త మానవాళికి ఆనందాన్ని కలిగిస్తాయి. చతుర్విధాభి నాయాత్మకమైన నాటకంలో ఆహార్యం, ఆంగికం, వాచికం, సాత్వికం ఒకదాని కంటే మరొకటి శ్రేష్ఠతరమై ప్రేక్షకుని ఆకట్టుకొంటాయి.

'నాటకాంతం హి సాహిత్యం' అన్నారు. సాహిత్య ప్రక్రియలన్నింటిలో నాటకాన్ని రచించడం చాలా కష్టం. నాటకకర్తకు అపారమైన ప్రతిభా, పాండిత్యం, ధారణశక్తి, సృజనతో పాటు లోకానుభవం ఉండాలి. నాటక రచనను అత్యున్నతమైందిగా, అత్యుత్తమ ప్రజ్ఞగా భావించారు.

తెలుగులో ఇప్పుడు మనం చెప్పుకునే ఆధునిక తెలుగు నాటకరంగం ఎప్పుడు ప్రారంభమైంది అని ప్రశ్నించుకుంటే గురజాడ అప్పారావు గుర్తొస్తాడు. సంప్రదాయ నాటకరంగంలో పద్యం, పాట, సంగీతం ప్రధానపాత్ర వహిస్తే, ఇతివృత్తం పౌరాణికంగానీ, జానపదంగానీ కావడం, సంభాషణలు గ్రాంథికంలో ఉండడం గమనించవచ్చు.

ఆధునిక సాంఘిక నాటకంలో సాంఘిక ఇతివృత్తం, వర్తమాన సమస్యలు, జీవిత వాస్తవికతకాక సమాజంలోని నీతిని, నియమాలను, కట్టుబాట్లను ప్రశ్నించడం, తిరస్కరించడం, సాంఘిక సంస్కారానికి అవసరమైన సందేశం ఇచ్చి ప్రత్యామ్నాయ పరిష్కారమార్గాలు చూడపం ఓ లక్షణం. ఆధునిక తెలుగు నాటక రంగానికి రచయితలు, నటులు, నాటక సమాజాలు కృషిచేశాయి.

వాస్తవ దృక్పథానికి, సాంఘిక చైతన్యానికి మూలమైంది సాంఘిక నాటకం. సమకాలీన సమాజంలోని ప్రతి సమస్యకు ప్రతిస్పందించేది, ప్రతి సంఘటనను ప్రతి బింబింప చేసేది సాంఘిక నాటకమే. సాంఘిక నాటక మెప్పుడూ సమకాలీన సమాజాన్ని అన్వేషిస్తూనే సమాజ శ్రేయస్సుకు పాటుపడుతుంది.

సంఘసంస్కరణ, దేశభక్తి, హేతువాద దృక్పథంతో ప్రారంభమైన సాంఘిక నాటకం ఆ తర్వాత కాలంలో సమాజంలో చోటు చేసుకున్న ప్రతి అంశాన్ని స్పృశించింది. మూఢవిశ్వాశాలు, బాల్య వివాహాలు, వృద్ధ వివాహాలు, కన్యాశుల్కం, వరకట్నం, స్త్రీ అభ్యున్నతి, లంచగొండి తనం, కులమతాల ప్రసక్తి, వేశ్యావృత్తి, మధ్యపానం, నిరుద్యోగం, రైతు సమస్యలు, ఆర్థిక అసమానతలు, భూస్వామిక వ్యవస్థ, విద్యా, వైద్య, న్యాయ, పోలీసు వ్యవస్థలు, స్త్రీ, దళిత, మైనారిటీ వాదాలు ఇలా భిన్నమైన అంశాలపై సాంఘిక నాటకాలు, నాటికలు విపరీతంగా వచ్చాయి. ఈ క్రమంలో రాయలసీమ నుండి కూడా నాటకకర్తలు తనవంతు బాధ్యతగా అనే సాంఘిక నాటకాలు రాశారు. అలా రాయలసీమ నుండి రాసిన వారిలో పి. సుబ్బరాయుడు గారు ఒకరు.

పోలిచర్ల సుబ్బరాయుడు పిచ్చయ్య, చిన్నసుబ్బమ్మ లకు ద్వితీయ సంతానంగా జూలై 18,1949లో జన్మించారు.భవనముల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. చక్రవర్తి,ఊర్వశి, ఉష, దీపావళి, వేమన, ఇంద్ర సింహాసనము, అంతంకాదిది ఆరంభం, భూతల నరకం, ధ్రువ చరిత్రము, రాజేశ్వరి మొదలైన నాటకాలు రాశారు. పాండురంగ మహత్మ్యము, వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, నమస్కారము, సూనృతసుధ, సూక్తిసుధ మొదలైన పుస్తకాలు రాశారు.

రాజేశ్వరి నాటకంలో 5 పాత్రలున్నాయి. రాజేశ్వరి

ప్రధానపాత్ర. ప్రభాకర్, రాజేశ్వరి భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు వేణు.ప్రభాకర్‌కు ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం. ప్రభాకర్ స్నేహితుడు వాసు(లాయర్). స్నేహితుడు అయిన ప్రభాకర్ భార్యతో అక్రమ సంబంధం పెట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు.ఈ చెడు ఆలోచన మనస్సులో పెట్టుకుని ప్రభాకర్‌తో మంచిగా ఉంటూ తనకు మందు తాపిస్తూ తాను కలిసి తాగుతూ అప్పు డప్పుడు తాగి ఇంటికి రాలేని ప్రభాకర్ ను తీసుకువచ్చే నెపంతో ఇంటికి వచ్చేవాడు. ఒకరోజు అలాగే ప్రభాకర్‌ని ఇంటికి తీసుకువచ్చి బెడ్‌రూం చేర్చి తిరిగి వెళ్లే సమయంలో రాజేశ్వరి తలుపులు వేయడానికి రావడంతో ఆమె భుజాలపై వేయి వేస్తాడు. సహించని రాజేశ్వరి వాసు చెంపపై లాగి కొడుతుంది. దెబ్బతిన్నాక కూడా నీభర్త మంచి వాడు కాదని వేరే అమ్మాయి కోసం తిరుగు తున్నాడని, నిన్ను ఏదోక రోజు వదిలేస్తాడని చెబుతాడు.

రాజేశ్వరి తన భర్త అయిన ప్రభాకర్‌కు వాసు స్నేహం మానేయమని చెబుతుంది. అలాగే తను ఎప్పుడు మన ఇంటికి రాకుండా ఉండేవిధంగా చూడమని చెబుతుంది. ప్రభాకర్ తన కంపెనీ ఓనర్ కూతురు సరోజని తన మాయలో పడేసివుంటాడు. చిన్నగా సరోజను పెళ్లి చేసు కుని 10 కోట్ల రూపాయల ఆస్తికి, కంపెనీకి ఓనర్ కావాలనే ఆలోచనతో ప్రభాకర్ ఉంటాడు. ఈ విషయాన్ని ఆసరాగా చేసుకుని వాసు ప్రభాకర్, రాజేశ్వరిలను విడదీయడానికి అనేక పథకాలు చెబుతుంటాడు. ఎంత ఆలోచించినా, ఎన్ని పథకాలు వేసిన రాజేశ్వరి దగ్గర మన ఆటలు సాగవని ప్రభాకర్ చెప్పడంతో వాసుకు ఏంచేయాలో దిక్కుతోచక చివరకు రాజేశ్వరిని చంపాలని నిర్ణయించు కుంటారు. ప్రభాకర్ రాజేశ్వరిని చంపడమా? అని భయ పడుతున్న సమయంలో వాసు నీకెందుకు మన చేతికి మట్టి అంటకుండా నేను ఉపాయం వేశానంటూ "చనిపోవడానికి సిద్ధంగా ఉన్న క్యాన్సర్ రోగి అయిన గురవయ్యకు డబ్బును ఇస్తాం, నీవు చనిపోయినా నీ కుటుంబసభ్యులు క్షేమంగా ఉంటారని, అలాగే రాజేశ్వరి గయ్యాళి అని, తన తోబుట్టువులతో ప్రభాకర్‌ని కొట్టిస్తుం దని చెప్పి చంపడానికి ఒప్పిస్తారు.

అనుకున్నది అనుకున్నట్లు జరుగుతుంది అని అనుకునే సమయంలో రాజేశ్వరి మంచితనం, మాటతీరు ఆమెను కాపాడింది. గురవయ్యను ప్రభాకర్ తన చిన్ననాటి స్నేహితుడని రాజేశ్వరికి చెప్పి రాగానే కమలా పండ్ల రసం ఇవ్వమని చెప్తాడు. అనుకున్న ప్రకారం ఇంట్లో తను లేకుండా జాగ్రత్త పడి మార్కెట్‌కు వెళతాడు.

గురవయ్య రాజేశ్వరిని చంపడానికి వస్తాడు. రాజేశ్వరికి ప్రభాకర్ గురవయ్య గురించి నా చిన్ననాటి మిత్రుడు క్యాన్సర్ రోగి చనిపోయేలోపు ఒకసారి చూడడానికి వస్తానన్నాడని చెప్పివుంటాడు. రాజేశ్వరి జ్యూస్ చేసి గురవయ్యకు ఇవ్వబోతూ "అన్నగారు మీరు చనిపోతారని తెలుసు అయినా మీరు ఈ సమయంలో ప్రశాంతంగా ఉండాలి" అని అంటోంది. ప్రశాంతత చాలా సులభంగా అనేశావమ్మా...

'అన్నగారూ... మీరన్నది నిజమే. ఈ ప్రపంచంలో యెవరున్నారు చెప్పండి ప్రశాంతంగా? నా మటుక్కు నాకు లేదు ప్రశాంతత. అటు మానాన్న ఆరోగ్యం, డబ్బుకు కటకట. ఇటూ యీయన చూస్తే చెడు సహవాసాలు, తాగుళ్లు. ఏ నిమిషంలో కుటుంబం తునాతునక లౌందోనని ఆందోళన. పిల్లవానికి చిన్నవయస్సు ఎలా నెగ్గుకురావాలో ఆలోచన. ఐనా అధైర్య పడితే తీరు తుందా? ధైర్యంగా నిలబడాలి. తప్పదు. మనస్సును ప్రశాంతంగా వుంచుకొని ఆలోచించాలి. బాగా ఆలోచించి సరైన నిర్ణయం సరైన సమయంలో తీసుకొని కష్టాలను ఎదుర్కొవాలి. అంతేగాని కృంగిపోతే ఎలా?"

గురవయ్య, ప్రభాకర్ సంభాషణలో ప్రభాకర్ తాగుతాడని, అందుకు కారణం వాసు అని తెలుసు కుంటాడు. నిజం తెలుసుకున్న గురవయ్య రాజేశ్వరిని చంపడు. గురవయ్య తన కుటుంబం గురించి బాధ పడుతుంటే రాజేశ్వరి గురవయ్యకు వినయంగా మరణం గురించి బాధపడకు అన్నగారూ " ఎవర్నెవరు రక్షిస్తారు..

నేనే వీళ్ళనంతా కాపాడుతున్నాననుకోవడం నరి కాదన్నయ్యా... ఇందిరాగాంధీ పోయిననాడు యీదేశం యేమై పోతుందో అనుకున్నారంతా... ఏమైంది.. ఆ తర్వాత దేశమెంత అభివృద్ధి చెందింది. మనమే ఉద్ధరిస్తున్నా మనుకోవడం ఒట్టి భ్రమ. మీరు నరసింహ శతకం విన్నారా! "అడవి పక్షులకెవ్వరాహారమిచ్చెను" అన్న పద్యం జ్ఞాపకముందా? అనగానే గురవయ్య నీతోటితో వినాలని ఉంది చెప్పమ్మా అని అంటాడు.

సీ॥ "అడవి పక్షుల కెవ్వడాహారమిచ్చెను
మృగజాతి కెవ్వడు మేతబెట్టె?
జలచరాదులకు భోజన మెవ్వడిప్పించె?
చెట్ల కెవ్వడు నీరు చేది పోసే
స్త్రీల గర్భంబులన్ శిశువుల నెవ్వడు బెంచె?
ఫణుల కెవ్వడు పోసె బరగ విషము
మధుపాళి కెవ్వండు మకరంద మొనరించె?
పశుల కెవ్వడొసగె బచ్చిపూరి

తే॥ జీవకోట్లను బోషింప నీవెకాని
వేరె యొకదాత లేడయ్య వెదకి చూడ
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస
దుష్ట సంహార! నరసింహ! దురిత దూర

అని వేదాంత పరమైన మాటలను పద్యాల రూపంలో చెప్పి గురవయ్యను ఓదారుస్తుంది. గురవయ్య నీ నోట మరొక పద్యం వినాలని ఉందమ్మా అనగా...

సీ॥ ధరణిలో వేయేండ్లు తనువు నిల్వగ బోదు
ధన మెన్నటికి శాశ్వతంబు గాదు
దారసుతాదులలా తన వెంట రాలేరు
భృత్యులు మృతిని తప్పింపలేరు
బంధుజాలము తన్ను బ్రతికించుకోలేరు
బలపరాక్రమమేమి పనికిరాదు
ఘనమైన సకల భాగ్యము లెంతగల్గియు
గోచి మాత్రంబైన గొనుచుబోడు

తే॥ వెర్రికుక్కల భ్రమలన్ని విడిచి నిన్ను
భజన చేసెడి వారికి బరమసుఖము
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస
దుష్టసంహార! నరసింహ! దురితదూర.

అని రాజేశ్వరి చెప్పి... అంతేకాదు అన్నగారూ గౌతమ బుద్ధుడు బోధచేస్తూ... ఈ ప్రపంచంలోని సుమస్త దు:ఖాలకు కారణం తగని కోరికలేనన్నాడు. ఈ ప్రపంచంలో రోగం, ముసలితనం, మరణం అతి సహజ మన్నాడు. సంఘంలో ఒకరిపైఒకరు ఆధారపడి సహక రించుకొని శరణుజొచ్చి దు:ఖాన్నధిగమించాలన్నారు. అదే "సంఘంశరణం గచ్ఛామి" అన్నమాట. అంతెందుకు యాక్సిడెంట్ జరిగిన చోటే ఆస్పత్రికి చేర్చేవాడొకడుం టాడు. అది యెలా అనే విషయం మనకర్థం కాదు. మనం ఒకరికి మేలు చేస్తే మనకు మేలు చేసేవాడూ ఒకడుం టాడు. అదంతే. మనం చేయవలసిందల్లా పై వాణ్ని నమ్ముకొని నిశ్చింతగా మన కర్తవ్యం మనం నిర్వర్తిం చడమే.. అని నీతి వాక్యాలు చెపుతుంది.

గురవయ్యలో మార్పు వచ్చి రాజేశ్వరితో నేను నిన్ను చంపడానికి వచ్చాను అని చెప్పగానే షాక్ అవుతుంది. అమ్మా ఆ దుర్మార్గుడు..ప్రభాకర్, ఆ నీచుడు వాసూ ప్లాన్ చేసి నిన్ను చంపేయమన్నారమ్మా.. నన్నే చంపేయ మన్నారు. రూ.5 లక్షలు తీసుకుని నిన్ను చంపడానికి ఒప్పుకున్నాను..అందుకు రాజేశ్వరి ఎందుకు చంపావని పోలీసులు అడిగితే ఏం చెప్పమన్నారనగా నీకూనాకు ఐదేళ్లుగా అక్రమసంబంధం నడుస్తున్నదని, నాకు క్యాన్సర్ అని తెలిసి నన్ను కాదని ప్రభాకర్‌ని పెళ్లి చేసుకున్నావని అందుకే కక్ష తీర్చుకున్నానని ఒక కట్టుకథను అల్లి నన్ను చెప్పమన్నారమ్మా'.. షాక్ నుంచి తేరుకున్న రాజేశ్వరి గురవయ్యతో నేను చనిపోతే లాభం ఏంటని గ్రహిస్తుంది. ప్రభాకర్, వాసు ఆడిన సరోజ డ్రామా గుర్తుకు వస్తుంది. ప్రభాకర్ మార్కెట్‌నుండి ఇంటికి రాగానే భర్త అని కూడా చూడకుండా కాల్చి చంపుతుంది. కేసుకాకుండా వాసు చూస్తాడు. ప్రభాకర్‌ను రాజేశ్వరి చంపడంతో ఆమె అంటేనే వాసుకు భయం ఏర్పడుతుంది. రాజేశ్వరికి ప్రభాకర్ చేస్తున్న కంపెనీలో ఉద్యోగం వస్తుంది.....

చెడు సహవాసాల వలన ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుందో తెలిపారు. అలాగే తాగుడుకు అలవాటు పడడంతో తన చుట్టూ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలోకి మనుషులు వెళతారనే సందేశంను ఇచ్చారు. ఇంకా ఈ నాటకంలో గురవయ్య, రాజేశ్వరి మధ్య జరిగిన సంభాషణల్లో మంచి మాటలతో తనను చంపడానికి వచ్చిన వారిని కూడా మార్చి వేసే శక్తి మాటకు ఉందని నిరూపితమౌతుంది....

ఆధార గ్రంథాలు :

1. రాయలసీమ నాటక వికాసం- డా॥.మూల మల్లికార్జున రెడ్డి
2. 'రాజేశ్వరి' నాటకం- పి. సుబ్బరాయుడు
3. తెలుగునాటకం ఉద్యమ నేపధ్యం- డా॥ కందిమళ్ళ సాంబశివరావు

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో గురజాడ సాహిత్యం

– నండూరి అనంతలక్ష్మి, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ సిటి కళాశాల, హైదరాబాదు.

సమాజ సంబంధం నుండి ఉత్పత్తి అయిన ఒక వాస్తవిక కళారూపం సాహిత్యం. సమాజము, సాహిత్యము విడదీయరానివి. సమాజ సాహిత్య సంబంధమే సాహిత్య తత్వం. సమాజ సాహిత్యాలుపరస్పర ప్రభావితాలు. సమాజహితమే సాహిత్య ప్రయోజనం. సాహితీకారుడు సామాజిక స్పృహతో రచనలు చేసినప్పుడు ఆ సాహిత్యానికి మరింత విలువ చేకూరుతుంది. భిన్నమనస్తత్వాలు కలిగిన సమాజంలో మనిషి ఎలా ఉండాలి? ఎలా ఉండ కూడదు? ఎలా నెగ్గుకు రావాలి? అనే ప్రశ్నలకు సమాధానంగా సాహిత్యం నిలబడగలగాలి. సమాజంలోని దుర వస్థలను, దురాచారాలను గుర్తించి, వాటిని సాహిత్యంలో వ్యక్తీకరించినట్లయితే ఆ సాహిత్యం సమాజంపై తన ప్రభావాన్ని చూపించి ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కాగలదు. ఆనందోపదేశాలతో కావ్య ప్రయోజనం నెరవేరాలంటే కవి తనచుట్టూ ఉండే ప్రపంచంలోకి వెళ్ళాలి, పరిశీలించాలి. నీతి ప్రబోధ చేయ గలగాలి. అప్పుడు సమాజానికి, జీవన గమనానికి సరైన దిశానిర్దేశం చేసినట్లవుతుంది. ఇటువంటి దిశా నిర్దేశం గురజాడ రచనల్లో కనిపిస్తుంది.

ఏ కవి రచనలోనైనా ఆకవి సమకాలీన సమాజ ప్రతి బింబించడం అనివార్యం. సమాజం అంటే సంస్కృతితో జీవనరీతితో తొణికిసలాడే నిండైన ప్రవాహం. సహితస్య భావం సాహిత్యం. సాహిత్యం కాబట్టి సాహిత్యం సరళంగా ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉండాలి. రచనలు సమాజ వికాసానికి, మనుషుల్లో మార్పు తీసుకు రావడానికి ప్రయత్నం చేయాలి. సాహిత్య ప్రయోజనం నెరవేరాలంటే ఆ సాహిత్యం జన సామాన్యంలోకి వెళ్ళాలి. సరళమైన ఛందస్సు, వ్యావహారిక భాషా వినియోగం ఉన్నప్పుడే ఆ సాహిత్యం జన సమాన్యానికి చేరువౌతుంది. అప్పుడే ఆ సాహిత్య ప్రయెజనం నెరవేరుతుంది. ఈ లక్ష్యంతోటి గురజాడ ముత్యాల సరాలు ఛందస్సులో కవితల్ని, వ్యావహారిక భాషలో కన్యాశుల్కం నాటకాన్ని రచించాడు.

గురజాడ తన కాలం కన్నా ఎన్నో కాలాలు ముందు ఉన్నారు. సంఘంలోని సమస్యలను తన కవితా వస్తువు లుగా స్వీకరించారు. నిమనిషి అనే కవితలో మనిషి చేసిన రాయిరప్పకు/మహిమ కలదని సాగి మొక్కులు/మనుషు లంటే రాయిరప్పలకన్న /కనిష్ఠంగాను చూస్తా వేల బేలూ? అని సాటి మనిషిని దేవుడిగా భావించమని సూచించాడు. సమాజంలో నాటుకు పోయిన మూఢాచారాలను ఖండించాడు. అందరు అరిష్టదాయకంగా, అశుభానికి సూచనగా భావించే తోకచుక్కను సంఘసంస్కరణ ప్రయాణ పతాకగా భావిస్తాడు. లోకములన్ని ఒకే ఇల్లుగా, వర్ణభేదములు నశించి ప్రేమబంధము వెల్లి విరియాలనే వసుదైక కుటుంబ తత్వాన్ని బోధించాడు.

దేశంలో అగ్రకులాలు, అల్పకులాలు అని విభజించి వీరిద్దరి నడుమ అంతులేని భేదాలు సృష్టించి సాటి మనిషిని హీనంగా చూసే కుల విద్వేషాలను సహించలేని గరుజాడ లవణరాజు కలలో నిమంచిచెడ్డలు మనుజు లందున/ఎంచి చూడగ రెండె కులములు మంచియన్నది మాలయైతే/ మాలనేనుగుదున్ అని కులరహిత సమాజాన్ని ఆకాంక్షించాడు. కులభేదాన్ని ధిక్కరించి మాలస్త్రీని నిగర్వియన చేర్చెన్ అని ఆమెకు సింహాసనాన్ని ఇచ్చిన ఆమెకు గౌరవాన్ని కలిగిస్తాడు. నిమలిన దేహుల మాలలనంచును/మలిన చిత్తులకధిక కులములు/ నెలవొసంగిన వర్ణధర్మము/అధర్మ ధర్మంబే అని వర్ణ వ్యవస్థ అధర్మమని తన నిరసన తెలియచేశాడు.

నిమగడు వేల్పున పాతమాటది, ప్రాణమిత్రుడు నేను, నీనెనరు కలుగక యున్న పేదను, కలిగినను/ నాపదవి వేల్పుల రేనికెక్కడు అని ఆలుమగల సంబంధాలలో

స్నేహపూర్వక సంబంధాన్ని గురజాడ ప్రవచించారు. స్త్రీ దాస్య భావనను రూపుమాపి, పురుష అహంకారాన్ని సంస్కరించే ప్రయత్నం చేశారు.

కాసులు గేయంలో ప్రేమ సిద్ధాంతాన్ని తెలియజేశారు. నిప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును/ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును అని ప్రేమ యొక్క గొప్పతనాన్ని చెప్పారు.

నాటి సమాజంలోని మూఢాచారాలైన కన్యాశుల్కం, బాల్య వివాహలపై మహిళల్లో తిరుగుబాటు తత్వాన్ని కలిగించారు. పూర్ణమ్మ గేయంలో పూర్ణమ్మ కన్యాశుల్కం కోసం జరిగే వివాహాల పట్ల తన వ్యతిరేకతను ఆత్మహత్య ద్వారా తెలియజేస్తుంది. నికన్నులకాంతులు కలువల జేరెను/మేలిమిజేరెను మేని పసల్/హంసల జేరెను నడకల బెడగులు/దుర్గను జేరెను పూర్ణమ్మ అని కఠినాత్ముల హృదయాలు సైతం కలిగి కన్నీరయ్యేలా పూర్ణమ్మ దు:ఖమయ జీవితాన్ని వర్ణించారు. అందమైన వైశ్య కన్య అయిన కన్యకను ఆ నగరాన్ని ఏలే రాజు మోహించి పట్టు కోవాలని చూస్తే కన్యక ఆ వివాహాన్ని మొదటే తిరస్కరించి అగ్ని గుండంలో దూకి మరణిస్తుంది పూర్ణమ్మ, కన్యక ఇద్దరూ తమకు జరిగిన, జరగబోవు వివాహల పట్ల తమ ధిక్కారాన్ని, ప్రతిఘటనను ఆత్మహత్యల ద్వారా తెలియ జేశారు. తమకు అన్యాయం చేసిన వారికి లంగకుండా తమ పరిధిలో తమ ధిక్కారాన్ని, తిరుగుబాటు చేశారు.

గురజాడ రచించిన దేశభక్తి గేయాన్ని శ్రీశ్రీ ఈ గీతం సమస్త ప్రపంచ మహాజనుల జాతీయగీతం అని ప్రశంసించారు. నిదేశమును ప్రేమించుమన్నా/మంచి యన్నది పెంచుమన్నా /వొట్టి మాటలు కట్టిపెట్టోయ్/ గట్టిమేల్ తలపెట్టవోయ్. ఇందులో ఒట్టి మాటలు, ప్రగల్భాలు చెప్పద్దని దేశంకోసం ఏమైన చేసి చూపించ మని చెప్పారు. నిసొంతలాభం కొంతమానుకు/పొరుగు వాడికి తోడ్పుపడవోయ్/చెట్టపట్టాల్ పట్టుకొని, దేశస్థ లంతా నడవవలనోయి/ అన్నదమ్ముల వలెను జాతులు మతములన్ని మెలగవలెనోయి అని సర్వమానవ సమైక్యతను చాటిచెప్పారు.

అప్పటి వరకు రాజ్యమేలుతున్న గ్రాంథికభాషను విడనాడి అందరికీ అర్థమయ్యే వ్యావహరిక భాషలో కులమత ద్వేషాలు లేని, దురాచారాలు, మూఢ నమ్మకాలు రూపుమాపిన, సోదరభావము, ప్రేమతత్వాన్ని కలిగిన, స్త్రీ పురుష సమానత్యంతో కూడిన ఆదర్శ సమాజం నిర్మాణమవ్వాలని తన సాహిత్యం ద్వారా కృషి చేశారు గురజాడ అప్పారావు గారు.

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో తెలుగు సాహిత్యం

– డా॥. పి. కమల సుధారాణి, సహాయాచార్యులు, తెలుగు శాఖ, ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాదు.

సాహిత్యం అంటే సంహితం. ఎంతో కొంత మేలు చేయటమే సాహిత్య లక్ష్యం. సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది. సమకాలీన సమాజంలోని అనేక అంశాలు సాహిత్యంలో ప్రతిబింబించటం ద్వారా సమాజస్థితిగతులు, ఆవశ్యకాంశాలు తెలుస్తాయి.

మనం మనం కలిస్తే జనం
జనం జనం కలిస్తే సమాజం

సమాజానికి మూలం కుటుంబ వ్యవస్థ. ఆ కుటుంబానికి మూలం వివాహవ్యవస్థ. అందుకే భారతీయ కుటుంబ జీవన సర్వకాలాల్లో ఆదర్శప్రాయంగా ఉంది. ఇదే భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పటిష్టతకు పునాదిగా నిలుస్తోంది. ఏ కాలం వారైనా, ఏ యుగం వారైనా, ఎవరైనా ఇష్టపడేది రామరాజ్యం. కారణం అన్ని రంగాలలో, అన్ని కోణాల్లో ప్రజలు సుఖ, సంతోషాలతో ఉన్న కాలమది, సమాజమది. అందుకే ఆదర్శ జీవన విధానానికి, సమాజానికి ప్రతీకగా ఆదికవి వాల్మీకి రామాయణం రచించారు. అది అన్ని కాలాల్లో, వర్గాల్లో, జాతుల్లో, మతాల్లో కూడా పరివ్యాప్తమయిన కథ మాత్రమే కాదు, జీవన మూల్యాలను బోధించే ఒక సాహిత్యం. రామాయణంలో ఏ పాత్రని చూసినా ఏదో ఒక విలువను, జ్ఞానాన్ని బోధించటం గమనార్హం. ముఖ్యంగా తెలుగు సాహిత్యంలోని సాహిత్య ప్రక్రియలన్నీ సమాజంలోని వ్యక్తులను ఉన్నత దిశగా పయనింపచేసే విధానంలో రచింపబడినాయి. ఆదికవి వాల్మీకి రామాయణం వ్యక్తిత్వ నిర్మాణాన్ని ఉపదేశిస్తే, భారతం వ్యక్తిలో అభివ్యక్తి నైపుణ్యాలను చెపుతూ దిశానిర్దేశం చేసింది.

పోతన భాగవతం స్నేహాన్ని, సేవాగుణాల్ని, దాస్యభక్తిని ప్రబోధించింది. భగవద్గీత కార్యోన్ముఖత ఆవశ్యకతని విశ్లేషించింది. ఇక ప్రబంధాలు, పురాణాలు, నాటకాలు, ఇతిహాసాలు అన్నీ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూనే తద్వారా ఆదర్శ సమాజ నిర్మాణం ఎలా చేసుకోవాలో బోధించాయి.

1. రామాయణం వ్యక్తిత్వ నిర్మాణం ఆవశ్యకతని చాలా కోణాల్లో, అనేక పాత్రల ద్వారా చెప్పటం జరిగింది. రాముడు ఆదర్శ పురుషుడు అయితే సీతమ్మ ఆదర్శ స్త్రీమూర్తి. భర్తని అనుసరించటమే కాదు, భర్తకు చెడు కీర్తి తేరాదని తనను వీపుపై తీసుకెళతాను అన్న హనుమతో బిడ్డ వంటి నీతో రావచ్చును. కానీ అలా వస్తే రామునికి - రావణునికి తేడా ఉండదని సున్నితంగా తిరస్కరించిన విధానం సర్వకాలాల్లో ఆదర్శనీయం, అనుసరణీయం. రావణుడు దొంగతనంగా సీతను తెస్తే, సీతకు దొంగతనంగా వెళ్ళాల్సిన అవసరం లేదు. ఆమె రాజపుత్రి, రాజపత్ని. కనుకనే హనుమతో వెళ్ళలేదు. ప్రతి స్త్రీ తాను వేసే అడుగు ఆలోచించివేయాలని సూచించే విధంగా రామాయణంలో అనేక సంఘటనలున్నాయి. అవన్నీ గమనిస్తే, ఆచరిస్తే ఆదర్శ సమాజ నిర్మాణం సుసాధ్యం.
2. మహాభారతం సర్వశాస్త్ర సంగ్రహం. ఇందులో లేని శాస్త్రం లేదు, విషయం లేదు. తెలుగు సాహిత్యంలో అత్యున్నత విలువలతో కూడిన జ్ఞానాన్ని ఇచ్చే అద్భుత గ్రంథం భారతం. ఇందులో ప్రతి కథ మానవ జీవన నిర్మాణానికి అత్యున్నత సోపానాలుగా ఉన్నాయి. ఉదా : (1) కచదేవయాని కథ - గురుశిష్య సంబంధ పవిత్రతను చాటుతుంది. (2) నల దమయంతుల కథ వ్యక్తుల గుణశీలతకు ప్రతీకగా చెప్పవచ్చు.
3. మహాభాగవతంలో దాస్యభక్తి, శరణాగతి అనే అంశాల ద్వారా ఎలా లక్ష్యం చేసుకోవాలో చెప్పడం

జరిగింది. గజేంద్రమోక్షం అనే కథ ద్వారా శరణాగతి, విశ్వాసం ఉంటే ఏ శక్తి అయినా దిగి వచ్చి రక్షిస్తుంది అని కవి చెప్పటంలో అంతర్యం మానవుల సందేహ పూరిత ఆలోచన ఉండరాదని చెప్పటం గమ నించదగిన అంశం.

4. భగవద్గీతలో శ్రీకృష్ణుడు కర్మ సిద్ధాంతాన్ని చెప్పటం ద్వారా కార్యోన్ముఖతని ఉపదేశించారు. పని చేయటం మానరాదు. ఫలితం కాలానికి, దైవానికి వదలాలని చెప్పటం సర్వకాలాల్లో అనుసరణీయ మైన అంశం.

5. తొలి తెలుగు ప్రబంధమై మనుచరిత్రలో వరూధిన, ప్రవరాఖ్యుల చరిత్ర ద్వారా గుణశీలాల ప్రాధాన్యం నొక్కి చెప్పారు. అల్లసాని వాని అల్లిక జిగిబిగిగా సాగిన ఈ రచనలో మానవీయ విలువలు, నైతిక నియమాలు ఆదర్శ సమాజానికి పునాదులుగా చెప్పబడినాయి.

6. తొలి తెలుగు సాంఘిక నాటకం కన్యాశుల్కం ద్వారా సమాజంలో సాంఘిక దురాచారాలు, మూఢ నమ్మకాలు వాటి ఫలితాలు చెప్పబడటం ద్వారా ఆదర్శప్రాయ మానవ జీవన ఆవశ్యకతను తెలిసేలా చేశారు. 100 సం॥ల తర్వాత కూడా ఈ నాటకంలోని ప్రతిపాత్ర సజీవంగా నేటికీ కనబడు తూనే ఉంది. దీన్ని బట్టి ఆదర్శ సమాజ నిర్మాణంలో సాహిత్యం ఎన్ని రకాలుగా ఉంటుందో తెలుస్తూనే ఉంది.

7. తొలి నవల రాజశేఖర చరిత్ర ఆనాటి సామాజిక దురాగతాలకు, అంధవిశ్వాసాలకు అద్దంలా నిల బడింది. తర్వాత సమాజ వికాసానికి అవసరమైన మార్పులు సూచనప్రాయంగా బోధించబడినాయి. ఇదే సాహిత్యానికున్న శక్తి. యుక్తితో ఏదో ఒక ప్రక్రియారూపంలో ఆదర్శ సమాజ నిర్మాణానికి అవసరమైన విషయాలను అందిస్తూనే ఉంటుంది.

8. పానుగంటి లక్ష్మీనరసింహం పంతులు గారి సాక్షి వ్యాసాలు సాహితీ ప్రియులకు ఆకర్షించటమే కాదు, ఆలోచింపచేశాయి. అనేక సంఘటనలు, వాటి ఫలితాలను కలల రూపంలో చెప్పడం కవి ప్రత్యేకత. ఎలా చెప్పినా సమాజంలోని దౌర్బల్యా లను ఖండించటమే లక్ష్యం. తద్వారానే సమ సమాజం, ఆదర్శసమాజం నిర్మించటం సుసాధ్యం.

9. కందుకూరి వీరేశలింగం గారి వ్యాసావళి యావత్ ప్రజల్ని ఆలోచింపజేశాయి.

10. చిలకమర్తి వారి ప్రహసనాలు, రాయప్రోలు, గురజాడల రచనలు అన్ని కోణాల్లో సమాజంలోని లోపాలను సరిదిద్దాల్సిన ఆవశ్యకతలను వివ రించారు.

11. ఆధునిక కవి సి.నా.రె. వ్యక్తిశ్రేయస్సు కన్నా సమాజశ్రేయస్సు ముఖ్యమని కర్పూర వసంత రాయలు నాటకం ద్వారా అపూర్వంగా చెప్పారు. జాషువా కుల పంకిలం లక్షసబ్బులతో కడిగినా పోవని సమసమాజ నిర్మాణం ఆకాంక్షించారు. కత్తి కన్నా కలం గొప్పదంటూ ఆధునిక కవులు ఎన్నెన్నో రచనలు చేశారు. దాశరథి, శ్రీశ్రీ వంటి వారు సామ్యవాద సమాజ నిర్మాణానికై రచనలు చేశారు.

12. తెలుగు సాహిత్యం సముద్రంలా ఎన్నో మణులు, మాణిక్యాలు, రత్నాలు, పగడాల వంటి రచనలతో చక్కని సమాజ నిర్మాణానికి కావల్సిన విషయా లెన్నెన్నో అందించింది.

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణానికి గురజాడ అప్పారావు గారి సాహిత్య కృషి

- వేముల కమలాకర్ సుజాత, రాజేంద్రనగర్ మండలం, రంగారెడ్డి జిల్లా.

సమాజం అనగా కొన్ని కుటుంబాల కలయిక. ఒక దేశ బాగోగులు ఆ దేశ ప్రజల ప్రవర్తన తీరుపై ఆధార పడి ఉంటుంది.ఉన్నత ఆశయాలు, లక్ష్యాలతో నడుచు కున్న సమాజమే ఆదర్శ సమాజంగ మారుతుంది. అసమానత లేని సమాజం మరియు విభజన లేని సమాజమే ఆదర్శ సమాజంగా మారుతుంది. ఆదర్శ సమాజ నిర్మాణంలో వ్యక్తులు, వ్యవస్థలు, వివిధ రంగాలు, కళలు, సాహిత్యం ఇలా అనేక అంశాలు వారితో ముడిపడి ఉంటుంది.

కవి శేఖర అనే బిరుదాంకితుడు, అభ్యుదయ రచయిత... మహాకవి మహాపురుషుడు గురజాడ మహాకవి,అభ్యుదయ కవితాపితామహుడు రచయిత, సంఘ సంస్కర్త, తెలుగు సాహితీకారులు, అభ్యుదయ వాది గురజాడ అప్పారావు సాంఘిక పరివర్తన అభ్యుదయ సాహిత్యోద్యమం గురించి దూరదృష్టితో... ఆంగ్ల రచయితగా గురజాడ అప్పారావు - అభ్యుదయ సాహిత్యపు అగుడుజాడ గురజాడ. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సాహితీకారుడు గురజాడ అప్పారావు. హేతువాది గురజాడ -గురజాడ ప్రప్రథమ ఆధునిక కథానిక రచయితఐన సాహిత్యంతో మెరుగైన సమాజ నిర్మాణానికి నిరంతరం కృషి చేసిన అభ్యుదయ వాది గురజాడ.

మన తెలుగు సాహిత్యానికి వెలుగు చూపిన గురజాడ అప్పారావు విశాఖపట్నం జిల్లా యలమంచిలి తాలూకా రాయవరంగ్రామములో 21-9- 1862 తాతగారింట జన్మించాడు. ఈయన తండ్రి రామదాసు. తల్లి కౌసల్యమ్మ. గురజాడ అప్పారావు ప్రాథమిక విద్యను చీపురు పల్లిలోనూ, ఉన్నత విద్య విజయనగరంలోనూ చదివి బి.ఏ. పాసయ్యాడు. ఆయన చదువుకునే రోజుల్లోనే ఎన్నో కవిత్వాలు రాసేవాడు. బి.ఏ. చదివాక విజయనగర కళాశాలలో 1891 లో అధ్యాపకుడుగా చేరాడు. అక్కడ ఆయనకు విజయనగర రాజు ఆనంద గజపతితో స్నేహం ఏర్పడింది. ఈయన విద్యకు, విద్యార్థులకు వన్నె తేవాలని కలలు కన్నాడు. అందుకే ఆయనకు ఎందరో ప్రియతమ శిష్యులయ్యారు. సాంఘీక దురాచారాలను తన కవిత్వము ద్వారా బయట పెట్టిన మహనీయుడు గురజాడ. మూఢనమ్మకాలను, మూఢాచారాలను, బాల్యవివాహాలను, అంటరానితనాన్ని కులవ్యవస్థలను వ్యతిరేకించాడు. అందుకే ఆయన కన్యాశుల్కము, ముత్యాలసరాలు, దిద్దుబాటు, కొండుభట్టీయము, మొదలగు గ్రంధాలను రాశాడు. పుత్తడిబొమ్మ గేయాలు, కన్యక గేయాలు రాశాడు. జాతీయోద్యమం కోసం దేశభక్తి గేయం రాశాడు. ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్ అంటాడు. సమాజానికి పట్టిన వేరు పురుగులను నాశనం చేస్తే దేశమనియెడు దొడ్డవృక్షం ప్రేమలను పూవెత్తునంటాడు గురజాడ. మతములన్నియు వెలుగునంటాడు.

మంచిచెడ్డలు మనుజులందున
యెంచిచూడగ రెండేకులములు
మంచియన్నది మాతయైతే
ఆమాలనేనవుతానంటాడు - ఈయన.
కపులకల్పన కలిమివెన్నో
వన్నెచిన్నెలు గాంచువస్తువు
లందు వెర్రి పురాణాగాధలు
నమ్మజెల్లునె పండితుల్

అంటూ ఇవిపుక్కింట పురాణకథలని ప్రజలలో మూఢనమ్మకాలు పోగొట్టుటకు ప్రయత్నించాడు. ఆ రోజులలో 5 సం॥ల లోపు ఆడపిల్లలకి కన్యాశుల్కము

ఇచ్చి పెళ్ళిళ్ళు చేసుకొనేవారు. కడుపులోవున్నది ఒకవేళ ఆడబిడ్డ అయితే ముందుగా శుల్కముఇచ్చేవారు. ఇది సాంఘిక దురాచారమని కన్యాశుల్కమును రచించాడు. ఇంతేకాదు పుత్తడిబొమ్మ పూర్ణమ్మ అంటూ బాల్య వివాహాలపై ధ్వజమెత్తాడు.

కాసుకు లోనై తల్లీద్రండ్రీ
నెనరూ న్యాయము వీడి
పుత్తడి బొమ్మ పూర్ణమ్మను ముదు
సలి మెగుడికి ముడివేస్రి.

డబ్బుకాశపడి తల్లీదండ్రులు పూర్ణమ్మను ముసలి వానికిచ్చి పెళ్లి చేస్తే పూర్ణమ్మ అవమానంతో చనిపోతుంది. ఈ పాటను ప్రజలో ప్రచారం చేయించి బ్యాలవివాహ వ్యవస్థను నిరసించాడు. రాజు మధాండుడై వైశ్య కన్యకను పట్టబోతే పట్టపగలే నట్టి వీధిని, పట్టబోరే జార చోరులు పట్టదల చతివింక నీవొక పట్టమేలే రాజువట చేతనైతే పట్టమంటూ రాజును సవాలు చేసి మంటలో దుమికింది. అచ్చట నున్న వారిని మేల్కొలిపింది. ఇలాంటి సామాజిక దురాచారాల పై ప్రజల్ని మేల్కొల్పే ఎన్నో కవిత్వాలు రాశారాయన.

ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికొక చరిత్ర, ఆ చరిత్రకొక పరిణామం ఉంటాయి. సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవి స్థానం నిర్ణీతమౌతుంది. కవి ప్రగతిశీలి, ప్రతిభాశాలీ అయితే, ఆ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ అప్పారావు.

సామాజిక స్వప్నమున్న రచయిత :

దృష్టిలో సమాజం ఎలా ఉండాలి అన్న భావనే. ఏ సామాజిక స్వప్నమూ లేకుండా ఏ రచయితా ఏమీ రాయరు, రాయలేరు. సామాజిక స్వప్నాలు రచయితలకు తమ సమకాలీన జీవితానుభవం లోంచే రూపుదిద్దు కుంటాయి. సమాజ చరిత్రను అర్థం చేసుకొని, దానికి వర్తమానాన్ని అన్వయించు కొని, భవిష్యత్తును గురించి ఆలోచించే క్రమంలో సామాజిక స్వప్నాలు ఏర్పడతాయి. గత, వర్తమానాల పట్ల అసంతృప్తిలోంచి, భవిష్యత్తును ఆశావహంగా తీర్చిదిద్దుకోవాలన్న సంకల్పం సామాజిక స్వప్నానికి పునాదిగా ఉంటుంది. సామాజిక స్వప్నం అందరు రచయితలకూ ఒకే తీరుగా ఉండదు. ఆయా రచయితల సామాజిక చైతన్యాన్ని బట్టి, సామాజిక స్వప్నాలుంటాయి. ఉత్తమమైన సామాజిక స్వాప్నికులలో ఆధునిక తెలుగు రచయితలలో గురజాడ అప్పారావు ప్రముఖులు. ఆయన సామాజిక స్వప్నం ఇది.

ఎల్లలోకము ఒక్కయిల్లె - వర్ణ భేదములెల్ల కల్లైవేలనెరుగని
ప్రేమబంధము - వేడుకలు కురియ
మతములన్నియు మాసిపోవును - జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును
అంత స్వర్గ సుఖంబులన్నవి - అవని విలసిల్లున్
(ముత్యాల సరములు)

గురజాడ అప్పారావు ఈ స్వప్నాన్ని ప్రకటించి సరిగ్గా నూట పదకొండు సంవత్సరాలైంది. కానీ ఆయన కోరుకున్న మంచి సమాజం ఇంకా కలగానే మిగిలి ఉంది. అందు వల్ల ఆ స్వప్నం ఇంకా ప్రాసంగికత కలిగి ఉంది. గురజాడ తన స్వప్నం సాకారం కావడానికి అడ్డంగా ఉన్న సకల సామాజికాంశాలనూ విమర్శకు పెట్టారు. ఆ క్రమంలో కొన్ని అద్భుతమైన, అర్థవంతమైన వాక్యాలను మనకందించి పోయారు. ఆ వాక్యాలను వ్యాఖ్యా నించుకుందాం.

కుటుంబంలో భార్యాభర్తల మధ్య ఆయన యజమాని - బానిస సంబంధాలను తిరస్కరించి స్త్రీ పురుష సమానత్వాన్ని కోరు కున్నారు. భర్త భార్యకు దేవుడనే భూస్వామ్యయుగ భావనను తిరస్కరించి, భార్యకు ప్రాణస్నేహితునిలాగా ఉండాలని కోరుకున్నారు. ఈ మార్పు ఆకాశంలోంచి ఊడిపడదని ఆయనకు తెలుసు. భూస్వామ్య వ్యవస్థలో నష్టపోయిన స్త్రీలే ఈ మార్పును తీసుకురావాలని ఆయన భావించారు. అందుకే

ఆధునిక మహిళ మానవ చరిత్రను తిరిగి రచిస్తుంది : స్త్రీ పురుష సంబంధాలను, భూస్వామ్య కుటుంబ వ్యవస్థను గురజాడ తీవ్రమైన విమర్శకు పెట్టారు. ఆ వ్యవస్థ మీద, ఆ సంబంధాల మీద స్త్రీ పాత్రలతో తిరుగు బాటు చేయించారు. కన్యాశుల్కం నాటకంలో ''నన్నడ క్కుండా సుబ్బికి పెళ్ళెందుకు నిశ్చయించావు'' అని వెంకమ్మ అగ్నిహోత్రావధానిని నిలదీసింది. తనను మోసగిస్తున్న గిరీశంను కొట్టడానికి పూటకూళ్ళమ్మ చీపురు తీసుకొని మధురవాణి ఇంటికి వెళ్ళింది. తనకు జరిగిన అన్యాయం తన చెల్లెలికి జరక్కూడదని బుచ్చమ్మ గిరీశంతో వెళ్ళిపోయింది. తనను అనుభవించి, తాను చెడిపోయిందని ప్రచారం చేస్తున్న రామప్ప పంతులును తనను పెళ్ళాడమని చెరువు కట్టదాకా తరుముతుంది మీనాక్షి. అవిధేయ భర్త అయిన కరటక శాస్త్రికి, అతని భార్య, అతనికి ఇష్టం లేని దొండకాయ కూర వండిపెట్టి నిరసన ప్రకటిస్తుంది. ఈ కరటకశాస్త్రి ''మా యిళ్ళళ్ళకు కోపం వస్తే చీపురు కట్టలు ఎగురుతుంటాయి'' అంటాడు. 'దిద్దుబాటు' కథానికలో కమలిని దారి తప్పుతున్న భర్తను బెదిరింపు లేఖ రాసిపెట్టి సంస్కరించుకుంటుంది. ఈ ఉదాహరణలన్నీ భూస్వామ్య కుటుంబ సంబంధాల మీద తిరుగుబాట్లే. భూస్వామ్య కుటుంబ సంబంధాలను తిరస్కరించిన గురజాడ పెట్టుబడిదారీ కుటుంబ సంబంధాలను కూడా సమర్థించలేదు.

కన్యాశుల్కం నాటకంలోనే మధురవాణి అంటుంది. ''ఇదే నేను కాపు కన్నెనై పుట్టి ఉంటే, నా అన్నవాళ్ళు ఉండేవారు. భర్తతోపాటు పొలంలో పనిచేస్తూ గౌరవంగా బతికేదానిని'' అని. భార్యాభర్తలిద్దరూ పనిచేస్తూ పరస్పరం గౌరవించుకుంటూ బతకాలన్నది మధురవాణి ప్రతి పాదన. గురజాడ 'సౌదామిని' అనే నవల రాయడానికి రాసిపెట్టుకున్న నోట్సులో భారతదేశంలో ప్రతి స్త్రీ ఒక వంటలక్కగా ఉండిపోయిందనీ, దీనివల్ల చాలా శ్రమ వృథా అవుతున్నదనీ, అందువల్ల గ్రామంలో సార్వజనీన భోజనశాలలు ఉండాలనీ, అందరూ అక్కడ తిని, పోయి వత్తుల్లో పాల్గొనాలనీ ... అభిప్రాయపడ్డారు. భార్యాభర్తల మధ్య ధన ప్రమేయంలేని, అధిపత్యం లేని సంబంధాలు నెలకొనాలన్నారు. ''మగడు వేల్పన పాత మాటది'' అంటే భూస్వామ్య స్త్రీ పురుష సంబంధాలు నిర్మూలింపబడా లని.... ''ప్రాణసఖుడ నీకు'' అని భర్తతోనే చెప్పించారు గురజాడ. అది ఆయన చమత్కారం. భార్యాభర్తలు ప్రాణస్నేహితులుగా ఉండాలన్న ఆకాంక్ష : నాటికి అత్యాశే. కాని ఈనాడు ఫలిస్తోంది. గురజాడ కవిత్వంలో ఇదొక మహా వాక్యం.

బ్రతికి చచ్చియు ప్రజల కెవ్వడు
ప్రీతిగూర్చునొ - వాడె ధన్యుడు

(డామన్ పితియస్)

గురజాడ కుటుంబ సంబంధాల్లోనే కాదు, మొత్తం మానవ సంబంధాల్లోనే స్నేహసంబంధాలు ఉండాలని కోరుకున్నారు. అనేక కారణాల చేత విభజితమై ఉన్న సమాజంలో మనుషుల మధ్య ఆరోగ్యకరమైన సంబం ధాలు ఏర్పడలేదు. వివక్ష, అధిపత్యం, అసమానత్వం - వీటి మూలంగా మానవుల మధ్య ఉండవలసిన సహజ సంబంధాలు కృత్రిమంగా మారిపోయాయి. తలకిందు లుగా నిలబడిపోయాయి. ఫలితంగా పరస్పరాహ రణోద్యోగం, పరపీడన పరాయణత్వం పెరిగి పోయాయి. గురజాడ ప్రజలు స్నేహితులుగా బతకాలని కోరుకున్నారు. అందుకే గ్రీకు సాహిత్యంలోంచి డామన్, పితియస్ అనే ఇద్దరు స్నేహితుల కథను తీసుకొచ్చి అదే పేరుతో కవిత రాశారు. ఇది ఒకరి కోసం ఇంకొకరు ప్రాణమివ్వడానికి సిద్ధపడిన స్నేహితుల కథ. మనిషి బతికున్నా, మరణించినా ప్రజలకు మేలుచేయాలి, ప్రీతిని కలిగించాలి, అప్పుడు అతని జన్మ ధన్యం అంటుంది ఈ కవిత. దేశ స్వాతంత్ర్యం కోసం నాయకులు, ప్రజలు త్యాగాలకు పూనుకుంటున్న సమయంలో ఈ కవిత వ్యక్తి త్యాగాన్ని కీర్తించింది. క్రమక్రమంగా స్వార్థం బలిసిపోతున్న వ్యవస్థలో ఉన్న మనం గురజాడ ప్రబోధాన్ని ఒక్కసారి అర్థం చేసుకుంటే మనకు కర్తవ్యం బోధపడుతుంది.

వర్ణ ధర్మ మధర్మ ధర్మంబే :

కులవ్యవస్థ భారతీయ సమాజానికి చేసిన నష్టం విలువ కట్టడం సాధ్యం కాదు. ప్రజల్ని వేలకు వేలు కులాలుగా విభజించడం వల్ల సాంఘిక ఐక్యత దెబ్బతిని, భారత జాతి బలహీనపడింది. ఈ కుల వ్యవస్థను శాశ్వతం చెయ్యడానికి వైవ, కర్మ, జన్మ సిద్ధాంతాలు సృష్టించి జాతిని నిర్వీర్యం చేశారు మన పూర్వీకులు. ఈ కారణంగానే భారతదేశం అనాదిగా పరాయిపాలనలో మగ్గిపోయింది. ఈ కుల వ్యవస్థను నిర్మూలించడానికి భారతదేశంలో అనేక ప్రయత్నాలు జరిగాయి. వర్ణవాదుల బలం ముందు ఆ ప్రయత్నాలు విఫలమౌతూ వస్తున్నాయి.

నిన్నటికి నిన్న కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా భౌతిక దూరం పాటించమని శాస్త్రజ్ఞులు చెబితే, చూశారా మా సిద్ధాంతమే నేడు ప్రపంచానికి ఆదర్శమైంది అని ఒక కవి పుంగవుడు పద్యం రాసి రాగం తీశాడు. అంటే వర్ణ సర్పం ఏ సమయంలోనైనా పడగవిప్పి కరవడానికి సిద్ధంగా ఉందన్నమాట. ఇలాంటి సమయంలో ఒక బాధ్యతగల కవి నూట పదేళ్ళ క్రితం వర్ణ ధర్మాన్ని అధర్మ ధర్మం అని తీర్పునిచ్చాడు. ఇది మరో గొప్ప మహావాక్యం. 'లవణరాజుకల' కవితలో గురజాడ రాజుకు, దళిత మహిళకు వర్ణాంతర, ప్రేమ వివాహం చేశాడు. వర్ణ వ్యవస్థను కాపాడే రాజు చేతనే గురజాడ వర్ణ వ్యవస్థలోని దుర్మార్గాన్ని చెప్పించడం విశేషం. ఎల్లలోకం ఒక్క ఇల్లు కావాలంటే వర్ణభేదము లెల్ల కల్ల కావాలి. అలా ఎప్పుడు జరుగుతుంది? కులాంతర వివాహాలు జరిగినప్పుడే. గురజాడ ఆ పెండ్లే చేశారు. పాల్కురికి సోమన, వేమన, అన్నమయ్య, వీరబ్రహ్మం లాంటి వాళ్ళు కుల వివక్ష నిర్మూలనను చెప్పారేగానీ, కుల నిర్మూలనను చెప్పలేదు. శ్రీరంగరాజ చరిత్రలో రాజుకు, గిరిజన మహిళకు పెండ్లి జరిగినా చివరకు అది కులాంతర వివాహం కాదు, మేనరికం అని తేలిపోయింది. 'మాలవాండ్ర పాట' కూడా అందరూ సమానమని చెప్పిందే గానీ, 'లవణ రాజు కల' లాగా కుండబద్దలు కొట్టినట్లు వర్ణ ధర్మం అధర్మ ధర్మం అని చెప్పలేదు.

దళితుడు ఎదురైనప్పుడు ఆలింగనం చేసుకోనివాడు మనిషెలా అవుతాడు? అన్నాడు గురజాడ ఒకచోట. 1910 నాటికి ఇది విప్లవమే. ''కవి, ప్రవక్తా కాలం కన్నా ముందుంటారు'' అన్న గురజాడ మాటకు ఆయనే ప్రథమోదాహరణం. ఏ రోజు బౌద్ధాన్ని దేశం ఎల్లలు దాటించామో ఆ రోజే మన దేశం మత విషయకంగా ఆత్మహత్య చేసుకుంది అనడానికి కూడా గురజాడ వెనుకాడలేదు. ఇది 1909 నాటి మాట. ఈ మహావాక్యాన్ని ప్రతి గ్రామం ప్రవేశద్వారంలోనూ అధికారికంగా రాసిపెట్టి ప్రచారం చేయాలి. గౌతమబుద్ధుని విగ్రహాలకు పూల మాలలు వేస్తూ, ఉద్యానవనాలు నిర్మిస్తూ, అంబేద్కర్ విగ్రహాల మీద దాడులు చేసే కుటిల నీతికి గురజాడ వాక్యాలే విరుగుడు.

ఎరిగి కోరిన కరిగి యీడో ముక్తి :

మనిషి : సమాజాన్ని ఒక వ్యవస్థనుంచి మరొక వ్యవస్థలోకి తీసుకుపోవాలంటే - అంటే పాత వ్యవస్థను నిర్మూలించి, కొత్త వ్యవస్థను నిర్మించాలంటే, భావవాదం ఏమాత్రం ఉపయోగపడదు. దానికి భౌతికవాదమే శక్తివంతమైన ఆయుధం. భావవాదులుగా ఉంటూ సమాజాన్ని కొంత మరమ్మతులు చేయవచ్చు భౌతిక మంటే మానవాతీత శక్తులను నమ్మకపోవడం. మనిషిని చరిత్ర నిర్మాతగా గుర్తించడం. గురజాడ 'మనిషి' కవిత ఈ వాస్తవాన్నే ప్రబోధిస్తోంది. మన సమాజంలో ఆర్థిక సాంఘిక వైరుధ్యాలుండడానికి కారణం మనుషులే. మనుషులు నిర్మించు కొన్న వ్యవస్థే. వైరుధ్యాల సమాజ నిర్మాణం చేసింది మనుషులే అయినట్లు, దాని నిర్మూలన కూడా మనుషులే చెయ్యాలి. ఈ వాస్తవాన్ని విగ్రహారాధనను ఆధారం చేసుకొని గురజాడ మనిషికి ముక్తినిచ్చేది దేవుళ్ళు కాదు మనుషులే అని చెప్పాడు. 'ముక్తి' అంటే సమస్యలకు పరిష్కారం. విగ్రహాలను మనిషి చెక్కుతున్నాడు. ఆ విగ్రహానికి మహిమ ఉందని పూజిస్తూ, ఆ విగ్రహాన్ని చెక్కిన ఆ మనిషిని రాయిరప్పల కన్నా హీనంగా ఎందుకు చూస్తారు? అని ప్రశ్నించారు

గురజాడ. దేవుడు ఎక్కడో కొండ కోనలలో ఉన్నాడని వెతికితే ఫలితం లేదు. సాటి మనిషిలోనే దేవుడున్నాడని, అతనిని అడిగితే ముక్తి ఇస్తాడని చెప్పారు. గురజాడ మనిషిని ఊహనుంచి వాస్తవంలోకి లాక్కొచ్చి వదిలారు. మానవశక్తికి అత్యున్నత గౌరవమిచ్చారు. ప్రతి మనిషికి ఇంకొక మనిషి పట్ల గల బాధ్యతను కూడా గుర్తుచేశారు. అందుకే ఈ వాక్యం గురజాడ కవిత్వంలో మరో మహా వాక్యం. 1910లో మనిషే దేవుడు అనడానికి కవికి ఎన్ని గుండెలుండాలి! ఈ నూట పదేళ్ళలో మత వ్యవస్థ మర్రిచెట్టులా విస్తరించింది. అజ్ఞానమే జ్ఞానమై రాజ్యమేలుతున్నది. అత్యంత ఆధునిక ప్రచార ప్రసార సాధనాలను ఉపయోగించుకొని అజ్ఞానాన్ని సరికొత్త వ్యాఖ్యానాలతో జనం మీదికి చిమ్ముతున్నారు. ప్రశ్నించిన వాళ్ళను వెంటాడి, వేటాడి హింసిస్తున్నారు. ''మతము లన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును'' అన్న గురజాడ మాట ఇవాళ తలకిందులైంది. దానిని నిటారుగా నిలబెట్టినప్పుడే భూమి స్వర్గంగా మారుతుంది.

దేశమును ప్రేమించమన్నా
మంచియన్నది పెంచుమన్నా

(దేశభక్తి)

1910లో గురజాడ కోకిల పాడిన కమ్మని పాట 'దేశభక్తి' కవిత. ఈ కవితకు ఆయన 'దేశాభిమానం' అని పేరు పెట్టారు. కందుకూరి కూడా 'దేశాభిమానం' పేరుతో వ్యాసాలు రాశారు. ఇది అప్పటి భారతీయులకు తెలుగు కవి ఇచ్చిన పిలుపు. ఇది ఒక కొత్త పిలుపు. ''సుజలాం సుఫలాం మలయజ శీతలాం'' అనే దేశభక్తికి భిన్నంగా దేశమంటే మనుషులు అని కొత్త అర్థం చెప్పిన కవిత ఇది. ఇప్పటికీ దేశభక్తి చర్చనీయాంశంగా ఉంది. మనుషుల్ని కులం పేరిట, మతం పేరిట, ఆహారం పేరిట ఇంకా సవాలక్ష మౌఢ్యాల పేరిట హింసిస్తూ దేశభక్తుల ముసుగులో తిరగడం కొనసాగుతున్నది. అసలైన దేశభక్తి మనుషులను ప్రేమించడంలో ఉందని ఈ పంతులు చెప్పిన పాఠం ఇంకా మతోన్మాదుల బుర్రకెక్కలేదు. అందుకే ఈ మహావాక్యానికి ఇంకా ప్రాసంగికత ఉంది. మనుషుల్ని ప్రేమించడం, మానవ శ్రమతో దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవడం, స్వయం సమృద్ధిని సాధించడం, కులమత మౌఢ్యాల నుంచి విముక్తమై దేశ ప్రజలంతా ఒక తల్లీబిడ్డలుగా బతకడం గురజాడ దృష్టిలో దేశభక్తి. వెనక చూపును ఆమోదించలేదు గురజాడ. వెనకచూపే దేశభక్తిగా ప్రచారం చేసే విశ్రాంతి జీవులు గురజాడ దగ్గర చదువుకోవాలి.

దేశ మనియెడి దొడ్డవక్షం
ప్రేమలను పూలెత్త వలెనోయి

ప్రజలమధ్య ద్వేషాగ్నులను రగిల్చే వాళ్ళకు ఈ మాట చాలు. మనుషుల మధ్య ప్రేమను పాదుచేయడమే గురజాడ ప్రబోధించిన దేశాభిమానం. మానవ ప్రేమ పునాదిగా కులమతాల ప్రసక్తిలేని లౌకిక భారతదేశం ఆవిర్భవించేదాకా, జ్ఞానమయమైన సమాజం రూపొందేదాకా గురజాడ మహా వాక్యాలకు ప్రాసంగికత ఉంటుంది. భారతీయ లౌకిక, భౌతిక, ప్రజా తంత్ర వాదులందరూ గురజాడను నిరంతరం అధ్యయనం చేస్తూ ఆదర్శ వాదులందరూసమాజాన్నిఅభ్యుదయం వైపు పయనింప చేయ్యాలి.

గురజాడ వెంకట అప్పారావుగారు సాహితీ రంగంలో నూతన ఒరవడిని సృష్టించిన నవయుగ వైతాళికుడు ముత్యాల సరాలుతో ముచ్చటగా చెప్పిన దేశభక్తి'' ''ప్రభోధకుడు విశ్వమానవ ప్రేమికుడు. మూఢ నమ్మకాలను వ్యతిరేకించి ఎండగట్టిన అభ్యుదయవాది.

❖❖❖

జాషువా గబ్బిలంలో - సామాజిక దృక్పథం

- డా॥. ఎల్. కస్తూరి, తెలుగు అధ్యాపకులు, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, తిరుపతి.

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో విశిష్ట స్థానాన్ని పొందిన కవులలో జాషువా ఒకరు. అభ్యుదయ భావాలు కలిగిన అభ్యుదయ కవి. గబ్బిలం, కాంధీశీకుడు, నేతాజీ, బాపూజీ, స్వయం వరం, రాష్ట్రపూజ, కొత్తలోకం, పిరదౌసి, ముంతాజ్ మహల్, క్రీస్తు చరిత్ర వంటివి ఖండకావ్యాలు. లఘు కావ్యాలు, పద్య గద్య, స్వీయ కావ్యాలను రచించారు. కవికోకిల, కవితావిశారదా, మధుర శ్రీనాథ, నవయుగ కవి చక్రవర్తి వంటి ఎన్నో బిరుదులను పొందారు. కళాప్రపూర్ణ, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నారు. క్రీస్తు చరిత్ర రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు.

ఆదర్శ సమాజ నిర్మాణానికి పాటుపడిన వారిలో జాషువా ఒకరు. సమకాలీన సమాజంపై తన కవిత్వాన్ని జులిపించారు. 'పేదరికం సహనాన్ని నేర్పితే, కులమతాలు ఎదిరించే తత్వాన్ని నేర్పిందని' ఎలుగెత్తిచాటారు. జాషువా కవిత్వం ఆవేదనాభరితమైంది. సమాజాన్ని పట్టిపీడిస్తున్న కులవ్యవస్థ జాడ్యం ప్రతిరచనలోనూ ప్రతిధ్వనిస్తుంది.

నా కవితా వధూటి వదనంబు నెగాదిగజూచి
రూపురేఖా కమనీయ వైఖరులు గాంచి, భళీభళీ
యన్నవారే
మీదేకులమన్న ప్రశ్నవెలయించి, చివాలున లేచి
పోవుచో బాకున గ్రుమ్మినట్లగున్
పార్థివ చంద్ర! వచింప సిగ్గుగున్

తన కవితా ప్రతిభను మెచ్చుకున్న వాళ్ళే, చివరికి నీదేకులమని ప్రశ్నించి, సభ నుంచి ఉపక్రమించిన తీరు మనస్సును బాకులా గుచ్చిందని ఆవేదన వెళ్ళగక్కారు జాషువా. ఎలాంటి కారణాలు లేకపోయినా కులాన్ని ప్రాతిపదికగా చేసుకొని ద్వేషంతో ప్రతి ఒక్కరినీ నిధించే కుసంస్కృతి అధికంగా ఉండే రోజులవి. అందుకే జాషువా ఈ విధంగా అంటారు.

'గవ్వకు సాటిరాని పలుగాకుల సూయచేత
నన్నెవ్విధి దూరినన్ ననువరించిన శారద లేచిపోవునే'

చిల్లిగవ్వకు సాటిరాని వాళ్ళు అసూయతో నన్ను నిందించినా, నన్ను చేరిన సరస్వతీదేవి వదలిపోదు కదా! అని ముక్త కంఠంతో తన వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు.

అంటరానితనం వ్యతిరేకత, సంఘసంస్కరణ, దేశభక్తి ప్రధాన కథావస్తువులుగా చేసుకొని సాంఘిక దురాచాలపై పోరాటం చేశారు.

కుమలతాలు గీచుకున్న గీతలజొచ్చి
పంజరాన గట్టువడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు
తరుగులేదు విశ్వనరుడు నేను

సమాజాన్ని పట్టి పీడిస్తున్న కులజాడ్యం కట్టుబాట్లతో సమాజాన్ని కుదిపేస్తున్నా, నేను దానికి లొంగే వ్యక్తిని కాను. దారిద్ర్యాన్ని, కుల మత బేధాల్ని కూడా చీల్చి నేను మనిషిగా నిరూపించుకోదలిచాను. 'తిరుగు లేదు విశ్వనరుడు నేను' అని తన గంభీర స్వరాన్ని వినిపించారు. ఇక జాషువా గబ్బిలంలోని సామాజిక దృక్పథాన్ని పరిశీలిస్తే-

జాషువా మనోవేదనకు నిలువెత్తు నిదర్శనం గబ్బిలం కావ్యం. నాయకుడు దళితుడైన అరుంధతీసుతుడు. తన కన్నీటి గాధను కైలాసంలోని శివునికి వినిపించమని గబ్బిలంతో సందేశాన్ని పంపడం ఇందులోని ప్రధాన ఇతివృత్తం.

సమాజం కులమత ద్వేషాలతో తోటి మనుషుల్ని అంటరానివాళ్ళుగా ఊరవతలికి నెట్టిన తీరును, చాతుర్వర్ణాలను గురించి ఈ విధంగా తెల్పారు.

కసరిబుసకొట్టునాతని గాలిసోక
నాల్గుపడగల హైందవ నాగరాజు

హిందూమతంలో చాతుర్వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను గురించి తెల్పుతూ ఐదవ కులస్థుడు ఎవరమ్మా అని భరతమాతను ప్రశ్నిస్తారు జాషువా. హైందవ నాగరాజు పడగనీడలో ఉన్న దళితులకు దేవాలయ ప్రవేశం లేదని, కులం కూడా లేని తాను పెళ్ళి చేసుకొని కొడుకుల్ని కని సంసార సాగరంలో ముంచడమెందుకని దళితుడు పెళ్ళిచేసుకోకుండా ఉన్నాడని జాషువా తెల్పారు. కర్మసిద్ధాంతం గురించి ఇలా అంటారు.

కర్మసిద్ధాన్తమున నోరుకట్టివేసి
స్వార్థలోలురయినా భుక్తిననుభవింత్రు
కర్మమననేమొ, దానికీ కక్షయేమొ,
యీశ్వరునిచేత రుజువు చేయించవమ్మ

కర్మసిద్ధాంతాన్ని ఆపాదించి కొందరు స్వార్థపరులు దళితుల నోటి దగ్గర కూడును లాగేసుకుంటున్నారని, అసలు కర్మ అంటే ఏమిటో చెప్పమని ప్రశ్నిస్తారు. బుద్ధుడు మొదలైన వారి విగ్రహాలను కట్టడాన్ని నిరసించి, కపట సన్యాసులను నమ్మొద్దని జాషువా హితవు పలికారు. ఆర్థిక అసమానతల్ని గురించిఈ విధంగా అంటారు.

హృదయములేని లోకమును మీయిది మాపుల బశ్చిమంబుగా
నుదయముతూర్పుగా నడుచుచుండు సనాతన ధర్మధేనువుల్
పిదికినపాలు పేదలకు లభించవు, శ్రీగలవాని యాజ్ఞలో
బెదవి గదల్పజాలర రవిందభవ ప్రముఖా మృతాందసుల్

ఈ లోకంలో ధర్మం అస్థవ్యస్థంగా ఉందనీ, సూర్యుడు తూర్పున ఉదయించి పశ్చిమంగా అస్త మించినట్లుగా సమాజం నడుస్తుంది. ధనవంతుడు తలిస్తే ఏమైనా చేయగలడు. వారు ఆజ్ఞాపిస్తే బ్రహ్మాదిదేవతలు కూడా ఏమీ చేయలేరు. ఆనాటి నుంచి ఈనాటి వరకు స్థితిమంతుల చేతుల్లోనే సమాజ ఉంటుందనీ, ధనం, పదవి, పలుకుబడి అనేవి సమాజాన్ని ఇప్పటికీ నడిపించే అస్త్రాలుగా ఉన్నాయని జాషువా సమాజంలోని పెత్తందార్లకు, సామాన్య మనుషుల మధ్య ఆర్థిక అసమానతల్ని తెల్పారు.

కష్టపడిపనిచేసినా తిండి దొరకని దీనస్థితిని గురించి 'భోజనము పెట్టువానికి భుక్తిలేదు' అని తన రెక్కల కష్టంతో పంటలు పండిచగా పాలం పులకించిపోతుంది. అతను శ్రమపడి చెమటోడ్చి ప్రపంచానికి ఆహారం సమకూరుస్తాడు. అయితే అతినికి మాత్రం భోజనం దొరకదు. ఇంతమంది దేవతలున్న దేశంలో పేదవాడికి పెట్టడానికి తిండిలేదని ప్రశ్నిస్తారు కవి. కులమతరహిత ఆదర్శ సమాజాన్ని కోరుకుంటారు. జాషువా కులం పేరుతో జరిగే దుర్మార్గాలను బలవంతులు బలహీనులపై చేసే దౌర్జన్యాలను బానిసను చేసే చాతుర్వర్ణ వ్యవస్థను నిరసిస్తారు.

'ఎవడారగించు నమృత భోజనంబున
గలిసినో యీలేమ గంజిబువ్వ'

అంటూ జాషువా చెప్పి మాటల్లో సామాజిక దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది. మానవ సమాజానికి మానవ విలువలకు భంగం వాటిల్లే ఎటువంటి శక్తులునైనా జాషువా తన కవిత్వంలో తెలియజేశారు.

ప్రతిమల పెండ్లి సేయుటకు వందలువేలు వ్యయించుగాని దు:
ఖితమతులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్పదీ భారతమేదిని ముప్పది మూడు కోట్లదే
వతలెగవడ్డ దేశమున భాగ్యవిహీనులలక్షులారునే

దేవతావిగ్రహాలకు పెండ్లిండ్లు చేయడానికి వందలు వేలు ఖర్చుపెట్టే జాతి, నిరుపేదలకు ఒక మెతుకుకూడా విదల్చకపోవడం చూసి ఆవేదన చెందారు జాషువా.

ప్రాణమున్న బీదవాని కన్నులజూచి
బాగుచేయు ధర్మపరుడు లేడు

జాషువా పేదలపక్షిపాతి. పేదరికాన్ని అనుభవించిన వాడు. ఆ అనుభవమే కవిత్వంగా మారి పేదలపట్ల తనకున్న సామాజిక బాధ్యతను గుర్తు చేసింది. జాషువా రచనలోని సామాజిక దృక్పథానికి ఆయన జీవితమే ఆలంభన.

అట్టడుగు వర్గాలవారి జీవితాల్లోని అనుభూతులను చెప్పడమే గాక, ఆ సామాజిక దృక్పథం, చైతన్యానికి కారణమైన కట్టుబాట్లను ధిక్కరించారు. జాషువా తన సమకాలీన కాల్పనిక కవులులాగా ఊహల్లో జీవించలేదు. కులవివక్షతో ఈ సమాజం దూరంగా పెట్టినా ద్వేషంతోనో, విరక్తితోనో జాషువా తన నుంచి సమాజాన్ని ఎప్పుడూ విడదీసి చూసుకోలేదు. సమాజంలోని కుళ్ళు కుతంత్రాలను పారద్రోలి సమసమాజ స్థాపన కోసం అందరూ నడుంబిగించాలని పేద, గొప్ప, చిన్నాపెద్దా తారతమ్మ బేధాలు ఉండకూడదని చెప్పిన సామాజికవేత్త. ఈయన సుకవిగా ప్రజల హృదయాలలో నిత్యం చిరస్మరణీయులుగా నిలిచిపోతారనడానికి నిదర్శనం ఈ క్రింది పద్యం.

రాజు మరణించె ఒక తార రాలిపోయే
కవియు మరణించె ఒక తార గగనమెక్కె
రాజు జీవించె రాతి విగ్రహాలయందు
సుకవి జీవించె ప్రజల నాలుకలయందు

రాజకంటె కవులు గొప్పవాళ్ళని చెప్పిన ఈ పద్యం మహాకవుల సరసన నిలబెడుతుంది జాషువాను అనుటలో సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. గుఱ్ఱం జాషువా - గబ్బిలం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
2. జాషువా తాత్వాక స్వప్నం - జాషువా పరిశోధన కేంద్రం, తెలుగు అకాడమీ, హైదరాబాదు.

❖❖❖

ఆదర్శ సమాజ నిర్మాణంలో కాలువ మల్లయ్య కృషి

– గడ్డం లింగరాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలుగు సాహిత్యంలో తన రచనల ద్వారా తెలంగాణ గ్రామీణ జీవనం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు, విశ్వాసాలు, పండుగలు మొదలైన వాటిని తనదైన శైలిలో సాహిత్య సృష్టిని చేస్తున్న రచయితలలో కాలువ మల్లయ్యగారు ప్రముఖులు. కాలువ మల్లయ్యగారు తన రచనా వ్యాసంగం ద్వారా సమాజంలోని అనేక సమస్యలను రచనల్లో చిత్రిస్తూ,వాటికి తనదైన పరిష్కార మార్గాలను చూపిస్తూ, ప్రజలను, సమాజాన్ని చైతన్యవంతులను చేస్తున్నారు.ఒక రచయిత యొక్క విలువలు తెలుసుకోవాలంటే ఆ రచయిత యొక్క సామాజిక వర్గాన్ని, రచయిత పెరిగిన పరిసరాలను వారి కుటుంబ నేపథ్యాన్ని తెలుసుకోవటం ద్వారా ఆనాటి దేశ,కాల, సామాజిక పరిస్థితులు తెలుస్తాయి.తద్వారా వారి రచనల్లో ప్రతిబింబించిన సామాజిక స్పృహను అంచనా వేసి సమాజానికి తెలుపవచ్చు.కాలువ మల్లయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి. కథా రచయితగా, నవలాకారునిగా, నాటకకర్తగా, సినిమాలకు కథా రచయితగా, దృశ్య శ్రవ్య మాధ్యమ రచయితగా, సంపాదకునిగా, వ్యాసకర్తగా కాలువ మల్లయ్యగారు అన్ని ప్రక్రియల్లో తన రచనా వ్యాసాంగాన్ని సృజించారు.

రచయితగా కాలువ మల్లయ్యగారు గత 40 సంవత్సరాల సాహితీ ప్రస్థానంలో ఎనిమిది వందలకు పైగా కథలు, పదిహేడు నవలలు, ఐదు కవితా సంపుటాలు, రెండు వందలకు పైగా వ్యాసాలు, నూట యాభై కవితలు, పది నాటకాలు రాశారు. ఇంకా మరెన్నో గ్రంథాలకు సంపాదకునిగా కూడా వ్యవహరించారు. సాహిత్యం ద్వారా ఆదర్శవంతమైన సమసమాజ నిర్మాణం కోసం కాలువ మల్లయ్యగారు చేస్తున్న కృషిని తెలపటమే ఈ వ్యాసోద్దేశ్యం.

పూర్వం నుండి నేటి వరకు కూడా సమ సమాజ వికాస అభివృద్ధి కోసం దళితులు, బహుజనులు, బి.సి.వృత్తి కులాల వారు అత్యంత ముఖ్యమైన పాత్రను పోషిస్తు న్నారు. వారు సంఘంలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలను ఎంతో ప్రభావితం చేస్తున్నారు.గత యాభై సంవత్సరాల సామాజిక చరిత్రను వీరి కొరకు తన రచనల్లో నిక్షిప్తంచేసి బావి తరాలకు అందించిన వారిలో ముఖ్యుడు. అన్యాయాలకు దోపిడీకి,అణచివేతకు గురైతున్న ప్రజానీకంపై తన రచనల్లో అంతులేని ప్రేమను కురిపించారు. ఈ జనం జీవితాలలో మార్పు రావాలని తపిస్తున్నారు. సర్వసంపదలకు సృష్టి కర్తలైన దళిత బహుజనులు రాజ్యాధికారంలోకి రావాలన్నదే వీరి రచనల్లోని లక్ష్యం.కాలువ మల్లయ్యగారి కథలు, నవలల్లో తెలంగాణ మట్టి వాసన గుబాలిస్తుంది.తెలంగాణ భాష, నుడి కారపు సొంపు పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది.సహజమైన, స్వచ్ఛమైన మాండలికంలో రచనలు చేసిన అతికొద్ది మంది రచయితలలో కాలువ మల్లయ్యగారు ఒకరు. వీరి రచనల్లో మన చుట్టూ ఉన్న సామాజిక సమస్యలు కనిపిస్తాయి. తెలంగాణ ప్రాంత సంస్కృతి, సంక్షోభం, సంఘర్షణ, పోరాటాలు,పరిష్కారం, దళిత బహుజన జీవితం, రైతాంగ జీవితంలోని కడగండ్లు, వ్యవసాయ, అసంఘటిత కూలీల బతుకులు, బొగ్గు గని కార్మికుల జీవనం, భూస్వాములైన దొరల దౌర్జన్యాలు, మావోయిష్టుల విప్లవ ఉద్యమాలు, బీడీ కార్మిక శ్రామిక వర్గాలు,నశిస్తున్న కుల వృత్తులు, మారుతున్న పల్లె సంస్కృతి వలస బతుకులు, వరకట్న సమస్యలు, ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం, రక్త సంబంధీకులను, తల్లిదండ్రులను నిరాదరిస్తున్న అసమానత్వం, పరాయికరణకు గురి చేస్తున్న చదువులు, ఇంగ్లీషు మీడియం చదువులు, కంప్యూటర్ విద్య,

విదేశాలపై మోజు వంటి పరిణామాలు, ప్రపంచీకరణ ప్రభావం, మధ్యతరగతి కుటుంబాలలో పెరుగుతున్న ఆశలు,అయోమయం వంటి మొదలైన సమస్యలు తెలంగాణ సామాజిక,ఆర్థిక, రాజకీయ పరిణామాలు, సామాజిక సంఘటనలు వీరి కథల్లో, నవలల్లో ప్రతి బింబిస్తాయి. అందుకే వీరి రచనలు సామాజిక చరిత్రను రికార్డు చేసినట్లుగా కనిపిస్తాయి.

1982లో వెలి, పాలేరు, పతనం, భ్రమలు, మార్పు అనే కథలు రాసారు.అన్ని కథలను వివిధ పత్రికలకు పంపారు. అన్నింటికంటే ముందుగా సృజన పత్రిక నుండి 1983 జనవరి సంచికలో వెలి కథ అచ్చయింది.తర్వాత మిగిలిన కథలు అన్ని అచ్చయ్యాయి.కాలువ మల్లయ్య గారి మొదటి కథగా 'వెలి'అనే కథను చెప్పవచ్చు. వెలి కథ ఒక రజక స్త్రీ గురించి చెప్పబడింది. ఒక చాకలి స్త్రీని ఊరి దొరలు, గ్రామ బహిష్కరణ చేస్తే ఆమె విప్లవోద్యమ స్ఫూర్తితో దొరను ఎదిరించి, దొరల ఆధిపత్యంపైన తిరుగుబాటు చేసిన బావమరదళ్ళ కథ. ఒక దళితుడైన పాలేరు విప్లవ చైతన్యంలో దొరని ఎదిరించిన కథ 'పాలేరు' కథ.ఒకప్పుడు తెలంగాణా సాయుధ పోరాటాన్ని సమర్థించి కమ్యూనిస్టుగా ఉన్న వ్యక్తి ఆతర్వాత వ్యాపారిగా, పెట్టుబడిదారీ వ్యవస్థలోకి వెళ్ళిన వ్యక్తి కథే. 'పతనం' కథ. ఈ వ్యవస్థపై ప్రజలకు ఉన్న భ్రమలు తొలగి పోవాలని విప్లవించి నమ సమాజాన్ని స్థాపించుకోవాలనే చెప్పే కథే 'భ్రమలు'. 1986ప్రాంతంలో రాసిన 'అవ్వతోడు గిది తెలంగాణ' శీర్షికతో రాసిన యాబ్భై కథలలో పండుగనాడే. మెతుకుల బువ్వ, ఆగమాగమయింది', బతుకుదెరువు లేకుం టయింది, మందమీద తోడేలు పడ్డట్టయింది, పురాగ టిక్కటాసారు, సోసంత్రమంటేందే? మొదలైన కథలు వివిధ కులాలపై, వృత్తుల పతనం పై మాండలిక భాషలో రాసినవి.అవే కాలువ మల్లయ్యగారికి రచయితగా మంచి గుర్తింపును ఇచ్చాయి. కాలువ మల్లయ్య గారి కథల్లో చాలా వరకు భూస్వాముల ప్రతినిధులైన దొరల ప్రస్తావనే ఉంటుంది. కాలక్రమేణా భూస్వామ్య వ్యవస్థ విచ్ఛినం కావడానికి దారి తీసిన పరిస్థితులు ప్రస్ఫుటమయ్యాయి. భూస్వామ్య వర్గ ప్రతినిధులైన దొరలు అణగారిన కులాల పై దౌర్జన్యం చేసి అన్ని విధాలుగా దోచుకున్నారు. లైంగిక దోపిడి తమ హక్కు అన్నట్లు ప్రవర్తించేవారు. అనాటి దొరల లైంగిక దోపిడీకి నిలువెత్తు దర్పణం 'దొరసానిచీర' కథ. తెలంగాణలోని ఒకనాటి దొరతనానికి కంచుకోటగా ఉన్న దొరల నివాసాలు నక్సలైట్ ఉద్యమం అనంతరం సామాజిక పరిణామాల వల్ల శిధిలమై ఎలాంటి దుస్థితికి చేరుకున్నాయో తెలిపే కథే 'దొరగారిగడి'.తెలంగాణలోని నిజాంప్రభువు దయాదాక్షిణ్యాలతో భూస్వాములు దొరలుగా, పటేలుగా, దేశ్‌ముఖ్‌లుగా, జమీందారులుగా, చెలామణి అవుతూ గ్రామాధికారులపై ఆధిపత్యం చెలాయిస్తూ ఇలా అన్ని అధికారాలతో సామాన్య ప్రజలను చెప్పు చేతల్లో పెట్టుకున్నారు. వెట్టి పనివాళ్ళు, షేరిదార్లు, దళితులు, వివిధ కుల వృత్తుల వారు సపర్యలు చేస్తుంటే రాజభోగాలు అనుభవించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో వీరి అధికారానికి కొంత వరకు అడ్డుకట్ట వేయబడింది. గ్రామాలలో విస్తరించిన నక్సలైట్, విప్లవోద్యమాలు భూస్వామ్య వ్యవస్థను నశింపచేశాయి. దీనితో సామాన్య ప్రజానీకం గ్రామాలలో ఊపిరి పీల్చుకున్నారు. 'ధిక్కారం' కథలో బడుగు బలహీన వర్గాల ప్రజలు తెలంగాణలో ఉవ్వెత్తున లేచిన విప్లవోద్యమాల వల్ల చైతన్యవంతులై తరతరాల అగ్రవర్ణపు భూస్వామ్యపు ఆధిపత్యాన్ని దిక్కరించి నిలిచిన వైనం కనిపిస్తుంది.

కాలువ మల్లయ్య రచనలు గ్రామీణజీవనాన్ని ఆసరాగా చేసుకుని చిత్రించినవే. పల్లెలో పుట్టిపెరిగి, బాల్యమంతా పల్లెలో గడపడంతో కాలువమల్లయ్యకు గ్రామీణ సమాజంపై పరిపూర్ణమైన అవగాహన ఏర్పడింది. గ్రామీణుల మనస్తత్వం, సంస్కృతి,జీవితం, కులవర్గ పోరాటాలు, పీడన కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, వాతావరణం దుర్భర పరిస్థితులు వీరికథల్లో కనిపిస్తాయి. మారుతున్న కాలంతోపాటు ఆచార వ్యవహారాలు మారు

తుంటాయి. అలా మారుతున్న క్రమంలో కులవృత్తులు, జీవనభారం కోల్పోతున్న వైనాన్ని చిత్రించిన కథ 'మడేలయ్య మనస్సు' గౌడ కులవృత్తిని వారి జీవన విధానాలను గురించి 'ఊరుమ్మడి బతుకులు' కథలో చిత్రించాడు. గొల్లకులం వారి ప్రధానవృత్తి మేకలు, గొర్రెలు కాయడం. వారు ఎండనక, వాననకం వాటిని కాసుకుంటూ బ్రతుకుదెరువును కాపాడుకుంటున్న వైనాన్ని 'అడవికాచిన వెన్నెల' కథలో చిత్రించారు. గత తరం వారి వ్యక్తుల్లోన్ని నిష్కల్మషమైన మనస్తత్వానికి వరసలు పెట్టుకుని పిలుచుకునే ఆప్యాయతానురాగాలు 'ముసలవ్వ మనస్సు'కథలో ఉన్నాయి.ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన కథ 'పెద్ద తాతయ్య' కథ.

భూమిపుత్రుడు నవల తెలంగాణ రైతుయొక్క దుర్భర పరిస్థితులను, భూమిని నమ్ముకున్న రైతు భూమిని అమ్ముకునే దైన్యస్థితికి రావడానికి గల కారణాలను, బొగ్గుగనుల్లో పనిచేసే శ్రామికుల యొక్క కష్టాలను, బ్యాంకు అధికారులు, వడ్డీవ్యాపారులు, రైతులను ఇబ్బంది పెట్టే పరిస్థితులను, ఉన్నత చదువులు చదివి ఉద్యోగం రాకపోవడంవల్ల నిరుద్యోగులుగా ఉన్న యువకులు, చివరికి నక్సలైట్లుగా మారుతున్న వైనాన్ని విశ్లేషిస్తుంది.

'సాంబయ్య చదువు' నవలలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సాంబయ్య చదువుకుని ఉద్యోగంలో, జీవితంలో స్థిరపడటం వంటి అంశాలను నేపథ్యంగా ఒక మధ్య తరగతి దళిత యువకుడి జీవిత ప్రస్థానాన్ని చిత్రించారు. ఈ నవలలో కథారంభం "చదువు నేపథ్యంగా 1940-1986 వరకు తెలంగాణ గ్రామీణ జీవనంలో నెలకొన్న సామాజిక పరిణామాలను ఈ నవల ప్రతిఫలింపజేసింది. కాలువ మల్లయ్య స్వీయజీవనం అంతసూత్రంగా ఈ నవల రూపుదిద్దుకుంది"(ఐలయ్య బన్న, కాలువ మల్లయ్య కథలు తెలంగాణా జనజీవితం; పుట:109). 'మాట్లాడేబొమ్మలు' నవలలో చదువు మూలంగా కుటుంబాల్లో మనుషుల మధ్య దూరాలు పెరగడం, బంధాలు తరగడం, గ్రామసీమలను నిర్లక్ష్యం చేయడం ఇతివృత్తంగా సాగిన నవల ఇది. సంస్కారాన్ని ఆదర్శాన్ని, విజ్ఞానాన్ని వినయాన్ని నేర్పవలసిన విద్య మనుష్య లను స్వార్థపూరితంగా తయారుకావడానికి గల పరిస్థితులను ఈ నవల తెలియజేస్తుంది. ఈ నవల 'సాంబయ్య చదువు' నవలకు కొనసాగింపుగా అని పిస్తుంది. ఈ మూడు నవలలో గ్రామీణ జీవితంలోని మధ్య తరగతి కుటుంబాలు పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఒక తరం నిరక్ష్యరాస్యతకు గురైతే మరొక తరం చైతన్యం అవుతుంటే దళిత, బహుజనులను దొరలు, వడ్డీ వ్యాపారులు, బ్యాంకు అధికారులు ఎలా వారిని పీడనకు గురి చేస్తున్నారో తెలుసుకోవచ్చు అయినా యువకులు దొరలను ఎదిరించి గ్రామసీమలను చైతన్యం వంతం చేసి పట్టణాల్లోకి వెళ్ళి ఉన్నతమైన విద్యను అభ్యసించి నాగరికతవైపు ఎలా వెళ్ళారో ఈ మూడు నవలలు మనకు విశ్లేషిస్తాయి.

'అస్పృశ్య కోయిల' నవలలో తెలంగాణాలోని గ్రామీన జీవిత సంబంధాలు, అక్కడి ఆదిపత్య కులాల దురహం కారం, అణగారిన కులాలు ఎదుర్కొనే వివక్షను కళ్లకు కట్టినట్లు చిత్రించారు. అస్పృశ్యత కారణంగా సమాజానికి దూరం చేయబడ్డ వారు ప్రజాజీవన స్రవంతిలో కలిసిన విధానాన్ని వివరించారు. ఊరు ఊరంతా అంటరాని వారంటూ కులవివక్షత చూపుతూ అణిచివేతను అమలు చేస్తున్న కాలంలో పండగే కాదు, దేవాలయప్రవేశాన్ని నిషేధించిన కాలంలో కులవివక్షను ప్రశ్నించిన స్త్రీ యొక్క జీవితాన్ని ఆవిష్కరింపజేశారు. దొరలచేతుల్లో బలైన ఒక స్త్రీ తన జీవన ప్రస్థానంలో ఏ మార్గం ఎంచుకుందో తెలిపే ఈ రచన దళిత బహుజన సాహిత్యంలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. ఈ నవలలో గ్రామంలో పాతుకు పోయిన దురాచారాలు, దళితుల శ్రమైక జీవితం, దళిత ప్రజల్లో వస్తున్న చైతన్యాన్ని మనం గమనించవచ్చు. దొర లను ఎదిరించి దళితవాడల వైపు చూస్తున్న దొరల

అహంకారాన్ని అణగదొక్కి దళితస్త్రీశక్తిగా నిలిచిన ఒక స్త్రీ ఎదిగిన క్రమాన్ని మనం గమనించవచ్చు.

'మాదిగవిజయం' అనే నవల మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఒక కుటుంబం కాలానుగుణంగా అంచెలంచెలుగా ఏ విధంగా అభివృద్ధి చెందిందో తెలియజేసే నవల. కాలక్రమంలో ఆ కుటుంబ పరిణామం, అభ్యుదయం, చైతన్యం, అభివృద్ధి ఈ నవలలో కనిపిస్తాయి. ఒక కుటుంబానికి చెందిన నాలుగు తరాల దళితుల జీవన విధానాన్ని రచయిత చిత్రించడం జరిగింది.

'అస్పృశ్యకోయిల', 'మాదిగవిజయం' అనే ఈ రెండు నవలల్లో దళితుల జీవన విధానం ఉంది. వారు ఏ విధంగా భూస్వాములు, దొరలచేత ఏ విధంగా పీడించబడ్డారో తెలుసుకోవచ్చు.కులం పేరు చెప్పుకోలేని స్థితి నుండి ఈ రోజు మా కులం మాల, మాదిగలమని చెప్పుకునే స్థాయికి ఎదిగిన తీరును ఈ నవలలు తెలియజేస్తాయి. తెలంగాణా గ్రామీణ సమాజంలో అంటరాని వారిగా ముద్రపడిన సమాజవిభాగానికి గురైన దళితులు స్వాతంత్ర్యానంతరం బాగా చదువుకుని ఉద్యోగాలను పొంది సమాజ గౌరవాన్ని, జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకుంటున్నారు.

తెలంగాణ పల్లెల్లో 1960సంవత్సరం తర్వాత వచ్చిన మార్పుల్ని చిత్రించిన నవల 'బతుకుపుస్తకం'. ఈ నవలలో తెలంగాణ సంస్కృతిని గురించిన వివరణ పుష్కలంగా ఉంది. జానపద ప్రదర్శనల కళలు, బతుకమ్మ పండుగలు, పోచమ్మ బోనాలు, పెండ్లి వేడుకలు వాటిల్లో వివిధ వృత్తుల వాళ్ళు పాల్గొనటం, మానవ సంబంధాలలో కులాలకు అతీతంగా ప్రేమానుబంధాలు క్రమంగా అవి సడలిపోవడాన్ని రచయిత ఎంతో నేర్పుగా చిత్రించారు. పెట్టుబడులు కేంద్రీకృతం కావటం, కేవలం పట్టణాలలోనే ఆర్థిక అవసరాలు అందుబాటులో ఉండటం, మరోవైపు వలసలు వీటన్నింటి వల్ల క్రమంగా గ్రామాలు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. ఈ విషయం మామూలు సందర్భాలలో అయితే అర్థం కాదు కానీ, ఒకటి, రెండు దశాబ్దాలకు ముందు పండుగలకు ఊర్లకు వచ్చే జనాల సంఖ్యనూ, నేడు ఊర్లకు పండుగలకు వస్తున్న జనాల సంఖ్యనూ చూస్తే చాలా స్పష్టంగా బోధపడుతుంది. ఈ పరిణామాలన్నింటిని ఈ నవల ఎంతోచక్కగా పూసగుచ్చినట్లు వివరిస్తుంది.

'గువ్వల చెన్నా' నవల పద్మశాలీల కులవృత్తిని గురించి, చేనేత కార్మికుల కష్టాలను గురించి వివరించిన నవల. ప్రపంచీకరణ నేపథ్యంలో అంతరించిపోతున్న నేత కార్మికుల వృత్తిని గురించి తెలిపిన నవల ఇది. ప్రపంచీకరణ పేరుతో పల్లెల్లో వచ్చిన ఫ్యాషన్ డిజైనింగ్‌లు పేదబతుకులను ఎలా కడదేర్చుతున్నాయో రచయిత చక్కగా తెలియజేశారు. అగ్గిపెట్టెలో చీరలను విదేశాలకు పంపించగల దేశం ఈ రోజు ప్రపంచీకరణ భూతానికి నేతపనివారి పనితనం కనుమరుగై పోవటం ఈ నవలలో చూస్తాం.

కాలువ మల్లయ్యగారు తన రచనల్లో ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా మాండలికాన్ని విరివిగా వాడారు. ఈ మాండలికం అంతా అట్టడుగు వర్గాల వారిదేనని రుజువు అవుతుంది.తెలంగాణ యాసను స్వీకరించి,వారి రచనల్లో అన్ని పాత్రలకు వాడారు. అతని రచనల్లోని పాత్రలు చాలా సాదాసీదాగా ఉంటాయి. అందువల్ల పాఠకులు ఆ పాత్రల్లో తమను తాము చూసుకోవటం విశేషం. అందుకే వీరి రచనలు పాఠకులకు ఆత్మీయమైనవిగా ఉంటాయి. తమ ఊరి వ్యక్తుల్ని పాత్రలుగా మలచి కథల్లో, నవలల్లో రచనకు వాస్తవికతను కల్పించారు. ఒక ప్రాంతంలోని సామాజిక జీవితాన్ని తీసుకుని విశ్వసనీయతను కలిగించి, రాయడంలోనే రచయిత విజయం ఆధారపడి ఉంటుంది. గొప్ప రచనలు అన్నీ ఇలా సార్వజనీనమైనవే అనే సంకల్పాన్ని త్రికరణ శుద్ధిగా నమ్మి సాహితీ వ్యవసాయం చేస్తున్న అక్షర కృషీవలుడు కాలువ మల్లయ్యగారు. ఆయన సాహిత్య కృషిని గుర్తించి, ఎన్నో సంస్థలు, అకాడమీలు, పత్రికలు సాహిత్య పురస్కారాలను అందించాయి. కొన్ని

నవలలు, కథలు, ఉత్తమ పురస్కారాలను పొందాయి.అవి

1. 'భూమి పుత్రుడు' నవలకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ఎటుకూరి వెంకట నరసయ్యగారి పురస్కారం అందించారు.
2. 'సాంబయ్య చదువు' నవల ఆటా వారి నవలల పోటీల్లో మొదటి బహుమతి పొందింది.
3. 'బతుకు పుస్తకం' నవల ఆటా వారి నవలల పోటీల్లో మొదటి బహుమతి పొందింది.
4. 'సృష్టికర్త ఆవేదన' కథ ఆంధ్రప్రభ కథల పోటీల్లో బహుమతి పొందింది.
5. 'కరువు' కథ స్వాతి వారి కథల పోటీల్లో మొదటి బహుమతి పొందింది.
6. 'మా కథలు' విశాల సాహిత్య పురస్కారాన్ని అందుకుంది.

ఇంకా అనేక రకాల సాహిత్య పురస్కారాలు, బహుమతులు అందుకున్నారు. తెలుగు అధికారా భాషా సంఘం సభ్యులుగా 2005నుండి 2007 వరకు ఉన్నారు. కాలువ మల్లయ్యగారు చేస్తున్న విశేష సేవకు గుర్తింపుగా, సాహిత్య విలువలు కాపాడుతున్న సంస్థల్లో ఘనమైన గుర్తింపును పొందారు.

ఆధార గ్రంథాలు :

1. ఐలయ్య, బన్న; కాలువ మల్లయ్య కథలు తెలంగాణ జనజీవితం; వరంగల్, నానీ ప్రచురణలు; 2010.
2. మల్లయ్య, కాలువ; కాలువ మల్లయ్య నవలలు; కరీంనగర్; తెలుగు వచనం ప్రచురణలు, 2001.
3. మల్లయ్య, కాలువ; గువ్వలచెన్నా; హైదరాబాద్; చతుర మాస పత్రిక; 2009.
4. మల్లయ్య, కాలువ; అస్పృశ్య కోయిల; హైదరాబాద్, లిఖిత ప్రెస్; 2017.
5. మల్లయ్య, కాలువ; మాదిగ విజయం; హైదరాబాద్, సామాజిక భారత్, బి.వి.వి.ఛారిటబుల్ ట్రస్టు; 2015.
6. మల్లయ్య, కాలువ; అవ్వతోడు గిది తెలంగాణ; హైదరాబాద్, దేవులపల్లి పబ్లికేషన్స్; 1998.
7. మల్లయ్య, కాలువ; మాకథలు; హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లికేషన్స్; 1998.

❖❖❖

ఆచార్య కొలకలూరి ఇనాక్ కవిత్వం - మానవతా ప్రభోదం

- డా॥. ఆంజనేయుడు, తెలుగుశాఖ, రాయలసీమ విశ్వ విద్యాలయం, కర్నూలు.

లోకంలో అనేక జీవరాశులు ఉన్నాయి. పశు పక్షాదులు, జలచర, భూచర, ఖేచర జీవజలాలు కని పిస్తున్నాయి. వీటితో పాటుగా మానవజాతి కూడా ఉంది. సకల జీవరాశిలో మానవునికి గల ప్రత్యేకత ఏమిటంటే భాష ఉండటం జ్ఞానం ఉండటం. ఆహారం, నిద్ర, మైథునం అన్ని జీవరాశులకు సర్వ సాధారణం. అయితే మానవుడు అంతకు మించిన స్థానాన్ని ఆక్రమించాడు. అదే జ్ఞానం. దీని కారణంగానే ఇతర జీవరాశుల నుండి మానవుడు వేరుపరచబడ్డాడు.

'మనో' అనగా To think with reasoning capacity అని అర్థం. అనగా ఆలోచించే శక్తి మనిషికి మాత్రమే ఉంది. తక్కిన వాటికి ఉన్నా ఇంతటి ఉన్నత స్థితిలో ఉండదు. అన్నింటిని మించి మానవునిలో ఆర్ద్రత గుణం, భూత దయ కలిగి ఉండటమే కాక సాటి మనిషి పట్ల, సహృదయ భావాల పట్ల పవిత్ర భావం కలిగి ఉం టున్నాడు. ఇవి మానవుల స్వభావానికి అదర్శ ప్రాయ మవుతున్నాయి. ఇలాంటి విశిష్ట ధర్మాలున్న మానవునిలో సృష్టికి అభివృద్ధికి, సాత్విక మనోధర్మం, ఇతరుల సుఖ దుఃఖాలలో సహానుభూతి, కలిసిమెలసి నడుచుకోవడం చేస్తున్నాడు. ఈ సాత్విక ధర్మమే అతన్ని ఉన్నతుణ్ణి చేస్తుంది. మనిషిని మనీషిని చేస్తుంది.

ఉత్తమ మానవుడిగా మారాలంటే మానవత్వం కలిగి ఉండాలి. మనం మనుషులం కావున మానవత్వ గుణాన్ని అనివార్యంగానైనా కలిగి ఉండాలి. ఈ మానవత్వాన్ని ప్రభోదించడానికి రాజకీయ నాయకులైతే శాసనాల ద్వారా, సంస్కర్తలైతే సంస్కరణల ద్వారా, మత ప్రవక్తలైతే బోధనల ద్వారా, కవులైతే కవితల ద్వారా ఉపదేశిస్తారు. ఒక రకంగా మానవత్వం అంటే మానవునిలోని అచ్చమైన దయాగుణమే. ఇదే త్యాగనిరతికి దారి తీస్తుంది. జీవిత పరమావధిని కలుగజేస్తుంది. గురజాడ అప్పారావు దేశంలో మనిషికి ఉన్న ప్రాధాన్యతను ఇలా తెలియజేసాడు. "దేశమనెడి దొడ్డ వృక్షము ప్రేమలను పూలెత్త వలెనోయ్, చెట్టా పట్టాల్ పట్టుకొని దేశస్థులంతా నడవవలెనోయ్" అన్న మాటల్లో మానవత్వం, దేశమంటే పశుపక్షాదులతో నిండిన దేశమే కాక వీటన్నింటిని తమ స్వాధీనంలో నిలుపుకున్న మనిషికి అగ్రస్థానం కల్పించబడింది. దేశ మంతా ఒక వృక్షంలా భావిస్తే చెట్టు పూలుపూచి ఫలాలు ఇచ్చినట్లుగా మనుషులు ప్రేమగుణాలను అలవర్చు కోవాలన్నాడు. మానవులంతా సమైక్య భావంతో నడుచు కోవాలన్నాడు. సొంత లాభం కొంత మానుకొని పొరుగు వానికి తోడుపడమన్నాడు. సాటి మనిషి కష్టాలను తీర్చిన వాడే నిజమైన మనిషి, ఈవిధంగా పరోపకార గుణం నిస్వార్థ జీవన విధానం సాంఘిక సమానత్వం సహృద్భావ వాతావరణం మొదలైనవి మానవత్వానికి నిదర్శనముగా కనిపిస్తాయి. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కవిత్వంలో మానవత్వానికి సంబంధించిన అంశాలను గమనిద్దాం.

కొలకలూరి ఇనాక్ గారు "రక్తస్వామ్యం" అనే కవితలో మానవులందరూ ఒకటేనని అందరిలో ప్రవహించే రక్తానికి ఊరు పేరు, కులం, మతం, భాష, ప్రాంతం, వ్యత్యాసం వుండదని పేద, గొప్ప, అధికారి, సామాన్యుడు, శ్రామికుడు, యజమాని అనే వ్యత్యాసం లేనిదంటాడు. రక్తం అత్యంత పురాతనమని, సూర్యోదయం అంత నవీనమైనదని చెబుతాడు. మానవులందరూ ఒక్కటే అనే భావనతో అందరూ కలిసి మెలసి జీవించాలని ఈ కవిత ద్వారా తెలియజేశాడు.

రక్తం పుడమి అంత పురాతనం
సూర్యోదయమంత నవీనం
సృష్టి పరిణామంలో పదునెక్కిన రక్తం

అత్యద్భుత సృష్టి పదార్థం.
నీ చేతిలో పెడుతున్న ఈ రక్తం చుక్క
ఏ వూరిదో ఏ వాడదో చెప్పగలవా ?
ఏ జాతిదో, ఏ నీతిదో గుర్తు పట్టగలవా ?
ఏనాటిదో, ఏ ప్రాణిదో తేల్చగలవా ?
నిన్ను బతికించిన ఈ రక్తం ఎవరిది ?
ముస్లిందా, హిందువుదా, సిఖ్ఖుదా, క్రైస్తవుడిదా ?

సృష్టిలోని సకలకోటి ప్రాణులలో ప్రవహించే రక్తం ఒక్కటే. ఈ రక్తమే ప్రాణం. మనుషుల్లో, జంతువుల్లో, నీటిలో నివసించే ప్రాణుల్లో పక్షుల్లో మొదలైన జీవు లన్నింటి మనుగడకు ఆధారం రక్తమే. అయితే మనుషుల దొకజాతి, పక్షులదొక జాతి, జంతువుల దొక జాతి, వాటి వాటి జాతి నుండి అని ఉత్పన్నమౌతూ తమ మనుగడను సాగిస్తున్నాయి. అయితే వీటన్నింటికి భిన్నమైనది మానవ జాతి. ఒకదేశంలో జాతుల మధ్య బేధం ఉంటుంది. మరొక దేశంలో మతాల మధ్య తేడా ఉంటుంది. ఇంకోదేశంలో వారసత్వం, మనదేశంలో కులాలు, మతాలు, భాషలు, ప్రాంతాలు మనుషుల మధ్య అంత రాలు సృష్టిస్తున్నాయి. భారతదేశంలోనైనా, చైనా, రష్యా, అమెరికా, సింగపూర్, ఆఫ్రికా ఖండమైనా.... మనుషుల్లోను, పశు పక్షాదుల్లోనూ ప్రవహించేది రక్తం ఒక్కటే. ఈ రక్తానికి బేధం లేదు. సర్వప్రాణులు ఒకే రక్తంపై ఆధారపడి జీవిస్తున్నప్పుడు వీటి మధ్య తేడా ఎందుకు? వీటి రూపాలు, జీవన విధానం వేరు వేరుగా ఉన్నా వీటినన్నింటిని బ్రతికించేది రక్తమే. రక్తానికి జాతి లేదు, మతం లేదు, కులం లేదు, ప్రాంతం లేదు, దేశం లేదు. ప్రాణులన్నింటిలోనూ సమానమే. ప్రాణియైన రక్తానికి లేని బేధం, తేడా, అంటరానితనం, వ్యత్యాసం మనుషులకెందుకు. అందరి శరీరాల్లో ప్రవహిస్తున్న రుధిరం ప్రాణులంతా సమానమేనని చాటి చెబుతుంది. ఇలా విశ్వ విశ్వవ్యాప్తమైన సమానత్వాన్ని, సత్యాన్ని చాటిచెప్పిన ప్రపంచం పట్టజాలనంత కవి ఆచార్య కొలకలూరి ఇనాక్.

శ్రమించని శరీరం పూజించబడని బండరాయితో సమానమని. చెమట సృష్టి చైతన్యానికి, చిరంజీవ త్వానికి గుర్తు అని, కన్నీరు చెమట కలిసి వుంటే అనంత సౌభాగ్యం అందిస్తాయని శ్రమ శక్తి గొప్పదనాన్ని శ్రమైక జీవన సౌందర్యాన్ని ఇక్కడ ఆవిష్కరించారు.

చెమట మానవతా చైతన్యానికి సంకేతం.
కన్నీరు ప్రాణి కోటి ప్రేమైక సౌందర్యానికి గుర్తు.
చెమర్చే శరీరం సజీవంగా కదిలే దేవాలయం
చెమర్చని శరీరం పూజ పొందలేని బండరాయి
చెమట పుట్టే తనువే పునర్భవించే అద్భుత సౌందర్యం
చెమట పుట్టని తనువే నశించే శిథిల శిల్పం.

"రక్తమాత" అనే కవితతో సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా వుండాలని చెబుతున్నాడు. కవులు కళాకారులు అభ్యుదయ భావాలతో రచనలు చేయ గలరని వాంచించాడు. అశాంతితో వున్న పీడిత తాడిత ప్రజలు అసంతృప్తితో పోరాటాలకు దిగకుండా ఉండా లన్నారు. సమ సమాజ నిర్మాణం కోసం అడవులలో తుపాకి పట్టుకొని తిరిగే నక్సల్‌బరీ ఉద్యమకారులు తిరగ బడి పోరాటాలకు దిగరాదంటాడు. దేశంలో ప్రాంతీయ వాదం, మతతత్వం పెరిగి దేశం ముక్కలు కాకుండా వుండాలని హెచ్చరిస్తున్నాడు. శ్రమించే శ్రామికులు కార్మిక కర్షక వర్గాలు సంతోషంగా జీవించే రోజులు రావాలని దేశం ప్రగతిపథంలో నడవాలనే కాంక్షను వ్యక్తం చేసి అభ్యుదయ భావాన్ని ప్రకటించాడు.

ఈ కవి సమ్మేళనం కవులు
మనిషి ఆరాట పోరాటాలు
ఆదరించి దర్శించి తరిస్తారు గాక.
పీడితుల అసంతృప్తి అగ్నిజ్వాలలు
దేశ సంస్కృతిని కాల్చకుండుగాక.
అడవుల్లో మోగే తుపాకీ చప్పుళ్ళకు
ప్రజావాసాలు గాఢనిద్ర వీడుగాక
కూడు గూడు గుడ్డ
దేశాన్ని ముక్కలు చేయకుండుగాక.

ఏ దేశపు కవియైనా తన ఉనికికి ఆధారమైన సంఘాన్ని విడిచి సాము చెయ్యలేడు. సంఘమే అతని వస్తువు, వివేచన. సర్వేపల్లి రాధాకృష్ణ గారు "To the poet earth is his home and heaven his hope!" అని అంటాడు. అనగా ''స్వర్గం కూడా ఆదర్శ లోకానికి ప్రతీకేగాని వేరు కాదని'' అర్థం. సంఘజీవి అయిన కవి సంఘాన్నికాదని గంతలు కట్టుకుని ముందుకు పోలేడు. సమాజంలోని న్యాయాన్యాయాలను చీల్చి చూపించే నిశిత దృష్టి అలవర్చుకున్నవాడు. ప్రజల హృదయాలలో ప్రవేశించి వారి భావాలను పుడిపిలి పట్టి, నిర్గమించి, నిగ్గు తేల్చి రూపకల్పన చేసేవాడు. ఆశల్ని, ఆశయాల్ని, ఆవేదనల్ని, ఆవేశాల్ని ఆపుటంగా అందించేవాడు. జాతి జీవితాల్ని దీపం పట్టి చూపేవాడు. తమోపటలాన్ని తరిమి కొట్టేవాడు. సంఘం నట్టింట్లో వెలుగులు విరజిమ్మేవాడు. ఆ వెలుగుల వెంట నడవమని జనతను శాసించగలవాడు.

మన దేశంలో వర్ణ వ్యవస్థ మనుషులను కులాలుగా, మతాలుగా వేరు చేసి, మనుషుల మధ్య తగాదాలు సృష్టించింది. దానికి తోడు పేదరికం ప్రభావంతో ఉన్న వారు లేని వారు అనే ఆర్థిక అసమానతలు పెరిగి పోయాయి. కావున ఈ పరిస్థితిలో మార్పు రావాలని, మానవతా దృష్టితో అందరూ ఆలోచించాలని, ఆర్థిక అసమానతలు సమసిపోవాలని, కులమతాల కుమ్ములాటలు తగవని మానవతా ప్రబోధం తగవని హితోప దేశం చేసినాడు.

నాగుబాము అండమీకుండదు
మిడిసిపడకండి
కులం చూసి, మనిషిని కాల్చకండి
పేదరికం చూసి, మానవత్వాన్ని పాతేయకండి
మీకోసం చెబుతున్నా
కులం మనల్ని కుళ్ళబొడిసింది.
మతం మనల్ని మతిలేకుండా చేసింది.
మనమధ్య మీ సంపద కొండలా పెరిగి
సోదరత్వం దూరం చేసింది.
ఏమీలేనివాళ్ళు. అన్నీ ఉన్నమీ
సుఖశాంతులకు సంకెళ్ళు వేస్తారు.

మీ సంపదను అగ్నికి ఆహుతి చేస్తారు. అంటూ - శివుళ్ళతో పెట్టుకోకండి అనే కవితలో తెలియజేసాడు. ఇక్కడ కవి 'శివుళ్లతో పెట్టుకోకండి' అంటూ సంపన్నులుగా ఉన్నవారికి ఉన్నత కులం అని చెబుతున్న వారికి హెచ్చరిక లాంటి మాటలను చెబుతున్నాడు. శివుని స్వభావమేమి? గరళకంఠుడు ఎక్కడ నివశిస్తాడు? పరమ శివుని మూడో కంటి మహాత్మ్యం ఏమిటి ? అనే ప్రశ్నలకు జవాబులు చెప్పుకుంటే సరి. దళితులు కూడా శివుని అంశ ఉన్నవారే. స్మశానాల దగ్గర నివాసాలేర్పరచుకొని ఊరికి దూరంగా నివశించేవారు. పరోక్షంగా శివునితో కలిసి జీవించేవారన్న మాట. రుద్రుడు భక్తుల కోర్కెలు తీరుస్తాడు. ఉగ్రుడైనాడంటే భస్మం చేస్తాడు. దళితుడు అంతే. పాచి పని మొదలుకొని మీకు అసహ్యం అనిపించే పనులన్నీ చేసి మీకు సుఖాన్ని అందించి తాను నిరా హారునిగా జీవించగల శక్తి సంపన్నుడు దళితుడు. సింహాన్ని, ఏనుగును లొంగదీసుకున్న ధీరుడు దళితుడు. క్రూర జంతువులనే తన బలంతో ఒక ఆట ఆడించగల దళితుడికి మీరొక లెక్క. అందుకే కవి శివుళ్లతో పెట్టు కోకండి అని హెచ్చరిస్తున్నాడు. దళితుల శ్రమను దోచుకున్న మీరు అతనికి చెందవలసిన సంపదను చెల్లించమంటున్నాడు. లేదంటే మీ సుఖశాంతులకు సంకెళ్ళు వేసి మీ సంపదనంతా అగ్నికి ఆహుతి చేస్తా మంటున్నారు.

మనుషుల మధ్య సోదరభావం ఉండాలి గాని కులం, మతం, ప్రాంతం పేర విభజించుకొని కలహాలు సృష్టించ కూడదు. బైబిల్‌లో ఒక మంచిమాట ఉంది. అదే ''సహోదరుల మధ్య ప్రేమ ఎంతో మనోహరం'' అని. ఏ మత గ్రంధాలు చెప్పినా మనుషుల మధ్య ఐక్యతనే చెబుతాయి. పాలకవర్గాలు తమ పబ్బం గడుపుకోవటానికి మనిషికి మనిషికి మధ్య అంతరాలు పెట్టి కులం పేర ఆర్థిక స్థోమత పేర విభజించి చిచ్చులు పెడుతున్నారు.

దీన్ని గమనించిన దళితులు చైతన్యవంతులై ధనవంతుల సంపదను అగ్నికి ఆహుతి చేయడానికి సిద్ధమవుతున్నారు. సోదర భావాన్ని పాటించినపుడు దళితులు చేసేదే మంచి పని అవుతుంది మరి.

'ప్రేమ ఒక గాయపడ్డ హృదయం' కవితలో దళితుడు, యేసుక్రీస్తు ఈ లోకాన్ని ఎంతగా ఎంతగా ప్రేమిస్తారో తెలియజేసాడు, ఆచార్య కొలకలూరి ఇనాక్. మొదట లోకాన్ని సృష్టించిన యెహోవా తర్వాత తన పోలికగా మనిషిని, అతనికి సాటిగా స్త్రీని నిర్మించి ఈ భూమిని స్వతంత్రించుకొమ్మని, సెలవిచ్చాడు. జనాభాతో పాటే మనసు మలినమై అపవిత్రత పాపము పెరగ సాగింది. పరిశుద్ధుడైన క్రీస్తును మనుషులు చూడలేక పోయారు. పాప పరిహారార్థం యెహోవా తన ఒక్కగా నొక్క కుమారుణ్ణి ఈ లోకానికి పంపాడు. ఆయన శరీరధారిగా లోకంలో సంచరిస్తూ తండ్రి మార్గాన్ని ఉపదేశిస్తూ అద్భుతాలు, మహత్కార్యాలు, స్వస్థతలు, సూచక క్రియలు జరిపి ప్రభు మార్గాన్ని సరాళం చేస్తూ ప్రజలను పాప విముక్తులను చేస్తూ వచ్చాడు. ఈ కార్య క్రమాలను ఆయన తన 30 సం॥ల ప్రాయంలో ప్రారంభించాడు. అయితే ఈ లోకంలో ఆయన బోధనలను మతాధిపతులు రాజులు అంగీకరించలేదు. క్రీస్తు శిష్యుడే ఆయనను 30 వెండి నాణెలకు అమ్మి సైనికులకు పట్టిచ్చాడు. నేరం మోపి ఆయనకు సిలవ శిక్షను రోమా ప్రభుత్వం అమలుపరచింది. ఈ శిక్షను అమలు చేయటంలో ప్రభుత్వం సైనికులు ఆయనను కొరడాలతో కొట్టారు. భారమైన సిలువను మోపించారు. అపహాస్యం చేసారు. ఇవన్నీ దేవుడైన యెహోవా కుమారుడు అనుభవించాడు. ఎవ్వరినీ పల్లెత్తు మాటనలేదు మౌనంగా ఉన్నాడు. ఎందుకంటే తన ప్రజలను ఆయన ప్రేమించాడు కనుక ఈ విషయాన్నే కవి చెబుతాడు.

వాళ్ళు నన్ను పెట్టే బాధల్ని
సంతోషంగా స్వీకరిస్తాను.
దు:ఖంతో వేదనతో
నిండిన ముఖాన్నించి
ఆనందాన్ని కోసుకోవాలని - శిక్షను అనుభవించాలి క్రీస్తు.

ఈ నేలపై దళితుని స్థితి కూడా అలాంటిదే ఈ దేశంలో పుట్టిన దళితుడు ఈ దేశాన్నెంతో ప్రేమిస్తున్నాడు. అదికూడా క్రీస్తు వలెనంటాడు.

వాళ్ళు నన్ను మోసం చేసినా
డాంబికాలు చూపినా
నన్ను అల్లరి పెట్టినా
నేను వాళ్ళని ప్రేమిస్తాను.
ఎందుకంటే వాళ్ళు నా అన్నదమ్ములు.

ఈ దేశంలో దళితులు ఎంత వంచనకు గురైతున్నారో అందరికీ తెలుసు. కులం, మతం పేరిట ప్రతిచోట దూషణలు, అవమానాలు పొందుతున్నాడు. అయినా ఈ దేశాన్ని ప్రేమిస్తున్నానంటాడు. అయితే నేను మర్త్యుణ్ని, అయినా నేను వాళ్ళని ప్రేమిస్తున్నాను. నేను మనిషిని, గాయాన్ని, అది కూడా జీవితం కోసం అయిన గాయాన్ని, ఆ గాయం ఎంత కాలమంటే

మూడున్నర ఏళ్ళ పాటు కాదు
తొంబైఏళ్ళ పాటు
నీకు సిలువ వేసింది
ఒక్క రోజుకే
నాది జీవితాంతం
ప్రతి రోజూ సిలువ వేయబడుతున్నానంటాడు.

ఏసు ప్రభు శ్రమలు అనుభవించింది మూడేళ్ళ పాటే, తర్వాత సిలువ మరణం పొందాడు. దళితుడు అనుభవిస్తున్న శ్రమలు జీవితాంతం తొంబై ఏళ్లపాటు, అనగా మరణించేంత వరకు అన్నమాట. అంతేకాదు ప్రతిరోజు సిలువ వేయబడుతున్నాడు దళితుడు. మరి దీనికి విముక్తి లేదా? నువ్వు నీ శత్రువులను, హంతకులను ప్రేమిస్తావు. వాళ్ళని క్షమించడానికి, రక్షించడానికి, పోషించడానికి, ప్రేమాభిమానాలు నిండిన మానవాత్మలుగా మార్చడానికి నీ హంతకుల్ని ప్రేమిస్తావు. ప్రేమ నిన్ను

దేవున్ని చేసింది. అది మానవీయమైనది, దివ్యమైనది కాబట్టి చివరగా క్రీస్తుకు దళితునికి ఎంత సారూప్య ముందో క్రింద తెలియజేస్తాడు.

అన్ని కాలాలు మానవజాతిని ప్రేమించడానికి
నీకొక గొప్ప హృదయముంది
నీ పొరుగు వాణ్ని ప్రేమించడానికి
నీకొక నెత్తురొలికె గుండె ఉంది
మనం ఇద్దరం ప్రేమిస్తాం
అయితే నువ్వు దేవుడివి
నేను మనిషిని.

దళితునిది ఎంత కరుణార్ద్ర హృదయం అందుకే దళితుణ్ని ప్రేమించమంటాడు ఇనాక్.

వాణ్ని ప్రేమించండి
వజ్ర వైఢూర్యాలు వరంగా ఇస్తాడు
వాణ్ణి గౌరవించండ్డి

భూమి సుఖ శాంతులు పంటనిస్తుంది. అంటూ దళితేతరులకు మేలు చేసే పరమసత్యాన్ని ఉపదేశిస్తాడు.

కాలంతో పాటు ఆలోచనలు మారాలి. సాంప్ర దాయాలు మార్చుకోవాలి. జీవితాన్ని ఆధునిక దృక్పథంతో మానవతా దృష్టితో మార్పు చేసుకోవాలి. అభ్యుదయ భావాలు హృదయంలో నింపు కోవాలి. అప్పుడే సమ సమాజం స్థాపన సాధ్యమవుతుంది. సమాజానికి శ్రేయస్సు కలుగుతుందని "ఈ కులాన్నేం చేస్తారు" అనే కవితలో ఇనాక్ గారు మనిషి తన విజ్ఞానం ద్వారా ఆకాశ రహస్యా లను చేదిస్తున్నాడు. సముద్ర లోతుల్ని అధ్యయనం చేస్తున్నాడు. నిప్పును, నేలను, ప్రకృతి శక్తులను నియంత్రించగలుగుతున్నాడు. గ్రహాంతరాలను దాని అంతరిక్షయానం నివాసం గురించి తెలుసుకుంటున్నాడు. సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్నాడు. కాని ఎంత అధునాతన శాస్త్ర పరిజ్ఞానం సాధించినా, మనిషిలో తరతారలుగా మనుసుల్లో అంతరాలు సృష్టించిన వర్ణ వ్యవస్థ జాడ్యం నుండి బయటపడలేక పోతున్నాడు. సంకుచిత మనస్తత్వంతో కులాల కుమ్ములాటలతో హెచ్చుతగ్గుల తారతమ్యాలతో ఆలోచిస్తున్నాడు. మనుషులందరూ ఒకటే అనే సోదరా భావం పెంపొందించుకోవాలని తన కోరికను క్రింది విధంగా తెలియజేస్తున్నాడు.

మనిషి ఆకాశాన్ని జయించినా,
సముద్రాల్ని తరించినా,
నిప్పును నియంత్రించినా,
నేలను పంచినా,
గ్రహాంతరాలు దాటినా,
సృష్కిర్తను పక్కనబెట్టి
ప్రాణికోటిని సృష్టించినా,
వర్ణ స్థైర్యం సడలలేదు.
వర్ణం అన్న అక్రమ సంతానం కులం
అన్నా! ఈ కులాన్నేం చేస్తారు ?

భారతంలో ఏకలవ్యుడు, రామాయణంలో శంభూకుడు కులం చేతనే శిక్షలు అనుభవించారు. సత్య హరిశ్చంద్రుని కొన్నది చండాలుడు. శంకరాచార్యుడికి అద్వైత వేదాంత తత్వాన్ని బోధించినవాడు చండాలుడు. రామానుజాచార్యుల గురువు చండాలుడు. భారతీయ వేద వేదాంగాలకు, పురాణేతిహాసాలకు మూల విరాట్ ఒక చండాలుండంటే ఎంత ఆశ్చర్యం. అనగా మాల మాదిగలు, హరిజనులు వీళ్ళంతా అవతార పురుషులే. అపరశివులే అనక తప్పదు. ఇంతటి మహోన్నత వ్యక్తిత్వం ఉన్న దళితుడు కులం కుట్రలో చిక్కుకు పోయాడు. వంచనకు గురై సవర్ణుల ఉచ్చులో కూరుకుపోయాడు. కులం నుంచి నేటికీ వేరుపడలేకపోయాడు.

ఆధునిక మానవుని మేధస్సుకు అంతుచిక్కనిది ఏదీ లేదు. విజ్ఞానం, పరిశోధన, నూత సృష్టి, అన్వేషణ అనేక రంగాల్లో మనిషి సాధించలేనిది ఏదీ లేదు. జ్ఞానమెకడి సొత్తు కాదురోయన్న - అది సర్వజాతుల సంపదరోయన్న - అని అన్న కవి మాటల్లో ఎంతో వాస్తవం కలదు. జ్ఞానానికి కులం లేదు. శాస్త్రీయ రంగంలో కృషి చేసిన మేధావులు మానవుని ప్రతి అవసరాన్ని గుర్తించి వాటిని తీర్చే మార్గాలను అన్వేషిస్తూ ప్రపంచానికి అందిస్తూ ముందు

కెళుతున్నారు. మరో నూతన సృష్టికి శ్రీకారం చుడు తున్నారు. గ్రహాంతరాలను చుట్టి రావడమే కాకుండా ప్రాణకోటిని బహుమానంగా నిర్మిస్తున్నారు. ప్రతి వస్తువుకి, సమస్యకి ప్రత్యమ్నాయం చూసి మనిషి ఆరోగ్య సంరక్షణను పెంచుతున్నారు. ఇంత అభివృద్ధిని సాధించిన ప్రపంచంలో అందునా భారతదేశంలో కులం మాత్రం వీగిపోవటం లేదు. మన ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ, వేషధారణ, సంస్కృతి, సాంప్రదాయాలు, మనం జీవించే పద్ధతులు అన్ని మారిపోయాయి. కాని కులం మాత్రం మారటం లేదు. వివక్ష యుగయుగానికి మనిషిని వెంటాడుతూనే ఉంది. మరి దీన్ని నిర్మూలించాలంటే ఎలా? మలేరియాకు, ప్రాణాంతకమైన వ్యాధులకు మందులున్నాయి. కాని కులం కాటుకు మందులేదు. మరి దీన్ని ఏంచేద్దాం? అంటాడు కవి. ఈ సమస్యకు పరిష్కారం పాఠకులే నిర్ణయించుకోవాలి.

సమాజంలో ఆర్థిక, సాంఘిక రాజకీయ అసమానతలు, కుల, మత, భాషా ప్రాంత వ్యత్యాసాలు పోవాలి. అందరూ ఒకటే అనే సమానత్వ భావన పెరగాలి. జాతీయ సమైక్యత సాధించబడాలి. అప్పుడే దేశం పురోభివృద్ధి సాధించబడుతుందని ''సమతలం నిర్మించండి అనే కవితలో'' పేర్కొన్నాడు. తిన్నదరగని వాడికి, తినడానికి తిండి లేనివాడికి మధ్య వున్న అసమానత పోవాలి. దొరలు, సేవకుల మధ్య వ్యత్యాసం తగ్గాలి. అసమర్థులు, అనాథలు, అభాగ్యులు మొదలగు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వాలు కృషి చేయాలి. వాళ్లకు ఆత్మీయత పంచాలి. ప్రేమాభిమానాలు చూపాలి. అప్పుడే దేశం ప్రపంచ దేశాల్లో సర్వోన్నత స్థానం అలం కరించగలదని కవి అభిప్రాయపడ్డాడు.

తిన్నదరగని వాడికి
తినటానికి లేనివాడికి
మధ్య దూరం తగ్గించాలి.
దోచుకొనే దొరల
పెడరెక్కలు విరిచికట్టి
దోపిడీకి గురయ్యేవాడి
శాశ్వత కారాగారం కూలగొట్టి
సమతలం నిర్మించండి.
పిల్లల్ని తల్లిదండ్రులు,
వృద్ధుల్ని కన్న బిడ్డలు
అసమర్థుల్ని, అనాథల్ని
అమాయకుల్ని, అయోగ్యుల్ని
ప్రజా ప్రభుత్వ సమాజంగా కాపాడండి.
ఓట్ల రాయితీలిచ్చి కాదు
ప్రేమామృతం పంచి.
అప్పుడే భారతీయులు
సభ్యదేశాల ప్రజలతో
సమస్కంధులు కాగలరు.

విశ్వజనీనమైన ప్రేమ. మనుషులంతా ఒక తల్లికి, తండ్రికి పుట్టిన బిడ్డల్లాగా భావించుకొని కలిసి ఉంటే కులం, మతం, ప్రాంతం, భాష అనే ఏ భావనా ఉండదు. కవి భావన ఎంత అద్భుతమైనది. ఈ విశ్వ మానవ ప్రేమకు అందరూ ఆహ్వానితులే. మరి రండి. సోదరభావంతో సంతోషకరమైన ప్రపంచాన్ని నిర్మిద్దాం.

భారతదేశం అనేక ప్రాంతాలు, అనేక భాషలు, మతాలు, వృత్తులు, అనేక వర్గాలు, అనేక భిన్నత్వాలు కలిగిన జన సమూహాల సమ్మేళనం. ఈవిధమైన భిన్నత్వం వున్నా మనమంతా భారతీయులమే. భిన్నత్వంలో ఏకత్వ సాధనే ఈ దేశ అభివృద్ధి మూలాధారం. ఈ భిన్నత్వం దేశ అభివృద్ధికి అవరోధం కారాదు. అందరూ ఒకటే అందరూ ఈ దేశమాత సంతానమనే భావన భారతీయు లందరి హృదయాల్లో నిలిచి వుండాలి. ఈ విషయాన్ని ఇనాక్ గారు ''భారతీయ ప్రజలారా దీవించండి'' అనే కవితలో వ్యక్తపరుస్తాడు. విదేశీయులైనా స్వదేశీయులైనా, కార్మికుడైనా యజమానియైన, ధనవంతుడైన పేదవాడైన, మేధావులైనా, పాలకులైనా, పాలితులైనా అంతా అన్న దమ్ములే. భారత రాజ్యాంగం ద్వారా ఏర్పరచబడిన సమానత్వం అందరికి వర్తిస్తుంది. హక్కులందరికి

సమానంగా వర్తిస్తాయి. కులాలు, మతాలు, పేద, గొప్ప అనే వ్యత్యాసం మాని. ఒకరినొకరి ఆత్మీయ భావంతో హృదయాలింగనం చేసుకోవాలి. ఐకమత్యం ప్రదర్శించాలి. ఈ దేశం ఏ ఒక్కరిదో కాదు. అందరికి సమాన హక్కులు గల ప్రజాస్వామ్య దేశం మనది.

విదేశీయులారా, స్వదేశీయులారా
మనమంతా అన్నదమ్ములమే.
అవసరంతో ఆపదలలో కష్టంలో సుఖంలో
మనమంతా అన్నదమ్ములమే.
ఒకడు మేధావి, మరొకడు కర్షకుడు
ఒకడు రైతు, ఇంకొకడు పాలకుడు
ఐనా మనమంతా అన్నదమ్ములమే.
ఇక రాజ్యాంగంలో సుప్రతిష్ఠితమైన
సోదరత్వం చెల్లు బాటవుతుంది.
ఈ కలలు నిజమవ్వాలని,
ఈదేశం మనందరి సొంతమని
నాయకులు ఉత్తమ పాలకులు కావాలని
భారత ప్రజలారా దీవించండి.

సాటి వ్యక్తుల పట్ల, ప్రాణుల పట్ల దయ, జాలి, కరుణ, ప్రేమ కలిగి ఉన్నప్పుడే మానవుడు మహనీయుడౌతాడు. మానవత్వానికున్న మహనీయతను క్రింది విధంగా చాటాడు.

మానవత్వం విశాలమైతే దేవత్వం
మానవత్వం సంకుచితమైతే దానవత్వం

Let my Country be Governed by the hearts of service and sacrifice. Let the new dawn Promise a good morning of mercy, Compession, hope and joy.

సమానత్వాన్ని ప్రతి హృదయంలోనూ చాటుతూ ముందుకు సాగడమే మానవత్వం. దానికి మరో రూపం ప్రేమ. ఆ ప్రేమను తన హృదయమంతా నింపుకున్న ధన్యజీవి. ప్రేమామయుడు ఆచార్య కొలకలూరి ఇనాక్.

మనిషి నా గీత నా బైబిల్ నా ఖురాన్
మనిషి నా బేంక్ చెక్‌బుక్ ధనం మానం
మనిషి నా ఊపిరి ప్రాణం రక్తం
మనిషి నా చైతన్యం నా జీవితం నా వ్యక్తిత్వం
నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.

మనిషి మానవోన్నతునిగా తీర్చిదిద్దే పవిత్ర గ్రంధాలు, అతని ఆర్థిక అవసరాలు, గుణశీలాలు, మనిషికి ఊపిరి ప్రాణమైన రక్తం, మానవుని మనుగడ, అభివృద్ధి, వ్యక్తిత్వమై మనిషిని నిర్మిస్తున్న ప్రాణపదమైన ఈ నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. మనిషిలోని మానవత్వానికి మహాపీఠం వేసిన మానవతా మూర్తి ఆచార్య కొలకలూరి ఇనాక్.

❖❖❖

ఆధునిక సాహిత్యంలో సామాజిక స్పృహ

– డా॥. పుట్ట శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, పాలమూరు విశ్వవిద్యాలయం, మహబూబ్ నగర్ జిల్లా, తెలంగాణ.

19వ శతాబ్దంలో ఆధునిక సాహిత్యం నడకలు నేర్పిన కాలమది.బ్రిటీష్ పాలన నిజాం నవాబుల పాలన రాజుల పాలన సామాజిక వ్యవస్థలో మార్పుకోసమై ఆధునిక సాహిత్యం సామాజిక స్పృహ కోసమై తన వంతు కృషి చేసింది.ఆధునిక సాహిత్యంలో సామాజికసేవ కోసం అనేక విధాలుగా ఈప్రయత్నంలో భాగంగా వ్యక్తిగత ఆనందమే ఒకనాటి సాహిత్యానికి ప్రయోజనం కానీ రాను రాను పాఠకులకు సాహిత్యానికి సమాజానికి ఉన్న సంబంధాన్ని గుర్తించి విమర్శనా దృష్టితోనే సాహిత్యాన్ని అధ్యాయానికి నాంది పలికారు.

ఆధునిక కవులు సర్వతారోహకులు అనేక దిక్కుల నుండి ఆరోహణకు సిద్ధమైనట్లుగా నేటి ఆధునిక కవులు సాహిత్యాన్ని వివిధ కోణాల నుండి అధ్యాయనం చేస్తున్నారు. కాలానుసరణ పద్ధతి, చారిత్రక పద్ధతి, తుల నాత్మక పద్ధతి, లాక్షణిక పద్ధతి, ప్రక్రియాపర పద్ధతి, రస భావ అనుభూతి అధ్యయన పద్ధతి, సామాజిక సాంస్కృతిక అధ్యయన పద్ధతి ఇలాంటి ప్రయోగాలు చేశారు. కవి తన చుట్టు తాను తిరుగుతూ సమాజం చుట్టూ తిరుగుతాడు. కవిసమాజంలో ఒక పౌరుడు మిగిలిన ప్రజలకంటే ముందుగానే సత్యాన్ని దర్శించి తన ప్రతిభతో శిల్ప నైపుణ్యంతో లోకానికి తెలియజేస్తాడు. సమాజం అంటే వ్యక్తుల సమూహమే సహృదయాలకు నిజమైనదే సాహిత్యం ఆధునిక సాహిత్యం అంటే మానవ జీవిత చిత్రణం మానవ జీవితం అంటే ప్రకృతిలో సంబంధం ఉండే సంఘ జీవితం మానవులు సంఘ జీవులు ఆర్థికంగా సాంస్కృతికంగా రాజకీయంగా, మత పరంగా విలువలతో ముడిపడి ఉంటాయి. సాహిత్యానికి సమాజానికి ఉండే సంబంధం వ్యక్తులకు సమాజంతో ఉండే సంబంధం లాంటిది.

ఆధునిక కవులలో సమాజం కోసం సాహిత్యం ద్వారా చేసిన కవులు గురజాడ అప్పారావు, కందుకూరి, శ్రీశ్రీ, రాయప్రోలు, జాషువా, చిలకమర్తి, పానుగంటి విశ్వనాథ దేవులపల్లి దువ్వూరి,దాశరథి,కుందుర్తి తిలక్, వేమన్న, సినారే ఇలా అనేక మంది కవులు సామాజిక స్పృహ కోసమై తమ సాహిత్యం తెలియజేశారు. వీరేకాక ఆధునిక కవులు సామాజిక స్పృహ కోసం ఎంతో పాటుపడ్డారు. ఆధునిక సాహిత్యంలో సామాజిక స్పృహ అంటే సమాజ వాస్తవలను భౌతిక దృక్పథంతో పరిశీలించడం జీవితాన్ని ముందుకు నడిపించే శక్తిలేవో అడ్డుపడే శక్తిలెన్నో ఆ శక్తులను ఎందుకోసం ఎవరు సమర్థించి పోషిస్తున్నారు. ఎవరు ఎందుకోసం వ్యతిరేకించి నిరూపిస్తున్నారో తెలుసుకోవడం ఆధునిక సాహిత్యంలో సామాజిక స్పృహ భావించవచ్చును. రచయితలు సాహిత్య సృజన ద్వారా జీవితాన్ని ముందుకు నడిపించే శక్తుల పక్షం వహించి అడ్డుమండల శక్తులను ఎదుర్కోవడమే సామాజిక

చైతన్యానికి నిదర్శనం రచయితలకు ప్రగతిశీలకమైన సామాజిక దృక్పథం ఉండాలి.

సామాజిక దృక్పథం అంటే భావనలను అంగీకరిస్తే సమాజంలో మార్గాలు ఉన్నాయని అనేక రకాల వర్గాలలో జన్మించిన వారికి స్వభావము ఉంటుందని జీవితాను భవాల ద్వారా అలవర్చుకోవడానికి పరిశీలన వలన ఆలోచనలు ప్రయోజనాలకోసం చైతన్యం కోసం కవులు ప్రయత్నం చేస్తారు. వర్గ చైతన్యాన్ని అలవర్చుకోవడానికి వీలున్నది. దీని ఒప్పుకోవడం ఇష్టంలేని సాహిత్యవేత్తలు, సామాజిక స్పృహ కోసమై ఆధునిక సాహిత్యం ద్వారా ఎంతో ప్రయత్నం చేశారు. సామాజిక స్పృహ అనే మాటను ఎగతాళి చేయడానికి ప్రయత్నిస్తారు. ప్రాచీన కవులందరికీ సామాజిక దృక్పథం ఉన్నదని ఆ విషయం కొత్తదేమీ

కాదని వాదిస్తారు. సమాజంలోని ఆర్థిక,సాంఘిక,రాజకీయ సమస్యల్ని క్షుద్రమైనవనీ సాహిత్యం వీటన్నిటికీ అతీతమైనదని భావిస్తారు.

సాహిత్యానికి ఆనందమే తప్ప మరో సాంఘీక ప్రయోజనమేది లేదని సాహిత్యం వ్యక్తిగత మోక్ష సాధ్యమని లేదా వ్యక్తిగత విముక్తిని భావించవచ్చును. ఆధునిక సాహిత్యంలో సామాజిక స్పృహతో రాసే రచన పాఠకులలో సామాజిక చైతన్యానికి దారి చూపుతుంది. అది సమాజ పురోగతికి చేస్తుందని రచయిత అచేతన స్థితిలో సుప్తచేతన స్థితిలోనో సాహిత్య సృజన జరుగు తుందని అనుకోవడం రచయితకు రచనల పట్ల బాధ్యతను సమాజం పట్ల బాధ్యతను విస్మరించడమే అవుతుంది. కావ్య జగత్తు సామాజిక జగతి నుండే పుడుతుంది. సామాజిక స్పృహ కోసమై ఆధునిక జీవిత సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది. సామాజిక సమస్యలు అనుభూతులు అనుభవాలు కావ్య జగతిలో ప్రతి బింబిస్తాయి.

ఆధునిక సాహిత్యంలో సామాజిక స్పృహ కోసమై తమ ఆలోచనా విధానాలను అనేక రకాల పేర్లతో రచనలు కొనసాగించి సమాజాన్ని చైతన్య పరిచారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సహనం, శాంతి, ప్రేమ, ప్రజాస్వామ్యం మొదలైన భావజాలం విశ్వ ప్రపంచంలో జీవకోటి అందరికీ ఉండాలని ఆధునిక సాహిత్యంలో సామాన్యులకు ప్రాధాన్యత వచ్చిందని చెప్పవచ్చును. వాస్తవానికి సామాజిక స్పృహ కోసం వస్తువులో సాహిత్య భాష ప్రక్రియలలో ఈ మార్పు స్పష్టంగా కనబడతాయి. ఆధునిక సాహిత్యంలో వచ్చిన పరిణామాల నేపథ్యంలో భూస్వామ్య రాచరిక వ్యవస్థ కొనసాగుతున్న కాలంలో సాహిత్యం యందు రాజుల కథలు దేవతల లీలలు భక్తి తత్వాలను వర్ణాశ్రమ ధర్మాలను కవులు వస్తువులుగా స్వీకరించారు. 19వ శతాబ్దంలో బ్రిటీష్ పాలన వలన వారి ప్రభుత్వం ఏర్పడింది. భారతీయ సమాజంలోకి ఆంగ్ల భాషలో చదువులు ప్రారంభించారు. అనేక భావజాలాలు పొందుపరుచుకుంటూ పట్టణ ప్రాంత అభివృద్ధి పత్రిక చలనచిత్ర గ్రంథాలయాలు వివిధ కోణాల నుంచి కథలు వచన కవిత్వం నవలలు నాటికలు శతకం అశుసాహిత్యం అభ్యుదయ విప్లవ సాహిత్య సృజన ద్వారా సమాజానికి గణనీయంగా స్పృహ కలిగింది.

సాహిత్యం సమాజం రెండింటిలో సమాజం మొదటిది. అభివృద్ధి దశలో గడిచిన సమాజంలో సాహిత్య సృజన భాష భావాలు అభిప్రాయాలు కలిసి సాహిత్య రూపానికి దారి తీస్తుంది. సమాజం మారే కొద్ది సాహిత్యం మారుతుంది. సామాజిక పరిణామ దశలో ఆదర్శాలు విశ్వాసాలు రూపకల్పన చేశాయి. ఈ భావజాలం సంఘటితం చేయడానికి సాహిత్యం సామాజిక భావ జాలాన్ని కళాత్మకంగా ప్రతిఫలిస్తుంది. కొత్త కథాత్మక అంశాలను తీసుకుని సమాజం మార్పు కోసం పరిష్కార మార్గాలను తీసుకుని విశ్వ శ్రేయాన్ని కలిగించే సాహిత్యాన్ని సృష్టించడమే గతానగతికత్వం మూసలక్షణం జీవన చైతన్యానికి నిదర్శనం సాహిత్యం సజీవంగా ఉండాలంటే సమాజంతో సంబంధాలు ఉండాలి. సమాజంలో మార్పు అనుగుణంగా సాహిత్యం మారుతూనే సామాజిక స్పృహ కలిగిస్తుంది.

❖❖❖

Societal Safety Sciences/Technologies in building an Ideal Society

- Prof. R. Ramakrishna Reddy and Dr. K. Rama Gopal, Department of Physics,
Sri Krishnadevaraya University, Ananatapur,, A. P. India

Abstract :

Societal safety sciences are new academic systems of interdisciplinary studies that combine specialized fields of social science and humanity. Advancements in science and technology have made our society convenient and comfortable. Scientific and technological progress has had various effects on society. These effects have not been limited to the improvement of society's material wealth, but have also extended to altering the paradigms under which society operates. Science and technology (S&T) will solve society's problems and considering how the future can change if science and technology address issues. Developments in S & T are altering the way people live, connect, communicate and transact, with profound effects on economic development .Some Salient features of Science and its role are presented in this paper.

Introduction :

Science and its role appreciate by society. Scientific knowledge helps the public satisfy many basic human needs and improves living standards. Finding a cure for cancer and a clean form of energy are two known examples. Similarly, science recognizes by the public as driving economic growth, which seems like a return on investment for public funding. We live in a knowledge society. It contributes to the functioning of democracies and innovation and helps countries to be competitive on a global scale. But science which contributes significantly to knowledge production is confronted with new challenges (https://www.hiig.de/en/science-and-society).

Science teaches you how to solve problems. Science plays an essential social role. Societal safety sciences ensure immense knowledge. Societal safety sciences (**Sidney Dekker,** 2019) are new academic systems of interdisciplinary studies. It combines specialized fields to prevent accidents and disasters that threaten human society, rescue the victims, and recover and reconstruct disaster areas (Seiji Abe et al., 2018). However, societal safety science has not quite yet established itself as a new field for studying problems in safety.

Does Science need Society?

The Concept of Ideal Society :

Plato suggested an Ideal society first. Society defines as a group of human beings sharing social relationships. A society is a group of people living together in a community. It includes some form of government rules and economic concepts. An ideal society would be a society where there is peace and liberty, and everyone creates equally. It logically would be the one in which everyone got as much of what they want as it is possible to achieve equitably. *An aggregate of people living together in a harmonious and customs is called an Ideal Society.* The best Society would exist when a common concern for the collective became intrinsic to individual priorities and choices. It would also be in harmony with the environment.

Poverty, disease, warfare, and crime would be past things. Description and understanding of an ideal society are two contentious issues put forward by scholars. While some sociologists focus on social components defining a perfect community, political scientists and economists underpin the significance of socio-political elements. Thus, an ideal society incorporates socio-economic and sustain life **(Kogelmann, 2017).** An ideal society must maintain order in its socio-political systems. In this regard, a well-ordered culture includes accepting systematic principles of justice, which regulate societal institutions.

Another important detail about utopian societies is that one has never existed. Sir Thomas More created the term utopia from the Greek language, which means 'no place. 'Groups and individuals have tried to create utopias in the past, but all have failed to date. Utopias are impossible to achieve because things can never be perfect. Utopias try to reorganize Society to correct what they see is wrong with how we live. Socrates believes that these qualities are intertwined and the justice of the individual requires a balance and embodiment of certain qualities. A good society will be "wise, courageous, [and] moderate," and these qualities must exist independently.

Science and Technology in Building an Ideal society :

Science and technology play a vital role in our daily lives. Technology plays a fundamental role in wealth creation, improving the quality of life, and real economic growth and transformation in any society. Almost everything we see is the gift of science and technology, whether smart phones, fans, electricity, microwave, radio, television, laptops, wheel, vehicles, cloth, paper, toothbrushes, etc. We must ensure adequate development of the workforce to guarantee the efficient utilization of resources and reduce the drain on our treasury and independence on outside sources for industrialization.

Science and technology (S&T) will solve society's problems by exploring examples and considering how the future can change if science and technology address issues. They have facilitated human life and made us feel comfortable. It enabled us to live a modern way of life. Science is an intellectual understanding of the world based on experimentation. S&T have solved many of society's problems and will continue to do so in the future. Scientific knowledge allows us to develop new technologies. Developments in S & T are altering the way people live, connect, communicate and transact, with profound effects on economic development. They renew emphasis given on creating and setting priority and evaluation rights, and promoting transparency, objectivity, and selectivity. Today **knowledge-based economies** are emerging stronger. S&T are associated with modernity and are essential to nation-building and the rapid development of their subject.

The long term goal of S&T development is:

- The long-term goal of science and technology should be in accordance with that of national development.
- Because of the limitation in available resources, priority areas should be established through consideration of, among other things, national needs and comparative advantage.

- The role of S&T is to lead national development and to support socio-economic needs.
- The priority areas that have been identified are:
- Development of electronics, information, and communication technologies.
- Development of selected high technologies to lead the industrial structure adjustment.
- Development of key technologies to increase the international competitiveness of existing Korean industries.
- Development of technologies related to resources, energy, and food for social and economic stability.
- Development of technology in the area of health care, environmental protection, and social information systems to improve the quality of life and social benefits.

Modern society is becoming dependent on S & T because they've become an essential part of everyday life following people's needs and needs. Present social science theory and public policy are no longer adequate to meet the multi-dimensional challenges posed by rising social aspirations, unemployment and inequality, wasteful patterns of production and consumption. The purpose of science is to create knowledge and that of technology is to translate scientific knowledge into products and processes .For example, science found out lasers and thoroughly investigated it. The result was a huge body of knowledge about lasers. Science and Technology have introduced us to the establishment of modern civilization. This development contributes greatly to almost every aspect of our daily life. Hence, people get the chance to enjoy these results, which make our lives more relaxed and pleasurable. Science was instrumental in providing people with answers in common questions as well as providing solutions to many of the issues we face each day. For instance, there are various vaccines, potions, medicines that scientific knowledge has aided to discover around the world.

Science and Technology benefits include:

1. Life is made simple and convenient using science and technology.
2. Travel is becoming easy and quick.
3. Interaction is becoming more accessible, faster and cheaper.
4. The quality of life has increased with either the increase in innovation.
5. Man has become sophisticated by using a variety of new technologies.

A public without improved scientific literacy, including an understanding of scientific evidence and risk, will be unable to make informed decisions for themselves, their families, and as part of the democratic process. They will be unable to contribute effectively to GM foods, biometric data, or nuclear energy. We now need a more mature relationship between science, policy, and society, with each group working to understand better the needs, concerns, aspirations, and ways of working of the others. 'Science and society' used to be an area seen solely as a niche part of science communication. The 'endless frontier' of research opens up new opportunities and ways of addressing societal challenges (https://assets. publishing. service.gov.uk/government/uploads/system/

uploads/attachment_data/file/36747/49-08-S_b.pdf).

Science is a tremendously important part of our cultural heritage and a vital part of our shared future. Confidence and trust in science should arise from a realistic and informed understanding of the processes of science and the practices of scientists. Scientists in academia. Demonstrating and exploring their values and motivations is also an important way for scientists to understand society and refresh their perspective on the value of their work. It provides the public with enough understanding of science and the opportunity to contribute to debates when science discusses, ultimately empowering society more. Scientific findings must apply at suitable scales. One must consider the impact of technological interventions on individual people, communities, and the environment. Science needs to become more multidisciplinary, and its practitioners should continue to promote cooperation and integration between the social and natural sciences (https**://www.nature.com/wcs/m05s.html**). A holistic approach also demands that science draws on the contributions of the humanities, local knowledge systems, aboriginal wisdom, and a wide variety of cultural values. Societal safety sciences offer a new multi-angled integrated field of study about safety and security. Solving societal safety problems that relate to people's safety and security thus requires multi-angled viewpoints over a synthetic framework that covers humans, society, scientific technology, and nature.

Science suggests ideas, and technology operationalizes them. Science clarifies and justifies how may achieve an objective. The "how" is translated into practical realization, and from here, technology takes over and complements science. It, therefore, shows that there is a symbolic relationship between science and technology. Science, a systematic search for truth, provides the basis for technology. Without technology, science becomes impotent, and without science, technology does not exist. However, the technology, the application of techniques, and not science lead to an increase in production. In the past, science and technology constituted distinct traditions, maintaining separate identity paths of processes and activities (Anaeto et al., 2016).

Citizen science could involve data collection, interpretation and analysis, and the dissemination of results. In many projects, the role of local stakeholders is strictly limited to information gathering. Citizen science refers to the involvement of non-scientist citizens in the generation of new scientific knowledge. This approach combines the Internet, smart phones, and social media with low-cost sensor networks to provide extensive, accurate time information. Citizen science can also educate and stakeholders that might otherwise bypass traditional methods of generating scientific knowledge—such an approach helps in risk management for some time. Bottom-up community-led projects, which would nowadays label as citizen science, were recognized as being hugely beneficial to capacity building as early as the 1980s (Commission on Science and Technology for Development,2019).

Many have equated the number of citizen science research projects with rapid technological development over the past 10–15 years. Small, inexpensive sensors are now widely

available and easy to connect to smart phones, which are generally Internet-connected and come with sophisticated cameras as standard. Together with advances in data processing and analysis, these developments are opening new pathways for citizen science to improve resilience-building efforts on a community scale. New information and communications technologies have augmented the flow of knowledge and data. At the same time, the Internet of things allows dynamic approach to research design, knowledge generation, and information provision at the community level. While it is sometimes challenging to integrate the newest forms of innovative hardware and software directly into resilience-building projects in the least developed countries, promising opportunities nevertheless exist; for example, the use of new sensor networks and online maps for hydrological monitoring, geological mapping, and risk mapping exercises (Buytaert et al.,2014, Commission on S & T for Development,2019).

S&T are the building block of every generation. Technology is the tool through which every civilization, from past to present, is growing. Communities that understand the basic fundamental of science bring changes to society. Technology is always directly or indirectly related to science, and through this, many brain hacking things are built, which ultimately change and give a new direction to human life. But just like a coin has two faces, science and technology also have both advantages and disadvantages depending upon the mindset of different people. With technology, people bring good changes to society and create devastating situations with the development and greed of humans and many unwanted weapons of mass destruction. Pollution and many things are in the developmental stage of creation. Society is changing various inventions, people and different countries are investing more in their weapons of mass destruction which ultimately brings fear and instability to the societies.

S&T is the life wire of every society today. It aids in the development and growth of the society, improving the knowledge base of its inhabitants by learning on the go. In the past few decades, technology has increased. And the use of technology is also increased drastically. Technology impacts society, including the potential for society to progress or decline, in both good and evil. It affects the life of people and changes the way they learn, think, and communicate. It plays a significant role in society, and now it is very tough to imagine life without technology.

